# అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర
# (1776 - 1945)

## ఎం. ఏ. చరిత్ర, మొదటి సంవత్సరం - ఐదవ పేపరు


**రచయితలు**

**డా॥ కంరున్నిసా బేగం**
చరిత్ర మరియు పురావస్తు విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డి**
ఉపన్యాసకులు, లయోలా కళాశాల
విజయవాడ

**డా॥ ఎస్. గిరిజ**
చరిత్ర మరియు పురావస్తు విభాగం
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

**ఆచార్య బి. మస్తానయ్య**
చరిత్ర మరియు పురావస్తు విభాగం
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

సంపాదకులు
**ఆచార్య పి. రామలక్ష్మి**
చరిత్ర మరియు పురావస్తు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయకర్త :
**ఆచార్య డి. భాస్కరమూర్తి**
చరిత్ర మరియు పురావస్తు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్
**ఆచార్య వి. చంద్రశేఖర రావు**



**దూర విద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510

Ph : 0863-2293299, 2293356, 08645 - 211023,
Cell : 9848285518, 08645 - 211024 (Study Material)
Website : www.anucde.com, e-mail : anucde@yahoo.com

M.A., History of U.S.A. (1776 To 1945)

First Edition : 2003

Second Edition : 2005

Third Edition : 2007

Fourth Edition : 2008

No. of Copies : 1000

**(C) Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of M.A., Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by :
**Prof. V. Chandrasekhara Rao,** *Director*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య వి. బాలమోహన్‌దాస్**

కులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# M.A. HISTORY 1st YEAR

## PAPER - V HISTORY OF U.S.A. (1776 TO 1945)

## SYLLABUS

**Unit I :** Colonies - American War of Independence - Constitutional Convention - George Washington - Federalists - John Adams - election of 1800.

**Unit II :** Jeffersonian democracy - Purchase of Louisiana - Thomas Madison - The war of 1812 - Treaty of Ghent - the Munro Doctrine - Andrew Jackson - James K. Polk - The Manifest Destiny - War with Mexico - Acquisition of California.

**Unit III :** The question of Slavery - The compromise of 1850 - Abraham Lincoln - Civil War - The surrender of the Confererates - Post - Civil War - Re-construction - Big Business.

**Unit IV :** The Populist Movement - Imperialism - Theodore Roosevelt - Internal and External Administration.

**Unit V.** Woodrow Wilson's Fourteen points - Treaty of Versailles - Hardinge - Franklin D. Roosevelt - The New Deal Policy - U.S.A.'s entry into World War II - The Atlantic Charter - The Yalta and Potsdam Conferences.

**Suggested Readings :**

| | | | |
|---|---|---|---|
| 1. | H.B. Parks | : | The United States of America : A History |
| 2. | Morison Samuel E. and Commager H.S. | : | The Growth of the American Republic vols. 1 & II |
| 3. | Allen Nervins and Henry Steele Commager | : | A Short History of the United States |
| 4. | Bailey Thomas. A. | : | A Diplomatic History of the American People |
| 5. | Curti Merli | : | The Growth of American People |
| 6. | Commager, H.S. | : | The Documents of American History |

DEGREE EXAMINATION, JULY 2005.

## M.A. History 1st Year

## Paper V - HISTORY OF U.S.A. (1776 TO 1945)

ıme : Three hours | Maximum : 100 marks

***Answer ALL questions.***
***All questions carry equal marks.***

. (a) Explain the factors that helped America in colonies to win their independence.
అమెరికన్లు తమ వలసల స్వాతంత్ర్యాన్ని పొందటానికి దోహదపడిన అంశాలను వివరించుము.

Or

(b) Discuss how far the Federal Constitution was an improvement over the Articles of Confederation?
అమెరికన్ ఫెడరల్ రాజ్యాంగం చట్టం ఆర్టికల్స్ ఆఫ్ కాన్‌ఫెడరేషన్ కన్నా ఏ విధంగా మెరుగైనదో చర్చించుము.

:. (a) Examine the chief features of Jeffersonian Democracy.
జఫర్సోనియన్ ప్రజాస్వామ్య ప్రధాన లక్షణాలను పరిశీలించుము.

Or

(b) Trace out the origin and significance of Munro-Doctrine.
మన్రో సిద్ధాంత ఆవిర్భావాన్ని గురించి, దాని ప్రాధాన్యత గురించి వ్రాయుము.

:. (a) Examine the events leading to the Civil War of 1861-65.
1861-65 సం.ల నాటి అంతర్యుద్ధానికి దారితీసిన సంఘటనలను పరిశీలించుము.

Or

(b) Explain the social and economic effects of the growth of "Big Business"
భారీ పరిశ్రమల అభివృద్ధివల్ల ఏర్పడిన సామాజిక, ఆర్థిక పరిణామాలను వివరించుము.

4. (a) Discuss the causes and results of the Spanish - American War of 1898.
1898 నాటి స్పానిష్ - అమెరికన్ యుద్ధానికి గల కారణాలను, ఆ యుద్ధ ఫలితాలను చర్చించుము.

Or

(b) Estimate Theodore Roosevelt as a progressive president.
అభ్యుదయ భావాలు గల అధ్యక్షుడిగా థియోడోర్ రూజ్‌వెల్ట్‌ను అంచనా వేయుము.

5. (a) Critically examine the "New Deal" of Franklin D. Roosevelt.
ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ "నవ విధానాన్ని" నిశితంగా పరిశీలించుము.

Or

(b) What were the factors that contributed for the success of U.S.A. in World War II?
రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా విజయానికి దోహదపడిన అంశాలు ఏవి?

(DH 05

# M.A. (Previous) DEGREE EXAMINATION, MAY 2006.

History

Paper V - **HISTORY OF U.S.A. (1776 to 1945)**

Time : Three hours    Maximum : 100 mark

Answer ALL questions

All questions carry equal marks.

1. (a) Write a note on the thirteen colonies.

పదమూడు వలసల గురించి వ్రాయుము

Or

(b) Give an account of John Adams.

జాన్ ఆడమ్స్ గురించి వ్రాయుము.

2. (a) Discuss the Jefferesonian democracy.

జఫర్సన్ ప్రజాస్వామ్యం గురించి చర్చించుము

Or

(b) Examine the causes and results of the War of 1812

1812 నాటి యుద్ధ కారణాలు, ఫలితాల్ని పరిశీలించుము.

3. (a) Discuss the Compromise of 1850

1850 నాటి అంగీకారం గురించి చర్చించుము.

Or

(b) Give an account of the Re-construction of America.

అమెరికా పునర్నిర్మాణం గురించి వ్రాయుము.

4. (a) write a note on the American imperialism.

అమెరికా సామ్రాజ్యవాదం గురించి వ్రాయుము.

Or

(b) Write a note on the following :

(i) Big stick policy    (ii) Trust busting.

క్రింది వాటిని గురించి వ్రాయుము.

(i) బడితే కర్ర విధానం    (ii) ట్రస్టుల నియంత్రణ

5. (a) Write a note on Hardinge.

హార్డింజ్ గురించి వ్రాయుము.

Or

(b) Discuss the foreign policy of F.D. Roosevelt.

ఎఫ్.డి. రూజ్వెల్ట్ విదేశాంగ విధానం గురించి చర్చించుము.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అమెరికా వలసలు | 1.1 - 1.11 |
| 2. | అమెరికా స్వాతంత్ర్య సమరం | 2.1 - 2.10 |
| 3. | జార్జివాషింగ్టన్ - 1789-97 | 3.1 - 3.9 |
| 4. | థామస్ జెఫర్సన్ 1801-1809 | 4.1 - 4.9 |
| 5. | 1812 సంవత్సర సంగ్రామము | 5.1 - 5.9 |
| 6. | మన్రో సిద్ధాంతం | 6.1 - 6.7 |
| 7. | ఆండ్రూ జాక్సన్ 1829-37 | 7.1 - 7.10 |
| 8. | అమెరికా మెక్సికో యుద్ధం 1846-1848 | 8.1 - 8.8 |
| 9. | అంతర్యుద్ధము | 9.1 - 9.11 |
| 10. | అంతర్యుద్ధానంతరం పునర్నిర్మాణము | 10.1-10.9 |
| 11. | భారీ వ్యాపారము | 11.1-11.7 |
| 12. | వ్యవసాయక విప్లవం | 12.1 - 12.8 |
| 13. | థియోడోర్ రూజ్‌వెల్ట్ (1901 - 1909) | 13.1 - 13.8 |
| 14. | ఉడ్రోవిల్సన్ (1913 - 1921) | 14.1 - 14.15 |
| 15. | ఫ్రాంక్లిన్ డిలనో రూజ్‌వెల్ట్ (1933 - 1945) | 15.1 - 15.9 |
| 16. | ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ విదేశీ విధానము | 16.1 - 16.15 |

పాఠం - 1

# అమెరికా వలసలు

## 1.1. లక్ష్యం:

ఐరోపావాసులు అమెరికా ఖండాన్ని కనుగొనడం, వలసలను స్థాపించడం, ఆ వలసలలో వారు కొన్ని విలువలను పెంపొదించు కోనడం వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయ క్రమం

1.2. పరిచయం
1.3. ఇండియన్స్
1.4. అమెరికాను కనుగొనుట-అమెరిగోవెస్పూచ్చీ
1.5. క్రిస్టోఫర్ కొలంబస్
1.6. వలసల ప్రారంభదశ-సమస్యలు
1.7. స్పెయిన్ వలసలు
1.8. ఫ్రెంచ్ వలసలు
1.9. నెదర్లాండ్-స్వీడెన్ వలసలు
1.10. తొలి ఇంగ్లీషు కార్యకలాపాలు.
1.11 చెసాపీక్ వలసలు-వర్జీనియా వలస స్థాపన
1.12. మేరీలాండ్ స్థాపన
1.13. న్యూ ఇంగ్లాండ్ కాలనీ-ప్లిమౌత్ యాత్రికలు
1.14 మెసాచుసెట్స్ స్థాపన
1.15. కరోలినా స్థాపన
1.16. న్యూయార్క్ స్థాపన
1.17. క్వేకర్ వలసలు
1.18. జార్జియా స్థాపన
1.19. వలసలు-విలువలు
1.20. సమీక్ష

## 1.2 పరిచయం:

తూర్పు దేశాలయిన చైనా, ఇండియాలతో పూర్వం నుంచి గల భూమార్గ వసతిని, కాన్ స్టాంటినోపుల్ క్రీ.శ. 1453 లో టర్కుల వశమవడంతో ఐరోపావాసులు కోల్పోయారు. నూతన జలమార్గాలను వారు అన్వేషించ సాగారు. కొత్తగా కనుగొన్న దిక్సూచి, ఆస్ట్రోలోబ్ ఈ భూగోళాన్వేషణలకు దోహదం చేశాయి. సాంస్కృతిక పునరుజ్జీవన ప్రభావంతో ప్రధాన ఐరోపా దేశాలయిన స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్ లు నౌకా యానాలను చేపట్టి, అమెరికా ఖండమని తరవాత కాలంలో పిలువబడిన నూతన ప్రపంచపు ఉనికిని తెలియజేసారు.

నూతన ఖండంలో మూడు ప్రధాన నైసర్గిక భాగాలున్నాయి. అవి: ఉత్తర అమెరికా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దక్షిణ అమెరికా.

వీనిలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఉత్తర అక్షాంశం $48^0$-$24^0$, రేఖాంశం $120^0$-$72^0$ ల మధ్య ఉన్నాయి. ఈ దేశంలోని రాష్ట్రాల సంఖ్య ఏభై. దీని ఎల్లలు తూర్పున అట్లాంటిక్ సముద్రం, పడమరన పసిఫిక్ సముద్రం, ఉత్తరాన కెనడా, దక్షిణాన మెక్సికో ఉన్నాయి. నౌకాయానానికి అనువయిన తూర్పు తీరం, సారవంతమైన దక్షిణ ప్రాంత భూమి, మిసిసిపి వంటి మహానదులు, అడవులలో గల సహజ సంపద, ఇక్కడ దొరికే విభిన్న లోహ సంపద - అన్నీ ఐరోపా వాసులను ఇక్కడ వలసల స్థాపనకై పురికొల్పాయి.

## 1.3.ఇండియన్స్ :

పదహారో శతాబ్ధంలో ప్రసుత్త అమెరికా సంయుక్త రాష్ట్రాలు అనబడే ప్రదేశంలో సుమారు 10,00,000 మంది ఇండియన్స్ స్థానికులుగా వుండేవారు. వీరు అనేక తెగలుగా, అనేక భాషలతో భిన్న సంస్కృతులకి చెందినవారు. మాయా, ఎజ్టెక్ నాగరికతల వారు మెక్సికో లోను, ఇన్‌కాస్ నాగరికతకు చెందినవారు పెరులోను నివసించేవారు. ఉత్తర అమెరికాలోని ఇండియన్లు వీరికన్నా నాగరికతా, సభ్యతలలో వెనుక బడి వుండే వారు. ఈతెగల వారు తూర్పు అడవులలో అక్కడక్కడ వారి నివాసాలు ఏర్పరచుకొన్నారు. వ్యవసాయము, వేట పై ఆధారపడి వీరు జీవించే వారు. ఈ తెగల వారు కొంత మంది శాంతి యుతమైన జీవితం గడిపేవారు, కాని కొంత మంది అతి వాద కార్యక్రమాలతో అనిశ్చితమైన జీవితం గడిపేవారు. వీరి రాజకీయ నిర్మాణము సులువుగాను, చక్కని ప్రజాస్వామ్య పద్ధతులలో ఉండేది. ఇండియన్ తెగకు చెందిన నాయకులు (chieftain) నిర్వాహక సభ ద్వారా నిర్ణయాలు తీసికోనే వారు. వ్యవసాయ భూములు, వేటాడే ప్రాంత లు అందరిదిగా భావించేవారు; ఏ ఒక్కరి సొంత ఆస్తి కాదు. వ్యవసాయము స్త్రీలు చూసుకొనగా, పురుషులు వేటాడే వారు.

ఐరోపా నుండి వచ్చిన వలసదారులు, ఇండియన్స్ నుండి చాలా విషయాలు నేర్చుకున్నారు. ఐరోపా వలస ప్రజలు వ్యవసాయం చేయడం, కూరగాయలు పండించటం, మొక్కల నుండి ఔషధాలను తయారు చేయటం నేర్చుకొన్నారు. పొగాకు పండించటం, దాని వాడకం కూడా నేర్చుకొన్నారు. మొట్ట మొదటి వలస దారులు ఇండియన్స్‌తో సత్సంబంధాలు కలిగి వుండాలని, వారిని క్రైస్తవ మతంలోకి మార్చాలని ప్రయత్నించారు. కాని ఇది సాధ్యం కాలేదు. ఎందుకంటే రెండు జాతుల వారు కలిసి మెలిసి నివసించుట అసంభవమైంది. వలస ప్రజలు అడవులను నరికి వేసి, ఆ భూములను సాగులోనికి తెచ్చే వారు. దాని వలన ఇండియన్స్ కు వేటాడే అవకాశం లేక జీవనోపాధి కోల్పోయారు. దానికి తోడు వలస ప్రజలు చర్మ వ్యాపారములో అభిరుచి చూపటంతో ఇండియన్స్ ఉపాధికి పోటీ మొదలై, వలసలకు, ఇండియన్స్‌కు మధ్య పోరాటాలు మొదలయ్యాయి.

ఈ వలసలకు, ఇండియన్స్ కు జరిగిన పోరాటములో ఇండియన్స్ అతి క్రూరంగా విరోధులతో ప్రవర్తించే వారు. ఇది గ్రహించి వలస ప్రజలు కూడా అంతే క్రూరంగా ప్రతి ఘటించేవారు. సుమారు మూడు వందల సంవత్సరాలు వీరి సంబంధాలు, విషాదకరమైనవి గాను, అపార్థాలతో కూడినవి గాను ఉండేవి. పనికి రాని ఒడంబడికలు, ద్రోహాలు, సామూహిక హత్యలు తప్ప ఇంకా ఏమి లేవు. చివరికి వలస ప్రజలు ఇండియన్స్‌పై ఆధిపత్యం గడించి మొత్తం అమెరికాను ఆక్రమించారు. ఇండియన్స్ 1/5 వంతకు తగ్గిపోయారు, ఈ తగ్గుదల కేవలం పోరాటాలవలన మాత్రమే కాదు. వలస ప్రజలు తెచ్చిన మత్తు పదార్థాలవలన, వారు తెచ్చిన రోగాలవలన ఇండియన్స్ అతి తక్కువ సంఖ్యకు చేరారు.

ఐరోపా దేశాలయిన స్పెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్ తమనౌకా యానాల ద్వారా అమెరికా ఖండాన్ని ప్రపంచానికి తెలియజేసారు. పదిహేడవ శతాబ్దంలో ఇటలీకి చెందిన అమెరిగో దీనిని ముందుగా కనుగొనడంతో అతడి పేరు తోనే ఈ ఖండాన్ని పిలిచారు. ఈ శతాబ్దం లోనే స్పెయిన్ రాజసహాయంతో, కొలంబస్ అమెరికా ఖండానికి ప్రయాణమయి మరింత గుర్తింపు తెచ్చాడు. స్పెయిన్ వలసలను స్థాపించింది. తరువాత బ్రిటన్, ఫ్రాన్స్ ఈ ఖండానికి వచ్చి తమ తమ వలసలను స్థాపించడం జరిగింది.

## 1.4 అమెరికా కనుగొనుట-అమెరిగోవెస్పూచ్చి-1451-1512:-

అమెరిగోవెస్పూచ్చి క్రీ.శ. 1451 సంవత్సరములో ఇటలీ దేశంలోని ఫ్లారెన్స్ నగరములో జన్మించాడు. ఇతని పిన తండ్రి అయిన డొమినికన్ ప్రీస్ట్ అమెరిగోకు విద్యనభ్యసింప చేశాడు. తరవాత అమెరిగో ఒక వ్యాపార వేత్తగా తన జీవితం ప్రారంభించాడు. ముందు ఫ్లారెన్స్ లోను, ఆ తర్వాత సెవెల్లి, కాడిజ్ (స్పెయిన్) నగరాలలో, 1495 సంవత్సరములో ఇతను ఒక కంపెనీతో తన సంబంధాలు మొదలు పెట్టాడు. పెద్ద పెద్ద ఓడలను తయారు చేయుట ఈ కంపెనీ వృత్తి. ఈ ఓడలు దీర్ఘకాల సముద్రయానానికై తయారైయ్యేవి. అమెరిగో 1497 నుండి 1512 వరకు సముద్ర యానములు చేశాడు. అమెరిగోవెస్పూచ్చి క్రీ.శ. 1507 లో కొన్ని జాబులు ద్వారా వివరాలను తెలియ జేసాడు. దీని ఆధారముగా ఇతను కనిపెట్టిన ఖండానికి అతని పేరు పెట్టారు. అమెరిగో కాబట్టి ఈ ఖండానికి అమెరికా అని పేరు వచ్చింది.

## 1.5. క్రిస్టోఫర్ కొలంబస్-1451-1506 :-

కొలంబస్ అను ఇంటి పేరు గల క్రిస్టోఫర్ కొలంబస్ క్రీ.శ. 1451 లో డొమినికొ కొలంబో, సుసన్నఫర్ హనారోజలకు జన్మించాడు. కొలంబస్ మొత్తం నాలుగు నౌకా యానాలు చేశాడు. స్పెయిన్ రాజు అయిన ఫెర్డినాండ్, రాణి ఇస బెల్లాల ఆర్థిక సహాయంతో మే 30, 1498 లో స్పెయిన్ నుంచి బయలు దేరి ఆగష్టు 5 వ తేదీన 1498 న కొలంబస్ అమెరికా ఖండము చేరాడు. ప్రపంచ చరిత్రలో ఇది ఒక ప్రముఖమైన సంఘటన.

కొలంబస్ నౌకా యానంతర్వాత సుమారు వంద సంవత్సరాలు కేవలం స్పెయిన్ దేశస్థులు మాత్రం అమెరికాలో వలసలు ఏర్పాటు చేసుకొన్నారు. అమెరికా ఖండంలో స్పెయిన్ యొక్క ప్రాబల్యాన్ని సహించలేని బ్రిటన్, ఫ్రాన్స్‌లు స్పెయిన్‌ను కొల్ల గొట్ట సాగారు. ఎలిజబెత్ రాణి ప్రోత్సహంతో బ్రిటిష్ నావికులు దొంగతనాలు దోపిడీలకు పాల్పడ్డారు. ఆంగ్లేయుల సముద్రపు దోపిడీల వలన విసిగి పోయిన స్పెయిన్ రాజు ఫిలిప్, ఈ దోపిడీలను ఆపటానికి ఇంగ్లండ్‌ను జయించ నిశ్చయించాడు. అందువలన క్రీ.శ 1588 లో "స్పానిష్ ఆర్మడా" ను ఇంగ్లండ్ మీదికి పంపాడు. ఈ యుద్ధంలో స్పెయిన్ ఓడిపోవుటయు గాక, స్పెయిన్ దేశపు నౌకా బలం పూర్తిగా ధ్వంసమైంది. కాబట్టి స్పెయన్ ఉత్తర అమెరికా తీరంపై ఆధిపత్యం కోసం ఇంగ్లండ్‌తో పోటీపడలేక పోయింది. ఆ తర్వాత ఆంగ్లేయులు, ఫ్రెంచ్ వారు ఉత్తర అమెరికాలో వలసలు స్థాపించారు. చిన్నచిన్న వ్యాపార దారులైన డచ్ మరియు స్వీడన్ వారు కొన్ని చిన్నచిన్న వలసలు ఏర్పాటు చేసుకొన్నారు.

## 1.6. వలసల ప్రారంభ దశ - సమస్యలు:-

ఉత్తర అమెరికా కోస్తాప్రాంతం, ఐరోపా వైపు ఉన్నదంతా దట్టమైన అడవీ భాగం. పశ్చిమాన భూ భాగం అప్పలేషియన్ పర్వత ప్రాంతం, సెయింట్ లారెన్స్ దగ్గర నుండి మెక్సికో గల్ఫ్ వరకు కొనసాగుతుంది. ఈ పర్వత ప్రాంతం కోస్తా నుండి వచ్చే వలసలను మిసిసిపి మైదానాల వైపు విస్తరించకుండా చేసాయి. ఈ కోస్తా భూ భాగం అంత సారవంతమైందికాదు. ఇంకొక కారణం ఏమనగా, ఇక్కడ వలసలు స్థాపించటానికి తగిన వాతావరణం లేదు. ఉత్తర అమెరికాలో చలికాలం ఎక్కువగా ఉంటుంది. కాగా దక్షిణంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది. వలస ప్రజల ఆరోగ్యానికి వాతావరణం సరిపడలేదు. కాబట్టి తొలిదశ వలసలు కేవలం కోస్తా ప్రాంతం మరియు సముద్ర నదుల మధ్య ఉండే తీర ప్రాంతానికి పరిమితమయ్యాయి. ఈ ప్రాంతానికి ఉన్న సౌకర్యం ఏమిటంటే నదుల పైన, ఓడల పైనా ప్రయాణం చేయగలగడమే.

తర్వాత ఫ్రెంచ్‌వారు సెయింట్ లారెన్స్ లోనూ, డచ్చివారు హడ్సన్ ప్రాంతంలోను, స్వీడన్ వారు డేలవేర్ లోను, ఇంగ్లీష్ వారు చెసాపీక్ ప్రాంతం లోనే స్థిరపడ్డారు. పశ్చిమదిశగా వలసలు నదీ తీర ప్రాంతాలకు నౌకా యానాల ద్వారా మెలమెల్లగా సాగింది. వలసల యాజమాన్యం ఎదుర్కొన్న సమస్య ఆర్థిక పరమైంది. వలసలకు పెట్టుబడి పెట్టినా వెంటనే దాని ఫలితము లభించలేక పోవటం జరిగేది. అందువలన వీరు నూతన విధానాన్ని మొదలుపెట్టారు. ఐరోపా వాసులకు కావసిన వస్తువులను ఇక్కడ పండించి వాటిని ఎగుమతి

చేయటం ఆరంభించారు. ఐరోపాకు కావలసిన అత్యవసరమైన వస్తువులలో చెక్కెర, సుగంధద్రవ్యాలు ఉండేవి. ఉత్తర అమెరికా కంటే ఈ వస్తువులు పండుటకు వెస్ట్ ఇండీస్ సరైన ప్రదేశంగా నిర్ణయించ బడింది. ఈ వెస్ట్ఇండీస్ ఐరోపా పెట్టుబడు దారులను ఎక్కువగా ఆకర్షించింది. మొదట ఉత్తర అమెరికాలో చర్మ వర్తకం సాగేది. దట్టమైన అడవుల ప్రాంతం కాబట్టి జంతు చర్మం ఎక్కువగా లభించేది. ఈ చర్మ వ్యాపారానికి కూడా ఐరోపాలో చాలా గిరాకి వుండేది. కాని ఈ చర్మ కారవృత్తి శ్రమతో కూడి ఎక్కువ సమయము హరించేది. కాబట్టి ఈ వ్యాపారము శాశ్వత పథకం పైలాభాలు చేకూర్చలేదు. ఈ చర్మ వర్తకులకు వేరే కొత్త ప్రదేశాల అన్వేషణ అవసరమైనది, ఎందుకంటే ఉత్తర అమెరికా అడవులలోని జంతు సంపద హరించుకొని పోయింది. అడవులలోని చెట్లను కొట్టివేయు పరికరములకు ఆవస్యత మొదలైంది. ఈ వ్యాపారము కూడా ఐరోపా వాసులను ఆకర్షించింది. కాని ఏ ఒక్క వలస కూడా అభివృద్ధి చెందలేదు; ఎందుకంటే అధిక లాభాలార్జించు వ్యవసాయ ఉత్పత్తి లేదు; అధిక లాభాలు గడించే పరిశ్రమ లేదు. ఈ ప్రక్రియలు అంతా ఎక్కువ సమయము తీసుకొనేవిగా ఉండేవి.

## 1.7. స్పెయిన్ వలసలు:-

అమెరికా ఖండాన్ని ప్రపంచానికి వెల్లడి చేయడంలో స్పెయిన్ పాత్ర ప్రముఖమైంది. స్పెయిన్ సహాయంతోనే నౌకా యానం చేసిన కొలంబస్ ఈ ఖండాన్ని కనుగొన్నాడు. మొదటి సారిగా స్పెయిన్ వలసను స్థాపించిన ఖ్యాతి హెర్నాండో కార్టెజ్‌కు 1521 లో దక్కింది. స్థానికులైన అజ్టెక్‌లను తరిమి వేసి మెక్సికోను వలసగా మార్చాడు. ఒక దశాబ్దంలోనే పెరులోని ఇన్‌కా సామ్రాజ్యాన్ని జయించి వెండి, బంగారాలతో స్వదేశానికి తిరిగి వెళ్ళాడు. 1541 లో హెర్నాండో డెసోటో మిసిసిపి నదిని కనుగొన్నాడు. ఫ్లోరిడాలోని సెయింట్ అగస్టీన్ వద్ద 1565 లో స్పెయిన్ తమ వలసను స్థాపించారు. వీరు ఎక్కువుగా దక్షిణ అమెరికా పైన పశ్చిమ ఇండీస్ పైన తమ దృష్టిని కేంద్రీకరించారు.

## 1.8. ఫ్రెంచి వలసలు:-

వలస విధాన విషయంలో ఫ్రెంచి ప్రభుత్వము తమదే బాధ్యతగా భావించింది. ఫ్రెంచి ప్రభుత్వము 1520 ల నుండి ఉత్తర అమెరికా తీర ప్రాంతాన్ని ఆక్రమించసాగింది. జాక్వెస్ కార్టియర్ 1535 లో సెయింట్ లారెన్స్‌ను, క్యూబెక్‌ని వలసలకు అనువైన ప్రదేశాలుగా భావించాడు. 1541 లో ఇక్కడ శాశ్వతమైన వలస స్థావరాలను ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఫ్రాన్సుకు తిరిగి వచ్చాడు. కాని రెండు వరుస సంవత్సరాలు, చలితోను, ఆకలి బాధలను భరించలేక వీరు ఈ ప్రయత్నాన్ని విరమించారు. ఆ తర్వాత శతాబ్దిలో ఫ్రాన్సు మత పరమైన అంతర్యుద్ధంలో నిమగ్నమైంది. కాని ఫ్రెంచ్ సముద్ర దొంగలు స్పెయిన్ నౌకలను కరేబియన్ సముద్రంలో విధ్వంసం చేస్తూ వుండువారు. ఫ్రెంచ్ మత్స్యకారులు సెయింట్ లారెన్స్ కు తరచు వెళ్ళేవారు.

పదహారో శతాబ్ది చివరి భాగంలో, ఫ్రాన్సు నాల్గవ హెన్రీ పరిపాలనలో, శాంతి ప్రతిష్టితమైంది. అప్పుడు ఫ్రాన్సు మరలా కెనడాలో వలసలు స్థాపించడానికి నిర్ణయించింది. ఈ నిర్ణయానికి రెండు కారణాలున్నాయి: మొదటిది వాయవ్య దిశనుండి తూర్పుకు మార్గం కనుగొనుట, రెండవది, ఆర్థిక పరంగా చర్మ వ్యాపారము పెంపొందించుట. ఈ వ్యాపారము రాబోవు రెండు వందల సంవత్సరాలకు కెనడా కార్యకలాపాలుగా పేర్కొనబడ్డాయి. కొంత మంది ఫ్రెంచి వర్తక పెట్టుబడి దారుల వరుస నౌకాయానాల వలన కొంత సఫలత ఫ్రాన్సుకు దొరికింది. శామ్యూల్‌డి ఛాంప్లెయిన్ అను ఫ్రెంచి నావికుడు శాశ్వితమైన వలసలను పోర్టు రాయల్ ఇన్ అకాడియా (ఆధునిక నోవాస్కోషియా) 1605 లోను, మరియు క్యూబెక్‌ను 1608 లోను స్థాపించాడు. ఈ వలసలను వర్తక కంపెనీలు పాలించాయి. అయితే 1663 లో ఈ వలసలు ఫ్రెంచి రాజు ఆధీనంలోకి వెళ్ళాయి. క్యూబెక్ నుండి ఫ్రెంచి వారు, సెయింట్ లారెన్స్ చేరి అక్కడ నుండి గ్రేట్‌లేక్స్ వరకు పయనించేవారు. దీని పరిసర ప్రాంతాలను లూయీ రాజు గౌరవార్థం "లూసియానా" అని పిలువసాగారు.

ఈ ఫ్రెంచి వలసలు అతి నిదానముగా పెరిగాయి. జనాభా పెరుగుదల అతి తక్కువ, 1663 నాటికి మొత్తం జనాభా కేవలం 2,000. వీరిలో చాలా వరకు చర్మ వర్తకులు. ఈ వలసలలో ప్రజలు 1663 నాటికి స్వయం సమృద్ధి చెందక, వారి ఆహారం పదార్థాలకై

మాతృ దేశమైన ఫ్రాన్స్‌పై ఆధారపడి అక్కడ నుంచి తెప్పించు కొనెవారు. ఈ వలసలు రాజు ఆధీనంలోకి వచ్చిన పిమ్మట, వలసలను అభివృద్ధి చేసే ప్రయత్నాలు ఆరంభించాడు. పదిహేడో శతాబ్ది చివరికి ఈ వలసల జనాభా 7,000 కు పెరిగింది. ఫ్రాన్స్‌లో ఉన్న భూస్వామ్య వ్యవస్థనే ఈ వలసలలో ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ అధికారులతోను, కాథలిక్ చర్చి పరిరక్షణలో వలసల జీవిత విధాన మంతా కొనసాగింది.

## 1.9. నెదర్ లాండ్ - స్వీడెన్ వలసలు:-

డచ్చి ఒక పెద్ద నావికా దేశంగా వర్ధిల్లి, స్పెయిన్‌తో తలపడి స్వాతంత్ర దేశమయింది. ఈ ప్రయత్నంలో నౌకా ఆధిక్యత బాగా ఉపయోగపడింది. పదిహేడో శతాబ్ది మొదటి నుంచి డచ్ నౌకలు ప్రపంచము మొత్తం తిరుగసాగాయి. డచ్ వారి మొట్టమొదటి సామ్రాజ్యవాద విధానము తూర్పు దీవుల నుండి ప్రారంభమైంది. తూర్పు దీవులలో డచ్ వారు పోర్చుగీస్ వారిని ఓడించి ఒక పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ సామ్రాజ్యం ఇరవయ్యో శతాబ్ది వరకు నిలకడగా వుంది. వీరు తర్వాత అమెరికా ఖండం వైపు కన్ను వేసి, మొదట స్పెయిన్ వెస్ట్ఇండీస్ ను ముట్టడించటం మొదలు పెట్టారు.

డచ్ వ్యాపారుల ద్వారా పంపబడిన ఇంగ్లీషు నావికుడు హెన్రీ హడ్సన్ 1609 లో, తూర్పు మార్గము తెలుపు కొనుటకు పోయి ఒక నదీ ప్రాంతమునకు (ఉత్తర అమెరికా) చేరాడు. ఆనదీ తీర ప్రాంతాన్ని ఆయన పేరుతోనే పిలిచారు. దానినే హడ్సన్‌బే అంటారు. కాని హడ్సన్ తూర్పున చైనాకు మార్గం కనిపెట్టలేక పోయాడు. ఆ నౌకాయానాన్ని మధ్యలో విరమించాడు. కాని హడ్సన్ ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ప్రదేశము చర్మ వ్యాపారానికి అనుకూలమైంది. అందువలన 1624 లో డచ్చి వెస్ట్ఇండీయా కంపెనీని ఈ ప్రదేశానికి పంపింది. మన్‌హట్టన్ ఐలాండ్‌కి దక్షిణంగా ఉన్న న్యూఆంస్టర్‌డాం ఈ వలసలకు రాజధాని అయింది. ఆల్బనీ, డిలావేర్, కనెక్టికట్ నదుల ప్రాంతంలో కూడా వీరు స్థావరాలను ఏర్పరచుకున్నారు.

ఆ తర్వాత డచ్ క్రమక్రమంగా, లాంగ్ ఐలాండ్, న్యూజెర్సీ, హడ్సన్ ప్రాంతాలను ఆక్రమించింది. కాని న్యూనెదర్ లాండ్స్ ఈ ప్రాంతాలలో అభివృద్ధి చెందలేక పోయింది. కారణమేమనగా అధికారమంతా గవర్నర్ల వద్దనే వుండేది. ఈ వలస ప్రజలకు రాజకీయ హక్కులు లేవు. వెస్ట్ఇండియా కంపెనీ ద్వారా నియమించబడిన గవర్నర్లు చాకచక్యంతో పరిపాలించుట, ఐకమత్యమును కాపాడుట చేయలేక పోయారు. ఈ కాలనీ యొక్క ముఖ్య ఆధారము చర్మ వ్యాపారము. కాని వలస ప్రజలలో వ్యవసాయన్ని ప్రోత్సహించారు. వెస్ట్ఇండియా కంపెనీ 1629 లో పెద్ద పెద్ద ఎస్టేట్స్‌ను ప్రవేటు వ్యక్తులకు ఇచ్చారు. భూములను సాగు చేయుటకు ఒప్పందాలు కుదుర్చుకొన్నారు. రైతులపై వీరు సిస్తులను వసూలు చేస్తూ విపరీతమైన అధికారాన్ని చెలాయించేవారు. ఈ న్యూ నెదర్‌లాండ్స్‌లో 1667 నాటికి 8000 మంది ప్రజలున్నారు. వారిలో ఎక్కువ మంది డచ్ వారుకాదు.

స్వీడన్ కేవలం ఒకే ఒక స్థావరాన్ని అమెరికాలో స్థాపించింది. ఈ స్థావరం 1638 లో డిలావేర్ నదీ ప్రాంతం. ఈ స్థావరం స్థాపించటంలో ముఖ్య ఉద్దేశ్యం చర్మ వ్యాపారము. ఇక్కడ కేవలం నాలుగు వందల మంది జనసమూహము ఉండేవారు. డచ్చి వారు 1655 లో ఈ స్థావరాన్ని జయించి దీనిని న్యూ నెదర్‌ల్యాండ్ కాలనీ లో చేర్చారు.

## 1.10. తొలి ఇంగ్లీషు కార్యకలాపాలు:-

ఇంగ్లీషు వారి అమెరికా అన్వేషణ, కొలంబస్ అమెరికా నౌకా యానం సఫలమైన దని తెలియగానే, ప్రారంభించారు. క్రీ.శ. 1497 వ సంవత్సరము జాన్‌కాబట్ అనే వెనీషియన్ నావికుడు, ఏడవ హెన్రీ సహాయంతో రెండు సార్లు న్యూఫౌండ్ లాండ్‌ని, ఇతర ప్రముఖ ప్రదేశాలని కనుగొన్నాడు. ఈ రెండు నౌకా యానాల వలన ఇంగ్లీష్ రాజుకు ఉత్తర అమెరికాపై ఆధిపత్యం లభించింది. కాని కాబట్ నౌకా యానం వలన వలసల స్థాపన జరగలేదు. ఆటు పిమ్మట సుమారు ఎనిమిది సంవత్సరాలు, పశ్చిమ ఇంగ్లాండ్ నుండి మత్యకారులు, వారి

చిన్నచిన్న నావలతో అట్లాంటిక్ సముద్రము దాటి న్యూఫౌండ్ లాండ్‌కు చేరారు. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం ఐరోపా దేశాల యుద్ధంతోను, ఆతర్వాత మత సంస్కరణలతోను, దాని కనుగుణంగా మొదలైన మత పరమైన పోరాటాలతోను, మునిగి పోయింది.

ఎలిజబెత్ రాణి పరిపాలనలో 1570 నాటికి, బ్రిటన్ దేశము స్థిరత్వము పొందటంతో పాటు, వర్తక వ్యాపారాలలో అతి శీఘ్రంగా అభివృద్ధి చెందింది. కొంత మంది రాజ్య ప్రముఖులు, రాజరిక కుటుంబం నుంచి, మరికొందరు లండన్ వర్తకులు కలిసి సామ్రాజ్యవాదంపై మొగ్గు చూపి, ఎలిజబెత్‌ను ప్రోత్సహించారు. వీరి ముఖ్య ఉద్దేశమేమనగా వాయవ్య దిశగా తూర్పునకు పయనించుట. సుగంద ద్రవ్య వ్యాపారము కొనసాగించుట వారి ప్రాధాన్యత. మార్టిన్ ఫ్రోబిషర్ అనే యాత్రికుడు 1576 వ సంవత్సరములో లాబ్రడోర్ తీర ప్రాంతము కనిపెట్టాడు. దాని తర్వాత అర్ధ శతాబ్ది కాలంలో జాన్ డేవిస్, హెన్రీ హడ్సన్, విలియం బెఫిన్‌లు మార్టిన్ ఫ్రోబిషర్‌ను అనుసరించి ఉత్తర కెనడా, ఉత్తర అమెరికా రేవు తీర ప్రాంతాలకు చేరారు. అందువలననే ఈ తీర ప్రాంతాలకు ఈ ఇంగ్లీషు నావికుల పేర్లు పెట్టడం జరిగింది. ఇంగ్లీషు వారి ఆధిపత్యం ఈ ప్రాంతంలో అధిగమించింది. అందువలన హడ్సన్‌బేలో చర్మ వ్యాపార స్టేషన్ 1670 లో స్థాపించారు.

ఈ మధ్య కాలంలో ఇంగ్లీష్ నావికులు, దొంగతనాలు, దోపిడీలు, స్పెయిన్ నౌకలపై మొదలు పెట్టి కెరేబియన్ సముద్రంనందలి స్పెయిన్ వలస దీవులను, దక్షిణ అమెరికా లోని స్పెయిన్ వలసలను తుదముట్టించారు. ఈ అలజడులకు కారణం ఇంగ్లీషు ప్రొటెస్టాంట్ మత విధానమే.

ఈ దోపిడీలు, దౌర్జన్యాల వలన ఇంగ్లీషు సామ్రాజ్య స్థాపన జరగదని, ఇది జాతి యొక్క గౌరవాన్ని పెంచదని చివరకు ఇంగ్లీషు వారు గ్రహించారు. ముందు చూపు గల ఇంగ్లీషు వారు అమెరికా ఖండం మధ్యలో శాశ్వతమైన వలసల స్థాపన జరగనిదే అమెరికాలో మనుగడ లేదని తెలుసుకొన్నారు. వలస విధానము ప్రోత్సహించ వలెనని రాజా స్థానంలోని ప్రముఖులు సూచించారు. దీనిని ఆచరణలో పెట్టడానికి ఇద్దరు ఇంగ్లీషు రచయితలు తమ రచనల ద్వారా ప్రజలకు తెలిపారు. వీరినే హక్లుయట్స్‌అని అంటారు.

హక్లుయట్ల రచనలు రెండు విధాలుగా ఉపయోగపడ్డాయి. ఉత్తర అమెరికాలో ఇంగ్లీషు వలసలు ఏర్పడినచో, వాయవ్య దిశగా తూర్పునకు మార్గం కనుగొనుట. రెండవది స్పెయిన్ వలస స్థావరాలపై దండయాత్రలు జరుపుట. ఈ రచనల వలన, దేశంలో ఆర్థిక పరమైన మార్పుల వలన నిరుద్యోగ యువత ఎక్కువగా ఆకర్షించబడ్డారు. అమెరికాలో స్థావరాలు ఏర్పరచినచో వారికి తగిన అవకాశం కలుగుతుందని ఆశించారు. వీరు అక్కడ, చెక్కెర, వైన్, ఆలివ్ ఆయిల్, పట్టు, అద్దకానికి వాడే రంగులను పండించి మాతృదేశానికి ఎగుమతి చేయవచ్చునని భావించారు. పైన చెప్పిన వస్తువులకు బ్రిటిష్ వారు స్పెయిన్‌పై ఆధారపడ్డారు. దీనికి బదులుగా ఇంగ్లీషు వారు వీరికి వస్త్ర రూపంలో దిగుమతులు చేసేవారు. హక్లుయట్స్ ప్రచురించిన సామ్రాజ్య వాద విధానము రెండు వందల సంవత్సరాల వరకు మార్గదర్శకమైంది.

బ్రిటిష్ సామ్రాజ్య విధానానికి ఎలిజబెత్ రాణి సానుకూలంగా వున్నా, ప్రభుత్వ ఖజానా నుండి, దీనికోసం ధనాన్ని వెచ్చించటం ఆమెకు ఇష్టం లేదు. కాబట్టి ప్రవేటు పెట్టుబడి దారులకు అవకాశం మిచ్చింది. మొట్ట మొదటి ప్రయత్నం అమెరికాలో వలస స్థాపనము సర్ హంఫ్రీగిల్ బర్ట్‌కు ఎలిజబేత్ రాణి ఒక ఛార్టర్ ద్వారా అనుమతి నిచ్చింది. గిల్‌బర్ట్‌కు ఈ చార్టర్ ద్వారా అమెరికాలో కేవలం క్రొత్త స్థావరాన్ని స్థాపించమని నిర్దేసించింది. గిల్‌బర్ట్ 1583 లో న్యూ ఫౌండ్ లాండ్‌ను కనుగొన్నాడు. కాని దురదృష్టవ శాత్తు తిరుగు ప్రయాణంలో అతని నౌక, అందరు నావికులతో సహా మునిగి పోయింది. గిల్ బర్ట్‌కు చార్టర్ ద్వారా లభించిన హక్కులను, అతని సవతి సోదరుడైన సర్ వాల్టర్ రాలేకు ఇచ్చారు. ఇతను బహుముఖ ప్రజ్ఞాశాలి, దౌత్యవేత్త, సైన్యాధికారి, కవి, సాహిత్యాభిమాని, శాస్త్రజ్ఞుడు, వలసలలో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చిన వ్యక్తి.

రాలే 1584 లో ఒక నావికాదళంను, దక్షిణ చెసాపీక్ ప్రాంతవకు పంపాడు. ఈ ప్రాంతము అనుకూలమైనదని, దానికి వర్జీనియా అని పేరు పెట్టాడు. ఎలిజబెత్ రాణి అవివాహిత యగుట వలన ఆవిడ కన్య కాబట్టి ఆమె గౌరవార్ధం "వర్జీనియా" అని పేరు పెట్టాడు.

ఆమరుసటి సంవత్సరమే రాలే ఇంకొక నౌకా దళంను ఎక్కువ మంది వలసలతో రౌనోకో దీవికి (Roano ke Island) (ప్రస్తుతం ఉత్తర కెరోలిన) పంపాడు. కాని వీరు విపరీతమైన చలిని ఎదుర్కొలేక తిరిగి వచ్చారు. ఈ దళంలో గొప్ప చరిత్రకారడు జాన్‌వైట్, ఉత్తర అమెరికా ఇండియన్‌ల జీవన శైలిని అతి సుందరంగా చిత్రించాడు. అటు పిమ్మట 1587 లో మరొక వలస బయలు దేరింది. ఇందులో స్త్రీలు, పిల్లలు, మగవారు అందరూ రౌనాకొ దీవికి వెళ్ళారు. బ్రిటన్‌కు స్పెయిన్ కు జరిగిన యుద్ధము వలన 1591 వరకు ఎటువంటి నౌకా యాత్రను చేపట్టలేదు. ఈ ప్రయోగం ఫలించక పోవటంతో రాలే ఈ వలస విధానానికి వెంటనే స్వస్థి చెప్పాడు.

## 1.11. చెసాపీక్ వలసలు-వర్జీనియా వలసస్థాపన:-

పదిహేడో శతాబ్ది ప్రారంభంలో ఆంగ్లేయులు పెద్ద సంఖ్యలో నూతన వలసల స్థాపనకై అన్వేషణ చేసేవారు. ఆనాటి స్టూ వర్ట్ రాజుల అధికార ధోరణి, రాజకీయ, మతపరమైన అసంతృప్తి ఈ వలసలకు ప్రధాన కారణాలు. రాలే తర్వాత అమెరికాకు ఒక వర్తక కంపెనీ 1607 లో వర్జీనియాకు చేరింది. ఈ కంపెనీ బ్రిటిష్ రాజైన మొదటి జేమ్స్ నుండి అనుమతిని పొందింది. వర్జీనియాలో వీరి స్థావరాన్ని జేమ్స్‌టౌన్‌గా పిలిచారు. ఈ కంపెనీ యజమానులలో చాలా మంది వర్తకులు, ఉత్తమ శ్రేణికి చెందిన ఇతరులు వుండేవారు. వీరిలో ఆనాటి అతి సంపన్నుడైన వ్యాపారి సర్ థామస్ స్మిత్ కూడా వున్నాడు. ఈ వర్తక కంపెనీ వర్జీనియాని సారవంతమైన ప్రాంతంగా చేయడానికి పూర్తి యత్నం చేసింది. వీరే ఇక్కడ పొగాకు పంటను అభివృద్ధి చేసి ఎగుమతి చేసేవారు. స్మిత్ నినాయకత్వనుంచి తొలగించి సర్ ఎడ్విన్ సాండీస్ అధికారాన్ని హస్త గతం చేసుకొన్నాడు. ఇతని ఆధ్వర్యంలో వలస విధానం మరింత ముందుకు సాగింది. ఇతడు వలస వచ్చిన వారికి 100 ఎకరాల భూమిని కేటాయించడం ఆరంభించాడు. మరొక వ్యక్తి ఎవరైనా కూడా వచ్చినట్లైతే అతనికి 50 ఎకరాల భూమిని ఇచ్చేవాడు. ఈ ఆర్థిక పరమైన లాభం మాత్రమే గాక వలస ప్రజలకు ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యాన్ని సహితం కలిపించాడు. ఈ విధానం వలన వర్జీనియా త్వరలోనే జన సాంద్రతను పెంచుకుంది. ఈ వలసను 1624 లో బ్రిటిష్ రాజు స్వాధీనం చేసికొని. దీని పాలన నిమిత్తం గవర్నర్లను పంపేవాడు. వర్జీనియా వలన స్థాపనతో బ్రిటిష్ వారికి అమెరికాలో తొలి అనుభవం కలిగింది.

## 1.12. మేరీ లాండ్ స్థాపన:-

జేమ్స్‌టౌన్ వలస విధానం వలన బ్రిటిష్ వారికి మంచి అనుభవం లభించింది. వలస పోవు వారికి సొంత భూమిని వారికి ప్రభుత్వంలో భాగస్వామ్యాన్ని కల్పించడం అవసరమని బ్రిటిష్ వారు తెలుసుకున్నారు. ఈ అనుభవంతో రెండవ వలస స్థాపన జరిగగింది. మేరిలాండ్ ఈ సారి ఎటు వంటి కంపెనీకీ అప్ప చెప్పబడలేదు, కేవలం ఒక వ్యక్తికి అప్ప చెప్పటమైంది. బాల్టిమోర్ ప్రభువైన సిసీలియస్ కల్వ ర్ట్‌కు మొదటి చార్లెస్ రాజు వర్జీనియా వలసకు ఉత్తరాన వున్న భూమిని ఆక్రమించి, పరిపాలించమని ఆజ్ఞాపించాడు. సిసీలీయస్ కాథిలిక్ మతస్థుడై నందువలన, మేరిలాండ్‌ని ఇంగ్లీషు కాథిలిక్స్‌కి ఒక శరణార్ధ వలసగా చేయాలని భావించాడు. కాని ఇతర మతస్థులైన వారు కూడా మేరిలాండ్‌కు రావటానికి సుముఖత ప్రకటించడంతో ప్రొటెస్టెంట్స్‌ను కూడా ఆహ్వానించి ఈ కాలనీలో మతసామరస్యాన్ని పాటించాలని నిశ్చయించాడు. మొదటి నుండి మేరీలాండ్‌లో ప్రొటెస్టెంట్స్ ఎక్కువ, కాబట్టి కాదిలిక్కులు తక్కువగా వుండుట వలన మత సామరస్యం చట్ట బద్ధధంచేసి 1649 లో ప్రకటించాడు. మేరీలాండ్‌లో మొదటి వలస ప్రజలు 1634 లో వచ్చారు. వీరికి భూమిని పంచారు. ఈ వలస ప్రజలు పొగాకు పంట ప్రారంభించి మంచి లాభాలు గడించారు. మేరీలాండ్ లో 1689 నాటికి ప్రజల సంఖ్య 25,000 కు చేరింది.

అనతి కాలంలోనే మేరీలాండ్ లో కలతలు మొదలైనాయి. దీనికి కారణం బాల్టిమోర్ ప్రభువు అధికార దుర్వినియోగం. ఎక్కువ పన్నులు వసూలు చేయుట, తన వారిని ఎక్కువ సంఖ్యలో అధికారులుగా నియమించుట చేసేవాడు. ఇంతటి విషమ పరిస్థితి ఎందువలన అనగా వలస ప్రజలలో ఎక్కువ మంది ప్యూరిటన్స్, వీరు కాథిలక్స్‌లను క్రైస్తవ మత వ్యతిరేకులని భావించారు. అందువలన అనేక సార్లు ప్రభుత్వ వ్యతిరేక విప్లవాలు, పోరాటాలు జరుగుతూ వుండేవి. అందువలన మేరీలాండ్ 1691 లో రాజు ఆధీనంలోకి వచ్చింది. ఆంగ్లికన్-చర్చిని అధికారికంగా స్థాపించారు.

## 1.13. న్యూ ఇంగ్లాండ్ కాలనీలు ప్లిమౌత్ యాత్రికులు:-

మేఫ్లవర్ అనే ఒక చిన్న ఓడలో ఒక వంద మంది ప్యూరిటన్ శాఖకు చెందిన స్త్రీ, పురుషులు మత స్వాతంత్ర్యం కోసం ఇంగ్లండ్ నుండి మెసాచుసెట్స్ తీరంలోని ప్లిమౌత్ వచ్చారు. వచ్చేటప్పటికి వారిసంఖ్య నూట రెండుకాగా, ఇద్దరు శిశువుల జననంతో సంఖ్య మార్పిడి జరిగింది. పిల్‌గ్రిమ్ ఫాదర్స్ అనేపేరుతో వీరు చరిత్రలో ప్రసిద్ధులైనారు. వీరు కొత్త ప్రపంచములో కాలు పెట్టిన తొలి రోజులలో అనేక కష్ట నష్టాలను సాహసంతో ఎదుర్కొన్నారు.. క్రమంగా వీరు మెసాచుసెట్స్‌లో స్థిరపడ్డారు. ఇంగ్లండ్‌లో మత సంఘర్షణలు ఉధృతం కావడంతో కొంత మంది ప్యూరిటన్‌లు దేశాన్ని వదలి ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో వలసలు ఏర్పరచుకొన్నారు.

## 1.14. మెసాచు సట్స్ స్థాపన:-

మొదటి ఛార్లెస్ అనుమతితో 1628 లో 'మెసాచుసెట్స్ బేకంపెనీ', బోస్టన్ పరిసర ప్రాంతాలకు వలస ప్రజలను పంపడానికి నిశ్చయించింది. జాన్ ఎండికాట్ నాయకత్వంలో తొలివలస జట్టు బోస్టన్ చేరింది. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు దాదాపు 900 మంది వలస ప్రజలు జాన్‌విన్‌థ్రోప్ నాయకత్వంలో పద్దెనిమిది ఓడలలో బోస్టన్‌కు చేరారు. 1640 నాటికి జనాభా ఇరవై వేలకు చేరింది. ఈ విధంగా మెసాచుసెట్స్ వలస ఏర్పడింది.

కనెక్టికట్ వలస మెసాచుసెట్స్ లోని నివసిస్తున్న కొంత మంది వలస ప్రజల చేత స్థాపితమైంది. వీరు హార్ట్ ఫర్డ్ మొదలైన అనేక పట్టణాలు నిర్మించుకొన్నారు.

బోస్టన్ పట్టణ వలస ప్రజలు న్యూహాంప్‌షైర్ వలసను స్థాపించారు. వీరు చేపలు పట్టడానికి, వాణిజ్యం పెంపొందించుకోవడానికి, ఉత్తరంగా తీరం వెంట వెళ్ళి న్యూహాంప్‌షైర్ వలసను నెకొల్పారు. న్యూహాంప్‌షైర్ 1680 లో రాజు వశమయింది. రోడ్ ఐలాండ్ వలస 1630 లో ఏర్పడింది. మెసాచుసెట్స్ నుండి మత పోరాటాలలో తరిమి వేయబడినవారు ఈ వలసను స్థాపించుకున్నారు.

## 1.15. కెరోలినా స్థాపన:-

రెండవ ఛార్లెస్ అనుమతిలో కరోలిరా అనే కంపెనీ ఎనిమిది మంది యాజమాన్యంతో, కొంతమంది బ్రిటీష్ ప్రభుత్వాధికారులతో బయలు దేరింది. వీరినే కరోలినా అనేవారు. కరోలినా యాజమాన్యం వారి కాలనీని వర్జీనియా మాదిరిగానే తీర్చి దిద్దాలని నిర్ణయించారు. వర్జీనియా వలసలో వలె మనిషికి చాలా ఎకరాల భూమిని, సేవకుడిని తెచ్చినచో కొన్ని ఎకరాల భూమిని ఇవ్వాలని నిర్ణయించారు. వారి పరిపాలన శాసనసభ ద్వారానూ, మత స్వాతంత్ర్యంతో కూడిన దైవుండేది. తొలి వలస 1670 లో స్థాపించబడింది. తొలి దశలో ఎన్నో కష్టాలను అనుభవించిన తర్వాత బానిసలు ధాన్యం పంటని పండించడటం మొదలు పెట్టారు. దీనితో బానిసలు అవసరమయ్యారు. ఈ వలస జనాభా 1700 సం॥ నాటికి 5,000. అందులో సగం మంది నీగ్రోబానిసలు, వలస ప్రారంభంనుంచి కరోలినాలో భూస్వామిక వ్యవస్థ, నీగ్రో బానిస వ్యవస్థలతో కూడిన సమాజం ఏర్పడింది. దక్షిణ కరోలినా భూస్వాములు చార్లెస్టన్‌ని ముఖ్య పట్టణంగా తీర్చిదిద్ది, పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకొని, విలాస వంతమైన జీవితాన్ని అలవాటు చేసుకొన్నారు. ఈ కెరోలినా యాజమాన్యులు వారి హక్కులను అమ్ముకోవడంతో ఈ వలస 1719 లో రాజు స్వాధీనమైంది.

ఈ కరోలినా ఉత్తర భాగం అట్లాంటిక్ సముద్ర వరుస దీవులతోను, ఇసుక దిబ్బెలతోను విడిపోయి వుంటుంది. ఈ ఉత్తర కెరోలినాలోఅతి సాధారణమైన మధ్య తరగతి వారు స్థిరపడ్డారు. చిన్నచిన్న వ్యాపారస్థులు, మతస్వాతంత్ర్యం కోరుకొనువారు, ఈ వలసను స్థాపించారు. అమెరికా స్వాతంత్ర్య సమరం నాటికి ఉత్తర కెరోలినా జనాభాలో నాల్గవ పెద్ద రాష్ట్రంగానూ ఆర్థికంగా అతి వెనకబడినదిగాను పరిగణించబడింది. ఇది 1728 లో రాజు ఆధీనంలోకి వచ్చింది.

## 1.16 న్యూయార్క్ స్థాపన :

కెరోలినా రాజు ఆధీనమైన వెంటనే, కనక్టకట్‌కు మేరీలాండ్‌కు మధ్య వున్న భూ భాగంను రాజు తమ్ముడు డ్యూక్ ఆఫ్ యార్క్‌కు ఇచ్చారు. ఈ భూ భాగంపై డచ్ వారి హక్కు ఎక్కువగా వుంది. వర్తక వ్యాపార పరమైన విరోధంలో ఇంగ్లీష్‌కు, హాలెండ్‌కు యుద్ధాలు

జరుగుతూ వుండేవి. కాని 1664 లో బ్రిటీష్ యుద్ధ నౌక న్యూ నెదర్‌ల్యాండ్స్‌ను తన స్వాధీనం చేయమని బలవంతం చేసింది. డచ్చి ప్రభుత్వం బలహీనమైనది కాబట్టి ఎటువంటి విధంగానూ ఇంగ్లీషువారిని ఎదుర్కొన లేక పోయింది. దక్షిణ భాగాన్ని డ్యూక్ అమ్మివేసి, ఉత్తర ప్రాంతంను తన అధికారంలో కొనసాగించి, దీనికి న్యూయార్క్ అని పేరు మార్చారు.

డ్యూక్ పంపిన అధికారులు భూస్వాములతోనూ, అలబనీ చర్మ వర్తకులతోను, న్యూ యార్క్ పట్టణ వర్తకులతోనూ, కలిసి వర్తక వ్యాపారం చేసి ఎంతో లాభాలు గడించారు. ప్రాతినిధ్యం లేనిదే పన్నులు కట్టమన్న వాదన మొట్ట మొదట న్యూ ఇంగ్లాండర్స్ వలస లాంగ్ ఐలాండ్ నుండి ప్రారంభమైంది. ఈ వలస 1690 లో రాజు ఆధీనంలోకి వచ్చింది. ఈ వలసపై డచ్చి వారి ప్రభావం వుండుట వలన చాలా మందిని ఆకర్షించింది. ఇందులో భాగంగా న్యూజెర్సీలో పందొమ్మిదవ శతాబ్దం వరకు డచ్చి భాషా చలా మణిలో వుంది.

## 1.17 క్వేకర్ వలసలు:-

న్యూజెర్సీ ప్రాంతాన్ని 1664 లో డ్యూక్ ఇద్దరు ఇంగ్లీషు ప్రముఖులకు అమ్మాడు. ఈ ఇద్దరు వాళ్ళ హక్కులను క్వేకర్స్‌కు అమ్మారు. ఈ ప్రాంతంలో డచ్చి వారు, స్వీడెన్ వారు నివసించే వారు. ఇక్కడ మత పరమైన స్వాతంత్ర్యం ఉన్నందున కొంత మంది ప్యూరిటన్స్ వచ్చి స్థిరపడ్డారు. క్వేకర్స్ శాసన సభను స్థాపించారు, కాని అధిక పన్నులు వసూలు చేయుట వలన, న్యూయార్క్‌ని వ్యతిరేకించుట వలన అసాధారణ పరిస్థితులు ఏర్పడుతుండేవి. విలియంపెన్ అనే అతను క్వేకర్స్‌లో చేరి 1681 లో భూ భాగంపై అధికారం సంపాదించి దీనికి పెన్సిల్వేనియా అని పేరు పెట్టినాడు. విలియంపెన్ ఇక్కడ అనుసరించిన విధానం మన్ననలను పొందింది. భిన్న మతాలకు, సంస్కృతులకు చెందిన వారితో కలసి బ్రదకడం నేర్పాడు. స్వేచ్ఛ, ఒడంబడికలకు ప్రాధాన్యత నిచ్చేవాడు. ఫిలడెల్ఫియా నగరాన్ని ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దాడు. ఆతర్వాత ఒక సంవత్సరానికి ఇతను డేలావేర్‌ను కూడా తన ఆధీనంలోకి తెచ్చి 1703 లో దీనికి ప్రత్యేక ప్రభుత్వం స్థాపించాడు.

## 1.18. జార్జియ స్థాపన:-

కరోలినాకు దక్షిణంగా వున్న భూ భాగంను 1732 లో కొంత మంది యాజమాన్యులు దాన రూపంలో పొందినారు. జార్జి రాజు నుండి పొందిన దానం గాబట్టి దీనికి జార్జియా అని పేరు పెట్టినారు. ఈ ప్రాంతమును స్పెయిన్, ఫ్రెంచి వారి ఆధీనంలోకి రాకుండ బ్రిటిష్ వారు చాలా జాగ్రత్తలు తీసుకొన్నారు. 1751 లో జార్జియా రాజు ఆధీనంలోకి వచ్చింది.

ఈ విధంగా పదిహేడో శతాబ్దం నాటికి ఇంగ్లండ్, అమెరికా ఖండంలో బలమైన పునాదులతో కూడిన వలస రాజ్యం స్థాపించింది. సమారు 1000 మైళ్ళు అట్లాంటిక్ తీరం మెయిన్ నుండి దక్షిణ కరోలినా వరకు తన వలసలను స్థాపించింది. 1689 నాటికి ఈ వలసలలో జనాభా సుమారు 220,000 వరకు పెరిగింది.

## 1.19. వలసలు-విలువలు:-

భిన్న దేశాలచే స్థాపితమైన అమెరికా వలసలలో మొదటి నుంచి కొన్ని విలువలు ఆదరణ పొందాయి. భిన్న జాతులు, భిన్న మత శాఖలు కలసి నివసించటంతో విశాల భావాలు, సామరస్య జీవనం వర్ధిల్లాయి. పాత ప్రపంచమైన ఐరోపాకంటే భిన్న సంస్కృతిని పెంపొందింప జేసు కోవాలనే కోరికతో, కడు జాగరూకతతో, తమ సంస్కృతిని పెంపొందించుకున్నారు. సహజ హక్కుల సిద్ధాంతం ఇక్కడ ప్రజాదరణ పొందింది. మానవ లందరికీ పుట్టుక తోనే కొన్ని హక్కులు లభిస్తాయని, వాటిని ఎవరూ తొలగించలేరని ఈ సిద్ధాంతం తెలియజేస్తుంది. జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, ఆస్తి హక్కు, ఆనందాన్ని పొందే హక్కు మానవులకు సహజమని ఇది తెలియ జేస్తుంది. రాజరిక ప్రభుత్వాలు అమితమైన అధికారాన్ని చూపితే ప్రభుత్వం పై తిరుగు బాటు చేయటం కేవలం హక్కే కాకుండా, కర్తవ్యం కూడా అని ఈ సిద్ధాంతం ప్రభోదించింది. బ్రిటిష్ రాజ్యాంగంతో ఈ హక్కులు ఉన్న వేనని, వలసల ఛార్టర్ల ద్వారా అమెరికన్‌లకు అవి వర్తిస్తాయని స్థానికులు భావించేవారు. కాని బ్రిటీష్ వారు పార్లమెంట్ అధికారం అమితమైందని, మాతృదేశాన్ని పరిపుష్టం చేయడానికే వలసలున్నాయని వలసలపై వారికి పూర్తి అధికారాలున్నాయని భావించేవారు. ఈ సంఘర్షణే స్వాతంత్ర్య ప్రకటనకు దారితీసింది.

వలసలో వ్యక్తి గత ఆస్తికి ప్రాధాన్యత ఏర్పడింది. పరిపాలనలో ప్రజా భాగస్వామ్యం మొదటి నుంచి వుండటంతో చట్ట సభల ప్రాధాన్యత కొనసాగింది. లిఖిత పూర్వకమైన ఒడంబడికలకు కట్టుబడి వుండటం నేర్చుకున్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, అధికారు లందరూ కూడా దాని పరిధిలోకి వస్తారని సామాన్య న్యాయం యొక్క ప్రాధాన్యత చాటారు. వ్యక్తి గత స్వేచ్ఛా, స్వతంత్ర్య నిర్ణయాలు, జీవనశైలిలో భాగమైనాయి.

## 1.20. సమీక్ష:-

భిన్న దేశాలకు చెందిన వ్యక్తులు అమెరికా ఖండంలో అడుగిడిగిన తర్వాత ఒకే ఒక జాతి గా రూపాంతరం చెందారు. స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, హక్కులను కోరిన ఐరోపా వాసులు నూతన ఖండంలో అడుగిడినప్పటి నుంచి, వాటిని పరిరక్షించుకునే ప్రయత్నాలను రాజ్యాంగ విధానాల ద్వారా చేశారు. ఐరోపాలో రాజరిక వ్యవస్థ వర్ధిల్లుతున్న సమయంలోనే వీరు ప్రజా భాగస్వామ్యంతో కూడిన గణతంత్ర విధాన ప్రయోగాన్ని చేపట్టారు. పదమూడు వలసలతో ఆరంభమయిన అమెరికా కాలక్రమేణా సంఖ్యాపరంగా పెరిగింది. ఆర్థిక ప్రాధాన్యతలనను గురించి రాజకీయ పార్టీలు ఉద్భవించాయి. ప్రాంతీయుతా భావం కూడా అంతర్యు యుద్ధం వరకు పెరిగింది.

## అభ్యాసాలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

1. నూతన ఖండంలో ఏర్పడిన ఐరోపా వలసలను వివరించండి.
2. అమెరికాలో ఏర్పడిన బ్రిటీష్ వలసలను గురించి తెలియ జేయండి
3. వలసలలో పెంపొందిన విలువలను వివరించండి.

## ఉపయుక్త గ్రంధములు


1) Henry Bamford parkes : The United States of America

2) Thomas A Bailey : The American Pageant

3) C.P Hil : History of the United States

4) Patt & Drummond : Our Nation, From its Creation


5) David Donald : A History of American Life & Thought

6) Richad M. Morris : Encyclopaedia of American History

7) Edward J. Conlon : America Charitha Sangraham
(For the United States Infor mation serice-Madras)

8) Telugu A cademy : America Samyukta Rashtrala Charitra.

9) Nevins, & Henry Steele Commager. : A Short History of the united States.




అమెరికా సంయుక్త రాష్ట్రాలు
నైసర్గిక స్వరూపము

**డా॥ కంరున్నిసా బేగం,** ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.
చరిత్ర, పురాతత్త్వ శాఖ
నాగార్జున విశ్వ విద్యాలయం

# పాఠం - 2

# అమెరికా స్వాతంత్ర్య సమరం

**2.0 లక్ష్యం :**

అమెరికా స్వాతంత్ర్య సమరమునకు కారణాలు, సమరగతి, స్వాతంత్ర్య సమర ఫలితాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం :**

2.1 పరిచయము

2.2 వలసల వైఖరి

2.3 బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి

2.4 బోస్టన్ హత్యాకాండ

2.5 బోస్టన్ తేనేటి విందు

2.6 ప్రథమ కాంటినెంటల్ కాంగ్రెస్

2.7 రెండో కాంటినెంటల్ కాంగ్రెస్

2.8 స్వాతంత్ర్య ప్రకటన

2.9 ఉత్తర ప్రాంతంలో యుద్ధం

2.10 అమెరికన్‌లకు విదేశ సహకారము

2.11 దక్షిణ ప్రాంతంలో యుద్ధం

2.12 పారిస్ శాంతి సమావేశం

**2.1 పరిచయము :**

పదిహేడవ శతాబ్ది మొదటి భాగంలో యూరపు నుండి ఉత్తర అమెరికాకు వలస మహా ప్రవాహంలాగ ప్రారంభమైంది. ఈ ప్రవాహం, కొద్దిమంది ఆంగ్ల వలసదారులతో సన్నని సెలయేరుగా మొదలైమూడు శతాబ్దాల పాటు క్రమంగా పెరుగుతూ, తుదకు లక్షలాది వలసదారులతో పెద్ద వెల్లువగా వచ్చి అమెరికాను ముంచెత్తింది. సప్త సంవత్సర యుద్ధానంతరం (1756-1763) క్రమేణా వలసలకు మాతృదేశంపైనా, మాతృ దేశానికి వలసలపైనా దృక్పథం మారింది. వలస ప్రజలలో క్రమంగా వృద్ధి అవుతున్న శక్తి సామర్థ్యాలవల్ల ఆత్మ విశ్వాసము ఇనుమడించింది. వారు బ్రిటిష్ ప్రభుత్వ అదుపులో అణిగి మణిగి ఉండవలసిన అవసరం లేదని భావించసాగారు. ఒక పక్క వలస ప్రజలు స్వాతంత్ర్యాన్ని అభిలషిస్తూ ఉంటే బ్రిటిష్ ప్రభుత్వము 1763 తరువాత వలసల మీద అధికారాన్ని మరింత కట్టు దిట్టం చేయవలెనని నిశ్చయించింది.

**2.2 వలసల వైఖరి :**

పద్దెనిమిదో శతాబ్దంలో ఆంగ్ల వలసలు, ఆర్థిక, సాసంస్కృతిక రంగాలలో చాలా పురోభివృద్ధిని సాధించారు. ఈ ప్రగతి వలస ప్రజలలో నవచైతన్యాన్ని కలిగించింది. వారు తమ పరిపాలన విషయంలో బ్రిటిష్ అజమాయిషీలేకుండా మెలగగలమని భావించ సాగారు.

వలసలలో నివసిస్తున్న ప్రజలలో ఎక్కువ భాగం బ్రిటన్ నుంచి వచ్చినవారు. వీరు మాతృ దేశంలోని ప్రజలు అనుభవిస్తున్న హక్కులు తమకు కూడా లభించవలెనని వాదించసాగారు. వలసల శాసన సభలకు అధ్యక్షత వహించడానికి ఆంగ్ల ప్రభుత్వము గవర్నర్‌లను నియమించడం వారు నిరసించలేదు. కాని ఆ గవర్నర్‌లు తమ శాసన సభల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు. వలస ప్రజలలో ఉదయించిన నూతన చైతన్యపు తొలి రోజులలో తమ మీద బ్రిటిష్ ప్రభుత్వానికి ఉన్న అధికారాన్నంతా కూలదోయాలని బ్రిటన్‌తో పూర్తిగా సంబంధ బాంధవ్యాలు తెంపుకోవాలని వారనుకోలేదు. కాని క్రమ క్రమంగా వివిధ పరిస్థితుల ప్రాబల్యం వల్ల వారిలో స్వాతంత్ర్య కాంక్ష చెలరేగింది. ఉత్తర ప్రాంత వర్తక ప్రముఖులు బ్రిటిష్ వాణిజ్య పద్ధతి (Mercantile system) వల్ల తమ వ్యాపారం కుంటుపడిపోతున్నదని భావించారు. బ్రిటిష్‌వారి శ్రామికోత్పత్తులకు మార్కెట్టుగా ఉంటూ, ఆ పరిశ్రమలకవసరమైన ముడి సరుకులు సరఫరాచేస్తూ బ్రిటన్‌కు సేవచేయడమే ఈ వలస ప్రజల కర్తవ్యమైనట్లుగా బ్రిటిష్ ప్రభుత్వం వ్యవహరించడం వలస ప్రజలకు మాతృదేశంపై ఏవగింపు కలిగించింది. కాని 1760కి ముందు ఇంగ్లండ్ వాణిజ్య చట్టాలను సక్రమంగా అమలు జరపకపోవడం వల్ల వలసల వర్తకులు ఆ చట్టాలను సులభంగా ఉల్లంఘించే అవకాశం ఉండేది.

## 2.3. బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి :

వలసలలోని ప్రజల దృక్పథం మారుతూ స్వాతంత్ర్య కాంక్ష పెరుగుతూఉన్న సమయంలో బ్రిటిష్ ప్రభుత్వము వాణిజ్య పద్ధతిని అంటి పెట్టుకొని వలసలు మాతృ దేశానికి లాభాన్ని చేకూర్చడానికే ఉన్నాయన్న ధోరణిలో ఉండేది. ఎడ్మండ్‌బర్క్, ఎర్ల్ ఆఫ్ ఛాతమ్ వంటి మేధావులు 1763కు ముందు వలసలకు, మాతృ దేశానికి మధ్య ఉన్న సంబంధాలను యధాతథంగా ఉండనీయవలెనని, వలసలపై మరింత ఆంక్షలను విధించడం క్షేమ కరం కాదని వాదించేవారు. అటువంటి వారు ఏ కొద్దిమందో తప్ప మిగిలిన వారందరూ వలసలపై అధికారాన్ని పటిష్టం చేయవలెనని పట్టుబట్టేవారు. సప్త సంవత్సర యుద్ధానంతరం అమెరికాలో బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించడంతో పాటు కొంత అప్పుకూడా అయింది. ఫ్రెంచి వారు ఖాళీచేసి వెళ్ళిన ప్రాంతాలను పునరాక్రమించకుండా చేయడానికి, రెడ్ ఇండియన్‌ల దాడులను అరికట్టడానికి, పది వేలమంది బ్రిటిష్ సైనికులను ఉత్తర అమెరికాలో ఉంచడానికి 1763లో బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించింది. దీనికయ్యే ఖర్చులలో కొంత భాగాన్ని వలసలనుంచి రాబట్టడానికి వలసలలో పన్నులు పెంచవలెనని బ్రిటన్‌లోని ప్రభుత్వాధినేతలు సంకల్పించినారు. సప్త సంవత్సర యుద్ధం రోజులలో వలసల వర్తకులు దొంగచాటుగా ఫ్రాన్స్‌తో వ్యాపారం సాగిస్తూ ఉండేవారని, బ్రిటిష్ నౌకాశాసనాలను ఏ మాత్రం పాటించలేదని బ్రిటిష్ వర్తకులు తమ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఈ పరిస్థితులలో నౌకా శాసనాలను కట్టుదిట్టం చేసి వాణిజ్య విషయాలలో తమ శ్రేయస్సుకు అధిక ప్రాముఖ్యము ఇవ్వడానికి బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించింది.

**బ్రిటిష్ నౌకా శాసనాలు :** బ్రిటిష్‌వారి మొట్టమొదటి నౌకా శాసనము 1650లో జారీ అయింది. దీని ప్రకారం :

1) వలసలనుంచి రవాణాచేసే సరకులను లేదా వలసలకు చేరవలసిన సరకులను వలసల ఓడలలోనో బ్రిటిష్ ఓడలలోనో మాత్రమే తీసుకొని వెళ్ళవలెను. ఈ ఓడల సిబ్బందిలో ఎక్కువగా వలస ప్రజలుగాని, ఆంగ్లేయులుగాని ఉండాలి.

2) వలసల నుంచి ఎగుమతి అయ్యే వస్తువులైన ఉన్ని (Furs), తెరచాపకొయ్యలు, తారు, తుత్తునాగము (Zinc), కర్పూర తైలము, పొగాకు మొదలైన సరకులు ఐరోపా దేశాలకు బ్రిటన్ మీదుగానే తీసికొని వెళ్ళాలి.

3) అదే విధంగా ఐరోపా దేశాలనుంచి వలసలకు దిగుమతి అయ్యే సరుకులు బ్రిటన్ మీదుగానే వెళ్ళాలి.

4) వలసలలోని పారిశ్రామిక ఉత్పత్తులు బ్రిటిష్ ఉత్పత్తులతో పోటీ చేయకుండా ఉండడానికి వలసలలోని పరిశ్రమలమీద కొన్ని నిబంధనలు చేయడమైంది. ఉదాహరణకు 1750 'ఇనుము చట్టము' అమెరికాలోని ముడి ఇనుము ఉత్పత్తి మీద ఒక గరిష్ట పరిమితిని విధించింది.

5) 1733 మొలాసెస్ చట్టం (Molasses Act) ప్రకారం ఫ్రెంచ్ పశ్చిమ ఇండియా దీవులు (French West Indies) నుంచి వలసలకు దిగుమతి అయ్యే మొలాసెస్ పైన గాలన్‌కు ఆరు పెన్నీలు పన్ను విధించడమయింది. దీనివల్ల వలస ప్రజలు బ్రిటిష్ పశ్చిమ

ఇండియా దీవులనుంచి మాత్రమే మొలాసెస్ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కాని సుమారు 150 సంవత్సరాల పాటు ఎడతెరిపి లేకుండా సాగుతూ వచ్చిన సంగ్రామాల వల్ల ఇతర ఇబ్బందులవల్ల బ్రిటిష్ ప్రభుత్వము ఈ నౌకా శాసనాలను కట్టుదిట్టంగా అమలు జరపలేకపోయింది. వలసలకు దొంగ రవాణా అతి సామాన్యమై పోయింది.

అమెరికా పశ్చిమ ప్రాంతం నుంచి ఫ్రెంచి అధికారాన్ని తొలగించిన తరువాత బ్రిటిష్ ప్రభుత్వము ఇంకో సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ ప్రాంతంలో ఓడిపోయిన ఫ్రెంచి వారు చెదురు మదురుగా ఉన్నారు. వీరు రెడ్ ఇండియన్‌లకు తమ స్థావరాలను నుంచి బ్రిటిష్ వారు తరిమివేస్తారనే భీతిని కలిగించి బ్రిటిష్ వారిపై తిరగబడేటట్లు ప్రేరేపించినారు. రెడ్ ఇండియన్‌లు పాంటియక్ అనే నాయకుని ఆధిపత్యంలో తిరుగుబాటు సాగించారు. డెట్రాయిట్, పశ్చిమ పెన్సిల్వేనియాల మధ్య ఉన్న కొన్ని ప్రాంతాలపై దాడిచేసి క్షోభపరిచారు. చివరకు బ్రిటిష్ సైన్యాలు వలస ప్రజల సహాయంతో పాంటియక్ తిరుగుబాటునే అణచివేసాయి. కాని ఫ్రెంచి వారు ఖాళీ చేసి వెళ్ళిన ప్రాంతాలను వలస ప్రజలు ఆక్రమించుకోగూడదని 1763లో బ్రిటన్ ఒక ప్రకటన చేసింది. అలి ఘనీ పర్వతాలు దాటిపోయి పశ్చిమ ప్రాంతంలో స్థావరాలేర్పరచుకొన్న వారందరినీ యధాస్థానాలకు వెను గిరిగి పోవలసింది బ్రిటిష్ ప్రభుత్వము ఈ ప్రకటనలో ఆజ్ఞాపించింది, రెడ్ ఇండియన్‌లు తమ భూములను బ్రిటిష్ ప్రభుత్వానికి తప్ప మరెవ్వరికీ అమ్మకూడదని ఆంక్ష విధించింది. పశ్చిమ ప్రాంతంలో లాభసాటి అయిన ఉన్ని వ్యాపారాన్ని నిర్వహించడానికి బ్రిటిష్ ప్రభుత్వమే కొందరిని ఏజెంట్లుగా నియమించింది. ఈ చర్యలన్నిటి వల్ల వలస ప్రజలలో బ్రిటిష్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగింది. 1763 తరువాత దాదాపు పన్నెండేళ్ళపాటు బ్రిటిష్ ప్రభుత్వాధి నేతలు, పార్లమెంట్ సభ్యులు వలసలనుంచి పన్నుల రూపంలో యుద్ధాలవల్ల ఖర్చయిన ధనాన్ని రాబట్టవలెనని విశ్వ ప్రయత్నం చేశారు.

జార్జి గ్రెన్విల్ 1763లో బ్రిటిష్ ప్రధానమంత్రి అయ్యాడు. ఇతడు వలసల వాణిజ్యంపై బ్రిటన్‌కున్న అధికారాన్ని మరింత కట్టుదిట్టం చేసాడు. దొంగచాటుగా వర్తకం సాగించేవారి మీద బ్రిటిష్ ప్రభుత్వం నిఘా పెంచాడు. వాణిజ్య శాసనాలను ఉల్లంఘిస్తే నేరస్థులను విచారించడం కోసం 'వైస్ అడ్మిరాల్టీ' న్యాయ స్థానాలు (Vice-Admiralty - Courts) ను ఏర్పాటు చేసాడు. వలసలు వాణిజ్య నౌకలు నిషిద్ధ సరుకులు తీసుకొని పోతున్నాయని అనుమానం వస్తే బ్రిటిష్ అధికారులు "రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్" (Writes of Assistance) ద్వారా తమకున్న అధికారాన్ని ఉపయోగించి వాటిని నిలిపి శోధించే అవకాశాన్ని కలిగించారు. ఆ తర్వాత బ్రిటన్ అనేక చట్టాలను ప్రవేశపెట్టింది. దానిలో ముఖ్యమైనవి :

**1) చక్కెర చట్టము :** ఈ చట్టము 1764లో ప్రవేశపెట్టబడింది. ఈ చట్టము విదేశాల నుంచి వలస ప్రజలు దిగుమతి చేసుకొనే మొలాసెస్ మీది సుంకాన్ని తగ్గించి చక్కెర మీద ఎక్కువ పన్ను విధించింది. ఇంతేకాక మద్యము, పట్టు, మొదలైన విలాస వస్తువుల మీద కొత్త పన్నులను విధించింది. ఈ చక్కెర చట్టాన్ని ప్రవేశ పెట్టడంలో బ్రిటిష్ ప్రభుత్వ ముఖ్యోద్దేశము అమెరికాలో ఉన్న బ్రిటిష్ సైనికులకయ్యే పోషణ ఖర్చును వలస ప్రజల నుంచి రాబట్టు కోవడమే. ఇదివరలో అమెరికన్‌లు ఫ్రెంచి పశ్చిమ ఇండియా దీవులనుంచి చక్కెర దిగుమతి చేసుకొని దానితో "రమ్" (Rum) తయారుచేసి ఆ రమ్‌కు బదులుగా ఆఫ్రికా బానిసలను కొనుక్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకొనే విదేశీ చక్కెర మీద చక్కెర చట్టము ఎక్కువ పన్ను విధించడంతో, అమెరికన్‌లు చక్కెరను మాతృ దేశం నుంచే దిగుమతి చేసుకోవలసిన అగత్యమేర్పడింది. ఇది వలస ప్రజలకు తీరని నష్టం కలిగించింది.

**2) కరెన్సీ చట్టము :** ఈ చట్టాన్ని బ్రిటిష్ ప్రభుత్వం 1764లో ప్రవేశ పెట్టింది. ఈ చట్టం వల్ల ప్రజలు వెండి బంగారాల వత్తాసు (backing) లేకుండా కేవలం కాగితపు కరెన్సీని జారీ చేయడం నిషేధించింది. ఈ చట్టం వలస ప్రజలకు అప్పులిచ్చిన బ్రిటిష్ శ్రీమంతులు పార్లమెంట్‌పై తీసికొని వచ్చిన ఒత్తిడి ఫలితము.

**3) స్టాంపుల చట్టము :** బ్రిటిష్ ప్రధానియైన జార్జి గ్రెన్విల్ 1765 లో స్టాంపుల చట్టాన్ని ప్రవేశ పెట్టాడు. ఈ చట్టం ప్రకారం వలస ప్రజలు వార్తా పత్రికలు, కరపత్రాలు, దస్తావేజులు మొదలైన వాటిపైన స్టాంపు పన్ను చెల్లించాలి. స్టాంపుల చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించినప్పుడు, దాని మూలంగా విపరీతమైన ఆందోళన నెదుర్కోవలసి వస్తుందని బ్రిటిష్ ప్రభుత్వ మూహించలేదు. ప్రాతినిధ్యం లేనిదే పన్నులు విధించకూడదు, అట్లా విధిస్తే అది నిరంకుశమవుతుందని వారు వాదించారు. దీనికితోడు మే 1765లో గ్రెన్విల్ క్వార్టరింగ్ చట్టాన్ని

(Quartring Act) ప్రవేశపెట్టాడు. ఈ చట్టం ప్రకారం అమెరికాలో ఉన్న బ్రిటిష్ సైనికులకు వలస ప్రజలు గృహ వసతి కల్పించి వారి నిత్యావసరాలు, కొవ్వత్తులు, ఉప్పు, మద్యము మొదలైనవి సరఫరా చేయాలి.

స్టాంపుల చట్టంపై ప్రతి ఘటన వర్జీనియా శాసనసభలో ప్రారంభమైంది. వర్జీనియా వలస ప్రజలపై పన్ను విధించే అధికారము వర్జీనియా శాసనసభకు మాత్రమే ఉందని, దానికి వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వం చేసే ప్రతి చర్య న్యాయానికి రాజ్యాంగానికి, ధర్మానికి విరుద్ధంగా ఉందని పాట్రిక్ హెన్రీ వర్జీనియా శాసనసభలో గర్జించాడు. ఆంగ్లరాజు మూడో జార్జి నిరంకుశంగా ప్రవర్తిస్తే సీజర్ చక్రవర్తి, మొదటి చార్లెస్‌లకు పట్టినగతే పడుతుందని ఈతడు బెదిరించాడు. ఈ ఆందోళన వెంటనే మెసాచుసెట్స్‌కు పాకింది. అక్కడ జేమ్స్ఓటిస్, శామ్యూల్ ఆడమ్స్‌లు హెన్రీవలనే ఆవేశ పూరితమైన ఉపన్యాసాలిచ్చి, ఆ వలసలోని ప్రజలను ఉత్తేజపరిచారు. అన్ని వలసలలోని తీవ్రవాదులు కలిసి "స్వేచ్ఛాపుత్రులు" (Sons of Liberly) అనే తీవ్రవాద సంఘాన్ని నెలకొల్పి దౌర్జన్య చర్యలను ప్రోత్సహించారు. బోస్టన్, ఫిలడెల్ఫియా, న్యూపోర్ట్, న్యూయార్క్, ఛార్లెస్టన్ పట్టణాలలో దొమ్మీలు జరిగాయి. ఆ పట్టణాలలో స్టాంపులమ్మే రాజోద్యోగులను తీవ్ర వాదులు భయపెట్టారు. అనేకచోట్ల ఈ రాజోద్యోగులు ప్రజాభిప్రాయానికి వెరిచి తమ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చారు. బ్రిటిష్ వ్యాపారం దెబ్బతింది.

స్టాంపుల చట్టం నిరసన మహాసభ అక్టోబర్ 1765లో న్యూయార్క్ పట్టణంలో జరిగింది. తొమ్మిది వలసల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మాతృ దేశంలోని ప్రజలనుభవించే హక్కులు, స్వేచ్ఛ తమకు కూడా పూర్తిగా వర్తింప చేయవలెనని కోరారు. బ్రిటిష్ పార్లమెంట్‌లో వలస ప్రజలకు సభ్యత్వంలేదు. వలస శాసన సభల అనుమతిలేకుండా పార్లమెంట్ పన్నులు విధించడం రాజ్యాంగ చట్టానికి విరుద్ధమని వీరు వాదించారు. బ్రిటిష్ పార్లమెంట్ చేసిన అనేక శాసనాలు వలసలపై మోయలేని భారం మోపాయనీ, వలసలకు మాతృదేశానికీ మధ్య కొనసాగుతూవున్న వాణిజ్యానికి అవి అనేక అంతరాయాలు కల్గించాయని ప్రకటించారు. వాణిజ్య విషయంలో పార్లమెంట్ విధించిన నిబంధనలవల్ల వలసలు, బ్రిటిష్ సరుకులను కొనడానికి వీలులేని పరిస్థితి ఏర్పడిందని బ్రిటిష్ వర్తకులను గట్టిగా హెచ్చరించారు. ఈ తీర్మానాలు మాతృ దేశంపట్ల అవిధేయకరంగా ఉన్నప్పటికీ విస్పష్టంగాను, ముక్కు సూటిగాను ఉన్నాయని చెప్పవచ్చును.

స్టాంపుల చట్టం కారణంగా వలసలలో రేగిన ప్రతిఘటనవల్ల వలస ప్రజలు బ్రిటిష్ సరుకులను బహిష్కరించారు; తత్ఫలితంగా దెబ్బతిన్న బ్రిటిష్ వర్తకుల ఒత్తిడివల్ల పార్లమెంట్ 1766లో స్టాంపుల చట్టాన్ని రద్దు చేసింది. కానీ వెంటనే డిక్లరేటరీ చట్టాన్ని (Declaratory Act) ప్రవేశ పెట్టింది. ఈ చట్టం ప్రకారం, వలసలు బ్రిటిష్ రాజుకు, పార్లమెంట్‌కు ఆదినుంచి తల ఒగ్గివున్నాయి. కాబట్టి ఉత్తరోత్తరా కూడా ఆ విధంగా ఉండవలసిందే. బ్రిటిష్ రాజుకు, పార్లమెంట్‌కు వలసలను అదుపులో పెట్టడానికి ఏ సమయంలోనైనా చట్టాలను ప్రవేశపెట్టే అధికారముంది, కానీ స్టాంపుల చట్టం రద్దయిందన్న వార్తవిన్న వలస ప్రజలు ఆనందాతిశయంలో డిక్లరేటరీ చట్టాన్ని గురించి అంతగా పట్టించుకోలేదు.

అనతి కాలంలోనే వలస ప్రజలు ఇదివరటికన్నా దారుణమైన పరిస్థితులనెదుర్కోవలసి వచ్చింది. స్టాంపుల చట్టాన్ని రద్దు చేసిన బ్రిటిష్ ప్రధాని రాకింగ్ హామ్, జూలై 1766లో పదవీ విరమణచేసాడు. విలియం పిట్ బ్రిటిష్ ప్రధాని అయ్యాడు. కాని అతడు అస్వస్థతతో ఉన్నందువల్ల కోశాగార మంత్రి ఛార్లెస్ టౌన్‌షెండ్ ఆర్థిక విషయాలలో ఎక్కువ చొరవ తీసుకొని ప్రవర్తించాడు. ఇతడు, వలసలలోకి దిగుమతి అయ్యే గాజు సామగ్రి, సీసము, రంగులు, కాగితము, తేయాకులపైన కొత్త పన్నులు విధించాడు. ఆ పన్నుల వల్ల వచ్చే ఆదాయాన్ని వలసలలోని బ్రిటిష్ గవర్నర్ల జీతాలకు ఉపయోగించవలెనని ఆశాసనాలలో స్పష్టంగా చెప్పడమైంది. దీనిమూలంగా గవర్నర్‌లపై వలస శాసన సభలకు ఇదివరకు ఉన్న అధికారం కాస్తా పోతుంది. ఇది గాక బ్రిటిష్ రాజుకున్న హక్కును వలసలలో బలోపేతం చేయడానికి టౌన్ షెండ్ మరొక చట్టం ప్రవేశపెట్టాడు. ఈ చట్టం ప్రకారం వలసలలోని రాజకీయ నేరస్థులను వలసల న్యాయ స్థానాలు, జ్యూరీలు విచారించరాదు. న్యాయ విచారణకు వారిని ఇంగ్లండ్‌కు పంపాలి. కొత్త దిగుమతి పన్నులతో బాటు రాజకీయ నేరస్థులను ఇంగ్లండ్ పంపవలెనని విధించడంతో వలసలన్నీ తమ తీవ్ర అసమ్మతిని తెలియచేశాయి. మెసాచుసెట్స్‌లోని దేశ భక్తులు శామ్యూల్ ఆడమ్స్ నాయకత్వంలో ఈ చట్టాలను ప్రతిఘటించ పూనుకొన్నారు. ముఖ్యంగా బోస్టన్ నగరంలోని యువకులు దేశ భక్తుల ముఠాగాచేరి ప్రజలకు ఈ దురన్యాయం వివరించి చెబుతూ ప్రతిఘటనోద్యమం ప్రారంభించారు. అదే విధంగా వర్జీనియా వలసలలోని కొందరు యువకులు, భూస్వాములు:, బానిసల

యజమానులు దేశ భక్తుల దండులోచేరి రాజకీయోద్యమం జరపడానికి కంకణం కట్టారు. వీరి నాయకులు థామస్ జెఫర్సన్, పాట్రిక్ హెన్రీ, రిచర్డ్ హెన్రీలీ మొదలైనవారు, జార్జి వాషింగ్టన్ ఎటువంటి ఉద్రేకాలకు లోను గాకుండా పరిస్థితులను ఆకళింపుచేసుకొంటూ నెమ్మదిగా విప్లవ పక్షంలో చేరాడు.

## 2.4 బోస్టన్ హత్యాకాండ :

బ్రిటిష్ సరుకులను వలసలు దిగుమతి చేసుకోరాదని వలస ప్రజలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఒప్పందాలు అమలు జరపడానికి, వలసలోని వర్తకులు దొంగచాటుగా ఇతర దేశాలనుంచి సరుకులు దిగుమతి చేసుకోడానికి, అనేక ఓడ రేవులలో "స్వేచ్ఛా పుత్రులు" చేదోడు వాదోడుగా ఉండేవారు. బోస్టన్ రేవు ఈ దొంగచాటు వర్తకానికి పేరు మోసిం. ఈ వర్తకాన్ని నిర్మూలించడానికి, 1768లో, కొంత మంది బ్రిటిష్ రెడ్ కోట్ సైనికులు బోస్టన్ రేవులో కాపల ఉన్నారు. మార్చి 5, 1770న వీరికీ వలస ప్రజలకూ బోస్టన్ రేవులో జరిగిన ఘర్షణలో బ్రిటిష్ సైనికులు తుపాకులు పేల్చడంవల్ల నలుగురైదుగురు వలస ప్రజలు మరణించారు. ఈ ఉదంతం బోస్టన్ హత్యాకాండ అనే పేరుతో చరిత్ర పుటలలోకి ఎక్కింది. ఈ ఉదంతము ఒక పెద్దమారణ హోమంగా పరిణమించవలసిందే కాని రెండు పక్షాల నాయకులు చూపిన ఓర్పువల్ల అంతటితో ఆగింది. ఆ రాష్ట్ర గవర్నర్ వెంటనే బ్రిటిష్ సైనికులను బోస్టన్ నుంచి తరలించాడు. కాల్పులు జరిపిన సైనికులను న్యాయ స్థానం విచారించి తగిన రీతిగా శిక్షించింది.

బోస్టన్ హత్యాకాండ జరిగిన రోజునే బ్రిటన్‌లో ప్రభుత్వ పక్షంవారు, ప్రతిపక్షం వారు కూడా టౌన్ షెండ్ చట్టాన్ని ఉపసంహరించవలెనని గట్టిగా కోరారు, కొత్తగా బ్రిటిష్ ప్రధాని అయిన లార్డ్ నార్త్ మాతృదేశానికి, వలసలకు మధ్య ఉన్న తగాదాలను చాకచక్యంతో పరిష్కరిస్తానని పార్లమెంట్‌లో సగర్వంగా చెప్పుకున్నాడు. ప్రతి కూలశాసనాలవల్ల అసంతృప్తి తప్ప వేరే ప్రయోజనముండదని అతడు మూడో జార్జికి మొరపెట్టుకున్నాడు. మూడో జార్జి కనీసమేదైనా ఒక పన్ను సిద్ధాంత రీత్యా విధించే అధికారము తనకు ఉండవలెనని, బ్రిటిష్ పార్లమెంట్‌కు, వలసలపై ఉన్న అధికారానికి అది చిహ్నమని పట్టుబట్టాడు. ఈ విషయం ఓటింగ్‌కు పెట్టగా సరిసమానంగా ఓట్లు వచ్చాయి. ప్రధాని నార్త్ నిర్ణాయక ఓటుతో (Casting vote) రాజు మాటనెగ్గింది. ప్రధాని నార్త్, టౌన్ షెండ్ సుంకాల్ని రద్దు పరుస్తూ ఒక తేయాకు మీద మాత్రం దిగుమతి సుంకం విధించాడు. ఈ పన్నును గూడా అనేక మంది వలస ప్రజలు చెల్లించడానికి నిరాకరించి హాలెండ్ నుంచి దొంగ చాటుగా తేయాకును దిగుమతి చేసుకొనేవారు.

బ్రిటీషు ప్రభుత్వము 1773లో, ఒక పెద్ద పొరపాటు చేసింది. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ డబ్బు ఇబ్బందులలో పడి పార్లమెంట్‌ను ఆశ్రయించింది. ఈ కంపెనీ వారి తేయాకు భారీ ఎత్తున నిలవ ఉండిపోయింది. జార్జిరాజు, పార్లమెంట్‌లోని అతని అనుయాయులూ కంపెనీ తేయాకును తక్కువ ధరకు వలసలలో అమ్మించడానికి నిశ్చయించి కంపెనీ తేయాకుపైన పౌనుకు మూడు పెన్నీల చొప్పున దిగుమతి పన్ను విధించారు. అయినప్పటికీ ఆ తేయాకు వలస ప్రజలకు ఇతరత్రా లభించే తేయాకుకన్న తక్కువ ధరకే గిట్టేది. కాని వలసలలోని "దేశ భక్తులు" (Patriots) పార్లమెంట్‌కు ఎట్లాంటి పన్ను విధించే హక్కులేదని, పైగా కంపెనీకి, తేయాకు అమ్మకం విషయంలో గుత్తాధికారం (monopoly) ఇవ్వకూడదని తీవ్ర నిరసన తెలిపారు.

వలసలు 1773లో, ఒక దానికొకటి సానుభూతితో చూసుకొంటూ సన్నిహితమయ్యేటందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. తేయాకుతో నిండిన ఓడలు ఇంగ్లండ్ నుంచి బయలుదేరి వలసలలోని రేవు పట్టణాల వద్దకు వచ్చి నిలిచాయి, తేయాకు బహిష్కరణోద్యమము ఒక్కొక్క వలసలో ఒక్కొక్క విధంగా జరిగింది. ఫిలడెల్ఫియాలో స్థానిక తీవ్రవాద సంఘాలు ఓడ కెప్టెన్‌లను తేయాకు దింపవద్దని, దింపేటందుకు ప్రయత్నం చేస్తే తాము ప్రతిఘటిస్తామని బెదిరించారు. అందువల్ల అనేక మంది కాప్టెన్‌లు తిరుగుదారి పట్టవలసి వచ్చింది. ఛార్లెస్టన్ రేవులో తేయాకును ఓడనుంచి దించి గిడ్డంగులలో చేర్చారు. ఆ గిడ్డంగులు నీటితో తడిసి ఉండడం వల్ల తేయాకంతా నాశనమైంది. న్యూయార్క్‌లో తేయాకు ఓడ తీరం చేరుకొంటూ ఉండగా ఒక పెద్ద తుఫాను వచ్చి ఓడ సముద్రంవైపు కొట్టుకు పోయింది.

## బోస్టన్ తేనీటి విందు :

బోస్టన్‌లో అనేక బహిరంగ సభలు జరిగిన తరువాత కొందరు తీవ్రవాదులు ఓడలోని తేయాకును దింపి దానిని బ్రిటిష్ అధికారుల ుండే సముద్రంలోకి నెట్టి వేశారు. ఈ సంఘటన "బోస్టన్ తేనేటి విందు" (Boston Tea Party) అని చరిత్ర పుటలలోకి ఎక్కింది. ికా స్వాతంత్ర్య పోరాటానికి ఇదే తక్షణ కారణమైంది.

మూడో జార్జి రాజు, ప్రధాని నార్త్‌లకు ఈ దౌర్జన్య చర్య పట్టరాని ఆగ్రహాన్ని కలిగించింది. బోస్టన్ రేవు పట్టణాన్ని మూసివేయమని, గు పటాలాల సైన్యము, ఆ పట్టణాన్ని ఆక్రమించవలెనని, ప్రజలు ప్రభు విధేయులై ఎట్లా మసలుకోవలెనో తెలుపమని జార్జి ఆజ్ఞాపించాడు. ుసెట్స్ బ్రిటిష్ వారికి ఆయుధాగారమైంది. జనరల్ గేజ్ ఆ ఆయుధాగారానికి అధ్యక్షుడు, వలస ప్రజలు ఈ చట్టాలను "దుస్సహ లు". (Intolerable Acts) అని నిరసించారు.

## ప్రథమ కాంటి నెంటల్ కాంగ్రెస్ :

ఇతర వలసలు మెసాచు సెట్స్ పట్ల సానుభూతిచూపి వారికి అవసరమైన ఆహార పదార్థాలను సరఫరా చేసాయి. సెప్టెంబరు, 4లో, వర్జీనియా శాసన ప్రతినిధి సభ సూచన ప్రకారం ప్రథమ కాంటినెంటల్ కాంగ్రెస్ ఫిలడెల్ఫియాలో సమావేశమైంది. ఈ సమావేశానికి ూతప్ప మిగతా అన్ని వలసలు తమ ప్రతినిధులను పంపాయి. తీవ్ర వాదులు, మితవాదులని ఈ ప్రతినిధులు రెండు వర్గాలుగా యారు, తమ రక్తం ధారపోసి అయినా సరే బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను అరికట్టవలెనని తీవ్రవాదులు వాదించారు. మెసాచుసెట్స్ ప్రతినిధులైన శామ్ ఆడమ్స్, జాన్ ఆడమ్స్, వర్జీనియా ప్రతినిధులైన పాట్రిక్ హెన్రీ, రిచర్డ్ హెన్రీలీ ముఖ్యులు ులలో పెన్సిల్వేనియా నుంచి వచ్చిన జాన్ డికిన్‌సన్ ముఖ్యుడు. మితవాదులు మాతృ దేశంతో తమకున్న వివాదాలను శాంతియుతంగా రించుకోవలెనన్నారు. చివరికి తీవ్రవాదులే నెగ్గారు. వారు హక్కుల పత్రమొకటి తయారుచేసి బ్రిటన్‌కు పంపారు. అందులో పార్లమెంట్ ప్రజల స్వాతంత్ర్యానికి ఎంత మాత్రం భంగం కలిగించకూడదని స్పష్టం చేశారు. "ప్రాతి నిధ్యంలేని పన్ను విధింపు"ని (taxation hout representation) అరికట్టవలెనన్నారు. వలసల పరిపాలనకు సంబంధించిన చట్టాలను, వలసల శాసనసభలే జారీచేసే ్పించమనికోరారు. ఇంతేకాక ప్రతి పట్టణంలోను, జిల్లాలోను భద్రతా సంఘాలు ఏర్పరచి వాటి అజమాయిషీలో బ్రిటిష్ వస్తు ్కరణోద్యమం కొనసాగించవలెనని ఆదేశించారు. మెసాచుసెట్స్ ప్రజలలో మాతృదేశం మీద విద్వేష భావం నాటుకుపోయింది. వలస లు "నిమిష వీరులు" (minute men) అనే పేరుతో ఒక పౌర సైన్యాన్ని ఏర్పాటుచేశారు. కన్‌కార్ట్ పట్టణంలో మందుగుండు సామగ్రిని త్తి చేసే ఒక రహస్య కర్మాగారాన్ని స్థాపించారు. ఈ కన్‌కార్ట్ కర్మాగారాన్ని పట్టుకొనడానికి 19 ఏప్రిల్, 1775లో జనరల్ గేజ్, బోస్టన్ , ఒక బ్రిటిష్ పటాలాన్ని పంపాడు. ఈ పటాలం యొక్క పని, జాన్‌హన్‌కాక్‌ను, శామ్యూల్ ఆడమ్స్‌ను బంధించడం ఈ వార్త ివియర్, విలియం దాజీల ద్వారా కన్‌కార్డ్‌కు చేరింది. "నిమిష వీరులు" హుటా హుటిగా చిన్న పటాలాన్ని పోగుచేసుకొని కంకార్డ్ వైపు న్న బ్రిటిష్ పటాలాన్ని దారిలోనే లెక్సింగ్టన్ వద్ద అటకాయించారు. ఈ సంఘర్షణలో ఎనిమిదిమంది వలసవారు మరణించారు. దీనితో ికా స్వాతంత్ర్య సమరం మొదలైందని చెప్పవచ్చును. బ్రిటిష్ సైనికులు స్వల్ప ప్రతిఘటన నెదుర్కొంటూ కన్‌కార్డ్ వరకూ వెళ్ళి అక్కడ వారు చేర్చి పెట్టుకొన్న మందుగుండు సామగ్రిని ధ్వంసం చేశారు. కాని వారు బోస్టన్‌కు తిరిగి వచ్చేటప్పుడు దారి పొడుగునా ఉన్న చెట్ల వెనక, రాతి స్తంభాల వెనక నిల్చి యుద్ధ సన్నద్ధులైన రైతులు బ్రిటిష్ పటాలం మీద చాటునుంచి కాల్పులు జరిపి గట్టి రు. ఈ ఘర్షణలో దాదాపు 200 మంది బ్రిటిష్ సైనికులు మరణించారు. మిగిలినవారు ఏదో విధంగా బోస్టన్ నగరంలో సురక్షిత ికి చేరబోయే సరికి న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాలవలస సైనికులు సుమారు 20,000 మంది వారిని ముట్టడించారు.

## రెండో కాంటినెంటల్ కాంగ్రెస్ :

ఫిలడెల్ఫియాలో, మే 10, 1775 వ సంవత్సరం, రెండో కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఇది ికన్న ఎక్కువ సంఖ్యలో తీవ్ర వాదులు పాల్గొన్నారు. కొత్త ప్రతినిధులలో బెంజమిన్ ఫ్రాంక్లిన్, థామస్ జెఫర్సన్ మొదలైన మేధావులున్నారు.

ఈ సమావేశం మెసాచుసెట్స్ రాష్ట్రానికి యుద్ధ విషయంలో పూర్తి మద్దతు ఇవ్వడానికి తీర్మానించింది. జార్జి వాషింగ్టన్ నాయకత్వం కింద బలిష్టమైన సైన్యాన్ని తయారు చేయడానికి తగిన ఏర్పాట్లు చేసింది. అంతేగాక వలసలలో శాంతిని పునరుద్ధరించవలసిందని మూడో జార్జికి ఒక విజ్ఞాపన కూడా చేసింది. కాని బ్రిటిష్ ప్రభుత్వాధి నేతలు తమ సాయుధ బలంతో విప్లవాన్ని పూర్తిగా అణిచివేయడానికి సిద్ధమయ్యారు. మూడో జార్జి తన మామూలు సైన్యానికి తోడు జర్మనీకి చెందిన హెస్సీ, అన్ హోల్ట్, బ్రన్స్విక్ రాజకుమారుల వద్ద నుంచి సైనికులను కిరాయికి తీసుకున్నాడు.

అమెరికన్ సైనికులు 1775లో బోస్టన్ సమీపంలో నగరాన్ని ఆనుకొని ఎత్తుగా ఉన్న బంకర్ హిల్ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. ఆ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి బ్రిటిష్ సైనికులు చేసిన ప్రతి ప్రయత్నాన్ని వారు వమ్ము చేశారు. ఈయుద్ధంలో పాల్గొన్న బ్రిటిష్ సేనాని హోవె (Howe) తన సైన్యంలో 1/3 వ భాగాన్ని నష్టపోయాడు. అదే సంవత్సరంలో సేనానులు ఆర్నాల్డ్, రిచర్డ్ మాంట్ గోమెరి నాయకత్వంలో కెనడా జయించడానికి పంపిన బ్రిటిష్ పటాలం మాంట్రియల్‌ను ఆక్రమించుకొన్న తరువాత పరాజయం పొందింది. ఇంతేగాక నార్‌ఫక్, వర్జీనియా, ఛార్లెస్టన్, దక్షిణ కెరోలినా ప్రాంతాలలో బ్రిటీష్ వారికి అనేక పరాజయాలు కలిగాయి.

## 2.8 స్వాతంత్ర్య ప్రకటన, జూలై 4, 1776 (Declaration of Independence) :

ప్రపంచ చరిత్రలోనే మానవ హక్కులను తెలియజేసినటువంటి ప్రముఖ ప్రకటన ఇది. ఫిలడెల్ఫియాలో సమావేశమైన ప్రతినిధులు, జూన్ 1776లో, అయిదుగురు సభ్యులున్న కమిటీతో, స్వాతంత్ర్య తీర్మాన రచనా భారాన్ని జెఫర్సన్‌పై పెట్టారు. జెఫర్సన్ రెండు రోజులు రాత్రింబగళ్ళు కృషిచేసి ఒక చిత్తు ప్రతిని తయారు చేశాడు ఈ చిత్తు ప్రతిని జూన్ 27వ తేదీన కాంగ్రెస్ సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న వలసల ప్రతినిధులు తామంతా ఒక జాతిగా, ఒక ప్రజగా, ఒక ఐక్య దేశంగా ప్రకటించుకోవలసిన అగత్యము ఉందని స్వాతంత్ర్య తీర్మానము (Declaration of Independence) ఆదేశించింది. అందులో జార్జి రాజు నిరంకుశ ప్రభుత్వ విధానాన్ని తూలనాడారు. వలస ప్రజల రాజకీయ విశ్వాసాలను సంగ్రహంగా పొందుపరిచారు. మానవులంతా సమానంగానే సృష్టి అయినారని, సృష్టికర్త అందరు మానవులకు కొన్ని జన్మ హక్కులను (inalienable) ప్రసాదించారని తెలిపారు. వానిలో జీవనము, (life) స్వేచ్ఛ (Liberty), సౌఖ్యాన్వేషణ (Pursuit of happiness) ముఖ్యమైనవి.

ఈ లోగా జనవరి 1776లో థామస్ పెయిన్ అనే ఒక విప్లవనాయకుడు "సామాన్యలోక జ్ఞానం" (Common sense) అనే గ్రంథాన్ని ప్రచురించాడు. దీనిలో అతడు అమెరికన్‌లు ఒక వైపు బ్రిటిష్ ప్రభుత్వంతో యుద్ధం చేస్తూ మరొకవైపు పరస్పర సామరస్యంతో ఉండవలెనని కోరుకోవడం ఎంత అసమంజసమైందో విపులీకరించాడు. బ్రిటన్‌తో అమెరికన్‌లకున్న "చిట్టచివరి అనుబంధ సూత్రం కూడా తెంచివేసుకోవలె" అని పెయిన్ అమెరికన్‌లను హెచ్చరించాడు. ఈ గ్రంథము అమెరికన్‌లలో నవచైతన్యం కలిగించి కార్యోన్ముఖులను చేసింది. పైన పేర్కొన్న రెండు ముఖ్య సంఘటనలు యుద్ధ వాతావరణాన్ని ముమ్మరం చేశాయి.

## 2.9 ఉత్తర ప్రాంతంలో యుద్ధం :

బ్రిటిష్ సేనాని హోవేను 1776వ సంవత్సరం, బోస్టన్ నుంచి తరిమివేసారు. కాని అతడు వెంటనే లాంగ్ ఐలండ్‌లో వాషింగ్టన్‌ను ఓడించి న్యూయార్క్ ఆక్రమించాడు. అతడు చలికాలము అక్కడే గడపవలెనని నిశ్చయించాడు. వాషింగ్టన్‌ను డేలవేర్ నదిమీదుగా దక్షిణంగా పెన్సిల్వేనియాకు తరిమివేశాడు. వాషింగ్టన్ ధైర్యాన్ని కోల్పోకుండా అదును చూసి హిమమయమైన డెలవేర్ నదిని చిన్న తోపుడు పడవలలో దాటిపోయి ట్రెంటన్‌లో తప్ప తాగి నిషాలో ఉన్న జర్మన్ కూలీ సైనికులపై విరుచుకుపడ్డాడు. అక్కడ అతనికి పూర్తి విజయము లభించింది. వెంటనే ప్రిన్స్‌టన్‌లో అతనికి మరో ఘనవిజయం లభించింది. దాదాపు న్యూజెర్సీ అంతా తిరిగి అమెరికన్‌ల స్వాధీనంలోకి వచ్చింది.

జనరల్ హోవే ఫిలడెల్ఫియాను, 1777లో స్వాధీనం చేసుకోవలెనని నిర్ణయించుకున్నాడు. అతని సైన్యాలు న్యూయార్క్ నుంచి సముద్రం మీదుగా ఫిలడెల్ఫియాకు వెళ్ళి ఆ నగరాన్ని స్వాధీనపరుచుకున్నాయి ఈ మార్గంలోనే హోవే, వాషింగ్టన్‌ను బ్రాండీవైన్ పట్టణం దగ్గరా, "జర్మన్ టోన్" దగ్గరా ఓడించాడు. వాషింగ్టన్ తన సైన్యంతో ఫిలడెల్ఫియా నగరం వెలుపల ఉన్న వాలీఫోర్జ్ (Valley Forge)కు

చేరుకొని అదును కోసం వేచి ఉన్నాడు. ఈ విధంగా 1776-77 సంవత్సరాల మధ్య ప్రాంతాలలో వాషింగ్టన్‌కు బ్రిటిష్ వారికి యుద్ధాలు జరుగుతూ ఉండగా అక్కడికి వందలకొద్దిమైళ్ళు ఉత్తరంగా ఉన్న న్యూయార్క్‌లోని సారటోగా వద్ద పర్యవసానాన్ని తేల్చగల ముఖ్యమైన యుద్ధం జరుగుతోంది. న్యూయార్క్ రాష్ట్రంలోని ప్రతిఘటనను రూపు మాపి ఆ విధంగా అమెరికాను మధ్యకు రెండుగా చీలిపోయేటట్లు చేయవలెననీ బ్రిటన్ ఒక బ్రహ్మాండమైన పథకం వేసింది. ఈ పథకం ప్రకారం న్యూయార్క్‌పై మూడు వైపుల నుంచి దాడి జరపాలని నిశ్చయించారు. ఈ సైన్యాలన్నీ న్యూయార్క్‌కు ఉత్తరంగా నూటయాభై మైళ్ళ దూరంలో హడ్సన్ నదీ తీరాన ఉన్న ఆల్బనీ వద్ద కలుసుకోవాలి. సేనాని బర్గోయిన్ కెనడానుంచి దిగువకు దండయాత్ర చేయాలి. సేనాని హోవె న్యూయార్క్ నగరం నుంచి ఉత్తరానికి సైన్యాలు పంపవలెనని సేనాధ్యక్షుడు సెంట్ లీజర్, ఆంటేరియో సరస్సునుంచి రాష్ట్రం మధ్యగా తూర్పు దిశకు మళ్ళారావలెను. ఈ పన్నాగమంతా పూర్తిగా విఫలమైంది. సెంట్ లీజర్‌ను అమెరికన్‌లు ఓరిస్కనీ దగ్గర ఉన్న అరణ్యంలోనే చుట్టు ముట్టారు. హోవె సైన్యాలు అసలు రాలేదు. అక్టోబరు 17వ తేదీ, 1777 సంవత్సరంలో సారటోగా వద్ద 20,000 అమెరికన్ రైతులు, పౌర సైనికులు కలిసి బర్గోయిన్ నాయకత్వంలో ఉన్న 6000 మంది బ్రిటిష్ సైనికులను చుట్టు ముట్టి ఓడించారు.

## 2.10 అమెరికన్‌లకు విదేశ సహకారము :

అమెరికన్‌ల సారటోగా విజయంతో, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలు అమెరికన్‌లు చేసిన విజ్ఞప్తులపట్ల సానుభూతి ప్రకటించడం మొదలు పెట్టాయి. ఫ్రాన్స్ 1778లో, వారితో స్నేహ సూచకమైన సంధి చేసుకొంది. అమెరికా విప్లవం ప్రారంభమయినప్పటి నుంచి ఫ్రాన్స్ అమెరికాకు సహాయం చేస్తూనే వచ్చింది. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తన ప్రజ్ఞతో ఫ్రెంచి వారిని మెప్పించి తన దేశానికి అవసరమైన ధనసహాయం విరివిగా పొందగలిగాడు. సారటోగాలో యుద్ధం ప్రారంభం కావడానికి ముందే కొంత మంది ఫ్రెంచివారు అట్లాంటిక్ సముద్రాన్ని దాటి అమెరికాచేరి అమెరికన్ సైన్యాలతో చేరారు. వీరిలో ముఖ్యంగా పేర్కొనదగ్గ వ్యక్తి మార్క్విస్ డిలఫాయెత్. కొంత కాలం తరువాత స్పెయిన్, హాలండ్ దేశాలు అమెరికన్‌లకు నౌకా దళాన్ని పంపి సహాయ పడ్డాయి. బ్రిటిష్ నౌకాదళంతో సరితూగగల ఫ్రెంచి నౌకా దళము అమెరికన్‌లకు అండగా ఉండి సహాయం చేయడం, అన్నిటికన్నా ముఖ్య విశేషం.

వాషింగ్టన్ తన సైన్యాలతో 1777-78వ సంవత్సర చలికాలం ఫోర్జ్ (Forge) లోయలోనే తలదాచుకోవలసి వచ్చింది. అక్కడ అమెరికన్ సైనికులు చలివల్ల, సరి అయిన ఆహారంలేనందువల్ల, జీతాలు సరిగా ముట్టనందువల్ల అనేక బాధలు పడ్డారు. అనేకమంది పటాలం నుంచి పారిపోయారు. అనేక మంది పటాలల సైన్యంను ఏకంచేసి, వాషింగ్టన్, వారి బాధ్యతలను, దేశభక్తి గురించి ఉద్బోధించాడు. వాషింగ్టన్ కార్యదీక్ష, నాయకత్వమే అమెరికన్ పటాలాలకు స్ఫూర్తినిచ్చింది. బ్రిటిష్ సేనాని హోవె (Howe) వారిపై దెబ్బతీయకుండా ఫిలడెల్ఫియాలో విశ్రాంతి పొందుతూ ఉండడం అమెరికన్‌లకు కొంత ఊపిరి సలుపుకొనే అవకాశాన్నిచ్చింది.

ఫ్రెంచి నౌకాదళం ఫిలడెల్ఫియాను చుట్టుముట్టవచ్చుననే భయంతో బ్రిటిష్ వారు జూన్ 1778లో అక్కడి నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించుకున్నారు. 1778లోనే యుద్ధ తీవ్రత ఉత్తర ప్రాంతం నుంచి దక్షిణ ప్రాంతానికి, పశ్చిమ సరిహద్దుకు పాకింది. న్యూయార్క్‌ను స్వాధీనం చేసుకొన్న బ్రిటిష్ పటాలం దేశంలోపలికి చొచ్చుకురాకుండా అడ్డటం కోసం వాషింగ్టన్ సైన్యం న్యూయార్క్ సమీపంలో వుంది.

## 2.11 దక్షిణ ప్రాంతంలో యుద్ధం :

బ్రిటిష్ వారు, ఉత్తర కెరోలినా, దక్షిణ కెరోలినా, జార్జియాలలోని లాయలిస్టులు (Loyalists) తమకు సహాయం చేయవచ్చుననే ఊహతో యుద్ధ రంగాన్ని దక్షిణ ప్రాంతానికి మార్చారు. వారు 1778లో సవన్నా యుద్ధ రంగంలో విజయం పొందారు. వారు నెమ్మదిగా జార్జియా, దక్షిణ కెరోలినా, ఉత్తర కెరోలినాలలో అనేక ప్రాంతాలను స్వాధీనపరచుకున్నారు. కారన్ వాలిస్ 1780వ, సంవత్సరం ఆగస్టులో కామ్డెన్ (దక్షిణ కెరోలినా) యుద్ధంలో అమెరికన్ సైన్యాధిపతి గేట్స్‌ను ఓడించాడు. మే, 1780లో ఆంగ్లేయులు ఛార్లెస్టన్‌ను పట్టుకున్నారు.

బ్రిటిష్‌వారు కెరోలినా రాష్ట్రాలలోని రేవు పట్టణాలను చేత చిక్కించుకొన్నప్పటికీ కొందరు అమెరికన్ గెరిల్లా నాయకుల చర్యల వల్ల వాటిపై తమ అధికారం సుస్థిరం చేసుకోలేకపోయారు. ఉత్తర కెరోలినాలో కింగ్స్ మౌంటెన్ వద్ద సరిహద్దు వలస ప్రజలలోని నాటుగుంపు ఒకటి 1780లో సుశిక్షితులైన కారన్ వాలీస్ అనుచరుల మీద అకస్మాత్తుగా విరుచుకొనిపడి వారిని ఓడించింది. అదే విధంగా 1781లో, దక్షిణ కెరోలినాలోని కౌపెన్స్ వద్ద బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత వాషింగ్టన్ తన సేనానులలో సమర్థుడయిన నధేని యల్‌గ్రీన్‌ను కెరోలినాలకు పంపించాడు. గ్రీన్‌కు, కారన్ వాలీస్‌కు, గిలిఫోర్ట్ కోర్ట్ హవుస్ వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బ్రిటిష్‌వారు గెలిచినప్పటికీ తీవ్రమైన నష్టాలకు గురైయ్యారు. అందువల్ల కారన్‌వాలీస్ విల్మింగ్‌టన్‌కు వెళ్ళిపోయాడు. గ్రీన్, బ్రిటిష్ వారికి నష్టం కలిగించి కెరోలినా, జార్జియాలలోని భూభాగంలో హెచ్చు శాతాన్ని తిరిగి పొందాడు. బ్రిటిష్‌వారు 1781లో దక్షిణ ప్రాంతం నుంచి ఉత్తర దిశకు తరలి వెళ్ళడం తప్పని సరైంది. స్వాతంత్ర్య సమరంలో కట్ట కడపటి ఘట్టము జేమ్స్‌టౌన్‌కు అనతి దూరంలో ఉన్న యార్క్ టౌన్ (Yorktown) దగ్గర జరిగింది. అక్టోబరు, 1781వ, సంవత్సరంలో వాషింగ్టన్, సర్వసైన్యాధిపత్యంలో ఉన్న అమెరికన్ సైన్యాలు, రోచంబూ (Rochambeau) ఆధ్వర్యంలో ఉన్న ఫ్రెంచి సైన్యాలు యార్క్ టౌన్ వద్ద, కారన్ వాలిస్ ఆధ్వర్యంలో ఉన్న బ్రిటిష్ సైన్యాలను చిత్తుగా ఓడించాయి. కాని యుద్ధము 1783 వరకు నామ మాత్రంగా కొనసాగింది. అప్పటికే ఈ యుద్ధాలతో విసుగెత్తి బ్రిటిష్ ప్రజలు శాంతి కోసం తహతహలాడడం మొదలుపెట్టారు. ఇంగ్లండ్‌లో మంత్రి వర్గం మారిపోయింది.

## 2.12 పారిస్ శాంతి సమావేశము :

అమెరికన్ ప్రతినిధులు, బ్రిటిష్ ప్రతినిధులు, సెప్టెంబరు, 1783లో శాంతి సమాలోచనలు జరిపి శాంతి పత్రం మీద సంతకాలు చేశారు. అమెరికా తరపున ఫ్రాంక్లిన్, జాన్‌జే, జాన్ ఆడమ్స్ మొదలయిన మేధావులు ఈ సమాలోచనలలో పాల్గొన్నారు. ఈ శాంతి పత్రం ప్రకారం; బ్రిటన్, అమెరికా సంయుక్త రాష్ట్రాల సాతంత్ర్యాన్ని గుర్తించింది. మిసిసిపినది అమెరికా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ సరిహద్దుగా ప్రకటించడమైంది. కెనడా బ్రిటిష్ వారి స్వాధీనంలోనే ఉండి పోయింది. ఫ్లోరిడాను బ్రిటన్ స్పెయిన్ దేశానికిచ్చి వేసింది. మిసిసిపినదిని అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్ కూడా నౌకాయానానికి ఉమ్మడిగా ఉపయోగించ వచ్చును. అమెరికా సంయుక్త రాష్ట్రాలు స్వాతంత్ర్య సమరంలో బ్రిటన్ తరపున పోరాడిన వేలాది అమెరికన్ లాయలిస్ట్‌లను బాధించరాదు. వారి ఆస్తి పాస్తులను తిరిగి వారికే అప్పగించవలెను. విశేష ధన, ప్రాణ నష్టాలకు గురైన ఫ్రాన్స్ టోబాగో (tobago), సెనగల్ అనే రెండు వలసలను పొందింది. కాని ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థ తారుమారైంది. అమెరికా విప్లవ సిద్ధాంతాలవల్ల ఉత్తేజితులైన ఫ్రెంచి పౌరులు స్వదేశంలో విప్లవ పథానికి చేరువ అవుతూ వచ్చారు. స్పెయిన్ మైనార్కా (Minorca) ఫ్లోరిడాలను పొందింది. ఈ సమరంలో బ్రిటిష్ వారి పక్షంలో ఉన్న రెడ్ ఇండియన్‌లు, నీగ్రోలు సంగతి ఎవ్వరూ పట్టించుకోలేదు. అనతి కాలంలోనే అమెరికన్‌లు తమ దేశాన్ని గణతంత్ర రాజ్యంగా రూపొందించుకున్నారు.

## సమీక్ష :

"దివీ భువీ కలిసి మానవుని మనుగడకు ఇంత దివ్య స్థలం మరెక్కడా నిర్మించలేదు" - జాన్ స్మిత్ వర్జీనియా వలస రాష్ట్ర స్థాపకుడు - 1607.

### అభ్యాసాలు :

1. అమెరికా స్వాతంత్ర్య సమరానికి దారి తీసిన కారణాలు వ్రాయుము.

2. అమెరికా స్వాతంత్ర్య పోరాట ముఖ్య ఘట్టాలను వివరింపుము.

## ఉపకయుక్త గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1) | Henry Bamford Parkes | : | The United States of America |
| 2) | Thomas A Baily | : | The American Pageant |
| 3) | C.P. Hill | : | History of the United States |
| 4) | Patt & Drummond | : | Our National From its creation |
| 5) | David Donald | : | A History of American Lifes Thought |
| 6) | Richard B Morris | : | Encyclopaedia of American History |
| 7) | Edward J. Conlon (For the united states Information Service-Madras | : | America Charitra Sangraham |



డా॥ కంరున్నిసా బేగం, ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.
చరిత్ర, పురాతత్త్వ శాఖ
నాగార్జున విశ్వ విద్యాలయం

# పాఠం - 3

# జార్జివాషింగ్టన్ - 1789-97

## 3.0 లక్ష్యం :

అమెరికా తొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్, తొలిదశ జీవితం, సర్వ సైన్యాధ్యక్షుడుగా నియమించబడటం, స్వాతంత్ర సమరంలో ఒక నాయకుడుగా అతను చేసిన సేవలు, ఈ సేవల గుర్తింపుగా తొలి అధ్యక్ష పదవికి అర్హుడు కావటం. రెండు పర్యాయాలు అధ్యక్ష పదవి నిర్వహించి రాబోయే తరాల అధ్యక్షులకు మార్గదర్శకుడైనది వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయ క్రమం :


3.1 తొలిదశ జీవితం

3.2 సర్వసైన్యాధ్యక్షుడుగా నియామకం

3.3 వాషింగ్టన్ అధ్యక్షుడుగా ఎన్నిక

3.4 దేశాంగ విధానము - ఉన్నత పదవుల నిర్ణయాలు

3.5 1789 వ సంవత్సరపు జుడిషియరీ చట్టము

3.6 ఆర్థిక విధానాలు - అలెగ్జాండర్ హామిల్టన్

3.7 వాషింగ్టన్ విదేశాంగ విధానము

3.8 వాషింగ్టన్ పదవీ విరమణ


## 3.1 తొలిదశ జీవితం :

వాషింగ్టన్ కుటుంబమును 1260 నుంచి ఇంగ్లండ్‌లో గుర్తించడం జరిగింది. వారి వంశం పేరు అప్పటిలో డివస్సింగ్‌టన్ (De Wesseington), తర్వాత కొంత భాష మార్పుతో వాషింగ్టన్‌గా మారింది. ఈ వంశానికి, సులగ్రేవ్ మానర్ (Sulgrave Manor) ఇంగ్లాండ్, స్పష్టంగా తెలిసింది. వాసింగ్టన్ తాత, ముత్తాతలు (ancestors) ఎనిమిదవ హెన్రీ ఆదరణ పొందారు. హెన్రీ, వీరికి ఉన్నత పదవులు, ఉన్నత ఉద్యోగాలు ఇచ్చి ఆదరించాడు. జాన్ వాషింగ్టన్, జార్జివాషింగ్టన్ యొక్కతాత (great grand father) 1632-1677లో అమెరికాలో జీవించటం కొరకు వచ్చాడు. వచ్చిన ఇరవై సంవత్సరాలకే 5000 ఎకరాల యజమాని అయ్యాడు, మౌంట్ విరోలినాలో.

జార్జి వాషింగ్టన్, వర్జీనియా రాష్ట్రంలో బ్రిడ్జెస్ క్రీక్ (Bridges Creek) అనే చోట, ఫిబ్రవరి 22, 1732వ సంవత్సరములో జన్మించాడు. తన పదకొండో ఏటనే తండ్రియైన అగస్టిన్ వాషింగ్టన్ (Augustine Washington) ను కోల్పోయాడు. తన ఏడవ సంవత్సరం నుండి పదిహేనవ సంవత్సరం వరకు కొద్దిపాటి విద్యనభ్యసించాడు. ఆ తర్వాత, తన చదువు సెక్షన్‌లోను, విలియమ్స్‌లోను చదివాడు. ఇతని అభిరుచి గణితం (Mathematics) మరియు భూగోళ శాస్త్రం. మౌంట్ వెర్నెన్‌లో సర్వేయర్‌గా కొంత కాలం పని చేసాడు. వాషింగ్టన్ సప్త వర్షయుద్ధంలో ఆంగ్లేయుల తరుపున ఫ్రెంచి సైన్యంతో వీరోచితంగా పోరాడాడు. అప్పటినుంచి ఇతడు ప్రసిద్ధి చెందాడు.

## 3.2. సర్వసైన్యాధ్యక్షుడుగా నియామకం :

స్వాతంత్ర్యోద్యమకాలంలో జార్జి వాషింగ్టన్ ఒక గొప్ప నాయకుడుగా ఎదిగాడు. జూన్ 14వ తారీఖున, 1775 వ సంవత్సరం వాషింగ్టన్, సర్వసైన్యాధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. వాషింగ్టన్ ఒక గొప్ప ఐశ్వర్యవంతమైన కుటుంబం నుంచి నాయకుడుగా ఎదిగినాడు కాబట్టి అతనిలో ఫెడరలిస్ట్ భావాలు ఎక్కువ.

## 3.3 వాషింగ్టన్ అధ్యక్షుడుగా ఎన్నిక :

స్వాతంత్ర్య యుద్ధ కాలంలో సేనాధిపతిగా పనిచేసి వలసలకు అఖండ విజయాలు చేకూర్చిన తర్వాత, వాషింగ్టన్ మానసికంగాను, శారీరకంగాను ఎంతో అలిసి ఉన్నాడు. అందువల్ల వర్జీనియాలో మౌంట్ వెర్నన్‌లోని తన ఎస్టేట్‌కు పోయి శాంతియుతమైన జీవితాన్ని గడపవలెనని అభిలషించాడు. అధ్యక్షపదవిపై వాంఛ చూపలేదు. కాని పదవిచేపట్టిన తరువాత నిర్విరామ కృషి చేసి తన బాధ్యతలను అతి సమర్థంగా నిర్వర్తించాడు. జార్జి వాషింగ్టన్ ఏప్రియల్ 30వ తేదిన, 1789వ సంవత్సరం, న్యూయార్క్ నగరంలోని వాల్ స్ట్రీట్‌లోని ఫెడరల్ హాలులో అమెరికా సంయుక్త రాష్ట్రాల తొలి అధ్యక్షుడుగా పదవీ స్వీకారంచాడు. జాన్ ఆడమ్స్ ఉపాధ్యక్షుడుగా పదవీ ప్రమాణం చేసాడు. న్యూయార్క్ పట్టణాన్ని రాజధానిగా చేసుకొని ఫెడరల్ ప్రభుత్వం పనిచేయడం ఆరంభించింది. ఈ నూతన దేశం వలసల పరిపాలనమంచి, కాన్ఫెడరేట్ ప్రభుత్వ పాలనలో, ఆ తర్వాత రాజ్యాంగాన్ని సమకూర్చుకొని, దాని ప్రకారము ఫెడరల్ ప్రభుత్వ పాలనలోకి వచ్చినది.

## 3.4 దేశాంగ విధానము - ఉన్నత పదవుల నిర్ణయాలు :

జార్జి వాషింగ్టన్ ఉన్నత పదవులకు సమర్థులను పార్టీలకు అతీతంగా నియమించాడు. విదేశాంగశాఖ కార్యదర్శి (Secretary of State) పదవికి థామస్ జెఫర్సన్‌ను, కోశాగార కార్యదర్శి (Secretary of Treasury) పదవికి అలెగ్జాండర్ హామిల్టన్‌ను నియమించారు. వీరిద్దరు భిన్న పార్టీలయిన రిపబ్లికన్, ఫెడరలిస్ట్ పార్టీలకు చెందినవారు. రక్షణశాఖ కార్యదర్శి (Secretary of war) పదవికి జనరల్ నాక్స్‌ను, అటార్నీ జనరల్ పదవికి, ఎడ్మండ్ రాండోల్ఫ్ (Edmund Randolph)ను నియమించాడు. అప్పటి అమెరికన్ రాజ్యాంగంలో కార్యనిర్వాహక శాఖకి సంబంధించి ఒక్క అధ్యక్షుని గురించే ప్రస్తావించారు. కాబినెట్‌ను (Cabinet)ను గురించి స్పష్టంగా ఏమీలేదు. కాని వాషింగ్టన్ మొదటి నుంచి ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి నిర్ణయాలు తీసుకొనేవాడు. ఈ విధంగా వాషింగ్టన్ అమెరికన్ పాలనా యంత్రాంగంలో కాబినెట్‌ను ఒక అంతర్భాగంగాచేసాడు. ఈ కాబినెట్ సభ్యులుకు, (Secretaries) కాంగ్రెస్‌లో సభ్యత్వంగాని, అందులో ప్రసంగించే అధికారంగాని లేదు. వారు అధ్యక్షునిచే నియమితులై అతనికే సలహాదారులుగా ఉండేవారు. వారు కాంగ్రెస్‌కుకాక అధ్యక్షునికే బాధ్యులుగా ఉండడం ఆనవాయితీ అయింది. వారి పదవీకాలం కూడ అధ్యక్షుని ఆమోదం మేరకే కొనసాగేది.

## 3.5 1789వ సంవత్సరపు జుడిషియరీ చట్టము :

రాజ్యాంగం సుప్రీం కోర్ట్ ఏర్పడాలని అందే తప్ప దాని నిర్మాణం ఎలా ఉండాలి అనేది స్పష్టం చేయలేదు. కాబినెట్‌ను ఏర్పరచిన తరువాత వాషింగ్టన్ 1789లో న్యాయశాఖ చట్టం (Judiciary Act of 1789) జారీ చేసాడు. దీని ప్రకారం దేశంలో ఒక సుప్రీం కోర్టు, పదమూడు జిల్లా కోర్టులు, మూడు సర్క్యూట్ కోర్టులు స్థాపించడమయింది. సుప్రీంకోర్టులో ఆరుగురు న్యాయాధిపతులు ఉంటారు. జాన్ జే (John Jay)ను వాషింగ్టన్ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. వీరు రాజ్యాంగాన్ని అత్యున్నత శాసనం (Supreme Law)గా గుర్తించి న్యాయ నిర్ణయాలు చేయవలెనని ఈ చట్టంలో పేర్కొనడమైంది.

## 3.6 ఆర్థిక విధానము - అలెగ్జాండర్ హామిల్టన్ :

కోశాగార కార్యదర్శిగా పని చేసిన హామిల్టన్ ఆర్థిక సమస్యలను అతి సమర్థంగా పరిష్కరించాడు. హామిల్టన్ జనవరి 11, 1755 సంవత్సరమున, బ్రిటిష్ పశ్చిమ ఇండీస్ దీవులలో ఒకటైన నెవిస్ (Nevis) లో జన్మించాడు. ఇతడు సెంట్ క్రాయిక్స్ (St. Croix) అనే

చోట కొన్నాళ్ళు గుమస్తాగా పనిచేసాడు. 'న్యూయార్క్ పట్టణం చేరి, 1773లో, కింగ్స్ కళాశాలలో కొంత కాలం విద్యాభ్యాసం చేసాడ అమెరికన్ విప్లవ కాలంలో కొన్ని సంవత్సరాలపాటు అతడు వాషింగ్టన్ దగ్గర వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసాడు. యార్క్‌టౌన్ వద్ద జరిగి యుద్ధంలో సైన్యాధ్యక్షుడుగా తన ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. 1782-83 సంవత్సరాల మధ్య కాలంలో ఒక ఏడాది పాటు కాంగ్రె సభ్యుడుగా ఉండి ఆ తరువాత న్యూయార్క్ పట్టణంలో న్యాయవాద వృత్తి చేపట్టాడు. అన్నా పొలిస్‌లో 1786లో జరిగిన పరిషత్తు న్యూయార్క్ రాష్ట్ర ప్రతినిధిగా హాజరైయ్యాడు. ఆ పరిషత్తులో ప్రభుత్వ స్వరూపాన్ని గురించి చర్చించడానికి 1787లో ఫిలడెల్ఫియాలో ఇం సమావేశం ఏర్పాటు చేయడం మంచిదని ఒక రిపోర్ట్‌ను తయారుచేసాడు. ఫిలడెల్ఫియా సమావేశంలో పటిష్టమైన కేంద్ర ప్రభుత్వా ఏర్పరచవలెనని సూచించాడు. హామిల్టన్ కోశాగార కార్యదర్శి పదవి నలంకరించే నాటికి వయస్సులో చిన్నవాడైనప్పటికీ విప్లవ యోధుడుగా న్యాయవాదిగా, ఫెడరలిస్ట్ పార్టీ ప్రతినిధిగా సిద్ధాంత నిర్మాతగా పేరుపొందాడు. ఫెడరల్ ప్రభుత్వానికి ధనిక వర్గాన్ని సన్నిహితం చేయడం అతని మూల సిద్ధాంతం.

**36.1 ఋణాలు** (Public Credit) : స్వాతంత్ర్య యుద్ధ కాలంలో సంయుక్త రాష్ట్రాలు కొన్ని అప్పులు చేసాయి. ఇవి మూడు రకాలు :

1) విదేశాలయిన ఫ్రాన్స్, స్పెయిన్, హాలండ్‌ల నుంచి తెచ్చిన 12 మిలియన్ డాలర్ల అప్పు;

2) అమెరికన్ పౌరుల దగ్గర తీసుకొన్న 42 మిలియన్ డాలర్లు.

3) రాష్ట్రాలు తమ రాష్ట్ర పౌరుల దగ్గర చేసిన 20 మిలియన్ డాలర్లు;

ఈ అప్పులన్నిటిని ఫెడరల్ ప్రభుత్వం తీర్చి వేయాలని హామిల్టన్ కృషి చేసాడు. ఫెడరల్ ప్రభుత్వం పన్నులు విధించి ఈ అప్పుల మీద పెరిగిన వడ్డీని మొదట తీర్చివేయాలని, తరవాత క్రమంగా అసలును తీర్చి వేయాలని తన అభిప్రాయం వెలిబుచ్చాడు. ఆ విధంగా చేసినట్లయితే ఋణాలిచ్చిన ధనవంతుల అండ దండలు ఫెడరల్ ప్రభుత్వానికి లభిస్తాయని హామిల్టన్ నమ్మకం, అంతేగాక ప్రభుత్వం వద్దనుంచి పొందిన ధనంతో వారు కొత్త వ్యాపారాలను ప్రారంభించడానికి అవకాశముంటుంది. ఈ పథకాన్ని జఫర్సన్, అతని అనుయాయులు వ్యతిరేకిస్తూ ఈ విధంగా అన్నారు.

ప్రభుత్వం ఆసాముల దగ్గర ఋణాలు తీసుకొన్నప్పుడు హామిగా పత్రాలు (Bonds) వ్రాసి ఇచ్చింది. ఆ పత్రాలను ఆర్థిక బాధలకు తట్టుకోలేక వారు ఇతర ధనిక వ్యాపారస్థుల (Speculators)కు తగ్గింపు ధరలకు అమ్మారు. ఆ విధంగా పత్రాలను కొన్న వ్యాపారస్థులకు పత్రాల అసలు విలువ (Face value)ను ప్రభుత్వం చెల్లించటం సబబుకాదు. పైగా ఆ డబ్బును దేశంలోని పౌరులందరి నుంచి పన్నుల రూపంలో రాబట్టడం మరింత శోచనీయమైన విషయమని వీరి వాదము. కాని హామిల్టన్ తన పట్టుదల వీడలేదు. కొంత మంది ధనికుల దగ్గర ఉన్న డబ్బు పెట్టుబడి రూపంలో ఉపయోగించడం జరుగుతుందని, అయితే సామాన్య ప్రజల చేతిలో ఉన్న డబ్బు దైనందిన జీవితావసరాలకు ఖర్చవుతుందని అతడు వాదించాడు.

జాతీయ ప్రభుత్వం (ఇది వరకటి కాన్‌ఫెడరేట్ ప్రభుత్వం)చేసిన అప్పులను తీర్చడానికి ప్రతిపాదించిన బిల్లును కాంగ్రెస్ ఆమోదించింది. కాని రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అప్పులను గూడా ఫెడరల్ ప్రభుత్వం తీర్చవలెనన్న హామిల్టన్ ప్రతిపాదనను దక్షిణ రాష్ట్రాలవారు పూర్తిగా ప్రతిఘటించారు. వర్జీనియా, ఇంకా కొన్ని రాష్ట్రాలు తమ ప్రజల దగ్గర పన్నులు వసూలు చేసి ఋణాలు తీర్చివేసాయి. అటువంటి రాష్ట్రాలలో మళ్ళీ పన్నులు విధించి ఇతర రాష్ట్రాలుచేసిన అప్పులను ఫెడరల్ ప్రభుత్వం తీర్చడం అనేది వారికి బాధ కలిగించింది. ఆ విధంగానే కొద్ది మొత్తాలు అప్పులున్న రాష్ట్రాల వారు పెద్ద మొత్తాలు అప్పులున్న రాష్ట్రాల ఋణ బాధను తొలగించడానికి ఫెడరల్ ప్రభుత్వం తమ దగ్గర పన్నులు వసూలు చేయడాన్ని ఏవగించుకొన్నారు. హామిల్టన్ పథకము ఉత్తర ప్రాంతంలోని వర్తక ప్రముఖులకు లాభం చేకూర్చేదిగా ఉందని వ్యతిరేకులు వాదించారు.

ధనవంతుల అవసరం ప్రభుత్వానికి ఉందని, అందుచేత ప్రభుత్వం వారికి చేరువ కావాలని హామిల్టన్ సూచించాడు. ఇంకా ఫెడరల్ ప్రభుత్వం రాష్ట్రాల అప్పులు తీర్చినట్లయితే దాని ప్రాముఖ్యం పెరుగుతుందని అన్నాడు. జాతి సమైక్యాన్ని గురించి హెచ్చరిస్తూ

అమెరికన్ విప్లవము ఒక ఉన్నతాశయ సిద్ధికే జరిగిందని, జాతీయ ప్రభుత్వం రాష్ట్రాల అప్పులు తీర్చే పనిని అందరి బాధ్యతగా గుర్తించవలెనని కూడా అన్నాడు. అయినా లాభంలేక పోయింది. చివరకు హామిల్టన్, జెఫర్సన్‌లు ఒక రాజీకుదుర్చుకొన్నారు. దీని ప్రకారం జెఫర్సన్ అనుయాయులు (దక్షిణ రాష్ట్రాల ప్రతినిధులు) రాష్ట్రాల అప్పులను ఫెడరల్ ప్రభుత్వం తీర్చే కార్యక్రమానికి సంబంధించిన బిల్లులు ఆమోదించారు. దీనికి బదులుగా హామిల్టన్ కేంద్ర రాజ ధానిని పొటామాక్ (Potomac) నదీ తీర ప్రాంతానికి తరలించడానికి ఉద్దేశించిన బిల్లుకు అనుకూలంగా ఉత్తర రాష్ట్రాల వారు ఓట్లు వేసేటట్లు చేస్తానని వాగ్దానం చేసాడు. ఈ వాగ్దానం ప్రకారం 1790లో రాజధానిని ఫిలడెల్ఫియాకు, 1801లో వాషింగ్టన్‌కు తరలించడమైంది.

**3.6.2 జాతీయ బ్యాంకును స్థాపించడం :** 1791 ప్రభుత్వాధ్వర్యంలో జాతీయ బ్యాంకును స్థాపించడం హామిల్టన్ ఆర్థిక పథకంలోని మరొక అంశము. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వలెనే అమెరికన్ జాతీయ బ్యాంకులో ప్రభుత్వ నిధులు మదుపు (Deposit) చేస్తారు. అవసరమైనప్పుడు ప్రభుత్వానికిగాని, పౌరులకు గాని ఈ బ్యాంకు ఋణాలిస్తుంది. ఈ బ్యాంకు కరెన్సీ నోట్లను జారీ చేయవచ్చు. కొత్త వ్యాపారం ప్రారంభించే వారికి ఋణాలను మంజూరు చేయవచ్చును. బ్యాంకు మూల ధనం (Capital)లో అయిదింట ఒక వంతు ప్రభుత్వము, అయిదింటా నాలుగు వంతులు ధనికులు మదుపు పెట్టవచ్చును. ఇవి హామిల్టన్ బ్యాంకు పథకంలోని ముఖ్యాంశాలు.

ఈ బ్యాంకు పథకంపై హా మిల్టన్, జెఫర్సన్‌ల మధ్య తీవ్రమైన వాగ్వి వాదాలు జరిగాయి. ఈ బ్యాంకు పథకంపై హామిల్టన్, జెఫర్సన్‌ల మధ్య తీవ్రమైన వాగ్వివాదాలు జరిగాయి.

1) ధనవంతుల వాటా హెచ్చుగా ఉన్నందువల్ల ఈ బ్యాంక్ వారికే మేలు చేస్తుంది.

2) వ్యవసాయ ప్రధానమైన దక్షిణ ప్రాంతంకన్న వ్యాపారం మీద ఆధారపడి ఉన్న ఉత్తర ప్రాంతానికే మంచి జరుగుతుంది.

3) జాతీయ ప్రభుత్వం క్రమేణా చాలా బలపడి రాష్ట్రాలను తనచేతిలోని కీలు బొమ్మలుగా చేసుకోగలదు. బ్యాంకు పథకము ఏదో కొద్ది మంది ధనికులకు జాతీయ ఆర్థిక విధానాలపై అధికారాన్ని కట్టబెట్టేదిగా ఉండదని, వారికి ఎక్కువ లాభాలు సమకూరుస్తుందని, జెఫర్సన్, అతని సహచరులు వాదించారు. అమెరికన్ రాజ్యాంగంలో బ్యాంకును స్థాపించే విషయం పేర్కొనడం జరగలేదని దానివల్ల ప్రభుత్వానికి ఆ అధికారం లేదని కూడా వీరు వాదించారు. రాజ్యాంగంలో ఏదయితే స్పష్టం చేయబడిఉందో దానిని తు.చ. తప్పకుండా ఆచరించవలెనని, రాజ్యాంగంలో లేని విషయాలలో ప్రభుత్వం తల దూర్చ రాదని కూడా వీరన్నారు, జెఫర్సన్ పార్టీ వారు చేసిన 1, 2, 3, ఆరోపణలను హామిల్టన్ ఖండించలేదు. కాని బ్యాంకు స్థాపన రాజ్యాంగానికి విరుద్ధము (Unconstitutional) అనే ఆరోపణను హామిల్టన్ వ్యతిరేకించినాడు. "సూచితాధికారాలు" (Implied Powers) అనే సిద్ధాంతం ప్రకారం బ్యాంకును స్థాపించే అధికారం ప్రభుత్వానికుందని అతడు వాదించాడు. వాషింగ్టన్‌కు జెఫర్సన్ అభిప్రాయాలకన్న హామిల్టన్ ప్రతిపాదనలే నచ్చాయి. ఆర్థిక విషయాలలో కోశాగార కార్యదర్శి అభిప్రాయాలు, తన అభిప్రాయాలు ఒకటే కనుక, బలపరచడం తన విధి అని వాషింగ్టన్ భావించాడు. బ్యాంకు బిల్లుమీద సంతకం చేసాడు. అమెరికన్ జాతీయ బ్యాంక్ 1791లో స్థాపించబడింది. అది 20 సంవత్సరాల పాటు పనిచేస్తుందని బ్యాంక్ చార్టర్ (Charter)లో పేర్కొనబడింది. ఈ విధంగా హామిల్టన్ ఒక అనుపూర్వికాని (Precedent) కి కారకుడైనాడు. అమెరికా సంపన్నమయ్యే ప్రయత్నానికి దోహదం చేశాడు ఈ విధంగా.

**3.6.3 ఎక్సయిజ్ సుంకము - "విస్కీ తిరుగుబాటు" :** హామిల్టన్ 1791లో విస్కీ మీద పన్ను విధించే బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టి ఆమోదింప చేసాడు. దీనికే ఎక్సయిజ్ సుంకమని పేరు. ఈ పన్ను మూలంగా ప్రభుత్వానికి అదనపు ఆదాయం రావడమే గాక పశ్చిమ ప్రాంతంలో (The back Country) ప్రభుత్వాధికారం దృఢ తరం కాగలదని హామిల్టన్ ఆకాంక్షించాడు. పశ్చిమ ప్రాంతాలవారి జీవనోపాధికి విస్కీ (సారా) వ్యాపారం చాలా ముఖ్యమైంది. ఈ పన్నుకు నిరసనగా పశ్చిమ పెన్సిల్వేనియాలో 1794లో "విస్కీ తిరుగుబాటు" (Whiskey Rebellion) జరిగింది. హామిల్టన్ ప్రోద్బలంతో వాషింగ్టన్ నాలుగు రాష్ట్రాలనుంచి దాదాపు 15,000 మంది సైనికులను (State Militia) తిరుగుబాటు అణిచివేయడానికి పంపాడు. ఇంత పెద్ద సైన్యాన్ని ఉపయోగించడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించినట్లు (Using a neataxe to kill a spider)గా ఉందని జెఫర్సన్ విమర్శించాడు. కాని తిరుగుబాటు నూతన ప్రభుత్వం ఎదుర్కోవలసిన సవాలని

హామిల్టన్ భావించాడు. కాన్ఫెడరేట్ సూత్రాల ఆధారంతో ఏర్పడిన ప్రభుత్వంవలెగాక కొత్త రాజ్యాంగంతో ప్రభుత్వానికి ప్రజల దగ్గర పన్నులు రాబట్టే శక్తి ఉందని హామిల్టన్ నిరూపించదలచాడు. ఫెడరల్ ప్రభుత్వం జారీ చేసిన చట్టాలను అమలు జరపడానికి రాష్ట్రాలు తమ సైన్యాన్ని పంపి అండగా నిలుస్తాయో లేదో కూడా హామిల్టన్ పరీక్షించదలచాడు. సుప్రతిష్ఠితమైన జాతీయ ప్రభుత్వాన్ని, రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారిలో సరిహద్దు వ్యవసాయ దారులు (Frontier Farmers) ఉన్నారు. ముఖ్యంగా వారికి, ఇతర ప్రజలకు కూడా జాతీయ ప్రభుత్వము ధృఢంగాను, శాశ్వతంగాను ఉంటుందని హామిల్టన్ రుజువు చేయదలిచాడు. నూతన ప్రభుత్వానికి ధనికుల, సంప్రదాయవాదుల (Conservatives) అండదండలు లభిస్తాయో లేదో తెలుసుకోవలెనని కూడా హామిల్టన్ ప్రయత్నము, దానికోసం నూతన ప్రభుత్వం శాంతి భద్రతలకు భంగం కలిగించే ఏసవాలునైనా ఎదుర్కొంటుందని వారికి స్పష్టం చేయదలచాడు. ఏది ఏమైనప్పటికీ ఈ సేనలు తిరుగుబాటుని అణచివేసాయి. కొంతమంది విప్లవ కారులను ఫెడరల్ ప్రభుత్వము నిర్బంధం (Arrests)లో ఉంచి ఫిలడెల్ఫియాకు తరలించింది. కొంతకాలం తరువాత వారు విడుదలయ్యారు. ఇద్దరు వ్యక్తులపై దేశద్రోహం నేరం కింద శిక్ష విధించడం జరిగినప్పటికీ వారిని కూడా ప్రభుత్వం క్షమించింది.

**3.6.4 ఉత్పత్తి దారులకు మద్దతు :** పారిశ్రామికోత్పత్తి దారులకు హామిల్టన్ ప్రభుత్వ సహాయాన్ని అందించాడు. దేశంలోని ఉత్పత్తుల ధరలు పడిపోకుండ ఉండడానికి రక్షణ పన్ను (Protective Tariff) విధానాన్ని అమలు పరిచాడు. ఈ విధానం ప్రకారం దేశంలో దిగుమతి అయ్యే విదేశ వస్తువుల మీద ఎక్కువ పన్ను విధించడమవుతుంది. రక్షణ పన్ను విధానం దేశం మొత్తానికి, దేశంలోని అనేక వర్గాల వారికి కూడా మేలు చేస్తుందని హామిల్టన్ భావించాడు. అతని ఉద్దేశం ప్రకారం కొత్తగా ప్రారంభమైన పరిశ్రమలకు ప్రభుత్వము రక్షణ ఇవ్వాలి. శైశవ దశలో ఉన్న పరిశ్రమలు (Infant Industries) రక్షణ పన్నులు అమలు జరపడం ద్వారా పటిష్ఠమైన పరిశ్రమలుగా రూపొందగలవని ఇతడు భావించాడు. అనుభవజ్ఞులైన ఇంగ్లండ్‌లోని ఉత్పత్తి దారులు తమ సరకులను అమెరికాలో విరివిగా అమ్ముడు పోయేటట్లు చేసినట్లయితే అమెరికాలోని కొత్త పరిశ్రమలకు విపరీతమైన నష్టాన్ని కలిగించగలరు. రక్షణ పన్ను వల్ల వ్యవసాయానికి, పరిశ్రమలకు మధ్య సమతుల్యము (balance) ఏర్పడి దేశాభివృద్ధి చెందగలదు. తన కవసరమైనంత పారిశ్రామికోత్పత్తులను, వ్యవసాయోత్పత్తులను దేశము స్వయంగా తయారుచేసుకొంటే యుద్ధ సమయంలో విదేశాలపై ఆధారపడవలసిన అవసరమేర్పడదు. అటువంటి స్వయం సమృద్ధి, ఆర్థిక స్వాతంత్ర్యము దక్షిణ ప్రాంతంలోని వ్యవసాయ దారులు, ఉత్తర ప్రాంతంలోని పారిశ్రామికోత్పత్తి దారులకు మధ్య సన్నిహిత సంబంధాలు వృద్ధి పొందేటట్లు చేయగలదు, భాగ్యవంతులనుంచి ప్రభుత్వం పన్నులు రాబట్ట వచ్చును. రక్షణ పన్ను ముఖ్యాశయం ఉత్పత్తి దారులకు మద్దతు ఇవ్వడమే అయినప్పటికీ కూలీలకు కూడా దీనివల్ల మేలు కలుగుతుంది. విదేశీ సరకుల పోటీని అదుపులో పెట్టినందువల్ల దేశంలో కర్మాగారాల సంఖ్య పెరుగుతుంది. దీని ఫలితంగా ఎక్కువమంది కూలీలకు ఉద్యోగవకాశం కల్గుతుంది. దేశంలో సంపద పెరిగిన కొద్దీ వ్యవసాయ దారులు తమ పంటలను మంచి ధరకు అమ్మడానికి వీలవుతుంది. ఈ విధంగా హామిల్టన్ తన ఊహలను తెలిపి 1792లో రక్షణ పన్నును పెంచాడు.

## 3.7 వాషింగ్టన్ విదేశాంగ విధానము :

వాషింగ్టన్ అధ్యక్షతకు ప్రారంభోత్సవం 1789లో జరిగిన కొద్ది మాసాలకే ఫ్రాన్స్‌లో విప్లవం చెల రేగింది. ఫ్రెంచి విప్లవ కారులు బూర్బన్ (Bourbon) రాజవంశాన్ని పదవీ భ్రష్టం చేసి, పదహారో లూయిని, మేరియాంటొనెట్‌ను ఉరితీసారు. ఈ విప్లవంలో రక్తపాతం, హింసాకాండ పెచ్చు పెరిగి పోవడం చూసి తమకు కూడా అట్లాంటి గతే పట్టవచ్చుననే భీతితో ఇతర ఐరోపా చక్రవర్తులు కూడా ఈ యుద్ధంలో జోక్యం కలిగించుకోవడానికి ప్రయత్నించారు. అనతి కాలంలోనే సమరాగ్ని జ్వాలలు ఐరోపా అంతటా పాకాయి. ఫ్రాన్స్ తిరిగి తన పాత శత్రువైన బ్రిటన్‌తో మరొకసారి చావు బతుకుల పోరాటం కొనసాగించింది. దీనితో అమెరికాకు అత్యంత క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. అమెరికాలోని వర్గాలు బ్రిటన్‌కి మద్దతు ఇవ్వాలా లేక ఫ్రాన్స్‌కి మద్దతు ఇవ్వాలా అనే అంశంపై చర్చించసాగాయి. ఒకవైపున అమెరికన్ విప్లవం తుది దశలో ఫ్రాన్స్ వలసల పట్ల సానుభూతిని, మిత్రత్వాన్ని ప్రదర్శించి వలసల స్వాతంత్రానికి దోహదం చేసింది. దానికి ప్రతిఫలంగా అమెరికా తనకు సహాయం చేయగలదని ఫ్రాన్స్ ఆశించింది. అమెరికాలోని రిపబ్లికన్ పార్టీ వారు ఫ్రెంచి విప్లవ కారులపట్ల సానుభూతి ప్రకటిస్తూ తమ దేశం బ్రిటన్‌కు తగిన శాస్తి చేసే తరుణం వచ్చిందని ఆశించారు.

అమెరికన్‌లు బ్రిటన్‌తో తమకున్న సాంఘిక, సాంస్కృతిక సంబంధాలను మరవలేదు. స్వాతంత్ర్య సమరానికి పూర్వం తమకు బ్రిటన్ మాతృ దేశమన్న మాటను అమెరికన్‌లు విస్మరించలేదు. అందువల్ల బ్రిటన్‌కు శత్రువైన ఫ్రాన్స్ అమెరికాకు కూడా శత్రువే అన్న భావాన్ని ఫెడరలిస్ట్‌లు వ్యక్తం చేస్తూ వచ్చారు. స్వాతంత్ర్యాన్ని సాధించినంత మాత్రాన బ్రిటన్‌తో అమెరికన్‌లు తెగ తెంపులు చేసుకొన్నట్లుకాదు, అని కూడా వీరు వాదించారు. ఇదే గాక అమెరికన్‌ల సముద్రాంతర వాణిజ్యంలో అధిక భాగం బ్రిటన్‌తో జరుగుతున్నది. ఇది సక్రమంగా సాగనట్లయితే హామిల్టన్ ఆర్థిక పథకాలు కూలిపోతాయి.

ఫ్రాన్స్‌లో జాకొబిన్ (Jacobins)లు దౌర్జన్య కాండకు తలపడిన తరువాత అమెరికన్ రాజకీయ పార్టీలు రెండూ విప్లవ విషయంలో తమ దృక్పథాలను దృఢతరం చేసుకొన్నాయి. రిపబ్లికన్‌లు ఫ్రెంచి విప్లవాన్ని మానవుని హక్కుల కోసం కావించిన పోరాటంగా వర్ణించి తమ ప్రభుత్వం విప్లవ కారులకు సహాయం చేయవలెనని కోరారు. ఫెడరలిస్ట్‌లు ఫ్రెంచి విప్లవ కారుల దారుణ హింసాకాండను చూసి విభ్రాంతులైనారు. ప్రజా ప్రభుత్వ విధానం మీద వారికున్న ఏవగింపు రెట్టింపైంది. ఫ్రెంచి విప్లవం హింసాత్మకమైందని వారు విమర్శించారు. అమెరికన్ ప్రభుత్వము బ్రిటన్‌కు మద్దతు ఇవ్వవలెనని ఫెడరిస్ట్‌లు వాదించారు.

**3.7.1 వాషింగ్టన్ తటస్థ విధానము :** దేశంలోని రాజకీయ పార్టీల దృక్పధాలు ఏవిధంగా ఉన్నప్పటికీ వాషింగ్టన్ మాత్రం తటస్థ విధానాన్ని అనుసరిస్తేనే దేశానికి క్షేమ కరమని భావించాడు. అమెరికా స్వతంత్ర దేశమని, ఏ దేశానికి తాము తల ఒగ్గి ఉండవలసిన అవసరం లేదని ప్రపంచానికి తెలియజేయవలెనని వాషింగ్టన్ కోరాడు. తన దేశం పటిష్టం కావడానికి చిరకాలం శాంతి భద్రతలు నెలకొని ఉండవలెనని వాషింగ్టన్ అభిప్రాయము. కనీసం ఇరవై సంవత్సరాల పాటు అమెరికా ఏ యుద్ధాలలోనూ తల దూర్చకుండా ఉంటే ఆ తరువాత తన దేశం వైపు కన్నెత్తి చూడడానికైనా విదేశాలు భయపడతాయని అతని నమ్మకము. అందువల్లనే బ్రిటన్‌కు సాయం చేయవలసిందిగా ఫెడరలిస్ట్‌లు, ఫ్రాన్స్‌కు బాసటగా ఉండవలసిందిగా రిపబ్లికన్‌లు ఒత్తిడి చేసినప్పటికీ వాషింగ్టన్ తటస్థ విధానాన్ని అవలంబించాడు. ఫ్రాన్స్‌కు సహాయం చేస్తే బ్రిటన్‌తో విరోధం తప్పదని, దాని పర్యవసానంగా అమెరికాకున్న స్వల్ప సైన్యము, నౌకాబలము, కొద్ది జనాభా ఆర్థిక దుస్థితికి లోనయి బ్రిటన్ చేతిలో ఓటమి పొందక తప్పదని వాషింగ్టన్ నమ్మాడు. అంతే కాకుండా స్పెయిన్, లూసియానా ప్రాంతం నుంచి, బ్రిటన్ కెనడా నుంచి అమెరికాపై దండెత్తడం చాలా సులభమని అతనికి తెలుసు.

వలసలు చేసుకొన్న ఒప్పందం 1778లో పదహారో లూయితో చేసుకొన్నదని, అది ఫ్రెంచి అతివాదుల (Radicals)తో చేసుకొన్నది కాదని అందువల్ల దానికి అమెరికా కట్టుబడి ఉండనవసరం లేదని హామిల్టన్, వాషింగ్టన్‌కు తెలిపాడు. జెఫర్సన్ ఈ వాదనను ఖండించి ఒప్పందాలనేవి రెండు దేశాల మధ్య జరిగేవని, ఒప్పందం చేసుకొన్నప్పుడు గాని ఆ తరువాతగాని ఎవరు అధికారంలో ఉన్నారనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదన్నాడు. వాషింగ్టన్ దృష్టిలో 1778వ సంవత్సర సంధి స్వయం రక్షణ కోసం చేసుకొన్నది. ఫ్రాన్స్ ప్రస్తుతం స్వయం రక్షణ కోసం బ్రిటన్‌తో యుద్ధం చేయడం లేదు. బ్రిటన్‌తో ఫ్రాన్స్ కయ్యానికి కాలుదువ్వి యుద్ధం చేస్తున్నది. అంతేగాక తన విప్లవ భావాలను ప్రచారం చేయడం కోసం ఇతర ఐరోపా దేశాలపై ఫ్రాన్స్ దండ యాత్రలు చేయజూస్తున్నది. వాషింగ్టన్ ఈ ఉద్దేశాలను మనసులో ఉంచుకొని 1793లో తన తటస్థ విధానాన్ని ప్రకటించాడు. తన ప్రకటనలో అమెరికా ఫ్రాన్స్, బ్రిటన్‌లు, రెండింటిలో దేనితోనూ చేతులు కలపదని వాషింగ్టన్ పేర్కొన్నాడు. అమెరికన్ ప్రజలు ఆ రెండు దేశాలలో దేనికీ మద్దతు ఇవ్వరాదని, యుద్ధ సామగ్రిని సరఫరా చేయరాదని ఆంక్ష విధించాడు. వాషింగ్టన్ కాబినెట్ సభ్యులు (జెఫర్సన్‌తో సహా) తటస్థ విధాన నిర్ణయాన్ని హర్షించారు.

**3.7.2. జినె (Genet) చర్యలు :** నూతన ఫ్రెంచి రిపబ్లిక్ వివేచన, దూర దృష్టిలేని "సిటిజన్ జినె"ను తన దౌత్య ప్రతినిధిగా అమెరికాకు పంపింది. అతడు ఛార్లెస్టన్‌లో కాలు పెట్టగానే వీధులలో ప్రజలు తండోపతండాలుగా చేరి ఘన స్వాగతమిచ్చారు. దానితో అతడు ఉన్మత్తుడయ్యాడు. బ్రిటిష్ వారి వర్తక సామగ్రిని కొల్లగొట్టమని ఫ్రెంచి యుద్ధనౌకల (Privateers)ను ప్రోత్సహించాడు. దీని కోసం అమెరికన్ నౌకాశ్రయాలను జినె స్థావరాలుగా ఉపయోగించాడు. స్పానిష్ వలసల మీద దండెత్త దలచి అమెరికన్ సైనికులను పోగు చేసాడు. రిపబ్లికన్‌లతో "గూడుపుఠాణీ" చేసి అమెరికన్ రాజకీయాలలో తలదూర్చాడు. ఈ పరిస్థితులలో వాషింగ్టన్ 1793లో తటస్థ విధానాన్ని ప్రకటించాడు. జినె చర్యలు అమెరికా, బ్రిటన్, స్పెయిన్‌లతో యుద్ధానికి దారి తీసే విధంగా ఉన్నాయని వాషింగ్టన్ భీతి చెందాడు. జినెను విదేశాంగ రాయబారిగా అమెరికాకు ఆహ్వానించడం విప్లవ ఫలితంగా ఏర్పడిన నూతన ఫ్రెంచి రిపబ్లిక్‌ను వాషింగ్టన్ గుర్తించటం వల్లనే. కాని

జెనె చర్యలు పరిగణించుకొన్న వాషింగ్టన్ అతని కార్యకలాపాలు అంతర్జాతీయ సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్నాయని, అతనిని అమెరికా వదలి వెళ్ళమని ఆదేశించాడు. తరువాత జెనె తన పదవికి రాజీనామా ఇచ్చి సామాన్య అమెరికన్ పౌరుడుగా అమెరికాలోనే స్థిరపడ్డాడు.

**3.7.3 బ్రిటన్‌తో సంఘర్షణలు :** వాషింగ్టన్ తటస్థ విధానానికి బ్రిటన్ అవరోధాలు కలిగించింది. బ్రిటన్ నౌకా బలం ఫ్రాన్స్‌ను, ఫ్రెంచి వలసలను (ఫ్రెంచి పశ్చిమ ఇండీస్) దీవులతో సహా దిగ్బంధనం (Blockade) చేసింది. ఫ్రాన్స్ తన పశ్చిమ ఇండీస్ దీవులకు సరుకులను చేరవేయకుండా బ్రిటన్ అడ్డగించింది. ఆ కారణంగా ఫ్రెంచి పశ్చిమ ఇండీస్ దీవులతో అమెరికా వ్యాపారం సాగించుకొనడానికి ఫ్రాన్స్ అనుమతినిచ్చింది. అమెరికా ఫ్రెంచి పశ్చిమ ఇండీస్ దీవులతో వ్యాపారం చేయడానికి వీలు లేకుండా బ్రిటన్ కట్టుదిట్టంగా ఆ దీవులను దిగ్బంధం చేసింది. ఫ్రాన్స్ శాంతి సమయంలో అమెరికాతో వ్యాపార సంబంధాలు పెట్టుకోలేదని, యుద్ధ సమయంలో మాత్రమే ఆ విధంగా చేయడం అక్రమమని బ్రిటన్ అభిప్రాయం వెలిబుచ్చింది. దీనికే "1756 సంవత్సరం నిబంధన" (Rule of 1756) అని పేరు. ఫ్రెంచి పశ్చిమ ఇండీస్ దీవులకు పయనిస్తున్న అమెరికన్ నౌకలను బ్రిటన్ నిర్బంధంగా స్వాధీనం చేసుకో సాగింది. యుద్ధంలో ఉపయోగించే మారణాయుధాలు మాత్రమే నిషిద్ధ వస్తువులు (contraband goods) అని, ఆహార వస్తువులు ఆ కోవలోకి రావని అమెరికన్‌లు ప్రతి ఘటించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

మరొక విధంగా బ్రిటన్ కూడా అమెరికా తటస్థ విధానాన్ని విస్మరించి ప్రవర్తించింది. ఆ రోజులలో బ్రిటిష్ నౌకాదళం నుంచి సైనికులు కొంతమంది చాలీ చాలని జీతాలవల్ల, తిండివల్ల క్రూరమైన శిక్షలను భరించలేక రహస్యంగా పారిపోయే వారు. తిరిగి అమెరికన్ నౌకాదళంలోనో లేదా వర్తక నౌకలలోనో చేరేవారు. అందువల్ల బ్రిటిష్ నౌకాదళాధికారులు అమెరికన్ నౌకలను హఠాత్తుగా నిలిపి పరిశోధించి వాటి పనివారి (Crew)లో ఆంగ్లేయులెవరైనా ఉంటే వారిని బంధించి తీసుకొని వెళ్ళి తిరిగి సైన్యంలో చేర్చుకొనేవారు. కొన్ని సందర్భాలలో అమెరికన్ పౌరులను గూడా ఆంగ్లేయులనే మిషతో బంధించి తీసుకపోసాగారు. బ్రిటన్‌లో పుట్టి విదేశాలకు వెళ్ళి అక్కడనే సంవత్సరాలుగా జీవించిన వ్యక్తులను కూడా ఆంగ్లేయులనే జమకట్టి వేధించసాగారు. ఈ విధంగా వారు సహజీ కరణ చట్టాన్ని (Naturalization Law) విస్మరించి ప్రవర్తించ సాగారు.

ఇంతేకాక బ్రిటన్ పారిస్ సంధి 1783 షరతుల ననుసరించి సంయుక్త రాష్ట్రాలలోని మహా సరస్సులకు దక్షిణంగా ఉన్న ప్రాంతాన్ని ఖాళీ చేయవలసి ఉంది. ఆ విధంగా చేయక పోవడమేగాక ఆ ప్రాంతంలో బ్రిటన్ సైనిక స్థావరాలేర్పరచుకొని వాయవ్య ప్రాంతంలోని రెడ్ ఇండియన్‌లకు బాసటగా నిలిచింది.

**3.7.4 జాన్ జే సంధి 1794 :** బ్రిటన్, అమెరికాలు 1794లో అప్రకటిత యుద్ధ వాతావరణంలో ఉన్నాయి. కొంతమంది అమెరికన్‌లు బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించమని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసారు. కాని ఫెడరలిస్ట్‌లకు తమ దేశం బ్రిటన్‌తో తగాదాపెట్టుకోవడం ఇష్టం లేదు. న్యూ ఇంగ్లండ్ వర్తకులు బ్రిటిష్ బ్యాంకర్ల ఆర్థిక సహాయంతో బ్రిటన్‌తో లాభసాటి వర్తకం సాగిస్తున్నారు. దిగుమతి చేసుకొనే సరకులలో 90 శాతం బ్రిటన్ నుంచే దిగుమతి అవుతున్నాయి. దిగుమతులమీద విధించే పన్నుల డబ్బుతో ప్రభుత్వం విదేశాలకు బాకీ పడి ఉన్న మొత్తాలను, స్వదేశంలో ఉన్న అప్పులను, రాష్ట్రాల అప్పులను తీర్చగలుగుతూ వుంది. ఈ కారణాలను దృష్టిలో ఉంచుకొని వాషింగ్టన్ బ్రిటన్‌తో యుద్ధాన్ని నివారించే ప్రయత్నం చేశాడు. దీనికి ఫెడరలిస్ట్‌ల ప్రోత్సాహంతోడైంది. బ్రిటన్‌తో తమకుగల వివాదాలను శాంతి యుతంగా పరిష్కరించుకొనడానికి వాషింగ్టన్ ప్రధాన న్యాయమూర్తి జాన్ జే (John Jay)ను బ్రిటన్‌కు రాయబారిగా పంపాడు. ఈలోపుగా వాయవ్య ప్రాంతంలో బ్రిటీష్ వారి ఆధిక్యాన్ని అంతం చేసే సంఘటన ఒకటి జరిగింది. ఫాలెన్ టింబర్ యుద్ధం (Battle of Fallen Timber) లో రెడ్ ఇండియన్‌లు అమెరికన్ సైన్యాల చేత చిత్తుగా ఓడిపోవడంతో వాయవ్య ప్రాంతంపై ఆధిక్యాన్ని నిలుపుకొంటామన్న నమ్మకం బ్రిటీష్ వారికి పోయింది.

బ్రిటన్‌తో చేసుకొన్న జాన్ జే సంధి (1794)లో అమెరికాకు కొంత వరకు లాభదాయకంగానే ఉంది, దాని ప్రకారం; వాయవ్య ప్రాంతంలో జంతువుల ఉన్ని (Furs) లభించే ప్రాంతాల నుంచి, కోటలనుంచి త్వరలో ఖాళీచేసి వెళ్ళడానికి బ్రిటన్ అంగీకరించింది. దీనికి బదులుగా విప్లవానికి ముందు అమెరికన్ పౌరులు బ్రిటిష్ వర్తకుల దగ్గర చేసిన ఋణాలను తీర్చడానికి అమెరికన్ ప్రభుత్వము అంగీకరించింది.

రెండు దేశాల మధ్య ఉన్న తగాదాలను పరిష్కరించడానికి రెండు దేశాల ప్రతినిధులు గల కమిషన్‌ల (Commissions)ను ఏర్పాటు చేసే నిర్ణయం తీసుకున్నారు.

పైన పేర్కొన్న ఋణాల విషయంలో ఖచ్చితంగా ఎంత సొమ్ము అమెరికన్ ప్రభుత్వం చెల్లించవలెనో, యుద్ధ సమయంలో బ్రిటన్ స్వాధీన పరచుకొన్న నౌకలకుగాను బ్రిటన్ ఎంత ధనము నష్టపరిహారంగా చెల్లించవలెనో అనే విషయాలను గురించి ఇంకా కెనడా అమెరికాల మధ్య సరిహద్దు గురించి కమీషన్‌లు చర్చించేటట్లు నిర్ణయించారు. కాని తటస్థ రాజ్యాల హక్కుల విషయంలో అమెరికా దృక్పధాన్ని బ్రిటన్ త్రోసిపుచ్చింది. అమెరికా నుంచి ఫ్రాన్స్‌కు, ఫ్రెంచి పశ్చిమ ఇండీస్ దీవులకు ఆహార పదార్థాలు తీసుకొని వెడుతూ ఉన్న అమెరికన్ నౌకలను పట్టుకోనని బ్రిటన్ హామీ ఇవ్వలేదు. ఇదేగాక "దిగ్బంధనము" అనే పదాన్ని బ్రిటన్ విస్పష్టంగా నిర్వచించలేదు. అమెరికన్ నౌకలను శోధించి ఆంగ్లేయులను, కొంతమంది అమెరికన్‌లను బ్రిటన్ నిర్బంధంలోకి తీసుకొన్న విషయం జేసంధిలో ప్రస్తావించలేదు. రిపబ్లికన్‌లు జే సంధిని బ్రిటన్‌కు అమెరికా దాసోహమనటంగా వ్యాఖ్యానించినారు. ఏమయినప్పటికీ యుద్ధంకన్నా ఈ సంధే వాంఛనీయమని వాషింగ్టన్ భావించాడు. సెనేట్ ఈ సంధిని ఆమోదించింది.

**3.7.5. పిన్‌క్నే సంధి** (Pickney's Treaty) : థామస్ పిన్‌క్నే స్పెయిన్‌లో అమెరికా రాయబారి. మిసిసిపీనదిని అమెరికా నౌకావాణిజ్యానికి ఉపయోగించుకోవలెనని వాషింగ్టన్ ఆదినుంచి అనుకొంటూ ఉండేవాడు. 1795వ సంవత్సరంలో జరిగిన ఐరోపా యుద్ధాలలో స్పెయిన్ ఫ్రాన్స్ పక్షంలో చేరింది. ఫ్రాన్స్‌కు శత్రువైన బ్రిటన్ తనపై దండెత్తి వస్తుందన్న భయంతో స్పెయిన్ అమెరికాతో స్నేహం చేయడానికి ఉబలాటపడింది. ఈ అదును పురస్కరించుకొని వాషింగ్టన్ ఆ దేశం ప్రకారం థామస్ పిన్‌క్నే స్పెయిన్‌తో ఒక సంధి కుదుర్చుకొన్నాడు. దీని ప్రకారం అమెరికన్‌లు మిసిసిపి నదిని నౌకాయానానికి యధేచ్ఛగా ఉపయోగించుకోవచ్చును. విదేశాలకు అమెరికన్ సరుకులను ఎగుమతి చేయడానికి మిసిసిపి ముఖ ద్వారం దగ్గరున్న న్యూ ఆర్లియన్స్ (New Orleans) నౌకాశ్రయాన్ని అమెరికన్లు వాడుకోవచ్చును. అమెరికా దక్షిణ సరిహద్దుగా స్పెయిన్ ఆధీనంలోని ఫ్లొరిడా, ఉత్తర సరిహద్దుగా 31వ అక్షాంశము (Parallel) నిర్ణయించబడింది. దీని ప్రకారం జార్జియా గురించి వారి ఆధీనంలో ఉన్న ప్రాంతాలని సంయుక్త రాష్ట్రాలకు మధ్య ఉన్న సరిహద్దు ప్రాంతంలో ఉన్న రెడ్ ఇండియన్‌లను అదుపులో పెట్టడానికి చర్యలు తీసుకొందామని రెండు ప్రభుత్వాలూ నిర్ణయం చేసుకొన్నాయి.

వాషింగ్టన్ పదవీ విరమణ చేయడానికి ముందే పశ్చిమ ప్రాంతంలో భద్రత (Security) కోసం తగిన ఏర్పాటు చేసాడు. తటస్థ రాజ్యాల వాణిజ్య హక్కులను, పశ్చిమ ప్రాంతంలో శాంతి భద్రతలు నెలకొల్పడం, మిసిసిపినదిలో నౌకాయాన హక్కులు సంపాదించడం, వాషింగ్టన్ అధ్యక్ష పదవీ కాలంలో సాధించిన ఘన విజయాలు ఇవి అమెరికా ప్రగతికి ఎంతో ఉపకరించాయి.

## 3.8 వాషింగ్టన్ పదవీవిరమణ :

వాషింగ్టన్ పదవీ విరమణ చేసేలోపుగా మరొక మూడు కొత్త రాష్ట్రాలు వెర్మాంట్, (Vermont), కెంటకీ (Kentucky) టెన్నెసీ (Tennessie)లు యూనియన్‌లో చేరాయి. పెన్సిల్వేనియాలో బొగ్గు గనులున్నాయని తెలిసింది. వాషింగ్టన్ చూపిన ఆసక్తి ఫలితంగా ఫెడరల్ మహానగర నిర్మాణము అందచందాలతో, హుందాతో మిళితమైంది. రాజకీయ పార్టీల మధ్య సమతుల్యతను పాటిస్తూ దేశ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను వాషింగ్టన్ చేపట్టాడు.

వాషింగ్టన్ 1797లో పదవీ విరమణ చేసిన తరువాత రెండు సంవత్సరాలకు స్వర్గస్థుడైనాడు. అయినా వాషింగ్టన్ సంయుక్త రాష్ట్ర ప్రజల స్మృతి పథంలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. తన అసమానమైన శక్తి సామర్థ్యాలతో, సునిశితమైన విచక్షణతో వాషింగ్టన్, అమెరికాదేశాన్ని ప్రపంచంలోనే స్వతంత్ర దేశంగా నిలబడేటట్లు చేసాడు.

జార్జివాషింగ్టన్ స్నేహితుడైన హెన్రీలీ ప్రథమ పౌరుడైన తన స్నేహితుని గురించి ఈ విధంగా తెలియ జేసాడు : "యుద్ధంలోనూ ప్రథముడే; శాంతిలోనూ ప్రథముడే, తన దేశ ప్రజల హృదయాలలోనూ అతడు ప్రథముడే."

**సమీక్ష :**

జార్జి వాషింగ్టన్ తొలి అధ్యక్షుడుగా దేశానికి అవసరమైన విదేశీ విధానాన్ని, అంతరంగిక విధానాన్ని అనుసరించాడు. నూతన దేశానికి, అధ్యక్షుడుగా అమితమైన విచక్షణను చూపి దేశానికి కొన్ని మార్గదర్శక సూత్రాలను అందించాడు. వానిలో ప్రధానమైనవి; అధ్యక్షునికి సలహాదారులుగా కార్యదర్శులను నియమించుకోవటం, జెఫర్సన్ వ్యతిరేకించినప్పటికీ జాతీయ బ్యాంకు ఏర్పాటుకి మద్దత్తుని ఇవ్వడం, మూడవసారి అధ్యక్షునిగా ఎన్నికలలో నిలబడమని అడిగినప్పుడు, నిరాకరించటం, శత్రుత్వంలో ఉన్న ఐరోపా దేశాలతో తటస్థ విధానాన్ని పాటించటం. వాషింగ్టన్ అనుసరించిన ఈ విధానాలు అమెరికా ప్రగతికి దోహదపడ్డాయి.

**అభ్యాసాలు :**

1. జార్జి వాషింగ్టన్ తొలి అధ్యక్షునిగా అనుసరించిన విధానాలను తెలుపుము

2. హామిల్టన్ ఆర్థిక విధానాలు వివరించుము.

**ఉపయుక్త గ్రంథాలు :**


1) Henry Bamford Parkes : The United States of Americat
2) Thomas A. Baile : The American Pageant
3) C.P. Hill : A History of the United States
4) Patt & Drummond : Our Nation From its creation
5) David Donald : A History of American Life & Thought
6) Richard B. Morris : Encyclopaedia of American History
7) Edward J. Conlon (For the United States Information Service-Madras) : America Charitra Sangraham
8) America Samyukta Rshtrala Charitra : Telugu Academy Text.



డా॥ కంరున్నిసా బేగం, ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.
చరిత్ర, పురాతత్త్వ శాఖ
నాగార్జున విశ్వ విద్యాలయం

పాఠం - 4

# థామస్ జెఫర్సన్ (1801 - 1809)

## 4.1 లక్ష్యం :

జఫర్సన్ అధ్యక్ష కాలంలో జరిగిన ఆంతరింగక విషయాలను, విదేశీ సంబంధాలను వివరించటమే ఈ పాఠ్య లక్ష్యం.

## పాఠ్య నిర్మాణక్రమం

4.2 పరిచయం
4.3 అధ్యక్ష ఎన్నికలు
4.4 జీవితం, ఆశయాలు
4.5 జెఫర్సన్ గణతంత్ర ప్రజాస్వామ్యం
4.6 దేశీయ వ్యవహారాలు
4.7 న్యాయ వ్యవస్థపై దాడి
4.8 లూసియానా కొనుగోలు
4.9 ఫెడరలిజం పతనం
4.10 బ్రిటన్, ఫ్రాన్స్ దిగ్బంధ విధానాలు
4.11 లెవిస్, క్లార్క్ అన్వేషణాయాత్రలు
4.12 త్రిపోలితో యుద్ధం
4.13 అధ్యక్ష ఎన్నికలు
4.14 సంగ్రహంగా

## 4.2 పరిచయం :

అమెరికా సంయుక్త రాష్ట్రాల మూడో అధ్యక్షునిగా ఎన్నుకోబడిన థామస్ జెఫర్సన్ 1801 లో పదవీ స్వీకారం చేసి, 1809 వరకు అధ్యక్ష పదవిలో కొనగసాగాడు. స్వేచ్ఛా, సమానత్వాలు అందరికి అవసరమని విశ్వసించే జెఫర్సన్ నాయకత్వాన అమెరికా మరింత ప్రజాస్వామ్యకంగా రూపొందింది. జార్జి వాషింగ్టన్ కాలంలో పటిష్టమైన ఆర్థిక విధానాలను అవలంబించిన అమెరికా ప్రభుత్వం, జెఫర్సన్ నాయకత్వాన సామన్య ప్రజానీకానికి మరింత చేరువైంది.

జెఫర్సన్ గొప్ప మానవతావాది. తన భావాలను సూటిగా వ్యక్తీకరించటంలో మేటి. రాజకీయ తాత్వికునిగా, రచయితగా, ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తులలో ఒకరు. ఐదారు భాషలలో ప్రావీణ్యం గల జెఫర్సన్, గ్రంథపఠనం పట్ల ప్రత్యేక ఆసక్తి చూపేవాడు. న్యాయం, ప్రభుత్వం, పాలనావిషయాలపై మాత్రమేగాక, ప్రకృతి, సంగీతం, వాస్తు వ్యవసాయం వంటి విభిన్న అంశాలపై సహితం ఆసక్తి చూపేవాడు. ఐరోపాలో వున్న రాజరికం, చర్చి ఆధిక్యత, వర్గ విభేదాలు ఇవేవీ కూడా అమెరికాలో వుండరాదని భావించేవాడు. బ్రిటిష్ రాజ్యంనుంచి మాత్రమేగాక స్వేచ్ఛా అనేది చర్చినుంచి, భూస్వాములనుంచి, ఆర్థిక అసమానతలనుంచి వుండాలని కోరేవాడు.

న్యాయవాదిగా జీవితాన్ని ఆరంభించిన జెఫర్సన్ త్వరలోనే రాజకీయ జీవితాన్ని ఆరంభించాడు. వర్జీనియా శాసన సభ్యుడుగా, గవర్నరుగా, కాంటినెంటల్ సమావేశాల సభ్యుడుగా, వినుతికెక్కాడు. స్వాతంత్ర్య ప్రకటన పత్రాన్ని స్వయంగా తయారుచేశాడు. అమెరికన్

కాంగ్రెస్ సభ్యుడిగా కొంతకాలం వున్నాడు. ఫ్రాన్స్ దేశంలో, విదేశీ రాయబారిగా వున్నాడు. జార్జి వాషింగ్టన్ అధ్యక్ష కాలంలో విదేశాంగ శాఖ కార్యదర్శిగా వుండేవాడు. జాన్ ఆడమ్స్ 1797 లో అధ్యక్ష పదవి స్వీకరించిన తర్వాత జెఫర్సన్ ఉపాధ్యాక్షుడైనాడు. పార్టీ వ్యవహారాల్లో 1794 నుంచి చురుగ్గా పాల్గొని జెఫర్సన్ మాడిసన్, గల్లాటిన్‌ల నుండి రిపబ్లికన్ పార్టీ నాయకత్వాన్ని స్వీకరించాడు. ఫ్రెంచి విప్లవం వల్ల సంభవించిన కొన్ని దురాగతాల ఫలితంగా ఆదేశం ప్రపంచానికి పెద్ద ముప్పుగా ఏర్పడిందని ఫెడరలిస్టులు భావించారు. ఫెడరలిస్టుల ప్రభావానికి లోనై జాన్ ఆడమ్స్ ఫ్రాన్స్‌తో యుద్ధానికి తలపడే ఆలోచనను చేయగా జెఫర్సన్ వ్యతిరేకించాడు. నౌకలలోని నావికులను బంధించే విషయంలో బ్రిటన్‌తో వివాదం ఏర్పడింది. రాజద్రోహచట్టం అమలుక్రింద విద్రోహకర శక్తులపై చర్యలు చేపట్టడం ప్రారంభించిన తర్వాత కొన్ని దుష్ఫలితాలు కలిగాయి. ఈ పరిస్థితులలో 1800 లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగ పోటీచేసే అవకాశం జెఫర్సన్‌కి లభించింది.

## 4.3 అధ్యక్ష ఎన్నికలు :

1800 నాటి ఎన్నికల్లో పోటీచేసేందుకు అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులకు రిపబ్లికన్ పార్టీ థామస్ జెఫర్సన్ ఆరన్‌బర్‌లని, ఫెడరలిస్ట్ పార్టీ జాన్ ఆడమ్స్, చార్లెస్ పింక్నీలను తమ అభ్యర్థులుగ ఎన్నుకొన్నారు. హామిల్టన్ వర్గం వారు ఆడమ్స్‌పై ద్వేషంతో అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు ఫెడరలిస్ట్ తరుపున పింక్నీని నిలిపేందుకు విఫలయత్నం చేశారు. రిపబ్లికన్లు, ఫెడరలిస్టులు ఒకరిపై మరొకరు నిందలు వేసుకొని ఎన్నికల ప్రచార వాతావరణాన్ని కలుషితం చేశారు. అయినా శాంతి, పొదుపు, వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం మొదలగు వాస్తవాంశాలను గురించి కూడా చర్చించడం జరిగింగి. చివరికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులైన థామస్ జెఫర్సన్, ఆరన్ బర్‌లు గెలుపొందారు. అదే సమయంలో కాంగ్రెస్‌కి జరిగిన ఎన్నికల్లో కూడా రిపబ్లికన్లు ప్రతినిధి సభలోను, సెనేట్‌లోను తిరుగులేని ఆధిక్యం సంపాదించారు. దీని ఫలితంగా ఫెడరలిస్టులు అధికారం కోల్పోయారు.

1804 లో జరిగిన ఎన్నికలలో జెఫర్సన్ ఫెడరలిస్ట్ పార్టీ అభ్యర్థి సి.సి. పింక్నీని అత్యధిక ఆధిక్యంతో ఓడించి 4 మార్చి 1805 న రెండవ పర్యాయం అధ్యక్ష పదవి స్వీకరించాడు. అతడు 1801 నాటి తన విధానాన్నే కొనసాగించాలని ఆశించాడు. కాని తన నాయకత్వంలోని రిపబ్లికన్లు నాలుగు వర్గాలుగ ఏర్పడ్డారు. పశ్చిమ రాష్ట్రాలలోని రిపబ్లికన్లు సాగుభూమి కొరకు క్రొత్త ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని ఒత్తిడి తేవడం ప్రారంభించారు. న్యూఇంగ్లాండ్ రిపబ్లికన్లు అధికారం కోసం ప్రాకులాడటం మొదలుపెట్టారు. వర్జీనియా రిపబ్లికన్లు సూత్రాలను ఉల్లంఘించారు. మధ్య రాష్ట్రాలకు చెందిన ప్రజాస్వామ్యవాదులు సూత్రాలను వదిలేసి స్థానం కోసం ప్రయత్నించారు. ఐరోపాలో యుద్ధ ప్రమాదం ముంచు కొస్తుంది. ఆ ఖండంలో శాంతికోసం జెఫర్సన్ ప్రయత్నాలు ఫలించే సూచనలు కానరాలేదు.

## 4.4 జెఫర్సన్ జీవితం, ఆశయాలు :

జెఫర్సన్ తన అభిప్రాయాలను, భావాలను స్పష్టంగా, మార్గదర్శకంగా, చిరకాలం గుర్తుండే విధంగా వ్యక్తీకరించగలిగేవాడు. అందువల్ల అమెరికా చరిత్రలో అతనికి ప్రముఖమైన రాజ్యవేత్తగా పేరువచ్చింది. మానవులందరికి హక్కులున్నాయని, ఈ హక్కులను సంరక్షించటమే ప్రభుత్వం, సమాజం బాధ్యత అని అతడు నొక్కి వక్కాణించేవాడు. వ్యవసాయమే ప్రధాన వృత్తిగాగల వర్జీనియా రాష్ట్రంలో పుట్టి పెరిగిన జెఫర్సన్ వ్యవసాయక జీవన విధానమే నైతిక, రాజకీయ ధర్మానికి జీవం పోస్తుందని భావించాడు. మహానగరాలు మనుషులను అవినీతిపరులు గా తయారుచేస్తాయని అతడు విశ్వసించాడు. అంటే అమెరికా వాసులు ప్రధానంగా వ్యవసాయదారులుగ ఉన్నంతవరకు, అమెరికా అతి జన సమ్మర్దం కానంత వరకు మాత్రమే వారు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించుకోగలరని జెఫర్సన్ భావించాడు.

జెఫర్సన్ అమెరికా అధ్యక్షులందరిలో బహుముఖ ప్రజ్ఞావంతుడు. అతడు కళలలోను, శాస్త్రాలలోను ఆరితేరిన పండితుడు. ఇంగ్లీషు పద్యంమీద వ్యాసం రచించాడు. చిత్ర పటాలను సేకరించాడు. అతడు గొప్ప సంగీతాభిమాని, వాస్తుప్రవీణుడు. మానవ జీవితాన్ని మెరుగుపరిచే అన్ని విషయాలమీద ఆసక్తి చూపేవాడు. జెఫర్సన్ గొప్ప తత్త్వవేత్త, ప్రకృతారాధికుడు, శాస్త్రీయ వ్యవసాయదారుడు. ఒక క్రొత్త రకం నాగలిని కనుగొనడమే గాక అనేక రకాల మొక్కలతో ప్రయోగాలు నిర్వహించేవాడు. వర్జీనియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమేగాక అందులోని భవనాలను రూపొందించడం, అధ్యాపకులను నియమించడం, పాఠ్యవిషయాలను తయారుచేయడం కూడ జెఫర్సన్ బాధ్యత వహించిచేసాడు.

## 4.5 జెఫర్సన్ గణతంత్ర ప్రజాస్వామ్యం

1800 లో జెఫర్సన్ అధ్యక్షునిగ ఎన్నిక కావడంతో గొప్ప ప్రజాస్వామిక యుగం ప్రారంభమైంది. ఫెడరలిస్టులు అధికారంలో ఉన్నకాలంలో ప్రజలకు ఓటేసే హక్కున్నా అనేకమంది ఎన్నికలలో వోట్లు వేయలేదు. అంతేగాక రాజకీయాలను ఉన్నత వర్గాలవారు నియంత్రించేవారు. జెఫర్సన్ యుగంలో వోట్లు వేసేవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. జెఫర్సన్ విప్లవకారుడు కాదు. కాని అతడు తన జీవిత కాలమంతా స్వేచ్ఛ, సమానత్వాల కోసం కృషిచేశాడు. జెఫర్సన్ తన భార్యకి రాసిన చివరి ఉత్తరంలో ఇలా పేర్కొన్నాడు: "అందరి దృష్టి మానవుని హక్కులపై పడింది. ప్రజలందరూ తమ వీపులపై బరువులు మోసేందుకు పుట్టలేదని ఉన్నత వర్గాలకు చెందిన కొద్దిమంది వారిపై స్వారి చేసేందుకు జన్మించలేదనే సత్యం శాస్త్ర పరిజ్ఞానం ఫలితంగా అందరికీ తెలిసింది."

మానవుని పరిపూర్ణత, దోషరాహిత్యం మీద జెఫర్సన్ కి అచంచల విశ్వాసం ఉంది. అమెరికా ఆదర్శవాదం, నిరాడంబరత, ఆశాదృక్పథాలపై జెఫర్సన్‌కి నమ్మకం ఉండేది. మానవుని భయాలు, తప్పిదాల మీదగాక అతని హేతుబద్ధమైన తెలివి, సమాజాభివృద్ధికి దోహదం చేసే అతని ఆవేశపూరిత చర్యల పునాది మీద ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అమెరికా వాసులు పరిపక్వత సాధించారని నిరూపించడమే జెఫర్సన్ రాజకీయ లక్ష్యం. అతడు ప్రీస్ట్‌లేకి ఉత్తరం రాస్తూ ఇలా పేర్కొన్నాడు : "ఇతరులకు లేని అనుకూల పరిస్థితులు మనకు ఉన్నాయి. ఈ పరిస్థితులు సమాజంలోని సభ్యులకు స్వేచ్ఛ స్వయంపాలన ఎంతవరకు ఇవ్వగలమో నిరూపించడమే మన కర్తవ్యంగా నిర్ణయించాయి."

హామిల్టన్ అధికార కేంద్రీకరణకు ప్రయత్నించాడు. కాని జెఫర్సన్ అధికార వికేంద్రీకరణను బలపరిచాడు. హామిల్టన్ అరాచకత్వానికి భయపడి శాంతి భద్రతలను కోరుకొన్నాడు. జెఫర్సన్ నియంతృత్వాన్ని వ్యతిరేకించి స్వేచ్ఛకోసం కృషి చేశాడు. కులీన వర్గం నిర్దేశంలోనే గణతంత్ర ప్రభుత్వం విజయవంతమవుతుందని హామిల్టన్ విశ్వసించాడు. ప్రజాస్వామ్య పునాదిలేని గణతంత్ర వ్యవస్థ కోసం ప్రయత్నం చేయడం నిరుపయోగమని జెఫర్సన్ నమ్మాడు. హామిల్టన్ మానవ స్వభావం గురించి హాబ్స్ బోధించిన నిరాశవాద ప్రభావానికి లోనయ్యాడు. కాని ఈ విషయంలో జెఫర్సన్ ఆశావాద దృక్పథాన్ని అనుసరించాడు. అధికారం ప్రజల చేతుల్లో సురక్షితంగాను, ధర్మయుక్తంగాను ఉంటుందని జెఫర్సన్ విశ్వసించాడు. ప్రజలందరూ వివేకవంతులు గాకపోయినా, విద్య వారిని విజ్ఞానవంతులుగ చేసి వారికి పరిపూర్ణత ప్రసాదిస్తుందని కూడా జెఫర్సన్ భావించాడు. శాసనాలద్వారా నౌకాయానాన్ని ప్రోత్సహించి, పారిశ్రామికోత్పత్తులను అభివృద్ధి చేసి, అమెరికా ఆర్థిక వ్యవస్థను బహుముఖంగా అభివృద్ధి చేయాలని హామిల్టన్ వాదించాడు. కాని జెఫర్సన్ అమెరికా వ్యవసాయక దేశంగానే కొనసాగాలని కోరాడు.

జెఫర్సన్ అమెరికాని సరళతరమైన చట్టాలు, సమానావకాశాలు ఉండే గణతంత్ర రాజ్యంగాను అణచివేయబడిన వర్గాల ప్రజలకు ఆశ్రయమిచ్చేదిగాను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మార్గదర్శిగా ఉండే దేశంగాను రూపొందించేందుకు కృషిచేశాడు. అమరికా ఐరోపాకి భిన్నంగా ఉండాలని జెఫర్సన్ కోరాడు. హామిల్టన్ అమెరికాని నూతన ఐరోపాగా రూపొందించాలని ఆశించాడు.

## 4.6 దేశీయ వ్యవహారాలు :

కాంగ్రెస్‌లోని రెండు సభలలోను పూర్తి ఆధిక్యం సాధించి తమ ఆధీనంలోకి తెచ్చుకొన్న రిపబ్లికన్లు విస్కీ మీద సుంకాన్ని రద్దుచేసి, విదేశీ,రాజ్యద్రోహకర చట్టాలను (Alien and Sedition Acts) అంతమయ్యే విధంగా చేశారు. ఆర్థికమంత్రి గల్లాటిన్ ప్రభుత్వవ్యయాన్ని, ముఖ్యంగా సైన్యం, నావికాదళంపై పెట్టే ఖర్చుని చాలావరకు తగ్గించి, ప్రభుత్వానికుండే అప్పుని సాధ్యమైనంత త్వరగా తిరిగి చెల్లించేందుకు ప్రణాళిక రూపొందించాడు. ప్రభుత్వాధికారులందరూ ఫెడరలిస్టులైనందువల్ల వారిలో కొందరిని జెఫర్సన్ తొలగించి ఆ పదవులలో రిపబ్లికన్లకు నియమించాడు. ఈ చర్య ఫలితంగా జెఫర్సన్ రెండు పార్టీలలోని అతివాదులకు ఆగ్రహం కలిగించాడు. ఎందువల్లంటే జెఫర్సన్ రిపబ్లికన్లను అమెరికా ప్రజల నిజమైన ప్రతినిధులుగాను, ఫెడరలిస్టువోటర్లు రాజ్యకుట్రదారులవల్ల ప్రక్కదారి పట్టినప్పటికీ వారిని సదాశయులైన పౌరులుగాను భావించాడు.

## 4.7 న్యాయవ్యవస్థపై దాడి

దేశీయ వ్యవహారాలలో న్యాయవ్యవస్థ తీవ్రవివాదానికి దారితీసింది. న్యాయాధికారులందరు ఫెడరలిస్టులే, వారు రాజ్యద్రోహచట్టాన్ని అమలుపరచడంలో పక్షపాత వైఖరి అవలంబించారు. వారి ప్రవర్తన న్యాయాధికారాన్ని దుర్వినియోగం చేసే విధంగా ఉందని రిపబ్లికన్లు భావించారు. అంతేగాక 1803 నాటి మార్బరీ - మాడిసన్ వ్యాజ్యంలో ప్రధాన న్యాయమూర్తి సర్‌జాన్ మార్షల్ కాంగ్రెస్ చేసే చట్టాలను రద్దుచేసే అధికారం సుప్రీంకోర్టుకి ఉందని తీర్పు చెప్పడం వల్ల కూడా రిపబ్లికన్లు భయాందోళన చెందారు.

జాన్ ఆడమ్స్ దేశాధ్యక్షునిగ ఉన్న చివరి రోజుల్లో మార్బరీని న్యాయమూర్తిగ నియమించాడు. కాని అతని నియమాక పత్రాన్ని మాడిసన్ నిలుపు చేయడం వల్ల దానిని మార్బరీ అందుకోలేకపోయాడు. అందువల్ల మాడిసన్ ఆ నియామక పత్రాన్ని ఇచ్చేందుకు ఆదేశపత్రం (writ of Mandamus) జారీ చేయాలనీ మార్బరీ సుప్రీంకోర్టుని అభ్యర్థించాడు. ఇందుకోసం 1789 నాటి న్యాయవ్యవస్థ చట్టం ప్రకారం మార్బరీ తన వ్యాజ్యాన్ని నేరుగా సుప్రీంకోర్టు ముందుకి తెచ్చాడు. ఈ విషయంలో ప్రధాన న్యాయమూర్తి మార్షల్ రాసిన కోర్టుతీర్పు న్యాయపరమైన హేతువాదానికి, రాజకీయ నిపుణతకు, గొప్ప నిదర్శనం. ఈ తీర్పు ప్రకారం ఆదేశ పత్రం ఇచ్చేందుకు న్యాయస్థానానికి రాజ్యాంగాధికారం లేదని, అందువల్ల న్యాయవ్యవస్థ చట్టంలోని వివాదాస్పదమైన భాగం చెల్లదని, మార్బరీ నియామక పత్రాన్ని ఇచ్చేందుకు మాడిసన్‌ని ఆదేశించడానికి వీలుకాదని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రభుత్వంతో నేరుగా పోరాటం జరిపేందుకు మార్షల్ ఇష్టపడలేదు. అయినప్పటికీ శాసనసభ చేసే చట్టాలను పునస్సమీక్షించే అధికారం న్యాయస్థానానికి ఉందని నిర్ణయించడం వల్ల, కాంగ్రెస్‌లో ఉండే రిపబ్లికన్ల ఆధిపత్యానికి కొన్ని హద్దులున్నాయని మార్షల్ తన తీర్పుద్వారా తెలియజేశాడు.

న్యాయవ్యవస్థకి వ్యతిరేకంగా అభిశంసన పద్ధతి ద్వారా పోరాడేందుకు రిపబ్లికన్లు నిర్ణయించారు. మతిభ్రమించిన ఒక జిల్లా న్యాయమూర్తిని 1804 లో అభిశంసించడంలో వారు విజయం పొందారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేస్‌ని అభిశంసించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. చేస్ తన ప్రసంగాల్లో రిపబ్లికన్లను దూషిస్తూ రాజకీయ పక్షపాతం చూపించినా అతడు స్వయంగా నేరంగాని, అపరాధంగాని, చేసినట్లుగ రిపబ్లికన్లు నిరూపించలేకపోయారు. అందువల్ల చేస్‌ని వదిలేశారు.

ఈ ఓటమి ఫలితంగా జెఫర్సన్‌కి రిపబ్లికన్లను న్యాయమూర్తులుగ నియమించడం ద్వారా మాత్రమే న్యాయవ్యవస్థలో క్రమంగా మార్పులు తెచ్చేందుకు అవకాశం ఉన్నట్లు భావించాడు. న్యాయ మూర్తుల నియామకం జీవితకాలం అవడం వలన ఆ అవకాశం కూడా రాలేదు. ప్రధాన న్యాయమూర్తి మార్షల్, ఇతర ఫెడరలిస్ట్ న్యాయమూర్తులు చాలాకాలం జీవించారు. దాని ఫలితంగా సుప్రీంకోర్టులో ఏర్పడిన కొద్ది ఖాళీలు మాత్రమే రిపబ్లికన్లను న్యాయమూర్తులుగా నియమించేందుకు దోహదపడ్డాయి. అంతేగాక కొత్తగా న్యాయ మూర్తులుగా నియమితులైన రిపబ్లికన్లు కాలక్రమేణా మార్షల్ ప్రభావానికిలోనై రిపబ్లిక్ పార్టీ సిద్ధాంతాలకు అన్ని వేళలా కట్టుబడి ఉండలేదు. దాని ఫలితంగా కొన్ని దశాబ్దాల వరకు ఫెడరలిస్టు సూత్రాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడం న్యాయవ్యవస్థ చేసింది. అయినప్పటికీ న్యాయస్థానంపై జెఫర్సన్ చేసిన దాడి ఒక లక్ష్యాన్ని సాధించింది. న్యాయమూర్తులు అప్పటినుండి నిష్పక్షపాత వైఖరి అవలంబించడంలోను, ప్రత్యక్షంగా రాజకీయ పోరాటాల్లో పాల్గొనకుండా ఉండే విషయంలోను జాగ్రత్త వహించడం ప్రారంభించారు.

## 4.8 లూసియానా కొనుగోలు

జెఫర్సన్ దౌత్యసంబంధంగా అత్యంత ప్రాముఖ్యత గల విజయం సాధించాడు. 1800 నాటి సాన్ ఇల్‌డిఫోన్సో సంధి ఫలితంగా స్పెయిన్ అధీనంలోని లూసియానా ప్రాంతం ఫ్రాన్స్‌కి లభించింది. ఈ సంధిని రహస్యంగా ఉంచి స్పెయిన్‌కి చెందిన అధికారులు ఆ ప్రాంతాన్ని పాలించడం కొనసాగించారు. కాని స్వల్పకాలంలోనే సంధిని గురించిన రహస్య సమాచారం బయటపడింది. అంతేగాక 1795 లో స్పెయిన్ నుండి అమెరికా పొందిన న్యూ ఆర్లియన్స్ వద్ద సరుకులు నిలువచేసుకొనే హక్కుని 1802 లో నిలిపివేశారు. దీనివలన అమెరికాలో భయాందోళనలు ఏర్పడ్డాయి. స్పెయిన్ వలెగాక ఫ్రాన్స్ విస్తరణ విధానం అవలంబించే శక్తివంతమైన దేశం. అటువంటి దేశం తన అధీనంలోని మిసిసిపి నదీ ముఖద్వారాన్ని ఉపయోగించుకొని అమెరికా పశ్చిమ ప్రాంతం అభివృద్ధిని నిరోధించేందుకు ప్రయత్నిస్తే

మెరికా తప్పనిసరిగా ఐరోపా యుద్ధాల్లో పాల్గొనవలసి వస్తుంది. అందువల్ల జెఫర్సన్ ఫ్రెంచి ప్రభుత్వం నుండి న్యూ ఆర్లియన్స్‌ని కొనుగోలు చేసే ప్రయత్నం చేసేందుకు జేమ్స్ మన్రోని ఐరోపాకి పంపించాడు.

జేమ్స్ మన్రో పారిస్ చేరేలోగానే లూసియానా ప్రాంతాన్ని ఇచ్చివేసేందుకు నెపోలియన్ నిర్ణయించుకొన్నాడు. ఐరోపాలో 1801 లో తాత్కాలికంగా ఆగిపోయిన యుద్ధం మరల ప్రారంభం కాబోతుంది. అంతేగాక అమెరికాలో ఫ్రాన్స్‌కి సైన్యం లేనందువల్ల, సముద్రంపై ఫ్రాన్స్‌కి ఆధిపత్యం లేని కారణంగాను బ్రిటిషువారికి వ్యతిరేకంగా లూసియానాను సంరక్షించుకొనే అవకాశం, శక్తి నెపోలియన్‌కి లేవు. దాని ఫలితంగా లూసియానా ప్రాంతాన్ని అమ్మివేసేందుకు నెపోలియన్ నిర్ణయించాడు. అంతేగాక బ్రిటన్‌కి వ్యతిరేకంగా అమెరికాని శక్తివంతంగా రూపొందిస్తే దానివలన ఫ్రాన్స్‌కి లాభం కలుగుతుందని కూడా ఆశించాడు. లూయిసియానాను $15,000,000 కి కొనుగోలు చేసేందుకు మన్రో త్వరితంగా అంగీకరించాడు. నాటి లూసియానా ప్రాంతంలో నేటి లూసియానా రాష్ట్రంతో కలిపి ఉత్తరంగా కెనడావరకు, పశ్చిమాన రాకీ పర్వతాలకు విస్తరించిన 16,00,000 చ.కి.మీ. వైశాల్యంగల విశాలమైన ప్రాంతంగా ఉండేది.

అమెరికా రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి కొత్తగా విదేశీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొనేందుకు గాని, ఆ ప్రాంతంలో నివసించే ప్రజలకు పౌరహక్కులు కల్పించేందుకుగాని అధికారం లేదు. కాని ఈ సంధి అమెరికాకి ముఖ్యంగా రిపబ్లికన్ పార్టీ ప్రాతినిధ్యం వహించే వ్యవసాయ ప్రయోజనాలకు గొప్పలాభం కలుగజేస్తుంది. అందువల్ల జెఫర్సన్ రాజ్యాంగ సూత్రాలకు ఈ విషయంలో తిలోదకాలిచ్చి హామిల్టన్ బ్యాంక్ విషయంలో పేర్కొన్న గుప్తాధికారాన్ని సమర్థిస్తూ ఈ సంధిని ఆమోదించమని సెనేట్‌ని కోరాడు.

ఈ సందికి సంబందించిన మరొక క్లిష్టమైన సమస్య ఏమిటంటే లూసియానా ప్రాంతానికి గల ఖచ్చితమైన సరిహద్దులేమిటో నెపోలియన్ నుండి మన్రో తెలుసుకోలేకపోయాడు. ఈ ప్రాంతంలోనే టెక్సాస్, పశ్చిమ ఫ్లోరిడాలు కలిసున్నాయని అనేకమంది అమెరికన్లు విశ్వసించారు. కాని సాన్ ఇల్‌డిఫోన్సో సంది ద్వారా ఫ్రాన్స్‌కి ధారాదత్తంచేసిన ప్రాంతాలలో ఇవి రెండూ లేవని స్పెయిన్ ప్రభుత్వం నొక్కి చెప్పింది. లూసియానా ప్రాంతం డిసెంబరు 1803 లో అమెరికా ఆధీనంలోకి వచ్చింది. కాని టెక్సాస్, ఫ్లోరిడాలను స్పెయిన్ తన అధీనంలోనే ఉంచుకొనడమేగాక ఆ ప్రాంతాల కొనుగోలుకు అమెరికా చేసిన ప్రతిపాదనను తిరస్కరించింది. అయినా ఆ ప్రాంతాలు లేనప్పటికీ లూసియానా కొనుగోలు ప్రపంచంలోనే అత్యంత విశాలమైన భూకొనుగోలుగా ప్రసిద్ధి చెందింది. ఆ ప్రాంతం దాదాపు నాటి అమెరికా పరిమాణమంత ఉంది.

## 4.9 ఫెడరలిజం పతనం

జఫర్సన్ పాలనలో సంభవించిన పరిణామాలన్నీ చాలావరకు రిపబ్లికన్ పార్టీకి గల ప్రజాదరణ పెరిగేందుకు దోహదపడ్డాయి. కాని విదేశాంగ మంత్రి టిమోతీ పికరింగ్ నాయకత్వంలోని తీవ్రవాద న్యూ ఇంగ్లాండ్ ఫెడరలిస్టులు చిరకాలంగా అమెరికా రాజకీయాలలో ఫెడరలిస్ట్ పార్టీ బలపరుస్తూ వస్తున్న పటిష్టమైన జాతీయ ప్రభుత్వ విధానాన్ని వదిలేశారు. అంతేగాక జెఫర్సన్ మీద ఫెడరలిస్టులకు గల ద్వేషం ఎంతవరకు వెళ్ళిందంటే వారు దేశం నుండి విడిపోవడం గురించి కూడ చర్చించడం ప్రారంభించారు. జాతీయ ఎన్నికల్లో వారు మరొకసారి గెలుపొందే అవకాశం కనిపించలేదు. కాబట్టి ఫెడరలిస్టులలో కొందరు వాణిజ్యానికి రక్షణ ఉండే విధంగాను, విజ్ఞానుల, ధనికుల పాలన ఏర్పడే విధంగాను ప్రజాస్వామ్య ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలకు అవకాశం లేకుండా న్యూ ఇంగ్లాండ్, న్యూయార్క్‌లతో కూడిన ఉత్తర సమాఖ్యను వేరుచేసి స్వతంత్ర దేశంగా ఏర్పాటుచేసే ప్రణాళిక తయారుచేయడం మొదలుపెట్టారు. కాని హామిల్టన్ వారికి తగిన ప్రోత్సాహమివ్వలేదు. జెఫర్సన్ అనుసరించే విధానాలు దేశాన్ని నాశనం చేస్తాయని విశ్వసించినా, దేశాన్ని ముక్కలుగ విడగొట్టేందుకు హామిల్టన్ ముందుకురాలేదు. అందువల్ల ఫెడరలిస్టులు తమను బలపరిచేవారికోసం వెదకడం ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో వారికి ఆరన్‌బర్ సహాయం లభించింది. ఆరన్‌బర్ అమెరికా ఉపాధ్యక్ష పదవిలో ఉన్నాడు. కాని 1800 నాటి ఎన్నికల్లో ప్రతిపక్షంతో ఒప్పందం చేసుకొనే ప్రయత్నం చేయడం కారణంగా అతనికి రిపబ్లికన్ పార్టీలో ఉండే ఉన్నతస్థాయిని కోల్పోయాడు.

ఆరన్‌బర్ తాను గెలిస్తే ఉత్తర సమాఖ్య ఏర్పాటు ఉద్యమానికి నాయకత్వం వహించవచ్చునే ఆశతో 1804 నాటి ఎన్నికల్లో న్యూయార్క్ గవర్నరు పదవికి పోటీ చేశాడు. హామిల్టన్ ఆ ఎన్నికలలో చురుకుగా పాల్గొని ఆరన్‌బర్ ఓటమికి కారణమయ్యాడు. ఈ విధంగా ఆరన్‌బర్

ఆశలు అడియాసలయ్యాయి. అందువల్ల ఆ ఎన్నికల తర్వాత అతడు తనతో ద్వంద్వయుద్ధానికి రమ్మని హామిల్టన్‌ని సవాలు చేశాడు. హామిల్టన్‌కి ద్వంద్వయుద్ధంలో పాల్గొనేందుకు ఇష్టంలేదు. కాని ఇతరులు తనను పిరికివాడని హేళనచేస్తారని భావించి ఆరన్ బర్‌తో ద్వంద్వయుద్ధానికి అంగీకరించాడు. న్యూయార్క్ నుండి హడ్సన్ నది ఆవలివైపున ఉన్న వీహావెన్ వద్ద వీరిద్దరి మధ్య 11 జూలై 1804 న సంఘర్షణ జరిగింది. దీని ఫలితంగా హామిల్టన్ తీవ్రగాయాలకులోనై మరణించాడు.

ఫెడరలిస్టులలోగల వర్గపోరాటాలు, అనైక్యతా వైఖరి వారి పతనానికి దారితీసింది. 1804 నాటి అధ్యక్ష ఎన్నికల్లో ఫెడరలిస్ట్ అభ్యర్థి సి.సి. పింక్నీని కనెక్టికట్, డెలావేర్ రెండు రాష్ట్రాలు మాత్రమే బలపరిచాయి. మెస్సాచుసెట్స్‌కూడా జెఫర్సన్‌నే బలపరిచింది. ఈ ఎన్నికల్లో జెఫర్సన్ ఆధిక్యతతో గెలుపొంది అధ్యక్షునిగా తిరిగి రెండవసారి ఎన్నికయ్యాడు.

అమెరికాలోని సామాన్య ప్రజల వివేకంలో విశ్వాసం లేకపోవడం, ప్రజాస్వామ్య ఉద్యమాన్ని వ్యతిరేకించడం వల్ల ఫెడరలిస్ట్ పార్టీ త్వరితగతిన పతనమైంది. జెఫర్సన్ రిపబ్లికన్లు 1812 నాటి యుద్ధం విషయంలో ఫెడరలిస్టులకు రాజ్యద్రోహమనే మచ్చను ఆపాదించి వారికి దేశరాజకీయాల్లో మనుగడలేకుండా చేశారు. అయినప్పటికి ఫెడరలిస్ట్ పార్టీ అధికారంలో ఉన్న స్వల్పకాలంలోనే అది అమెరికా అభివృద్ధికి విశేషంగా కృషి చేసింది. అమెరికాకి కార్యసాధక జాతీయ ప్రభుత్వాన్ని ఇవ్వడం, ఆర్థిక వ్యవస్థను సుస్థిరంచేయడం, ఐరోపా దేశాల నుండి గౌరవం పొందడం, రిపబ్లికన్ వ్యవస్థ సమర్థవంతమైన పాలన అనుకూలమైనదని నిరూపించడం ఫెడరలిస్ట్ పార్టీ సాధించిన విజయాలు. జెఫర్సన్ సిద్ధాంతం విజయవంతమైన తర్వాత ఏర్పడిన అమెరికా ప్రభుత్వాలు విభిన్న రాజకీయ భావాల్ని ఆదర్శంగా తీసుకొని అనుసరించినా అవి అన్నీ అమెరికా రిపబ్లిక్ స్వతంత్ర దేశంగా రూపొందిన తొలి సంవత్సరాలలో ఫెడరలిస్టులు సురక్షితంగా వేసిన గట్టి పునాదిపైనే ఆధారపడ్డాయి.

## 4.10 బ్రిటన్, ఫ్రాన్స్ దిగ్బంధ విధానాలు

జెఫర్సన్ రెండవసారి అధ్యక్షునిగ ఉన్న కాలంలో అతని పాలనంతా ఐరోపాలో యుద్ధాలు చేసే దేశాలకు వ్యతిరేకంగా అమెరికా తన తటస్థ హక్కులను కాపాడు కోవడంతోనే సరిపోయింది. నెపోలియన్, అతని శత్రువుల మధ్య సంఘర్షణలు 1803 లో తిరిగి ప్రారంభమయ్యాయి. నెపోలియన్‌కి భూమి మీద జరిగే యుద్ధాలలో చిరకాలంగా ఓటమి లేదు. అతడు 1807 నాటికి ఐరోపా ఖండంలో అత్యధిక భూభాగాన్ని జయించి స్వాధీనపరచుకొన్నాడు. బ్రిటన్ 1805 లో ట్రఫాల్గర్ వద్ద ఫ్రెంచి నావికాదళాన్ని నాశనం చేయడం ద్వారా సముద్రం మీద ఆధిపత్యం సంపాదించింది. ఫ్రాన్స్, బ్రిటన్‌లు ప్రత్యక్షంగా నేరుగా ఒకరి మీద మరొకరు దాడి చేసేందుకు వీలుగాక ఆర్థికయుద్ధానికి తలపడి శత్రుదేశ వాణిజ్యంలో జోక్యం చేసుకొని ప్రత్యర్థిని లొంగతీసుకొనేందుకు ప్రయత్నించాయి. ఈ విధానం ఫలితంగా తటస్థ దేశాలలో ముఖ్యమైన అమెరికా నష్టపడసాగింది.

1790 దశకంలో చేసినట్లే అమెరికా నౌకలలో పనిచేసే నావికులను బ్రిటన్ నిర్బంధించడం ప్రారంభించింది. ఫ్రాన్స్ ఆధీనంలోని వెస్ట్ ఇండీస్‌తో వ్యాపారం చేయడానికి ప్రయత్నించే అమెరికా నౌకలను బ్రిటిషువారు 1805 తర్వాత స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టారు. ఈ విషయంలో అమెరికా ప్రభుత్వం బ్రిటిషు ప్రభుత్వంతో జరిపిన సంప్రదింపులు సంతృప్తికర ఫలితాలనివ్వలేదు. నెపోలియన్ బ్రిటిషు వాణిజ్యాన్ని నాశనం చేయడం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే లక్ష్యంతో భూ ఖండ విధానాన్ని రూపొందించి 1806 లో బెర్లిన్ డిక్రీని, 1807 లో మిలన్ డిక్రీని జారీ చేశాడు. బ్రిటన్‌కి లేదా తటస్థ దేశానికి చెందిన నౌక బ్రిటన్‌లోని ఏ నౌకాశ్రయం చేరినా, దానినుండి బయలుదేరినా, బ్రిటిషు అధికారులను ఓడను దర్శించేందుకు అనుమతించినా ఆ ఓడను స్వాధీనం చేసుకుంటానని ఫ్రాన్స్ ప్రకటించింది. నెపోలియన్ డిక్రీలకు జవాబుగా బ్రిటన్ 1807 లో ఆర్డర్స్ - ఇన్ - కౌన్సిల్ జారీ చేసింది. దీని ప్రకారం బ్రిటన్‌లోని నౌకాశ్రయంనుండి బయలుదేరిన లేదా బ్రిటన్ నుండి అనుమతి పత్రం పొందిన తటస్థదేశానికి చెందిన ఓడలు తప్ప మిగిలిన ఓడలు నెపోలియన్ స్వాధీనంలోని ఏ ఐరోపా ప్రాంతంతోను వ్యాపారం చేయడానికి అనుమతి లేదని బ్రిటన్ ప్రకటించింది. ఈ దిగ్బంధ విధానాల వల్ల తటస్థదేశమైన అమెరికాకి చెందిన ఓడలు ఐరోపా దేశాలతోగాని, ఆదేశాలకు చెందిన వలసలతో గాని వ్యాపారం చేసేందుకు క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. వాస్తవంగా పరిశీలిస్తే బ్రిటన్, ఫ్రాన్స్ రెండు దేశాల దిగ్బంధ విధానాలు సంపూర్ణంగా అమలుకాలేదు. కాని

బ్రిటిషు నావికాదళం ఐరోపాలోని ముఖ్యమైన నౌకాశ్రయాలపై పటిష్టమైన నిఘా కొనసాగింది. అమెరికా జలాల్లో కార్యకలాపాలు సాగించేందుకు ఫ్రాన్స్ స్వచ్ఛంద యుద్ధ నౌకలను పంపింది.

ఫ్రాన్స్ కంటే బ్రిటన్‌పై అమెరికా ప్రజల ఆగ్రహం పెల్లుబికింది. దీనికి కారణం బ్రిటన్ అమెరికా నౌకలలోని నావికులను నిర్బందించడం. 1807 లో జరిగిన దౌర్జన్యకర సంఘటన ప్రాముఖ్యత పొందింది. చెసాపీక్ అనే పేరుగల అమెరికా యుద్ధనౌక మీద లియోపార్డ్ అనే బ్రిటిషు నౌక దాడిచేసి దానిని లొంగదీసుకొని అందులోని నలుగురు నావికులను నిర్బంధించి బ్రిటిషు నావికాదళంలో చేర్చుకొంది.

చెసాపీక్ సంఘటన తర్వాత అమెరికా తన హక్కులను సంరక్షించుకొనేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఐరోపా దేశాలు, ముఖ్యంగా బ్రిటన్ దేశం అమెరికానుండి వచ్చే దిగుమతుల మీద, ప్రధానంగా ఆహార పదార్థాల మీద ఆధారపడి ఉన్నాయని, వీటిని అమెరికానుండి ఎగుమతి చేయడం ఆపివేస్తే ఆ దేశాల్లో ఆహారకొరత ఏర్పడి లొంగివచ్చి రాయితీలిచ్చి ప్రత్యేక సౌకర్యాలను కలుగచేస్తాయని జెఫర్సన్ విశ్వసించాడు. దీని ఫలితంగా అమెరికా రేవులలో ఉండే నౌకలు తప్ప మిగిలిన ఏ నౌక కూడా అమెరికాని వదలి ఏ విదేశీ రేవుకైనా పోవడాన్ని నిషేధిస్తూ డిసెంబరు 1807 లో అమెరికా కాంగ్రెస్ వ్యాపార నిరోధక చట్టాన్ని (Embargo Act) చేసింది.

అమెరికా అత్యంత తీవ్రమైన ఈ చట్టాన్ని చేసి అమలుపరిచినా కూడా దానివల్ల జెఫర్సన్ ఆశించిన ఫలితాలు కలుగలేదు. బ్రిటిషువారికి అమెరికా సరుకుల అవసరం చాలా ఉందని, అందువల్ల వారు తప్పని సరిగా దిగివస్తారని జెఫర్సన్ తప్పుగా అంచనావేశాడు. అంతేగాక వ్యాపార నిరోధక చట్టంవల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని దేశంలో వాణిజ్య స్తబ్దతకు, ధరల పతనానికి దారితీసింది. ఈ చట్టాన్ని దేశంలో, ముఖ్యంగా న్యూ ఇంగ్లాండ్‌లో అమలు పరచడం కష్టతరమైంది. అప్పటికే సముద్రం మీద సరుకులను రవాణా చేస్తున్న నౌకలు అమెరికా ఓడరేవులకు రావడం మానేసి దూరంగా ఉండిపోయాయి. వ్యాపారులు తమకు అవకాశం లభించిన సమయాల్లో ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారు. అందువల్ల వ్యాపారులు ఈ చట్టానికి లోబడి ఉండే విధంగా నియంత్రించేందుకు జెఫర్సన్ చర్యలు తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారులకుండే అధికారాలను మరింతగా విస్తృత పరిచాడు.

## 4.11 లెవిస్, క్లార్క్ అన్వేషణా యాత్రలు

జెఫర్సన్ 1801 లో తన అంతరంగిక కార్యదర్శి కెప్టెన్ లెవిస్‌ని అమెరికా పశ్చిమ ప్రాంతానికి అన్వేషణాయాత్రకి పంపించాడు. కెప్టెన్ లెవిస్ తన సహాయకునిగా లెఫ్టినెంట్ విలియం క్లార్క్‌ని తీసుకెళ్లాడు. జెఫర్సన్ ఈ యాత్రకి ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ నుండి 25,000 డాలర్లు పొందాడు. 1803 లో లూసియానాని స్వాధీనం చేసుకొన్న తర్వాత ఈ అన్వేషణాయాత్ర ప్రారంభమయింది.

లెవిస్, క్లార్క్ అన్వేషణాయాత్రలో 32 మంది సైనికులు, 10 మంది పౌరులు పాల్గొన్నారు. ఈ యాత్ర బృందం పిట్స్‌బర్గ్‌నుండి బయలుదేరి సెయింట్ లూయిస్‌లో కొంతకాలం ఆగారు. వారు 14 మే 1804 న నదీ మార్గం ద్వారా ఉత్తర డకోటా వైపు బయలుదేరి వెళ్లారు. వారు రాకీ పర్వతాలు దాటి కొలంబియా చేరారు. అక్కడ నుండి బయలుదేరి 7 నవంబరు 1805 న పసిఫిక్ మహాసముద్రం చేరారు.

యాత్రలో పాల్గొన్న అన్వేషకులు ఇండియన్స్‌తో స్నేహం చేసి చలికాలమంతా అక్కడ గడిపారు. 1806 వసంతకాలంలో తిరుగు ప్రయాణం ప్రారంభించారు. మిస్సోరీ నుండి దిగువకు ప్రయాణించి 23 సెప్టెంబరు 1806 న సెయింట్ లూయిస్ చేరుకొన్నారు. ఈ అన్వేషణ యాత్ర రెండున్నర సంవత్సరాలు సాగింది. ఈ కాలంలో వారు 14,400 కి.మీ. నిర్జన ప్రదేశం గుండా పయనించారు. దీని ఫలితంగా ఆ ప్రాంతం నైసర్గిక స్వరూపం, భౌగోళిక పరిస్థితులపై ప్రజలకు అవగాహన ఏర్పడి పశ్చిమ దిశ విస్తరణకు మార్గం సుగమమైంది. ఆ తర్వాత కాలంలో ఆరెగాన్ ప్రాంతం విషయంలో అమెరికా, బ్రిటన్ల మధ్య వివాదం సంభవించిన సమయంలో ఈ అన్వేషణాయాత్ర ఆధారంగా అమెరికా ఆ ప్రాంతంపై తనకుగల హక్కుని స్థిరపరచుకొని దానిని స్వాధీనం చేసుకొంది.

## 4.12 త్రిపోలీతో యుద్ధం.

జెఫర్సన్ అధ్యక్షుడయ్యే నాటికి సంవత్సరాదాయంలో అయిదోవంతయిన 20,00,000 డాలర్లను అమెరికా తన వాణిజ్యనౌకలు మధ్యదరా సముద్రంలో ప్రయాణించేందుకు అనుమతికోసం ముస్లిం దేశాలైన మొరాకో, అల్జీర్స్, ట్యూనిస్, త్రిపోలీలకు చెల్లించింది. 1801 లో అమెరికా అల్జీర్స్ పాలకుడితో ఒక ఒప్పందం చేసుకొంది. ఇది త్రిపోలీ పాలకుడు బాషా చేసిన ప్రతిపాదనకంటే లాభసాటిగా ఉంది. ఈ ఒప్పందం విషయం బాషాకి తెలిసి అతడు తీవ్రంగా ఆగ్రహించి అమెరికాపై యుద్ధం ప్రకటించాడు. జెఫర్సన్ త్రిపోలీతో యుద్ధానికి అనుకూలంగా లేడు. కాని అమెరికా తన నావికులను సంరక్షించేందుకు, దేశ గౌరవాన్ని కాపాడేందుకు త్రిపోలీతో తప్పనిసరిగా యుద్ధం చేయవలసి వచ్చింది.

జెఫర్సన్ కమాండర్ డేల్ నాయకత్వంలో నావికాదళాన్ని మధ్యధరా సముద్ర ప్రాంతానికి పంపించాడు. కాని ఆ దళం ఏమీ సాధించకుండానే తిరిగి రావలసి వచ్చింది. అందువల్ల జెఫర్సన్ మరల కమాండర్ మోరిస్ నేతృత్వంలో పెద్ద నావికాదళాన్ని పంపాడు. కాని అది కూడా కార్యసాధనలో విఫలమైంది. దానివల్ల మూడవసారి కెప్టెన్ విలియం బ్రెయిన్‌బ్రిడ్జ్ నాయకత్వంలో మరొక నావికాదళాన్ని పంపగా అది త్రిపోలీ తీరం చేరింది. కాని ఫిలడెల్ఫియా అనే పేరుగల యుద్ధనౌకకు ప్రమాదం సంభవించి దానిలోని 390 మంది నావికులను శత్రుదేశంవారు బంధించారు. దీని ఫలితంగా జెఫర్సన్ చివరిసారిగా లెఫ్టినెంట్ స్టీఫెన్ డెకతూర్ నేతృత్వంలో మరొక నావికాదళాన్ని త్రిపోలీ పైకి పంపాడు. డెకతూర్ తనదళంతో నేరుగా త్రిపోలీ నౌకాశ్రయంలోకి చొచ్చుకొని పోయి ఫిలడెల్ఫియా నౌకలోనికి ప్రవేశించి దానిని అగ్నికి ఆహుతి చేసి తప్పించుకొని వచ్చాడు. 1804 లో అమెరికా సైనికులు త్రిపోలీ నగరం మీద దాడిచేసి దానిపై బాంబులు వేశారు. కానీ త్రిపోలీ పాలకుడు బాషా మాత్రం తన వైఖరి మార్చుకోలేదు. దీని ఫలితంగా రెండు దేశాల మధ్య సరియైన ఒప్పందం చాలాకాలం వరకు కుదరలేదు. చివరకు బాషా లొంగివచ్చి జూన్ 1805 లో అమెరికాతో శాంతి ఒప్పందం చేసుకొన్నాడు. ఈ సంధి షరతులు :

1. అమెరికా ప్రతి సంవత్సరం త్రిపోలీకి చేసే చెల్లింపులను నిలిపివేసింది.
2. ఫిలడెల్ఫియా నౌకకు చెందిన అధికారులను, సిబ్బందిని విడుదల చేసేందుకు జరిమానా చెల్లించేందుకు అమెరికా అంగీకరించింది.
3. మధ్యధరా సముద్రం నుండి తన యుద్ధ నౌకలను వెనుకకి రప్పించేందుకు అమెరికా అంగీకరించింది.

త్రిపోలీతో అమెరికా చేసిన యుద్ధానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. రక్షణ వ్యయం తగ్గిస్తే అమెరికాకి పెను ప్రమాదం సంభవిస్తుందని ఈ యుద్ధం వల్ల జెఫర్సన్ తెలుసుకున్నాడు. దీని ఫలితంగా సైన్యాన్ని, నావికాదళాన్ని అభివృద్ధి చేసేందుకు జెఫర్సన్ కృషి చేశాడు. జెఫర్సన్ విధానంలో మార్పువచ్చి సరియైన చర్యలు తీసుకొనకపోతే బ్రిటన్‌తో 1812 లో జరిగిన యుద్ధంలో అమెరికా తీవ్రంగా నష్టాలు ఎదుర్కోవలసి వచ్చేది.

## 4.13 : అధ్యక్ష ఎన్నికలు (1808)

1808 లో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. వాషింగ్టన్ మూడవసారి అధ్యక్షునిగ ఉండేందుకు తిరస్కరించడం వల్ల దానిని దృష్టాంతంగా తీసుకోవాలని నిర్ణయించిన జెఫర్సన్ తానుకూడా మూడవ పర్యాయం అధ్యక్షునికి జరిగే ఎన్నికలలో పోటీ చేసేందుకు తిరస్కరించాడు. దీని ఫలితంగా రిపబ్లికన్ పార్టీ నాయకుడిగ అతని సన్నిహిత మిత్రుడు జేమ్స్ మాడిసన్ ఎన్నికయ్యాడు. అంతేగాక 1808 నాటి అధ్యక్ష ఎన్నికలలో జేమ్స్ మాడిసన్ పోటీచేసి ఘనవిజయం సాధించి దేశాధ్యక్షుడయ్యాడు.

## 4.14 సంగ్రహంగా

థామస్ జెఫర్సన్ అమెరికాలో 1800, 1804 లో జరిగిన ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగ పోటీచేసి గెలుపొంది రెండు పర్యాయాలు దేశాధ్యక్ష పదవిని పొందాడు. అతడు దేశంలో గణతంత్ర ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసేందుకు విశేషంగా కృషి చేశాడు విదేశీ, విద్రోహకర చట్టాలను అంతమయ్యేట్లు చేయడం, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి అప్పులను తీర్చడం మొదలగు చర్యలు చేపట్టాడు. ఫెడరలిస్టు ప్రభావానికి లోనైన న్యాయవ్యవస్థపై దాడిచేసి మార్పులు తెచ్చేందుకు ప్రయత్నం చేసాడు. జెఫర్సన్ ఫ్రాన్స్ నుండి విశాలమైన లూసియానా ప్రాంతాన్ని

కొనుగోలు చేశాడు. అది ప్రపంచ చరిత్రలోనే అత్యంత పెద్దదైన భూకొనుగోలుగ ప్రసిద్ధిచెందింది. అతని పాలనలోనే ఫెడరలిస్ట్ పార్టీ పతనం ప్రారంభమైంది. ఐరోపాలో శత్రుదేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఆర్థిక దిగ్బంధ విధానాలు అనుసరించడం వల్ల తటస్థదేశమైన అమెరికా సముద్రయాన వ్యాపారంలో నష్టపోయింది. లెవిస్, క్లార్క్ చేపట్టిన అన్వేషణా యాత్రవల్ల పశ్చిమ ప్రాంతాలకు ప్రజలు వలసవెళ్లి స్థిరపడటం ప్రారంభమైంది. మధ్యధరా సముద్రంలో అమెరికా నౌకల రవాణా విషయంలో ట్రిపోలీతో యుద్ధం చేయవలసివచ్చింది. 1808 లో మూడవసారి అధ్యక్ష పదవికి పోటీచేసేందుకు జెఫర్సన్ తిరస్కరించాడు. జెఫర్సన్ తన జీవితంలో సాధించిన ఎన్నో విజయాలలో మూడింటిని మాత్రమే పేర్కొన్నారు, అవి, అమెరికా స్వాతంత్ర్య ప్రకటన రచన, మతస్వేచ్ఛకై చేసుకొన్న వర్జీనియా చట్టము, వర్జీనియా విశ్వవిద్యాలయ రూపకల్పన తాను పొందిన ఉన్నత నియామకాలను గూర్చి కాక, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, విద్యలకై చేసిన కృషిని మాత్రమే అతను పేర్కొనడం అతని ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతీక.

## 4.15 నమూనా ప్రశ్నలు

వ్యాసరూప ప్రశ్నలు

1. జెఫర్సన్ పరిపాలన ప్రధాన లక్షణాలు వర్ణించండి.
2. జెఫర్సన్ అమెరికా అభివృద్ధికి చేసిన కృషిని వివరించండి
3. "లూసియానా కొనుగోలు జెఫర్సన్ సాధించిన గొప్ప విజయం" వ్యాఖ్యానించండి.
4. జెఫర్సన్ ప్రజాస్వామ్యాన్ని వివరించండి.

## ఉపయుక్త గ్రంధాలు :


1. H.B. Parkes : The United States of America A History
2. Allen Nevins and Henry Steele Commager : A Short History of the United States
3. Morison, Samuel E and Commager, H.S. : The Growth of The American Republic
4. Beard, Charles and Mary : The Rise of American Civilization
5. Commager, H.S. (Ed) : Documents of American History.
6. Bailey T.A. : Diplomatic History of the United States.



ప్రొఫెసర్ బి. మస్తానయ్య
ఆంధ్ర విశ్వ విద్యాలయం
విశాఖపట్నం

పాఠం - 5

# 1812 సంవత్సర సంగ్రామము

## 5.0 లక్ష్యం :

బ్రిటన్‌తో 1812లో అమెరికా సల్పిన యుద్ధాన్ని దానికారణాలను, ఫలితాలను తెలియజేయటమే ఈ పాఠం లక్ష్యం.

## విషయ క్రమం :

5.1 ఐరోపా నేపథ్యం

5.2 జఫర్సన్ తటస్థ విధాన ప్రకటన

5.3 1809 అధ్యక్ష ఎన్నికలు

5.4 యుద్ధ కారణాలు - తటస్థ హక్కుల ఉల్లంఘన

5.5 చెసాపీక్ ఉదంతం

5.6 ఎమ్ బార్గో చట్టం

5.7 నాన్ ఇంటర్ కోర్స్ చట్టము

5.8 "మేకన్స్ బిల్ నంబరు 2"

5.9 వార్ హాక్స్

5.10 1812 ఎన్నికలు

5.11 అమెరికా సంసిద్ధత

5.12 యుద్ధ గమనం

5.13 ఘెంట్ సంధి

5.14 హార్ట్ ఫోర్ట్ సమావేశము

5.15 1812 సంవత్సర యుద్ధ ఫలితాలు

5.16 సమీక్ష

## 5.1. ఐరోపా నేపథ్యం

విప్లవం విజయవంతం కావడంతోటే స్వాతంత్ర్య ప్రకటనలో వ్యక్తపరచిన తమ రాజకీయాశయాలకు నిర్దుష్ట రూపం కల్పించుకొనే అవకాశం అమెరికన్లకు ఏర్పడింది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, అలీన విధానాలపై తమ మక్కువను వారు ఈ యుద్ధం ద్వారా ప్రపంచానికి తెలియజేసారు. లిఖిత రాజ్యాంగానికి కట్టుబడి జీవించడం అమెరికన్లకు ఒక అలవాటుగామారిపోయింది. ప్రపంచ చరిత్రలో తొలి రాజ్యాంగాలలో ఇదొకటి. "స్వతంత్ర రాష్ట్రాలన్నిటిలోనూ రాజ్యాంగం నిర్దిష్టం" అని అమెరికా రెండవ అధ్యక్షుడు జాన్ ఆడమ్స్ వ్రాశాడు.

ఐరోపాలో జరుగుతున్న రాజకీయ మార్పులు అమెరికాని ప్రభావితం చేశాయి. ఫ్రెంచి విప్లవము క్రీ.శ. 1789లో ప్రారంభమై, క్రమక్రమంగా బలపడి, ఇతర రాజ్యాలకు కంటకప్రాయమైన విప్లవ యుద్ధంగా పరిణమించింది. ఆయా రాజ్యాల స్వాతంత్ర్యాన్ని ప్రగతిని నిరోధించి బెదరకొట్టింది. ఈ విప్లవం ఫ్రాన్స్ దేశంలో ఎన్నో ఒడుదుడుకులు పొందిన తరువాత నెపోలియన్ నాయకత్వాన్ని వరించింది.

నెపోలియన్ తొలిదశలోనే ఐరోపాలో అత్యధిక భూభాగాన్ని కైవసం చేసుకొన్నాడు. ఒక్క బ్రిటన్‌కు మాత్రమే, సముద్రాలపై ఆధిపత్యం ద్వారా ఈ మహాయోధుని ధాటికి దాసోహమ్మనక నిలవగలిగిన స్తోమత ఉండేది. ఫ్రాన్స్ బ్రిటన్‌ల మధ్య సంఘటిల్లిన సైనిక ఆర్థిక పోరాటాలు, నూతన దేశంగా ఏర్పడిన అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వతంత్రతపైనా ఆర్థిక వ్యవస్థ పైనా దెబ్బ తీశాయి.

## 5.2 జఫర్సన్ తటస్థ విధాన ప్రకటన :

తనకున్న అపరిమితమైన పలుకుబడి వల్ల జెఫర్‌సన్ 1804లో రెండోసారి అధ్యక్షుడుగా ఎన్నిక అయాడు. లూసియానాని పొందడం నిజంగా గొప్ప వరం. దేశం సంపన్నమౌతున్నది, అదీగాక అధ్యక్షుడు అన్ని వర్గాల వారినీ సంతృప్తి పరచడానికి గట్టిగా కృషి చేశాడు. 1805లో రెండవసారి అధ్యక్షుడుగా ఎన్నిక అయ్యాక, జెఫర్ సన్‌గ్రేట్ బ్రిటన్‌కీ, ఫ్రాన్స్‌కీ జరుగుతున్న యుద్ధంలో అమెరికా తటస్థంగా ఉంటుందని ప్రకటించాడు. రెండు నౌకాదళాలు సముద్రంలో అడ్డంకులు ఏర్పరచి అమెరికన్ వ్యాపారానికి పెద్ద అవరోధం కల్పించాయి. యుద్ధ నౌకలను తప్పించుకొని అమెరికన్ వ్యాపార నౌకలు ఇంగ్లాండుగాని, ఫ్రాన్స్‌గాని చేరలేవు.

## 5.3 1809 అధ్యక్ష ఎన్నిక :

"నాన్ ఇంటర్ కోర్స్ చట్టము"పై సంతకం చేసిన మూడు రోజులకు మార్చి 4, 1809న జెఫర్సన్ పదవీ విరమణ చేసాడు. జెఫర్సన్ మూడోసారి అధ్యక్షపదవికి పోటీ చేయడానికి నిరాకరించి, ఈ విషయంలో వాషింగ్టన్ సిద్ధాంతాన్ని అమలులో పెడుతున్నట్లు ప్రకటించాడు. తదుపరి, రిపబ్లికన్ పార్టీ జేమ్స్ మాడిసన్‌ను, ఫెడరలిస్ట్ పార్టీ సి.సి. పింక్నేను అధ్యక్ష పదవికి అభ్యర్థులుగా నిలబెట్టారు. నియోజిక గణంలో మాడిసన్‌కు 122 పింక్నెకు 47 ఓట్లు వచ్చాయి. మాడిసన్ ఎన్నికయినాడు, మాడిసన్‌కు జెఫర్సన్‌కున్నంత అధికార దక్షత, సమర్థత లేవు. ఇతడు రాజకీయ విధానాలను కాంగ్రెస్‌కే వదలివేసేవాడు.

## 5.4. యుద్ధ కారణాలు - తటస్థ హక్కుల ఉల్లంఘన :

1803వ సంవత్సరంలో బ్రిటన్, ఫ్రాన్స్‌ల యుద్ధం మళ్లీ మొదలయింది. ఇంతటితో 'ఏమియను' సంధి (The Treaty of Amiens 1802) విలువ దిగజారింది. అది ఒక తాత్కాలిక ఒడంబడికగా మాత్రమే నిలబడింది. బ్రిటన్ ట్రెఫాల్గర్ యుద్ధం (1805) లో ఫ్రెంచి నౌకా దళాన్ని ఓడించి తన నౌకాబలాధిపత్యాన్ని పునఃప్రతిష్టించింది. ఆ తరువాత బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఒకదానితో ఒకటి ప్రత్యక్ష యుద్ధం చేయడానికి వీలు లేక ఆర్థిక యుద్ధానికి తలబడ్డాయి. నెపోలియన్ దృష్టిలో బ్రిటన్ "దుకాణాదారుల దేశం" (Nation of Shop-Keepers) కాబట్టి, వారి వ్యాపారాన్ని, ఆర్థిక, వ్యవస్థని దెబ్బతీస్తే బ్రిటన్‌ని దెబ్బతీసినట్లేనని భావించి భూఖండ విధానాన్ని (Continental System) అమలులో పెట్టాడు. ఈ పద్ధతిని 1806లో మొదట బెర్లిన్ డిక్రీల (Berlin Decrees) ద్వారా , తరువాత 1807లో మిలన్ డిక్రీల (Milan Decrees) ద్వారా ప్రకటించాడు. ఈ ప్రకటనల ప్రకారం బ్రిటీష్ దీవులు ముట్టడిలో ఉన్నాయని, వాటితో ఏ దేశమైనా జరిపే వ్యాపారం నిషేధిస్తున్నామని తెలిపింది. ఏ దేశ (తటస్థ రాజ్యాలతో సహా) నౌక లైనా బ్రిటన్‌కు గాని, మిత్ర దేశాలకు గాని, ఆ దేశాలనుంచి గాని సరకులు చేరవేసేట్లయితే అవి హస్తగతం చేసుకోవడమవుతుందని హెచ్చరించాడు. ఈ విధంగా నెపోలియన్ బ్రిటన్ వాణిజ్యం మీద దెబ్బతీయడానికి ప్రయత్నించాడు. దీనికి ప్రతీకారం, మరియు జవాబుగా బ్రిటన్ 1807లో "ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్" (Orders-in-Council) జారీ చేసింది. ఫ్రాన్స్ దాని మిత్ర దేశాల నౌకాశ్రయాలు మూసివేయడం జరిగింది. ఏ దేశ నౌకలైనా (తటస్థ రాజ్యాలతో సహా) దానిని ఉల్లంఘించినట్లయితే ఆ నౌకలను పట్టుకోవడం అవుతుందని ప్రకటించింది. ఈ విధంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు రెండూ అమెరికా తటస్థదేశ హక్కులను ఉల్లంఘించి ప్రవర్తించాయి. దీనితో అమెరికా వ్యాపారావకాశాలు కుంటుపడినాయి. అమెరికన్ నౌకలను బ్రిటన్‌తో వ్యాపారం కొనసాగిస్తే ఫ్రాన్స్, ఫ్రాన్స్‌తో వాణిజ్య సంబంధాలు పెట్టుకొంటే బ్రిటన్ స్వాధీన పరచుకొనే క్లిష్టపరిస్థితి ఏర్పడింది. 1803-1812 మధ్య కాలంలో దాదాపు 1500 అమెరికన్ నౌకలను బ్రిటన్, ఫ్రాన్స్‌లు స్వాధీనం చేసుకొన్నాయి. కాని కొన్ని అమెరికన్ నౌకలు దిగ్బంధన వ్యూహాలనుంచి తప్పించుకొని రెండు దేశాలతోను వ్యాపారం సాగించి అపారమైన లాభాలు గడించాయి. బ్రిటన్, ఫ్రాన్స్‌లు యుద్ధంలో తలమునకలై వున్నందున, అమెరికా, ఆసియా, దక్షిణ అమెరికాలతో లాభసాటి వ్యాపారం కొనసాగించింది. బ్రిటన్ ఫ్రాన్స్‌లు రెండూ తటస్థ దేశ హక్కులను విస్మరించి, అమెరికాకు హాని కలిగించినా, దేశంలోని జనం ఫ్రాన్స్‌మీదకన్న బ్రిటన్ మీదనే ఎక్కువగా శత్రుభావంతో ఉన్నారు. ఫ్రాన్స్‌పై మక్కువకు కారణాలు

రెండు 1) స్వాతంత్ర్య యుద్ధం ముగిసినప్పటికీ, బ్రిటన్‌పై అయిష్టత కొనసాగడం. 2) లూసియానాను ఫ్రాన్స్‌నుంచి కొనుగోలు చేయడం ద్వారా ఏర్పడిన సాన్నిహిత్యం.

ఈ సమయంలో బ్రిటన్ 700 యుద్ధ నౌకలు నిర్మించుకుంది, 1, 50,000 మంది సైనికులు, నావికులు వాటిమీద పనిచేస్తున్నారు. ఈ బలంతో బ్రిటన్ తన వ్యాపారాన్ని, తన కాలనీలతో, సంబంధాన్ని రక్షించుకోగలదు. కాని బ్రిటీష్ నౌకా దళంలోని వ్యక్తులను చాలా హీనంగా చూడ్డం వల్ల నౌకా దళంలోకి స్వచ్ఛందంగా సైనికులను సేకరించడం అసంభవమైంది. ఎందరో నావికులు బ్రిటీషు ఓడలను వదలి పెట్టి అమెరికన్ నౌకలను ఆశ్రయించారు. ఈ పరిస్థితులలో బ్రిటీష్ ఆఫీసర్లు అమెరికన్ నౌకలను వెదకి, బ్రిటిష్ సైనికులను వశపరచుకోవడం ఆరంభించారు. బ్రిటిష్ సైనికులను గుర్తించే క్రమంలో బ్రిటిష్ ప్రభుత్వ అధికారులు అమెరికా నౌకలతో ప్రయాణించే అమెరికా పౌరులను కూడా బ్రిటిష్ వారిగా భావించి, వారిని ఇబ్బందులకు గురిచేసేవారు. అమెరికా ప్రభుత్వం దీనిని వ్యతిరేకించినప్పటికీ, ఆ హక్కు తమకున్నదన్నట్టు వారు వ్యవహరించారు. అమెరికాకు ఇది తీరని అవమానం. బ్రిటిష్ ఆఫీసర్లు అమెరికన్ నావికులను తరచు తమ ఓడలలోకి బలవంతంగా తీసుకుపోయేవారు. బ్రిటన్ అమెరికన్ నౌకలను అడ్డగించి తన సైన్యం నుంచి పారిపోయి వచ్చినారనే నెపంతో కొంతమంది వ్యక్తులను తన స్వాధీనం చేసుకోసాగింది.

## 5.5 చెసాపీక్ ఉదంతం 1807 :

క్రీ.శ. 1805 తరువాత ఫ్రెంచి పశ్చిమ ఇండీస్ దీవులతో వ్యాపారం సాగిస్తున్న అమెరికన్ నౌకలను నిర్బంధంలోకి తీసుకొనసాగింది. ఈ విషయాలను అనుసరించి జెఫర్సన్ బ్రిటీష్ ప్రభుత్వంతో కొనసాగించిన సంప్రదింపులు వ్యర్థమైనాయి. దీనికి తోడు 1807లో బ్రిటిష్ యుద్ధ నౌక, లియోపార్డ్, అమెరికన్ యుద్ధ నౌక చెసాపీక్‌ను అడ్డగించి స్వాధీనం చేసుకొని అందులోని నలుగురు ఓడ పనివారిని నిర్బంధించి తన సైన్యంలో చేర్చుకొంది. ఆ వ్యక్తులలో ముగ్గురు అమెరికన్‌లు, ఈ సంఘటన అమెరికన్ పత్రికలలో ప్రముఖ సంపాదకీయంగా మారింది.

## 5.6. ఎమ్‌బార్గో చట్టం, డిసెంబరు, 1807

ఈ చెసాపీక్ ఉదంతం అమెరికాలో గొప్ప అలజడి లేవదీసింది. కాని అధ్యక్షుడు జెఫర్సన్ బ్రిటన్‌తో యుద్ధం చేయకుండా ఇంకో తీరుగా ఒత్తిడి తీసుకొని రావలెనని ప్రయత్నించాడు. బ్రిటన్‌కు, అమెరికా ఆహార పదార్థాలు, ఇతర సరకులూ చాలా అవసరమని వాటిని నిలిపివేస్తే బ్రిటన్ ఇక్కట్లకు లోనవుతుందని, దానితో బ్రిటన్‌కు గుణపాఠం నేర్పినట్లవుతుందని అతడు భావించి 1807 డిసెంబర్‌లో ఎమ్‌బార్గో (Embargo Act) చట్టం జారీ చేయించాడు. ఈ చట్టము అమెరికానుంచి విదేశాలకు సరకుల ఎగుమతిని నిషేధించింది. బ్రిటన్‌కు అమెరికన్ సరకుల అవసరాలను జెఫర్సన్ తప్పుడు అంచనావేసినాడు. అందుచేత ఈ చట్టము ఆశించిన ఫలితాలనివ్వక పోగా అమెరికన్ వాణిజ్య, ఆర్థిక వ్యవస్థపై దెబ్బతీసింది. దేశంలో వస్తువుల ధరలు పడిపోయాయి. ఆర్థిక రంగంలో ప్రతిష్ఠంభన ఏర్పడింది. చాలా మంది నౌకా యజమానులు, వర్తకులు దివాలాతీశారు. వ్యవసాయదారులు తమ సరుకులను విదేశాలలో అమ్మడానికి వీలులేక పత్తి మాంసము, గోధుమ, పొగాకులను స్వదేశంలో అతి స్వల్పమైన ధరలకు అమ్మవలసి వచ్చింది. ముఖ్యంగా న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాలలో ఈ చట్టము అమలు జరపడం దుస్సాధ్యమయింది. న్యూ ఇంగ్లండ్ నౌకలలో మూడింట ఒకటి ప్రభుత్వం కన్నుగప్పి దొంగ చాటుగా విదేశాలతో వర్తకం సాగించి అపారమైన లాభాలను ఆర్జించసాగాయి. బ్రిటన్‌తో యుద్ధం సంభవిస్తే అమెరికన్ వాణిజ్యము సర్వనాశనమవుతుందని న్యూ ఇంగ్లండ్ వారు భావించారు. ఎమ్‌బార్గో చట్టము రాజ్యాంగానికి విరుద్ధమని వారు ప్రచారం చేయసాగారు. జెఫర్సన్ అనుయాయులైన కొంత మంది రిపబ్లికన్‌లు కూడా ఎమ్‌బార్గో చట్టాన్ని వ్యతిరేకించారు. ఈ పరిస్థితులవల్ల ప్రవేశపెట్టిన పదిహేను నెలలకే ఎమ్‌బార్గో చట్టాన్ని కాంగ్రెస్ రద్దు పరచింది.

## 5.7 నాన్ ఇంటర్ కోర్స్ చట్టము, మార్చి 1809 :

ఎమ్‌బార్గో చట్టం రద్దయిన తర్వాత, జెఫర్సన్ దాని స్థానంలో "నాన్ ఇంటర్ కోర్స్ చట్టము" (Non-Intercourse Act) అనే దాన్ని కాంగ్రెస్‌చేత జారీ చేయించాడు. బ్రిటన్, ఫ్రాన్స్‌లు మినహా ప్రపంచంలోని ఏ ఇతర దేశంలోనయినా, అమెరికనులు వ్యాపారం చేయవచ్చునని

ఈ చట్టం పేర్కొన్నది. బ్రిటన్ ఫ్రాన్స్ దేశాలతో వ్యాపార నిషేధం తొలగించడం విషయమై సంప్రతింపులు జరపడానికి అధ్యక్షునకు అధికారం ఇవ్వబడింది.

### 5.8 మేకన్స్ బిల్ నంబరు 2 :

నాన్ ఇంటర్ కోర్స్ చట్టాన్ని కూడ న్యూ ఇంగ్లండ్ వర్తకులు ఉల్లంఘించారు. అందుచేత కాంగ్రెస్ ఈ చట్టాన్ని గూడ రద్దు చేసి, దీనికి బదులుగా "మేకన్స్ బిల్ నంబరు2" (Macan's Bill Number Two) అనే చట్టాన్ని జారీ చేసింది. ఈ చట్టము, బ్రిటన్, ఫ్రాన్స్‌లతో వ్యాపారం అమెరికన్లు చేయడానికి అనుమతించింది. బ్రిటన్‌గాని, ఫ్రాన్స్‌గాని తమ దిగ్బంధ విధానాన్ని వదులుకున్నట్లయితే, ఆ దేశంతో అమెరికా తన వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకుంటుంది. దిగ్బంధ విధానాన్ని కొనసాగించే దేశంతో అమెరికా తన వ్యాపార నిషేధాన్ని కొనసాగిస్తుంది. ఈ చట్టము జారీ అయిన వెంటనే నెపోలియన్ 1810లో, అమెరికన్‌ల తటస్థ రాజ్య హక్కులలో జోక్యం కలుగజేసుకోనని ప్రకటించాడు. తత్కారణంగా మాడిసన్ బ్రిటన్‌తో వాణిజ్య సంబంధాలు నిలిపివేసినట్లు ప్రకటించాడు. కాని నెపోలియన్ తన వాగ్దానానికి కట్టుబడి ఉండక అమెరికా తటస్థ హక్కులను నిర్లక్ష్యం చేసి ముందువలెనే ప్రవర్తించసాగాడు.

### 5.9 వార్ హాక్స్ :

క్రీ.శ. 18.12 సంవత్సరం యుద్ధం జరగడానికి హేతువు కేవలం బ్రిటన్, సంయుక్త రాష్ట్రాల తటస్థ దేశహక్కులను ఉల్లంఘించడమే గాక పశ్చిమ సరిహద్దు ప్రాంతం వారు ఇంకా పశ్చిమంగా విస్తరించవలెనని ఉబలాట పడుతూ ఉండగా బ్రిటన్ ఆ కార్యక్రమానికి అంతరాయం కలిగించడం. బ్రిటన్‌పై శత్రుత్వ భావాన్ని పెంపొందించినవారు దేశ పశ్చిమ సరిహద్దు ప్రాంతం నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికైన సభ్యులు. వీరికే "వార్‌హాక్స్" అని పేరు. వీరి నాయకుడు హెన్రీక్లే, ఇతడు ప్రజా ప్రతినిధుల సభలో స్పీకరుగా ఎన్నికయినాడు. పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో అమెరికన్‌లకు, రెడ్ ఇండియన్‌లకు మధ్య తరచు ఘర్షణలు జరుగుతూ ఉండేవి. ఈ ఘర్షణ విషయంలో ఇండియన్‌లను ప్రేరేపించినవారు కెనడాలో నివసిస్తున్న బ్రిటీష్ వారని వార్ హాక్స్ అభిప్రాయం. తెకంసే (Tecumseh) అనే రెడ్ ఇండియన్ నాయకుడు వాయవ్య ప్రాంతంలోను, దక్షిణ ప్రాంతంలోనూ ఉన్న ఎన్నో తెగల రెడ్ ఇండియన్‌లను కూడగట్టుకొని నవంబరు 1811లో ఇండియానా రాష్ట్ర గవర్నర్ విలియమ్ హెన్రీ హారిసన్‌ను ఎదిరించాడు. తెకంసె బ్రిటీష్ వారి సహాయం లేనిదే అంత సాహసానికి పూనుకోడని పశ్చిమ ప్రాంతం వారి అభిప్రాయం. బ్రిటన్‌తో యుద్ధం సంభవిస్తే కెనడాను పొందవచ్చునని, అంతేకాక బ్రిటన్‌కు మిత్ర రాజ్యమయిన స్పెయిన్‌నుంచి ఫ్లొరిడాను కూడా సంపాదించవచ్చునని పశ్చిమ ప్రాంతాలవారి పథకము.

వార్ హాక్స్, ముఖ్యంగా హెన్రీక్లే ఒత్తిడి ఫలితంగాను, బ్రిటన్‌తో తటస్థ హక్కుల విషయమై సామరస్యం కుదరనందువల్లనూ చివరకు జూన్ 18, 1812న అమెరికన్ కాంగ్రెస్ తటస్థ హక్కులకు భంగం కలుగుతున్న కారణంగా బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించింది. ఈ తేదీకి రెండు రోజుల ముందు బ్రిటన్ ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్‌ను రద్దు చేసినట్లు ప్రకటించింది. దురదృష్టవశాత్తు ఆ సమాచారము అమెరికాకు అందే లోపలనే అమెరికన్ కాంగ్రెస్ యుద్ధం ప్రకటించడం జరిగింది.

### 5.10 1812 ఎన్నికలు :

1812 వ సంవత్సరంలో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో బ్రిటన్ మీద యుద్ధ ప్రకటన విషయమై రిపబ్లికన్ పార్టీలోనే భేదాభిప్రాయాలు ఏర్పడి పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఔత్తరాహులైన కొంతమంది రిపబ్లికన్లు బ్రిటన్‌తో యుద్ధాన్ని వ్యతిరేకించి న్యూయార్క్‌కు చెందిన డివిట్ క్లింటన్ (De witt Clinton) తమ అభ్యర్థిగా పోటీ చేయించారు. యుద్ధాన్ని సమర్థించిన రిపబ్లికన్‌లు మాడిసన్ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. ఫెడరలిస్ట్ పార్టీ ఈ ఎన్నికలలో పాల్గొనలేదు. న్యూ ఇంగ్లండ్, మధ్య రాష్ట్రాలవారు క్లింటన్‌ని, దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల వారు మాడిసన్‌ని బలపరిచారు. ఈ ఎన్నికలో మాడిసన్‌కు 128, క్లింటన్‌కు 89 ఓట్లు వచ్చాయి.

### 5.11. అమెరికా సంసిద్ధత :

యుద్ధం చేయడానికి కావలసిన సాధన సంపత్తి, ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ అమెరికా బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించింది. ఫెడరల్ సైన్యం సంఖ్య 7000 కన్నా తక్కువగానే వుంది. సైన్యాధికారులు అమెరికన్ విప్లవ కాలం నాటికి చెందిన వయోవృద్ధులు. యుద్ధ

నౌకల సంఖ్య చాలా తక్కువ. యుద్ధము ప్రారంభమయిన తరువాత ఫెడరల్ ప్రభుత్వము వివిధ రాష్ట్రాల సైన్యాలనుంచి నాలుగు లక్షల మంది సైనికులను ఫెడరల్ సైన్యంలో చేరమని కోరింది. వారిలో చాలా మంది ఈ కోరికను ఖాతరు చేయలేదు. ఫెడరల్ సైన్యంలో చేరిన చాలామంది సైనికాధికారులపట్ల అవిధేయంగా ఉండటమో లేదా పారిపోవడమో జరిగేది.

అమెరికావద్ద యుద్ధ ఖర్చులకు చాలినంత ధనంలేకపోయింది. అందుచేత ఖర్చులో మూడింట ఒక వంతు భాగాన్ని ఫెడరల్ ప్రభుత్వము పన్నుల ద్వారా రాబట్టింది. మిగతా రెండు వంతుల ధనాన్ని ధనికులవద్ద నుంచి ప్రభుత్వము అప్పుకోరింది. కాని చాలా మంది ధనికులు యుద్ధాన్ని వ్యతిరేకించి ఋణ మివ్వడానికి నిరాకరించారు. 1811 నాటికి "బాంక్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్" కాలపరిమితి ముగిసినందువల్ల అది రద్దయింది. ఈ బాంక్ ఉండే పక్షంలో ప్రభుత్వానికి యుద్ధ సమయంలో సహాయం లభించి ఉండేది. కోశాగార కార్యదర్శిగా ఉన్న గెలాటిన్ ఈ ఆర్థిక సమస్యలతో ఏదో విధంగా సతమతమైనప్పటికీ, యుద్ధానికి కావలసిన ధనాన్ని సమకూర్చగలిగాడు. యుద్ధం ముగిసే నాటికి ప్రభుత్వం దివాలా తీసే పరిస్థితులలో ఉంది.

## 5.12 యుద్ధగమనం :

క్రీ.శ. 1812-1813 సంవత్సరాలలో బ్రిటన్ ఐరోపా యుద్ధాలలో తలమునకలై వుంది. ఆకారణంగా చెప్పుకోదగ్గ సంఖ్యలో సైనికులను అమెరికాకు చేరవేయలేక పోయింది. కెనడాలో వున్న సైన్యము, స్థానిక కెనడా సైన్యము కలిసి అమెరికన్ సైన్యాన్ని ఓడించగలదని ఆశాభావం బ్రిటన్‌కు వుంది. 1812వ సంవత్సరంలో అమెరికన్ సైన్యము లేక్ ఛాంప్లెయిన్ (Lake Champlain) నయాగరా (Niagara), డెట్రాయిట్ (Detroit),ల మార్గంలో కెనడాను ముట్టడించవలెనని ప్రయత్నించింది. కాని ఈ ప్రయత్నం విఫలమయింది. పైగా బ్రిటిష్ సైన్యము మిచిగన్ (Michigan)లో ప్రవేశించి డెట్రాయిట్‌ను స్వాధీనం చేసుకొని తెకంసే వర్గ సహకారం పొందింది.

క్రీ.శ. 1813లో అమెరికన్ కెప్టెన్ ఆలివర్ హెజార్డ్ పెర్రీ (Oliver Hazard Perry) లేక్ ఈరీ (Lake Erie) ని స్వాధీనం చేసుకొన్నాడు. అదే సంవత్సరంలో విలియం హెన్రీ హారిసన్ (William Henry Harrison) డెట్రాయిట్ నుంచి అంటేరియా (Ontario) వరకు బ్రిటిష్ వారిని తరిమికొట్టి థేమ్స్ (Thames) యుద్ధ రంగంలో వారిని ఓడించాడు. ఈ యుద్ధంలోనే తెకంసే మరణించాడు. కానీ, నయాగరా, లేక్ ఛాంప్లెయిన్‌ల నుంచి కెనడాను జయించడానికి వెళ్ళిన అమెరికన్ సైన్యాన్ని తరిమికొట్టడమయింది. 1814వ సంవత్సరంలో వృద్ధులయిన విప్లవ కాలపు అధికారుల స్థానంలో కొంతమంది యువ సైన్యాధికారులు తర్ఫీదయి సమర రంగంలో ప్రవేశించారు. ఈలోపుగా ఐరోపా యుద్ధ రంగాలలో నెపోలియన్ పూర్తిగా ఓడిపోయాడు. ఐరోపాలో యుద్ధం ముగియగానే బ్రిటన్ అధిక సంఖ్యలో తన సైన్యాన్ని చేరవేసింది. 1814లో బ్రిటీష్ సైన్యము ఛాంప్లెయిన్ మార్గం ద్వారా న్యూయార్క్‌ను ముట్టడించ ప్రయత్నించింది. కాని ఈ ప్రయత్నం విఫలంకాగా తన సైన్యము కెనడాకు మళ్లి వెళ్ళింది. కెనడా సరిహద్దులో జరిగిన యుద్ధ రంగాలలో జయాపజయాలు రెండు వైపుల సమ పాళ్ళలోనే ఉన్నాయని చెప్పవచ్చును.

**సముద్ర ప్రాంత యుద్ధము :** అమెరికన్ నౌకాదళము సముద్ర ప్రాంత యుద్ధాల తొలిదశలో కొన్ని విజయాలు సాధించింది. విప్లవం రోజులలో మాదిరిగా అమెరికన్‌లు బ్రిటిష్ వాణిజ్యం మీద దెబ్బతీశారు. కాని 1813లో పటిష్టమైన బ్రిటిష్ నౌకాదళము అమెరికాచేరి అట్లాంటిక్ కోస్తా ప్రాంతాన్ని దిగ్బంధం చేసింది. 1814లో బ్రిటీష్ నౌకాదళము చెసాపీక్ అఖాతాన్ని (Chesapeake Bay) ముట్టడించింది. అక్కడవున్న అమెరికన్ నౌకాదళాన్ని ఓడించి బ్రిటిష్ నౌకాదళము వాషింగ్టన్ పట్టణాన్ని ప్రవేశించింది. బ్రిటిష్ వారు వాషింగ్టన్‌లో విధ్వంసక చర్యలకు పూనుకొన్నారు. రాజధాని నగరాన్ని, అధ్యక్ష నివాస భవనాన్ని, ఇతర ప్రభుత్వ భవనాలను తగలబెట్టారు. మాడిసన్ కొంతమంది కార్యదర్శులు ప్రాణ రక్షణార్థం ఎక్కడో తలదాచుకోవలసి వచ్చింది. దీనికి ముందు అమెరికన్‌లు కెనడాలోని యార్క్ ప్రస్తుతం టొరొంటో పట్టణాన్ని ముట్టడించి కెనడా పార్లమెంట్ భవనాన్ని ఇతర ప్రభుత్వ భవనాలను ధ్వంసంచేసారు. ఒక విధంగా వాషింగ్టన్‌లో జరిగిన విధ్వంసక చర్యలు బ్రిటీష్‌వారి ప్రతీకార చర్యలని చెప్పవచ్చు. ఈ చర్యలు బ్రిటిష్ వారికి సైతం విభ్రాంతి కలిగించినాయి.

ఆ తరువాత బ్రిటిష్ వారు బాల్టిమోర్ పట్టణాన్ని ముట్టడించ ప్రయత్నించి విఫలమైయ్యారు. ఈ పరాజయం తరువాత బ్రిటిష్‌వారు చెసాపీక్ యుద్ధ ఘట్టానికి స్వస్తి చెప్పి వెళ్ళారు. ఈ యుద్ధ ఘట్టము అమెరికన్‌లకు అవమానకరమైనదైనప్పటికీ, బ్రిటిష్ వారికి ఘన విజయాలను సాధించి పెట్టలేదని చెప్పవచ్చును.

**దక్షిణ ప్రాంతంలో యుద్ధం :** దక్షిణ ప్రాంతంలో అమెరికన్ సైనికులు తమ శక్తి సామర్థ్యాలు చక్కగా ప్రదర్శించారు. ఈ ప్రాంతంలో విజయాలను సాధించిన ఘనత ఆండ్రూ జాక్సన్ (Andrew Jackson) కు దక్కుతుంది. మిసిసిపి ప్రాంతంలో నివసిస్తున్న క్రీక్ (Creek) ఇండియన్‌లు తెకంసే ప్రోత్సాహంతో 1813లో ఆ ప్రాంతం అమెరికన్‌లపై దాడులు జరిపారు. టెన్నెసీ సైన్యమునకు నాయకుడుగా ఉన్న జాక్సన్ తన సైన్యంతో వెంటనే ఇండియన్‌లను చుట్టు ముట్టాడు. అనేక మాసాలపాటు కొనసాగిన తీవ్ర సంఘర్షణ తరువాత జాక్సన్ హార్స్ షూ బెండ్ యుద్ధరంగం (The Battle of Horse Shoe Bend) లో క్రీక్ ఇండియన్‌లను చిత్తుగా ఓడించాడు. ఈ విజయం ఫలితంగా క్రీక్ ఇండియన్‌లు అలబమాలో తమ స్వాధీనంలో వున్న భూభాగమంతటినీ అమెరికన్‌లకు ఇచ్చేసారు. హారిసన్ వాయవ్య ప్రాంతంలోని ఇండియన్‌లను అణచివేసినట్లే జాక్సన్ నైరుతి ప్రాంత ఇండియన్‌లను అదుపులోకి తెచ్చాడు. ఈ విజయం తరువాత జాక్సన్ నైరుతి ప్రాంత కేంద్ర సైన్యానికి నాయకుడుగా నియమితుడయినాడు.

**న్యూ ఆర్లియన్స్ యుద్ధము :** న్యూ ఆర్లియన్స్ 1814 హేమంతంలో (autumn) జరిగింది. పదివేలమంది బ్రిటిష్ యోధులు జమైకా నుంచి మెక్సికో అఖాతాన్నిచేరారు. వీరంతా ఐరోపా యుద్ధ రంగాలలో తమ ప్రతిభచూపి, పేరు పొందినవారు. వీరు న్యూ ఆర్లియన్స్‌ను ముట్టడించారు. న్యూ ఆర్లియన్స్ దగ్గర జాక్సన్ తన సైన్యంతో జాగరూకత వహించి ఉన్నాడు. ఇక్కడ జనవరి 1815న జరిగిన యుద్ధంలో రెండువేల మంది బ్రిటిష్ సైనికులు నేలకూలారు. జాక్సన్ సైనికులలో మరణించిన వారి సంఖ్య కేవలం 21 మాత్రమే.

ఈ యుద్ధం జరిగిన తేదీకి 61 రోజుల ముందే - అంటే డిసెంబరు 24, 1814వ తేదీన బ్రిటన్‌కు అమెరికాకు ఘెంట్ (Ghent) (బెల్జియంలో) సంధి జరిగింది. కానీ ఈ సంధి వార్త అమెరికాకు చేరకముందే న్యూ ఆర్లియన్స్ యుద్ధం జరిగి బ్రిటిష్ సైన్యంలో అపారమైన నష్టం సంభవించింది. న్యూ ఆర్లియన్స్ యుద్ధ రంగము, జాక్సన్‌కు కీర్తి సంపాదించి పెట్టడమే గాక భవిష్యత్తులో అధ్యక్ష పదవిని అలంకరించే ఒక గొప్ప వ్యక్తిని వెలుగులోకి తెచ్చింది.

## 5.13 ఘెంట్ సంధి, ఆగష్టు 1814 :

ఆగష్టు 1814లో ఘెంట్ శాంతి సమావేశము ప్రారంభమయింది. అమెరికా తరపున పాల్గొన్న దౌత్య వర్గంలో ఆల్బర్ట్ గెలాటిన్, జాన్‌క్విన్సీ ఆడమ్స్, హెన్రీక్లే ప్రముఖులు బ్రిటీష్ దౌత్యవర్గం ఘెంట్ సమావేశ ప్రారంభంలో కొన్ని ప్రతిపాదనలు చేసింది. అమెరికన్‌లు, మెయిన్, న్యూయార్క్‌లలో, లేక్ సుపీరియర్, మిసిసిపిల మధ్య భాగంలో కొంత భూభాగాన్ని బ్రిటన్‌కు దత్తం చేయవలెనని, అమెరికా వాయవ్య ప్రాంతంలో కొంత భాగాన్ని శాశ్వతంగా ఇండియన్‌లకిచ్చి వేయవలెనని షరతులు పెట్టారు. అమెరికన్ దౌత్య వర్గం ఈ షరతులు తోసిపుచ్చారు.

ఈ షరతులపై చర్చలు జరుగుతున్న సమయంలోనే లేక్ ఛాంప్లెయిన్, బాల్టిమోర్‌లలో అమెరికన్‌లు విజయాలు సాధించినారన్న వార్తలు అందాయి. బ్రిటన్ అప్పటికే యుద్ధమంటే విముఖత తెలుపసాగింది. అప్పటికి దాదాపు ఇరవై సంవత్సరాలుగా బ్రిటన్, ఫ్రెంచి విప్లవ కారులతోను, ఆ తరువాత నెపోలియన్‌తోను యుద్ధం కొనసాగిస్తున్నది. ఈ సుదీర్ఘ యుద్ధాలు బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బతీసాయి. బ్రిటీష్ పౌరులు ప్రభుత్వానికి ఎక్కువ పన్నులు చెల్లించలేక కష్టాలు పడుతూ ఉండేవారు. ఈ పరిస్థితులలో బ్రిటన్ ఏదో విధంగా అమెరికాతో సంధి కుదుర్చుకోవలెనని నిశ్చయించింది. డిసెంబరు 24, 1814న సంధి పత్రంపై సంతకాలు అయ్యాయి.

దీని ప్రకారం రెండు పక్షాల వారు యుద్ధ సమయంలో ఆక్రమించుకొన్న భూభాగాన్ని స్వంత దారులకు తిరిగిఇచ్చి వేయాలి. బ్రిటన్‌కు విధేయులుగా ఉన్న రెడ్ ఇండియన్‌లు అమెరికానుంచి 1811లో వారికి (ఇండియన్‌లకు) హక్కు ఉన్న ప్రాంతాలను తిరిగి పొంద వచ్చు. ఈ సంధి పత్రంలో 'ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్'ను గురించిగాని, ఇమ్‌ప్రెస్‌మెంట్" పద్ధతి గురించిగాని ఏమీ పేర్కొనలేదు. కాని రెండు దేశాలమధ్య ఉన్న ఇతర చిన్న చిన్న తగాదాలు సంధి సమావేశం తరవాత జాయింట్ కమిషన్స్ ద్వారా పరిష్కరించుకొనే అవకాశం కలిగింది.

## 5.14 హార్ట్ ఫోర్డ్ సమావేశము :

ఘెంట్ శాంతి సంభాషణలు కొనసాగుతున్న తరుణంలో న్యూ ఇంగ్లండ్ రాష్ట్రాలకు చెందిన కొంతమంది, ఫెడరలిస్ట్ నాయకులు సంయుక్త రాష్ట్రాలనుంచి విడిపోవలెననే (Secession) ఉద్దేశంతో కనెక్టికట్ రాష్ట్రంలోని హార్ట్‌ఫోర్డ్ దగ్గర సమావేశమయ్యారు. వీరు బ్రిటన్‌తో వాణిజ్య సంబంధాలకు అంతరాయం కలిగించిన 1812 యుద్ధాన్ని వ్యతిరేకించారు. ఈ యుద్ధం పశ్చిమ ప్రాంతం వారి పురోభివృద్ధికి దోహదకారి అని భావించారు. వీరు తమ రాష్ట్రాల సైన్యాన్ని (Militia) యుద్ధ సమయంలో ఫెడరల్ ప్రభుత్వం ఆధీనంలో ఉంచటానికి నిరాకరించారు. ఈ రాష్ట్రాల వర్తకులు యుద్ధ సమయంలో బ్రిటిష్ సైన్య నౌకాదళాలతో వ్యాపారం కొనసాగించారు. అంతే కాకుండా ఆ రాష్ట్రాల రాజకీయ నాయకులు వర్జీనియా, కెంటకీ తీర్మానాలను తలదన్నే రీతిలో ఫెడరల్ ప్రభుత్వ చర్యలను రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించ వచ్చు అనే విధానాన్ని ఏక కంఠంతో చాటారు.

హార్ట్ ఫోర్ట్ సమావేశం ప్రారంభమయ్యే సమయానికి యుద్ధం ముగిసింది. కాని సమావేశంలో పాల్గొన్న సభ్యులు సంయుక్త రాష్ట్రాల నుంచి విడిపోయే విషయాన్ని చర్చించక రాజ్యాంగ చట్టాన్ని సవరించడానికి కొన్ని సవరణలు ప్రతిపాదించారు. యుద్ధం ప్రకటించే విషయంలోను, నిషేధాలు (Embargo) విధించడంలోను, కొత్త రాష్ట్రాలను యూనియన్‌లో చేర్చుకొనే విషయంలోను కాంగ్రెస్ అధికారాలపై కొన్ని హద్దులు విధించవలెనని ఈ సవరణల సారాంశము. ఈ సమావేశ నివేదిక రాజధాని వాషింగ్టన్‌కు చేరేనాటికే న్యూ ఆర్లియన్స్ యుద్ధ రంగంలో అమెరికన్ల విజయము, ఘెంట్ సంధి విషయాలు గురించిన వార్తలు చేరాయి. విజయోత్సాహంలో అధ్యక్షుడు మాడిసన్ ఈ నివేదికను ఖాతరు చేయలేదు.

## 5.15 1812 వ సంవత్సర యుద్ధ ఫలితాలు :

1812వ సంవత్సర యుద్ధం ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని కొన్ని సత్ఫలితాలను సంయుక్త రాష్ట్రాలకు ప్రసాదించింది.

1) ఈ యుద్ధం వల్ల సంయుక్త రాష్ట్రాలు శక్తి సామర్థ్యాలున్నదేశమని బలహీనమైనది కాదని ఐరోపా గుర్తించింది. పందొమ్మిదో శతాబ్ద శేష భాగంలో సంయుక్త రాష్ట్రాల వ్యవహారాలలో ఐరోపా జోక్యం చేసుకొనకుండ ఉండటానికి ఇది ఒక కారణము.

2) ఈ యుద్ధము అమెరికన్‌లలో జాతీయతా భావాన్ని (Nationalism) విదేశీ వ్యవహారాలలో ఏకాంత (Isolationism) విధానాన్ని పెంపొందించింది. ఈ యుద్ధం ముగిసే వరకు అమెరికన్ రాజకీయ పార్టీలు బ్రిటన్‌నో, ఫ్రాన్స్‌నో సమర్థిస్తూ ఉండేవి. కాని యుద్ధం తరువాత వాషింగ్టన్, జఫరన్స్‌లు ఆశించిన ఏకాంత విధానాన్ని ఆచరణలో పెట్టే పరిస్థితులేర్పడినాయి. ఇదిగాక 1815-1914 మధ్య కాలంలో ఐరోపాలో ఏ చిన్న యుద్ధాలు జరిగినా అవి అమెరికా శాంతి భద్రతలకు అంతరాయం కలిగించలేదు. అందువల్ల ఐరోపాలోని తగాదాలలో అమెరికా తలదూర్చవలసిన అగత్యం లేకపోయింది.

3) అమెరికా (సంయుక్త రాష్ట్రాలు) పశ్చిమ ప్రాంతం వారికి ఈ యుద్ధము సత్ఫలితాలను ప్రసాదించింది. థేమ్స్, హార్స్, షూబెండ్ యుద్ధ రంగాలలో అమెరికన్‌లు రెడ్ ఇండియన్‌లను ఓడించి విజయం పొందారు. దీని ఫలితంగా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో శాంతి స్థాపన జరిగి అమెరికన్‌లకు రెడ్ ఇండియన్ల బెడద ఒక తరం వరకు తొలగిపోయింది. పశ్చిమ దిశకు విస్తరణ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించుకోడానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే విధంగా అమెరికన్‌లకు బ్రిటిష్ వారికి మధ్య కుదిరిన సామరస్యమైన ఘెంట్ సంధి ఉత్తర సరిహద్దు ప్రాంతం (కెనడా)లో కూడ శాంతికి దోహదం చేసింది.

4) నౌకా చట్టాలను గురించి సంయుక్త రాష్ట్రాలు కోరిన విధంగా సంధిలో ఒప్పందం కుదరనప్పటికీ దేశ భవిష్యత్తులో అమెరికా ఏ విధంగానూ నష్టపోలేదు. ఎందువల్లనంటే 1812 తరువాత పందొమ్మిదో శతాబ్దం అంతం వరకు ఐరోపాలో చెప్పుకోదగ్గ పెద్ద యుద్ధాలేవీ జరగలేదు. అమెరికాలో జరిగిన అంతర్యుద్ధ (Civilwar) కాలంలో బ్రిటన్ తటస్థంగా ఉండటం వల్ల అమెరికాకు మేలేజరిగింది. అంతర్జాతీయ చట్టాన్ని (International Law) ఘెంట్ సంధిలో బ్రిటన్ వ్యాఖ్యానించిన తీరు భవిష్యత్‌లో అమెరికాకు లాభదాయకంగానే పరిణమించింది.

5) ఆర్థికంగా కూడా ఈ యుద్ధం కొన్ని సత్ఫలితాలను ప్రసాదించింది. నిషేధ (ఎమ్‌బార్గో) చట్టం వల్ల, నాన్ ఇన్‌టర్ కోర్స్ చట్టంవల్ల, 1812 యుద్ధాలవల్ల ఇతర దేశాలనుంచి సరకులు దిగుమతిచేసుకోవడం కష్ట తరమయింది. తమ కవసరమయిన వస్తువులను తామే తయారుచేసుకొంటే తమ కాళ్ళ మీద తాము నిలబడతామన్న ఆత్మ విశ్వాసం అమెరికన్‌లలో కలిగింది. ఈ లక్ష్యాన్ని సాధించి నట్లయితే ఏ కాంత విధానాన్ని తాము నిర్విఘ్నంగా పాటించవచ్చునని నిశ్చయించుకొన్నారు. ఈ పరిస్థితులలో అమెరికన్‌లు అనేకులు కర్మాగారాలు నెలకొల్పి వస్తూత్పత్తి చేయడానికి కంకణం కట్టుకొన్నారు. ఈ విధంగా అమెరికా క్రమ క్రమంగా గొప్ప పారిశ్రామిక దేశంగా రూపొందింది.

6) బ్రిటిష్ నౌకాదళం బాల్టిమోర్ మీద దాడిజరిపింది. పట్టణానికి రక్షణగా ఉన్న మెక్ హెన్రీ కోటమీద ఫిరంగులు పేల్చింది. కోట మాత్రం చెక్కు చెదరలేదు. ఒక బ్రిటిష్ నౌకపై బందీగావున్న మేరీలాండ్ లాయర్, ఫ్రాన్సిస్ స్కాట్‌కే, ఈ దృశ్యం చూసి ఉత్తేజితుడై "ది స్టార్ శ్పాంగిల్డ్ బానర్" అనే గేయం వ్రాశాడు.

ఈ యుద్ధం ద్వారా, దేశ ప్రజల అవసరాలను గుర్తించి ఆమెరికా ప్రభుత్వము దేశంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ రహదార్లు నిర్మించింది. ఈ చర్య దేశంలోని వివిధ వర్గాలను సంఘటితపరచడానికి కూడా ఉద్దేశించింది. దేశ రక్షణ కోసం సైన్య, నౌకా బలాల సంఖ్యను పెంచడం కూడా ఈ తరుణంలోనే జరిగింది. స్వదేశీ వస్తువులు సులభంగా అమ్ముడు పోవడం కోసం విదేశీ వస్తువులపైన విపరీతమైన సుంకాలు విధించారు. దేశ కరెన్సీ నిలకడగాను, దేశమంతటా ఒకే రూపం (Uniform)లో ఉండటానికి సంయుక్త రాష్ట్రాల రెండో జాతీయ బాంకు స్థాపితమయింది. పశ్చిమ ప్రాంతాల విషయమై దేశం నిర్లక్ష్యం చేయడంలేదనే నమ్మకం కలిగించడానికి ఆ ప్రాంతాలలో కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేయడమయింది. 1812 యుద్ధం తరువాత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఆధిక్యాన్ని తేటతెల్లం చేస్తూ సుప్రీంకోర్టు చాలా తీర్పులు ఇచ్చింది.

1812 సంవత్సర యుద్ధమైన కొద్ది కాలానికే అమెరికా ఏకాంత విధానాన్ని అవలంభించ మొదలుపెట్టింది. 1814లో మొదలయిన ఈ ఏకాంత విధానము దాదాపు ఒక శతాబ్ద పర్యంతం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. దీనికి 1816లో అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడైన జేమ్స్ మన్రో సిద్ధాంతం కీలకమై నిలిచింది.

1812 వ సంవత్సర యుద్ధం వల్ల దేశంలో ఐకమత్యం, జాతీయ భావం పెంపొందాయి. దీర్ఘ కాలం కోశాగార మంత్రిగా ఉన్న ఆల్బర్ట్ గెలాటిన్ యుద్ధ ప్రభావాన్ని ఈ విధంగా తెలియ జేసారు. యుద్ధానికి పూర్వం అమెరికన్లలో ప్రాంతీయాభిమానం ఎక్కువగా వుండేది. "విప్లవం ప్రసాదించిన జాతీయ భావం అంతకంతకు సన్నగిల్లుతున్నప్పుడు, యుద్ధం వచ్చి దాన్ని బలపరిచింది. ప్రజల అనుబంధాన్ని బలపరిచే సార్వజనీనాంశాలు ఇప్పుడు ఎక్కువయ్యాయి. వారి ఆత్మ గౌరవం, రాజకీయ భావాలు వాటితో ముడిపడి వున్నాయి. ప్రజలలో అమెరికన్‌లమన్న భావం ఎక్కువైంది. తామొకే జాతి ప్రజగా భావిస్తున్నారు. నడచుకుంటున్నారు. అందువల్ల యూనియన్ శాశ్వతంగా సురక్షితంగా నిలబడగలదని నా ఆశ."

### 5.16 సమీక్ష :

కొందరు అమెరికన్లు ఈ యుద్ధం ఒక దురదృష్టకర సంఘటనగా భావించారు. యుద్ధానికి హేతువుగా తెలిపిన ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్ యుద్ధ ప్రకటనకు రెండు రోజుల ముందే తొలగించబడ్డాయి దేశ రాజధాని అయిన వాషింగ్టన్ నగరము, అధ్యక్షుడైన మాడిసన్ అవమానకర పరిస్థితులను యుద్ధగమనంలో ఎదుర్కొన్నారు. ఘెంట్ సంధి జరిగిన తర్వాత న్యూ ఆర్లేన్స్ యుద్ధం జరగడం కూడా విమర్శకు గురైంది.

బ్రిటన్‌పై సాధించిన మరో విజయంగాను, అమెరికా ప్రతిపాదించిన తటస్థ దేశ హక్కుల నిమిత్తము జరిగిన యుద్ధంగానూ ఈ 812వ సంవత్సరపు యుద్ధాన్ని చరిత్రకారులు భావిస్తున్నారు.

## అభ్యాసాలు :

1) 1812 యుద్ధ కారణాలను వ్రాయుము
2) 1812 యుద్ధ గమనమును వివరింపుము
3) 1812 యుద్ధ ఫలితాలను వ్రాయుము
4) 1812 సంవత్సర సంఘటనను ఏ విధంగా భావిస్తారు.

## ఆధార గ్రంథాలు :


1) Henry Bamford Parkes : The United States of America
2) Thomas A Bailey : The American Pageant
3) C.P. Hill : History of the United States
4) Patt & Drummond : Our Nation from its creation
5) David Donald : A History of American Life & Thought
6) Richard B Morris : Encyclopaedia of American History
7) Edward J. Colon (For the United States Information Service-Madras : America Charitra Sangraham
8) America Samyukta Rstrala Charitra : Telugu Academy Text



డా॥ కంరున్నిసా బేగం, ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.
చరిత్ర, పురాతత్త్వ శాఖ
నాగార్జున విశ్వ విద్యాలయం

పాఠం - 6

# మన్రో సిద్ధాంతం

## 6.1. లక్ష్యం

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఐదవ అధ్యక్షుడైన జేమ్స్ జీవిత విశేషాలను, మన్రో సిద్ధాంత ప్రతి పాదనకు దారితీసిన పరిస్థితులను, సిద్ధాంత వివరాలను, దాని ప్రభావాన్ని వివరించడం ఈ పాఠ్య లక్ష్యం.

## పాఠ్య నిర్మాణక్రమం

**6.1. లక్ష్యం**

**6.2 ఉపోద్ఘాతము**

**6.3 మన్రో జీవిత విశేషాలు**

**6.4 బ్రిటన్ తో అమెరికా సంబంధాలు**

**6.5 ఫ్లోరిడా కొనుగోలు**

**6.6 రష్యా చర్యలు**

**6.7 దక్షిణ అమెరికాలో స్వాతంత్రోద్యమాలు**

**6.8 మన్రో సిద్ధాంతం**

**6.9 మన్రో సిద్ధాంత ప్రభావము**

**6.10 సంగ్రహంగా**

## 6.2 ఉపోద్ఘాతము

వర్జీనియా రాష్ట్రానికి చెందిన జేమ్స్ మన్రో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఐదవ అధ్యక్షుడు. ఇతని పదవీ కాలం 1817 నుంచి 1825 వరకు కొనసాగింది. దేశంలో శాంతి భద్రతలను నెలకొలపడంతో బాటు ఇతడు విదేశాలతో సత్సంబంధాలు కలిగి యున్నాడు. అందు చేతనే ఇతని పదవీ కాలాన్ని "సుహృద్భావయుగం" (Era of Good Feelings) అని పిలుస్తారు. మన్రో తన విదేశాంగ విధానంలో ప్రవచించిన నూతన సిద్ధాంతం ద్వారా ప్రసిద్ధుడయ్యాడు. అమెరికా-ఐరోపాలలోని రాజకీయ వ్యవస్థలు భిన్న మైనవని, ఐరోపా దేశాలు తమ వ్యవస్థను విస్తరించ ప్రయత్నిస్తే, అది అమెరికా రక్షణకు ప్రమాదకరంగా పరిగణిస్తామని మన్రో ప్రకటించాడు. దక్షిణ అమెరికాలో స్వాతంత్ర్యం పొందిన దేశాలను అణచి వేయడానికి ఐరోపా దేశాలు ప్రయత్నిస్తే, ఆ చర్యని అమెరికాకి వ్యతిరేక చర్యగా భావిస్తామని మన్రో తెలిపాడు. ఈ సిద్ధాంత ఫలితంగా మన్రో పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. అమెరికా విదేశాంగ మంత్రి జాన్ క్విన్సీ ఆడమ్స్ ఈ సిద్ధాంతాన్ని పశ్చిమార్ధ గోళానికి దూరంగా ఉండమని ఐరోపాకు అమెరికా చేసిన హెచ్చరికగా ప్రకటించాడు.

## 6.3 మన్రో జీవిత విశేషాలు:

స్పెన్సర్ మన్రో, ఎలిజా జోన్స్ దంపతులకు జేమ్స్ మన్రో ఏప్రిల్ 28, 1758 న జన్మించాడు. అతని తల్లి దండ్రులిద్దరూ పేరు ప్రఖ్యాతలుగల వలస కుటుంబాలకు చెందిన వారు. మన్రో తన 18 వ సంవత్సరంలోనే చదువుని ఆపి లెఫ్టినెంట్‌గా సైన్యంలో చేరి, అమెరికా స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొన్నాడు. తరువాత న్యాయశాస్త్రం అధ్యయనం చేసాడు.

మన్రో 1782 లో మొట్ట మొదటగా రాజకీయాలలో ప్రవేశించి, వర్జీనియా రాష్ట్ర సభకు ఎన్నికయ్యాడు. మరుసటి సంవత్సరమే అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నుకోబడ్డాడు. రెండవ పర్యాయం వర్జీనియా రాష్ట్రశాసన సభకు 1786 లో ఎన్నుకోబడి, ఆ పదవిలో నాలుగు సంవత్సరాలు కొనసాగాడు. సెనేట్ సభ్యత్వాన్ని 1790 లో పొందాడు.

జార్జి వాషింగ్టన్ ఇతనిని 1794 లో ఫ్రాన్స్ దేశ రాయబారిగా నియమించాడు. రెండు సంవత్సరాల తరవాత స్వదేశం వచ్చిన మన్రో కాలక్రమేణా జెఫర్సన్‌కి అత్యంత సన్నిహితుడయ్యాడు. వర్జీనియా గవర్నరుగా మరో మూడు సంవత్సరాలు మన్రో కొనసాగాడు.

జెఫర్సన్ దేశాధ్యక్షునిగా ఉన్న కాలంలో మన్రోని లూసియానా కొనుగోలు నిమిత్తం ఫ్రాన్స్‌కి పంపాడు. రాబర్ట్ లివింగ్‌స్టన్, జేమ్స్ మన్రోలు కలిసి, విశాలమైన లూసియానా ప్రాంతాన్ని ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసే విషయంలో విజయం సాధించి, పేరు ప్రఖ్యాతులు సాధించారు.

మాడిసన్ అధ్యక్షునిగా ఉన్న కాలంలో మన్రో విదేశాంగ కార్యదర్శిగానూ యుద్ధ కార్యదర్శిగానూ పని చేసాడు. దేశాధ్యక్షునిగా 1816 ఎన్నికలలోనూ, 1820 ఎన్నికలలోనూ గెలుపొందాడు. విదేశాంగ కార్యదర్శి అయిన జాన్ క్విన్సీ ఆడమ్స్ రాజనీతిజ్ఞత, ఆండ్రూ జాక్సన్ పెరుగుదల జేమ్స్ మన్రో అధ్యక్ష పదవికి ఖ్యాతి తెచ్చాయి.

మన్రో ఆంతరంగిక విధానంలో ప్రముఖమైనది మిస్సోరీ ఒప్పందం. సమతుల్యత కోసం మెయిన్‌ని స్వేచ్ఛా రాష్ట్రంగానూ, మిస్సోరీని బానిస రాష్ట్రంగానూ ఒకేసారి యూనియన్‌లో చేర్చుకున్నాడు. ఈ విధంగా బానిసత్వ అంశం పై రగులుతున్న ఆందోళనను తాత్కాలికంగా ఆపగలిగాడు.

## 6.4 బ్రిటన్‌తో అమెరికా సంబంధాలు:

మన్రో అధ్యక్ష కాలంలో బ్రిటన్‌తో సత్సంబంధాలు కొనసాగాయి. ఘెంట్ సంధి వదిలిన అనేక అంశాలను, సమస్యలను శాంతి యుతంగా పరిష్కరించేందుకు మన్రో, ఆడమ్స్‌లు కృషి చేశారు. ఈ విషయంలో వీరికి, అమెరికాతో సత్సబంధాల విలువను గుర్తించిన బ్రిటిష్ విదేశీ కార్యదర్శి లార్డ్ కేసల్రీ, సహకారం కూడా అభించింది. అప్పటి నుంచి అమెరికా పశ్చిమ విస్తరణను నిరోధించేందుకుగాని స్థానిక ఇండియన్ల ప్రభుత్వ వ్యతిరేక కార్య కలాపాలకు మద్దతు నివ్వడంగాని బ్రిటన్ చేయలేదు.

అమెరికా, బ్రిటన్‌ల మధ్య 1817 లో రష్ -బేగాట్ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం ఈ రెండు దేశాలు తనిఖీల నిమిత్తం తప్ప, మిగిలిన సమయాలలో మహా సరస్సులలో (గ్రేట్‌లేక్స్) యుద్ధ నౌకలుంచరాదని తీర్మానించాయి. అయోరికా-బ్రిటన్‌ల ప్రతి నిధులతో కకూడిన సంయుక్త సంఘాలు అమెరికా-కెనడాల మధ్య ఖచ్చితమైన సరిహద్దు నిర్ణయించేందుకు చర్యలు ప్రారంభించాయి. లూసియానా కొనుగోలు వలన అమెరికా సరిహద్దు ఉత్తరాన మిసిసిపి నది నుండి రాకీ పర్వతాల వరకు విస్తరించింది. మెయిన్, న్యూబ్రన్స్‌విక్‌లు కలిసే ప్రాంతం తప్ప, పశ్చిమాన మహాసరస్సుల వరకు సరిహద్దు రేఖను నిర్ణయించడంలో సరిహద్దు సంఘాలు విజయవంతంగా పని పూర్తి చేసాయి. మహాసరస్సులకు పశ్చిమానగల రాకీ పర్వతాల వరకు సరిహద్దు రేఖను 49 వ సమాంతర రేఖగా 1818 నాటి ఒప్పందం నిర్ణయించింది. రాకీ పర్వతాలకు ఆవలి వైపు రష్యా ఆధీనంలోని అలాస్కా, స్పెయిన్ ఆధీనంలోని కాలిఫోర్నియాల మధ్య ఓ రెగాన్ ప్రాంతం ఉండేది. ఈ ప్రాంతంలోకి అమెరికా, బ్రిటన్ రెండు దేశాలకు చెందిన ప్రజలు వలసపోయి, నివాసం ఏర్పరచుకొనేందుకు అనుమతి ఇవ్వాలని అంగీకరించారు.

అమెరికన్లకు, కెనడా వాసులకు ఈ ఒప్పందాలు పరస్పర రక్షణను కలుగజేసాయి. అది క్రమేణా వారి మధ్య స్నేహానికి, సహకారానికి దారి తీసింది. ఆ తరువాత ఏభై సంవత్సరాలకు మహాసరస్సుల మీద, సరిహద్దు వెంబడి నిరాయుధీకరణ అమలు చేయడం జరిగింది. ఈ విధంగా అమెరికా, కెనడాల మధ్యగల సరిహద్దు, ప్రపంచంలోనే రక్షణ నిర్మాణాలులేని సుదీర్ఘమైన సరిహద్దుగా ప్రఖ్యాతి పొందింది.

## 6.5 ఫ్లోరిడా కొనగోలు

స్పెయిన్ ఆధీనంగల ఫ్లోరిడాను స్వాధీనం చేసుకోవాలని మన్రో ప్రభుత్వం నిర్ణయించింది. స్పెయిన్ ఆ సమయంలో శక్తిహీనమయిన దేశంగా ఉండేది. అందువల్ల ఆ దేశం నుండి అమెరికాకు ఎటువంటి ప్రమాదం లేదు. కాని స్పెయిన్ వలస అయిన ఫ్లోరిడా మాత్రం సమస్యగా మారింది. జార్జియా రాష్ట్రంలోని తోటల నుంచి పారిపోయి వచ్చిన బానిసలకు ఆశ్రయంగానూ, అమెరికా ప్రభుత్వ వ్యతిరేకులయిన ఇండియన్లకు బలమైన స్థావరంగానూ మారింది. సెమినోల్ ఇండియన్లు 1817 లో ప్రభుత్వానికి కష్టాలు కలిగించడం ప్రారంభించారు. మన్రో వారిని శిక్షించేందుకు ఆండ్రూ జాక్సన్‌ని పంపాడు. అవసరమైతే వారిని తరుముకుంటూ స్పెయిన్ ఆధీనంలోని ప్రాంతాల్లోకి ప్రవేశించమని కూడా జాక్సన్‌కు రహస్యంగా అధికారమిచ్చాడు. జాక్సన్ సెమినోల్ ఇండియన్లపై దాడిచేసి, వారిని ఫ్లోరిడా ప్రాంతంలోకి తరిమి వేశాడు. అంతేగాక స్పెయిన్‌కి చెందిన రెండు స్థావరాలను ఆక్రమించుకొని, స్పెయిన్ అధికారులను తొలగించాడు. ఈ సంఘటన దౌత్య సంక్షోభానికి దారితీసింది.

మన్రో ప్రభుత్వం జాక్సన్‌కి పూర్తి సహాయాన్నిచ్చింది. సరిహద్దుల్లో శాంతి భద్రతల వైఫల్యానికి స్పెయిన్‌దే పూర్తి బాధ్యతని స్పెయిన్‌ని నిందిస్తూ, జాన్ క్విన్సీ ఆడమ్స్ ఆదేశానికి ఘాటుగా ఉత్తరం రాసాడు. చివరకు స్పెయిన్ అంగీకరించి, అమెరికాతో 1819 లో ఆడమ్స్-ఓసిస్ సంధి చేసుకొంది. ఈ సంధిని 1821లో అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. ఈ సంధి ప్రకారం స్పెయిన్ ఫ్లోరిడాను అమెరికాకి 5,000,000 డాలర్లకు అమ్మివేసింది. అమెరికా తన వంతుగా టెక్సాస్ పై తనకు గల హక్కుని వదులు కొంది. పసిఫిక్ వరకు రెండు దేశాల స్వాధీనంలోని ప్రాంతాల సరిహద్దుని ఈ సంధి నిర్ణయించింది.

## 6.6 రష్యా చర్యలు

అమెరికా ప్రయోజనాలకు రష్యా నుంచి ముప్పు ఏర్పడింది. అలాస్కాలో పద్దెనిమిదవ శతాబ్దంలో వలస స్థాపించిన రష్యా ఇప్పుడు ఓరెగాన్ ప్రాంతంలో ఆసక్తి కనపరచడం ప్రారంభించింది. జార్ చక్రవర్తి 1821 లో రష్యా స్వాధీనంలోని ప్రాంతాన్ని 51 వ సమాంతర రేఖ వరకు విస్తరిస్తూ, తీరరేఖ నుంచి 160 కి.మీ. లోపలికి వచ్చేందుకు ఇతర దేశాలకి చెందిన నౌకలను నిషేధిస్తూ ప్రకటన జారీచేశాడు. దీనివలన మన్రో ప్రభుత్వం ఆందోళన చెందింది. ఎందుకంటే ఓరెగాన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని అమెరికా ప్రభుత్వం ఆసించింది. అంతేకాక రష్యా చర్యవల్ల, ఇదివరకే వాయవ్య పసిఫిక్ మహాసముద్రం ద్వారా అమెరికా చేసే చర్మ వ్యాపారానికి నష్టం కలుగుతోంది. వలస సామ్రాజ్యాలు, వాటి సముద్రయాన వాణిజ్య అడ్డంకులు, గుత్తాధిపత్యాలు ప్రగతికి ప్రతి బంధకాలని, అవి యుద్ధాన్ని ప్రేరేపిస్తాయని జాన్‌క్విన్సీ ఆడమ్స్ విశ్వసించాడు. అంతేగాక వాటినుంచి అమెరికా ఖండాన్ని విముక్తి చేసే సమయం ఆసన్నమైందని కూడా ఆడమ్స్ భావించాడు. ఇతడు 1821 లో ఒక ఉపన్యాసం చేస్తూ, కొంత వరకు రష్యాని ఉద్దేశిస్తూ, వలస నిషేధ సిద్ధాంతాన్ని ప్రకటించాడు. దీని ప్రకారం రెండు అమెరికా ఖండాలు ఇకముందు ఐరోపా రాజ్యాల వలస స్థాపనకు నిషిద్ధమని ప్రకటించాడు. దీనితో రష్యా 1824 లో దిగివచ్చి $54^0$ 40'.ని సరిహద్దుగా అంగీకరించింది. వలస నిషేధ సిద్ధాంతం ద్వారా జాన్ క్విన్సీ ఆడమ్స్ రాజనీతిజ్ఞత తెలుస్తోంది. ఆడమ్స్‌కి గల ఉన్నత విద్య, అనుభవం, సమర్ధత ఇందుకు దోహదపడ్డాయి.

## 6.7 దక్షిణ అమెరికా స్వాతంత్రోద్యమాలు

దక్షిణ అమెరికాలో జరుగుతున్న సంఘటనలు కూడా మన్రో సిద్దాంత ప్రకటనకు కారణమయ్యాయి. స్పెయిన్ వలసలలో నివసించే ప్రజలు గత పన్నెండు సంవత్సరాలుగా, స్వాతంత్ర్యం కొరకు పోరాటం జరుపుతూ, విజయం సాధించేందుకు దగ్గరయ్యారు. స్వాతంత్రోద్యమం ఈ దక్షిణ అమెరికా దేశాలలో 1810 లో ప్రారంభమయింది. నెపోలియన్ స్పెయిన్‌ని ఆక్రమించుకున్న కారణంగా ఈ ఉద్యమం బలపడింది. కాని నెపోలియన్ పతనం తరవాత స్పెయిన్ ప్రభుత్వం అట్లాంటిక్ సముద్రం మీదుగా సైనికులను పంపి, 1816 చివర నాటికి, తన వలసల మీద తిరిగి ఆధిపత్యాన్ని సంపాదించింది.

కాని వెనిజులాలో సైమన్ డి. బోలీవర్, అర్జెంటినాలో జోన్ డి. మార్టిన్ మొదలగు సమర్ధవంతులైన నాయకులు స్వాతంత్ర్య పోరాటాలను కొనసాగించారు. వీని ఫలితంగా దక్షిణ అమెరికాలో ఒక దేశం తరవాత మరొక దేశానికి వరుసగా వలస రాజ్యాల కబంధ హస్తాల నుంచి

విముక్తి లభించింది. 1822 నాటికి లాప్లాటా (అర్జంటినా), చిలీ, పెరూ, కొలంబియా, మెక్సికో దేశాలు స్వతంత్రమయ్యాయి. పోర్చుగీస్ వా ఆధీనంలోని బ్రెజిల్ స్వాతంత్ర్యం ప్రకటించుకొని 1824 నాటికి స్పెయిన్ సైన్యాన్ని అంతమొందించింది. కెనడా, అలాస్కా, గయానాల తప్ప మిగిలిన అమెరికా ఖండమంతా, ఐరోపా దేశాల ఆధీనం నుంచి విముక్తి పొందింది. నూతన ప్రపంచంలో క్యూబా, ప్యూర్టరికోలు మాత్రమే స్పెయిన్ వలసలుగా కొనసాగాయి.

దక్షిణ అమెరికాలోని స్వాతంత్ర ఉద్యమాలను బలపరచాలని అమెరికా నిర్ణయించుకుంది. దీనికి అనేక కారణాలున్నాయి. అమెరిక ఖండం నుంచి ఐరోపా సామ్రాజ్యవాదాన్ని బహిష్కరిస్తే, అమెరికా రక్షణ మెరుగవుతుంది; ఐరోపా లోని వర్గ పోరాటాలు, యుద్ధాల దూరంగా ఉండేందుకు అమెరికాకి సానుకూలత ఏర్పడుతుంది. కఠిన వాణిజ్య నిబంధనలను అమలుపరిచే స్పెయిన్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైతే దక్షిణ అమెరికాలోని విశాలమైన మార్కెట్లు అమెరికాకి కొత్తగా అభిస్తాయి. అంతేగాక ఇతర దేశాల్లో గణతంత్ర వ్యవస్థ విస్తరిస్తే అమెరికాల ఏర్పాటు చేసిన గణతంత్ర ప్రభుత్వానికి కొత్త శక్తి, హోదా లభిస్తాయని కూడా అమెరికా భావించింది. ఈ విధంగా సైనిక, దౌత్య, వాణిజ్య రాజకీయ, సైద్ధాంతిక కారణాల వలన దక్షిణ అమెరికా ప్రజల స్వాతంత్ర్యోమాలకు అమెరికా అనుకూల వైఖరి అవలంబించింది. జఫర్సన్ అతని మంత్రి వర్గం 1808 లోనే దక్షిణ అమెరికాలో విప్లవం వచ్చే అవకాశాన్ని గురించి, చర్చించింది. ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా ఐరోపా ప్రభావాన్ని అమెరికా ఖండంలో నాశనం చేసే ఏ ఉద్యమాన్ని అయినా అమెరికా ప్రోత్సహించాలనే నిర్ణయం తీసికొన్నారు.

కాని చాలా కాలం వరకు జెఫర్సన్ తీసికొన్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు అమెరికా ఏ చర్యా తీసికోలేదు. దక్షిణ అమెరికాలో జరి పోరాట తొలి దవల్లో అమెరికాకి బ్రిటన్‌తో పోరాటం జరుప వలసి వచ్చింది. ఆ తర్వాత ఫ్లొరిడా సంధిని కాంగ్రెస్ ఆమోదించే వరకు స్పెయిన్‌ని వ్యతిరేకం చేసుకోవడానికి మన్రో, ఆడమ్స్‌లు విముఖత చూపారు. ఈ లోగా అనేక ఉపన్యాసాల్లో హెన్రీ క్లే దక్షిణ అమెరిక దేశాలకు అమెరికా సహకారం అందించాలని వాదిస్తూ, ప్రజల ఉద్రేకాలను రెచ్చగొట్టాడు. దీని ఫలితంగా, 1822 లో మన్రో, ఆడమ్స్‌లు స్పెయిన్ నుంచి స్వతంత్రం పొందిన ఐదు దక్షిణ అమెరికా గణతంత్ర రాజ్యాలకు దౌత్యపరంగా గుర్తింపు ఇచ్చారు. అవి: లాప్లాటా, చిలీ, పెరూ, కొలంబియా, మెక్సికో దేశాలు. మొట్ట మొదటి సారిగా వారి స్వతంత్రను స్నేహ పూర్వకంగా గుర్తించినది అమెరికాయే.

దక్షిణ అమెరికా వ్యవహారాలో ఆసక్తి కలిగిన మరోక దేశం బ్రిటన్. బ్రిటిష్ ప్రభుత్వం గణతంత్ర వ్యవస్థ వ్యాప్తికి వ్యతిరేకత తెలిపింది అంతేగాక ఐరోపా నుండి నూతన ప్రపంచాన్ని వేరు చేస్తూ, ఐక్య అమెరికా వ్యవస్థ ఏర్పాటుని కూడా బ్రిటన్ వ్యతిరేకించింది. దీని ఫలితంగా అమెరికా ప్రభావాన్ని నిరోధించేందుకు బ్రిటన్ ఆసక్తి చూపింది. అంతేగాక ఆర్థిక ప్రయోజనాలను ఆశించి స్పెయిన్ వలస వ్యవస్థ విచ్ఛిన్నాన్ని కూడా బ్రిటన్ స్వాగతించింది.

బ్రిటన్, అమెరికాలు స్పెయిన్ అధీనంలో ఉన్న దక్షిణ అమెరికా దేశాల ప్రజలపై సానుభూతి చూపించాయి. కాని మిగిలిన ఐరోప దేశాలు స్పెయిన్ ప్రభుత్వాన్నే బలపరచాయి. నెపోలియన్ పతనానంతరం ఐరోపా పై పవిత్ర కూటమి (హోలీ అలయన్స్) సభ్యులయిన ఆస్ట్రియా, రష్యా, ప్రష్యాల ప్రాబల్యం అధికమైంది. ఉదారవాద విప్లవాత్మక ఉద్యమాలను అణచివేయడం, ప్రపంచంలో రాజరికాన్ని సుస్థిరం చేయడం పవిత్ర కూటమి లక్ష్యాలు. దక్షిణ అమెరికా దేశాలు స్పెయిన్ రాజుకి వ్యతిరేకంగా విప్లవాత్మక ఉద్యమాలు చేస్తున్నందున వాటిని అణచి వేయవలసిందిగా పవిత్ర కూటమి 1823 లో ఫ్రెంచి ప్రభుత్వానికి అధికారమిచ్చింది. స్పెయిన్ అధికారాన్ని తిరిగి ప్రతిష్ఠించడానికై ఫ్రాన్స్ తన సైన్యాలను దక్షిణ అమెరికాకు పంపుతుందని, దానికి ప్రతి ఫలంగా ప్రత్యేక వాణిజ్య హక్కులను, అవసరమైతే వలసను కూడా ఫ్రాన్స్ పొందేందుకు అవకాశం ఉందనే ఆందోళన అమెరికాలో ఏర్పడింది. ఈ విధంగా ఫ్రాన్స్ జోక్యం ఉండ వచ్చనే భయం కూడా మన్రో సిద్ధాంతానికి దారితీసింది.

## 6.8 మన్రో సిద్ధాంతం

దక్షిణ అమెరికా ఫ్రాన్స్ నియంత్రణలోనికి వచ్చే ప్రమాదముందని బ్రిటన్ ఆందోళన చెందింది. దీని ఫలితంగా 1822 లో కాసల్‌రీ తరవాత బ్రిటన్ విదేశీ కార్యదర్శి పదవిని పొందిన జార్జి కానింగ్ అమెరికాకి ఒక సూచన చేసాడు. అమెరికా రాయబారి రిచర్డ్ రష్‌తో ఆగస్ట్

1823 న సంభాషిస్తూ, దక్షిణ అమెరికాలో ఫ్రాన్స్ జోక్యానికి వ్యతిరేకంగా బ్రిటన్ అమెరికాలే కలసికట్టుగా అసమ్మతిని తెలియ జేద్దామని కానింగ్ ప్రతిపాదించాడు. ఈ వార్త అక్టోబరులో రాజధాని వాషింగ్టన్‌కు చేరింది. మన్రో తన మంత్రి వర్గాన్ని, ఇది వరకటి అధ్యక్షులయిన జెఫర్సన్, మాడిసన్‌లను సమావేశ పరచి కానింగ్ ప్రతిపాదనను చర్చించడం ఆరంభించాడు.

కానింగ్‌కి అమెరికా పట్ల మిత్ర భావం అంతగా లేదు. అయినప్పటికి ఉమ్మడి నిరసన ప్రతిపాదన చేశాడు. దీనికి గల కారణాలు నిగూఢంగానే ఉండిపోయాయి. త్వరలోనే కానింగ్ ఉమ్మడి ప్రతి పాదనను విరమించుకొని, ఫ్రాన్స్‌తో ప్రత్యక్షంగా సంప్రదింపులు జరిపి తన సమస్యను పరిష్కరించుకొన్నాడు. సముద్రాలపై బ్రిటన్‌కి ఉన్న ప్రబలశక్తి అట్లాంటిక్ సముద్రాన్ని కూడా నియంత్రిస్తుందని తెలుపుతూ, అక్టోబరులో లండన్‌లోని ఫ్రాన్స్ రాయబారి పాలిగ్నాక్‌ని, ఫ్రాన్స్‌కి దక్షిణ అమెరికా వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఆలోచన లేదనే ప్రకటన మీద సంతకం చేసేందుకు అంగీకరింప చేసాడు. కాని కానింగ్ ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వానికి తెలుపక, గోప్యంగానే ఉంచాడు. అందువల్ల ఉమ్మడి ప్రకటన చేసే విషయంలో బ్రిటన్‌కి ఇంకా ఆసక్తి ఉందని అమెరికా బావించసాగింది.

ఈ పరిస్థితులలో మన్రో సిద్ధాంతం రూపొందింది. మన్రో దేశాధ్యక్షునిగా కాంగ్రెస్‌కి డిసెంబరు 2, 1823 న పంపిన సందేశంలో ఈ సిద్ధాంతం అంతర్భాగమయింది. వరుసగా జరిగిన అనేక చర్చల ఫలితమే కాబట్టి మన్రో సిద్ధాంత కర్త ఫలానా వ్యక్తి అని ఖచ్చితంగా చెప్పలేము. కాని జాన్ క్విన్సీ ఆడమ్స్ మాత్రం ఈ సిద్ధాంతాన్ని రూపొందించడంలో ప్రధాన పాత్ర వహించాడు.

చర్చల ఫలితంగా మన్రో, అతని మంత్రి వర్గం కలిసి దక్షిణ అమెరికాలో ఫ్రాన్స్ జోక్యానికి వ్యతిరేకంగా ప్రకటన ఇచ్చేందుకు నిర్ణయించారు. కాని ఈ ప్రకటనను బ్రిటన్‌తో కలసి కాకుండా స్వతంత్రంగానే విడుదల చేసేందుకు నిర్ణయం తీసికొన్నారు. ఎందుకంటే సంయుక్త ప్రకటన వల్ల అమెరికాకు జూనియర్ పాత్ర మాత్రమే లభిస్తుందని, ఐరోపా నుంచి అమెరికాను వేరు చేయాలనే లక్ష్యానికి ఇది దోహద పడదని వారు భావించారు. ఒక్క ఫ్రాన్స్‌కి మాత్రమేగాక తమ విధానాన్ని ప్రపంచానికే ప్రకటించాలని వారు భావించారు.

మన్రో తన సిద్ధాంతాన్ని ప్రపంచానికి డిసెంబరు 2, 1823 న ప్రకటించాడు. ఇందులోని అంశాలు:

(1) "మిత్ర రాజ్యాల (ఐరోపా) రాజకీయ వ్యవస్థ అమెరికా రాజకీయ వ్యవస్థకి పూర్తి భిన్నంగా ఉంది".

(2) "వారు తమ వ్యవస్థను అమెరికా ఖండంలోని ఏ భాగానికైనా విస్తరించేందుకు ఎటువంటి ప్రయత్నం చేసినా, అది మా (అమెరికా) శాంతిభద్రతలకు ప్రమాదకరమైందిగా పరిగణిస్తామని ప్రకటిస్తున్నాం".

(3) "స్వాతంత్ర్యం ప్రకటించుకొని, దానిని కొనసాగించే ప్రభుత్వాలను అణచి వేసే లక్ష్యంతో గాని లేదా వాటి గమ్యాన్నినియంత్రించేందుకు గాని, ఏ ఐరోపా దేశమయినా జోక్యం చేసుకుంటే అది అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వ్యతిరేకంగా తీసికునే చర్యగా పరిగణిస్తాం".

(4) ఈ సందేశంలోనే మన్రో, రష్యాకి ఓరుగాన్ పై గల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని, ఆడమ్స్ రూపొందించిన వలస నిషేధ సిద్ధాంతాన్ని పునరుద్ఘాటించాడు. "స్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తి పొంది, వాటిని కొనసాగించే అమెరికా ఖండాలను ఇప్పటి నుంచి భవిష్యత్తులో ఏ ఐరోపా ప్రభుత్వమూ కూడా వలస స్థాపనకు లోబడేవిగా పరిగణించ కూడదు".

అధ్యక్షుని సందేశంలో ఈ సూత్రాలతో పాటు రెండు ప్రకటనలు కూడా ఉన్నాయి. అవి: (1) ఐరోపా రాజ్యాల ఆధీనంలో ఇప్పటికే ఉన్న వలసలుగాని, లేదా వానిపై ఆధారపడి ఉన్న భూభాగాల విషయంలో గాని అమెరికా జోక్యం చేసుకోదు. (2) ఐరోపా రాజ్యాలకు సంబంధించిన విషయాల కారణంగా సంభవించిన యుద్ధాలలో అమెరికా పాల్గొనదు. ఈ రెండు అంశాల ద్వారా అమెరికా తనకు సంబంధించని విషయాలలో జోక్యం చేసుకోనని, అదే విధంగా ఐరోపా దేశాలు తమ ఖండం విషయంలో సామ్రాజ్య కాంక్ష చూపరాదని ప్రకటించింది. అమెరికాకు దురాక్రమణ చేసే ఉద్దేశ్యం లేదని ఐరోపా రాజ్యాలకు విశ్వాసం కలుగ జేసేందుకు ఈ ప్రకటనలను అధ్యక్ష ప్రకటనలో చేర్చారు.

## 6.9 మన్రో సిద్ధాంత ప్రభావము

మన్రో సిద్ధాంత ప్రకటన తక్షణ సంఘటనల మీద ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. ఏ దక్షిణ అమెరికా దేశాల నుద్దేసించి మన్రో ఈ ప్రకటన చేసాడో, ఆ దక్షిణ అమెరికా దేశాలు ఈ ప్రకటన పట్ల ఎటువంటి ఉత్సుకత చూపలేదు. ఆ దేశాలు అమెరికా కంటే బ్రిటన్ నుంచి ఎక్కువ సహాయ, సహకారాలను పొందుతుండేవి. ఎక్కువగా అవి బ్రిటన్ ఆర్థిక ప్రభావానికి లోనై ఉండేవి. దక్షిణ అమెరికా అంతా, ముఖ్యంగా మెక్సికోలో, 1820 దశకం ఉత్తరార్ధంలో, బ్రిటన్-అమెరికాల మధ్య తీవ్రమైన దౌత్య సంబంధ పోటీ ఉండేది. కాని అన్ని చోట్లా బ్రిటన్ ప్రభావమే అధికంగా కనిపించింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. బ్రిటిష్ నావికా దళమే తమ స్వాతంత్ర్యానికి పూర్తిగా మద్దతు నిస్తుందని దక్షిణ అమెరికా ప్రజలు భావించే వారు. తమకు అవసరమైన పెట్టుబడులను, పారిశ్రామికోత్పత్తులను బ్రిటన్ సులభంగా సరఫరా చేయ గలదని వారు గుర్తించారు. దక్షిణ అమెరికా ప్రజలు గణతంత్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నా, అవి నామ మాత్రమే. చాలా కాలం వారు సైనిక నియంతృత్వ పాలనలోను లేదా భూస్వామ్య వర్గాల పాలనలోనూ గడిపారు. వారిలో కొందరు, ముఖ్యంగా మెక్సికన్లు, అమెరికా విస్తరణ విధానం తమ స్వాతంత్ర్యానికి ముప్పు తేవచ్చని భావించేవారు.

ఈ కారణంగా చాలాకాలం వరకు ఉత్తర, దక్షిణ అమెరికాల మధ్య స్నేహ పూర్వక సహకారం లేదు. బ్రిటన్ 1830 దశకంలో ఫాక లాండ్ దీవులను, బ్రిటిష్ హోండురాస్‌ను స్వాధీనం చేసుకోవడమే గాక మస్కిటో కోస్ట్ అనే పేరుగల ఉత్తర నికరగువాని సంరక్షిత రాజ్యంగా ఏర్పాటు చేసింది. అయినప్పటికీ, బ్రిటన్‌కి కొత్త ప్రాంతాలను ఆక్రమించుకొనే విషయం కంటే, ఆర్థిక నియంత్రణ విషయంలో ఎక్కువ ఆసక్తి చూపింది. అందు వల్ల బ్రిటన్ మన్రో సిద్ధాంతాన్ని ఉల్లంఘించినా, అమెరికా ఏ మాత్రం ఆక్షేపించ లేదు.

ఇరవై సంవత్సరాలకు పైగా, అమెరికా దేశ ప్రజలు కూడా ఈ సిద్ధాంతాన్ని దేశధ్యక్షుడైన మన్రో వ్యక్తిగత అభిప్రాయంగా మాత్రమే భావించారు; అంతేగాని విదేశీ విధానానంలో మైలు రాయిగా అప్పుడు భావించలేదు. అయితే ఈ సిద్ధాంతాన్ని 1845 లో దేశాధ్యక్షుడైన జేమ్స్ కె. పోక్ పునరుద్ఘాటించాడు. ఉత్తర అమెరికా విధానంలో అప్పటి నుండి ఇది శాశ్విత భాగమయింది. వెనిజులా సరిహద్దు వివాదం అంటే 1895 నుంచి మాత్రమే మన్రో సిద్ధాంతాన్ని దక్షిణ అమెరికాకి విస్తరించారు. కాని అప్పటికి ప్రపంచ పరిస్థితులు ఎంతగా మారిపోయాయంటే మన్రో సిద్ధాంతం ఆ కాలానికి సరిపోదనే అభిప్రాయం కూడా ఏర్పడింది. మన్రో సిద్ధాంత కర్తలే ప్రపంచాన్ని రాజకీయంగా రెండు భాగాలుగా విభజించారు. ప్రాచీన ప్రపంచం రాజరికంతో కూడినదని, నూతన ప్రపంచంలో గణతంత్ర వ్యవస్థ ఉంటుందని వారు భావించారు. కాని పంధొమ్మిదవ శతాబ్దాంతానికి దక్షిణ అమెరికాలో కంటే పశ్చిమ ఐరోపాలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, ఎక్కువగా ఉన్నాయి. ఇరవైయ్యవ శతాబ్దంలో దక్షిణ అమెరికాలో సంభవించిన సంఘటనల కంటే పశ్చిమ ఐరోపా, తూర్పు ఆసియాలలో జరిగిన సంఘటనలే అమెరికా సంయుక్త రాష్ట్రాల పై అధిక ప్రభావం చూపాయి. అమెరికా ఖండంలో ఐరోపా జోక్యాన్ని వ్యతిరేకించడం అమెరికా కొనసాగించినా, ఆ దేశం భూగోళ విభజన సిద్ధాంతం ఆధారంగా విదేశాంగ విధానాన్ని అనుసరించడం అసాధ్యమని తెలుసుకొంది.

మన్రో సిద్ధాంత ప్రకటన అయిన 1823 తరవాత కొన్ని దశాబ్దాల వరకు అమెరికా రాజ్య వ్యవహారాలలో విదేశాంగ విధానానికి ప్రాముఖ్యత రాలేదు. ఉత్తర అమెరికా ఖండంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రబల స్థానాన్ని పొందింది. అంతేగాక అట్లాంటిక్ సముద్రం మీదగా ఐరోపా దేశాలు అమెరికా పై దాడి చేసే ప్రమాదం లేదు. అందు వల్ల అమెరికా పెద్ద సైన్యాన్ని నిర్వహించడం గాని, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం గాని వదిలేసి, తన దేశ ఆర్థిక, రాజకీయ అభివృద్ధి పై కేంద్రీకరించింది.

అమెరికా ఏకాంత విధానాన్ని ఎన్నుకోడానికి ఐరోపాలోని పరిస్థితులు దోహద పడ్డాయి. నెపోలియన్ పతనానంతరం డెబ్బై ఐదు సంవత్సరాల వరకు ఐరోపా దేశాలు విదేశీ విస్తరణ కంటే అంతర్గత మార్పులతోనే ప్రధానంగా నిమగ్నమయ్యాయి. పంధొమ్మిదవ శతాబ్దాంతంలో ఐరోపా దేశాల సామ్రాజ్యవాద పునరుద్ధరణ జరిగే వరకూ, అమెరికా దేశంలో తిరిగి విదేశీ వ్యవహారాలకు ప్రాధ్యాన్యత లభించలేదు.

## 6.10 సంగ్రహంగా

మన్రో ప్రభుత్వం ప్రకటించిన సిద్ధాంతం నాటి అవసరాలకి, ఆ శతాబ్దానికి సరిపోయింది. దానిని ప్రవచించిన వ్యక్తిగా అధ్యక్షుడు మన్రో చరిత్రలో చిరస్థాయిగా నిలిచాడు.

## వ్యాసరూప ప్రశ్నలు

1. మన్రో సిద్ధాంతం రూపొందడానికి దారి తీసిన పరిస్థితులను తెలియజేయండి.
2. మన్రో సిద్ధాంతాన్ని వర్ణించి, దాని ప్రాముఖ్యతను అంచనా వేయండి.

## ఉపయుక్త గ్రంధాలు


| | | | |
|---|---|---|---|
| 1. | H.B. Parkes | : | The Unitedstates of America - A History |
| 2. | Morison, Samuel and Commager, H.S | : | The Growth of The American Republic |
| 3. | Bailey T.A | : | Diplomatic History of the American People |
| 4. | Bemis, Samnel F. | : | Diplomatic History of the United States |
| 5. | Curti, Merle | : | Growth of American Thought |
| 6. | Bemis Samnel F. | | John Quincy Adams |
| 7. | Cresson W.P. | : | James Munro |



ప్రొఫెసర్ బి. మస్తానయ్య
ఆంధ్ర విశ్వ విద్యాలయం
విశాఖపట్నం

పాఠం - 7

# ఆంధ్రూ జాక్సన్ (1829-37)

## 7.1. లక్ష్యం

ఆంధ్రూ జాక్సన్ జీవిత విశేషాలను, అతని లక్ష్యాలను, అతని అధ్యక్ష కాలంలో జరిగిన సంఘటనలను, జాక్సన్ ప్రజాస్వామ్య లక్షణాలను వివరించడం ఈ పాఠ్య లక్ష్యం.

## పాఠ్య నిర్మాణక్రమం


7.1 లక్ష్యం

7.2 పరిచయం

7.3 జీవిత విశేషాలు

7.4 పదవుల పంపక విధానము

7.5 జాక్సన్ ప్రజాస్వామ్యం

7.6 కిచెన్ కాబినెట్

7.7 లోకోఫోకోయిజం

7.8 సుంక వివాదం - రద్దు సంక్షోభం

7.9 మేస్ విల్ వీటో

7.10 కేంద్ర బ్యాంక్‌తో యుద్ధం

7.11 ఆర్థిక విజృంభణ మాంద్యం

7.12 సుప్రీంకోర్టు

7.13 ఇండియన్ విధానం

7.14 విదేశీ విధానము

7.15 సంగ్రహంగా


## 7.2 పరిచయం

ఆంధ్రూ జాక్సన్ అధ్యక్ష పదవికి రెండు సార్లు ఎంపికయి, ఎనిమిది సంవత్సరాలపాటు ఆ బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాడు. ఆడమ్స్, హెన్రీక్లే, వెబ్‌స్టర్, కల్హౌన్ వంటి గొప్ప రాజ్యాంగ వేత్తలున్న కాలంలో వారి కంటె అధికమైన ప్రజాదరణను జాక్సన్ సాధించి, ఆ శకానికే తన పేరు నిలిపాడు. పత్రికలు అతనికి "ఓల్డ్ హికరీ" అని మారుపేరు పెట్టాయి. సన్నిహితులు అతనిని "ది జనరల్" అని పిలిచేవారు. అతడు "పాలించాడు" అని మాత్రమే అతని శత్రువులు అనేవారు అతని పాలనలో ప్రజాస్వామ్యం విస్తరించి అంచులకు నెట్టబడిన అనేక బలహీన సామాన్యులను చేరింది. ఆంధ్రూ జాక్సన్, అతని ప్రజాస్వామ్యం అమెరికా రాజకీయాలను అంతర్యుద్ధం వరకు, అంటే శతాబ్దంలో మూడో భాగం వరకూ (దాదాపు 33 సంవత్సరాలు) నియంత్రించారు. ఆంధ్రూ జాక్సన్‌కి ముందు ఉన్న అధ్యక్షులందరూ ధనిక వర్గానికి చెందినవారే. ఒక సామాన్యుడు మొదటిసారిగా శ్వేత సౌధాన్ని (వైట్‌హౌస్) తన నివాసంగా చేసుకోవడం జాక్సన్‌తోనే

ప్రారంభమయింది. ఆండ్రూజాక్సన్ అధ్యక్షునిగా పదవీ స్వీకారం చేయడంతో ఒక నూతన యుగం ఆరంభమయింది. సామాన్య ప్రజానీకానికి చిహ్నమైన జాక్సన్ పదవీ స్వీకరణ రోజున దేశ ప్రజలు, ముఖ్యంగా, పేదవారు వేల సంఖ్యలో తరలివెళ్ళి, అతనిని అభినందించి పండుగ జరుపుకున్నారు. ఆ కోలాహలంలో శ్వేత సౌధంలోని ఖరీదైన తివాసీలు, గాజు సామాగ్రి ధ్వంసమయ్యాయి. జస్టిస్ స్టోరీ భావనలో కింగ్‌మాబ్ పాలన విజయవంతమైనదిగా కనిపిస్తోంది." (The reign of king Mob seemed Triumphant)

## 7.3 జీవిత విశేషాలు:

ఆండ్రూ జాక్సన్ 1767లో కెరోలినా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న వాక్స్‌హా అనే ప్రాంతాన ఒక సామాన్య కుటుంబంలో జన్మించాడు. అతడు పుట్టడానికి ముందే తండ్రిని పోగొట్టుకున్నాడు. అమెరికా విప్లవ కాలంలో అతడు పౌర సైన్య దళంలో పని చేస్తుండగా బ్రిటిష్‌వారు బంధించారు. విడుదల తరువాత ఉపాధ్యాయ వృత్తిలో కొన్నాళ్ళు ఉన్నాడు. న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేసి తన ఇరవై ఒకటవ సంవత్సరంలో టెన్నెసీ రాష్ట్రంలోని నాష్ వెల్లె జిల్లా న్యాయ స్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితుడయ్యాడు.

జాక్సన్ 1796లో రాష్ట్ర రాజ్యాంగ సదస్సులో సభ్యుడు కావడంతో అతని రాజకీయ జీవితం ప్రారంభమయింది. అదే సంవత్సరంలో టెన్నసీ రాష్ట్రం నుండి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యాడు. కాని జాక్సన్ రాజకీయ జీవితం కంటే సైనిక జీవితాన్నే మరింత ఎక్కువగా ఇష్టపడే వాడు. అందుకని పౌర సైన్యదళంలో చేరి, 1813-14లో జరిగిన యుద్ధంలో గ్రీకులను ఓడించాడు. దాని ఫలితంగా అతనికి అమెరికా సైన్యంలో మేజర్ జనరల్ పదవి లభించింది. న్యూ ఆర్లీన్స్ యుద్ధంలో బ్రిటిష్ వారిపై విజయం సాధించి జాక్సన్ కీర్తి ప్రతిష్ఠలను సంపాదించాడు. ఫ్లోరిడా గవర్నరుగా కొంత కాలం సెనెట్ సభ్యునిగా కొంత కాలం పనిచేసాడు. అధ్యక్ష పదవికి 1824లో పోటీ చేసినా, ఫలితం లేకపోయింది. తిరిగి 1828లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో జాన్ క్విన్సీ ఆడమ్స్‌ని ఓడించి, జాక్సన్ అధ్యక్ష పదవిని పొందాడు. ఈ ఎన్నికల నాటికి రిపబ్లికన్ పార్టీ రెండుగా చీలిపోయింది. ఆడమ్స్ అనుచరులు నేషనల్ రిపబ్లికన్ పార్టీగానూ, జాక్సన్ అనుచరులు డెమోక్రటిక్ రిపబ్లికన్ పార్టీగానూ ఏర్పడ్డారు. ఈ ఎన్నికల ప్రచారంలో రాజకీయ సమస్యలను ఇరు పక్షాలు త్రోసిపుచ్చి, అభ్యర్థుల వ్యక్తిత్వాల మీద, ప్రవర్తనలమీద నిందలు మోపసాగారు.

జాక్సన్ తన 62వ సంవత్సరంలో అధ్యక్షుడైనాడు. నిరంతర యుద్ధాల ఫలితంగా అతని ఆరోగ్యం క్షీణించింది. అందువల్ల అతడు దృఢంగా వ్యవహరించగలడని ఎవరూ అనుకోలేదు. అయినప్పటికి, తనకు పూర్వం ఎన్నికయిన అధ్యక్షులందరికంటే జాక్సన్ శక్తివంతమయిన నాయకత్వాన్ని ప్రదర్శించాడు.

## 7.4 పదవుల పంపక విధానము :

జాక్సన్ దేశాధ్యక్షునిగా పదవీ స్వీకారం చేసిన తర్వాత దేశీయ విధానంలో నూతన మార్పులను ప్రవేశ పెట్టాడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో ఆవర్తనం (రొటేషన్) విధానాన్ని ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వృద్ధులు, అసమర్థులు అనేకమంది ఉన్నారని, వారిని పదవినుంచి తొలగించాలని అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల ప్రచారంలో జాక్సన్, అతని అనుయాయులు వాదించారు. దీని కనుగుణంగా జాక్సన్ అధ్యక్షుడైన వెంటనే 900 మందిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలనుంచి తొలగించాడు. వీరిలో కస్టమ్స్ అధికారులు, తపాలా ఉద్యోగులు, గుమస్తాలు మొదలగువారు ఉన్నారు. వారి స్థానాల్లో అధ్యక్ష ఎన్నికలలో తనను బలపరచిన వారిని అతడు నియమించాడు. ఈ విధానాన్ని పదవుల పంపిణీ విధానంగా పేర్కొంటారు. న్యూయార్క్‌కి చెందిన విలియం సి. మర్సీ (William C. Marcy) ఈ విధానాన్ని తెలియజేస్తూ "ఎవరు విజేతలో వారే ప్రయోజనార్హులు" అన్నాడు. (To the victors belong the spoils).

జాక్సన్ తీసికొన్ని ఈ చర్య నూతన విధానమేమీ కాదు. జార్జి వాషింగ్టన్ ఫెడరలిష్టులను మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించాడు. జెఫర్సన్ కొందరు ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో రిపబ్లికనులను నియమించాడు. జెఫర్సన్ పాలన నుంచి ఒకే రాజకీయ పార్టీ అధికారంలో కొనసాగింది. అందువల్ల ఉద్యోగులను తొలగించి, కొత్త వారిని నియమించవలసిన అవసరమేమీ రాలేదు. జాక్సన్ పదవీ కాలం నాటికి రిపబ్లికన్ పార్టీ రెండుగా చీలిపోవడం వలనను, సామాన్యులకు నూతన ప్రభుత్వం బాసటగా నిలువడానికి జాక్సన్ ఈ విధానాన్ని భారీ ఎత్తున చేపట్టాడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు "రాజకీయ సేవల" ఆధారంగా ఉండాలనే సూత్రాన్ని ప్రవేశపెట్టి, తన అనుయాయులకు

ఉద్యోగాల నిచ్చాడు. జాక్సన్ తరువాత అధ్యక్షులయిన వారు ఈ సూత్రాన్ని మరింత విస్తృత పరిచారు. అధికారంలోకి కొత్త పార్టీ వచ్చిన ప్రతి సందర్భంలోనూ ప్రభుత్వ ఉద్యోగులను పూర్తిగా తొలగించడం వారి స్థానంలో కొత్త వారిని నియమించడం జరిగింది. కొత్తగా ఎన్నికయినా ప్రతి అధ్యక్షునికి తన పదవీ కాలం ప్రారంభంలో కొన్ని నెలలు తన వారిని సంతృప్తి పరచడంలోనే సరిపోయేది. ఈ విధానం 1880 వరకు కొనసాగింది. ఉద్యోగం సంపాదించడంలో విఫలుడైన ఒక వ్యక్తి 1881లో దేశాధ్యక్షుడయిన గార్ఫీల్డ్‌ని హత్య చేయడంతో, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థని సంస్కరించే ఉద్యమం బలం పుంజుకొని సత్ఫలితాల నిచ్చింది.

## 7.5 జాక్సన్ ప్రజాస్వామ్యం :

ఆండ్రూ జాక్సన్ పశ్చిమ రాష్ట్ర భావ జాలానికి ప్రతినిధి. తూర్పు పెట్టుబడి ప్రయోజనాలకి వ్యతిరేకి. బ్యాంక్‌ల పట్ల అపనమ్మకం ఉండేది. సామాన్య మానవుడు కూడా అసామాన్య విజయాలని సాధించగలడని నమ్ముతూ, గుత్తాధిపత్యాన్ని, ప్రత్యేక హక్కులనీ వ్యతిరేకించే వాడు. రాజకీయ సమానత్వం, సమాన ఆర్థిక అవకాశాలు అందరికీ అందాలని భావించేవాడు. జాక్సన్ 1837లో అధ్యక్ష పదవినుండి దిగిపోతూ చేసిన వీడ్కోలు ప్రసంగంలో అతని ప్రజాస్వామ్యంలోని ప్రధాన సూత్రం తెలుస్తోంది. "అమెరికా సంయుక్త రాష్ట్రాల జనాభాలో అత్యధికులైన తోట సేద్యకారులు, రైతులు, మెకానిక్‌లు, శ్రామికుల" ప్రయోజనాల కోసమే ప్రభుత్వ పాలన సాగాలని జాక్సన్ ప్రకటించాడు. ఈ వర్గాల వారి విజయం వారి శ్రమపైనా, ఆర్థిక వ్యవస్థపైనా ఆధారపడి ఉంటుందని, హఠాత్తుగా ధనవంతులవ్వాలని ఆశించకూడదని తెలిపాడు. జాక్సన్ అతని అనుయాయులు వ్యవసాయ కార్మిక వర్గాల ఐక్యతను ప్రతిపాదించేవారు. ఈ ఐక్యత వలననే ద్రవ్య ప్రయోజనాల అధికారాలను తగ్గించగలమని విశ్వసించేవారు. దీనిని సాధించేందుకు స్వేచ్ఛా వాణిజ్య కార్యక్రమాలను మాత్రమే అనుసరించాలని కూడా వారు నమ్మారు.

సన్నకారు ఆస్తి యజమానులను రక్షించాలి. ప్రభుత్వం బ్యాంకులకు, పారిశ్రామిక సంస్థలకు ప్రత్యేక హక్కులను ఇవ్వరాదు. కట్టుదిట్టమైన పోటీని నిర్వహించాలి. ప్రభుత్వ భూములను సులభతర షరతులలో ప్రజలకివ్వాలి. రాజ్యాంగానికి కఠినతర వ్యాఖ్యానం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ విధులకు పరిమితి పెట్టాలి. ఇవి అన్నీ జాక్సన్ ప్రజాస్వామ్య సూత్రాలు. కేంద్ర ప్రభుత్వ అధికారం గురించి, రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్న దానికంటే ఎక్కువ ఇవ్వడానికి అతడు వ్యతిరేకించాడు. అయినప్పటికి, అతడు జాతీయవాది. దక్షిణ కెరోలీనాలో ప్రబలుతున్న వేర్పాటువాద ధోరణులకు జాక్సన్ పూర్తి వ్యతిరేకి.

అమెరికా ప్రజలలో ఆర్థిక మార్పుల కారణంగా ఆవిర్భవించిన ప్రజా ఉద్యమానికి జాక్సన్ నాయకుడయ్యాడు. రైతులు, మధ్య తరగతి వర్గం, కార్మిక వర్గం ఈ ఉద్యమాన్ని బలపరిచాయి. దీని ఫలితంగా ప్రజాస్వామ్యం విస్తరించింది.

జాక్సన్ మద్దతుదార్లలో ప్రధాన వర్గం కార్మికులు. తూర్పు పట్టణాలలో, నగరాలలో వీరు నివసించేవారు. న్యూయార్క్ నగరంలో 1830 నాటికి ఉన్న ప్రజల్లో చాలామంది ఫ్యాక్టరీలలోనూ, నౌకాశ్రయాల్లోనూ పనిచేసే కార్మికులే. వీరు అధిక సంఖ్యలో డెమోక్రటిక్ పార్టీలో చేరేవారు. వీరి సంఖ్య నానాటికి అధికమయి, న్యూయార్క్ నగరం ఫెడరలిస్ట్ పార్టీ నుంచి, డెమోక్రటిక్ పార్టీకి స్థావరంగా మారింది. ఫిలడెల్ఫియా, పిట్స్‌బర్గ్ నగరాలు జాక్సన్ మద్దతుదార్లతో నిండి పోయాయి. జాక్సన్ పదవీకాలంలోనే కార్మిక యూనియన్లను వారు స్థాపించుకున్నారు. విలియం లెగ్గెట్ వంటి నాయకులు సమ్మెలను నిరోధించే న్యాయస్థాన తీర్పులను ఖండించేవారు. జాతీయ నౌకాశ్రయాలలో పనిచేసే కార్మికుల సౌకర్యార్థం జాక్సన్ వారి పని గంటలను రోజుకి పది గంటలుగా 1836లో నిర్ణయించాడు. రోజుకి 12 నుండి 14 గంటల వరకు పనిచేసే కార్మికులకు, వారి నాయకులకు ఈ నిర్ణయం ఊరట నిచ్చింది.

జెఫర్సన్ కాలంలో విడువబడిన సామాన్యులను జాక్సన్ ప్రజాస్వామ్యం ప్రజా జీవనంలో చురుకుగా పాల్గొనేటట్లు చేసింది. చాలా రాష్ట్రాలలో ఆస్తి అర్హత క్రమేణా అంతరించి, 1830 నాటికి పురుషులందరికి ఓటింగు హక్కు వచ్చింది. అధ్యక్ష ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థులను ఇదివరలో కాంగ్రెస్ కాకస్‌లు నియమించేవి. నూతన యుగంలో ప్రత్యేక కన్వెన్షన్లు అభ్యర్థులను ప్రజాభీష్టం మేరకు ఎన్నుకునేవి. ఈ విధానం 1836 నుండి బలపడింది. ఈ విధంగానే న్యాయాధికారులను నియమించే పాత విధానానికి స్వస్తి పలికి, నూతన విధానమైన

చిన్నకోవడం ఆరంభమయింది.

ధనవంతుల అలవాట్లను, మర్యాదలను త్రోసిన రోజునే ప్రజాస్వామ్యం ప్రబలింది. ఎన్నికలలో పాల్గొనే వారంతా తాము సామాన్యులమని తెలియజేసే నూతన విధానం మొదలయింది. ప్రజాస్వామ్యం మతంలోకూడా ప్రవేశించింది. ఉద్రేక పూరితమైన ప్రార్థనలు, గీతాలు ప్రాధాన్యతను పొందాయి.

పత్రికా పఠనం అధికమయింది. పత్రికల సంఖ్య పెరిగింది. న్యూయార్క్ సన్ పత్రిక 1833లోనూ, న్యూయార్క్ "హెరాల్డ్" 1835లోనూ ఆరంభమయ్యాయి. ఫిలడెల్ఫియాలో 1830లో గొడే లేడీస్ బుక్ మొదటి ప్రజాదరణ పొందిన పత్రిక అయింది. ప్రజా పాఠశాల వ్యవస్థకై వాదోప వాదాలు సాగాయి. మెస్సాచుసెట్స్‌కి చెందిన హోరేస్‌మాన్ విద్య విస్తరణ విషయంలో నాయకత్వం వహించాడు. అజ్ఞానాన్ని ప్రజా విద్యా విధానం ద్వారా తొలగించవచ్చునని నాటి ప్రజలు భావించారు. మేరీ లియాన్, కేథరిన్ టీచర్ స్త్రీ విద్యకై పోరాడారు. ప్రజాస్వామ్యం విస్తరించింది.

ఆర్థిక రంగాన, జాక్సన్ మద్దతుదార్లు తూర్పు రాష్ట్రాల ఆధీనంలోని బ్యాంకింగ్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అప్పు ఇచ్చిన వారినిగాక తీసికొన్న వారిని బలపరచారు. గుత్తాధిపత్యం ఏ రూపంలో ఉన్నా స్టీం బోటు నుంచి బ్యాంక్ ఛార్టర్స్ వరకు, అక్కడ నుంచి పేటెంట్ హక్కుల వరకు - వ్యతిరేకించారు. పబ్లిక్ భూములను తక్కువ ధరకి, సులభ పద్ధతిలో, ప్రభుత్వం నుంచి కొనే హక్కు తమకుందని వారు భావించేవారు. వారు రహదారులు, కాలువలు, రైలు మార్గాలు నిర్మించేందుకు రాష్ట్రాలు ఛార్టర్లు ఇవ్వాలని, ధన సహాయం చేయాలని వాదించారు. కాని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోరాదని, లాభాల్లో పాలు పంచుకోరాదని షరతు పెట్టారు. పోటీ పడే ఔత్సాహికులకు ప్రత్యేక హక్కులు ఇవ్వరాదని, ప్రభుత్వ నియంత్రణలేని, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించాలని వారు పోరాడారు.

జాక్సన్ అధ్యక్ష కాలం సంస్కరణల యుగం జర్మనీలో ఆరంభమయిన "ట్రాన్సెండెటలిజం" ఇంగ్లండ్‌లోని కూల్రిజ్ ద్వారా అమెరికాకి చేరింది. దేవుని ఔదార్యత ప్రకృతి ప్రయోజకత్వం, మానవునిలోని దైవత్వము దీనిలోని ప్రధానాంశాలు. మానవునిలోని దైవత్వాన్ని విశ్వసిస్తున్నప్పుడు అతడిని బానిసత్వంలో ఉంచడంగాని, అజ్ఞానంలో ఉంచడం గాని చేయకూడదు. అందుచేత సంస్కరణలను చేపట్టి మానవ సమాజాన్ని దోషరహితం చేయాలి. బానిసకు స్వేచ్ఛను, పేదలకు సంక్షేమాన్ని, అజ్ఞానికి విద్యను, సమాజానికి శాంతి న్యాయాలను ఇవ్వాలని వారు కోరారు. ఈ దారిలో ఎదురయ్యే అన్ని ఇబ్బందులను తొలగించుకోవాలి. మూఢా చారాలను మతం నుంచి తొలగించి నైతికతకు ఎమర్సన్, థియోడార్ పార్కర్‌లు ప్రాధాన్యత నివ్వసాగారు. అజ్ఞానాన్ని పబ్లిక్ పాఠశాలా విధానం ద్వారా తొలగించమని హోరేస్ మాన్ చెప్పసాగారు. పేదరికం అడ్డంకి అయితే కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఆస్తి ఒక ఆటంకమయితే భూ పంపిణీ విధానాల వంటివి అనేకం తెలియజేసారు. రాజ్యం ఒక ఆటంకమైతే దాని అధికారాలను తగ్గించాలి. శాసనోల్లంఘనాన్ని కూడా తోరో ప్రతిపాదించాడు. ఎలిహు బుర్రిట్, విలియం లాడ్ విశ్వశాంతి ప్రణాళికలను తయారు చేసారు.

సమాజ పునర్నిర్మాణం చేయకుంటే, అబద్ధాలను వదలకుంటే, సత్యాన్ని మంచిని తిరిగి తేకుంటే, సంస్కర్తగా ఉండకపోతే మానవుడు ఎందుకు జన్మించినట్లు అని ఎమర్సన్ ప్రశ్నిస్తాడు. కఠినమైనప్పటికి, సంస్కర్త జీవనం గడపకపోతే అది నిజమైన జీవితమే కాదని హోరేస్ గ్రీలే చెప్పాడు. ఈ నేపథ్యంలో జాక్సన్ ప్రజాస్వామ్యం కృత్రిమమైన విశిష్టతలను వ్యతిరేకించింది. రాజకీయాల్లో ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని పిలుపునిచ్చేది. సమానత్వం కొరకు, జరిగే ఉద్యమాలలో చురుకుగా జాక్సన్ ప్రజాస్వామ్య వాదులు పాల్గొనే వారు. కాని, వారు తెల్లవారిలో సమానత్వాన్నే మాత్రమే విశ్వసించారు. ఇండియను, నీగ్రోల పట్ల ఈ విధానాన్ని అనుసరించలేకపోయారు. స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన సిద్ధాంతాలకు, ఉద్యమాలకు జాక్సన్ ప్రజాస్వామ్య వాదులు దూరంగా ఉండిపోయారు. ఆ కాలానికి చెందిన సుప్రసిద్ధ సాహిత్యవేత్తలలో నథానియల్ హాథార్న్, జేమ్స్ ఫెనిమోర్ కూపర్ వంటి కొద్ది మంది జాక్సన్ మద్దతుదారులయ్యారు.

## 7.6 కిచెన్ కాబినెట్ (Kitchen Cabinet)

అధికారంలోకి వచ్చిన వెంటనే జాక్సన్ తన ఆదర్శాలను అమలులో పెట్టదలచాడు. మంత్రివర్గ సభ్యులుకాని కొందరు వ్యక్తిగత స్నేహితులతో అతడు చర్చించి నిర్ణయాలు తీసికొనేవాడు. ప్రతి పక్షం వారు ఈ స్నేహ బృందాన్ని అవహేళనగా కిచెన్ కాబినెట్ అని

పిలిచేవారు. వీరు కాక వాన్ బ్యూరన్ (విదేశాంగ కార్యదర్శి), సెనేటర్ బెంటన్ ఉండేవారు. ఇతరులంతా పత్రికా రంగానికి చెందినవారే.

## 7.7 లోకోఫోకోయిజం

పరిశ్రమలు, పెట్టుబడులు గణనీయంగా అభివృద్ధి చెందిన ఈశాన్య ప్రాంతంలో, ముఖ్యంగా న్యూయార్క్ మెస్సా ఛుసెట్స్ రాష్ట్రాల్లో లోకోఫోకోయిజం ఉద్యమం ఆరంభమయి, విస్తరించింది. ఈ ప్రాంతాల్లోని అతివాద జాక్సన్ వాదులకు "లోకోఫోకోలు" అనే పేరు వచ్చింది. న్యూయార్క్ నగరంలో 1835లో అతివాదులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని భగ్నం చేసేందుకు మితవాదులు దీపాలను తీసివేశారు. అతివాదులు ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకొని అగ్గిపుల్లలను వెలిగించి సమావేశాన్ని కొనసాగించారు. ఆ కాలంలో అగ్గిపుల్లలకు లోకోఫోకోలు అనే పేరుండేది. దీనివలననే జాక్సన్ మద్దతు దార్లకు లోకోఫోకోలు అనే పేరు వచ్చింది. లోకోఫోకోయిజం వాదానికి ముఖ్య ప్రతినిధి విలియం లెగ్గెట్. అతడు విలియం కల్లెన్ బ్రియాంట్ అనే కవి సంపాదకత్వంలో వెలువడే "న్యూయార్క్ ఈవెనింగ్ పోస్ట్" అనే పత్రికలో సంపాదకునిగా ఉండేవాడు.

జాతీయ రాజకీయాల్లో లోకోఫోకోలు జాక్సన్‌ని పూర్తిగా బలపరచారు. కాని రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం వారు డెమోక్రటిక్ పార్టీలోని మితవాద శక్తులతో పోరాడవలసి వచ్చింది. ద్రవ్య ప్రయోజనాలకుగల ప్రత్యేక హక్కుల కారణంగా, సన్నకారు ఆస్తి యజమానుల హక్కులకు ప్రమాదం వాటిల్లిందని భావించి, వారు సాధారణ సంస్థల, స్వతంత్ర బ్యాంకులకు సంబంధించిన చట్టాలు తేవడానికి కారకులయ్యారు. గుత్తాధిపత్యాన్ని నివారించడం, కట్టుదిట్టమైన పోటీని నెలకొల్పడం వారి ప్రధాన లక్ష్యం. ప్రజాధనాన్ని దాచిపెట్టడం మాత్రమే బ్యాంకుల పని అనియు, బంగారం వెండి మాత్రమే సురక్షితమైన ద్రవ్యమని విశ్వసించిన లోకోఫోకోలు బ్యాంక్ నోట్ల వినియోగాన్ని వ్యతిరేకించారు. ఈ విధంగా నాటి లోకోఫోకోవాదం సన్నకారు ఆస్తి యజమానుల దృక్పధానికి ప్రాతినిధ్యం వహిస్తూ, ఆర్థిక వ్యక్తిత్వ వాదాన్ని సమర్థిస్తూ, ప్రభుత్వ జోక్యం ఏ రూపంలోనూ ఉండని వ్యవస్థని బలపరుస్తూ ఉండేది.

## 7.8 సుంక వివాదం - రద్దు సంక్షోభం :

జాక్సన్ పదవీ కాలంలో సుంక విషయం వివాదా స్పదమైంది. రక్షిత సుంకాలను 1816 తరువాత 1824లోనూ, 1828లోనూ రెండుసార్లు పెంచారు. పారిశ్రామికోత్పత్తులకే గాక పశ్చిమ రాష్ట్రాలలో పండించే ఉన్ని, జనుపనార మొదలగు వ్యవసాయ ఉత్పత్తులకు కూడా రక్షణ కల్పించారు. జనుపనార పండించే కెంటకీ, మిస్సోరీలు తప్ప మిగిలిన దక్షిణాది రాష్ట్రాలన్నీ రక్షిత సుంకాల పెరుగుదలను వ్యతిరేకించాయి. ఈ సుంకాలు 1828లో ఎంత ఎక్కువగా పెరిగాయంటే దక్షిణాదిన వాటిని "గర్హించదగిన సుంకాలు" (Tariff of Abominations) అని పిలిచారు. వాటిపై వ్యతిరేకత దక్షిణ కెరోలినాలో ప్రబలమై, డిసెంబరు 1828లో వాటిని రద్దుచేసే హక్కు రాష్ట్ర శాసనసభకు ఉందని కల్హౌన్ చేసిన ప్రతిపాదనను, ఆ శాసనసభ ఆమోదించింది.

దక్షిణ కెరోలినా, జాక్సన్ ప్రభుత్వ ప్రతి చర్యకు వేచి చూడాలని నిర్ణయించుకొని రద్దుని (nullification) వెంటనే అమలు చేయలేదు. ఈ అంశానికి సంబంధించిన విధానాలను కలౌన్ నిర్ణయిస్తాడని, 1833లో జాక్సన్ తరువాత అతడే అధ్యక్షునిగా ఎన్నిక అవుతాడని ఆశించారు. కాని అనేక రాజకీయ వ్యక్తిగత వివాదాల ఫలితంగా జాక్సన్, కల్హౌన్‌ల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. జాక్సన్ రెండవసారి అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు నిర్ణయించడం అంతేగాక తన తరువాత కల్హౌన్‌కి బదులుగా వాన్‌బ్యూరెన్‌ని అధ్యక్షునిగా చేసేందుకు మొగ్గు చూపాడు. అందువల్ల దక్షిణ కెరోలినా రాష్ట్రానికి చెందిన కల్హౌన్ దేశాధ్యక్షుడయ్యే ఆశలు సన్నగిల్లాయి.

కాంగ్రెస్‌లో రద్దు సిద్ధాంతం గురించి చర్చించడం ప్రారంభమయింది. జనవరి 1830లో వెబ్‌స్టర్ హెయిన్ మధ్య జరిగిన చర్చలో అది ప్రముఖపాత్ర వహించింది. సెనేట్‌లో అధికారికంగా ప్రభుత్వ భూ విధానం గురించి, చర్చించే సందర్భంలో అది క్రమంగా విస్తృతమై ప్రాథమిక రాజ్యాంగ అంశాల గురించిన చర్చగా మారింది. కనెక్టికట్‌కి చెందిన సెనేట్ సభ్యుడు అగస్టస్ ఫుట్ ఉత్తరాది వ్యాపార వర్గాల దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ, ప్రభుత్వ భూముల అమ్మకాలపై పరిమితి విధించాలని ప్రతిపాదించాడు. బెంటన్ ఈ ప్రతిపాదనను ఖండిస్తూ ఇది తూర్పు రాష్ట్రాలకు చౌకగా కార్మికులు దొరికేందుకు ఉద్దేశించిందని వాదించి దీనికి వ్యతిరేకంగా దక్షిణ రాష్ట్రాల సహాయాన్ని అర్థించాడు.

దక్షిణ కెరోలినాకి చెందిన రాబర్ట్ హెయిన్ ఈ సవాలుకి ప్రతిస్పందిస్తూ ప్రభుత్వ భూ విధానంలోనే గాక, సుంకాలకి సంబంధించి కూడా, దక్షిణ - పశ్చిమ ప్రాంతాలు ఏకమవ్వాలని పిలుపునిస్తూ, ఫెడరల్ ప్రభుత్వ చట్టాలను రద్దుచేసే హక్కు రాష్ట్రాలకు ఉందని తన వాదనను కొనసాగించాడు. దీనికి జవాబుగా వెబ్‌స్టర్ తన సుప్రసిద్ధ ఉపన్యాసంలో కేంద్ర ప్రభుత్వానికి తన పరిధిలో సార్వభౌమాధికారం ఉందని, అమెరికా ప్రజల హక్కులు, దేశ సమైక్యతతో ముడిపడి ఉన్నాయని వాదించాడు. వెబ్‌స్టర్ అభిప్రాయాన్నే జాక్సన్ అంగీకరించాడు. ఫెడరల్ ప్రభుత్వ అధికారమే ఎక్కువ శక్తివంతమైనదని భావించాడు. రాష్ట్ర హక్కులే అధికమని భావించే కల్హౌన్ అతని అనుచరులు, జఫర్సన్ పుట్టిన రోజు సందర్భంగా ఏప్రిల్ 1830లో ఏర్పాటు చేసిన విందులో రద్దు హక్కు గురించి ఉపన్యసించాలని ప్రణాళిక సిద్ధం చేసుకొన్నారు. వారి ఉద్దేశ్యాలను ముందుగానే తెలుసుకొన్న జాక్సన్, కార్యక్రమ ప్రారంభంలోనే కల్హౌన్‌పై దృష్టి సారించి, విందుని మొదలుపెడుతూ "సమైక్యతను పరిరక్షించాలి" అని ఉద్ఘాటించి, ప్రత్యర్థి వర్గాన్ని చిత్తు చేసాడు.

కాంగ్రెస్ జూలై 1832లో కొత్త సుంకాలకి సంబంధించిన బిల్లుకి ఆమోదం తెలిపింది. ఇది వరకటి గర్హించదగిన సుంకాల కంటె కొత్తవి తక్కువే అయినా దక్షిణ కెరోలినా దృష్టిలో అవి ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. సమీప భవిష్యత్తులో సుంకాలు మారే సూచనలు లేనందువల్ల రద్దు మద్దతుదార్లు చర్య తీసికొనే సమయం ఆసన్నమైందని భావించారు. దీనికోసం ప్రత్యేకంగా ఎన్నుకోబడిన రాష్ట్ర సదస్సు 1828, 1832 నాటి సుంకములు తమ ప్రజలకు వర్తించవని ప్రకటించింది. అంతేగాక ఫిబ్రవరి 1833 నుంచి సుంకాల రద్దు అమలవుతుందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం బలప్రయోగానికి తలపడితే, దక్షిణ కెరోలినా, దేశం నుంచి విడిపోతుందని ప్రకటించింది.

దక్షిణ కెరోలినాని బలపరుస్తూ ఏ రాష్ట్రం కూడా ముందుకు రాలేదు. అంతేగాక ప్రజాభిప్రాయం కేంద్ర ప్రభుత్వాధికారాన్ని బలపరచింది. జాక్సన్, తన విదేశాంగ కార్యదర్శి ఎడ్వర్డ్ లివింగ్‌స్టన్ రచించిన ప్రకటనను జారీ చేసాడు. రద్దు హక్కు అమెరికా రాజ్యాంగానికి, రాజ్యాంగ స్ఫూర్తికి, రాజ్యాంగ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని ఏ మహా లక్ష్యంతో దానిని (యూనియన్) రూపొందించారో అది నాశనమవుతుందని జాక్సన్ ప్రకటించాడు. అంతేగాక అవసరమైతే సైన్యాలను ఉపయోగించి, దక్షిణ కెరోలినాని విధేయంగా చేసేందుకు అధ్యక్షునికి తగిన అధికారం ఇచ్చేందుకు ఒక బిల్లుని కాంగ్రెస్ ఆమోదించాలని కూడా జాక్సన్ కోరాడు.

ఈ లోగా కాంగ్రెస్‌లో సుంకాలను తగ్గించే ప్రతి పాదనలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాధికారాన్ని బలపరచడంలో జాక్సన్‌కి మాత్రమే ఘనత లభించడం ఇష్టపడని హెన్రీక్లే, ఈ సమస్యని సామరస్యంగా పరిష్కరించడానికి నాయకత్వం వహించాడు. కొత్త సుంకాల బిల్లు, అధ్యక్షునికి బలప్రయోగ హక్కునిచ్చే బిల్లు (Force Bill) రెండూ ఒకే రోజు కాంగ్రెస్ ఆమోదం పొంది చట్టాలయ్యాయి. దక్షిణ కెరోలినా అంత వరకు అమలుగాని తన రద్దు శాసనాన్ని వెనక్కి తీసికొంది. కొత్త సుంకాలకి అంగీకారం తెలిపింది. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వాధికారం, జాక్సన్ అధికారం బలపడ్డాయి. రద్దు హక్కుకి గుర్తింపు లభించలేదు.

## 7.9 మేస్ విల్ వీటో :

కెంటకీ రాష్ట్రంలో మేస్‌విల్ నుంచి లెక్సింగ్టన్ వరకు రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని కోరే బిల్లుని మే 1830లో జాక్సన్ వీటో చేసాడు. అంతర్గత అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అని అతడు విశ్వసించాడు. ఈ వీటో ఫలితంగా రాష్ట్రాలలో రహదారులు, కాలువల నిర్మాణ పనులు చాలా కాలం వరకు ఆగిపోయాయి.

## 7.10 కేంద్ర బ్యాంక్‌తో యుద్ధం :

బ్యాంక్ పట్ల జాక్సన్ దృక్పథము జాతీయ రాజకీయాలలో ప్రాధాన్యత పొందింది. డెమోక్రటిక్ పార్టీ సదస్సును నిర్వహించి 1832లో జరిగే అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసింది. జాక్సన్‌ని రెండవసారి అధ్యక్షునిగా నిలుపుటకు, ఉపాధ్యక్ష పదవికి కల్హౌన్‌కి బదులు వాన్‌బ్యూరెన్‌ని ఎన్నుకొంది. నేషనల్ రిపబ్లికన్లు హెన్రీక్లేని తమ అభ్యర్థిగా నిలిపారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల బ్యాంక్ ఛార్టర్‌ని పునరుద్ధరించాలా, వద్దా అనే అంశమే ప్రాధాన్యత వహించింది.

రెండో జాతీయ బ్యాంక్ 1816లో స్థాపిత మయింది. దానికి ఉన్న ఛార్టర్ 1836 నాటికి ముగుస్తుంది. అయినప్పటికి జాక్సన్ భావాలు తెలిసిన బ్యాంక్ యాజమాన్యం తమ ఛార్టర్‌ని పునరుద్ధరించాలని 1832 లోనే కోరారు. అధ్యక్ష పదవికి రెండోసారి ఎన్నికలలో ఉన్న జాక్సన్ బ్యాంక్ విషయంలో స్పందించే తీరు ప్రజలలో చర్చనీయాంశమవుతుందని వారు భావించారు. హెన్రీక్లే సలహాతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసికొంది. క్లే ఆశించినట్లే కాంగ్రెస్ అత్యధిక బలంతో పునరుద్ధరణ బిల్లుని ఆమోదించింది. కాని జాక్సన్ దానిని వీటో చేశాడు. నేషనల్ రిపబ్లికన్లు ఈ చర్యను నిరసిస్తూ, బ్యాంక్ పునరుద్ధరణను కోరుతూ, అధ్యక్ష ఎన్నికలలో ప్రచారం చేశారు. అంతేగాక వారు ఎన్నికల ప్రచారంలో భాగంగా జాక్సన్ వీటో సందేశాన్ని ముద్రించి ప్రజలకు పంచుతూ జాక్సన్ చర్య ఆర్థిక విషయాల్లో అతని అజ్ఞానాన్ని సూచిస్తుందని ప్రచారం చేశారు. కాని అధ్యక్ష ఎన్నికలలో జాక్సన్ ఘన విజయాన్ని సాధించాడు.

దీనికి కారణం జాతీయ బ్యాంక్ ప్రజలందరి మన్ననలను పొందలేకపోవడమే. పశ్చిమ రాష్ట్రాలు బ్యాంక్ పట్ల అయిష్టతను పెంచుకున్నాయి. అది రాష్ట్రాల బ్యాంక్‌లకు నోట్లు విడుదల చేయలేదు. సులభరీతిలో అక్కడి ప్రజలకు అప్పులను ఇవ్వనీయలేదు. ఈ విధంగా పశ్చిమ రాష్ట్రాలకు ద్రవ్యాన్ని, అప్పు విధానాన్ని పరిమితం చేయడం ద్వారా, వారు తూర్పు రాష్ట్రాల వ్యాపార వర్గాలకు శాశ్వతంగా అప్పుల్లో కూరుకొనిపోయే విధంగా చేసిందని విశ్వసించారు. పశ్చిమ రాష్ట్రాల వారు జాతీయ బ్యాంక్‌కే గాక, అన్ని బ్యాంక్‌లకు వ్యతిరేకులై, బంగారము వెండి మాత్రమే, నమ్మక ద్రవ్యమని విశ్వసించేవారు. ప్రైవేట్ సంస్థలకు నోట్లను విడుదల చేసే అధికారం ఇచ్చినంత కాలం ఊహాత్మక వ్యాపారానికి (Speculative business) ప్రోత్సాహం లభిస్తుందని, ద్రవ్యోల్బణాల అనంతరం ఆర్థిక సంక్షోభాలు, మాంద్యాలు సంభవిస్తాయని, నిజాయితీ పరులు అప్పుల పాలవుతారని కూడా వారు భావించారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల బ్యాంక్ ప్రజాస్వామిక సంస్థలకు ప్రమాదకరమైందని జాక్సన్ భావించాడు. దానికి 1823 నుంచి అధ్యక్షునిగా ఉన్న నికోలస్ బిడిల్ ఫిలడెల్ఫియాకి చెందిన ఉన్నత కుటుంబానికి చెందినవాడు. రాజకీయాలలో అతడు, బ్యాంకు మునిగిపోయాయి. రాజకీయ మద్దతునాశించి అతడు అనేకమంది కాంగ్రెస్ సభ్యులకు, పత్రికా సంపాదకులకు పెద్ద ఎత్తున అప్పులనిచ్చి, చెల్లింపులను గూర్చి పట్టించుకోలేదు. అందుచేతనే కేంద్ర బ్యాంక్‌ను జాక్సన్ "ప్రజలకు బాధ్యత వహించని కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమైన అధికారాన్ని బలపరచేది" అని పేర్కొన్నాడు.

జాక్సన్ రెండోసారి అధ్యక్షునిగా ఎన్నుకోబడిన తరువాత, కేంద్ర బ్యాంక్ ఛార్టర్ పూర్తి అయ్యే వరకు ఆగకుండా, వెంటనే దానిపై దాడి చేయాలని నిర్ణయించాడు. ఎందుకంటే ఈ విషయంలో ఏమాత్రం ఆలస్యం చేసినా, నికోలస్ బిడిల్ తన బలాన్ని శక్తివంతం చేసుకొనే అవకాశం ఉందని జాక్సన్ భావించాడు. కేంద్ర బ్యాంక్‌లో ప్రభుత్వ డిపాజిట్లు ఉన్నాయి. వీటిని ఉపసంహరించాలని జాక్సన్ భావించి, ఆ బాధ్యతను సక్రమంగా నిర్వహించేందుకు ఆర్థిక కార్యదర్శిగా మేరీలాండ్‌కి చెందిన రోజర్ టానీని ఎన్నుకున్నాడు. బ్యాంక్ ఛార్టర్ ప్రకారం ఆర్థిక కార్యదర్శి భద్రత లేదని భావించితే బ్యాంక్‌లో ఉంచిన డిపాజిట్లను ఉపసంహరించవచ్చు. ఈ బాధ్యతను రోజర్‌టానీ స్వీకరించి, సెప్టెంబర్ 1833 నుంచి క్రమంగా ప్రభుత్వ నిధులను అమెరికా సంయుక్త రాష్ట్రాల బ్యాంక్ నుంచి రాష్ట్రాల బ్యాంక్‌లకు బదిలీ చేయడం ప్రారంభించాడు. దీనివలన కేంద్ర బ్యాంక్ శక్తిహీనమై, రాష్ట్ర బ్యాంక్‌లు బలపడ్డాయి. జాక్సన్ వ్యతిరేకులు సెనేట్‌లో అధ్యక్షునిపై అభిశంసన తీర్మానాన్ని ఆమోదించినా, ప్రభుత్వ నిధుల ఉపసంహరణను మాత్రం ఆపలేకపోయారు. బ్యాంక్ ఛార్టరు 1836 వరకు కొనసాగింది. ఆ తరువాత అది పెన్సిల్వేనియా చట్టాలకి లోబడి, రాష్ట్ర బ్యాంక్‌గా పునర్వ్యవస్థీకరించబడింది.

## 7.11 ఆర్థిక విజృంభణ, మాంద్యం (Boom and Depression)

కేంద్ర బ్యాంక్‌పై ఎన్ని విమర్శలున్నా, రాష్ట్ర బ్యాంకులపై అదుపును కలిగి స్థిరమైన ఆర్థిక కట్టుబాట్లుకు దోహదపడేది. ప్రభుత్వ నిధుల ఉపసంహరణ వలన కేంద్ర బ్యాంక్‌కి గల ఆర్థిక శక్తి చాలా వరకు తగ్గించిన వెంటనే దేశం ద్రవ్యోల్బణంలో పడిపోయింది. రాష్ట్రాలలోని బ్యాంకుల సంఖ్య, అవి విడుదలచేసే నోట్ల సంఖ్య గణనీయంగా పెరిగి, ఆర్థిక వ్యవస్థ త్వరిత గతిన విజృంభించింది. అభివృద్ధి పనులకై రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల నుంచి అధిక మొత్తాలు అప్పుగా తీసికోవడం ప్రారంభించాయి. ప్రభుత్వ భూముల అమ్మకాలు 1834లో 4,000,000 ఎకరాలు ఉండగా 1836లో అవి 20,000,000 ఎకరాలకు పెరిగాయి. చాలా వరకు ఈ భూములు స్థిర నివాసుల కంటే వ్యాపారుల చేతుల్లోకే పోయాయి. రాష్ట్ర బ్యాంకుల నుండి అప్పుగా తీసికొన్న నోట్ల ద్వారా ఈ భూములకు చెల్లింపులు జరిగాయి.

ఆర్థిక విజృంభణ ఫలితంగా ప్రభుత్వాదాయం గణనీయంగా పెరిగింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో మొట్టమొదటి సారిగానూ, చివరిసారిగానూ 1835లో ప్రభుత్వానికున్న అప్పులన్నీ తీరిపోయి, ఖజానాలో అధిక మొత్తంలో మిగులుదల ఏర్పడింది. ఈ మిగులు నిధులను రాష్ట్రాలకు పంచేందుకు, అవి వాటిని తమకు నచ్చే విధంగా ఉపయోగించుకొనేందుకు ఒక బిల్లుని కాంగ్రెస్ 1836లో ఆమోదించింది.

అయితే ఈ ఆర్థిక పుష్టి ఎంతో కాలం కొనసాగలేదు. ఆర్థిక కార్యదర్శి 1836లో ఇక నుండి ప్రభుత్వం ప్రభుత్వ భూముల అమ్మకంలో బ్యాంకు నోట్లను స్వీకరించదని, బంగారు వెండిని మాత్రమే స్వీకరిస్తుందని ఒక ద్రవ్య ప్రకటనా పత్రాన్ని (Specie Circular) జారీ చేసాడు. జాక్సన్ ప్రభుత్వం బ్యాంక్‌లకు వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమంలోని చర్యయిది. దీని ద్వారా వారు రాష్ట్ర బ్యాంకులు విడుదల చేసే నోట్లను చెలా..ణిలో లేకుండా చేయడానికి ప్రయత్నించారు. కాని ఈ ప్రకటన పత్రం ఆలస్యంగా రావడంతో, అప్పుగా ఇచ్చేందుకు బ్యాంకుల్లో వెండి బంగారాలు లేవు. ప్రభుత్వ నిధులు కలిగియున్న బ్యాంకులు రాష్ట్రాలకు పంచేందుకు నిధులను ఇవ్వవలసి రావడంతో బ్యాంకుల పరిస్థితి మరీ బలహీనమయింది. ఈ విధంగా రాష్ట్ర బ్యాంకుల పరిస్థితి క్షీణించి, 1837 నాటికి అనేక బ్యాంకులు విఫలమయ్యాయి. అవి విడుదల చేసిన నోట్లకి విలువ లేకుండా పోయింది. వ్యవసాయోత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోయాయి. కర్మాగారాలు మూతపడనారంభించాయి. దేశం ఆర్థిక మాంద్యంలో మునిగిపోయింది. ఈ పరిస్థితి అనేక సంవత్సరాలు కొనసాగింది.

## 7.12 సుప్రీం కోర్టు :

జాక్సన్ పదవీ కాలంలో న్యాయ వ్యవస్థలో కూడా ప్రధాన మార్పులు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తితో సహా ఎనిమిది మంది సుప్రీంకోర్టు న్యాయ మూర్తులను ఇతడు నియమించాడు. దీని ఫలితంగా న్యాయ వ్యవస్థ తీర్పులు జాక్సన్ ప్రజా స్వామ్య విధానాలకు అనుగుణంగా ఉండేవి. రాజ్యాంగానికి సర్ జాన్ మార్షల్ విధానమైన ఫెడరలిస్ట్ వివరణ గాక, ప్రజా సంక్షేమ ధోరణిలో సాగేవి. సర్ జాన్ మార్షల్ తరువాత మేరీలాండ్‌కి చెందిన రోజర్ టానీ ప్రధాన న్యాయ మూర్తిగా 1835లో పదవీ స్వీకారం చేసాడు. టానీ రాష్ట్రాల అధికారాలను పటిష్ట పరచడంలోనూ, వాణిజ్యాన్ని నియంత్రించడంలోనూ, ప్రజా సంక్షేమం పట్ల సానుకూలత ప్రదర్శించాడు.

సుప్రీంకోర్టు దృక్పథంలో వచ్చిన మార్పు 1837 నాటి చార్లెస్ రివర్ బ్రిడ్జ్ వ్యాజ్యంలో స్పష్టమయింది. బోస్టన్ కేంబ్రిడ్జిలను కలుపుతూ వంతెనను నిర్మించమని చార్లెస్ రివర్ బ్రిడ్జి కంపెనీకి 1786లో మెస్సాచు సెట్స్ అనుమతించింది. సుంకాల ద్వారా అధిక లాభాలు పొందిన ఈ కంపెనీ తన గుత్తాధిపత్యాన్ని స్థాపించసాగింది. దీనిని భరించలేని మెస్సాచుసెట్స్ ప్రజలు రెండవ కంపెనీకి మరో వంతెన నిర్మించేందుకు అనుమతిని ఇచ్చారు. వంతెనకయిన ఖర్చుని సుంకాల ద్వారా రాబట్టుకొన్న తరువాత రాకపోకలు స్వేచ్ఛగా జరగాలని నిబంధన విధించారు. దానికి వ్యతిరేకంగా మొదటి కంపెనీ వారు సుప్రీం కోర్టులో దావా వేసారు. సర్‌జాన్ మార్షల్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నట్లయితే రెండవ వంతెన నిర్మాణం పూర్వపు ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని నిర్ణయించేవాడు. కాని రోజర్ టానీ విశిష్టమైన తీర్పులో వంతెన నిర్మించిన కంపెనీ ఆస్తి హక్కు కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని తీర్పు ఇచ్చాడు. "వ్యక్తిగత ఆస్తి హక్కులను పవిత్రంగా పరిగణించి వాటిని సురక్షిస్తూనే సమాజానికి కూడా హక్కులుంటాయనీ, వాటి సంరక్షణపైనే ప్రతీ పౌరుని సుఖ సంతోషాలు ఆధారపడి ఉంటాయని" పేర్కొన్నాడు. టానీ తీర్పుతో మితవాదులు భయభ్రాంతులయ్యారు. ఆస్తి హక్కులకు ఒప్పందాల పవిత్రతకు భంగం ఏర్పడుతుందని వారు భావించారు. జాక్సన్ ప్రజాస్వామ్యాన్ని న్యాయవ్యవస్థ బలపరచింది.

## 7.13. ఇండియన్ విధానం :

ఇండియన్లతో జాక్సన్ కఠినంగా ప్రవర్తించాడు. దేశాధ్యక్షునిగా ఉన్న ఎనిమిది సంవత్సరాలలో (1829-37) వారితో మొత్తం 94 ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. వీని ఫలితంగా అనేకమంది ఇండియన్ తెగలను, వారి సొంత చట్టాలకు, ఆచారాలకు లోబడి జీవించే జాతులుగా ప్రభుత్వం గుర్తించింది. కొన్ని సందర్భాలలో వారిని ప్రత్యేక తెగలుగా గుర్తించి, కొన్ని ప్రదేశాలను వారికి కేటాయించి, అక్కడకు వారిని వలస పొమ్మని ఆదేశించడం జరిగింది. జాక్సన్ 1836లో ఇండియన్ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటుచేసి, ఇండియన్ల నుంచి గ్రహించిన భూములకు తగిన పరిహారాన్ని చెల్లించాడు. ఇండియన్లు ఇందుకు అంగీకరించక ప్రతిఘటించిన సందర్భాలలో జాక్సన్ బలప్రయోగం

చేశాడు. చివరకు బ్లాక్ హోల్ యుద్ధాలు, సెమినోల్ యుద్ధం చేయడం ద్వారా అమెరికాకు **ఇండియన్ల వల్ల కలిగే** ప్రమాదం అంతమయింది. స్పష్టమైన కఠినవైఖరి అవలంభించడం ద్వారా ఇండియన్ల నుంచి వచ్చే ముప్పుకి నివారణ జరిగింది.

## 7.14. విదేశీ విధానము :

జాక్సన్ ధైర్యంగా చర్యలు తీసికొంటూ, ముందుకు సాగేవాడు. బ్రిటన్‌తో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాడు. సరిహద్దు సమస్య ఫలితంగా బ్రిటన్‌తో సత్సంబంధాలు లేకున్నా, జాక్సన్ సంప్రదింపులు ప్రారంభించి, వాటిని అనేక నెలలు కొనసాగించి, చివరకు బ్రిటీష్ వలస రేవుల ద్వారా అమెరికా వాణిజ్యానికి అనుమతిని సాధించాడు. బ్రిటన్ ఆధిపత్యంలోని వెస్టిండీస్‌లో అమెరికా ఉత్పత్తులు, నౌకలపై బ్రిటిష్ నిబంధనలను తొలగించడానికి బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంగీకరింపజేయడంలో వాన్ బ్యూరెన్ విజయం సాధించాడు.

ఫ్రాన్స్‌తో అమెరికా సంబంధాలు మొదట జటిలమయి, తరువాత మెరుగయ్యాయి. బెర్లిన్, మిలన్ డిక్రీల కారణంగా అమెరికాకు కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించే విషయంలో ఫ్రాన్స్‌తో వివాదం ఏర్పడింది. లూయీ ఫిలిప్ ప్రభుత్వం 1831 నాటి సంధి ప్రకారం 50,00,000 డాలర్లను నష్ట పరిహారంగా ఇచ్చేందుకు అంగీకరించి, దానికి బదులుగా ఫ్రాన్స్‌లో తయారయిన మద్యంపై అమెరికా విధించే సుంకాలని తగ్గించాలని షరతు పెట్టింది. అమెరికా కాంగ్రెస్ దీనికి ఆమోదం తెలిపింది. కాని ఫ్రాన్స్ శాసనసభ మాత్రం డబ్బు చెల్లింపు విషయంలో నిర్ణయం తీసికోకుండానే వాయిదా పడింది. ఒప్పందం ప్రకారం మొదటి వాయిదా క్రింద 10,00,000 డాలర్ల చెల్లింపుకి సంబంధించిన డబ్బు వసూలు కాలేదు. దీనితో జాక్సన్ వెంటనే అమెరికా వాణిజ్య వర్గాలకు హెచ్చరిక చేశాడు. అంతేగాక డిసెంబరు 1834లో నావికా దళాన్ని సమాయత్తం చేసేందుకు ఆదేశాలు జారీ చేసాడు. ఫ్రాన్స్ ఆస్తులపై దాడికి అధికార మివ్వవలసిందని కాంగ్రెస్‌ని కోరడం ద్వారా జాక్సన్ ఫ్రాన్స్‌కి కోపాన్ని తెప్పించాడు. చివరకు ఫ్రాన్స్ శాసనసభ నష్టపరిహారంగా చెల్లించవలసిన డబ్బుకి ఆమోదం తెలుపుతూ అమెరికా అధ్యక్షుడయిన జాక్సన్ ఉపయోగించిన పదాలకు "సంతృప్తికరమైన వివరణ" ఇచ్చేంత వరకు చెల్లింపులు చేయకూడదనే షరతు విధించింది. కాని జాక్సన్ క్షమాపణ చెప్పేందుకు నిరాకరించాడు. దీని ఫలితంగా, అమెరికా-ఫ్రాన్స్‌ల మధ్య 1835లో యుద్ధ ప్రమాదం ఏర్పడింది.

ఈ పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం నిర్వహించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీని ఫలితంగా జాక్సన్ క్షమాపణ చెప్పనప్పటికీ, ఫ్రాన్స్‌ని అవమానించే ఉద్దేశం తనకి లేదని ప్రకటించాడు. ఈ విధంగా తన గౌరవం కాపాడబడటంతో సంతృప్తి చెందిన ఫ్రాన్స్ 1831 నాటి ఒప్పందాన్ని అమలు చేసింది.

జాక్సన్ సయాం (థాయిలాండ్) రాజుతోనూ, మస్కట్ సుల్తాను తోనూ ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. ఈ విధంగా జాక్సన్ పాలనలోనే ఆసియా దేశాలతో అమెరికా ఒప్పందాలు చేసికోవడం ప్రారంభించింది.

టెక్సాస్ రిపబ్లిక్ పట్ల జాక్సన్ వేచియుండే విధానాన్ని అనుసరించాడు. టెక్సాస్‌లోని అమెరికన్లు మెక్సికో ప్రభుత్వంతో ఘర్షణపడి, శాన్ జసింటో యుద్ధం ద్వారా 1836లో స్వతంత్ర దేశమయింది. అమెరికాలో అంతర్భాగమవడానికి అనుమతిని కోరింది. ఈ అభ్యర్థనను జాక్సన్ మన్నించలేదు. మెక్సికో ప్రభుత్వాన్ని శత్రువుగా చేసుకొనేందుకుగాని, బానిసత్వ వ్యవస్థగల టెక్సాస్‌ను యూనియన్‌లో చేర్చుకోవడం ద్వారా ఔత్తరాహుల నిరసనను ఎదుర్కోవడానికి గాని జాక్సన్ సిద్ధంగా లేడు. కాని టెక్సాస్ రిపబ్లిక్ ఉనికిని అధికార పూర్వకంగా 1837లో గుర్తించాడు.

## 7.15 సంగ్రహంగా :

అమెరికా అధ్యక్షులయిన లింకన్, రూజువెల్ట్‌ల వలె జాక్సన్‌కి కూడా అత్యంత ప్రజాకర్షణ ఉండేది. స్థిరమైన స్వభావం, లోక జ్ఞానం గల సాధారణ అమెరికా పౌరుడు ఎన్నికల్లో గెలిచి, అత్యంత శక్తిమంతమైన పదవిని సమర్థవంతంగా నిర్వహించగలడని జాక్సన్ నిరూపించాడు.

నిరాడంబరత, ముక్కు సూటితనం, రాజీపడేందుకు తిరస్కరించడం, స్త్రీల విషయంలో సున్నితత్వం ఇతని లక్షణాలు. కాంగ్రెస్ వలెనే అధ్యక్షుడు కూడా ప్రజలకు నేరుగా ప్రాతినిధ్యం వహిస్తున్నాడని జాక్సన్ వాదించేవాడు. జాక్సన్ అత్యధిక బిల్లులను వీటో చేశాడు. రాజ్యాంగా కారణాల వల్లగాక వ్యక్తిగతంగా తాను అంగీకరించని కారణంగానే బిల్లులను తిరస్కరించేవాడు. విదేశీ విధానంలో కఠినంగానూ, కేంద్ర బ్యాంక్ విషయంలో సంపూర్ణ విజయం సాధించడం ద్వారానూ అధ్యక్షపదవికి ప్రాముఖ్యం తెచ్చాడు. దక్షిణ కెరోలినా రద్దు ప్రతిపాదనను భగ్నం చేయడం ద్వారా యూనియన్ ఐక్యతను కాపాడగలిగాడు. ఇతడు శక్తివంతమైన కార్య నిర్వాహకునిగా పేరు తెచ్చుకొన్నాడు.

## వ్యాస రూప ప్రశ్నలు

1. అమెరికా అధ్యక్షునిగా జాక్సన్ సాధించిన విజయాలు వర్ణించండి.
2. జాక్సన్ ప్రజాస్వామ్య విధానాలను చర్చించండి.
3. జాక్సన్ అనుసరించిన ఆర్థిక విధానాలను, వాటి ఫలితాలను తెలుపండి.

## ఉపయుక్త గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | A.J. Schlesinger | : | The Age of Jackson |
| 2. | J.G. Van Deusch | : | The Jacksonian Era (1828 - 1848) |
| 3. | James Marquis | : | Andrew Jackson : The Portrait of A President |
| 4. | Samuel Eliot Morision, Henry Steele Commager, and Willian E. Leuchtenburg | : | The Growth of American Republic. |



ప్రొఫెసర్ బి. మస్తానయ్య
ఆంధ్ర విశ్వ విద్యాలయం
విశాఖపట్నం

## పాఠం - 8

# అమెరికా మెక్సికో యుద్ధం 1846-1848

### 8.1 లక్ష్యం :

మెక్సికోతో క్రీ.శ. 1846లో యుద్ధానికి దారి తీసిన పరిస్థితులను యుద్ధ ఫలితాలను విశ్లేషించడమే ఈ పాఠానికి లక్ష్యం.

### విషయ క్రమం :


8.2 అమెరికా విస్తరణకు కారణాలు - జనాభా పెరుగుదల
8.3 ఆర్థిక కారణాలు
8.4 అమెరికన్ జాతీయ అహంభావం
8.5 అమెరికన్‌లకు మెక్సికో ప్రాంతాల ఆకర్షణలు
8.6 న్యూమెక్సికోతో అమెరికన్‌ల సంబంధాలు
8.7 ఓరిగాన్ ఉదంతము
8.8 కాలిఫోర్నియాలో క్లిష్ట పరిస్థితి
8.9 ఓరిగాన్ సంధి 1846
8.10 మెక్సికోతో యుద్ధం
8.11 స్లైడెల్ కమిషన్
8.12 యుద్ధ గమనము
8.13 కాలిఫోర్నియాను జయించడం
8.14 మెక్సికో పట్టణంపై దాడి
8.15 గుడలూప్ హిడాల్గో సంధి - 1848


### 8.2 అమెరికా విస్తరణకు కారణాలు - జనాభా పెరుగుదల .

క్రీ.శ. 1812 నుండి 1850 నాటికి, సుమారు 72,50,000 నుండి 2కోట్ల 30 లక్షల దాకా జనాభా పెరిగింది. ఈ కాలంలో స్థావరాలకు అనువుగా దొరికిన భూమి వైశాల్యం యూరపు ఖండమంత పెరిగింది. అంటే 44,20,000 నుండి 78,00,000 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. వ్యవసాయాభివృద్ధితో పాటు పరిశ్రమలు అతి త్వరగా పెరుగుతున్నాయి. సుమారు క్రీ.శ. 1830 ప్రాంతాల నుంచి అమెరికన్‌లు పశ్చిమ దిశకు విస్తరించే కార్యక్రమాన్ని చురుకుగా కొనసాగించి, సంయుక్త రాష్ట్రాలలో కలుపుకోవడం జరిగింది. బ్రిటన్‌తో కొంత సంఘర్షణ జరిగిన తరువాత ఓరిగాన్ (Oregon) ప్రాంతము సంయుక్త రాష్ట్రాలలో చేరింది.

### 8.3 ఆర్థిక కారణాలు :

క్రీ.శ. 1840 నాటికి దక్షిణ మిసిసిపి లోయనుపూర్తిగా అమెరికన్‌లు ఆక్రమించడంతో ఆ ప్రాంతంలో నూతనంగా వచ్చేవారు ఆక్రమించడానికి మంచి భూములు కరువైనాయి. ఉత్తర లోయలో అయోవా (Iowa), ఇలినాయ్ (Illinois), విస్కాన్సిన్ (Wisconsin)లు అనాక్రమిత ప్రాంతాలుగా ఉన్నాయి. అమెరికన్‌ల పశ్చిమ విస్తరణ కార్యక్రమము దక్షిణలోయనుంచి పశ్చిమంగా కొనసాగింది. 1837

ామం తరువాత సంయుక్త రాష్ట్రాలలో ఏర్పడిన పరిస్థితి కూడా విస్తరణ కార్యక్రమానికి దోహదం చేసింది. ఆహార పంటల (Foodcrops) ాలు హఠాత్తుగా పడిపోవడం వల్ల వ్యవసాయ దారులుబాగా దెబ్బతిన్నారు. 1830 తరువాత కొనసాగిన రోడ్డు రవాణా సౌకర్యాల కార్యక్రమం ల్ల ప్రభుత్వం పన్నులను అధికం చేసింది. ఆ సుంకాలను మిసిసిపీలోయ రాష్ట్రాల వారు చెల్లించలేక ఋణగ్రస్తులయ్యారు.

## 4 అమెరికన్‌ల జాతీయ అహంభావం :

జాక్సన్ శకంలో అమెరికన్ పౌరుడు తన దేశము ప్రపంచమంతటిలో మహోన్నతమైందిగా భావించడం ప్రారంభించాడు. తన ం అన్ని రంగాలలోను పురోగమించిందని, వైభవ ప్రాభవాలతో తులతూగుతున్నదని ప్రతి అమెరికన్ పౌరుడూ దృఢంగా నమ్మాడు. మెరికన్ జాతి అనే సువర్ణ ఛత్రం కిందికి, దూర పశ్చిమ ప్రాంతము, కెనడా, మెక్సికో మధ్య, దక్షిణ అమెరికాల ప్రజలను చేర్చవలెనని మెరికన్‌లు కలలకన్నారు. మహోత్కృష్టమైన అమెరికన్ ప్రజాస్వామ్యముపైన పేర్కొన ప్రాంతాలలో వేళ్ళూనవలెనని వారు ఆశించారు. ఈ ారణం వల్ల కూడా అమెరికన్‌లు పశ్చిమానికి విస్తరించే కార్యక్రమం చేపట్టారు.

## .5 అమెరికన్‌లకు మెక్సికో ప్రాంతాల ఆకర్షణలు :

మహా మైదాన ప్రాంతాన్ని (Great Plains Region) అన్వేషకులు (explorers) పెద్ద అమెరికన్ ఎడారి అని వర్ణించారు. ల్లవారు నివసించడానికి యోగ్యమైనది కాదని భావించిన ఈ ప్రాంతానికి తూర్పు ప్రాంతం నుంచి తెల్లవారిచేత తరమబడిన ఎర్ర ండియన్‌లు వచ్చి స్థావరాలేర్పరచుకొన్నారు. పశ్చిమ విస్తరణ కార్యక్రమంలో ముందంజవేసిన అమెరికన్‌లు ఈ మహామైదాన ప్రాంతంలో ంచి సుభిక్ష ప్రాంతాలైన తూర్పుటెక్సాస్, ఒరిగాన్, కాలిఫోర్నియాలకు చేరవలసి ఉంది. ఈ ప్రాంతాలు అమెరికన్‌లను ఆకర్షించాయి.

## .6 న్యూమెక్సికోతో అమెరికన్‌ల సంబంధాలు :

న్యూ మెక్సికోలో శాంతా ఫే (Santa Fe) పట్టణము ఒక గొప్ప వ్యాపార కేంద్రంగా ఉండేది. క్రీ.శ. 1821లో అమెరికన్‌లు ుట్టమొదటి సారిగా ఆ పట్టణంతో వ్యాపార సంపర్కం ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడికి వెళ్ళిన అమెరికన్ వర్తకులు తిరుగు యాణంలో తోళ్ళు (Fars), వెండి, బంగారాలను వ్యాగన్‌లలో నింపుకొని తెచ్చేవారు. ఈ విధంగా అమెరికన్ వర్తకులు న్యూమెక్సికోకు కపోకలు సాగించినందువల్ల న్యూమెక్సికోపైన మెక్సికో అధికారం నామ మాత్రంగా ఉందని కూడా అమెరికన్‌లకు తెలిసింది. అమెరికన్‌లు క్కువ భూభాగాన్ని ఆక్రమించుకొనవలెనని ఉబలాటపడడానికి ఈ పరిస్థితి దోహదం చేసింది. "పర్వత పురుషులు" (Mountain Men) నే పేరు పొందిన కొంతమంది వర్తకులు బీవర్ (beaver) మృగాల కోసం అన్వేషణలు జరుపుతూ పశ్చిమ ప్రాంతాలను బాగా పరిశీలించారు. ారి పరిశీలనవల్ల తూర్పు ప్రాంతపు అమెరికన్‌లకు పశ్చిమ ప్రాంతంలోని సారవంతమైన భూములతో బాటు నౌకాయానానికి అనువైన ులను గురించి కూడా క్షుణ్ణంగా తెలిసింది.

## .7 ఒరిగాన్ ఉదంతము :

క్రీ.శ. 1738లో ఆంగ్లేయ నావికుడు జేమ్స్ కుక్ (James Cook) ఒరిగాన్ కోస్తా ప్రాంతాన్ని పరిశీలించాడు. ఆ ప్రాంతంలో ఉన్ని ుష్కళంగా లభిస్తుందని దానిని చైనాకు ఎగుమతి చేసి విరివిగా ద్రవ్యాన్ని సంపాదించవచ్చునని అతడు తెలుసుకొన్నాడు. ఆ తరువాత కొద్ది జులలోనే న్యూ ఇంగ్లండ్ వర్తకులు తమ నౌకలలో దక్షిణ అమెరికాకు ప్రదక్షిణం చేసి ఒరిగాన్ కోస్తా చేరి ఉన్ని, మరికొన్ని విలాస స్తువులను సేకరించారు. ఈ ప్రయాణాల (Expedition)లోనే 1792లో ఒక నౌకాధికారి కొలంబియా నదిని కనుగొన్నాడు. నెపోలియన్ ంగ్రామాల కాలంలో ఆంగ్లేయులు ఉన్ని వ్యాపారాన్ని తాత్కాలికంగా మానుకొన్నందువల్ల అమెరికన్‌లకు చైనాతో ఈ వ్యాపారం విషయంలో ుత్తాధికారం లభించింది.

న్యూ ఇంగ్లండ్ నుంచి సముద్ర మార్గం ద్వారా ఓరిగాన్‌కు రాకపోకలు సాగించిన వర్తకులుగాక, కెనడా దేశస్థులు కొంతమంది భూ మార్గం ద్వారా ఓరిగాన్ ప్రాంతాన్ని చేరసాగారు. ఉదాహరణకు నార్త్-ఈస్ట్ కంపెనీ అనే పేరు గల ఒక కంపెనీ 1793లో ఈ కార్యక్రమాన్ని కొనసాగించింది. తరువాత కొద్ది సంవత్సరాల కాలంలో చాలా మంది కెనడా దేశస్థులు ఓరిగాన్ ప్రాంతాన్ని అన్వేషించారు. ఈ అన్వేషణ వల్ల ఇంగ్లండ్‌కు ఓరిగాన్ ప్రాంతంపై కొంత హక్కు ఏర్పడింది.

అమెరికన్‌లు చిరకాలం నుంచి ఓరిగాన్ ప్రాంతానికిరాక పోకలు జరిపినప్పటికీ మొట్టమొదటిసారిగా ఆ ప్రాంతంలో స్థావరం ఏర్పరచడం 1808లో జరిగింది. ఆ సంవత్సరంలో జాకబ్ ఆస్టర్ (Jacob Astor) అనే వ్యక్తి అమెరికన్ ఫర్ కంపెనీని స్థాపించాడు. ఇతడు 1812లో కొలంబియా నది ముఖ ద్వారం వద్ద ఆస్టోరియా (Astoria) అనబడే అమెరికన్ స్థావరాన్ని నెలకొల్పాడు. ఆ తరువాత చాలా మంది అమెరికన్ వర్తకులు ఆ ప్రాంతానికి వెళ్ళి వ్యాపార కేంద్రాలను స్థాపించారు. కానీ 1812 యుద్ధం వల్ల ఈ కార్యక్రమము పూర్తిగా విఫలమైంది. ఆస్టర్ ఆ ప్రాంతంలో తనకున్న సర్వ హక్కులను కెనడాకు చెందిన "నార్త్ వెస్ట్ కంపెనీ"కి అమ్మి వేయడంతో, ఓరిగాన్‌లో అమెరికన్ ఆక్రమణ కార్యక్రమం తాత్కాలికంగా నిలిచిపోయింది.

ఆ తరువాత ఓరిగాన్ బ్రిటిష్ వారి ఆధిపత్యం కిందికి వచ్చింది. 1821లో నార్త్ - ఈస్ట్ కంపెనీ, నార్త్-వెస్ట్ కంపెనీలు యునైటెడ్ కంపెనీ అనే పేరుతో తరువాత 20 సంవత్సరాల పాటు ఓరిగాన్ ప్రాంతము యునైటెడ్ కంపెనీ ప్రతినిధి అజమాయిషీ కింద ఉంది. ఆ వ్యక్తి కొలంబియా నది ఉత్తరపు టొడ్డున వాంకూవర్ కోట (Fort Vancouver) నిర్మించాడు. ఇదే కాకుండా ఇంకా కొన్ని కోటలను కూడా ఈ ప్రాంతంలో అతడు నిర్మించాడు. ఓరిగాన్‌ను అమెరికన్‌లు వశపరచు కొనడానికి ఈ గుత్తాధికారాన్ని విచ్ఛిన్నం చేయవలసి ఉంది.

**ఓరిగాన్ ప్రాంతంలోకి అమెరికన్‌ల ప్రవేశము :** 1824 నాటికి అమెరికన్‌లు ఆంగ్లేయులు కూడా ఓరిగాన్ ప్రాంతం మీద ఆధిపత్యం కోసం పోటీపడసాగారు. కొలంబియా నదికి ఉత్తరంగా ఉన్న భూభాగం విషయమై ఏదో ఒక విధంగా సర్దుబాటు చేసుకొనడానికి బ్రిటన్ సంసిద్ధంగానే ఉంది. కాని అమెరికా 49వ అక్షాంశానికి దక్షిణంగా ఉన్న భూభాగాన్ని కోరింది. కొలంబియా నదికి 49వ అక్షాంశానికి మధ్య త్రికోణాకారంలో ఉన్న భూ భాగము సరిహద్దు తగాదాకు కేంద్రంగా తయారైంది. ఈ తగాదాలో చిక్కుకున్న భూభాగము తనదని ఏ దేశమూ ఖచ్చితంగా కోరనందువల్ల రెండు దేశాలు ఉమ్మడి ఆక్రమణ సంధి (Treaty of Jointocurpation)ని కుదుర్చుకొన్నాయి. ఈ సంధి ప్రకారం రెండు దేశాల పౌరులు అక్కడ స్థావరాలేర్పరచుకొని వ్యాపారం కొనసాగించడానికి వసతి కల్పించడమయింది. ఆ తరువాత కొంత కాలం అమెరికన్ వ్యాపారులెందరో ఓరిగాన్‌లో ఆంగ్లేయుల పలుకుబడిని నిర్మూలించవలెనని ప్రయత్నించి నిరాశ చెందారు. అమెరికన్ మత ప్రచారకులు క్రీ.శ. 1833 ప్రాంతంలో, ఓరిగాన్‌కు వెళ్ళి మత ప్రచార కేంద్రాలను స్థాపించినారు. వారు కూడా స్వదేశానికి తిరిగి వెళ్లినప్పుడు ఆ ప్రాంతపు సిరి సంపదలను గురించి విశేషంగా ప్రచారం చేసినారు. అమెరికన్‌లు తండోప తండాలుగా ఓరిగాన్‌కు 1841నుంచి తరలి వెళ్ళారు. వారు ఓరిగాన్ ట్రెయిల్ (Oregon trail) అనే బారులు తీరిన పెద్ద కారవాన్ బండ్లలో పశ్చిమంగా పయనించారు. అమెరికన్‌ల జనాభా 1843 నాటికి బాగా వృద్ధి కావడం వల్ల వారక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని నెలకొల్పారు. అమెరికన్ యూనియన్‌లో ఓరిగాన్‌ను చేర్చుకొనవలెనని కూడ కోరారు. కొలంబియా నదికి ఉత్తరంగా ఉన్న ప్రాంతం కెనడా హరిహడ్సన్ బే కంపెనీ అజమాయిషీలో ఉన్నందువల్ల ఒక పెద్ద ఘర్షణ ప్రారంభమైంది.

## 8.8. కాలిఫోర్నియాలో క్లిష్ట పరిస్థితి :

అమెరికా స్వాతంత్ర్యము పొందడానికి ముందు నుంచే కాలిఫోర్నియా స్పెయిన్ స్వాధీనంలో ఉండేది. శాన్ డియాగో (San Diego) నుంచి శాన్ ఫ్రాన్సిస్కో వరకు ఉన్న తీర ప్రాంతంలో కోటలను, మత ప్రచార కేంద్రాలను కూడా స్పెయిన్ వారు స్థాపించారు. 1821 వరకు (మెక్సికో స్వాతంత్ర్యం సంపాదించేవరకు) కాలిఫోర్నియాలో నివసిస్తుండే వారు ముఖ్యంగా క్రైస్తవ మతాన్ని అవలంబించిన ఇండియన్‌లు, క్రీ.శ. 1821 తరువాత భూమిని పశువుల మందల యజమానుల (Ranchers)కు స్పెయిన్ ప్రభుత్వం పంచి పెట్టింది. అయితే మెక్సికన్ పౌరులు కాని వారు కొందరిక్కడ భూమిని సంపాదించినారు. వారిలో ముఖ్యంగా పేర్కొనదగ్గ వ్యక్తి జాన్ సట్టర్ (John Sutter) ఇతడు దిగువ శాక్రమెంట్ లోయలో ఒక కోట నిర్మించాడు. ఈ కోట కాలిఫోర్నియాలో కాలు పెట్టిన అమెరికన్‌లకు కేంద్రంగా

ఉపకరించింది. క్రీ.శ. 1830 తరువాత కాలిఫోర్నియాలో పశువుల మందల యజమానులు అసంఖ్యాకంగా స్థిరపడ్డారు. 1820 నుంచి పశు చర్మము (hide), పశువుల కొవ్వు (tallow) అమ్మే వర్తకులు న్యూ ఇంగ్లండ్ నుంచి కాలిఫోర్నియాకు వెళ్ళేవారు. వారక్కడ తమ పాద రక్షల కర్మాగారాల కోసం పశువుల చర్మాలను తీసుకొని వెళ్ళేవారు. వీరు కూడా స్వదేశానికి తిరిగి వెళ్ళిన తరువాత కాలిఫోర్నియాలోని సారవంతమైన భూములను గురించి ప్రచారం చేసేవారు. దీని ఫలితంగా 1841లో అమెరికన్‌లు భూ మార్గం ద్వారా కాలిఫోర్నియాకు తరలిపోవడం ప్రారంభించారు. 1844 సంవత్సరానికి కొన్ని వందల అమెరికన్ కుటుంబాల వారు దిగువ శాక్రమెంటో లోయలో నివసించసాగినారు. ఇక్కడి అమెరికన్‌లు కాలిఫోర్నియాను అమెరికన్ యూనియన్‌లో చేర్చుకోవలెనని కోరారు. థామస్ లార్కిన్ (Thomas Larkin) అనే వ్యక్తి వారి నాయకుడు, అతడు కాలిఫోర్నియాలోని మెక్సికన్‌లు అమెరికన్‌లు కలిసి మెక్సికో ప్రభుత్వంపై విప్లవం లేవదీయడానికి పథకం ఏర్పాట్లు చేసాడు, ఆ విప్లవం సంభవిస్తే అమెరికన్‌లు కష్ట నష్టాలకు గురి అవుతారనే జాలితో అమెరికన్ ప్రభుత్వము కాలిఫోర్నియాను యూనియన్‌లో చేర్చుకొంటుందని అతడు ఆశించాడు. ఈ విధంగా 1844 నాటికి ఓరిగాన్‌లో పరిస్థితులు తీవ్ర రూపం దాల్చినట్లుగానే కాలిఫోర్నియాలో కూడా క్లిష్ట పరిస్థితి ఏర్పడింది.

## 8.9 టెక్సాస్ సమస్య :

క్రీ.శ. 1844 ఎన్నికల ముందు టెక్సాస్‌ను యూనియన్‌లో చేర్చుకోవలెనా లేదా అన్న సమస్యపై దేశంలో తీవ్రమైన వాదోపవాదాలు చెలరేగాయి. టెక్సాస్‌ను అమెరికన్ యూనియన్‌లో చేర్చుకొనడానికి అమెరికన్ ప్రభుత్వము విముఖత చూపించింది. ఆ తరవాత బ్రిటన్ టెక్సాస్‌ను స్వతంత్ర దేశంగా ఉంచడానికి ప్రయత్నించింది. ఆ విధంగా చేసినందువల్ల తనకు కొన్ని లాభాలు చేకూరుతాయని బ్రిటన్ ఆశించింది 1) బ్రిటన్ తన పారిశ్రామికోత్పత్తులను టెక్సాస్‌లో విక్రయించి ఆ విలువకు పత్తిని కొనవచ్చు. టెక్సాస్ అమెరికన్ యూనియన్‌లో కలిసి పోతే ఈ విధంగా చేయడానికి సాధ్యపడదు. 2) టెక్సాస్ స్వతంత్ర దేశంగా ఉన్నట్లయితే తానాశించిన విధంగా అక్కడ బానిసత్వ వ్యవస్థను నిర్మూలించవచ్చు. ఈ కారణాలవల్ల 1844లో బ్రిటన్ టెక్సాస్ స్వాతంత్ర్యాన్ని గుర్తించవలసిందిగా మెక్సికోను కోరింది.

బ్రిటన్ టెక్సాస్‌పై చూపిన ఆసక్తి ఫలితంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సైతం టెక్సాస్ విషయంలో శ్రద్ధ పెరిగింది. టెక్సాస్‌ను అమెరికన్ యూనియన్‌లో చేర్చుకోవలెనన్న కాంక్ష అమెరికన్‌లలో అధికమైంది. 1844లో అధ్యక్షుడు జాన్ టైలర్ (John Tyler) తన విదేశాంగ శాఖ కార్యదర్శి (Secretary of State) ని ఈ విషయమై సంధి చిత్తు ప్రతిని తయారు చేయమని ఆదేశించాడు, సంధి అధికార పత్రాలను కాంగ్రెస్ ఆమోద ముద్ర కోసం కాంగ్రెస్ దృష్టికి తెచ్చాడు. టెక్సాస్‌లో బానిసత్వాన్ని నిర్మూలించవలెనని బ్రిటన్ చేస్తున్న ప్రయత్నాలను వమ్ము చేయడానికి వేరే మార్గం లేదని అతడు చెప్పాడు. కాని సెనేట్‌లోని బానిసత్వ నిర్మూలన వాదులు, మెక్సికోతో యుద్ధం సంభవిస్తుందేమోనని శంకించిన సభ్యులు ఈ సంధిని ఆమోదించడానికి వ్యతిరేకించిన కారణంగా సంధి ప్రయత్నం విఫలమైంది. ముఖ్యంగా చాలా మంది అమెరికన్‌లు టెక్సాస్ సమస్యను 1844 ఎన్నికల తరువాత పరిష్కరించడం యుక్తమని భావించారు. ఈ ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జేమ్స్‌కే పోక్ (James K. Polk) టెక్సాస్‌ను యూనియన్‌లో చేర్చుకొనే విషయంలో సుముఖత చూపి ప్రత్యర్థి అయిన హెన్రీ క్లేని ఓడించాడు. పదవీ విరమణ చేయబోయే అధ్యక్షుడు జాన్‌టైలర్ తన పదవీ కాలంలోనే టెక్సాస్‌ను యూనియన్‌లో చేర్చుకోవలెనని అభిలషించాడు. కాని సంధి ప్రయత్నం చేసినట్లయితే సెనేట్ ఆమోదం లభించదని ఎరిగిన టైలర్ టెక్సాస్ ప్రభుత్వానికి అమెరికన్ ప్రభుత్వానికి మధ్య "ద్విపాక్షిక తీర్మానం" (Joint Resolution) ని కుదిర్చి టెక్సాస్‌ను అమెరికన్ యూనియన్‌లో చేరవలసిందిగా ఆహ్వానించాడు. ఈ తీర్మానంపై 1845లో టైలర్ సంతకం చేసాడు. అదే సంవత్సరంలో టెక్సాస్ యూనియన్‌లో చేరింది.

## 8.10 ఓరిగాన్ సంధి - 1846 :

ఉమ్మడి ఆక్రమణ సంధిని రద్దు పరచి ఓరిగాన్‌ను యనియన్‌లో చేర్చుకోవడానికి తగు ప్రయత్నం చేసేటందుకు తనకధికారం ఇవ్వవలసిందిగా అధ్యక్షుడు పోక్ 1845లో కాంగ్రెస్‌ను కోరాడు. ఓరిగాన్ విషయమై బ్రిటన్‌కు పంపిన లేఖలో అమెరికన్ ప్రభుత్వము బ్రిటన్‌తో యుద్ధానికి కాలు దువ్వడం లేదని స్నేహ పూర్వకంగా ఓరిగాన్‌ను స్వాధీనపరచగోరుతోందని పోక్ తెలియపరచాడు. ఈలోపుగా హడ్సన్ బే కంపెనీ వాంకూవర్ కోటను కొలంబియా నది దగ్గర నుంచి వాంకూవర్ దీవికి మార్చుకోవడానికి తీర్మానించింది. అంటే తగాదాలో

ఉన్న భూ భాగంపై తనకేవిధమైన హక్కు అక్కరలేదని ఈ కంపెనీ బ్రిటన్‌కు తెలిపింది. పైగా బ్రిటన్ కూడా అమెరికా సంయుక్త రాష్ట్రాలతో స్నేహాన్ని అభిలషించింది. క్రీ.శ. 1846లో ధాన్య చట్టాల (Corn laws) ను బ్రిటిష్ పార్లమెంట్ రద్దుచేసినందువల్ల బ్రిటన్‌కు అమెరికన్ ఆహార ధాన్యాల అవసరం కలిగింది. ఈ విధంగా పరిస్థితులు అనుకూలించి నందువల్ల అమెరికా బ్రిటన్‌తో ఓరిగాన్ సంధి నిర్ణయాన్ని (Oregon Treaty Settlement) కుదుర్చుకొని తగాదాలో ఉన్న ఓరిగాన్ ప్రాంతాన్ని స్వాధీనపరచుకొంది.

## 8.11 మెక్సికోతో యుద్ధం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మెక్సికోకు మధ్య కొన్ని తగాదాలు ఏర్పడ్డాయి. మెక్సికో వరసగా బలహీనమైన ప్రభుత్వాల పరిపాలనలో ఉండటంవల్ల అమెరికన్ ప్రభుత్వము కొన్ని ఇబ్బందుల నెదుర్కోవలసి వచ్చింది. మెక్సికన్ ప్రజలు అమెరికన్ ప్రజలు కలిసి కోరిన ఒక సంధిని ఆమోదించే విషయంలో మెక్సికో ప్రభుత్వము జాప్యం చేసింది. మెక్సికోలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తరచుగా విప్లవాలు చెలరేగుతున్నాయి. ఆ విప్లవ సమయాలలో మెక్సికన్ భూభాగంపై నివసించే అమెరికన్ పౌరుల ఆస్తులను, ప్రాణాలను కాపాడే విషయంలో మెక్సికన్ ప్రభుత్వము అసమర్థత చూపింది. రియోగ్రాండ్ (Riogrande) నదిని తన దక్షిణ సరి హద్దుగా గుర్తించమని టెక్సాస్, మెక్సికోను కోరగా మెక్సికో నిరాకరించింది. టెక్సాస్‌ను అమెరికన్ యూనియన్‌లో అంతర్భాగంగా చేసుకొన్న విషయం అధికార పూర్వకంగా గుర్తించడానికి మెక్సికో నిరాకరించింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మెక్సికో రాయబారిని, మెక్సికో స్వదేశానికి తిరిగి రమ్మని కబురుచేసి, అమెరికాతో దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకొంది. ఈ పరిస్థితులలో మెక్సికోపై ఆగ్రహించిన యూనియన్ పౌరులు ఈ విధంగా అన్నారు. టెక్సాస్ అమెరికన్ యూనియన్‌లో చేరడానికి ముందే పది సంవత్సరాల నుంచి స్వతంత్ర దేశంగా ఉంది. టెక్సాస్ స్వాతంత్ర్యాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలేగాక అనేక ఐరోపా దేశాలు కూడా గుర్తించాయి. టెక్సాస్, మెక్సికో ప్రభుత్వంపై తిరుగుబాటు జరపడం మెక్సికో దృష్టిలో న్యాయ సమ్మతం కాకపోతే, మెక్సికో ఒకానొకప్పుడు స్పెయిన్ ప్రభుత్వంపై తిరగుబాటు జరపటం న్యాయ సమ్మతమవుతుందా అని ప్రశ్నించారు. మెక్సికోలో జరుగుతున్న విప్లవాలలో అమెరికన్ పౌరులు ఆస్తులు కోల్పోయి నందుకుగాను నష్ట పరిహారంగా మూడు మిలియన్‌ల డాలర్లు చెల్లించమని అమెరికన్ ప్రభుత్వము మెక్సికో ప్రభుత్వాన్ని కోరగా వారు నిరాకరించారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలపట్ల మెక్సికో ప్రభుత్వం, మెక్సికన్ పౌరులు శత్రుభావం కలిగి ఉండడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. టెక్సాస్‌లో తిరుగుబాటు జరగడానికి అమెరికా పరోక్షంగా బాధ్యురాలని మెక్సికో అభిప్రాయపడింది. రియోగ్రాండ్ నదిని టెక్సాస్ దక్షిణ సరిహద్దుగా గుర్తించమని అమెరికా మెక్సికోను కోరింది. కాని మెక్సికో రియోగ్రాండ్ నదికి ఉత్తరంగా ఉన్న న్యూసెస్ (Nueces) నది టెక్సాస్ దక్షిణ సరిహద్దు అని వాదించింది. అంటే న్యూసెస్ నదికి, రియోగ్రాండ్ నదికి మధ్య ఉన్న భూ భాగము తనదంటే తనదని, అమెరికా, మెక్సికోలు ఘర్షణ పడ్డాయి. మెక్సికన్‌లకు, అమెరికన్ ప్రజల మీద ఏవగింపు, కోపము, అనుమానము ఉండేవి. అమెరికాతో యుద్ధం చేసి గెలవగలమనే ధైర్యం కూడ మెక్సికన్‌లకుండేది. మెక్సికో సైన్యము అమెరికన్ సైన్యం కన్న రెట్టింపు ఉండేది. మెక్సికో పర్వతాలతో, ఎడారులతో, అరణ్యమయంగా ఉన్నందువల్ల అమెరికన్‌లు మెక్సికోపై దండెత్తి గెలవలేరని మెక్సికన్‌లు అభిప్రాయపడేవారు. మెక్సికోతో యుద్ధం చేసే విషయంలో అమెరికాలో తప్పక భేదాభిప్రాయాలు చెలరేగుతాయని మెక్సికన్ రాజకీయ నాయకులు నమ్మేవారు. బానిసత్వ వ్యవస్థను ఏవగించుకొనే అమెరికన్‌లు మెక్సికోతో యుద్ధాన్ని వ్యతిరేకిస్తారని కూడా వారు అభిప్రాయపడ్డారు. మెక్సికోతో యుద్ధము దక్షిణాది అమెరికన్లు మరికొంతమంది భూభాగాన్ని సంపాదించడానికి పన్నిన ఎత్తుగడ అని ఔత్తరాహులు శంకిస్తారని మెక్సికన్‌లు విశ్వసించారు. అంతేగాక అమెరికా సంయుక్త రాష్ట్రాలతో యుద్ధం సంభవిస్తే ఐరోపా దేశాలు, ముఖ్యంగా బ్రిటన్ తమకు సహాయం చేయవచ్చునని చాలా మంది మెక్సికన్‌లు ఆశించారు.

## 8. 12. స్లైడెల్ కమిషన్ :

మెక్సికోకు తన ప్రభుత్వానికి మధ్య ఉన్న తగాదాలను శాంతియుతంగా పరిష్కరించుకొనవలెననే ఉద్దేశంతో అధ్యక్షుడు పోక్ ఆఖరి ప్రయత్నంగా 1845లో జాన్ స్లైడెల్ (John Slidell) అనే వ్యక్తిని మెక్సికోకు రాయబారిగా పంపాడు. జాన్ స్లైడెల్ ఈ కింది పేర్కొన్న షరతుల మేరకు మెక్సికితో సంధి ఏర్పాట్లు చేయాలి.

1. మెక్సికో టెక్సాస్ దక్షిణ సరిహద్దుగా రియోగ్రాండ్ నదిని గుర్తించినట్లయితే మెక్సికో అమెరికన్ పౌరుల కిచ్చిన ఋణాల నన్నింటిని అమెరికన్ ప్రభుత్వం తీర్చి వేస్తుంది.

2. న్యూ మెక్సికోను అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఐదు మిలియన్ డాలర్ల ఖరీదుకు కొంటుంది.

3. అమెరికా సంయుక్త రాష్ట్రాలు కాలిఫోర్నియాను ఇరవై మిలియన్‌ల డాలర్ల ఖరీదుకు కొనగలదు.

ఇదే సమయంలో మెక్సికో అధ్యక్షుడు హేరారే (Herrera)ను తొలగించి జనరల్ పెరేడ్స్ (General Paredes) అధ్యక్షుడైనాడు. స్లైడెల్ అక్కడికి నగరానికి వెళ్ళే సమయానికి మెక్సికన్‌లకు అమెరికన్‌లపై ఏవగింపు మిన్ను ముట్టింది. దీని వల్లనే వారు స్లైడెల్‌ను ఆహ్వానించడానికి నిరాకరించారు. టెక్సాస్‌ను దొంగిలించిన అమెరికా, మెక్సికో దేశాన్ని వినాశనం చేయ సంకల్పించిందని వారు భీతి చెందారు.

స్లైడెల్ రాయబారం విఫలమయిందని తెలియగానే అమెరికన్ అధ్యక్షుడు పోక్ మెక్సికోతో యుద్ధం చేయ నిశ్చయించాడు. మెక్సికో ముందుగా యుద్ధాన్ని ప్రారంభించేటట్లు చేయడానికి వ్యూహం పన్ని జకరీటేలర్ (Zachary Taylor) అనే సైన్యాధికారిని 1846లో రియోగ్రాండ్ న్యూసెస్ నదుల మధ్య తగాదాలో ఉన్న ప్రాంతానికి సైన్యంతో తరలించాడు. కొన్ని మాసాల పాటు రెండు పక్షాలు మిన్నకుండడం వల్ల చివరికి అధ్యక్షుడు పోక్ మెక్సికో అంతర్జాతీయ మర్యాదలను పాటించలేదనే మిషతో యుద్ధం ప్రకటించడానికి కాంగ్రెస్ అనుమతి తీసుకొన ప్రయత్నించాడు. అధ్యక్షుని లేఖ కాంగ్రెస్‌కు చేరేలోగానే ఒక మెక్సికన్ సైన్యము టేలర్ సైన్యం పై దెబ్బతీసింది. వెంటనే పోక్ తన లేఖను మార్చి మెక్సికో అమెరికా సంయుక్త రాష్ట్రాలపై యుద్ధం ప్రారంభించిన కారణంగా మెక్సికోతో యుద్ధం చేయడం తక్షణ కర్తవ్యమని కాంగ్రెస్‌కు వర్తమానం పంపినాడు. అమెరికన్ కాంగ్రెస్ మే 13వ తేదీన 1846లో మెక్సికోపై యుద్ధం ప్రకటించింది. ఈ యుద్ధానికి, 50,000 సంఖ్య గల సైన్యాన్ని సమీకరించడానికి, పది మిలియన్ డాలర్ల ధనాన్ని ఖర్చు చేయడానికి అధ్యక్షునకు కాంగ్రెస్ అధికార మిచ్చింది. యుద్ధం విషయంలో దక్షిణాది రాష్ట్రాలు పశ్చిమ రాష్ట్రాలు ఉత్సాహాన్ని చూపగా ఈ శాన్య ప్రాంతం తన వ్యతిరేకాన్ని వెలిబుచ్చింది. ముఖ్యంగా న్యూ ఇంగ్లండ్ బానిసత్వ నిర్మూలన వాదులు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు.

జనాభిప్రాయమిట్లా ఉంటే, అబ్రహాం లింకన్ అమెరికన్ భూ భాగం మీద అమెరికన్‌ల రక్తము సరిగ్గా ఎక్కడ చిందిందో తెలుపవలసిందిగా అధ్యక్షుడైన పోక్‌ను అడిగాడు. దీనికే 'స్థల తీర్మానము' (Spot Resolution) అని పేరు. (Mexicans had Shed American blood on American Soil) మరో విధంగా చెప్పవలెనంటే అమెరికన్ భూ భాగం మీదికి మెక్సికన్‌లు నిజంగా దండెత్తి వచ్చిందీ లేనిదీ తెలుపమని లింకన్, పోక్‌ను కోరాడు. ఈ సంఘటనతో లింకన్ అమెరికా రాజకీయాలలో ప్రవేశించటము జరిగింది.

## 8.13. యుద్ధ గమనము :

యుద్ధానికి సంపూర్ణమైన మద్దతు నిచ్చినవి మిసిసిపిలోయ రాష్ట్రాలు మాత్రమే. ఈ శాన్య ప్రాంతము సైనికులను చేర్చుకొనే విషయంలో ప్రభుత్వానికి సహాయం చేయలేదు. ఆగ్నేయ ప్రాంతము కొద్దిమంది యువకులను సైన్యంలో చేరనిచ్చింది.

టేలర్ సైన్యం టెక్సాస్ నుంచి దక్షిణంగా పయనించి మాంటెర్రీని (Monterey) 1846లో, బ్యూనావిస్టాని (Buena Vista) 1847లో వశపరచుకొన్నది. బ్యూనావిస్టా సమర రంగంలో మెక్సికన్‌లు చిత్తుగా ఓడిపోయారు. ఈ విజయం తరువాత మెక్సికో పట్టణాన్ని చేరడం సులభతరమైన విషయంగా గోచరించింది. కాని బ్యూనా విస్టా విజయం తరువాత పోక్, టేలర్‌ను అక్కడనే ఉంచి తాను జయించిన భూభాగాన్ని కాపాడుతుండవలెనని ఉత్తరువులిచ్చాడు. పోక్ ఈ విధంగా ప్రవర్తించడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వం టేలర్ నాయకత్వాన్ని శంకించింది. టేలర్ ఇంకా కొన్ని విజయాలు సాధించినట్లయితే విగ్ పార్టీ వారు అతనిని రానున్న అధ్యక్ష ఎన్నికలలో తమ అభ్యర్థిగా పోటీ చేయించవచ్చునని పోక్ అనుమానించాడు.

క్రీ.శ. 1846 వేసవిలో కర్నల్ స్టీఫెన్ డబ్ల్యుకీర్నె (Stephen W. Kearney) నాయకత్వం కింద అమెరికన్ సైన్యము శాంతాఫే (Santa Fe) పట్టణాన్ని ముట్టడించి సులభంగా వశపరచుకొంది. ఈ విజయంతో న్యూ మెక్సికో అమెరికన్‌ల స్వాధీనమయిందని కీర్నె ప్రకటించి కాలిఫోర్నియా ముట్టడిలో సహాయ పడడానికి పశ్చిమంగా పయనించాడు. ఇంకా కొంత అమెరికన్ సైన్యము టేలర్‌కు సహాయపడడానికి దక్షిణంగా పయనించింది.

**కాలిఫోర్నియాను జయించడం :** మెక్సికోతో యుద్ధము ప్రారంభం కాకమునుపే కాలిఫోర్నియాలో నివసించే అమెరికన్‌లు స్వాతంత్ర్యం ప్రకటించారు. యుద్ధము ప్రారంభమయ్యే నాటికి రెండు వారాలముందే "బేర్ ఫ్లాగ్ తిరుగుబాటు" (Bear Flag Revolt) ప్రారంభమైంది. ఫ్రేమాంట్ (Fremont) అనే అమెరికన్ వ్యక్తి కొంత సైన్యంతో శాక్రమెంటో (Sacramento) లోయనుంచి తూర్పుగా పయనించి మాంటెరీ (Monterey) ని జయించిన అమెరికన్ సైన్యాన్ని కలుసుకొన్నాడు. ఈ రెండు సైన్యాలు మెక్సికోను ఓడించాయి; ఆ తర్వాత మెక్సికన్ సైన్యాన్ని దక్షిణంగా తరిమికొట్టి లాస్ ఏంజల్స్ దగ్గర వారిని ఓడించినాయి. 1847 నాటికి మెక్సికోలోని ఉత్తర రాష్ట్రాలు అమెరికన్‌ల స్వాధీనమయ్యాయి.

## 8.14. మెక్సికో పట్టణంపై దాడి :

నవంబర్, 1846లో అమెరికన్ ప్రభుత్వము వీరాక్రజ్ (Vera Cruz) మార్గం గుండా సైన్యాన్ని నడిపి మెక్సికో పట్టణాన్ని స్వాధీన పరచుకొనడానికి ప్రయత్నించింది. ఈ పని విన్ ఫీల్డ్ స్కాట్ (Winfield Scott) భుజస్కంధాలపై మోపడం జరిగింది. మార్చి 1847లో స్కాట్, మెక్సికో కోస్తాలో వీరాక్రజ్ దగ్గర తన సైన్యాన్ని చేర్చాడు. మెక్సికో అధినేత శాంతాఅన్నా (Santa Anna)ను, సెరోగార్డో (Carro Gordo) యుద్ధ రంగంలో ఓడించినారు. ఆ తరువాత అనేక యుద్ధ రంగాలలో స్కాట్ మెక్సికన్‌ల తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. చివరకు, సెప్టెంబరు 13వ, తారీఖు, 1847లో మెక్సికో పట్టణము అమెరికన్‌ల స్వాధీనమైంది. శాంతా అన్నా ప్రాణ రక్షణార్థం పారిపోయాడు.

## 8.15. గుడలూప్ హిడాల్గో సంధి (Treaty of Guadlupa Hidalgo) :

ఈ సంధి, ఫిబ్రవరి 1848లో జరిగింది. సంధి సంప్రదింపులలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు తరపున నికొలస్ పి. ట్రిస్ట్ (Nicholas P. Trist) పాల్గొన్నాడు. మెక్సికో కింది షరతులను ఆమోదించింది.

1. టెక్సాస్ దక్షిణ సరిహద్దు రియోగ్రాండ్ నది.
2. న్యూ మెక్సికో, కాలిఫోర్నియా ఇంకా మెక్సికోకు చెందిన పశ్చిమ ప్రాంతాలు, సంయుక్త రాష్ట్రాలకు దత్తం చేయాలి.
3. దీని కోసం అమెరికా సంయుక్త రాష్ట్రాలు మెక్సికోకు పదిహేను మిలియన్‌ల డాలర్ల సొమ్ము చెల్లిస్తుంది.
4. మెక్సికో ప్రభుత్వము అమెరికన్ పౌరులకు ఋణపడి ఉన్న, 32,50,000 డాలర్ల సొమ్మును అమెరికన్ ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఈ సంధి అనుబంధంగా 1853లో గాడ్స్‌డెన్ కొనుగోలు (Gadsden Purchase) జరిగింది. అప్పుడు గీలా (Gila) నదికి దక్షిణంగా ఉన్న 1,15,000 చ.కి.మీ. భూభాగాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికో వద్దకొని దానికి మారుగా, 100,00,000 డాలర్ల సొమ్ము చెల్లించింది.

ఈ విధంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు తన పశ్చిమ దిశ విస్తరణగావించి, ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా ప్రసిద్ధి చెందింది.

**అభ్యాసాలు :**

1. అమెరికా - మెక్సికో యుద్ధ కారణాలను వివరింపుము
2. మెక్సికో యుద్ధ గమనమును వ్రాయుము

ఉపయుక్త గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1) | Henry Bamford Parkes | : | The United States of America |
| 2) | Thomas A Baily | : | The American Pageant |
| 3) | C.P. Hill | : | History of the United States |
| 4) | Patt & Drummond | : | Our National From its creation |
| 5) | David Donald | : | A History of American Lifes Thought |
| 6) | Richard B Morris | : | Encyclopaedia of American History |
| 7) | Edward J. Conlon (For the united states Information Service-Madras | : | America Charitra Sangraham |



డా॥ కంరున్నిసా బేగం, ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.

చరిత్ర, పురాతత్త్వ శాఖ

నాగార్జున విశ్వ విద్యాలయం

# అంతర్యుద్ధము

## 9.1 లక్ష్యం :

అంతర్యుద్ధానికి దారి తీసిన సంఘటనలు, యుద్ధ గమనము, ఫలితాలను తెలియజేయడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ క్రమం :


9.2 పరిచయం

9.3 విల్‌మట్ ప్రావిజో

9.4 1848 ఎన్నికలు

9.5 1850 సంవత్సరపు రాజీ

9.6 రాజీ ప్రయత్నాలు

9.7 1851 సంవత్సరము ఎన్నికలు

9.8 కాన్సాస్ నెబ్రాస్కా చట్టము

9.9 1856 సంవత్సరము ఎన్నికలు

9.10 డ్రెడ్ స్కాట్ ఉదంతము

9.11 లింకన్ - డగ్లస్ చర్చలు

9.12 జాన్ బ్రౌన్ చర్యలు - 1859

9.13 1860 ఎన్నికలు

9.14 అబ్రహాం లింకన్

9.15 దక్షిణ రాష్ట్రాలు యూనియన్ నుంచి విడిపోవడం

9.16 అంతర్యుద్ధ ప్రారంభము

9.17 మొదటి బుల్ రన్ యుద్ధం

9.18 1862-63లో యుద్ధగమనము

9.19 తూర్పు ప్రాంతంలో యుద్ధం

9.20 రెండో బుల్ రన్ యుద్ధము

9.21 మెక్లెల్లాన్ రెండోసారి సైన్యాన్ని నడిపించడం

9.22. గెటిస్ బర్గ్ యుద్ధము

9.23 1864 సంవత్సర యుద్ధ గమనము

9.24 అంతర్యుద్ధ ఫలితాలు

## 9.2 పరిచయము :

"అనైక్యతగల ఇల్లు నిలబడలేదు" "సగం స్వతంత్రులుగా సగం బానిసలుగా శాశ్వతంగా ఉన్నట్లయితే ఈ ప్రభుత్వానికి మనుగడలేదని నా నమ్మకం" - అబ్రహాం లింకన్ స్ప్రింగ్ ఫీల్డ్, ఇలినాయ్, జూన్ 17, 1858.

పంథొమ్మిదవ శతాబ్దిలో అమెరికా ప్రపంచ దృష్టిని అమితంగా ఆకర్షించింది. ఐరోపానుంచి అనేకులు ఈ దేశాన్ని సందర్శించేవారు. అందులో ఒకరు ఫ్రెంచి రాజకీయ వ్యాఖ్యాత ఏలెక్సిస్ డటాక్‌లిన్. 'అమెరికాలో ప్రజాస్వామ్యం' అనే అతని పుస్తకం 1835లో ప్రచురించబడింది. యూరప్ అంతటా ప్రముఖుల ఆమోదాన్ని పొందింది. ఈ కొత్త దేశాన్ని గురించి అంత కంతకు అనుకూలమైన అభిప్రాయం పెంపొందింది. ఎందరో యాత్రికులు బోస్టన్ పట్టణం, సముద్రతీరం చాలా అందమైనవన్నారు; కారడవుల మధ్య యూటికా, సైరాక్యూజ్, ఆబర్న్ వంటి పట్టణాలు ఎలా పుట్టి అభివృద్ధి చెందాయని ఆశ్చర్యపడ్డారు; ఉత్తర రాష్ట్రాలు పర్యటిస్తూ, వ్యవసాయంలో, వ్యాపారంలో, రవాణా సౌకర్యాలలో ఇంత వేగంగా పురోగమించడం దేశ సౌభాగ్యానికి తిరుగులేని సాక్ష్యాలన్నారు. ప్రజాస్వామ్య దేశంగానూ, పర్యాటక కేంద్రంగానూ ప్రపంచ దృష్టిని ఆకర్షించే అమెరికా కొద్ది సమయంలోనే అంతర్యుద్ధం ద్వారా ఆకర్షించసాగింది.

ఉత్తర, దక్షిణ రాష్ట్రాల వైరుధ్యాలే ఈ యుద్ధానికి ప్రధాన హేతువయ్యాయి. దక్షిణ రాష్ట్రాలు ప్రధానంగా వ్యవసాయ ప్రాంతాలు. అందుచేత వారు బానిస వ్యవస్థని ఆదరించి, పెంపొందించారు. ఉత్తర రాష్ట్రాలు ప్రధానంగా వ్యాపార, వాణిజ్య నౌకాయాన రంగాలపై ఆధారపడేవి. వారు బానిస వ్యవస్థని వ్యతిరేకించే వారు. ఈ వైరుధ్యం ప్రధానమైనది కావడంతో ఒక్కొక్క రాష్ట్రం యూనియన్‌లో చేరేటప్పుడు, దానిని బానిస రాష్ట్రంగాకాని, స్వేచ్ఛా రాష్ట్రంగాకాని రాజ్యాంగంలో పేర్కొనేవారు. ఈ రాష్ట్రాల సంఖ్య కూడా సమానంగా ఉండేట్లు అమెరికన్లు జాగ్రత్త వహించేవారు ప్రధానంగా ఉత్తర రాష్ట్రాలు స్వేచ్ఛా రాష్ట్రాలుగానూ, దక్షిణ రాష్ట్రాలు బానిస రాష్ట్రాలుగానూ కొనసాగేవి. మెక్సికో దగ్గరి నుంచి సంపాదించిన భూభాగాలను సంయుక్త రాష్ట్రాలలో ఏ విధంగా చేర్చుకోవలెననే విషయం మీద ఔత్తరాహులకు, దాక్షిణాత్యులకు మధ్య తీవ్రంగా తర్జన భర్జనలు జరిగాయి. ఆ కోపాటోపంలో ఉత్తర ప్రాంతం వారు దక్షిణ ప్రాంతం వారు కూడా, మిసోరి రాజీని, ఆ రాజీలోని విభజన రేఖా సూత్రాన్ని సైతం పూర్తిగా విస్మరించి పశ్చిమ ప్రాంతమంతా స్వాతంత్ర ప్రాంతంగానే ఉండవలెనని ఉత్తరాది వారు, ఆ ప్రాంతమంతా బానిస వ్యవస్థను అనుమతించే ప్రాంతంగానే ఉండవలెనని దక్షిణాదివారు, ఒకరిని మించి ఒకరు పట్టుదలతో వాదిస్తూ వచ్చారు. ఈ రెండు పక్షాలవారి మధ్య కొందరు మితవాదులు (moderates) ఉన్నారు. ఆయా ప్రాంతాలు బానిసత్వ విధానానికి అనుకూలంగా ఉండవలెనో, ప్రతికూలంగా ఉండవలెనో నిర్ణయించుకొనే హక్కు ఆ ప్రాంత ప్రజలకే వదిలివేయడం మంచిదని ఈమిత వాదులు సూచించారు.

## 9.3. విల్‌మట్ ప్రొవిజో (Wilmot Proviso) :

మెక్సికో దగ్గరి నుంచి తీసుకొన్న ప్రాంతాలను యూనియన్‌లో చేర్చుకొనే విషయంలో ప్రజా ప్రతినిధుల సభలో ఒక బిల్లును 1846లో ప్రవేశపెట్టడం జరిగింది. పెన్సిల్వేనియా ప్రతినిధి డేవిడ్ విల్‌మట్ (David Wilmot) నూతన ప్రాంతాలలో బానిసత్వాన్ని నిర్మూలించవలెననే సవరణను ప్రతిపాదించాడు. ఈ సవరణ ఔత్తరాహులకు, దాక్షిణాత్యులకు మధ్య నాలుగు సంవత్సరాల కాలం కొనసాగి తీవ్రమైన వాద ప్రతివాదాలకు నాంది పలికింది. దాక్షిణాత్యుల తరపున జాన్ సి. కల్హౌన్ (John C. Calhoun) నూతన ప్రాంతాలలో బానిసత్వాన్ని నిర్మూలించే హక్కు, కాంగ్రెస్‌కు లేదని వక్కాణించాడు. నూతన ప్రాంతాలు సంయుక్త రాష్ట్రాలలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి సొత్తు అని దాక్షిణాత్యులు వాదించారు. అమెరికన్ పౌరులు వారి వారి ఆస్తి పాస్తులను రక్షించుకొనడానికి రాజ్యాంగంలో వీలు కల్పించడం జరిగిందని, ఆస్తితో సమానమైన బానిసలను యూనియన్‌లో ఎక్కడికైనా తీసుకొని వెళ్ళే హక్కు తమకున్నదని కూడా వారు వాదించారు. మిన్నెసోటా (Minnesota), ఒరిగాన్ (Oregon) ప్రాంతాలు స్వతంత్ర రాష్ట్రాలుగా యూనియన్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. సెనేట్‌లో దాక్షిణాత్యుల ప్రతినిధుల సంఖ్య తగ్గిపోతుంది. అమెరికా భూ భాగానికి సంబంధించినంత వరకు ఎలాంటి చట్టాన్ని అయినా ప్రవేశ పెట్టడానికి రాజ్యాంగము కాంగ్రెస్‌కు హక్కును ప్రసాదించినదని, అందువల్ల యూనియన్‌లోని ఏ ప్రాంతంలోనైనా బానిసత్వాన్ని నిర్మూలించడానికి కాంగ్రెస్‌కి అధికారం ఉందని ఔత్తరాహులు వాదించారు. బిల్లుపై జరిగిన చర్చలలో రెండు పక్షాలకు చెందిన మితవాదులు ఈ విధంగా రాజీ మార్గాన్ని సూచించారు.

1. బానిసత్వ వ్యవస్థ ఉండవలెనా లేదా అనే విషయం మీద ఆయా ప్రాంతాలకు చెందిన పౌరులే నిర్ణయించుకోవచ్చును.

2. అధ్యక్షుడు పోక్ నాయకత్వం కింద కొంత మంది, మిసోరీ రాజీ రేఖను పసిఫిక్ మహా సముద్రం వరకు పొడిగించి, నూతన ప్రాంతాలను రెండు పక్షాల వారికి సమానంగా పంచి పెట్టవచ్చునని సూచించారు.

## 9.4. 1848 సంవత్సరపు ఎన్నికలు :

బిల్లుపై చర్చలుక కొనసాగుతున్న తరుణంలో ఈ ఎన్నికలు జరిగాయి. దేశంలోని రెండు ప్రధాన పార్టీలయిన డెమోక్రాటిక్, విగ్ (Whig) పార్టీలు ప్రచారంలో విల్ మట్ ప్రొవిజోను గురించి స్థిరమైన అభిప్రాయాలను తెలియజేయ నిరాకరించాయి. డెమొక్రాటిక్ పార్టీ మిచిగన్‌కు చెందిన లూయీకస్ (Lewis Cass)ను అధ్యక్షపదవికి పోటీ చేయించింది. విగ్ పార్టీ తరపున జనరల్ జకరీటేలర్ పోటీ చేసాడు. బానిసత్వ నిర్మూలన వాదులు కొంతమంది ఫ్రీ సాయిల్ పార్టీ (Free soul Party) అనే పేరుతో మార్టిన్ వాన్ బ్యూరెన్ (Martin Van Buren) ను తమ అభ్యర్థిగా పోటీ చేయించారు. ఈ పార్టీ విల్‌మట్ ప్రొవిజోను సమర్థించింది. టేలర్ అధ్యక్షుడుగా ఎన్నికయినాడు. ప్రజా ప్రతినిధుల సభలో ఫ్రీసాయిల్ పార్టీకి 13 స్థానాలు మాత్రమే లభించాయి.

## 9.5 1850 సంవత్సరపు - రాజీ :

విల్‌మట్ ప్రొవిజోపైన కాంగ్రెస్ చర్చలు జరుపుతున్నప్పుడు, న్యూమెక్సికో, కాలిఫోర్నియాలు సైనిక పరిపాలన కింద వున్నాయి. 1849లో హఠాత్తుగా కాలిఫోర్నియాలో కొన్ని చోట్ల బంగారం బయటపడింది. ఈ వార్త వాయు వేగంతో దేశమంతటా పాకింది. దాదాపు ఒక లక్షమంది ప్రజలు వచ్చి బంగారపు గనుల వద్ద స్థిరపడ్డారు. కాలిఫోర్నియాలో సైనిక ప్రభుత్వ స్థానంలో ఇంకొక సుస్థిరమైన ప్రభుత్వాన్ని నెలకొల్పవలసిన అవసరం కాంగ్రెస్ గుర్తించింది.

అధ్యక్షుడు టేలర్, కాంగ్రెస్‌తో సంప్రదించకుండానే, కాలిఫోర్నియా, న్యూ మెక్సికోలను తమ రాజ్యాంగాలను ఏర్పాటు చేసుకొని యూనియన్‌లో చేరడానికి అభ్యర్థించవలసినదిగా కోరాడు. ఆ రెండు రాష్ట్రాలు బానిసత్వ వ్యవస్థను రద్దు పరుస్తూ రాజ్యాంగాలను ఏర్పరచుకొన్నాయి. ఈ విషయం తెలియగానే దాక్షిణాత్యులు కోపోద్రిక్తులయినారు. కాంగ్రెస్ 1849లో సమావేశం కాగా జార్జియాకు చెందిన ప్రతినిధులు యూనియన్‌నుండి విడిపోదలచినట్లు ప్రకటించినారు. యూనియన్ మనుగడకు చేటు వాటిల్లింది.

## 9.6. రాజీ ప్రయత్నాలు :

హెన్రీక్లే, స్టీఫెన్ ఎ. డగ్లస్ (Stephen A. Douglas) ల నాయకత్వం కింద కొంతమంది మితవాదులు జనవరి 1850లో రాజీ సూచనలను ప్రతిపాదించారు. ఈ అంశాలన్నీ కలిసి 1850 సంవత్సరపు రాజీ అను పేరుతో చరిత్ర ప్రసిద్ధి చెందాయి. రాజీ ప్రకారం;

1) కాలిఫోర్నియాను బానిసలు లేని రాష్ట్రంగా యూనియన్‌లో చేర్చుకోవాలి.

2) మెక్సికోనుంచి ప్రభుత్వం సంపాదించిన ఇతర భూ భాగంలో బానిసత్వ వ్యవస్థపై ఏ విధమైన ఆంక్షలు విధించకూడదు. ఈ భూ భాగము యుటా (Utah) న్యూమెక్సికో అనే రెండు ప్రాంతాలుగా విభక్త మవుతుంది. ఆయా ప్రాంతాల ప్రజలు బానిసత్వ వ్యవస్థను గురించి తమకు నచ్చిన రీతిగా నిర్ణయాలు చేసుకొనవచ్చును.

3) టెక్సాస్‌కు చెందిన పశ్చిమ ప్రాంతాన్ని కొంత న్యూ మెక్సికోలో కలపాలి. నష్ట పరిహారంగా 10 మిలియన్‌ల డాలర్ల మేరకు టెక్సాస్ రాష్ట్రపు అప్పులను కేంద్ర ప్రభుత్వము బాధ్యత తీసుకొని తీర్చివేస్తుంది, పశ్చిమ టెక్సాస్, న్యూ మెక్సికోతో కలిసి త్వరలో బానిసత్వ వ్యవస్థలేని రాష్ట్రం యూనియన్‌లో చేరుతుంది. కాబట్టి ఔత్తరాహులకే ప్రతిపాదన ప్రీతి గలిగిస్తుంది. మిగిలిపోయిన భాగంలో బానిసత్వ వ్యవస్థ కొనసాగడమేగాక ఋణ బాధ తొలిగినందువల్ల దాక్షిణాత్యులు సైతం తృప్తి చెందుతారు.

4) కొలంబియా జిల్లాలో బానిసత్వ వ్యవస్థ కొనసాగుతుంది. కాని బానిస వ్యాపారాన్ని నిషేధించడమయింది.

5) యజమానుల దగ్గరి నుంచి పారిపోయిన బానిసలను గురించి కట్టుదిట్టమైన చట్టాన్ని జారీ చేయాలి.

కొంత తర్జన భర్జనలు జరిగిన తరువాత రెండు పక్షాలవారు ఈ రాజీకి అంగీకరించారు. ఈ రాజీ కాంగ్రెస్ ఆమోదాన్ని పొందింది.

## 9.7. 1851 సంవత్సరపు ఎన్నికలు :

ఈ ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ తరపున ఫ్రాంక్లిన్ పియర్స్, విగ్ పార్టీ అభ్యర్థిగా విన్‌ఫీల్ట్ స్కాట్ పోటీ చేసారు. ఫ్రీ సాయిల్ పార్టీ జాన్ పి హేల్‌ని పోటీ చేయించింది. డెమొక్రాటిక్ పార్టీ వారు 1850 రాజీని పూర్తిగా సమర్థించారు. విగ్ పార్టీ రాజీని సమర్థించినట్లు ప్రకటించినప్పటికీ దృఢంగా సమర్థించలేదు. ఫ్రీ సాయిల్ పార్టీ రాజీని పూర్తిగా వ్యతిరేకించింది. ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ ఘన విజయాన్ని సాధించింది. విగ్ పార్టీ ఈ అపజయం తరువాత తిరిగి కోలుకోలేదు.

## 9.8. కాన్సాస్ నెబ్రాస్కా చట్టము (The Kansas - Nebraska Act) :

మిసోరీ, అయోవాలకు పశ్చిమంగా ఉన్న ప్రాంతాన్ని, కాన్సాస్, నెబ్రాస్కా అనే రెండు రాష్ట్రాలుగా ఏర్పరచడం కోసం ఈ చట్టాన్ని 1854లో జారీ చేసారు. బానిసత్వం విషయంలో మిసోరీ రాజీని రద్దు చేసినారు. ఈ రెండు రాష్ట్రాలలోని ప్రజలు బానిసత్వ విషయంలో ప్రజాసార్వభౌమత్వం (Popular Sovereignty)ని గౌరవితస్తూ స్వయం నిర్ణయం చేసుకొనడానికి వసతి కలిగించడమైంది. ఈ చట్టము అమెరికన్ రాజకీయ పార్టీలలో కొన్ని పరిణామాలకు కారణమైంది. 1852 నుంచి తిరోగమిస్తున్న విగ్ పార్టీ సమూలంగా రూపు మాసిపోయింది. డెమొక్రాటిక్ పార్టీ వారు నెబ్రాస్కా డెమొక్రాట్లని, యాంటీ నెబ్రాస్కా డెమొక్రాట్లని రెండు వర్గాలుగా చీలిపోయారు. అయోమయ పార్టీ (Know-nothing-party) అనే ఒక కొత్త పార్టీని స్థాపించడం జరిగింది. మధ్య పశ్చిమ ప్రాంతం వారు కాన్సాస్ - నెబ్రాస్కా చట్టాన్ని నిరసించుకొన్నారు. వీరు చిన్న చిన్న స్థానిక పార్టీలను నెలకొల్పారు. ఈ పార్టీలన్నీ కలసి రిపబ్లికన్ పార్టీ అనే పేరుతో 1854 ఎన్నికలలో ఘన విజయాలను సాధించింది. ఇది వరలో దేశంలోని రెండు ప్రధాన పార్టీలకు ఉత్తర ప్రాంతంలోను, దక్షిణ ప్రాంతంలోను అభిమానులు ఉన్నందువల్ల దేశంలో ఒక విధమైన ఐకమత్యము ఉండేది. కాని 1854లో ప్రాంతీయతా భావంతో ఉన్న పార్టీలు ఉద్భవించాయి. రిపబ్లికన్ పార్టీ ఔత్తరాహుల పార్టీగాను, డెమొక్రాటిక్ పార్టీ దాక్షిణాత్యుల పార్టీగాను రూపాంతరాలు పొందాయి.

నెబ్రాస్కా రాష్ట్రంలో బానిసత్వ వ్యవస్థను ప్రవేశపెట్టడానికి పరిస్థితులు అనుకూలించనందువల్ల దాక్షిణాత్యులు ఆ ప్రయత్నం చేయలేదు. కాన్సాస్‌లో ఔత్తరాహులకు దాక్షిణాత్యులకు మధ్య తీవ్రమైన ఘర్షణలు జరిగాయి. మిస్సోరి మొదలయిన బానిస వ్యవస్థగల రాష్ట్రాలనుంచి బానిసల యజమానులు అసంఖ్యాకంగా కాన్సాస్‌కు తరలి వెళ్ళినారు. ఉత్తరాది వారు కాన్సాస్‌కు నిర్మూలన వాదులను పంపించే కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడికి వెళ్ళే ప్రవాసులకు (Emigrants) సహాయం చేయడానికి కొన్ని కంపెనీలను వీరు స్థాపించారు. రెండు వర్గాల వారు వేరుగా ప్రభుత్వ యంత్రాగంగాలను ఏర్పరచుకొని కాంగ్రెస్ ఆమోదాన్ని కోరారు. వీరి ముఖ్య సమస్యలు; రైలు మార్గం (Trans continental railbrood) గురించి ఉత్తరాదివారు, చికాగో లేక సెయింట్ లూయిస్ తూర్పు హద్దుగా, దక్షిణాదివారు న్యూ ఆర్లిన్స్ నుండి మెక్సికో సరిహద్దుగుండా లాస్ ఏంజిల్స్‌కు వేయవలెనని ఘర్షణ పడ్డారు. ఇంకొక కారణమేమనగా, కాన్సాస్‌లో మార్చి 1855లో జరిగిన ఎన్నికలలో, మిసోరి నుంచి బానిస యజమానులు వచ్చి ఓట్లు వేసారు. కాని కాన్సాస్‌లో 1,400 మాత్రమే సరైన ఓట్లు, ఉండగా రికార్డ్ అయిఓట్లు 6000 వున్నాయి. అంటే సుమారుగా 5000 ఓట్లు బానిస యజమానులు వేసినవి. కాబట్టి అధ్యక్షుడు పియర్స్ ఈ ఎన్నికలు చెల్లవని ప్రకటించాడు. రెండు వర్గాలవారు ఎదుటి వర్గం వారిపై సైనిక దాడులు జరిపి హత్యలు దోపిడీలు మొదలయిన రాక్షస కృత్యాలకు తలపడ్డారు. "రక్తమయ కాన్సాస్" (Bleeding Kansas) అనే పేరు దేశమంతటా మారు మోగింది. 1856లో జరిగిన పొటావటోమి హత్యాకాండ (Pattawatomie Massacre) అతి దారుణమైంది. "కాన్సాస్ యుద్ధము" రానున్న అంతర్యుద్ధానికి నాంది పలికింది.

## 9.9. 1856 సంవత్సరపు ఎన్నికలు :

ఈ ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ తరపున జేమ్స్ బుకనన్ (James Buchanan) పోటీ చేసాడు. ఈ తనికి ప్రత్యర్థిగా జాన్ సి ఫ్రేమంట్ (John C. Fremont) రిపబ్లికన్ పార్టీకి పోటీ చేసాడు. డెమొక్రాటిక్ పార్టీ 1850 సంవత్సరపు రాజీని, కాన్సాస్-నెబ్రాస్కా చట్టాన్ని సమర్థించింది. రిపబ్లికన్ పార్టీ తన ప్రచారంలో కాంగ్రెస్ బానిసత్వాన్ని నిర్మూలించవలెనని, కాన్సాస్‌ను బానిసలు లేని రాష్ట్రంగా యూనియన్‌లో చేర్చుకొనవలెనని పేర్కొంది. అయోమయ పార్టీ అధ్యక్షుడు ఫిల్మోర్ (Fillmore)ను తన అభ్యర్థిగా పోటీ చేయించింది. ఈ ఎన్నికలలో డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీలు జాతీయ పార్టీలుగా గాక ప్రాంతీయవాద పార్టీలుగా వ్యవహరించాయి. నియోజిక వర్గ గణనలో జేమ్స్ బుకనన్ 174 ఓట్ల ఆధిక్యతతో ఎన్నికయ్యాడు.

### 9.10 డ్రెడ్ స్కాట్ ఉదంతము (The Dred Scott Case) :

మిస్సోరీకి చెందిన డ్రెడ్ స్కాట్ అనే బానిస తన యజమానితో బానిస వ్యవస్థ లేని ఇలినాయ్ రాష్ట్రానికి, మిన్నెసోటా ప్రాంతానికి వెళ్ళి అక్కడ కొంత కాలం నివసించాడు. రెండుసార్లు తాను బానిసలు లేని భూ భాగంలో నివసించినందువల్ల స్వతంత్ర పౌరుడుగా తనను గుర్తించవలెనని సుప్రీంకోర్టులో అతడు దావావేసాడు. నిర్మూలనా వాదులు అతనికి అండగా నిలిచారు. సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి టానే (Taney) డ్రెడ్ స్కాట్‌కు వ్యతిరేకంగా ఈ విధంగా తీర్పు చెప్పాడు.

1) డ్రెడ్‌స్కాట్ నీగ్రో అవడం వలన అమెరికన్ రాజ్యాంగము అతడిని అమెరికా పౌరుడుగా గుర్తించలేదు.

2) డ్రెడ్ స్కాట్ అమెరికన్ పౌరుడు కానందువల్ల ఈ కేసును సుప్రీం కోర్టు పరిశీలించనవసరం లేదు.

3) అతడు మిస్సోరీకు చెందిన వాడు కనుక ఇలినాయ్‌లో కొంత కాలం నివసించిన కారణంగా బానిసత్వం నుంచి విముక్తి పొంద జాలడు. అంటే ఇలినాయ్ రాష్ట్రం చట్టాలు అతనికి వర్తించవు.

4) మిన్నె సోటా న్యాయ బద్ధంగా బానిసత్వ వ్యవస్థలేని ప్రాంతం కాదు, కనుక అక్కడ నివసించిన కారణంగా కూడా అతడు దాస్యవిముక్తుడు కానేరడు.

5) మిస్సోరీ రాజీ 5వ రాజ్యాంగ సవరణకు విరుద్ధమైనది కనక రాజ్యాంగ సమ్మతం కాదు.

6) కాంగ్రెస్ బానిసత్వాన్ని నిర్మూలింపజాలదు అనే విషయాన్ని ఈ తీర్పు స్పష్టం చేసింది.

## 9.11 లింకన్ - డగ్లస్ చర్చలు (Lincoln - Douglas Debates) :

1858లో అబ్రహాం లింకన్ ఇల్లినాయ్ రాష్ట్ర సెనేట్ సభ్యత్వానికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసాడు. ఆ రాష్ట్రం మాజీ సభ్యుడు డగ్లస్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా తిరిగి పోటీ చేసాడు. డగ్లస్ అధ్యక్ష పదవిని గురించి కూడా కలలు కనసాగాడు. ఎన్నికలకు ముందు లింకన్ డగ్లస్‌ను బానిసత్వ విషయమై చర్చలకు రమ్మని సవాలు చేసాడు. వారిద్దరి మధ్య జరిగిన ఏడు చర్చలలో ఫ్రీ పోర్ట్ (Free port) దగ్గర జరిగిన చర్చ చరిత్రాత్మకమయింది. ఆ చర్చలో లింకన్ డగ్లస్‌ను కింది విధంగా ప్రశ్నించి సందిగ్ధావస్థలో ఇరికించాడు. డ్రెడ్ స్కాట్ తీర్మానాన్ని, ప్రజా సార్వభౌత్వంతో కూడిన స్వయం నిర్ణయాన్ని బానిసత్వ విషయంలో ఏ విధంగా సమర్థించగలవు? ఆ రెండూ పరస్పర విరుద్ధాలు కదా అని లింకన్ ప్రశ్నించాడు. డ్రెడ్ స్కాట్ తీర్మానాన్ని డగ్లస్ సమర్థిస్తున్నట్లు ప్రకటించినట్లయితే, రానున్న 1860 సంవత్సరపు అధ్యక్ష ఎన్నికలలో నిర్మూలన వాదులు అతనికి ఓట్లు వేయరు. ప్రజాసార్వభౌమాన్ని సమర్థించినట్లయితే బానిస వ్యవస్థను సమర్థించే వారు డగ్లస్‌కు ఓట్లువేయరు. బానిసలు అనే ఆస్తిని పరిరక్షించుకోడానికి కావలసిన స్థానిక చట్టాలను బానిసల యజమానులు పొందజాలరు అనే నగ్న సత్యము డగ్లస్ ఆలోచించి ఇచ్చిన సమాధానంలో స్పష్టమైంది. డగ్లస్ సెనేట్ ఎన్నికలలో విజయం సాధించాడు. కాని రెండు సంవత్సరాల అనంతరం డెమొక్రాటిక్ పార్టీ వారు అధ్యక్ష పదవికి అభ్యర్థిని నిర్ణయించే తరుణంలో దక్షిణ ప్రాంత డెమొక్రాట్లు డగ్లస్‌ను సమర్థించలేదు. డగ్లస్‌తో చర్చల ఫలితంగా లింకన్ పేరు దేశమంతటా మారు మోగింది. రిపబ్లికన్ పార్టీలోని లింకన్ అనుచరులు 1860 ఎన్నికలలో లింకన్‌ను అధ్యక్ష పదవికి అభ్యర్థిగా నిర్ణయించడానికి కావలసిన ఏర్పాట్లు చేయసాగారు.

## 9.12. జాన్ బ్రౌన్ చర్యలు 1859 :

జాన్ బ్రౌన్ (John Brown) అనే నిర్మూలన వాది 1856లో, కొంతమంది అనుచరులతో కాంగ్రెస్‌లోని బానిసల యజమానులను కొందరిని హతమార్చాడు. ఇతడు 1859లో దక్షిణ ప్రాంతంలో బానిసల విప్లవాన్ని లేవదీయవలెనని పథకం చేసాడు. అదే సంవత్సరంలో కొంతమంది తెల్లవారిని, నీగ్రోలను కూడ గట్టుకొని వెళ్ళి వర్జీనియాలోని హార్పర్స్ ఫెర్రీ (Harper's Ferri)లో ఉన్న ఆయుధాగారంపై దాడి చేసాడు. కేవలం పంథొమ్మిది మందితో వెళ్ళిన ఇతడు అక్కడి ఆయుధాలనన్నింటిని వశం చేసుకొని దక్షిణ ప్రాంతంలో బానిసల విమోచనం కోసం తిరుగుబాటు సాగించవలెనని పథకం వేసుకొన్నాడు. బ్రౌన్ ప్రయత్నం విఫలమైంది. రాబర్ట్ ఇ. లీ (Robert E. Lee) నాయకత్వంలో ప్రభుత్వ సైన్యము ఇతనిని బంధించింది. తరువాత దేశ ద్రోహము, హత్యాకాండ, ఇత్యాది దౌర్జన్య చర్యలకుగాను విచారణ జరిపి ఇతనికి ఉరిశిక్ష వేశారు. బ్రౌన్ చర్యలను దక్షిణ ప్రాంతంలోనూ, ప్రజాసామాన్యమంతా ఖండించారు. దాక్షిణాత్యులలో భయాందోళనలను ఇనుమడించాయి. న్యూ ఇంగ్లండ్‌లోని నిర్మూలన వాదులలో విజ్ఞాన వంతులైన ఒక వర్గం ముఖ్యంగా ఒక మహాకవి, తత్వ వేత్త అయిన రాల్ఫ్‌వాల్డో ఎమర్సన్ ఉత్తమాశయం కోసం ప్రాణత్యాగానికి కూడా వెరవని బ్రౌన్‌ని మహావీరుడని ప్రశంసిస్తూ, అతనిని ఏసు క్రీస్తుతో పోల్చాడు. బానిసల తిరుగుబాటుకి భయపడుతూ ఉన్న దాక్షిణాత్యులకు ఈ సంఘటన అమితాగ్రహ కారణమయింది.

## 9.13 1860 సంవత్సరపు ఎన్నికలు :

డెమొక్రటిక్ పార్టీకి చెందిన అధ్యక్షుడు బుకనన్ సమర్థత లేని వ్యక్తి కావడం వల్ల బానిసత్వ సమస్య ప్రతిష్ఠంభన విషయంలో దృఢమైన చర్య తీసుకొనలేకపోయాడు. అందువల్ల అతనిని అభ్యర్థిగా నిలబెట్టడానికి సుముఖత కనిపించలేదు. దక్షిణ కెరోలినా రాష్ట్రంలోని ఛార్లెస్టన్‌లో జరిగిన పార్టీ మహాసభ (Convention)లో ఉత్తర, దక్షిణ డెమొక్రాట్లంతా రాజీపడి స్టీఫెన్ డగ్లస్‌ని పార్టీ అభ్యర్థిగా నిలబెట్టడం ఉచితమని ఒక సూచన చేశారు. కాని సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వ వశంలో ఉన్న ప్రాంతాలలో ప్రభుత్వము బానిసత్వ వ్యవస్థకు రక్షణ కల్పించవలెనన్న దాక్షిణాత్యుల కోరికను డగ్లస్ అంగీకరించకపోవడం వల్ల డెమొక్రాటిక్ పార్టీలో ఉత్తర దక్షిణ వర్గాలకు రాజీ కుదరక పార్టీ చీలిపోయింది. దక్షిణ డెమొక్రాట్‌లు కెంటకీకి చెందిన జాన్ సి. బ్రెకిన్‌రిడ్జ్ (John C. Breckinridge) ను తమ అభ్యర్థిగా పేర్కొన్నారు. ఉత్తరాది డెమొక్రాట్‌లు ఇంకొక సమావేశం జరుపుకొని డగ్లస్‌ను అభ్యర్థిగా పేర్కొన్నారు.

రిపబ్లికన్ పార్టీ వారు చికాగోలో సమావేశమై, న్యూయార్క్‌కు చెందిన విలియమ్ హెచ్.సివార్డ్ (William H. Seward)ను తమ అభ్యర్థిగా పేర్కొనడానికి ప్రయత్నించారు. కాని అబ్రహాం లింకన్ అభిమానుల ఒత్తిడి ప్రబలమై చివరకు మూడో బాలట్‌లో అతడే అభ్యర్థిగా ఎన్నికైనాడు. బానిసత్వ విస్తరణను నిలిపివేయడం, కాన్సాస్ ప్రాంతాన్ని స్వతంత్ర రాష్ట్రంగా యూనియన్‌లో చేర్చుకోవడం తన విధానాలని ఈ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. జాతీయ పరిశ్రమల రక్షణ కోసం విదేశీ సరుకులపై దిగుమతి సుంకాలను హెచ్చించవలెనని, కేంద్ర ప్రభుత్వము విస్తృతమైన "దేశీయాభివృద్ధి కార్యక్రమాన్ని" అమలు జరపవలెననీ కూడా ఈ పార్టీ సూచించడం వల్ల దక్షిణాది ప్రజలకు మరింత ఆగ్రహం కలిగింది. ఈ ఎన్నికల సంరంభంలో ఇంకొక పార్టీ కూడా ప్రవేశించింది. రాజ్యాంగ సమాఖ్య వాదులు లేదా "కాన్‌స్టిట్యూషనల్ యూనియనిస్ట్" లు అనే పేరున్న ఈ పార్టీ టెన్నెసీ వాసి అయిన జాన్‌బెల్ (John Bell)ను తన అభ్యర్థిగా నిలబెట్టింది.

ఈ ఎన్నికల విజయం రిపబ్లికన్ పార్టీని వరించగా అబ్రహాం లింకన్‌కు, నియోజకవర్గ ఎన్నికలో 180 ఓట్లు వచ్చాయి. అబ్రహాం లింకన్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. లింకన్ తరువాత ఎక్కువ ఓట్లు సంపాదించిన డగ్లస్‌ను ఔత్తరాహులు బలపరిచారు. బ్రెకిన్ రిడ్జ్‌కి, బెల్‌కి సరిహద్దు రాష్ట్రాలలోను, దక్షిణాది రాష్ట్రాలలోను మాత్రమే ఓట్లు పడ్డాయి. దక్షిణాది రాష్ట్రాలలోను, సరిహద్దు రాష్ట్రాలలోను ఒక్కరు కూడా లింకన్‌కు ఓటు చేయలేదు. ఈ విధంగా లింకన్ దేశంలోని ఔత్తరాహులు ఎన్నుకొన్న అధ్యక్షుడు అయ్యాడు.

## 9.14. అబ్రహాం లింకన్ - 1809-1865 :

అబ్రహాం లింకన్, ఫిబ్రవరి 12, 1809న, కెంటకీ సరిహద్దు ప్రాంతాలలో హార్టిన్ అనేచోట కర్రగది (log cabin)లో జన్మించాడు. ఇతడు బాగా పొడుగైన వాడు, మోటు (rough) మనిషి, స్వయం కృషివల్ల విద్యాభ్యాసం చేసాడు. ఉన్నత లక్ష్యాలున్న వ్యక్తి. పెద్దవాడైన తరువాత ఇలినాయ్‌కి వెళ్ళి న్యాయవాదిగా పేరు సంపాదించాడు. కాంగ్రెస్‌కు 1846లో ఎన్నికయ్యాడు. లింకన్ స్వరాష్ట్రంలో సుప్రసిద్ధుడైనప్పటికీ

1858లో బానిసత్వ సమస్యపై డగ్లస్ స్టీఫెన్‌తో తీవ్రవాదోపవాదాలు చేసిన తరువాతగాని అతని పేరు దేశమంతటా తెలియలేదు. ఉభయులు ఇలినాయ్ నుంచే సంయుక్త రాష్ట్రాల సెనేట్ సభ్యత్వానికి పోటీ చేసినారు. లింకన్ రిపబ్లికన్ పార్టీ తరుపున, డగ్లస్ డెమొక్రాటిక్ పార్టీ తరపున పోటీ చేసారు. ఈ సెనేట్ ఎన్నికలలో లింకన్‌పైన కొద్ది ఆధిక్యంతో డగ్లస్ గెలిచాడు. కాని ఎన్నికల సందర్భంలో లింకన్ ఇచ్చిన గంభీరోపన్యాసాలు అతనికి పేరు ప్రతిష్ఠలు ఆర్జించాయి. ఉదాహరణకు "ఈ ప్రభుత్వము సగం బానిసగా, సగం స్వతంత్రంగా వ్యవహరించే ప్రస్తుత స్థితిని శాశ్వతంగా సహించడం అసంభవము అని నా విశ్వాసము. పూర్తిగా బానిసత్వ దేశమైనా, లేదా పూర్తిగా స్వతంత్ర దేశమైనా కావలె" అన్న లింకన్ గంభీర సూక్తి అతని విశ్లేషణాశక్తిని చాటి, అతని నాయకత్వంపై ఔత్తరాహులలో గౌరవ భావం కలగజేసింది. అంతేగాక లింకన్ బానిసత్వ వ్యవస్థ గురించి యూనియన్‌ను కాపాడే విషయం గురించి ఈ విధంగా అన్నాడు, "ఒక్క బానిస అయినా కూడా బానిసత్వం నుంచి విముక్తి పొందకుండానే అమెరికన్ యూనియన్ కాపాడ గలిగితే ఆపనే చేస్తాను. అట్లా కాకుండా బానిసత్వాన్ని సమూలంగా తుడిచిపెట్టి యూనియన్‌ను కాపాడవలసి వస్తే ఆవిధంగానే చేస్తాను. కొంతమంది బానిసలను మాత్రం దాస్యశృంఖలాల నుంచి విడిపించి మిగిలిన వారిని బానిసలుగానే ఉండవలసిన పరిస్థితిలో యూనియన్‌ను కాపాడ గలిగితే అదీ చేస్తాను", దేశసమైక్యాన్ని కాపాడటమే లింకన్ ధ్యేయము అన్నది పై మాటలవల్ల విస్పష్టంగా తెలుస్తుంది.

## 9.15 దక్షిణ రాష్ట్రాలు యూనియన్ నుంచి విడిపోవడం :

లింకన్ అధ్యక్షుడుగా ఎన్నికయిన వెంటనే, అతని అభిప్రాయాలను తెలిసిన దక్షిణ రాష్ట్రాలవారు ఎదురు తిరిగారు. డిసెంబరు 20వ తారీఖు 1860న దక్షిణ కెరోలినా యూనియన్ నుంచి విడిపోయింది. మరో ఆరు వారాలలో దక్షిణాది రాష్ట్రాలైన మిసిసిపి, ఫ్లారిడా, అలబమా, జార్జియా, లూసియానా, టెక్సాస్‌లు దక్షిణ కెరోలినాను అనుసరించాయి. ఈ విధంగా విడిపోయిన రాష్ట్రాలు మౌంట్ గొమరీ (Mont gomery) పట్టణంలో ఫిబ్రవరి 1861లో సమావేశమయ్యారు. కాన్‌ఫెడరేట్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (Confederate States of America) అనే పేరుతో వేరే ఒక సమిష్టి ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి తీర్మానించుకొని, వారు జెఫర్సన్ డేవిస్‌ను తమ అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. వీరు వర్జీనియాలోని రిచ్ మండ్ (Richmond) పట్టణాన్ని తమ రాజధానిగా చేసుకొన్నారు. అనంతరం కొద్ది మాసాలలోనే ఇంకొక నాలుగు దక్షిణాది రాష్ట్రాలు కాన్‌ఫెడరసీలో చేరగా కాన్ ఫెడరేట్ రాష్ట్రాల సంఖ్య పదకొండుకు పెరిగింది.

లింకన్ మార్చి 4, 1861న, పదవీ స్వీకారోత్సవ సందర్భంలో చేసిన ఉపన్యాసంలో దక్షిణ ప్రాంతంపై సామరస్య ధోరణిలో ఇంచుమించు సానునయ పద్ధతిలో ప్రసంగించాడు. ఆదినుంచి ఏకంగా, ఏక చరిత్ర సంస్కృతులు ఉన్న తమజాతి అఖండమని, భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను, రాజకీయంగాను కూడా తమజాతి రెండుగా విడిపోవడం అసంభవమని లింకన్ చెప్పాడు. ఏది ఏమైనప్పటికి సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం మీద ముందుగా దౌర్జన్యం జరిగితే తప్ప దాక్షిణాత్యులపై తన ప్రభుత్వము బల ప్రయోగానికి తలపడదని కూడా లింకన్ దాక్షిణాత్యులకు హామీ ఇచ్చినాడు.

## 9.16. అంతర్యుద్ధ ప్రారంభము :

చార్లెస్టన్ నౌకాశ్రయం సమీపంలోని సమ్‌టర్ (Samter) దుర్గంలో సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వానికి చెంది కొంత సైన్యము ఉండేది. ఆ సైన్యానికి ఆహార పదార్థాలు అయిపోతూ ఉండడంతో వారికి కావలసిన ఆహార పదార్థాలు జలమార్గాన పంపడమో లేదా ఆదుర్గాన్ని దాక్షిణాత్య కాన్ ఫెడరేట్ ప్రభుత్వానికి అప్పగించడమో లింకన్ వెంటనే నిశ్చయించవలసిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. తాను సైనికులను యుద్ధ సామగ్రిని సమ్‌టర్ దుర్గానికి చేరవేసిన వెంటనే యుద్ధం ప్రారంభంకావడమే గాకుండా ఫెడరల్ ప్రభుత్వమే కయ్యానికి కాలుదువ్విందనే అపవాదు కూడా వచ్చేటట్లున్నది. ఆ విధంగా చేయకపోతే దక్షిణ రాష్ట్రాల సమాఖ్యను న్యాయ బద్ధమైనదిగా లింకన్ గుర్తించినట్లేగాక పిరికి తనంతో దాక్షిణాత్యులు లొంగిపోయినట్లు ఔత్తరాహులు ప్రచారం చేస్తారు. చివరకు లింకన్ ఆహార పదార్థాలను పంపడానికి నిశ్చయించాడు. అందులో యుద్ధ సామగ్రి సరఫరా చేయడంలేదని లింకన్ ముందుగా ప్రకటించినప్పటికీ దాక్షిణాత్యులకు దీనిని శత్రు చర్యగానే భావించారు. ఫలితంగా ఏప్రిల్ 12, 1861న కాన్‌ఫెడరసీ తాలూకు ఫిరంగి దళాలు సమ్‌టర్ దుర్గంపైన కాల్పులు ప్రారంభించాయి. ముప్పై నాలుగు గంటల తరవాత అక్కడ ఉన్న ఫెడరల్ ప్రభుత్వ సేన లొంగిపోయింది. ఆ దుర్గంపైన ఉన్న చుక్కల,

చారల జెండా దించివేయడం జరిగింది. దాని స్థానంలో కాన్‌ఫెడరసీ తాలూకు చుక్కలు, నిలువు గీతలున్న పతాకాన్ని ప్రతిష్ఠించడంతో చరిత్రాత్మకమైన **అంతర్యుద్ధానికి** అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చును.

**దక్షిణాది రాష్ట్రాలు బానిసత్వ** వ్యవస్థ రక్షణకై యుద్ధాన్ని ప్రకటించగా, యూనియన్ ప్రభుత్వం యూనియన్ పరిరక్షణే తన యుద్ధ కారణంగా **తెలిపింది. అంతర్యుద్ధము** ముఖ్యంగా తూర్పున వర్జీనియాలోను, పడమట టెన్నెసీలోను, మిసిసిపి నదీ తీరం వెంట జరిగింది. యుద్ధ ప్రారంభ దశలో ఔత్తరాహులు వాషింగ్టన్ నగరాన్ని శత్రువుల బారినుంచి కాపాడవలెనని, సరిహద్దు రాష్ట్రాలైన మేరీలాండ్, మిసోరీ, కెంటకీలను యూనియన్ ఆధీనంలోకి చేర్చవలెనని తలచారు. వారి రెండో ధ్యేయము కాన్‌ఫెడరసీని జయించడం. దక్షిణ ప్రాంతంలో ప్రతి 900 చ.సెం. మీ. నేలనూ జయించడము అసాధ్యము. అందువల్ల యూనియన్ ఈ కింది వివరించిన విధానాలను అనుసరించింది. కానఫెడరేట్ నౌకాశ్రయాలను దిగ్బంధం చేసింది. దక్షిణ ప్రాంతంలో ఉన్న రైలు మార్గాలను విచ్ఛిన్నం చేయబూనింది. కీలక రవాణా కేంద్రాలైన రిచ్‌మండ్ (Richmond) అట్లాంటా, (Atlanta), విక్స్ బర్గ్ (Vicks burg)లను హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించింది. అంతేగాకుండా కాన్‌ఫెడరసీలోని తూర్పు ప్రాంతానికి, పశ్చిమ ప్రాంతానికి సంబంధం తెగిపోయేటట్లు చేసే మేరకు యూనియన్ సైన్యాలను దక్షిణ ప్రాంతంలోకి నడిపించ ప్రయత్నించింది.

ఫెడరల్ ప్రభుత్వాధికారాన్ని మొత్తం దేశమంతటా పునః ప్రతిష్ఠించడానికి 75,000 మంది స్వచ్ఛంద సైనికులు అవసరమని లింకన్ ప్రకటించాడు. మిగిలిన ఎనిమిది బానిస రాష్ట్రాలలో వర్జీనియా, ఉత్తర కెరోలినా, ఆర్కాన్సాస్, టెన్నెసీలు కేంద్ర ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకొన్నాయి. మేరీలాండ్, డేలవేర్, కెంటకీ, మిసోరీ రాష్ట్రాలు యూనియన్‌లో ఉండి పోయినప్పటికీ ఈ రాష్ట్రాలలోని పౌరులు అధిక సంఖ్యలో దాక్షిణాత్య సైన్యంతరపున పోరాడారు. వర్జీనియాలోని పశ్చిమ ప్రాంతము కేంద్ర ప్రభుత్వం పట్ల విధేయత ప్రకటించినందువల్ల 1863లో ఈ ప్రాంతము పశ్చిమ వర్జీనియా అనే పేరుతో ప్రత్యేక రాష్ట్రంగా గుర్తింపు పొందింది.

## 9.17. మొదటి బుల్‌రన్ యుద్ధము :

వాషింగ్టన్ నగరానికి దక్షిణంగా నూరు మైళ్ళ దూరంలో ఉన్న రిచ్‌మండ్ పట్టణము దక్షణాది రాష్ట్రాలకు రాజధాని అయింది. ఔత్తరాహులు 30,000 సైన్యాన్ని వర్జీనియాకు తరలించారు. ఈ సైన్యానికి దాదాపు ఇంతే ఉన్న దక్షిణాది సైన్యానికి జూలై 21, 1861న బుల్‌రన్ దగ్గర మొట్టమొదటి భారీ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఔత్తరాహులు ఘోర పరాజయానికి గురి అయ్యారు.

మొదటి బుల్‌రన్ యుద్ధం పూర్తయిన తరువాత 1861 శేష భాగంలో యూనియన్ దిగ్బంధన **వ్యూహం** వల్ల విదేశాలతో ఉత్పన్నమైన ఘర్షణను కాన్‌ఫెడరసీ ఎదుర్కొనవలసి వచ్చింది. ముఖ్యంగా బ్రిటన్‌తో కొంత కీచులాట జరిగింది. **బ్రిటిష్ నౌక ట్రెంట్** నవంబరు, 1861లో సదాంప్టన్ (Southampton)కు పయనిస్తుండగా యూనియన్ నౌక ఒకటి దానిని నిలిపింది. **ట్రెంట్ నౌకలో** మేసన్, స్లైడెల్ అనే కాన్ ఫెడరసీ అధికారులిద్దరు బ్రిటన్‌కు ప్రయాణం చేస్తున్నారు. ఐరోపా దేశాలు కాన్ ఫెడరేట్ ప్రభుత్వాన్ని **గుర్తించేటట్లు** ప్రయత్నించడానికి వీరు వెడుతున్నారు. వీరిద్దరిని యూనియన్ అధికారులు బంధించారు. ఈసంఘటనతో బ్రిటన్ రెచ్చిపోయి తన ఆగ్రహాన్ని వ్యక్త పరిచే ఒక ఉత్తరాన్ని లింకన్ ప్రభుత్వానికి పంపే ప్రయత్నంలో ఉండగా ఆవిషయం తెలుసుకొన్న లింకన్, మేసన్, స్లైడల్‌లను విడుదల చేసాడు. అంతర్యుద్ధ కాలంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు కాన్‌ఫెడరసీ గుర్తించమని **కోరినా** కూడా తటస్థంగానే ఉన్నాయి.

## 9.18. 1862-63లో యుద్ధ గమనము :

పశ్చిమ రంగంలో, 1862లో కొన్ని ముఖ్యమైన యుద్ధాలు జరిగాయి. పశ్చిమ ప్రాంతంలో మిసిసిపి తీరాన ఉన్న విక్స్‌బర్గ్ (Vickburg) టెన్నెసీలోని నాష్‌విల్ (Nashville) నగరాలు కానఫెడరేట్‌ల కీలక స్థావరాలు వీటిని చేజిక్కించుకొనడానికి లింకన్, యులిసిస్ గ్రాంట్ అనే యోధుని వినియోగించారు. ఇతడు ఫిబ్రవరి, 1862లో డోనెల్సన్ కోట (Fort Donelson) ను పట్టుకొన్నాడు. ఈ విజయం తరువాత నాష్‌విల్ దాని తరువాత షిలో (Shiloh) గ్రాంట్‌కు లొంగిపోయాయి. ఏప్రిల్ 1862లో యూనియన్ నౌకా, సైన్య దళాలు రెండూ కలిసి న్యూఆర్లియన్స్‌ను స్వాధీనపరచుకొన్నాయి. విక్స్ బర్గ్‌పై దండెత్తడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. మిసిసిపినది పూర్తిగా యూనియన్ సైన్యాల వశమయింది. ఆ నదికి పశ్చిమంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తూర్పు రాష్ట్రాలతో సంబంధం తెగిపోయింది.

## 9.19. తూర్పు ప్రాంతంలో యుద్ధము :

సమర్ధుడుగా కనిపించిన జార్జి, మెక్లెల్లాన్ (George B. Meclellan)ను లింకన్ తూర్పు ప్రాంతం యూనియన్ సేనకు సేనాధిపతిగా నియమించినాడు. ఇతడు పోటో మాక్ సైన్యంతో రిచ్‌మండ్‌పై దండయాత్రకు బయలుదేరాడు. జూన్, 1862లో లక్షకు పైగా ఉన్న తన సేనను రిచ్‌మండ్ పొలిమేరలకు నడుపుకొని వెళ్ళి, తన సైన్యంలో సగం మాత్రమే ఉన్న లీ జాక్సన్ సైన్యాన్ని ఎదిరించాడు. కాని రిచ్‌మండ్‌ను పట్టుకొనే ప్రయత్నం విఫలుడై తన సేనను ఉపసంహరించుకొని వాషింగ్టన్ తిరిగి వెళ్ళిపోయాడు.

## 9.20. రెండో బుల్ రన్ యుద్ధము :

మెక్లెల్లాన్ అసమర్థతతో నిరాశచెందిన లింకన్ తన సైన్యంలో అధిక భాగాన్ని జనరల్ జాన్‌పోప్ నాయకత్వంలోకి మార్చాడు. కాని, ఆగష్టు 1862లో, లీ, పోప్ సైన్యంపై విరుచుకొని పడి రెండో బుల్‌రన్ యుద్ధంలో పోప్ సైన్యాన్ని ఓడించాడు. అపఖ్యాతి పాలైన పోప్ వాషింగ్టన్‌కు మళ్ళాడు.

## 9.21. మెకెల్లాన్ రెండోసారి సైన్యాన్ని నడిపించడం :

రెండో బుల్ రన్ యుద్ధంలో విజయం సాధించిన లీ ఉత్తరాభిముఖంగా తన సైన్యాన్ని నడిపించి పోటోమాక్‌ను దాటి మేరీ లాండ్‌లో ప్రవేశించగా అతనిని ఎదుర్కొనడానికి మెక్లెల్లాన్‌ను పోటోమాక్ సైన్యానికి నాయకునిగా నియోగించాడు, మెక్లెల్లాన్ దక్షిణాది సైన్యము లీ నాయకత్వంలో ఉత్తరంగా పైకి చొచ్చుక పోకుండా ఆంటీయాటమ్ (Antietam) యుద్ధంలో అడ్డగించినప్పటికి ఆ యుద్ధానంతరం తిరిగి వెనకంజవేయసాగాడు. దానితో లింకన్ విసుగుచెంది అతనిని తొలగించి ఇతర సేనాధిపతులకు ఆ బాధ్యతలు అప్పగించాడు. అంటీయాటమ్‌లో విజయానంతరం లింకన్ బానిస విముక్తి ప్రకటన (Emancipation proclamation)ను జారీ చేసాడు. దీని ప్రకారం కాన్‌ఫెడరేట్ రాష్ట్రాలన్నింటిలో జనవరి 1వ తేది, 1863 నుంచి బానిసలు దాస్య విముక్తి పొందారు.

ఉత్తరాది సైన్యము తిరిగి వర్జీనియాపై దాడి చేసింది. కాని, ఫ్రెడరిక్ బర్గ్ దగ్గర డిసెంబరు 1862లో జరిగిన యుద్ధంలో యూనియన్ సైన్యము ఓడిపోవడమే కాకుండా 12,000 మంది యూనియన్ సైనికులు మరణించారు. మే 1863లో ఛాన్సెలర్స్ విల్ (Chancellorville) దగ్గర జరిగిన పోరాటంలో కూడా యూనియన్ సైన్యము ఓడిపోయింది. కాని దురదృష్టవశాత్తు కాన్ ఫెడరేట్ సేనా నాయకుడు స్టోన్‌వాల్ జాక్సన్‌పై చీకటి కమ్ముతుండగా పొరపాటున కాన్ ఫెడరేట్ సైనికులే కాల్పులు జరిపినందువల్ల అతడు మరణించాడు.

## 9.22. గెట్టిస్ బర్గ్ యుద్ధము :

జనరల్ లీ పెన్సిల్వేనియాకు కాన్ ఫెడరేట్ సైన్యాన్ని తరలించగా, యూనియన్ సైన్యము గెట్టిస్ బర్గ్ వద్ద లీ సేనల నెదిరించింది. గెట్టిస్ బర్గ్ దగ్గర లీ నాయకత్వంలో తెల్లని యూనిఫారాలలో 75,000 మంది సుశిక్షిత వీరులు, జనరల్ జార్జి మీడ్ (George G. Meade) నాయకత్వాన సమీకృతులై ఉన్న సుమారు 90,000 మంది నీలం యూనిఫారం యోధులను ఎదుర్కొన్నారు. జూలై ఒకటి, రెండు, 1863లో దాక్షిణాత్య సేనదే పైచేయిగా ఉంది. వారు రెండు పక్కల ఉత్తరాది సైన్యాన్ని వెనుకకు తరమికొట్టారు. కాని జూలై ఒకటి, రెండు 1863లో దాక్షిణాత్మ సేనదే పై చేయిగా ఉంది. వారు రెండు పక్కల ఉత్తరాది సైన్యాన్ని వెనుకకు తరమికొట్టారు. కాని జూలై 3న, ఉత్తరాది సేనలు విజృంభించి జనరల్ జార్జి పికెట్ నాయకత్వంలో దక్షిణాది సేనలను దారుణంగా ఓడించాయి. అత్యంత సాహసోపేతమైన ఈ యుద్ధంలో మృతుల సంఖ్య 50,000 ఉంటుందని అంచనా వేసారు. భీకర నష్టాల పాలయిన దక్షిణాది సేనలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయాయి. గెట్టిస్ బర్గ్ యుద్ధం ముగిసింది. దాక్షిణాత్యులవల్ల యుద్ధ భయము అంతమయింది. జూలై 4వ తేదీన ఉత్తరాది అంతటా స్వాతంత్ర్య దినోత్సవము వైభవోపేతంగా జరుపుకొన్నారు. దీనికి కారణము గెటిస్ బర్గ్ విజయమే కాకుండా పశ్చిమ యుద్ధ రంగాలలో కూడా ఉత్తరాది సైన్యము విజయ పరంపరలు సాధించడం. గెట్టిస్ బర్గ యుద్ధం ముగిసిన మరుసటిరోజున పశ్చిమ ప్రాంతంలో విక్స్ బర్గ్‌లో యులిసిస్ గ్రాంట్‌కు కాన్ఫెడరేట్ సైన్యం లొంగిపోయింది. గెట్టిస్ బర్గ, విక్స్ బర్గ యుద్ధాలలో యూనియన్ సైన్యాల విజయాలు అతి ప్రాముఖ్యమైనవి. కాన్‌ఫెడరసీకి, బ్రిటన్ సహాయం చేస్తుందేమో అనే భ్రాంతి ఈ విజయాలతో రెండు పక్షాలు వారికీ తీరిపోయింది. గెట్టిస్

బర్గ్ విజయము లీ ఉత్తరాభి ముఖంగా చొచ్చుకొని పోకుండా అరికట్టగా, విక్స్‌బర్గ్ గెలుపు పశ్చిమ ప్రాంతంలో కాన్‌ఫెడరసీపై గట్టి దెబ్బతీసింది. తరువాత నవంబరు, 1863లో జనరల్ గ్రాంట్, చటనూగా (Chattanooga) యుద్ధ రంగంలో కాన్‌ఫెడరేట్ సైన్యాలను ఓడించాడు.

గెట్టిస్‌బర్గ్ అమెరికన్ చరిత్రలో ప్రసిద్ధి కెక్కడానికి కారణము కేవలం అక్కడ జరిగిన పోరాటమే కాదు. అక్కడ నవంబరు 1863లో మృత వీరులకు జాతీయ యుద్ధ స్మారక చిహ్నం నిర్మించే సందర్భంలో లింకన్ చారిత్రాత్మకమైన ఒక ఉపన్యాసమిచ్చాడు. "ఎనభై ఏడు సంవత్సరాలకు పూర్వం మన పూర్వీకులు ఈ ఖండంలో మానవులంతా సమానంగానే జన్మించారు అనే సిద్ధాంతానికి అంకితమై స్వేచ్ఛాయుతమైన ఒక కొత్త జాతిని నెలకొల్పినారు" అనే భావ పూరితమైన వాక్యంతో మొదలైన ఆ ఉపన్యాసము... "ప్రజలదై, ప్రజలచేత, ప్రజలకోసం నెలకొన్న ప్రభుత్వము పుడమినుంచి అంతర్ధానం కాదు...." అనే వాక్యంతో అంతమై ప్రజాస్వామ్యానికి నిర్వచనంగా నిలిచింది.

## 9.23. 1864 సంవత్సర యుద్ధ గమనము :

అంతర్యుద్ధంలో అతి ముఖ్యమైన కాలము 1864వ సంవత్సరము. ఈ సంవత్సరంలో కాన్ ఫెడరేట్‌లు ఒకవైపున పట్టుదలతో శత్రువులతో పోరాడుతూ ఉంటే, ఇంకొక వైపున ఔత్తరాహులు 1863లో సంపాదించిన విజయాలను నేలపాలు చేయకూడదనే ధృఢ నిశ్చయంతో పోరాడారు. గ్రాంట్ తూర్పు ప్రాంతంలో యూనియన్ సైన్యాలకు సర్వసేనానిగా నియమితుడయినాడు. ఇతడు విల్డర్‌నెస్ (Wilderness) స్పాట్ సిల్వేనియా (Spot sylvania) కోల్డ్ హార్బర్ (Cold Harbour) యుద్ధ రంగాలలో అఖండ విజయాలు సాధించాడు. ఈలోగా అట్లాంటా (Atlanta) యుద్ధ రంగంలో ఇంకొక యూనియన్ సైన్యాధికారి షెర్మన్ (Sherman) విజయం సాధించినాడు. ఈ మధ్య కాలంలోనే జరిగిన 1864 సంవత్సర అధ్యక్ష ఎన్నికలలో లింకన్ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన తన ప్రత్యర్థి మెక్లెల్లాను ఓడించి తిరిగి ఎన్నికయినాడు.

ఫిబ్రవరి, 1865 కాన్ ఫెడరేట్ నాయకులకు లింకన్‌కు మధ్య వర్జీనియాలోని హాంప్టన్ రోడ్స్ (Hampton Roads) అనే చోట శాంతి సంభాషణలు జరిగాయి. ఇవి విఫలం కావడంతో యుద్ధం తిరిగి కొనసాగింది. 1865వ సంవత్సరం ఏప్రిల్ 9వ తేదీన కాన్ ఫెడరేట్ సైన్యాధిపతి లీ (Lee) యూనియన్ సైన్యాధ్యక్షుడు గ్రాంట్‌కు అపోమటాక్స్ కోర్ట్ హౌస్ (Appomottox) దగ్గర లొంగి పోవడంతో అంతర్యుద్ధం ముగిసింది. ఒక మాసం తరువాత యూనియన్ ప్రభుత్వము జెఫర్సన్ డేవిస్‌ను ఖైదు చేసింది.

## 9.24. యుద్ధ ఫలితాలు :

బానిసత్వం నిర్మూలించబడింది. అంతర్యుద్ధంలో మృతి పొందిన వారుగాని, క్షతగాత్రులు అయిన వారు గాని దాదాపు పది లక్షల మంది, అందులో దక్షిణాది రాష్ట్రాలలోని యువతరం తుడుచుకొని పోయిందని చెప్పుకోవచ్చును.

యుద్ధానికి 1500 కోట్ల డాలర్లుకు పైగా వ్యయమయింది. నాశనమైన ఆస్తిగాని, యుద్ధానంతరం కలిగిన దుష్పరిణామాలు గాని అంచనాలకు మించాయి. యుద్ధం జరిగిన ప్రదేశాలలో, పట్టణాలు ధ్వంసమయ్యాయి. రాకపోకలకనువయిన రైలు, రోడ్డు మార్గాలు అస్త వ్యస్తాలయినాయి. దక్షిణ రాష్ట్రాల ప్రజల విత్తమంతా అందర్యుద్ధంలో హరించడం వల్ల పునర్నిర్మాణానికి కావలసిన మూల ధనం కూడా కరువయింది.

దక్షిణాదిన దివాలా తీయని బ్యాంకులుగాని భీమా సంస్థలుగాని లేవంటే అతిశయోక్తి కాదు.

పులి మీద పుట్రవలె ఫెడరల్ ప్రభుత్వము దక్షిణాది కాన్ఫడరేట్ (Confederate Government) ఆస్తులన్నిటినీ స్వాధీనం చేసుకోవడానికి ఉత్తరువులు జారీ చేసింది.

దక్షిణాదిన ఉన్న కొద్ది కార్ఖానాలు చాలా కాలం క్రితమే మూలపడినాయి. ఈ దుస్థితిని తప్పించుకోవడానికి దక్షిణాదివారి ఏకైక శరణ్యము, సారవంతము అయిన వారి పంట పొలాలే. కాని వాటిని సాగు చేయడానికి కూడా అనేక ఆటంకాలు ఏర్పడ్డాయి.

భూములను సాగులోకి తేవలెనంటే దక్షిణాదిన శాంతి భద్రతలు నెలకొల్పి నీగ్రోలు యథాతథంగా పనిలోకి వచ్చే పరిస్థితులు కల్పించాలి. వేలాది నీగ్రోలు ఫెడరల్ సైన్యంలో చేరి యుద్ధానంతరం విడుదల పొందారు.

తమకు స్వాతంత్ర్యం వచ్చిందని తెలుసుకొన్న వీరు పనిమాని ధైర్యవంతులై తిరగడం ఆరంభించారు.

అనుకోకుండా వచ్చిన ఈ స్వేచ్ఛను ఎట్లా అనుభవించవలెనో వారిలో చాలా మందికి తెలియదు. వారందరూ నోరూరేటట్లు ప్రభుత్వము త్వరలోనే ప్రతి కుటుంబానికీ నలభై ఎకరాలను, ఒక కంచర గాడిద (mule)ను ఊరకనే ఇస్తుందనే వదంతి వ్యాపించి పని చేయడం మాని ఊహాలోకంలో తిరగడం మొదలుపెట్టారు. ఒకప్పుడు తెల్లవారికి బానిసలైన నీగ్రోలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆకలి దప్పులకూ అనారోగ్యానికీ బానిసలయ్యారు.

## సారాంశము :

ఈ యుద్ధం వలన అమెరికా ఒక సుస్థిరమైన, స్వేచ్ఛాయుతమైన దేశంగా అవతరించింది. బానిసత్వ వ్యవస్థ చట్టరీత్యా నిషేధించబడింది. ఉత్తర దక్షిణ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల వైరుధ్యాల దృష్ట్యా జరిగిన ఈ అంతర్యుద్ధ సమగ్రమైన దేశాభివృద్ధికి దోహదపడింది.

**అభ్యాసాలు :**

1. అంతర్యుద్ధమునకు కారణములు వ్రాయుము

2. యుద్ధ గమనమును వివరింపుము.

**ఉపకయుక్త గ్రంథాలు :**


| | | | |
|---|---|---|---|
| 1) | Henry Bamford Parkes | : | The United States of America |
| 2) | Thomas A Baily | : | The American Pageant |
| 3) | C.P. Hill | : | History of the United States |
| 4) | Patt & Drummond | : | Our National From its creation |
| 5) | David Donald | : | A History of American Lifes Thought |
| 6) | Richard B Morris | : | Encyclopaedia of American History |
| 7) | Edward J. Conlon (For the united states Information Service-Madras | : | America Charitra Sangraham |
| 8) | Telugu Acaedemy | : | America Samyukta Rastrala Charitra. |



డా॥ కంరున్నిసా బేగం, ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.

చరిత్ర, పురాతత్త్వ శాఖ

నాగార్జున విశ్వ విద్యాలయం

## పాఠం - 10

# అంతర్యుద్ధానంతర పునర్నిర్మాణము

### 10.0 లక్ష్యం :

అంతర్యుద్ధం తరువాత సంభవించిన పరిణామాలను పున: నిర్మాణ విధానాలను, వాని ఫలితాలను వివరించడం ఈ పాఠం లక్ష్యం.

### విషయ క్రమం :

10.1 పరిచయము
10.2 అంతర్యుద్ధ పరిణామాలు
10.3 విదేశీ సవాళ్ళు
10.4 లింకన్ పునర్నిర్మాణ పథకము
10.5 జాన్సన్ ప్రణాళిక
10.6 రాజ్యాంగం పధ్నాలుగో సవరణ
10.7 అతివాదుల పునర్నిర్మాణ పథకము
10.8 సైనిక పునర్నిర్మాణ చట్టము
10.9 పునర్నిర్మాణ ప్రభుత్వాల తీరుతెన్నులు
10.10 స్వతంత్ర నీగ్రోల ప్రవర్తన
10.11 పునర్నిర్మాణ ఫలితాలు
10.12 కుక్లక్స్‌క్లాన్
10.13 రాజ్యాంగ పదిహేనో సవరణ
10.14 బుకర్ వాషింగ్టన్
10.15 ఆర్థిక పునర్నిర్మాణము
10.16 సమీక్ష

### 10.1 పరిచయము :

ఏప్రియల్ తొమ్మిదో తేది 1865వ సంవత్సరము అమెరికా సంయుక్త రాష్ట్రాల అంతర్యుద్ధంలో దక్షిణాది కాన్ఫెడరేట్ (Confederate) సైన్యాధిపతి అయిన జనరల్ రాబర్ట్ ఇ.లీ. (general Robert E. Lee) తన, 30,000 మంది అనుచరులతో యూనియన్ సైన్యాధ్యక్షుడు గ్రాంట్‌కు అపొమటక్స్ (Appomotox) కోర్ట్ ఆవరణలో లొంగిపోయిన చారిత్రాత్మక దినము. ఈ సంఘటన జరిగిన అయిదు రోజులకే వాషింగ్టన్ నగరంలోని ఫోర్డ్ నాటకశాలలో "మన అమెరికన్ సోదరులు" అనే నాటకాన్ని తిలకిస్తూన్న అమెరికా అధ్యక్షుడైన అబ్రహాం లింకన్‌ను జాన్ విల్క్స్ బూత్ (Wilkes Booth) అనే నటుడు తుపాకితో కాల్చాడు. ఆ రాత్రి అంతా స్పృహ కోల్పోయి మరునాడు ఉదయం, ఏప్రియల్, పదిహేను, 1865న లింకన్ కాల గర్భంలో కలిసి పోయాడు. లింకన్ మరణం వల్ల కలిగిన సంక్షోభానికి తోడు అంతకన్నా జటిలమైన అంతర్యుద్ధానంతర పునర్నిర్మాణ సమస్య అమెరికన్‌లకు సవాలుగా నిలిచింది.

## 10.2. అంతర్యుద్ధ పరిణామాలు :

ఈ అంతర్యుద్ధంలో సుమారు పదిలక్షల మంది, వారిలో దక్షిణాది రాష్ట్రాలలోని యువతరం మొత్తం, చనిపోయారు. ఆర్థిక పరంగా ఈ యుద్ధానికైన ఖర్చు 1500 కోట్ల డాలర్లు, నాశనమైన ఆస్తిగాని, యుద్ధానంతరం కలిగిన దుష్పరిణామాలు గాని అంచనాలకు మించాయి. ఎన్నో పట్టణాలు, రైలు, రోడ్డు మార్గాలు ధ్వంసమైనాయి. ఆర్థిక పరంగా హరించుకొని పోవుటంవలన దక్షిణాది రాష్ట్రాలకు పునర్నిర్మాణానికి కావలసిన మూల ధనం కూడా కరువయింది. దక్షిణాది రాష్ట్రాలలో అన్ని బ్యాంకులు, భీమా సంస్థలు మూతపడ్డాయి. ఇటువంటి పరిస్థితులలో, ఫెడరల్ గవర్నమెంటు దక్షిణాది కాన్ఫెడరేట్ ప్రభుత్వ ఆస్తులన్నిటినీ స్వాధీనం చేసుకోవడానికి ఉత్తరువులు జారీ చేసింది. యుద్ధం తర్వాత వేలాది నీగ్రోలు స్వేచ్ఛను ఏ విధంగా అర్థం చేసికొన్నారంటే తాము వ్యవసాయ పనులకు పోనవసరం లేదని మాత్రమే భావించారు. భూమి సాగు పనిలోచేయవలసిన బాధ్యతను వారు విస్మరించి, తమకు క్రొత్తగా వచ్చిన స్వాతంత్ర్యాన్ని ఏ విధంగా అనుభవించాలో తెలియక, దేశంలో తిరగటం మొదలు పెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వారు ఆర్థిక పరమైన బాధలు, ఆకలి దప్పులు, అనారోగ్యంతో బాధలు ఎదుర్కొనవలసి వచ్చింది. ఎందుకంటే ఇది వరలో వారి బాగోగులను చూసిన యజమానులు ఇప్పుడు వారిని నిర్లక్ష్యం చేశారు.

## 10.3 విదేశీ సవాళ్ళు :

దక్షిణాది రాష్ట్రాలు ఓటమి పొందడంతో బానిసలకు స్వేచ్ఛ లభించింది. ఈ పరిణామానికి దక్షిణ రాష్ట్రాల భూస్వాములు వెంటనే అంగీకరించలేకపోయారు. ఆంత రంగికమయిన ఈ సమస్యలన్నీ చాలవన్నట్లు కొన్ని విదేశాల బెడదలు కూడా అమెరికాను బాధించ సాగినాయి. ముఖ్యంగా ఫ్రాన్స్ చక్రవర్తి మూడో నెపోలియన్ మెక్సికోపై 1864లో దండెత్తి ఆస్ట్రియాకు చెందిన మాక్సిమిలియన్ (Maximilian)ను ఆదేశానికి చక్రవర్తిగా నియమించాడు. దీనివల్ల మన్రో సిద్ధాంతము ఉల్లంఘితమయినా అమెరికన్‌లు అంతర్యుద్ధంలో నిమగ్నమై ఉండటంవల్ల ఏమి చేయలేదు. యుద్ధానంతర అమెరికన్‌లు తమ శక్తి యుక్తులను ఉపయోగించి ఫ్రెంచి వారిని మెక్సికో నుంచి వెళ్ళగొట్టి మన్రో సిద్ధాంతాన్ని పున: ప్రతిష్ఠితం చేసారు.

అంతర్యుద్ధ కాలంలో దక్షిణాది కాన్ఫడరేట్లకు సహాయ సంపత్తులనిచ్చిన ఇంగ్లండ్, కెనడాలను కూడా అమెరికన్‌లు ఒక పట్టు పట్టిచూసారు. అమెరికాలో స్థిరపడిన ఐర్లండ్ వాసులు ఇంగ్లీషువారిని ఏ విధంగా నైనా తిప్పలు పెడితే చాలునని ఈ అవకాశాన్ని బాగా వినియోగించుకొన్నారు. వీరు సుమారు నూట ఏభై మంది వ్యక్తులు కలిసి ఆకుపచ్చ చొక్కా దళాలు (Green Shirts) గా ఏర్పడి ఇంగ్లీషు వారి స్థావరమైన కెనడాపై 1866-1870లో దాడి చేసారు. వీటి ఫలితంగా అమెరికన్‌లను ఎదుర్కొనడానికి సరయిన ఉజ్జీని ఏర్పాటు చేయదలచిన బ్రిటీష్ వారు 1867లో ఒక చట్టం ద్వారా కెనడాకు అధినివేశ ప్రతిపత్తి (Dominion Status) ప్రసాదించారు. అమెరికన్ అంతర్యుద్ధానంతరం రెండు నూతన రాజ్యాలు ఆవిర్భవించినాయి. మొదటిది పునరైక్యమైన అమెరికా సంయుక్త రాష్ట్రాలు, రెండోది సంయుక్త కెనడా, కాని అప్పటికి నాలుగు సంవత్సరాల హోరా హోరిగా యుద్ధం చేసుకొన్న ఉత్తర, దక్షిణ రాష్ట్రాలకు సఖ్యత కలిగించడానికి, ఆర్థికంగా అభివృద్ధి పరచడానికి ఎంతో శ్రమ చేయవలసి వచ్చింది. దీనికి ప్రాతిపదికగా లింకన్‌వేసిన ప్రణాళిక ఉపకరించింది. దానికనుబంధంగా జాన్సన్, కాంగ్రెస్, అతివాద సభ్యుల ప్రణాళికలు కూడా ఉపకరించాయి.

## 10.4 లింకన్ పునర్నిర్మాణ పథకము :

యుద్ధంలో ఓటమి పొందిన దక్షిణ రాష్ట్రాలను పునర్నిర్మించ వలసిన అవసరం యూనియన్ ప్రభుత్వానికి ఉంది. ప్రాణాలు వదిలిన అధ్యక్షుడు అబ్రహాం లింకన్ స్వయంగా ఒక ప్రణాళికను సూచించాడు. యుద్ధం ముమ్మరంగా సాగుతున్న కాలంలోనే లింకన్ రెండోసారి అధ్యక్షుడుగా ఎన్నికైనప్పుడు పదవీ స్వీకరణోత్సవ సందర్భంగా ప్రసంగిస్తూ "ఎవరిపట్లను ఏ విధమైన ద్వేషం లేకుండా అందరిపట్ల ఉదార భావంతో మనం తలపెట్టిన కార్యక్రమాన్ని చివరి వరకూ నిర్వహించి జాతికి గలిగిన గాయాలను మాన్పు కొందాము. ఈ యుద్ధంలో వీర మరణం పొందిన వారి బిడ్డలకు సంరక్షణ కల్పించడంలో మన మధ్యను, ప్రపంచ రాజ్యాలన్నిటి మధ్యను న్యాయమైన శాశ్వతమైన శాంతిని స్థాపించడానికి సర్వప్రయత్నాలను కొనసాగిద్దా"మని తన పథకాన్ని సూక్ష్మంగా వివరించినాడు.

అదే సమయంలో సమాఖ్య నుంచి విడిపోయిన రాష్ట్రాల ప్రతిపత్తిని నిర్ణయించే అధికారము కాంగ్రెస్‌దా, అధ్యక్షునిదా అనే మీమాంస బయలు దేరింది. లింకన్ దృష్టిలో దక్షిణాది రాష్ట్రాలు న్యాయ రీత్యా ఎప్పుడూ సమాఖ్యనుంచి విడిపోలేదు. కాని అక్కడి ప్రజలు కొందరు రాజ్యభక్తి రహితుల ప్రోద్బలం వల్ల సమాఖ్య అధికారాన్ని ఎదిరించారు. అమెరికా అధ్యక్షుడుగాను, సర్వసైన్యాధ్యక్షుడుగాను, క్షమాదానం చేసే అధికారిగాను అట్లాంటి రాజ్యభక్తి రహితుల మీద చర్య తీసుకొనే అధికారము తనకే ఉందని లింకన్ విశ్వసించాడు. దీని కనుగుణంగా 1863లో దక్షిణాదిన ఉన్న ఏ రాష్ట్రంలోనయినా నూటికి పదివంతుల ఓటర్లు సమాఖ్యకు విధేయతతో మెలిగే ప్రభుత్వాన్ని ఏర్పరచగోరినట్లయితే అట్లాంటి రాష్ట్రాన్ని తిరిగి సమాఖ్యలో పూర్తి హక్కులతో చేర్చుకొంటానని లింకన్ ప్రతిపాదించినాడు. ఇట్లాచేసే అధికారము అధ్యక్షునికి లేదని కాంగ్రెస్ లింకన్ ప్రణాళికను తోసిపుచ్చింది. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఇట్లా సులభంగా సమాఖ్యలో చేరితే ఆ రాష్ట్రాలవారు ఉత్తరాది డెమొక్రాట్లతో కలిసి రిపబ్లికన్‌లకున్న మెజారిటీ పోగడతారని వారి భయము. అందువల్ల దక్షిణాది రాష్ట్రాలను దూరంగా ఉంచి, పునర్నిర్మాణ కార్యకలాపాలను కాంగ్రెస్ నడిపించవలెనని వారి కోరిక.

అమెరికా అధ్యక్షునికీ శాసన సభకూ ఎవరు అధికులనే ప్రశ్న ఆరంభమయింది. కాని అంతర్యుద్ధం ముగియక ముందే సమాఖ్య సైన్యాలు ఆక్రమించుకున్న వర్జీనియా, టెన్నిసీ, ఆర్కన్సాస్, లూ సియానా రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పరచి లింకన్ వాటికి సమాఖ్య పరిగణన ఇచ్చాడు. పైగా దక్షిణాదిపై పగసాధించే ఉద్దేశంతో 1864లో కాంగ్రెస్ అంగీకరించిన కఠోర శాసనాన్ని లింకన్ ఆమోద ముద్రవేయకుండా తిప్పి పంపాడు. లింకన్ తన స్నేహ భావాన్ని మరింతగా విశదపరచడానికి 1864లో జరిగిన ఎన్నికలలో తనతోబాటు ఉపాధ్యక్ష పదవికి దక్షిణాది రాష్ట్రమైన టెన్నిసీ పూర్వ గవర్నరూ, సెనేట్ సభ్యుడూ అయిన ఆండ్రూజాన్సన్‌ను అభ్యర్థిగా నిలిపి తనతోబాటు అతనిని కూడా విజయుని చేసాడు. అకాల మరణంవల్ల లింకన్ తనపునర్నిర్మాణ ప్రణాళికను అమలు చేయలేకపోయాడు. ఈ కార్య బారము అతని తరువాత అధ్యక్షుడైన ఆండ్రూ జాన్సన్‌పై బడింది.

## 10.5 జాన్సన్ ప్రణాళిక :

డిసెంబర్ 1865 వ సంవత్సరం, వరకూ అమెరికా కాంగ్రెస్ సమావేశం కాకపోవడంవల్ల అంత దాకా పునర్నిర్మాణ కార్యక్రమంతా కార్యనిర్వాహకశాఖపైబడింది. ఈ శాఖాధ్యక్షుడుగా జాన్సన్ కొద్ది మార్పులతో లింకన్ పథకాన్ని అమలు పరిచాడు. అధ్యక్షుని ప్రత్యేక ప్రకటన (Proclamation) ద్వారా ప్రతి దక్షిణాది రాష్ట్రానికి ఒక గవర్నర్‌ను నియమించాడు. క్షమా ప్రదానం చేసి అనేకమంది మాజీ కాన్ఫెడరేట్ ప్రభుత్వ సభ్యులకు తిరిగి రాజకీయ హక్కులు కలిగించాడు. దక్షిణ రాష్ట్రాలలో సమ్మేళనాలు (Convention) ఏర్పాటుచేసి పురాతనమైన వేర్పాటు చట్టాలను రద్దు చేయించడం, కాన్ఫడరేట్ యుద్ధ ఋణాలను రద్దు చేయించడమేకాక కొత్త రాజ్యాంగాలను కూడా తయారు చేయించారు. కొద్ది కాలంలోనే ప్రతి రాష్ట్రంలోనివారూ తమ తమ గవర్నర్‌లను, రాష్ట్ర శాసన సభలను ఎన్నుకొన్నారు. ఫిబ్రవరి, 1865లో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో బానిసత్వాన్ని పూర్తిగా నిషేధిస్తూ ప్రతిపాదించిన రాజ్యాంగంలోని పదమూడో సవరణను కొత్తగా ఏర్పడిన అనేక దక్షిణ రాష్ట్రాల నూతన శాసనసభలు ధ్రువపరిచాయి. తరువాత ఈ ప్రభుత్వాలకు జాన్సన్ సమాఖ్య పరిగణన ఇచ్చాడు. డిసెంబర్ 1865లో కాంగ్రెస్ సమావేశాలకు దక్షిణాది నుంచి నూతన ప్రతి నిధులు వచ్చినప్పుడు కాంగ్రెస్ తనకున్న అధికారం పురస్కరించుకొని వారిని సభ్యులుగా స్వీకరించలేదు. ఈ విధంగా కాంగ్రెస్‌కూ జాన్సన్‌కూ మధ్య తీవ్ర విభేదాలు కలగడానికి అనేక కారణాలున్నాయి.

లింకన్ హత్యా కారణంగా తలవనితలంపుగా అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడుగా దక్షిణాదివాడైన ఆండ్రూ జాన్సన్ ఉన్నత స్థానాన్ని ఆక్రమించడం తీవ్ర పరిణామాలకు దారి తీసింది. అధ్యక్షులందరిలోకి అతి సాధారణ ప్రజలలో నుంచి వచ్చిన వారిలో ఇతడే అగ్రగణ్యుడు. ఉత్తర కెరోలినాలో నిరుపేద కుటుంబంలో పుట్టిన జాన్సన్ కొద్ది కాలంలోనే తల్లి దండ్రులను కోల్పోయి అనాధ అయ్యాడు. పదేళ్ళ వయసులో దర్జీ పని నేర్చుకొని అంతటిలో తృప్తిపడి ఊరుకోకుండా కష్టపడి స్వయంగా చదువుకోవడం నేర్చుకొన్నాడు. తరువాత భార్య ద్వారా వ్రాయడం, లెక్కలు చేయడం నేర్చుకొన్నాడు.

పదిహేడేళ్ళ ప్రాయంలో ఇతడు టెన్నెసీకి తరలిపొయ్యాడు. అక్కడ రాజకీయాలలో ప్రమేయం కల్పించుకొని భూస్వాములచేత అణిగిపోయున్న వారి హక్కులను కాపాడే నాయకుడుగా పేరుపొందాడు. కాంగ్రెస్‌కు ఎన్నికయిన జాన్సన్, తన రాష్ట్రము సమాఖ్యనుంచి విడిపోయినప్పుడు తాను కేంద్ర ప్రభుత్వానికి విధేయుడై నిలిచాడు. టెన్నెసీ రాష్ట్రము సమాఖ్య సైన్యాల చేత విముక్తి అయిన తరువాత

అక్కడ మిలిటరీ గవర్నర్‌గా జాన్సన్ నియమితుడై చాకచక్యంతో తన పదవి నిర్వహించాడు. ఆ తరువాత 1864లో ఉపాధ్యక్షుడుగా ఎన్నిక కావడం, లింకన్ మరణానంతరం అధ్యక్షుడుకావడం జరిగింది. ఇతనిలో ఋజువర్తన, కార్యదీక్షా పరత్వము మొదలైన సద్గుణాలున్నప్పటికీ, నాయకుని కవసరమైన సామర్థ్యం లేకపోవడం వల్లనూ, దుడుకు తనమూ, కలహ ప్రియత్వమూ ఉండడం వల్లనూ, జనరంజకుడు కాలేక పోయాడు. అంతేగాక కాంగ్రెస్‌లో తన పార్టీ వారైన రిపబ్లికన్ సభ్యులు కూడా ఇతనికి వ్యతిరేకులయినారు. వారిలో తీవ్రవాదులు (Radicals) స్టీవెన్స్ (Stevens) అనే అతని నాయకత్వంలో జాన్సన్ ప్రతి చర్యనూ విమర్శించసాగారు. జాన్సన్ హయాంలో తీవ్ర విమర్శలకు గురికాని సంఘటనలు రెండే రెండు. మొదటిది రష్యా చక్రవర్తి జార్ నుంచి డెబ్భై ఐదు లక్షల డాలర్లకు అలస్కాను కొనడం, రెండోది మన్రో సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి మెక్సికోలో ఫ్రెంచివారి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని తుదముట్టించడం.

పునర్నిర్మాణ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రమేయం లేకుండా చేయడంవల్ల దానిలో సభ్యులకు జాన్సన్ పట్ల వ్యతిరేకత తీవ్రమయింది. అంతేకాక జాన్సన్ ప్రణాళిక ద్వారా సమాఖ్యలో తిరిగిచేరుకొన్న దక్షిణాది రాష్ట్రాలనుంచి ఎన్నికయిన వారిలో చాలా మంది పూర్వపు తిరుగుబాటు కాన్ఫెడరేట్ ప్రభుత్వంలోని ఉన్నత ఉద్యోగులు, వీరిలో కాన్ఫెడరేట్ ఉపాధ్యక్షుడు, నలుగురు జనరల్స్, ఐదుగురు కల్నల్స్, ఆరుగురు మంత్రి వర్గ సభ్యులు, ఏభై ఎనిమిది మంది కాన్ఫెడరేట్ కాంగ్రెస్ సభ్యులున్నారు. అంతర్యుద్ధానికి ముందు దక్షిణాది వారికి కాంగ్రెస్‌లో ఉన్న సంఖ్య కంటె యుద్ధానంతరం వారి బలము అధికమయింది. వీరందరూ కాంగ్రెస్ సభ్యులుగా అనుమతిపొందితే, ఉత్తరాది సభ్యులలో ఉన్న అసంతృప్తి వర్గాలతో చేతులు కలిపి, తమ సంఖ్యాబలాన్ని పెంచుకొనే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితులలో సమాఖ్య శాసనాలన్నీ వారి ఇష్ట ప్రకారమే ఆమోదం పొందితే అంతర్యుద్ధంలో గెలిచింది. ఉత్తరాది వారైనా యుద్ధానాంతరం లాభమంతా దక్షిణాది వారికే దక్కేటట్లుంది. అంతేగాక జాన్సన్ ప్రణాళికను అనుసరించి ఏర్పడిన నూతన దక్షిణాది ప్రభుత్వాలు కొన్ని వారికి అనువైన చట్టాలను చేసాయి. వీటివల్ల నీగ్రోలకు పౌరసత్వ హక్కులు లభించక పోవడం, కొన్ని రకాల ఆస్తులు, ఉద్యోగాలు వారు పొందడానికి అనర్హులు కావడం తటస్థించింది. నిరుద్యోగులైన నీగ్రోలను రాష్ట్ర ప్రభుత్వాలు దేశ దిమ్మరులుగా జమకట్టి ఖైదుచేసి మళ్ళీ ఏదో రూపంగా దాస్యంలో పడవేసే ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఒకే రకమైన తప్పుచేసిన తెల్లవారికంటే నల్లవారికి కఠిన శిక్షలు విధించాయి. కొన్నిరాష్ట్రాలలో అవిధేయులైన బానిసలకు శారీరక దండన విధించే అధికారము భూస్వామీలకిచ్చి నా మరికొన్ని చోట్ల నీగ్రోలు వ్యవసాయము, ఇంటి చాకిరీలు తప్ప వేరే ఏ పనీ ముట్టుకోకూడదని శాసించడం జరిగింది. ఈ చట్టాల తీరు తెన్నులు చూసిన ఉత్తరాది రాష్ట్రాల తీవ్రవాదులు అంతర్యుద్ధం చేసింది దీని కోసమేనా అని వాపోవసాగారు. దక్షిణాది రాష్ట్రాలనుంచి ఎన్నికైన సభ్యులకు లోగడ చెప్పినట్లు కాంగ్రెస్‌లో స్థానం లేకుండా చేసారు. నీగ్రోల విషయమై తగిన సహాయ చర్యలు తీసుకోవడానికి కాంగ్రెస్‌సభ్యుల అభిమతాను సారంగా పునర్నిర్మాణం కొనసాగించడానికి అనువుగా ఒక సమిష్టి సంఘాన్ని ఏర్పరచారు. థడ్డర్ స్టీవెన్స్ ఈ సంఘానికి అధ్యక్షుడు, దీనిలో కాంగ్రెస్‌కు చెందిన పదిహేనుమంది సభ్యులున్నారు. వీరు సూచించిన పద్ధతినే అతివాద పునర్నిర్మాణ కార్యక్రమము (Radical Reconstruction Programme) అన్నారు.

## 10.6 రాజ్యాంగం పధ్నాలుగో సవరణ :

నీగ్రోలకు పరిపూర్ణ పౌర హక్కులు ప్రసాదించాలని వాదించే కాంగ్రెస్ సభ్యులకు క్రమంగా ప్రజల సహకారం పెరిగింది. ఇంతలో గుట్టుగా వున్న జాన్సన్ అతివాదుల రభస వీధిన పడింది. నీగ్రోల సహాయం కోసం తాత్కాలికంగా ఏర్పరచిన "ఫ్రీడ్ మెన్స్ బ్యూరో" అనే సంస్థను పటిష్టంగా చేసి దాని కార్యకలాపాలను విస్తరించడానికి అతివాదులు ఒక చట్టాన్ని చేసారు. కాని జాన్సన్ దానిని తన వీటోతో తోసిపుచ్చాడు. తరువాత కాంగ్రెస్ ఆమోదించిన పౌర హక్కుల చట్టానికి (Civil Rights Bill) కూడా ఇదే గతి పట్టింది. అందువల్ల, జూన్ 1866లో కాంగ్రెస్ రాజ్యాంగానికి పధ్నాలుగో సవరణను ప్రవేశపెట్టి భావిలో కూడా నీగ్రోల హక్కులు కాపాడడానికి గట్టి ప్రయత్నం చేసింది. నీగ్రోలకు పౌరసత్వ హక్కులే కాక తదితర అమెరికన్ పౌరులతో సమానంగా అన్ని హక్కులు, రక్షణలు ఈ సవరణ ప్రసాదించింది. "ఏ వ్యక్తి ప్రాణాలను గాని, స్వేచ్ఛనుగాని, ఆస్తిని గాని, చట్టరీత్యా విచారించకుండా స్వాధీనం చేసికొనకూడదని" కూడా ఈ సవరణ నిర్దేశించింది. దీనిలో నీగ్రోలకు ఎన్నిక హక్కు ఇవ్వవలెనని నిష్కర్షగా చెప్పినప్పటికీ పౌరులకు ఓటు హక్కు తగ్గిన దామాషా ప్రకారం ఆయా రాష్ట్రాల ప్రజాప్రతినిధుల సంఖ్యను కూడా తగ్గించవలసి ఉంటుందని కట్టడి చేసింది, కాని తిరుగుబాటులో పాల్గొన్న దాక్షిణాత్య సమాఖ్య ముఖ్య నాయకులకున్న ఓటింగ్ హక్కును ఈ సవరణ రద్దు పరచింది. దీనివల్ల టెన్నెసీ మినహా మిగిలిన దక్షిణ రాష్ట్రాల వారు జాన్సన్ సలహాను

పాటించి పద్నాలుగో సవరణను నిరాకరించారు. బలవంతంగా ఈ సవరణను వారిచేత ఆమోదింపజేయడానికి గాను కాంగ్రెస్ కొన్ని చట్టాలను అమలు జరిపింది. ఆనాటి నుంచి కొద్దికాలం కాంగ్రెస్‌దే పై చేయి అయింది.

## 10.7 అతివాదుల పునర్నిర్మాణ పథకం :

కాంగ్రెస్‌లో అతివాదుల నాయకుడైన థడ్డస్ స్టీవెన్స్ (Thaddeus Stevens) డెబ్బై నాలుగు సంవత్సరాల వృద్ధుడు. ఎత్తు పెదవులు, బట్టతల మీద నల్లవిగ్గు, కుంటికాలు మొదలయిన అవ లక్షణాలతో వికృతంగా ఉండేవాడు. కాని ఇతడు నీగ్రోల మీద అవ్యాజ ప్రేమచూపి అనేక మందికి డబ్బు తీసుకోకుండా న్యాయవాదిగా పనిచేసాడు. మరణానంతరం తన శవాన్ని నీగ్రోల స్మశానంలోనే ఖననం చేయవలెనని నిర్దేశించాడు. సునిశిత మేధాసంపన్నుడైన ఇతడు తన ఎత్తిపొడుపు మాటలతో విపక్షం వారికి నోటమాటరాకుండా చేసి అసమానుడైన పార్లమెంటేరియన్‌గా పేరు పొందాడు. 1866లో కాంగ్రెస్‌కు ఎన్నికలు జరిగినప్పుడు జాన్సన్ ఒక వంకా అతి వాదులు మరొకవంకా తమకే గెలుపు దక్కవలెనని తీవ్ర ప్రయత్నాలు చేసారు. చివరకు విజయలక్ష్మి అతివాదులనే వరించింది. వారికి కాంగ్రెస్‌లో మూడింట రెండు వంతులకుపైగా మెజారిటీ లభించింది. అయినా దక్షిణాది రాష్ట్రాల వారు రాజ్యాంగం పద్నాలుగో సవరణను అంగీకరించడానికి ఉద్యుక్తులు కాకపోవడంతో కాంగ్రెస్ బలవంతంగా తన కార్య సాధనకు ఉద్యమించింది. కాంగ్రెస్ పునర్నిర్మాణ చట్టం చేసినా అధ్యక్షుడు దానిని వీటో చేయడంతో అతనిని అభిశంసించడానికి కూడా కాంగ్రెస్ వెనుకాడలేదు. అభిశంసన తీర్మానము ఒక్క ఓటు తేడాతో వీగి పోయింది. ఆనాటి నుంచి కాంగ్రెస్ మరింత పట్టుదలతో తన పునర్నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించింది.

## 10.8. సైనిక పునర్నిర్మాణ చట్టము :

మార్చి 2వ తారీఖు, 1867 సంవత్సరంలో సైనిక పునర్నిర్మాణ చట్టాన్ని (Military Reconstruction Act) మరిమూడు చట్టాలను కాంగ్రెస్ ఆమోదించింది. జాన్సన్ పథకాన్ని, తద్వారా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలను తుడిచివేసింది. దానికి ప్రత్యామ్నాయంగా పద్నాలుగో సవరణను ఆమోదించిన టెన్నెసీ రాష్ట్రాన్ని వదలి మిగిలిన దక్షిణాదిని మొత్తం అయిదు విభాగాలు చేసి వాటిని పరిపాలించడానికి ఒక్కొక్క కేంద్ర మిలిటరీ జనరల్‌ను గవర్నర్‌గా నియమించింది. ప్రతి విభాగంలోను కేంద్ర సైన్యాలను శాంతి పరిరక్షణకు పంపడమయింది. గవర్నర్‌లు ప్రతి రాష్ట్రంలోను ఎన్నికలు జరిపించి నూతన ప్రతినిధుల సమ్మేళనాల ద్వారా కొత్త రాజ్యాంగాలను ఆయా రాష్ట్రాలకు తయారు చేయ సమకట్టారు. ఈ ఎన్నికలలో నీగ్రోలతో సహావయోజనులైన వారందరికి ఓటు హక్కు కల్పించారు. కాని లోగడ కాన్ఫెడరసీని బలపరచిన వారందరి ఓటు హక్కును రద్దు పరిచారు. ఈ విధంగా తయారయ్యే రాజ్యాంగాలు నీగ్రోలకు ఓటు హక్కును శాశ్వతంగా కలిగించడమే గాక కేంద్ర రాజ్యాంగ పద్నాలుగో సవరణను ఆమోదించవలసి వుంది. ఈ షరతులను పూర్తి చేసిన రాష్ట్రాలను మాత్రమే సమాఖ్యలో తిరిగి చేర్చుకోవడమవుతుందని చెప్పింది. కాంగ్రెస్ చేసిన ఈ ప్రతిపాదనలననుసరించి మిలటరీ గవర్నర్‌లు ఎన్నికలు జరిపించారు. నూతన సభ్యుల సమ్మేళనాలు కేంద్ర ఆదేశాల మేరకు వర్తించాయి. జూలై 1867 నాటికి ఏడు రాష్ట్రాలు మళ్ళీ సమాఖ్యలో చేరడమేగాక పద్నాలుగో సవరణకు చట్టపు హోదా వచ్చింది. వర్జీనియా, మిసిసిపి, టెక్సాస్ రాష్ట్రాలలో ఈ కలాపమంతా 1870 సంవత్సరం నాటికి పరిసమాప్తమయింది. అతివాదులు ఇట్లా మిలటరీ ప్రభుత్వమేర్పాటు చేయడం ఒక విధంగా రాజ్యాంగ విరుద్ధ చర్యే అయినా వీరు అధ్యక్షుని ఆటకట్టించినట్లే సుప్రీంకోర్టు హెచ్చరికలను ఖాతర్ చేయలేదు.

## 10.9 పునర్నిర్మాణ ప్రభుత్వాల తీరుతెన్నులు :

కాంగ్రెస్ పునర్నిర్మాణ కార్యక్రమం ద్వారా ఏర్పడిన ప్రభుత్వాలు నీగ్రో ఓట్ల వల్ల ఎన్నికయినవే అయినా వాటి నాయకత్వము దాదాపు సర్వత్రా తెల్లవారిచేతులలోనే ఉండిపోయింది. వీరిలో ముఖ్యులంతా కేంద్ర సైన్యంలో పని చేయడానికి వచ్చిన ఉత్తరాదివారే. ఇందులో కొందరు యోగ్యులైనా అందినమటుకు కాజేద్దామనుకొనే స్వార్థపరులు కూడా లేకపోలేదు. దక్షిణాది ప్రజలు ఈ స్వార్థ పరులను 'అవకాశవాదులు (Carpet baggers) అని హేళన చేసేవారు. వీరు దక్షిణాదికి వచ్చేటప్పుడు తమ సర్వస్వాన్ని ఒక చిన్న సంచిలో తేవడమే దీనికి కారణము. దక్షిణాదిలోనే ఉన్న అవకాశ వాదులను 'స్కాలవాగ్స్' (Scalavags) అనేవారు పునర్నిర్మాణంలో వీరి పాత్రను గురించి చరిత్రకారులు విభిన్న దృక్పధాలను వెలిబుచ్చారు. కొందరి అభిప్రాయం ప్రకారం మొదట దక్షిణాదిలో కూడా సైనికుల స్వైర విహారం జరిగింది. మిలటరీ ప్రభుత్వానంతరం స్వార్థపరులైన అవకాశ వాదులూ స్కాలవాగ్స్ కలిసి దక్షిణాది ప్రభుత్వాలలోకి నిరక్షరాస్యులైన నీగ్రోలను

రప్పించి వారి చాటున అవినీతిని, లంచగొండి తనాన్ని విశృంఖలంగా (Carnival of Corruption) కొనసాగించారు. మరొక కథనం ప్రకారం మిలటరీ పరిపాలన దక్షిణాదిన చాలా పరిమిత కాలం వరకే కొనసాగింది. అదే విధంగా అవకాశ వాదులలో దోపిడీ దారులు ఉన్నా వారిలో ఎక్కువ మంది ఆదర్శవాదులు, నిస్వార్థంగా ఉద్యోగాలు చేసిన వీరు నీతిమంతులుగా కూడా పేరు పొందారు. ఉత్తరాది నుంచి వచ్చిన చాలా మంది స్త్రీలు పాఠశాలలు పెట్టి విద్యా వ్యాప్తికి కృషి చేసారు. అట్లాగే కొందరు ఉత్తరాది యువకులు పరిశ్రమాభివృద్ధిగావించారు. స్కాల వాగ్స్' అని పేరు పొందిన దక్షిణాది తెల్లవారిలో కూడా ఇటువంటి సంస్కరణాభిలాష ఉన్నవారు లేకపోలేదు. యుద్ధానంతరం ఏర్పడిన ప్రభుత్వాలలో లంచగొండి తనము ఉన్నమాట వాస్తవమేకాని అది ఒక్క దక్షిణాదికే పరిమితం కాక ఉత్తరాదిన కూడా కొనసాగింది. ఇక నీగ్రోల రాజ్యం వచ్చిందని చెప్పడంలో సత్యం లేదు. ఒక దక్షిణ కెరోలినా రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వం మినహా తక్కిన అన్ని దక్షిణాది ప్రభుత్వాలలోనూ నీగ్రోలు అల్పసంఖ్యాకులే. అమాయకులైన నీగ్రోలు ప్రభుత్వంలో అత్యాచారాలు చేసినారనుకోవడం సబబుకాదు.

## 10.10 స్వతంత్ర నీగ్రోల ప్రవర్తన :

నిజానికి నీగ్రోలకు అనుకోకుండా స్వాతంత్ర్యంతో బాటు ఓటు హక్కురావడం అనేక విచిత్ర సంఘటనలకు దారితీసింది. ఆశ్చర్యంలో మునిగిన నీగ్రోలు పౌరులుగాను, ఓటర్లు గాను తమ కర్తవ్యాలేమిటో అర్థం చేసుకొనే స్థితిలో కూడా లేరు. ఈ నూతన బాధ్యతలను అందుకునే స్థితిలో నీగ్రోలు లేరు. వీరిలో చాలా మంది విద్యలేనివారే చాలా మంది నీగ్రోలకు ఓటర్ల లిస్ట్‌లో నమోదు చేసుకొనే నాటికి తమ వయస్సెంతో తెలియదు. పదహారేళ్ళ బాలురు కూడా తెలియక ఓటర్ల జాబితాలో చేరిపోయారు. కొందరు తమ పూర్తిపేరు కూడా తెలియక ఓటర్ల జాబితాలో చేరలేకపోయారు. కాని కొందరు మాత్రం వారి పేరును, బాబ్, క్రిస్టమస్, సిపియో, నెబుజనీర్ అని ఏదితోస్తే ఆ పేరు చెప్పేవారు. ఇంకా తెలివైన వాళ్ళమనుకొనే నీగ్రోలు తమ పేరు జార్జి వాషింగ్టన్ అనో, అబ్రహాం లింకన్ అనో చెప్పిన ఘట్టాలు కోకొల్లలు. ఒక దక్షిణ కెరోలినాలోని చార్లెస్టన్ నగరం ఓటర్ల లిస్టులోనే నలభై ఆరుగురు వాషింగ్టన్‌లు, అరవై ముగ్గురు అబ్రహాం లింకన్‌లూ ప్రత్యక్షమైనారు. మరీ విచిత్రమేమిటంటే ఓటర్ల లిస్ట్‌లో తమ పేరు నమోదు చేయించుకోవడానికి రమ్మంటే అదేదో కొత్త తినుబండారమో, తాగే పదార్థమో అనుకొని కొందరు నీగ్రోలు బుట్టలూ పెట్టెలూ నమోదు చేసే కార్యాలయానికి పట్టుకొని వచ్చారు. మరి కొందరు ఓట్లు వేసేటప్పుడు జాగ్రత్తగా గుర్తు పెట్టి వాటిని భద్రంగా తీసుకొని **వెళ్ళి పోస్టు** డబ్బాలలో వేసారు. కొత్తగా ఓటరులైన నీగ్రోల తిప్పలిట్లా ఉంటే దక్షిణ రాష్ట్రాలలోని అనేక మంది తెల్లవారికి ఓటు హక్కు **లేకుండాపోయింది**. దక్షిణ కెరోలినాలో మాజీ గవర్నర్‌లూ, కాంగ్రెస్ సభ్యులూ, న్యాయాధికారులూ హాజరయిన ఒక పెద్ద విందులో ఒక్క తెల్లవానికీ ఓటు హక్కులేకపోగా వారికి వడ్డించే నీగ్రో వంటవానికొక్కనికే ఆ ఓటు హక్కు లభ్యమైంది. ఇట్లా సగానికిపైగా తెల్లవారు ఓటింగ్ హక్కులు కోల్పోగా, అయిదు దక్షిణాది రాష్ట్రాలలో నీగ్రోలదే పై చేయి అయింది.

## 10.11 పునర్నిర్మాణ ఫలితాలు :

ఇన్ని లోపాలున్నా పునర్నిర్మాణ ప్రభుత్వాలు ఎన్నో సత్ఫలితాలు సాధించాయి. ఇవి తయారు చేసిన రాజ్యాంగాలు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయి. ప్రభుత్వంలో ప్రజాస్వామ్య లక్షణాలను ప్రవేశపెట్టడమేగాక, తెల్ల, నల్ల జాతుల మధ్య ఆస్తి, ఓటు, ఉద్యోగాది విషయాలలో వ్యత్యాసాలను అవి రద్దు చేసాయి. న్యాయాధిపతులను కూడా ఎన్నుకొనే ఏర్పాటును ప్రవేశపెట్టాయి. అప్పులు తీర్చలేక పోతే ఇళ్ళను జప్తుచేయడం, అప్పు తీర్చని వారిని ఖైదు చేయడం మొదలైన పద్ధతులు రద్దు అయి ప్రజల శ్రేయోభివృద్ధికోసం పాఠశాలలు, అనాధ శరణాలయాలు స్థాపితమైయ్యాయి.

ప్రభుత్వ ప్రమేయం లేకుండా నీగ్రోలనందరిని సంఘటితం చేసే పనిని కూడా ఉత్తరాది తెల్లవారు చేపట్టారు. రిపబ్లికన్ పార్టీ 'యూనియన్ ఆఫ్ అమెరికా' అనే సంస్థ ద్వారా తమ పార్టీ స్వార్థం కోసం నీగ్రోల చేత ప్రమాణాలు చేయించడం రహస్య సందేశాలివ్వడం వారిని సైనిక దళాలుగా తయారు చేయడం కొనసాగించింది. నీగ్రోలకు తెల్లవారిపై పగపెంచడమే కాక వారికి ఆయుధాలు కూడా సరఫరా చేయసాగింది. ప్రభుత్వ పదవులు కోల్పోవడమేగాక పౌర హక్కులు కూడా కరువైన దక్షిణాది తెల్లవారు ఈ నూతన పరిణామాల వల్ల నీగ్రోలను అణచివేయడానికి ఆటవిక పద్ధతులను చేపట్టారు, దానికి నాందిగా తెల్లవారు మొదట చిన్న చిన్న రక్షక సంస్థలుగా ఏర్పడ్డారు. క్రమంగా ఇవే పెరిగివిరాట్ రూపం దాల్చాయి. ఈ సంస్థలలో కొన్ని నీగ్రోలపై దమననీతి సాగించినాయి. అట్టి వాటిలో కుక్లక్స్ క్లాన్ (Kuklux Klan) అనేది ముందంజవేసిన రహస్య సంస్థ.

## 10.12 కుక్లక్స్ క్లాన్ :

టెన్నెసీ రాష్ట్రంలోని పులాస్కీ అనే పట్టణంలో 1866లో మొట్టమొదట ఈ క్లాన్ స్థాపితమైంది. కొందరు యువకులు ముసుగులు వేసుకొని గుర్రాలపై స్వారీ చేస్తూ అంతర్యుద్ధంలో చనిపోయిన తెల్లవారి దయ్యాలమని మూఢ విశ్వాస జీవులైన నీగ్రోలను తమాషాగా బెదిరించేవారు. మాజీ కాన్ఫెడరేట్ సైన్యాధ్యక్షుడైన నథాన్ బెడ్ ఫర్డ్ ఫారెస్ట్ దీని ముఖ్య నాయకుడు. ఈ నాయకుడు మహామాంత్రికుడన (Grandwizard)టం వాడుక, అనతి కాలంలోనే నీగ్రోలను ప్రత్యర్థులుగా భావించే చాలా మంది దక్షిణాది గ్రామీణ తెల్లవారిని ఆకర్షించి బృహత్ సంస్థ అయి వివిధ ప్రదేశాలలో వివిధ నామాలతో పాకిపోయింది. దీని సభ్యులు తమ విరోధులను బెదిరించీ కొరడాలతో కొట్టి అంతకూ లొంగకపోతే చంపేవారు. కాని పరాక్రమము, మానవత్వము, దయ, దేశభక్తి మొదలైన ఉదాత్తధ్యేయాలు ఈ సంస్థకు మూలాధారమని పైకి చాటేవారు. తెల్ల జాతుల వారిని రక్షించడమూ తెల్లజాతి స్త్రీలపై జరిగిన అత్యాచారాలకు పగ తీర్చుకోవడమూ తమ పరమ లక్ష్యమని కూడా వీరు చెప్పేవారు. కాని వెలివేయడం, దేశబహిష్కరణ వంటి పనుల ద్వారా సమాజంలో భయోత్పాతము కల్పించి కాంగ్రెస్ సాగిస్తున్న పునర్నిర్మాణ కార్యక్రమాన్ని తుదముట్టించడమే వీరి పరమావధి అయింది. దాని కనువుగా నీగ్రోలపై ఘోర దురంతాలు జరపడమేకాక, ఫ్రీడ్ మాన్స్ బ్యూరో ఉద్యోగులను, యూనియన్ లీగ్ కార్యకర్తలను నీగ్రో విద్యాలయాలలో పని చేసే అధ్యాపకులను కూడ వదిలేవారు కాదు. ఇట్లాంటి దురంతాలవల్ల చాలా మంది నీగ్రోలూ అవకాశ వాదులూ బెదిరి ఎన్నికలప్పుడు పోలింగ్ ఛాయలకు పోవడానికే జంకేవారు. అప్పటికీ మొండికేసి ఓటు చేయపూనిన వారిని "క్లాన్" కొట్టడమో చేతులు కాళ్ళు విరవడమో చంపడమో జరిగింది. 1768లో ఒక్కలూసియానా సివార్లలోనే రెండు రోజులలో తెల్లవారు రెండువందల మంది నీగ్రోలను చంపారు. ఆ దరిదాపు అడవులలో ఇరవై ఒక్క శవాలను పాతిపెట్టిన గుట్టు బయట పడింది. దక్షిణాన మరీ వెనకబడిన ప్రాంతాలలో ఈ ఉద్యమం వల్ల పైశాచిక తాండవం జరిగి నీగ్రోలను పూర్తిగా వెనకకు నెట్టివేయడం జరిగింది.

## 10.13 రాజ్యాంగ పదిహేనో సవరణ :

పరిస్థితి మరీ విషమించేలోగా రాష్ట్ర ప్రభుత్వాలు ఇట్లాంటి ప్రచ్ఛన్న సంస్థలకు వ్యతిరేకంగా చట్టాలుచేసాయి. కాంగ్రెస్ కూడా 1870లో రాజ్యాంగానికి పదిహేనవ సవరణను ఆమోదించింది. దీని ప్రకారం "జాతి వల్లగాని, రంగువల్లగాని, ఒకప్పుడు దాస్య వృత్తి చేపట్టినందువల్లగాని పౌరుల ఓటు హక్కును ఎవరూ భంగపరచరాదు." అని శాసించింది. ఈ నూతన అధికారాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ కఠిన నిబంధనలను విధిస్తూ కొన్ని శాసనాలు చేసింది. దక్షిణ రాష్ట్రాల ఎన్నికల సమయంలో సైన్య సహాయాన్ని అందించడానికి రహస్య సంస్థలను విచ్ఛిన్న పరచడానికి, సైనిక శాసనము (Martial Law) అమలు జరపడానికి కేంద్ర ప్రభుత్వము అధికారం పొందింది.

చట్టాన్ని చేసినా పై పై ఉపశమనానికి పనికి వచ్చినవేకాని అవి జాతి విభేదాలను పెకలించి వేయలేకపోయాయి. జాతి విభేదాలు వల్ల కేవలం నీగ్రోల ఓటు హక్కు నశించడమే కాక అనేక విధాలవారు బాధలకు గురైనారు. ముఖ్యంగా న్యాయ స్థానాలలో వీరికి జరిగిన అన్యాయాలకు అంతులేదు. జూరీ (Jury)లను నిర్ణయించేటప్పుడు నీ గ్రోలను లెక్కలోకి తీసుకొనేవారే కాదు. తెల్లవారు తప్పుచేసి కూడా శిక్షనుంచి తప్పించుకొనేవారు. న్యాయ విచారణ లేకుండానే నీగ్రోలకు మరణ శిక్ష విధించడం చాలా కాలం కొనసాగింది. దీనికి తోడు రిపబ్లికన్ల అధికారము అంతరించి డెమొక్రాట్లు ఆధిపత్యానికి రావడంతో కఠినమైన వేర్పాటు శాసనాలు (Stringent Segregation Laws) అన్ని దక్షిణాది రాష్ట్రాలలోనూ అమలు పరచసాచారు. తెల్లవారికీ, నల్లవారికీ మధ్య వివాహాలు నిషిద్ధాలు. విద్యాలయాలలోనూ, రైళ్ళు, హోటళ్ళు, సినిమాలు మొదలైన వాటిలోనూ నీగ్రోలకు ప్రత్యేక స్థానాలు కేటాయించేవారు.

## 10.14 బుకర్ వాషింగ్టన్ :

నీగ్రోల స్థితిని మెరుగుపరచడానికి కొన్ని మత సంస్థలు, కొందరు వదాన్యులు ముందుకు వచ్చి ధన వితరణచేసి ప్రత్యేక విద్యా వైద్యాది వసతులు కల్పించారు. కొంత కాలానికి నీగ్రోలలోనే కొందరు సంస్కర్తలు బయలుదేరారు. అటువంటి వారిలో బుకర్ వాషింగ్టన్ ఒకడు. 1856లో వర్జీనియాలో నీగ్రోబానిస వనితకు ఒక తెల్లజాతి తండ్రికీ పుట్టాడు. బాల్యంలోనే ఉప్పు కార్ఖానాలోనూ, బొగ్గు గనిలోనూ

పనిచేస్తూ విద్యనభ్యసించి 1875లో పట్ట భద్రుడైనాడు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బుకర్‌ను అలబామా ప్రభుత్వము నీగ్రోల అభివృద్ధికి స్థాపించిన "టస్కజీ" (Tuskagee) అనే సాధారణ వృత్తి విద్యాలయంలో అధికారిగా నియమించింది. శ్రమించి కృషి చేసిన నీగ్రోల విద్యా వ్యాప్తికి పాటుపడే నాయకుడుగా అక్కడ బుకర్ మన్నన పొందాడు. జాతి విద్వేషాలను రూపు మాపడానికి తన శక్తినంతా ధారపోసి తెల్లవారికీ, నల్లవారికీ ప్రేమ పాత్రుడైనాడు. నీగ్రోలు రాజకీయ, వ్యావహారికాధికారాలు కోరడం కంటే పారిశ్రామిక శిక్షణను పొంది క్రమ క్రమంగా సమాజంలో కలిసి పోవలెనని ఇతడు భావించాడు. తెల్లవారు అతిగా పగ సాధించబూనితే ఎవరు తీసిన గోతిలో వారే పడతారని హెచ్చరించాడు. సాంఘిక ఆచారాలలో విభిన్నంగా ఉన్నా పరస్పర అభ్యున్నతిని సాధించేటందుకు ఏకత్వాన్ని ఉపాసించవలెనని బుకర్ చెప్పిన మాటలు అమెరికన్‌లందరికి ఆమోద యోగ్యమయ్యాయి. నీగ్రో తీవ్రవాదులు ఇతని అభిప్రాయాలను వ్యతిరేకించినా ఇతడు అసమాన నీగ్రో నాయకుడుగా పేరు పొంది చాలా మంది అమెరికా అధ్యక్షులకు నీగ్రో సమస్యలపై ఆంతరంగిక సలహాలివ్వగలిగాడు. ఇతడేకాక డుబాయిస్ వంటి వ్యక్తులు కూడా 'నయాగార ఉద్యమము' (Nayagara Movement) వంటి కార్య క్రమాల ద్వారా నీగ్రో సమస్యలను పరిష్కరించబూనినారు. అయినా దక్షిణాదినా, ఉత్తరాదిన కూడా నీగ్రోలు నానా బాధలకూ గురికావడం సర్వసామాన్యమైంది. ఈ రెండు జాతుల మధ్య జరిగిన వాటిలో చాలా నికృష్టమైన దొమ్మీలు ఉత్తరాదిన సంభవించడం ఒక విశేషము.

## 10.15 ఆర్థిక పునర్నిర్మాణము :

విభిన్న జాతుల మధ్య సామరస్యము ఒడుదుడుకులతో నత్తనడకతో సాగినా యుద్ధానంతరం ఆర్థిక పునర్నిర్మాణ ప్రగతి ఇంత కంటె మెరుగుపడి దాదాపు ఒక సాంఘిక విప్లవాన్ని తీసుకొచ్చింది. యుద్ధ కాలంలో వ్యవసాయ క్షేత్రాల యజమానుల ఆర్థిక స్థితి చితికిపోయింది. యుద్ధానంతరం విశాల క్షేత్రాలు లోగడవలెనే భూస్వాములచేతులలో ఉన్నా తగినంత మదుపూ, కూలీలూ లేకుండా సాగుచేయడం అసాధ్యము. యుద్ధ కాలంలో అంతో ఇంతో సంపాదించిన ఆ సామీలు మాత్రం తమ క్షేత్రాలను తిరిగి సస్యశ్యామలంగా పండించసాగారు. అటువంటి వసతిలేనివారు భూమిని చిన్న రైతుకు కౌలుకిచ్చేవారు. అది వీలుపడని చోట్ల పంట కౌలు పద్ధతి (Crop sharing) ని అనుసరించేవారు. దీని ప్రకారం భూస్వామి కౌలుదారుకు భూమి, ఇల్లు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులు ఇచ్చి ఫల సాయంలో సగం తీసుకొనేవాడు. ఇందువల్ల పాత క్షేత్రాలు తిరిగి సాగులోకి వచ్చాయి. దీనితో బాటు డబ్బు అవసరమైన చిన్నా పెద్దా రైతులు తమ పంటలను వర్తకులకు కుదువబెట్టి వడ్డీలకు అప్పులు తెచ్చే (Crop-lien-system) పద్ధతి ఆచరణలోకి వచ్చింది. దీనిలో రైతు ఎక్కువ డబ్బు నష్టపోయి దారిద్ర్యంలో చిక్కుకొనే బాధ ఉన్నప్పటికీ అవసరాలకు అక్కర తీరుతున్నందువల్ల ఈ పద్ధతి శీఘ్రంగా వ్యాప్తి చెందింది. అయినా ఇందువల్ల వ్యవసాయ దారుల సమస్యలు పూర్తిగా సమసిపోలేదు. ఈ సమస్యలన్నింటినీ సరిదిద్దడానికి ముమ్ముందు పాప్యులిస్టు ఉద్యమమనే (Populist Movement) పెద్ద ప్రయత్నమవసరమైంది.

## 10.16. సమీక్ష :

నీగ్రో బానిసత్వ విముక్తి తరువాత దక్షిణాదిన కూడా పరిశ్రమలు వృద్ధిచెందాయి. ముడిసరుకులు, అనుకూల వాతావరణము ఉండడం వల్ల నూలు మిల్లులు అధికంగా స్థాపించడం మొదలైంది. దీనితోబాటే పొగాకు, సిగరెట్ల పరిశ్రమలు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు కూడా చిన్న ఎత్తున వృద్ధి పొందడం మొదలు పెట్టి భావి కాలంలో అమెరికాలో భారీ పరిశ్రమలు ఉద్భవించడానికి నాందీవాచకాలైనాయి.

**అభ్యాసాలు :**

1. లింకన్ పునర్నిర్మాణ పథకమును వివరించుము?

2. జాన్సన్ పునర్నిర్మాణ పథకమును వివరించుము?

3. అతివాదుల పునర్నిర్మాణ పథకమును వివరించుము.

ఉపకయుక్త గ్రంథాలు :

| | | | |
|---|---|---|---|
| 1) | Henry Bamford Parkes | : | The United States of America |
| 2) | Thomas A Baily | : | The American Pageant |
| 3) | C.P. Hill | : | History of the United States |
| 4) | Patt & Drummond | : | Our Nation From its creation |
| 5) | David Donald | : | A History of American Lifes Thought |
| 6) | Richard B Morris | : | Encyclopaedia of American History |
| 7) | Edward J. Conlon<br>(For the united states<br>Information Service-Madras | : | America Charitra Sangraham |
| 8) | Allan Nevins and Henry Steele | : | A Short History of United States |
| 9) | Telugu Academy | : | America Samyukta Rshtra Charitra |



డా॥ కంరున్నిసా బేగం, ఎం.ఎ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.
చరిత్ర, పురాతత్త్వ శాఖ
నాగార్జున విశ్వ విద్యాలయం

పాఠం - 11

# భారీ వ్యాపారము

## 11.1. లక్ష్యం :

19 వ శతాబ్ది రెండవ అర్ధభాగమున ముఖ్యంగా 1865 - 1900 సం॥ల మధ్య కాలమున అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో భారీ పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారభివృద్ధి జరిగాయి. దానికి తోడ్పడిన పరిస్థితులు, వాటివలన వచ్చిన ఫలితాలను పరిశీలించటయే ఈ పాఠం లక్ష్యం

## పాఠ్యనిర్మాణ క్రమం


11.1 లక్ష్యం

11.2 భారీ పారిశ్రామికాభివృద్ధి

11.3 పారిశ్రామికాభివృద్ధికి దారితీసిన కారణాలు

11.4 అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారీ పరిశ్రమలు, వ్యాపారాభివృద్ధి

11.5 ముగింపు


## 11.2 భారీ పారిశ్రామికాభివృద్ధి :-

అంతర్యుద్ధం తర్వాత ఉత్తర రాష్ట్రాలు గెలుపొందడం వలన ఫెడరల్ యూనియన్ రూపురేఖలు మారిపోయాయి ఉత్తర, దక్షిణ రాష్ట్రాల విభేదాలకు కారణమైన బానిసత్వ సమస్య పరిష్కారమై నందు వలన సంయుక్త రాష్ట్రాలు తమ ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి శ్రమించడం మొదలుపెట్టి అద్భుత ఫలితాలు సాధించాయి. దాదాపు అర్ధశతాబ్ది కాలంలో పెద్ద పెద్ద కార్ఖానాలు, రైలు మార్గాలు, అభివృద్ధి చెందుతున్న నగరాలతో సంయుక్త రాష్ట్రాలు నూతనత్వాన్ని సంతరించుకున్నాయి. అంతర్యుద్ధ కాలంలో జాతీయ బ్యాంకులు స్థాపించడం ద్వారానూ, రైలు మార్గాలు వేయడం ద్వారాను, చట్టబద్ధంగా ధరలను స్థిరీకరించడం ద్వారాను ప్రభుత్వం పరిశ్రామికాభి వృద్ధికి దోహదం చేసింది. అంతర్యుద్ధం వలన పెట్టుబడి దారులు, మూలధనం పోగుచేసుకోవడానికి వీలయింది. యుద్ధానంతరం నూతన పరిశ్రమలు స్థాపించడానికి అవకాశం ఏర్పడింది.

## 11.3 ఈ పారిశ్రామికాభివృద్ధికి దారితీసిన కారణాలు :

**11.3.1 సహజవనరులు** : 1865 - 1914 సం॥ల మధ్య అమెరికా సంయుక్త రాష్ట్రాలు సాధించిన పారిశ్రామిక అభివృద్ధి వలన ఆదేశం ప్రపంచ దేశాలన్నింటిలోను శక్తివంతము. సౌభాగ్యవంతము అయింది. దీనికి అనేక పరిస్థితులు దోహదపడ్డాయి. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగినది సహజ వనరులు. ఇవి అమెరికాలో పుష్కలంగా లభ్యం కావడం. నేలబొగ్గు, ఇనుప ఖనిజము, నూనె రాగి, సీసము, తగరము, సున్నపురాయి. ఉప్పు, గంధకము ఇతర ముడి పదార్థాలు విరివిగా దొరుకాయి. అమెరికా అవసరాలకు సరిపోయే ముడిపదార్థాలన్నీ అక్కడ లభ్యం కాకపోయినా, పరిశ్రమాభివృద్ధి కవసరమైన ముఖ్యవస్తువులకు అక్కడ కొదువలేదు. ఆధునిక పరిశ్రమలకు కీలక ద్రవ్య ఇనుప ఖనిజము. పెన్సిల్వేనియా, న్యూజెర్సీ, మిన్నెసోటా మొ॥ లైన రాష్ట్రాలలో విరివిగా లభ్యమయ్యేది. ఈ రకంగా పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన ముడిసరుకులన్ని దాదాపు అమెరికా రాష్ట్రాలకు లభించుటవలన పారిశ్రామికాభివృద్ధి సాధ్యమైనది.

**11.3.2. సాంకేతిక పరిజ్ఞానం** : సాంకేతిక పరిజ్ఞానం లేనిదే పారిశ్రామికాభ్యుదయం అసాధ్యం నూతన యంత్రాలు, నూతన శాస్త్రీయ పద్ధతులు సమకూడటంతో అమెరికాలో పరిశ్రమాభివృద్ధి త్వరితగతిని జరిగింది. జర్మనీ, ఇంగ్లాండ్ మొదలగు ఐరోపా దేశాలనుండి

సాంకేతిక పరిజ్ఞానం గల పక్కుమంది అమెరికాలో స్థిరపడ్డారు. వీరు శాస్త్రీయ పద్ధతులను పారిశ్రామిక వ్యవసాయ రంగాలందు ప్రవేశ పెట్టారు. అంతేగాక, భౌతిక, రసాయన శాస్త్రాలలో సాధించిన ప్రగతి కూడా దీనికి తోడ్పడింది.

**11.2.3 పెట్టుబడి :-** పరిశ్రమల స్థాపనకు అవసరమైనది మూలధనము లేక పెట్టుబడి, అంతర్యుద్ధ కాలమున విదేశీ వ్యాపారం చేయుటకు వీలులేనందున, అట్టి వ్యాపారస్థులందరూ అక్రమ వ్యాపారం సాగించి, అధిక లాభాలు గడించి ఆధనాన్ని పరిశ్రమల స్థాపనకు వినియోగించారు. దీనికి తోడు అనేక మంది విదేశీయ పెట్టుబడిదారులు కూడ అమెరికాలో తమ ధనాన్ని వినియోగించి పరిశ్రమలు స్థాపించారు.

**11.3.4 సమర్థ పారిశ్రామిక వేత్తలు :-** అనేక మంది సమర్థ పారిశ్రామిక నిర్వాహకులు పందొమ్మిదవ శతాబ్దిలో కృషిచేశారు. వాండర్‌బిల్ట్, హిల్, జె.గౌల్డ్ మున్నగువారు రైలు మార్గాలు నిర్వహణలో అందెవేసారు. నూనె పరిశ్రమకు రాక్‌ఫెల్లర్ పెట్టింది పేరు. ఆండ్రూకార్నీలో ఉక్కుపరిశ్రమను సొంతం చేసుకున్నారు. ఫిలిప్ డి. ఆర్మర్, గస్టవస్ స్విఫ్ట్, మైకేల్ కుడహె, నెల్సన్ మోరిస్ అనే నలుగురు మాంసం ప్యాకింగ్ వ్యాపారానికి మకుటంలేని రాజులు. వ్యవసాయ యంత్రాల ఉత్పత్తి జాన్ డీరీ, మెక్ కార్మిక్ల సొత్తు, బాంకింగ్ వ్యాపారంలో కుక్, మార్గన్‌లు పేరుగాంచిన వారు. దీనికితోడు సమర్థులైన కూలీలు కూడా చౌకగా దొరికేవారు, అంతర్యుద్ధం తర్వాత అమెరికాకు తండోపతండాలుగా వలసవచ్చినవారు దీనికి ఉపయోగపడ్డారు. వ్యవసాయ క్షేత్రాలు యంత్రీకృతమైన తర్వాత అక్కడ నిరుద్యోగులైన వ్యవసాయ కార్మికులందరూ పరిశ్రమలకు ఎగబాకారు. కాని ఈ పారిశ్రామిక వేత్తలలో కొందరు తీరని ధన పిపాసతో లాభాలు గడించడమే వృత్తిగా పెట్టుకొని ప్రజల సంక్షేమాన్ని కాలరాచి 'రాబర్‌బేరన్స్' అనే పేరు తెచ్చుకున్నారు. రాక్ ఫెల్లర్, కార్నెగీ, హిల్‌ల వంటి మరికొందరు చాకచాక్యంతో వ్యాపారాన్ని నడిపి గొప్ప పారిశ్రామిక, రాజనీతిజ్ఞులుగా పేరుపొందారు.

**11.3.5 అమెరికన్‌ల శ్రామిక ప్రవృత్తి :** 17వ శతాబ్ది కాల్వినిజమ్, 18 వ శతాబ్దిలో ఆడమ్ స్మిత్ ప్రవచించిన ఆర్థిక స్వేచ్ఛ, ఉదార భావాలవల్ల ప్రభావితులైన అమెరికన్‌లలో ఆర్థిక ప్రగతిని సాధింపవలెనను దృఢనిశ్చయం ఎక్కువైంది. ఆర్థిక ప్రగతి సాధించుటకై చెమటోర్చి పనిచేయడం, సంపాదించిన దానిలో కొంత వెనక వేయడం వారి ప్రధాన ఆశయాలు. ఉన్న దానితో తృప్తిపడి సోమరులుగా జీవించడం వారికి గిట్టదు. స్వయంకృషి, స్వశక్తిపై అచంచల విశ్వాసంతో వారు పురోగతిని సాధింప వలెనని ఉవ్విళ్లూరేవారు. ఈ ఆత్మస్థైర్యమే అమెరికన్‌ల ప్రగతికి మూలకారణం

**11.3.6 ప్రభుత్వ రక్షణ :** అమెరికన్ల పారిశ్రామిక ప్రగతికి ఆదేశ ప్రభుత్వమిచ్చిన సహకారం సాటిలేనిది. దాదాపు నాలుగు దశాబ్దాలు ప్రభుత్వాన్ని నిర్వహించిన రిపబ్లికన్ పార్టీ పెట్టుబడిదారులకు, వ్యాపారస్తులకు, ఉత్పత్తి దారులకు సహాయకారిగా ఉండే అనేక నిర్ణయాలు తీసుకొంది క్లీవ్‌లాండ్ అధ్యక్షతన ఏర్పడిన డెమొక్రటిక్ ప్రభుత్వం కూడ ఈ విధానాన్నే అవలంభించింది. పరిశ్రమలకు నష్టం రాకుండా ఉండడానికి అనువుగా రక్షణ సుంకాలను (Protective tariffs) చట్ట బద్ధంగా ప్రభుత్వం ఏర్పరచింది. అందులో ముఖ్యమైనవి 1861 లో ఆమోదించిన మోరిల్ టారిఫ్, 1890 నాటి మెకన్లే చట్టము, 1897 నాటి డింగ్లీటారిఫ్, హోమ్‌స్టడ్ ఆక్ట్ ద్వారా పశ్చిమ ప్రాంతమున పారిశ్రామికులకు భూములు, ముడిసరుకులు మున్నగు వారిని ఉచితంగా ఇచ్చారు. ఈ చట్టాలన్నియు అమెరికన్ ఉత్పత్తిదారులు విదేశీ వ్యాపారస్థుల పోటీ లేకుండా తమసరుకులను అధిక ధరలకు అమ్ముటకు వీలు కల్పించాయి. ప్రభుత్వం ఆర్థిక విధానాల ద్వారాను జాతీ బ్యాంకింగ్ పద్ధతి ద్వారాను విలువను తగ్గించి ఋణగ్రహీతలైన అమెరికన్ వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చింది. పారిశ్రామికులకు భూములు, ముడిసరుకులు ఇవ్వడం వలన కూడా ప్రభుత్వం అదనపు సౌకర్యం కలుగచేసింది.

**11.3.7 సుప్రీంకోర్టు నిర్ణయాలు :** ప్రభుత్వ అండదండలకు తోడు సుప్రీంకోర్టు పెట్టుబడిదారులకు లాభకరమయ్యే న్యాయ నిర్ణయాలు ఇచ్చి తోడ్పడింది. 1868 లో అమెరికా రాజ్యాంగానికి చేర్చిన పద్నాలుగో సవరణ దీనికి ప్రాతిపదిక అయింది. ఈ సవరణ ప్రకారం ఏ రాష్ట్రంకూడా అమెరికా పౌరుల అధికారాలనుగాని, హక్కులను కాని తగ్గించకూడదు. అంతేకాక ఏ వ్యక్తి ప్రాణాన్నిగాని, స్వేచ్ఛనుకాని, ఆస్తిని కాని చట్టరీత్యా విచారించకుండా జప్తిచేకూడదు. 1898 లో అమెరికన్ సుప్రీంకోర్టు పద్నాలుగో సవరణ మొదటి

భాగంలోని 'వ్యక్తి' పద నిర్వచనం క్రింద సంస్థగాని, వ్యక్తిగాని రావచ్చునని తీర్మానించడంతో ఈ నిబంధనను తిప్పి వ్రాసినట్లుయింది. ఈ తీర్పు ప్రకారం వ్యాపార సంస్థలు సరైన లాభాలు పొందడంలో అడ్డుపడే ఏ చట్టమైన రాజ్యాంగ విరుద్ధమయిందనే నిర్ణయం జరిగింది. సంస్థల సరైన లాభాలను నిర్ణయించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు కాక న్యాయస్థానాలకే లభించింది. ఫలితంగా పెట్టుబడిదారులకు అధిక రక్షణ ఏర్పడి వారు విపరీతమైన లాభాలు గడించడం మొదలు పెట్టినారు. కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానాల నుంచి అభయం పొందిన దక్షులైన భారీ వ్యాపారస్తులు సుదీర్ఘమైన రైల్వేలను నిర్మించడానికి బృహత్ పారిశ్రామిక వ్యవస్థలను సృష్టించడానికి నడుము కట్టారు.

**11.3.8 రైల్వేల ప్రగతి :** పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత చేయూతనిచ్చింది రైల్వేల అభివృద్ధి. 1861 నాటికి కేవలం 48,000 కి॥ మీ. రైలు మార్గాలు మాత్రమే ఉండగా 1900 సం॥ నాటికి 3,08,800 కి॥మీ. రైలు మార్గాన్ని పొడిగించడం వల్ల ఈ కాలాన్ని రైల్వే యుగమని పిలిచేవారు ఇవన్నీ కలిసి ఐరోపా మొత్తంలోని రైలు మార్గాలకంటే అధికంగా ఆనాటి ప్రపంచ రైలు మార్గాల పొడవులో 40 శాతం ఉన్నట్లు తేలింది. వీటిలో చిన్నవీ. పెద్దవీ కూడా ఉన్నాయి. ఈ పెద్ద మార్గాలనే ట్రాన్స్ కాంటినెంటల్స్ అంటారు. అట్లాంటిక్ మహాసముద్రం ఒడ్డును పసిఫిక్ సముద్రతీరంతో కలుపుతూ అమెరికా ఖండంలోని ఒక కొననుంచి మరొక కొనవరకు విస్తరించి ఉన్నాయి. ఈ రైలు మార్గాలు ముడిపదార్థాలను సరుకులను యంత్రాలను, సాంకేతిక సిబ్బందిని ఒక ప్రాంతంనుంచి వేరొక ప్రాంతానికి చేరవేయుచూ ఆర్థిక ప్రగతికి దోహదం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైనిక తపాల అవసరాల దృష్ట్యా, వాటి నిర్మాణానికి ఉదారంగా, ఉచితంగా రైల్వేలైనుకు రెండు పక్కలా భూములు ఇచ్చాయి.

ఈ విధంగా 'యూనియన్ పసిఫిక్ కంపెనీ' సెంట్రల్ పసిఫిక్ కంపెనీ వంటి పెద్ద సంస్థలు ట్రాన్స్‌కాంటినెంటల్ మార్గాల్ని నిర్మించాయి. ఈ నూతన రైలు మార్గాల వెంట అనేక సంపన్న గ్రామాలు ఆవిర్భవించి భవిష్యత్‌లో అవేనగరాలయ్యాయి. ముఖ్యంగా వ్యవసాయం, గనుల పరిశ్రమ పశ్చిమాన వృద్ధి పొందడానికి రైల్వేలే ముఖ్య కారణం అంతేగాక రైలు మార్గాలు వేయడం మొదలు పెట్టాక అమెరికాలో కోటీశ్వరుల సంఖ్య బాగాపెరిగి పోయింది. ఈ వ్యాపారంలో బాగాలాభాలను గడించి కొంతమంది కోట్లకు పడగెత్తారు. ఈ వ్యాపారంలో వాండర్‌బిల్ట్ పదికోట్ల డాలర్లు సంపాదించారు. 1877 నాటికి వాండర్‌బిల్ట్ న్యూయార్క్ సెంట్రల్‌ని బాగా విస్తరించి, న్యూయార్క్ చికాగోలను కలిపారు. వాండర్‌బిల్ట్ పదిలక్షల డాలర్లు దానంచేసి టెన్నిసీ రాష్ట్రంలో తన పేరిట విశ్వవిద్యాలయం స్థాపించారు. 'క్రెడిట్ మొబిలియర్' అనే డమ్మీ సంస్థ అక్రమంగా సంపాదించిన లాభాలకు అంతేలేదు. రైల్వే వ్యాపారం మూలంగా రైలు ప్రభువులు (Rail Barons) అనే కొత్త సంపన్న వర్గం బయలుదేరింది. ఇవేగాక ఇంకా నాలుగ ట్రాన్స్ కాన్టినెంటల్ లైన్సు నిర్మింప బడ్డాయి. అవి సదరన్ పసిపిక్ మరియు నార్దన్ పసిపిక్ (1883), సాన్‌టాఫే (1884) దగ్రేట్ నార్దన్ (1893) నిర్మింపబడ్డాయి. పశ్చిమ రైల్వేల నిర్మాణంలో జేమ్స్, జె.హిల్ పేరు పొందిన వాడు. ఇతను వ్యవసాయం అభివృద్ధి చేయడమేగాక, పాఠశాలలను, చర్చిలను కూడా నిర్మించాడు.

**11.3.9 నూతన శాస్త్రీయ పరిశోధనలు :** అమెరికాలో పరిశ్రమలు పెంపొందడానికి నూతన శాస్త్రీయ పరిశోధనలెంతో తోడ్పడ్డాయి. 1851 లో కెంటకీ వాసి అయిన విలియంకెల్లీ ఉక్కుతయారుచేసే నూతన విధానాన్ని కనిపెట్టాడు. ఆహార పదార్థాల ఉత్పత్తిలోను, రోడ్లు, రవాణా సౌకర్యాలలోనూ అత్యద్భుత ప్రగతి సాధించారు. రిఫ్రిజిరేటర్, కారు, గాసోలిన్‌కారేజి, విమానము, గ్లైడర్ మొదలైనవి ఆనాటి గణుతికెక్కిన పరిశోధనలలో కొన్ని మాత్రమే డైనమోలు నడిపే స్టీమ్ టర్బైన్‌లు, ఇంటర్నల్ కంబస్చన్ ఇంజన్‌లు కూడా వాటిరంగాలలో విప్లవాలను కొనితెచ్చిన పరిశోధనలు 1860-1890 మధ్య కాలంలో 4,40,000 పేటంట్లు అమెరికాలో నమోదు అయినాయంటే ఈ పరిశోధనలు ఎంతగా అభివృద్ధి చెందాయో తెలుస్తున్నది.

**11.3.10 ట్రస్ట్‌లు :** భారీ పరిశ్రమలు, వ్యాపారాభివృద్ధికి దోహదం చేసిన వానిలో ప్రముఖ పాత్ర వహించినవి ట్రస్ట్‌లు, ట్రస్ట్ లేక కార్పోరేషన్ భిన్న వ్యాపారసంస్థల కలయిక. అనగా ఒకే వ్యాపారం చేయు భిన్న సంస్థలు తమ మధ్యగల పోటీని నివారించి తమకు గిట్టుబాటు ధరలేకాక, తరచు అధికలాభాలు పొందాలనే ధ్యేయంతో ఒక ట్రస్ట్‌గా ఏర్పడేవారు. ఈ నూతన వ్యవస్థక్రింద అనేక పోటీ సంస్థల నిర్వహణాధికారం కొంతమంది ట్రస్టీల చేతులలోనే వుండేది. వారు అట్లాంటి సంస్థలన్నింటిలోనూ ఉత్పత్తి అయిన సరుకులను పోగుచేసి

టిమీద గుత్తాధిపత్యాన్ని సంపాదించడం వల్ల వాటిని ఎక్కువ ధరలకు అమ్మి లాభాలను అందరికీ పంచేవారు. సంస్థల యాజమాన్యంతో స్టలకెలాంటి ప్రమేయం లేదు. ఇటువంటి ట్రస్ట్‌లను నిర్వహించిన వారిలో జాన్. డి. రాకా ఫిల్లర్, ఆండ్రూ కార్నెగీలు ముఖ్యులు. అధిక స్టలు కేవలం ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని ప్రజల సంక్షేమాన్ని విస్మరించి అనేక అక్రమాలకు పాల్పడ్డారు.

ఈ విధంగా అనేక అంశాలు అమెరికా సంబందిత రాష్ట్రాలలో భారీ పరిశ్రమలు, వ్యాపారం అభివృద్ధి చెందడానికి దోహదపడ్డాయి.

## .4 అమెరికా రాష్ట్రాలలో భారీ పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధి :

అమెరికా అన్ని రంగములలో వచ్చిన భారీవ్యాపారాభివృద్ధిని పరిశీలిద్దాం. ఈ క్రింది అంశాలు అమెరికా సంబంధ రాష్ట్రాలలో రీ వ్యాపారాభివృద్ధిని తెలియచేస్తాయి.

**11.4.1 బొగ్గు ఉక్కు :** ఏదేశమైనా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైనవి బొగ్గు, ఉక్కు, పెన్సిల్వేనియా ఈశాన్యపు ాంతము మిక్కిలి ధృడమైన ఆంత్రసైట్ (Anthrecite) అను బొగ్గుకు ప్రసిద్ధి. అదేవిదంగా అపలేషియన్ పీఠభూమి, మధ్య, దూర ు రాష్ట్రాలందు బొగ్గుగనులు (Bituminous Cool) ఉన్నాయి. ఈ బొగ్గుగనుల అభివృద్ధివలన 19 వ శతాబ్ది రెండవ భాగంలో, ంవత్సరానికి ఆంద్రసైట్ పదిమిలియన్ టన్నులనుండి అరువది మిలియన్ టన్నులకు, బిట్యూమినస్ బొగ్గు ఆరుమిలియన్ల టన్నుల ండి రెండు వందల మిలియన్‌ల టన్నులకు పెరిగింది.

1860 సంవత్సరం నాటికి ఎనిమిది లక్షల టన్నుల ఇనుప ఖనిజం (Pig iron) ఉత్పత్తికాగా, 1900 నాటికి పధ్నాలుగు మిలియన్ న్నులకు పెరిగింది. దీనిలో పదకొండు మిలియన్ టన్నులు ఉక్కుగా మార్చుటకు ఉపయోగించారు. పెన్సిల్వేనియాలో ఇనుము, ఉక్కు ్యం అవడమే గాక, రవాణా సౌకర్యాలు కూడా ఉన్నందువల్ల, ఉక్కు ఉత్పత్తి చేసే ముఖ్య కేంద్రమైంది.

ఆకాశాన్ని అంటే హర్మ్యాలను భవిష్యత్తులో నిర్మించిన అమెరికానాగరికతకు మూలాధారం ఉక్కు, అందుకనే అమెరికనలు తమ ాగరికతను ఉక్కునాగరికత (Steel Civilization) అని చెప్పుకుంటారు. ఈనాడు ఉక్కు ఎక్కడైనా విరివిగా దొరుకుతున్నప్పటికీ, బ్రహాంలింకన్ కాలంలో మాత్రం ఇది అపురూపంగానే ఉండేది. రైలు పట్టాలు, వంతెన, దూలాల వంటి వాటికి కూడా ఆనాడు ఇనపసరుకునే ిేవారు. 1870 లో 'న్యూయార్క్ సెంట్రల్ రైల్వే కంపెనీ వారు ఉక్కుపట్టాలను మొదటిసారిగా వాడదలచుకొన్నప్పుడు, వాటిని ఇంగ్లాండ్ ించి దిగుమతి చేసుకోవలసి వచ్చింది. రెండు దశాబ్దాల కాలంలోనే అమెరికా ఉక్కు పరిశ్రమలో ఎంతో ముందంజవేసి ఇంగ్లాండ్ ్మనీలను అధిగమించ గల్గింది. దీనికి ముఖ్య కారణం ఉన్నత శ్రేణి ఇనుప ఖనిజము, నేలబొగ్గు, విస్తారంగా దగ్గరలో లభ్యంకావడమే, లేక ుపరియర్ ప్రాంతములోని మిసాబే గనులలో నేలబారనే కల్తీలేని ముడి ఇనుము విశేషంగా లభ్యమయ్యింది. దీనికి తగినట్లు బెసిమర్ ిపెట్టిన నూతన విధానంవల్ల ఉక్కు తయరీ కారు చౌక అయి అమెరికాలో ఉక్కు నాగరికతకు రెక్కలొచ్చినట్లయింది. సమర్థులైన రిశ్రామిక వేత్తలు ఈ రంగాన్ని చేపట్టడం ఎంతో విశేషం.

అమెరికాలో ఉక్కు పరిశ్రమకు ఆంద్రూకార్నేగీ మూల కారకుడు. ఇతను స్థాపించిన కార్నీగీ ఉక్కు కంపెనీ (1900) అమెరికాలోని ్గవవంతు ఉక్కును, ఉత్పత్తి చేసేది. స్కాట్లండ్‌లో అతిదీన కుటుంబంలో పుట్టిన కార్నేగీ అమెరికాకు బ్రతుకు తెరువుకోసం వచ్చి ిగ్రాములు అందించే బంట్రోతు పనినుంచి, శరవేగంతో పైకెగబాకాడు. అనేక వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించిన ఇతను 65 లో ఉక్కు పరిశ్రమను చేపట్టాడు. నేల బొగ్గు ఇనుము, సున్నపు గనులను, సరుకులు చేరవేసే ఓడ, రైలు మార్గాలను తన గుప్పెట్లో ్టుకొని, దేశంలో తయారయ్యే సరుకుల్లో నాల్గోవంతు ఇతనే ఉత్పత్తి చేసేవాడు. ఇతని పెట్టుబడి తక్కువ కాలంలోనే 25 మిలియన్ ర్ల నుండి 160 మిలియన్లకు పెరిగింది. ఇతను తనవలె మేధావులైన వారితో భాగస్వామ్యం పెట్టుకొని, కార్మికుల చేత ఎక్కువ గంటలు చేయించుకొని తక్కువ జీతాలు ఇవ్వడం ద్వారా బాగా లాభాలు గడించి, కోటీశ్వరుడయినాడు. అంతేగాక కార్నెగీలో కొన్ని ప్రత్యేక ిణాలున్నాయి. అతనికి ట్రస్ట్‌లన్నా, గుత్త వ్యాపారమన్నా ఏవగింపు. మధ్య వర్తులుంటే గిట్టదు. 1890 నాటికి ఇతని వ్యాపారాన్ని పోటీలో ుంచగల సంస్థలు తలెత్తాయి. వ్యాపారంలో ఒత్తిడికి తట్టుకోలేక, మిత్రుల సలహాలు పాటించి, హుందాగా వ్యాపారాన్ని 44 కోట్ల

డాలర్లకు మార్గన్ అనే ప్రముఖ వ్యాపారస్తునికి అమ్మాడు. చేతికి ఎముక లేనట్టు 35 కోట్ల డాలర్లను ప్రపంచమంతట గ్రందాలయాలు ప్రజోపయోగ సంస్థలు నిర్మించడానికి దానం చేసాడు.

**11.4.2 తైల పరిశ్రమ :** బొగ్గు, ఇనుము తర్వాత ముఖ్యమైనది తైల పరిశ్రమ అమెరికాలో తైల పరిశ్రమలో పేరెన్నికగన్నవాడు జాన్.డి.రాక్ ఫిల్లర్ పరిశ్రమను స్థాపించడంలో, దాతృత్వంలో రాకోఫిల్లర్, కార్నీగీకి ఏంతమాత్రం తక్కువకాదు. ఇతను అమెరికాలో ట్రస్టుని స్థాపించి ఏకస్వామ్యానికి కారణమైనాడు.

తైలపరిశ్రమ అమెరికాలో అనుకోకుండా అభివృద్ధి అయింది. మొదట సెలయేళ్ళుగా వెలువడే కొద్దిపాటి ఖనిజతైలాన్ని సీసాలకెక్కించి జాగ్రత్తగా వాడుకునేవారు. 1859 లో పెన్సిల్వేనియా రాష్ట్రంలో మొదటి నూనె బావి పడటంతో ద్రవరూపంలోనికి బంగారం (Liquid gold) అనే పేరుతో ఖనిజతైలానికి విపరీతంగా గిరాకీ పెరిగింది. ఆనాటినుండి పెట్రోలు, కిరోసిన్‌ల ద్వారా భూమినుండి పైకి తీసిన ఈ ఖనిజం ఖరీదు అమెరికాలోని అన్ని గనులన్నిటినుండి తీసిన బంగారు ఖరీదు కంటే ఎన్నోరెట్లు ఎక్కువయ్యింది.

ప్రప్రథమంగా ఇ.ఎల్. డ్రేక్ అను వ్యక్తి 1859 లో పశ్చిమ పెన్సిల్వేనియాలో నూనె బావిని త్రవ్వారు. తైల పరిశ్రమాభివృద్ధికి కృషి చేసిన వాడు క్లీవ్‌లాండ్ వాసియైన జాన్. డి. రాక్ ఫెల్లర్, ఇతను చాల బీదకుటుంబంలో పుట్టి, చిన్న ఉద్యోగాలెన్నో చేసి, కష్టపడి, స్వశక్తివల్ల మహాభాగ్యవంతుడైన ప్రతిభాశాలి. ఇతను కొద్దికాలంలోనే ఒహాయో రాష్ట్రంలోని నూనె వ్యాపారన్నంతటిని గుత్తకు తీసుకున్నాడు. 1870 లో హైయోలో 'స్టాండర్డ్ ఆయిల్ కంపెనీని' స్థాపించాడు. క్రమంగా న్యూయార్క్, పిట్స్‌బర్గ్, ఫిలడెల్ఫియాలోని పరిశ్రమను వశం చేసుకొని 1897 నాటికి అమెరికాలోని తైల పరిశ్రమలో 90% హస్తగతం చేసుకున్నారు. సరుకుల ధరలను ఊహించనంతగా తెగ్గోసి, తన పోటీదార్లు విరమించుకునేలా దివాలా తీసి గాని, వ్యాపారాన్ని అమ్ముకుపోయే దాక గాని చేసేవారు. ఇటువంటి పద్ధతులన్ని అవలంభిస్తూ తన ఇష్టం వచ్చినట్లు ధరలను పెంచుతూ, తగ్గిస్తూ అశేషలాభాలు గడించాడు. ఇతను వస్తు ఉత్పత్తిలో అత్యున్నత ప్రమాణాలను పాటించి, సమర్ధులైన ఉద్యోగులను ఎన్నికచేసి, లాభాలలో నియమిత భాగాన్ని కూడబెట్టి, వ్యాపారాన్ని దక్షతతో నిర్వహించేవాడు ఇతనికి వ్యాపారంలో దయాదాక్షిణ్యాల పట్టింపు ఉండేది కాదు. రాక్ ఫెల్లర్ కుమారుడు తన తండ్రి చర్యను సమర్థిస్తూ "అందమైన పెద్ద గులాబీ పువ్వును పెంపొందిచాలంటే దానిచుట్టూ ఉన్న చిన్న చిన్న మొగ్గలను తుంచి వేయవలసి ఉంటుందన్నాడు చనిపోయేనాటికి ఇతను బిలియన్ డాలర్ల ధనాన్ని కూడ బెట్టాడు. "చికాగో విశ్వవిద్యాలయం, రాక్ ఫిల్లర్ ఫౌండేషన్" వంటి అనేక సంస్థలు స్థాపించాడు. 1899 లో అమెరికాలోని రాక్‌ఫెల్లర్ తైలపరిశ్రమల కంపెనీలన్నీ కలసి స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ ఆఫ్ న్యూజెర్సీ' ఏర్పడింది. రాక్ ఫెల్లర్ తన చివరి 30 సం॥ రాలు తాను ఆర్జించిన ధనాన్ని విద్యాలయాలకు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ఇచ్చాడు.

**11.4.3. విద్యుచ్ఛక్తి :** థామస్ ఆల్వా ఎడిసన్ 1879 సం॥లో ఫిలమెంట్‌ను కనుగొన్నాడు. 1882 ఎడిసన్ ఎలక్ట్రిక్ కంపెనీ, న్యూయార్క్‌లోని విద్యుత్ దీపాలకొరకై ఒక పవర్ ప్లాంట్‌ను ప్రారంభించింది. 1887 లో ఫ్రాంక్.జె.స్ప్రేగ్. విద్యుచ్ఛక్తితో నడిపే కారును రిచ్‌మాండ్‌లో నిర్మించాడు. విద్యుచ్ఛక్తిని ఉపయోగించి సమాచారం అందించడానికి టెలిగ్రాఫ్, కనుక్కొన్నాడు. 1876 లో అలెగ్జాండర్ గ్రహంబెల్ టెలిఫోన్ కనిపెట్టాడు. ఎడిసన్ ఎలిక్ట్రిక్ కంపెనీని ఇంకా వృద్ధిచేసి 1892లో 'జనరల్ ఎలక్ట్రానిక్' అని పేరుమార్చాడు. టెలిగ్రాఫ్ 1886 లో వెస్టరన్ యూనియన్, పోస్టల్ టెలిగ్రాఫ్ అనే రెండుకంపెనీల అధీనంలో ఉండేవి, టెలిఫోన్‌లన్నీ అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ అనే కంపెనీ క్రింద పనిచేసేవి ఇదే అమెరికాలో పెద్ద కార్పోరేషన్.

**11.4.4. రైల్వేల అభివృద్ధి :** 1860 - 1900 సంవత్సరాల మధ్యకాలంలో అనేక రైలు రోడ్ల నిర్మాణం జరిగింది. ఈ రైల్వేల అభివృద్ధిలో వాండర్ బిల్ట్, ఎడ్గార్ థాంసన్, టి.ఎ.స్కాట్, జేమ్స్ హిల్ ముఖ్యులు. జార్జి పుల్‌మన్ 1864 లో స్లీపింగ్ కార్‌ను నిర్మించడం, 1868 లో జార్జి వెస్టింగ్ హౌస్ ఎయిర్ బ్రేక్ కనుక్కోవడం, ఇంకను ఇంజన్లు, బ్లాక్ సిగ్నల్ మున్నగునవి కనుగొనుట వలన రైలు ప్రయాణం వేగంగాను, సురక్షితంగాను జరిగేది. కాని ఈ రైల్వేలను నడిపే సంస్థలన్ని రహస్య ఒప్పందాలు చేసుకొని ఎక్కువ సుంకాలు వసూలు చేసేవారు. వీరు వ్యవసాయ దారులను అమానుషంగా పీడించేవారు. చివరికి 1887 లో అంతర్ రాష్ట్రీయ వాణిజ్య చట్టాన్ని (Inter state

ommerce Act) కాంగ్రెస్ ఆమోదించి, రైల్వేలు చేసే అక్రమాలను తొలగించడానికి నిర్ణయించింది. దీనిని అమలు పర్చడానికి అంతర్ ష్ట్రీయ వాణిజ్య కమీషన్ (Intastate Commerce Commission ని స్థాపించింది.

**11.4.5 ఇతర పరిశ్రమలు :** సాంకేతిక పరంగా వచ్చిన మార్పులు వలన ప్రజల జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయి. వ్యవసాయ రంగంలో కూడ అనేక యంత్రాలు ఉపపయోగించబడ్డాయి. అంతేగాక వ్యాపారం అభివృద్ధి గావడానికి టైప్‌రైటర్ (1867), ాడింగ్ మిషన్ (1888), కాష్ రిజిస్టర్ (1897) ఎంతో తోడ్పడ్డాయి. అలాగే 1846 లో కుట్టు మిషన్ కనిపెట్టిన తర్వాత ఎంతో మార్పు ్చింది. ప్రజల ఆహార పద్ధతిలో మార్పు రావడానికి రిఫ్రిజిరేటర్ ఎంతో తోడ్పడింది. మెక్ కార్మిక్ హార్‌వెస్టర్ కంపెనీ నెలకొల్పింది. ాకను జేమ్స్, బి. డ్యూక్ యొక్క 'అమెరికన్ టొబాకో కంపెనీ ఆఫ్ చికాగో వ్యవసాయ ఉత్పత్తులలో ఏకస్వామ్యాన్ని నెలకొల్పింది. (1890) మెరికన్ షుగర్ రిఫైనింగ్ కంపెనీ (1891) కూడా ఏకస్వామ్యానికి ఉదాహరణలు, ఉప్పు, మద్యము, అగ్గిపెట్టెలు, రబ్బరు, సీసము మేకులు ుదలైన రంగాలలో ఇటువంటి గుత్త సంస్థలు వెలిసాయి.

**11.4.6 షేర్మన్ చట్టము :** 1880 ఏకస్వామ్యం అమెరికా వ్యాపారంలో బాగా పెరిగిపోవడంతో చాలమందిని కలవరపర్చింది. ుఖ్యంగా చిన్న చిన్న వ్యాపారస్థులు, పెద్ద కార్పొరేషన్స్‌తో పోటీ పడలేక వ్యతిరేకులుగా తయారయ్యారు. ట్రస్ట్‌లు ఏర్పడడమేగాక వివిధ ర్పొరేషన్లనుకూడ కలిపివేసేవారు. ఈ రకంగా మార్కెట్ అంతా ఒకే కార్పోరేషన్, తన యొక్క పేటెంట్ హక్కులతో మిగతావాటిని యంత్రిస్తూ, పోటీ లేకుండా రాజ్యం ఏలేది. దీనితో ఆందోళనకు గురైన ప్రజలు ఈ భారీ వ్యాపారస్థుల ఆట కట్టించడానికి, మార్కెట్‌లో ీని కలుగచేసి, ధరలను నియంత్రించడానికి, గవర్నమెంట్ చర్యలు తీసుకోవాలని భావించారు. ట్రస్ట్‌లను అదుపులో ఉంచడానికి ాలు శాసన సభల ద్వారా ప్రయత్నం చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ట్రస్ట్‌లను నిషేధిస్తూ చట్టాలు చేశాయి. కాని అన్ని రాష్ట్రాలు టువంటి చట్టాలను చేయకపోవడం వలన అంతగా ట్రస్ట్‌లను అదుపులో పెట్టలేక పోయారు. న్యూజర్సీ, డీలా వేర్, పశ్చిమ వర్జీనియా ష్ట్రాలు, చాలా తక్కువ నిషేదాలను ఈ కార్పోరేషన్ల యొక్క చార్టర్లపై విధించారు. చివరకు ఫెడరల్ ప్రభుత్వం ఒత్తిడి వచ్చిన ఫలితంగా 90 నాటికి 'షేర్మన్ అంటీట్రస్ట్ చట్టము' ఏకగ్రీవంగా ఆమోదితమైంది. ఎనిమిది ముఖ్యాంశాలతో కూడిన ఈ చట్టం. మంచి, చెడు, అని క్షత లేకుండా ట్రస్ట్‌ల గుత్త వ్యాపారాన్ని పూర్తిగా నిషేదించింది. ట్రస్ట్‌లు, కాంబినేషన్‌లు వగైరా పేర్లమీద వ్యాపార సంస్థల మధ్య అంతర్ ష్ట్రీయ వ్యాపారానికిగాని, విదేశీవ్యాపారానికి కుదుర్చుకొన్న ఒప్పందాలను ఈ చట్టం రద్దుపర్చింది. ఈ నిబంధనను ఉల్లంఘించిన క్తులకు అయిదువేల డాలర్లు జరిమాన గాని, ఒక సంవత్సరం ఖైదు శిక్షగాని, రెంటిని గాని విధించే ఏర్పాటు జరిగింది. ఇదేవిధంగా ంతర్ రాష్ట్రీయ వ్యాపారాన్ని గుత్తకు తీసుకునే ప్రయత్నం చేసినవారిని దండించే ఏర్పాట్లను కూడా ఈ చట్టం చేసింది. అయినా ఈ ట్టం వ్యాపారస్థుల కెట్లాంటి ఇబ్బందిని కల్గించలేక పోగా, కార్మికులు సమ్మెచేసే హక్కును రద్దుచేసిందని న్యాయస్థానం వ్యాఖ్యానించడంతో ురీత పరిణామాలు కల్గాయి. అంతర్యుద్ధం తర్వాత ఏర్పడిన 318 కార్పోరేషన్లలో 236 కార్పోరేషన్లు 1898-1903 మధ్య కాలంలో ర్పడ్డాయి. థియోడోర్ రూజ్‌వెల్ట్ అధికారానికి రాగానే ఈ చట్టాన్ని పటిష్ఠంగా అమలు జరిపి మార్గన్, హిల్ వంటి హేమా హేమీలకు ుణపాఠం నేర్పి 'ట్రస్ట్ బస్టర్' (Trust - Buster) అనే బిరుదు పొందాడు. క్రమంగా ఇతర ట్రస్ట్‌లన్నింటిపై కూడ ఇట్లాంటి ఆంక్షలు ంచడంతో గుత్త వ్యాపారం తిరుగుముఖం పట్టి ధరలు తగ్గే అవకాశం కల్గింది.

**11.4.7 బ్యాంకింగ్ వ్యాపారం :** 1890 లో బ్యాంకింగ్ వ్యాపారం అమెరికాలో బాగా అభివృద్ధి చెందింది. అంతర్యుద్ధకాలంలో ుఖ్యమైన బ్యాంకింగ్ హౌస్‌గా పేరుపొందిన "జేకుక్ అండ్ కంపెనీ ఆఫ్ ఫిలడేల్ఫియా" 1873 లో దివాలా తీసినందువలన, న్యూయార్క్‌లోని .పి.మార్గాన్ అండ్ కంపెనీ (1895) బ్యాంకింగ్ వ్యాపారంలో వృద్ధిలోనికి వచ్చింది. ఇంకా కొన్ని బ్యాంకింగ్ హౌసస్ ఉన్నప్పటికి జె.పి. ార్గాన్, బ్యాకింగ్ వ్యాపారంలో ఒక ధ్రువతారగా వెలుగొందాడు. మార్గన్ ఎంతో నేర్పుతో తాను చేపట్టిన పరిశ్రమలలో స్థిరత్వాన్ని సాధించాడు. ెనీతో లాభాలను అందరికీ సక్రమంగా చెందేటట్లు చూసేవాడు. అంతేకాక వ్యాపారంలో పోటీవలన ధరలు మరీ పడిపోతాయని ధరల ురించి. వినియోగ దారుల బాగోగుల గురించి, మార్కెట్ గురించి కార్పోరేషన్లు కొన్ని ఒప్పందాలు చేసుకోవడం మంచిదని మార్గన్ ్మవాడు.

'డ్రెక్సెల్ మార్గన్ అండ్ కంపెనీ' (Drexel Morgan and Company) మొదట్లో అమెరికన్ సెక్యూరిటీలను యూరప్‌లో అమ్మడం నిమగ్నమై యుండేది. 1900 సంవత్సరానికి మూడవవంతు రైలు రోడ్లన్నీ మార్గనైజ్ చేయబడ్డాయి. 1890 లో మార్గన్ మిగతా పరిశ్రమ వైపు కూడా ఆకర్షితుడైనాడు. మార్గన్ నిర్మించిన వాటిలో 'యునైటెడ్ స్టేట్స్ స్టీల్' (1901) బాగా అభివృద్ధి సాధించింది. ఆండ్రూ కార్నె తర్వాత స్టీల్ వ్యాపారంలో ఈ సంస్థ బాగాపేరెన్నికగన్నది. కార్నేగీ కంపెనీని పదిస్టీల్ కంపెనీలతో కలిపి పెద్ద కార్పరేషన్‌గా మార్చాడ అమెరికాలోని ఉక్కు పరిశ్రమలో, ఎక్కువ వ్యాపారాన్ని ఈ 'యునైటెడ్ స్టేట్స్ స్టీల్ కార్పోరేషన్' నియంత్రించేది. ఈ విధంగా బ్యాంకిం వ్యాపారంలో ధృవతారగా వెలుగొందిన మార్గన్ "యునైటెడ్ స్టేట్స్ స్టీల్ కార్పోరేషన్ అనే నూరుకోట్ల డాలర్ల సంస్థను ప్రథమంగా నిర్మించాడ ఇంత ఎక్కువ మూలధనంతో స్థాపితమైన వ్యాపారసంస్థ ఆనాటి వరకు ఇదొక్కటే తర్వాత దీని ఒరవడిననుసరించి. అటువంటి బృహ సంస్థలు అనేకం ఉద్భవించాయి. దీనికి దీటుగా ఏర్పడిన మరొకసంస్థ 'స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ' కాని 1907 లో ఈ రెండు సంస్థలు ఒ ఒప్పందానికి వచ్చి వ్యాపారాన్ని నియంత్రించేవి. ఈ రకంగా మొత్తం అమెరికన్ పరిశ్రమలలో మార్గాన్ కంపెనీ నియంతృత్వ అధికారాలు సంపాదించుకొన్నది. ఈ రకంగా ట్రస్ట్‌లు మామూలు వ్యాపారానికే నియమితంకాక రవాణా, టెలిఫోన్, టెలిగ్రాఫ్, రైల్వేల వంటి అత్యవస రంగాలకు కూడ ఎగబ్రాకడంతో పరిస్థితి శ్రుతి మించి రాగాన పడినట్లయింది. అత్యాశా పీడితులైన ట్రస్టీలు న్యాయాన్యాయలను విడి సమాజ భక్షకులుగా కావడమే దీనికి కారణం. వీరు గుత్త వ్యాపారం దైవ దత్తమని (Dilline ingout of monopoly) విశ్వసిం. అనేకమంది రాజులకంటె ఎక్కువగానే ప్రజలమీద తమ జులుం సాగించారు. దేశ చట్టాలను సమర్థంగా వ్యతిరేకించగలిగే ఇట్లాంటి పె వ్యాపారస్థులంతా ప్రభుత్వ చ్ఛాయలో, న్యాయస్థానాల తీర్పుచాటున తమలోపాలను కప్పిపుచ్చుకునేవారు.

## 11.5 ముగింపు :

ఈ విధంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1865-1900 సంవత్సరాల మధ్యకాలంలో భారీ పారిశ్రామికాభివృద్ధి వ్యాపార ప్రగతి జరగడంలో అమెరికా సంపన్న దేశంగా మార్పుచెందింది. దేశ ఆర్థిక ప్రగతితో ప్రజల జీవన ప్రమాణం, పెరిగింది. పారిశ్రామికాభివృద్ధి రక్షణ కల్పించిన ఫెడరల్ ప్రభుత్వం తర్వాత వ్యాపార గుత్తాదిపత్యముగల సంస్థలను, ట్రస్టులను అదుపులో పెట్టుటకు తగుచర్యలు తీసుకోవలసి వచ్చింది. పారిశ్రామిక ఉత్పత్తులకు విదేశీ మార్కెట్లు అవసరము గనుక అమెరికాకు విదేశాలతో వ్యాపారం సాగించుటతోబాటు వలసలను కూడా పొందవలెనను కాంక్ష బయలుదేరింది. పారిశ్రామికాభివృద్ధితోబాటు కార్మికుల సంఖ్య కూడా పెరిగింది. వారి సమస్య పరిష్కారం కొరకు వారు కార్మిక సంఘాలను ఏర్పరచుకొనుట జరిగింది. ఈ విధంగా భారీపరిశ్రమలు, వ్యాపారాభివృద్ధి వలన అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఆర్థిక ప్రగతిని సాధించి విదేశ వ్యాపారం సాగించుటకు గల అన్ని వనరులను సమకూర్చుకొనగల్గాయి.

## అభ్యాసాలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 60 వ్యాసరూప సమాధానాలు రాయండి

1. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1865 - 1900 సం॥ ల మధ్యకాలంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడిన అంశాలను వ్రాయండి
2. అంతర్యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారీ వ్యాపారాభివృద్ధి తెలుపండి.

## ఉపయుక్త గ్రంథాలు :


1. C.P. Hill - A History of the united States
2. Henry Bampord Parkes - The United States of America, A History
3. Samuel E. Momson & Henry Steel Commager - The Growth of the Amecican Repeblic Vol.2
4. తెలుగు అకాడమీ ప్రచురణ - అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర.



డా॥ ఎస్. గిరిజ

అసోసియేట్ ప్రొఫెసర్

ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్టణము

పాఠం - 12

# వ్యావసాయిక విప్లవము

## .1 లక్ష్యం :

19 వ శతాబ్ది రెండవ అర్థభాగంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామిక విప్లవమేగాక, వ్యావసాయిక విప్లవము కూడా ంభవించినది. ఈ వ్యవసాయిక విప్లవానికి దారితీసిన కారణాలు. వ్యవసాయదారులు సాగించిన ఉద్యమాలు పరిశీలించుటయే ఈ ఠం లక్ష్యం.

## షయ క్రమం


12.1 లక్ష్యం

12.2 వ్యవసాయిక విప్లవం.

12.3 వ్యవసాయిక విప్లవానికి దోహదపడిన కారణాలు.

12.3.1 పశ్చిమ దిశ విస్తరణ

12.3.2 నూతన వ్యవసాయ పరికరాలు

12.3.3 నూతన శాస్త్రీయ పద్ధతులు

12.3.4 ప్రభుత్వ ప్రోత్సాహము

12.3.5 వ్యవసాయక దారుల సమస్యలు

12.3.6 ప్రభుత్వ నిస్సహాయస్థితి

12.4 వ్యవసాయదారులు సాగించిన ఉద్యమాలు

12.4.1 గ్రేంజర్ ఉద్యమము

12.4.2 గ్రీన్‌బాక్ ఉద్యమము

12.4.3 వ్యవసాయదారుల సంఘములు

12.4.4 పాప్యులిజమ్ లేక పాప్యులిస్ట్ ఉద్యమం

12.4.5 రాజకీయాలలో ప్రవేశం

12.4.6 1893 నాటి ఆర్థిక మాంద్యము

12.4.7. విల్సన్ - గోర్హామ్ టారిఫ్ చట్టము

12.4.8 1896 అధ్యక్ష ఎన్నికలు

12.5 ముగింపు

## 12.2 వ్యవసాయక విప్లవం :

అంతర్యుద్ధానంతరం, ముఖ్యంగా 1860-1900 సంవత్సరాల మధ్య కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వ్యవసాయోత్పత్తులు అధికంగా పెరిగాయి. 1860 ముందు సాగుబడిలో ఉన్న భూములకంటె, 1900 సంవత్సరాల నాటికి సుమారు మూడు రెట్లు భూమి నూతనంగా సాగుబడిలోనికి వచ్చింది. అలాగే 1900 నాటికి సాలీనా 655 మిలియన్ల బుషెల్స్ గోధుమలు రెండున్నర బిలియన్‌ల బుషెల్స్ ధాన్యము, కోటిబేళ్ళ పత్తి అమెరికన్ క్షేత్రాలలో ఉత్పత్తి అయ్యాయి. ఇదే కాలంలో అమెరికా జనాభా రెండింతలయింది. వారి అవసరాలకు పుష్కలంగా సరిపోయే ఆహార వస్తువులు సమకూరడమేగాక, ఐరోపా మార్కెట్‌కు నిరంతరం సరఫరా చేసేటంతగా వ్యవసాయోత్పత్తి పెరిగింది.

## 12.3 వ్యవసాయిక విప్లవానికి దోహదపడిన కారణాలు :

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఈ వ్యావసాయక విప్లవం రావడానికి అనేక కారణాలు తోడ్పడ్డాయి, వాటిని పరిశీలిద్దాం.

**12.3.1. పశ్చిమదిశ విస్తరణ :** అమెరికన్లు పశ్చిమ దిశకు విస్తరించడంతో, అనేక నూతన భూములను పొంది, తమ అకుంఠిత కృషితో వానిని సాగుబడిలోనికి తెచ్చి గోధుమ, వరి ప్రత్తి మున్నగు పంటలనే గాక పశువులు, గొర్రెలు, పెంపకమును కూడా అభివృద్ధి పరచారు. అంతకు ముందు ఫసిపిక్ మహా సముద్రతీరం వరకూ విస్తరించిన నూతన భూభాగంలోని మైదానాలు కొండ లోయలు. సాగుబడికి అత్యంత ఉపయుక్తాలుగా వుండేవి. గోధుమ, ప్రత్తి వరి మొదలైన వ్యావసాయక ఉత్పత్తులకు 1860 వరకు తూర్పున ఉన్న ఇల్లినాయ్, ఇండియానా, విస్కాన్సిన్, ఒహైయో వర్జీనియా రాష్ట్రాలు అగ్రశ్రేణిలో ఉండేవి. క్రమంగా గోధుమ పంట ఒహైయోనది వెంటనే విస్తృతిపొంది, మిస్సోరి లోయలో ప్రవేశించి, పశ్చిమానికి పాకింది. తత్ఫలితంగా ఇరవయ్యో శతాబ్దారంభం నాటికి పశ్చిమ రాష్ట్రాలు వ్యవసాయోత్పత్తులలో ఆధిపత్యం పొందాయి.

**12.3.2 నూతన వ్యవసాయ పరికరాలు :** వ్యవసాయంలో ఇంతటి గణనీయ మార్పు రావడానికి కేవలం నూతన ప్రదేశాలు సాగులోనికి తేవడమేగాక, సేద్యంచేసే విధానంలో నూతన శాస్త్రీయ పద్ధతులు, వ్యవసాయక యంత్రవనరులు, ప్రవేశ పెట్టడం వలన కూడా సాధ్యమైనది. 1800 నాటికే కార్ఖానాలలోను, గనులలోను పనిచేసే కార్మికులు తమ తండ్రి, తాతలకు తెలియని పరికరాలను ఉపయోగించడం మొదలెట్టారు. కాని అప్పటికే వ్యావసాయదారులు ఎంతో కాలంనుండి వాడుతున్న గుర్రంగాని, ఎద్దుగాని లాగే కొయ్యనాగలినే వాడుతుండేవారు. నారు నాటడం, కలుపుతీయడం వంటి పనులన్నీ చేతితోనే జరిగిపోయేవి. వ్యవసాయం బాగా ప్రయాసతోటి కూడుకున్నది కనుక ఆ రోజులలో రైతు బాగా శ్రమించినా ఎనిమిది, పది ఎకరాలకంటే భూమి సాగయ్యేది కాదు. ఇలాంటి పరిస్థితులలో ఎలీవిట్నీ 1793 లో ప్రత్తినుండి గింజలు వేరు చేయు యంత్రాన్ని (Cotton gin) కని పెట్టాడు. 1797 లో మేలైన మొదటినాగలికి పేటెంటు తీసుకోవడం జరిగింది. అయినా దానికి ఎన్నో మార్పులు అవసరమైయ్యాయి. 1837 లో జాన్ డీరీ తయారు చేసిన నాగలి బహు ప్రజాదరణ పొందింది. 1855 లో జేమ్స్ ఆలివర్ తయారు చేసిన ఉక్కు కవచమున్న నాగలి బాగా పేరు పొందింది. 1860 తర్వాత ఈ నాగలికి (Chilled Plough) గిరాకి ఎక్కువైంది. అదే విధంగా 1860 నాటికి పంటను కోయు యంత్రాలు విస్తృతంగా వాడుకలోనికి వచ్చాయి. దీనితోబాటే నూర్పిడి యంత్రాలు కూడా అన్ని హంగులతో తయారైయ్యాయి. 1880 తర్వాత తయారైన యంత్ర సాయంతో కోతకోయడం, సంటమార్చడం, తూర్పార బట్టడం, బస్తాలకెత్తడం కూడా వెంట వెంటనే జరిగే అవకాశమేర్పడింది. ఈ విధంగా అనేక యంత్రాలు వ్యవసాయంలో ఉపయోగింపబడ్డాయి.

క్రమంగా వెన్న తీయుటకు ధాన్యం పొట్టుతీయుటకు, ఎరువులు చల్లుటకు మొదలైన వ్యవసాయ పనులకు అనేక యంత్రాలు వాడుకలోనికి వచ్చి కృషీవలుల పనులు సులభతరం చేశాయి. అంతకు ముందు మూడు వందల మంది చేసే పనిని, నలుగురు వ్యక్తులే ఎంతో తేలికంగా, చేసే అవకాశం కల్గింది. అంతేగాక యంత్రాలు నడుపుటకు ఆవిరి, పెట్రోలు, విద్యుచ్ఛక్తి వాడుకలోనికి వచ్చిన తర్వాత, ఎన్నో బీడు పడిన భూములు సస్యశ్యామలంగా పైరు పంటలతో కళకళలాడసాగాయి.

**12.3.3 నూతన శాస్త్రీయ పద్ధతులు :** ఈ యంత్రాలకు తోడు, భూసారం త్వరగా తగ్గిపోకుండా శాస్త్ర పరిశోధనలు చేసి, తగిన ...్యలు తీసుకోవడం మొదలైంది. శాస్త్రీయ పరిశోధనలు పెంపొందడంతో, కొత్త కొత్త వృక్షాలను, హైబ్రిడ్ మొక్కలను పెంచడం, వేర్వేరు పంటలను మార్చి, మార్చి పండించడం (rotation of crops) తద్వారా భూసారాన్ని పెంచడం, పశుగణాభివృద్ధి మొదలైన నూతన శాస్త్రీయ ...ద్ధతులనెన్నింటినో చేపట్టారు. ఈ నూతన సాధనాలను అధికంగా తూర్పున ఉన్న చిన్న వ్యవసాయ క్షేత్రాలలోనివారు ఉపయోగించు ...కోలేక పోయారు. కాని పడమరకు పోయిన కొద్దీ వీటి ఆవశ్యకత నానాటికి వృద్ధిపొందింది. వ్యవసాయంలో నాణ్యతగల విత్తనాలు, కొత్త కొత్త ...ద్ధతుల వలన అభివృద్ధిని సాధించ గలిగారు.

**12.3.4 ప్రభుత్వ ప్రోత్సాహము :** 1862లో వ్యవసాయ శాఖను (Dept of Agriculture) స్థాపించారు. కాంగ్రెస్ మొదట్లో ...ులియన్ డాలర్లను వ్యవసాయ పరిశోధనకు కేటాయించింది. వ్యవసాయభివృద్ధికి, ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాలు గైకొనిన చర్యలు సైతము ...్రోహదం చేశాయి. 1862 మోరిల్ వ్యవసాయ కళాశాలలు స్థాపించబడ్డాయి. 1887లో హచ్ (Hatch) చట్టము ద్వారా ప్రతిరాష్ట్రంలో ...్యవసాయ పరిశోధనా కేంద్రాలు నెలకొల్ప బడ్డాయి. ఈ నూతన పరిశోధన వలన, ప్రభుత్వ ప్రోత్సాహం వలన శాస్త్ర వేత్తలు, అమెరికన్ ...ేలకు, వాతావరణానికి సరిపడు క్రొత్త రకమైనమొక్కలను, తెగుల నివారణకు మందులును కనుగొన్నారు. అంతేగాక భూసార పరిరక్షణను, ...ూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించసాగారు. ఈ నూతన పద్ధతులనన్నింటినీ వ్యవసాయదారులకు తెలియపర్చారు. ఈ రకంగా ...్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి.

**12.3.5 వ్యవసాయదారుల సమస్యలు :** అమెరికన్ కృషీవలుడు ఒక్కొక్క సంవత్సరము గడిచే కొద్దీ కొత్త భూములను, పాత ...ాములను కూడా పూర్వం కంటె మిన్నగా సేద్యంచేసి ఎక్కువ పంటను పండించ సాగాడు. అతని పరిశ్రమకు, తెలివికి, సాధనా సంపత్తికీ, ...్యాపార సౌలభ్యానికి అతను ఎంతో సుఖసంతోషాలు పొందవలసింది. కాని ఒక శతాబ్దకాలం. అమెరికాలో వ్యవసాయం అభివృద్ధి చెందిన ...ర్వాత కూడా అతనికి కష్టాలు తప్పలేదు. అక్కడి వ్యావసాయ సమస్యలు బాగ క్లిష్టమైనవి కావడమే దీనికి కారణము, దక్షణాది ...్యవసాయదారులకు. డెయిరీ వ్యాపారస్తులకు, పశుపోషకులకు, పంటతోటల పెంపకం దార్లకు సంబంధంచిన ఈ సమస్యలు బహువిధములుగా ...ుండేవి. ఒకప్పుడు అవి రైలు రవాణా సమస్యలుగా తలెత్తితే, మరొకప్పుడు ద్రవ్యోల్బణ సమస్యగా ఉండేవి. అంతేగాక ప్రభుత్వ భూపాలనా ...ిధానం, అంతర్ రాష్ట్రీయ విభేదాలు, రాజకీయ కక్షల వ్యూహరచనలు మాత్రమేగాక అంతర్జాతీయ సంబంధాలు కూడా ఒక్కొక్కప్పుడు ...ైతుల పరిస్థితిని తారుమారు చేసేవి. దక్షిణాది భూములలో, ఎక్కువగా వ్యాపారపంటలైన ప్రత్తి, పొగాకు వేయడంలో భూసారం బాగ ...్తింది. తరచుగా వస్తున్న అనావృష్టివలన, మైదానాలలో సాగే వ్యవసాయం బాగ సన్నగిల్లింది. 1859-60 సంవత్సరాల మధ్యకాలంలో ...దహారు నెలలపాటు వర్షాభావం వలన కాన్సాస్ నెబ్రాస్కా రాష్ట్రములు తీవ్ర అనావృష్టికి గురైయ్యాయి. అంతేగాక 1886-90 సంవత్సరాల ...ధ్యకాలంలో కాటక పరిస్థితులెదురైయ్యాయి. అతి భయంకరమైన హిమ ఝంఝుం (blizzards) ల వల్ల పర్వతాలలోనూ, విశాల ...ైదానాలలోను ఉండే పశుసంపద తుడిచి పెట్టుకొని పోయేది. అంతేగాక క్రిమికీటకాదుల వలన కూడా వ్యవసాయానికి చాల నష్టం ...ిగ్గింది. 1892 వ సంవత్సరములో పత్తి పంటకు పురుగుపట్టి పత్తి పండించే ప్రాంతాన్నంతా నాశనం చేసింది. ఈ పురుగువలన పత్తిపంట ...ానికిపైగా నష్టమైంది. ఈ తెగులును అరికట్టడానికి అత్యంత విషపూరితమైన క్రిమికీటకాదులను వాడవలసి వచ్చింది. అంతేగాక 1874 ...ుండి అప్పుడప్పుడు వచ్చే మిడతల దండు వల్ల కూడా అపారనష్టం సంభవించింది.

**12.3.6 ప్రభుత్వ నిస్పృహాయస్థితి :** వ్యవసాయదారులకు, రైలురోడ్లు మిగిలిన ఇతర పారిశ్రామికులవలె, కాంబినేషన్లు, ట్రస్ట్‌లు లేవు. ...దేశ మార్కెట్లలో వ్యవసాయ ప్రగతిని సాధించిన రష్యా, కెనడా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా మున్నగు ఇతర దేశాలతో వీరు పోటీకి నిలువలేకుండే ...రు. రక్షణ సుంకము వలన ఎగుమతులు తగ్గి అమెరికన్ కృషీవలులు తమ ఉత్పత్తులను అమెరికానందే అమ్ముకొనవలసివచ్చేది. ...ాము పండించే గోధుమ, ప్రత్తి మొదలైన ఉత్పత్తులకు ధరలు విదేశాలలో నిర్ణయంకావడం చేతనూ, తాము కొనవలసిన అవసరవస్తువుల ...ూల్యము రక్షణ సుంకాల ప్రాపుగాంచిన ట్రస్ట్‌ల వల్ల మిన్నంటేటట్టు పెరగడంవలన రైతులస్థితి దీనంగా మారింది. పంటల ధరలు 19 వ ...తాబ్ది చివరి ఇరవై సంవత్సరాలలో దారుణంగా పడిపోయాయి. 1870 ప్రాంతంలో గోధుమలు ఒక డాలరుకు ఒక బుషెల్ చొప్పున ...మ్మగా 1890 సంవత్సరంలో 63 సెంట్లకు వాటి ధర పడిపోయింది. 1873లో పౌను 17 సెంట్లు అమ్మే ప్రత్తి 9 సెంట్లకు, చివరకు 6 సెంట్ల

వరకు పడిపోయింది. ఇదేవిధంగా ఓట్సు (oats) ధాన్యము, బార్లీ, పొగాకు మున్నగు పంటలన్నింటి ధరలు కూడా బాగాతగ్గాయి. దీని ఫలితంగా భూముల ధరలు కూడా విపరీతంగా తగ్గాయి. ఈ రకంగా 1880 నాటికి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గడంతో రైతుల బాధలకు అంతులేదు. కరువు కాటకాలవల్ల రైతులు ఋణాలకోసం వడ్డీ వ్యాపారస్థుల దగ్గరికో, బ్యాంకు ఏజెంట్లు దగ్గరికో వెళ్తే 8 డాలర్ల నుండి 20 డాలర్ల వరకు వడ్డీ చెల్లింపవలసి వచ్చేది. ఒక్కొక్కసారి 40 డాలర్ల వరకు కూడా వడ్డీ వేసేవారు. ఈ ప్రతికూల వాతావరణంలో అమెరికన్ రైతుల స్థిరచరాస్థులన్నీ తనఖా వడ్డీ వ్యాపారస్థుల పరం కావడం మినహా గత్యంతరం లేక పోయింది. రైతులు కొనే వస్తువులన్నీ ట్రస్టులచే ఎక్కువ ధరలకు అమ్మబడేవి. వాళ్ళు ఉపయోగించే యాంత్రిక పరికరాలన్నీ మార్కెట్‌లో 'మెక్ కార్మిక్ హార్‌వెస్టర్ కంపెనీ ఆఫ్ చికాగో'' ఆధీనంలో ఉండేవి. అంతేగాక రైల్వే కంపెనీలు రైతులనుండి అత్యధిక రేట్లను వసూలు చేసేవారు.

రైతులు తమ దుస్థితిని రూపుమాపుకొనుటకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సహాయం అడిగే అవకాశం కూడా లేకపోయేది. దేశజనాభాలో సగభాగం రైతులే అయినా ఆనాడు వారి నుండి ఎవరినీ కాంగ్రెస్‌కుకాని, రాష్ట్ర శాసనసభకు గాని సభ్యులుగా ఎన్నుకోవడం జరగలేదు. 1890 ప్రాంతంలో వ్యవసాయ ప్రతినిధులైన సెనేటర్ పెఫర్ కాంగ్రెస్ సభ్యుడు, జెర్రీ సింప్సన్‌లు వాషింగ్టన్‌కి వెళ్ళినప్పుడు వాళ్ళని అడవిమృగాలవలె చూడసాగారు. శాసన నిర్మాతలుకూడా పారిశ్రామికవేత్తల, రైలురోడ్ల నిర్మాతల, బ్యాంకర్ల అవసరాలను గుర్తించినట్లు, వ్యవసాయదారుల కష్టాలను గుర్తించలేకపోయారు. ట్రస్ట్‌లపైన రైలు రోడ్డు కంపెనీల మీద ఆంక్షలు విధింపవలెనని చేసిన చట్టాలన్నీ ఏదో ఒకవిధంగా నిరర్థకమయ్యాయి. అంతేగాక వ్యవసాయదారులకు సహాయంచేయవలెనని నిర్దేశించిన 'హోమ్‌స్టడ్' చట్టం రైతులకు ఆశాభంగం కల్గించింది.

## 12.4 వ్యవసాయదారులు సాగించిన ఉద్యమాలు

ఇట్టి నిస్సహాయస్థితిలో వ్యవసాయదారులు తమ సమస్యలను పరిష్కరించుకొనుటకు సమైక్యమై ఉద్యమాలను సాగించారు. అట్టివానిలో ప్రముఖమైనవి 1. గ్రేంజర్ ఉద్యమము 2. గ్రీన్‌బాక్ ఉద్యమము 3. పాప్యులిజమ్ లేక పాప్యులిస్ట్ ఉద్యమము.

**12.4.1 గ్రేంజర్ ఉద్యమము :** పారిశ్రామికులు, బ్యాంకర్లు శ్రామికులు ఐక్యమైనట్లే వ్యవసాయదారులు కూడా ఏకమై పరిస్థితులను ఎదుర్కోవలెననే నిర్ణయానికి వచ్చారు. 1867 లో వ్యవసాయ దారుల దీనావస్థను కనులారాగాంచి వారినుద్ధరించుటకు, వాషింగ్టన్‌లో గవర్నమెంటు గుమస్తాగా పనిచేసే ఆలివర్ హడ్సన్‌కెల్లీ, కొద్దిమంది స్నేహితులతో కలసి 'రైతుపోషకులు' (Patrons of husbandry) అనే ఒక సంస్థను నెలకొల్పాడు. దీని స్థానిక అంగాలనే 'గ్రేంజ్‌లు' అనేవారు. వీరుసాగించిన కృషి 'గ్రేంజర్ ఉద్యమంగా' పేరుగాంచింది. ఈ గ్రేంజ్, వ్యవసాయంలో శాస్త్రీయపద్ధతులను గూర్చి తెలియజేయుటకై స్థాపించబడింది. కాని తర్వాత ఈ గ్రేంజ్ రైతులు తాము ఎదుర్కొంటున్న ఆర్థిక బాధలు, రైలు రోడ్ల కంపెనీల వలన వారికి జరుగుతున్న అన్యాయం వెలిబుచ్చుకోవడానికి బాగ ఉపయోగించింది. 1874 వ సంవత్సరం నాటికి ఈ సంస్థలో 7,50,000 మంది సభ్యులు చేరారు. గృహావసరాలు, నిత్యకృత్యాలలో అవసరమయ్యే వస్తు సామగ్రినుండి, వృత్తుల కవసరమైన పరికరాలవరకు చౌకగా అందచేసే బాధ్యతను ఈ గ్రేంజర్లు వహించారు. వ్యవసాయ క్షేత్రాలు స్వయంపోషకాలుగా, స్థిరపడటమే వీరి యొక్క ముఖ్య లక్ష్యంగా భావించి పనిచేయసాగారు. తూర్పు రాష్ట్రాలలో ఒక సాధారణ సంస్థగా ప్రారంభమైన ఈ గ్రేంజ్ 1869 సంవత్సరానికి పడమరకు కూడా విస్తరించి, 1873 నాటికి బాగా వ్యాప్తిలోనికి వచ్చింది. దళారుల అక్రమలాభాలను అరికట్టడానికి గ్రేంజర్లు, ఎన్నో సహకార సంస్థలను, చౌకదుకాణములను స్థాపించారు. కాని వీటి నిర్వహణలో అనేక అవకతవకలు జరగడం వలన ఇవి అంతగా రాణించలేదు. ఈ గ్రేంజర్లు రాజకీయాలకు అతీతంగా ఉండవలెనని ప్రయత్నించినా చాలమంది సభ్యులు వ్యక్తిగత హోదాలో రాజకీయములలోనికి ప్రవేశించడం మొదలుపెట్టారు. ఈ వ్యక్తులు కొన్ని రాష్ట్రాలలో మిశ్రమ ప్రభుత్వాలను కూడా ఏర్పరచగలిగారు. వీరు రైలు కంపెనీలు, సరకు రవాణా సంస్థలు చేసే అక్రమాలను అరికట్టుటకై కొన్ని శాసనాలు చేసి రైతులకు న్యాయాన్ని చేకూర్చారు. ఈ చట్టాలకే 'గ్రేంజర్ చట్టాలు' అని పేరు వచ్చింది. వీటిని అమలు కాకుండా చేయాలని కొందరు న్యాయస్థానాలలో వ్యతిరేక దావాలు నడిపించారు. 1876 లో మన్ (Munn) కి ఇలినాయ్ రాష్ట్రానికి మధ్య నడిచిన దావాలపై సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ అవసరమైనప్పుడు ప్రభుత్వం దండనీతిని ఉపయోగించ వచ్చునన్నారు. దీనివలన గ్రేంజర్ పలుకుబడి క్రమంగా తగ్గడం ప్రారంభమైంది. 1874 లో 20 వేల దాక ఉన్న గ్రేంజ్‌ల సంఖ్య 1880 నాటికి నాలుగు వేలను పడిపోయింది. ఈ విధంగా సుప్రీంకోర్టు తీర్పువలన. రాజకీయములలో

పాల్గొనుట వలన, తాము నిర్వహించు సహకారసంస్థలలో అవకతవకల వలన, ట్రస్టుల వ్యతిరేకత వలన 1880 నాటికి గ్రేంజర్ ఉద్యమం దాదాపు నశించింది.

**12.4.2 గ్రీన్‌బాక్ ఉద్యమము :** గ్రేంజర్ ఉద్యమం తర్వాత కృషీవలుల సమస్యలను తీర్చుటకు పాటుబడినది 'గ్రీన్‌బాక్ ఉద్యమము' ఈ గ్రీన్‌బాక్ పార్టీ 1876లో గ్రాంట్ అధ్యక్షుడుగా తీసుకున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడింది. 1878 లో ఈ గ్రీన్‌బాక్ పార్టీవారు మిలియన్ ఓట్లు సంపాదించారు. అంతేగాక 15 మంది కాంగ్రెస్ సభ్యులను ఎమ్మకోవడంతో ఈ ఉద్యమం పతాకస్థాయిని చేరుకుంది. ధరలు ఎక్కువగా పెరగడానికి కారణం, ధనం తగినంత చెలామణిలో లేకపోవటమేనని వీరు భావించారు. అందుచేత అధిక ధనం చెలామణిలో పెట్టవలెనని వీరి ఆందోళన, వడ్డీరేటును, పన్నుల భారాన్ని కూడా తగ్గించాలని వీరుకోరారు. 1867 నుంచి 1872 వరకు ఈ సంస్థ తూర్పు కార్మికుల ఆధిపత్యంలో ఉంటే, తర్వాత వ్యవసాయదారుల నాయకత్వంలోనికి వచ్చింది. 1880 లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో గ్రీన్‌బాక్‌లు జేమ్స్.బి.వీవర్‌ను తమ అభ్యర్థిగా నిలబెట్టారు. అతనికి మూడులక్షల ఓట్లుమాత్రమే వచ్చాయి. కాని 1879 లో రొక్కపు వ్యాపారము (Specie payment) పునఃప్రారంభం కావటంవలన, 1880 లో ధాన్యము ధరలు పెరుగుటవలన ఈ ఉద్యమం ప్రభావము తగ్గి, 1888 వ సంవత్సరానికి దాదాపు అంతరించిందని చెప్పవచ్చు. కాని ఈ ఉద్యమం కూడా కొంతమటుకు రైతుల స్థితిగతులను బాగు పరచుటకు ప్రయత్నించింది.

**12.4.3 వ్యవసాయ దారుల సంఘములు :** గ్రేంజర్, గ్రీన్‌బాక్ ఉద్యమాలు వెనుక బడడంతో కొత్త సంస్థలు తలెత్తాయి. వ్యవసాయదారుల సంఘాలు విరివిగా ఏర్పడ్డాయి. వీటిలో ముఖ్యమైనది 'నేషనల్ ఫార్మర్స్ అలయన్స్' దీనినే ఉత్తరాది కూటమి (Northern Alliance) అని పిలిచేవారు. దీనిని 1880 సంవత్సరము నుండే మిల్టన్ జార్జ్ చికాగో నుంచి నడపసాగాడు. 1875 నుండే టెక్సాస్ రాష్ట్రంలో గుర్రాల దొంగలను పట్టుకోవడానికి, కట్టడిలేక తిరిగే పశువులను పట్టుకోవడానికి 'దక్షిణాది కూటమి' పనిచేయ సాగింది. దీనిలోని సభ్యులు కొన్ని రహస్య సంకేతాలను ఉపయోగించేవారు. దీనిలో నీగ్రోలకు స్థానంలేదు. 1886 వరకు ఈ సంస్థ బాగా అభివృద్ధి పొందింది. తర్వాత డా॥ సి. డబ్ల్యు. మేకూనీ (Dr. C.W. Macune) వంటి సమర్థవంతులైన నాయకులవలన దక్షిణాదికంతా పాకింది. నీగ్రో వ్యవసాయదారులు కూడా ఇలాంటి జాతీయ కూటమిని ఏర్పరచుకున్నారు. దీనినే 'కలర్డ్ ఫార్మర్స్ నేషనల్ అలయన్స్' అనేవారు. దీనిలో ఒక మిలియన్ సభ్యులు చేరారు. వెండి సరఫరా ధారాళంగా ఉండవలెనని, రైలురోడ్ల ఆధిపత్యం ప్రభుత్వం చేతిలోనే ఉండవలెనని వీరు ఆందోళన చేయసాగారు. ఈ కాలంలోనే వ్యవసాయ దారులు పశ్చిమంలో కూడా ఆందోళన చేయసాగారు.

**12.4.4 పాప్యులిజమ్ లేక పాప్యులిస్ట్ ఉద్యమం :** వ్యవసాయదారుల కూటమి సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉండవలెనని ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. ఫ్లొరిడా కూటమి వారు జాతీయబ్యాంకులు రద్దు కావలెనని, సబ్ ట్రెజరీలు ఏర్పాటు చేయవలెనని వాంఛించారు. 1890 లో జరిగిన ఎన్నికలలో దక్షిణాది కూటమికి చెందిన వారెందరో స్థానిక పార్టీల సహకారంతో అధికార పదవులను ఆక్రమించారు. ఆ ఎన్నికలలో 53 మంది కాంగ్రెస్ సభ్యులు కూడా ఎన్నికైనారు. ఈ దక్షిణాది కూటమి ఎనిమిది రాష్ట్రశాసన సభలలో ఆధిపత్యం వహించడమేగాక, ఈ కూటమికి చెందిన ఆరుమంది గవర్నర్లుగా ఎన్నికైయ్యారు. వ్యవసాయదారుల అకుంఠిత అభిమానమే ఈ విజయానికి కారణము. ఈ విధంగా వ్యవసాయదారుల సంఘాలు గోధుమ పండించే కాన్సాస్, నెబ్రాస్కా, మిన్నెసోటాలలో బాగా అభివృద్ధి చెందాయి. 1880 లో నేషనల్ ఫార్మర్స్ అలయన్స్' ప్రారంభమై 1887 కంతా బాగా అభివృద్ధి చెంది దేశంలోని రాజకీయ ఆర్థిక విధానాలలో మార్పురావలెనని పోరాడింది. వీరి సమావేశాలను అయోవాకు చెందిన జేమ్స్. బి. వీవర్, విలియమ్ ఎ. పెఫర్, జెర్రీసింప్సన్, కాన్సాస్‌కు చెందిన మేరీ ఎలిజబెత్ లీజ్ మున్నగువారు నిర్వహించేవారు. 1890 నాటికి 9 మంది కాంగ్రెస్ సభ్యులు ఎన్నుకోబడటమేగాక ఈ కూటమి పశ్చిమరాష్ట్రశాసన సభలలో ఆధిపత్యం సంపాదించేటంత ప్రబలశక్తిగా రూపొందింది.

ఈ విజయాలచేత ఉత్తేజితులైన పశ్చిమోత్తర సమాఖ్యావారు తాము అంతవరకు పడిన శ్రమ అంతా వృధా అయిందని, కాబట్టి తమ లక్ష్యసాధనకు రాజకీయాలు అవసరమని తీర్మానించారు. కాన్సాస్ రాష్ట్రము ముందుకొచ్చి జూన్ 1890 లో కొంతమంది వ్యవసాయదారులు, కార్మిక నాయకులు కలసి రాష్ట్ర పీపుల్స్ పార్టీని స్థాపించారు. 1890 ఎన్నికలలో ఈ పార్టీ పేరున అయిదుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒక

సెనేటరు ఎన్నికైయ్యారు. నెబ్రాస్కా రాష్ట్ర ఉభయ శాసన సభలలో వీరికే ఆధిపత్యం వచ్చింది. దక్షిణ డకోటా ఒక సెనేటరును వీరి పక్షంగా ఎన్నుకొంది. క్రమంగా దక్షిణాదిలో కూడా ఈ పార్టీ బలం పుంజుకున్నది. ఈ రకంగా అభివృద్ధి చెందిన తర్వాత వ్యవసాయదారులు ఒక నూతన జాతీయ పార్టీని స్థాపించాలనుకున్నారు. పశ్చిమంలోని వ్యవసాయదారులు, దక్షిణాది కూటమిలోని వ్యవసాయ దారులతో కలసి పోవాలనుకున్నారు. కాని దక్షిణాది కూటమివారు డెమొక్రటిక్ పార్టీతో కలసి పనిచేయడంతో అదికుదరలేదు. కాబట్టి ఈ కొత్త పార్టీ ఎక్కువగా పశ్చిమంలోని వ్యవసాయదారులు, కొంతమంది దక్షిణాది నాయకులైన **టామ్ వాట్సన్** మున్నగు వారితో స్థాపించబడింది. ఈ పార్టీ 1891లో లాంఛన ప్రాయంగా సిన్సినాటి వద్ద 'పీపుల్స్ పార్టీ' అనే పేరుతో **ఏర్పడింది.** దీని సభ్యులనే పాప్యులిస్టులని పిలిచేవారు. అంతకు ముందు నైట్స్ ఆఫ్ లేబర్, గ్రీన్ బాక్ మున్నగు వాటిలోని సభ్యులు తర్వాత **ఈ పీపుల్స్**పార్టీలో చేరారు.

**12.4.5 రాజకీయాలలో ప్రమేయము** : పీపుల్స్ పార్టీవారు 1892 లో నెబ్రాస్కాలోని ఒమాహాలో ఒక రాజకీయ మహాసభను జరిపి దానిలో అనేక సంస్కరణలు ప్రతిపాదించి వాటిని సాధించుటకు కృషి చేస్తామని వాగ్దానం చేశారు. పాపులిస్టుల ఆశయాలలో ముఖ్యమైనవి సెనేట్ సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకొనుట, రిఫరెండమ్, ఇనీషియేటివ్ మున్నగు ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులను ప్రవేశ పెట్టుట, రైల్వేలు, తంతి తపాలా మున్నగునవి ప్రభుత్వ అజమాయిషీనందుంచుట; గ్రాడ్యుయేటెడ్ ఆదాయపు పన్ను కార్మికుల పనిగంటలను తగ్గించుట, ధాన్యమును కుదువ పెట్టుకొని తక్కువ వడ్డీ రేటుకు రైతులకు ఋణములిచ్చుట మున్నగునవి. ఇంకను 16:1 నిష్పత్తిలో బంగారము, వెండి నాణాలు ధారళంగా లభించేటట్లు చేయవలెనని, తలసరి 50 డాలర్లకు తగ్గకుండా ద్రవ్యం చలామణిలో ఉండవలెనని, ప్రభుత్వం డబ్బును పొదుపుగా వాడవలెనని, పోస్టల్ మదుపుకు అనువు కల్పించవలెననీ వీరు ఆశించారు. ఈ ఆశయాల కృషికి వీరు దశాబ్దంపాటు శ్రమించారు. ఎన్నికలముందు వీరి నాయకుడైన పోలక్ మరణం వీరికి ఎంతో నష్టాన్ని కల్గచేసింది. వీరు 1892 లో ఒమాహావద్ద జరిగిన సభలో జేమ్స్, బి. వీవర్‌ను అధ్యక్షపదవికి నామినేట్ చేశారు. వీవర్ అంతకుముందు అంతర్యుద్ధంలో జనరల్‌గా పనిచేశాడు. ఉపాధ్యక్ష పదవికి జనరల్ జేమ్స్‌ఫీల్డ్‌ను పాప్యులిస్ట్‌పార్టీ తరపున పోటీ చేయించాడు. క్లీవ్‌లాండ్ డెమొక్రటిక్ పార్టీ తరపున, హారిసన్ రిపబ్లికన్ పార్టీ తరపున పోటీచేశారు. వీవర్‌కు మిలియన్ ఓట్లకు పైగా వచ్చాయి. ఈ విధంగా అంతర్యుద్ధం తర్వాత పాప్యులిస్టులు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మూడో పార్టీని ఏర్పాటు చేసిన ఘనతను పొందారు.

**12.4.6. 1893 నాటి ఆర్థిక మాంద్యము** : క్లీవ్‌లాండ్ 1892 అధ్యక్ష ఎన్నికలలో విజయం సాధించాడు. ఎంతో ఉత్తముడని పేరు పొందిన క్లీవ్‌లాండ్ అతి సామాన్యుడైన విద్యావంతుడు. ఈయన 1893 లో రెండోమారు అధ్యక్షునిగా పదవి స్వీకరించిన సంవత్సరము అమెరికాలో ఆర్థిక మాంద్యం ఏర్పడింది. 15వేల వ్యాపార సంస్థలు దివాలా తీశాయి. కార్ఖానాలు గనులు మూతపడటంతో వేలాది కార్మికులు తమ జీవనభృతి కోల్పోయారు. పశ్చిమ రాష్ట్రాలలో ధాన్యం పంట తగ్గి, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోవడంతో కటకట ప్రారంభమైంది. నాలుగు సంవత్సరాల వరకు పరిస్థితి మెరుగు పడలేదు క్లీవ్‌లాండ్ అభిప్రాయం ప్రకారం 1890లో ఆమోదింపబడిన 'షెర్మన్ వెండి ఖరీదు చట్టము' ఈ ఆర్థిక మాంద్యమునకు మూలకారణము. అమెరికాకు పట్టిన ఈ దుస్థితిని తొలగించుటకై క్లీవ్‌లాండ్ వెండి ఖరీదు చట్టాన్ని రద్దు చేయడానికి నిశ్చయించాడు. దాని స్థానంలో స్వర్ణ ప్రమాణాన్ని పాటించవలెనని ఇతని నిర్ణయం. కాని దీనిని రజిత ప్రమాణ వాదులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ సమస్యను పరిష్కరించుటకు క్లీవ్‌లాండ్ 1893లో ప్రత్యేక కాంగ్రెస్ సమావేశాన్ని ఏర్పరిచారు. ఈ చర్య డెమొక్రటిక్ పార్టీలో విభేదాలను ఎక్కువ చేసింది. అంతేగాక తాను ఆశించినంత ఫలం కూడా అందలేదు. ఖజానాలో ఉన్న బంగారం రాను రానూ తరుగుతూ వచ్చింది. స్వర్ణ విలువల లోటును భర్తీ చేయడానికి క్లీవ్ లాండ్ ప్రత్యేకమైన బాండ్లను జారీ చేసి వాటిని బంగారానికి అమ్మవలసిన పరిస్థితి ఏర్పడింది. అప్పటికే కావలసినంత బంగారం లభ్యంకాకపోగా, క్లీవ్‌లాండ్ మార్గన్ తదితర బ్యాంకింగ్ హౌస్‌ల నుండి బంగారం కొన్నాడు. బ్యాంకర్లు ఈ జాతీయ సమస్యకు సాయం చేయడంలో 70 లక్షల డాలర్ల కమిషన్ పొందారు. ఈ చర్యను పాప్యులిస్టులు కూడా విమర్శించారు.

**12.4.7. విల్సన్ గోర్మన్, టారిఫ్ చట్టము** (Wilson-Gorman Tariff Act) : క్లీవ్‌లాండ్ దక్షిణ సుంకాల సమస్యను పరిష్కరించడంలో కూడా విఫలుడైనాడు. 1890 లో పరిశ్రమలకు అధిక రక్షణ కల్పించే ఉద్దేశంతో, మెకెన్లీ చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1894 లో విల్సన్ - గోర్మన్ చట్టం ప్రవేశ పెట్టబడింది. పరిశ్రమలకు అత్యంత ఆవశ్యకమైన మూల ద్రవ్యాలపై సుంకాలు తగ్గించే ఏర్పాటు ఈ చట్టం కల్పించింది.

అంతేగాక నాలుగువేల డాలర్ల సాంవత్సరిక ఆదాయం ఉన్న వారిపై నూటికి రెండు డాలర్ల చొప్పున ఆదాయపు పన్నును ఈ చట్టం ప్రవేశ పెట్టింది. ఈ చర్యను కొంతమంది 'సోషలిస్ట్ కమ్యూనిస్ట్' చర్యగా వర్ణించారు. గోర్మాన్ వంటి నాయకులు ఈ చట్టానికి 634 సవరణలు ప్రతిపాదించారు. చివరకు తన సంతకం పెట్టకుండానే, క్లీవ్‌లాండ్ ముసాయిదాను చట్ట బద్దం చేశాడు. తన డెమొక్రటిక్ పార్టీవారే చట్టము ఇలాంటి దుర్దశకు మారడానికి కారణమని క్లీవ్‌లాండ్ ప్రకటించాడు. కనీసం ఆదాయపు పన్నుకు సంబంధించిన భాగమైనా ఉందనుకుంటే సుప్రీంకోర్టు దానిని కొట్టి వేసింది. కోర్టు ఇచ్చిన ఈ నిర్ణయాన్ని అధ్యక్షుడు, పాప్యులిస్టు పార్టీవారేకాక బీద ప్రజానీకం కూడా దుయ్యబట్టారు. ఈ రకంగా న్యాయ స్థానం ధనిక వర్గంవారివైపే ఉంటుందని అనడానికి ప్రజలకు మంచి అవకాశం కల్గింది. అంతేగాక 1894లో జరిగిన పుల్‌మన్ సమ్మెను అణచి వేయడానికి కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని మొట్ట మొదటిసారి ఉపయోగించడం కూడా పాప్యులిజం పటిష్టమవడానికి దోహదం చేసింది.

**12.4.8. 1896 అధ్యక్ష ఎన్నికలు :** ఆనాటి ఆర్థిక పరిస్థితిని సామాన్య ప్రజల దైన్య స్థితిని వివరిస్తూ, పడమటి ప్రాంతానికి చెందిన విలియమ్ హార్వే తాను రాసిన పుస్తకం "కాయిన్స్ ఫైనాన్షియల్ స్కూల్" (Coin's Financial School )ను ప్రచురించి, నిర్నిబంధ రజిత ప్రమాణం వలన కష్టాలన్నీ తొలగుతాయని ప్రచారం చేసాడు. ఆ విధంగానే తూర్పు ప్రాంతానికి చెందిన హెన్రీ డెమారెస్ట్ లాయిడ్ (Henry Demarest Lloyd ) అనే అతను "వెల్త్ ఎగెనెస్ట్ కామన్ వెల్త్" (Wealth against Common Wealth) అనే పుస్తకం ద్వారా వాల్‌స్ట్రీట్ బాంకర్ల ఒత్తిడివలన ప్రజాస్వామ్యం విచ్ఛిన్నమైందని ప్రజలకు తెలియపరచాడు. ఈ ప్రచారమంతయు పాప్యులిస్టుల ఉద్యమానికి అనుగుణంగా ఉండడం వలన 1896 అధ్యక్ష ఎన్నికలో తమకు అధిక విజయవకాశం ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేయసాగారు. అంతేగాక రెండు పెద్ద రాజకీయ పార్టీలైన రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలలో కూడా వెండి ప్రమాణాన్ని అవలంబించమని గట్టిగా కోరే వర్గాలున్నాయని వీరికి తెలుసు. అందువలన ఈ రెండు పార్టీలు స్వర్ణ ప్రామాణ్యానికి మొగ్గుచూపిస్తే, ఈ వర్గాలు విడిపోతాయని పాప్యులిస్టులు ఎదురు చూడసాగారు. ఆర్థిక మాంద్యం వలన బాగా చితికిపోయిన డెమొక్రటిక్ పార్టీపై తాము తేలికగా విజయం సాధిస్తామనే ధైర్యంతో రిపబ్లికన్ పార్టీ 1896 ఎన్నికలకు సిద్ధమైంది. ఓహైయోకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తయైన మార్క్‌హన్నా (Mark Hanna) ఈ రిపబ్లికన్ పార్టీకి ముఖ్య రథసారథి. ఇతను అలెగ్జాండర్ హామిల్టన్ వలె గవర్నమెంట్ కొంత మంది విద్యావంతులైన ధనవంతుల చేతులలో ఉండవలెనని విశ్వసించేవాడు. హన్నా ఆధ్వర్యంలో ఓహైయోకు చెందిన మెకెన్లీ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా నియమితుడయ్యాడు. ఈ పార్టీవారు పరిపూర్ణ స్వర్ణ ప్రమాణానికి పాటుపడవలెనని నిర్ణయించారు. పాప్యులిస్టులు ఊహించినట్లే రజిత ప్రమాణాన్ని అంగీకరించే రిపబ్లికన్‌లు హెన్రీ టెల్లర్ నాయకత్వంలో సభనుంచి, నిష్క్రమించి తమ భావాలకు అనుగుణంగా ఉండే అభ్యర్థికే ఓటు వేస్తామని ప్రకటించారు.

డెమొక్రటిక్ పార్టీ సమ్మేళనంలో కూడా ఇలాంటి విధానాలే కనిపించాయి. పశ్చిమాన, దక్షిణాదిన ఉన్న డెమొక్రటిక్ ప్రతినిధుల నాయకుడైన విలియమ్ జెన్నింగ్స్ బ్రైన్ (William Jennings Bryan ) ఈ పార్టీకి నాయకత్వం వహించాడు. 36 సంవత్సరాల బ్రైన్ అంతకుముందు నెబ్రాస్కా కాంగ్రెస్ సభ్యుడు. ఇతను వెండిని విరివిగా అమ్మవలెనని వాదించేవారిలో ఒకడు. 'క్రాస్ ఆఫ్ గోల్డ్' (Cross of Gold ) ఉపన్యాసంగా పేరుపొందిన అతని ప్రసంగంలో, పెద్ద కంపెనీకి డైరక్టర్‌గా ఉన్న వ్యక్తి ఎంత వ్యాపారస్థుడో, అహోరాత్రులు చెమటోడ్చి, పంటను పండించి జాతీయ ఆదాయాన్ని పెంచే కృషీవలుడు కూడా అంత వ్యాపారస్థుడే అని చెప్పాడు. ఇదే విధంగా ఎత్తైన పర్వత శిఖరాగ్రాల మీదికి, లోతైన గనులలోనికి పయనించి అక్కడినుంచి శ్రమకోర్చి, విలువైన మణులను వెలికి తెచ్చే శ్రామికుడు కూడా వ్యాపారస్తునికి ఎందులోను తక్కువ కాడు అని తెలిపాడు. ఇటువంటి వారికోసం సమాజం మీద తిరుగుబాటు చేసైనా సౌభాగ్యం సాధిస్తామని వాగ్దానం చేసాడు. రక్షణ సుంకాలను తగ్గించాలని, ట్రస్టుల విచ్ఛిన్నం సాధించాలని, శ్రామికుల తగాదాలలో కోర్టులు ఇంజక్షన్‌లు ప్రయోగించకుండా ఉండేదానికి కృషి చేయాలని డెమొక్రాటిక్ పార్టీవారు తీర్మానించారు.

తమ పార్టీ విధానాలే, డెమొక్రటిక్ పార్టీ లక్ష్యమగుటవలన, తమ అభ్యర్థిని నిలబెడితే రిపబ్లికన్ ఎన్నిక సులభమయ్యేటట్లు కనబడటంతో, పాప్యులిస్టులు డెమొక్రటిక్ అభ్యర్థియైన డబ్ల్యు.జె. బ్రెయిన్‌ను సమర్థించారు. బ్రైన్ జఫర్సన్, జాక్సన్ అంతటి వ్యక్తిత్వము గలవారు. మంచి వక్త. నిజాయితీ పరుడు. ఎన్నికలముందు అతను 17,000 మైళ్ళు తిరిగి 600 ప్రసంగాలు ఇచ్చాడు. మార్క్‌హన్నా పారి శ్రామిక వేత్తలు, బ్యాంకర్ల నుండి పెద్ద మొత్తం ప్రచారనిధిని సమకూర్చాడు. అంతేగాక బ్రైన్‌ను అరాజకం సృష్టించువాడుగా ప్రచారం చేసి, అతని గెలుపు

ఆర్థిక వినాశనానికి దారితీస్తుందని వక్కాణించాడు. ఈ ఎన్నికలలో డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీచేసి బ్రైన్ బాగా దెబ్బతిన్నాడు. ధరలు బాగా పెరగడంతో చాలామంది వ్యవసాయదారులు రిపబ్లికన్ పార్టీ వైపు మొగ్గుచూపి మెకన్లే గెలుపుకు దోహద పడ్డారు.

ఈ రకంగా మెకన్లే గెలవడం ఒక రకంగా హామిల్టన్ భావాలకు మద్దతు ఇచ్చినట్లయింది. మెకన్లే 6 లక్షల ఓట్లతో గెలుపొందాడు. అతను అధ్యక్ష పదవిని అలంకరించే నాటికి ఆర్థిక మాంద్యం తగ్గ సాగింది. 1897లో ప్రవేశపెట్టబడిన 'డింగ్లీ టారిఫ్' చట్టం వ్యాపారస్థులకు విదేశీ పోటీదారులనుంచి పూర్తి రక్షణ కల్పించడమేగాక, స్వదేశీ మార్కెట్‌లో కూడా ధరలు పెంచుకొనే అవకాశాన్ని కల్పించింది. పంటలు విరివిగా పండనారంభించడం, అప్పుడే వాటి ధరలు కూడా పెరగడం తటస్థించింది. ఈ రకంగా రైతుల అసంతృప్తి తీరిన తర్వాత వారి ఆర్థిక సమస్యను తీర్చడానికి మెకన్లే ఉద్యుక్తుడయ్యాడు. 1900 సంవత్సరంలో సువర్ణ ప్రమాణ చట్టాన్ని ఆమోదించడమేగాక 15 కోట్ల డాలర్ల బంగారు నిలువలను పెంచి, దేశ ఆర్థిక సౌష్టవానికి కృషి చేసాడు.

## 12.5 ముగింపు :

ఈ విధంగా వ్యవసాయదారులు తమ సమస్యలను పరిష్కరించుకొనుటకు సమైక్యమై గ్రేంజర్ ఉద్యమం, గ్రీన్ బాక్ ఉద్యమం, పాప్యులిస్ట్ ఉద్యమాలను సాగించారు. పాప్యులిస్టు పార్టీ క్షీణించి, కర్షకుల కోర్కెలు పూర్తిగా పరిష్కరింపబడకపోయినా ఈ ఉద్యమం వ్యవసాయదారుల దుస్థితిని నిర్మూలించుటకు చేసిన కృషి నిరుపమానమైనది. ఆచార్య బైలీ (Thomas A. Bailey) మాటలలో చెప్పవలెనన్న "వారు తమ తప్పిదములను సరిదిద్దుకొనుటకంటె తమ హక్కుల కొరకు నిర్విరామ పోరాటం సల్పారు.

పంథొమ్మిదివ శతాబ్ది అంతానికి పెట్టుబడిదారులకు విజయం కల్గడమేగాక, ఆర్థికంగా వారు నిలదొక్కుకొనే వనరుకూడా కల్గింది. కాని పాప్యులిస్టులు అంతటిలో వెనుకబడినట్లు భావించరాదు. పాప్యులిస్టు ఉద్యమ ఫలితంగా అమెరికన్‌లలో అధిక సంఖ్యాకులకు ప్రాణప్రదమైన మూల్యాల వ్యాప్తికి విస్తృత ప్రచారం లభించింది. తర్వాత కాలంలో వచ్చిన సమర్థులైన నాయకులు పాప్యులిస్టులు వెలిబుచ్చిన అనేక భావాలను, కోర్కెలను అభ్యుదయ శకములోను, నవ విధాన కాలములోను సాధించగలిగారు. ఈ కాలంలో పరిశ్రమలతోపాటు, వ్యవసాయాభివృద్ధికి, ధరల స్థిరీకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది.

పాప్యులిస్ట్ ఉద్యమము భిన్న పార్టీలకు, భిన్న వర్గములకు చెందిన వ్యవసాయ దారులమధ్య నెలకొన్న అగాధమును రూపుమాపి వారిని సన్నిహితులను చేసింది. అంతర్యుద్ధ కాలంలో విచ్ఛిన్నమైన పశ్చిమ, దక్షిణ ప్రాంతాల మధ్యగల వ్యవసాయ సంబంధములను పాప్యులిజమ్ పునరుద్ధరించింది. ఈ విధంగానే దక్షిణ ప్రాంతములలోని వ్యవసాయ దారులను సమైక్యం చేసింది. ఈ విధంగా పాప్యులిస్ట్ ఉద్యమం కాలగమనంలో గణనీయమైన విజయాలను సాధించింది.

## ప్రశ్నలు :

ఎ) ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.

1. అంతర్యుద్ధానంతరము అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వ్యవసాయ విప్లవమునకు దోహదపడిన కారణములను వర్ణింపుము.
2. 19వ శతాబ్దిలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని వ్యవసాయ దారులు సాగించిన ఉద్యమాలను సమీక్షింపుము.
3. పాప్యులిస్టు ఉద్యమం గురించి ఒక వ్యాసము వ్రాయుము.

## ఉపయుక్త గ్రంథాలు :


1. Morison & Conmager : The Growth of the American Republic Vo. II.
2. Henry Bamford Parkes : The United States of America, A History
3. తెలుగు అకాడమీ ప్రచురణ : అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర



డాక్టర్ ఎస్. గిరిజ

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం

## పాఠం - 13

# థియోడోర్ రూజ్‌వెల్ట్ (1901-1909)

### 13.0 లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు 1901 నుంచి 1909 వరకు అధ్యక్షునిగా ఉన్న థియోడోర్ రూజ్‌వెల్ట్ అనుసరించిన ఆంతరంగిక విధానాలను, సంస్కరణలను, అతను అనుసరించిన విదేశీ విధానమును గురించి తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

### విషయ క్రమం


13.1 తొలి జీవితం

13.2 ఆంతరంగిక విధానము

13.3 ట్రస్ట్‌ల నియంత్రణ

13.4 బొగ్గుగని కార్మికుల సమ్మె

13.5 అభ్యుదయ వాదం

13.6 మక్‌రాకర్స్

13.7 జాతీయ వనరుల సంరక్షణ

13.8 ఆల్డ్రిచ్ - వ్రీలండ్ చట్టం

13.9 విదేశీ విధానం

13.10 సమీక్ష

13.11 వ్యాసరూప ప్రశ్నలు

13.12 ఉపయుక్త గ్రంథాలు


### 13.1 తొలి జీవితము

థియోడోర్ రూజ్‌వెల్ట్ అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఇరవై ఆరవ అధ్యక్షుడు, రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి అయిన ఇతడు 43 సంవత్సరాలకే అత్యున్నతమైన పదవిని పొంది, 1901 నుంచి 1909 వరకు అధ్యక్షుడుగా కొనసాగాడు. అమెరికా చరిత్రలో రూజ్‌వెల్ట్‌కి ప్రత్యేక స్థానం ఉంది. అతనిని ఆదర్శంగా భావించే అనేకమంది అభిమానులు ఎల్లప్పుడు ఉండేవారు. అశేషమైన ప్రజాకర్షణ శక్తి కలిగి, ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలను ఇచ్చేవాడు. ఫెడరల్ రాజకీయాలలో నూతన స్ఫూర్తిని ప్రవేశపెట్టాడు. భారీ వ్యాపారంలో ఉండే అనైతిక పద్ధతులను నిరసిస్తూ, వారిని ఉన్నత ప్రమాణాలకు కట్టుబడేటట్లు చేసిన తొలి అధ్యక్షుడు రూజ్‌వెల్ట్. ప్రభుత్వానికి, చట్టాలకి వారు అతీతులు కాదనీ, ప్రకటించటమే గాక, విధేయులుగా మెలిగేటట్లు చేయగలిగాడు. విద్యలలోను, కళలలోను ఆసక్తిని చూపేవాడు. చక్కటి భాషలో ప్రసంగాలు చేసి ప్రజలను ఆకర్షించేవాడు.

రూజ్‌వెల్ట్ 1858 సంవత్సరంలో న్యూయార్క్‌లోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. క్రమమైన వ్యాయామముతో శరీరాన్ని ధృఢంగా మలచుకున్నాడు. ఇతడు యునైటెడ్ స్టేట్స్ సివిల్ సర్వీసు కమిషన్ సభ్యునిగా ఉండేవాడు. కొంతకాలం న్యూయార్క్ నగర పోలీసు కమీషనర్‌గానూ, నౌకాదళానికి సహాయ కార్యదర్శిగానూ పనిచేసాడు. స్పానిష్ - అమెరికన్ యుద్ధకాలంలో క్యూబాలో "రఫ్ రైడర్స్" అనే దళానికి అధికారిగా ఉండి, ప్రజారంజకుడు అయ్యాడు. న్యూయార్క్ గవర్నర్ పదవికి 1898లో ఎన్నికై అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టాడు. బహుముఖ ప్రతిభాశాలిగా పేరు పొందిన రూజ్‌వెల్ట్ 1900 సంవత్సర ఎన్నికలలో ఉపాధ్యక్షునిగా ఎన్నికైయ్యాడు. సెప్టెంబర్ 1901లో అధ్యక్షుడైన మెకన్లీని లియనో - జోల్‌గాజ్ అనే అరాచకవాది హత్య చేశాడు. ఆ కారణం వలన ఉపాధ్యక్షుడైన థియొడోర్ రూజ్‌వెల్ట్ అమెరికా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసాడు.

సైనికునిగా, రచయితగా, వక్తగా, రాజకీయవేత్తగా రూజ్‌వెల్ట్ అమెరికన్ ప్రజాదరణ పొందాడు. విభిన్న వర్గాల ప్రజలతో కలసి పోవడంలో రూజ్‌వెల్ట్ తనకు తానే సాటి. ప్రచారము అంటే ఇతనికి అత్యంత ప్రీతి. తనకి గిట్టనివారిని దుయ్యబట్టడంలో ఎటువంటి సంకోచం చూపేవాడు కాదు. ఇదే పంథాలో పార్టీని, దేశాన్ని కూడా నడపడానికి తీర్మానించుకున్నాడు. ఇతర నాయకులలో అభిప్రాయ భేదాలు కలిగినప్పుడు, రూజ్‌వెల్ట్ మరింత దృఢ నిశ్చయంతో దేశమంతా పర్యటించి ఉపన్యాసాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని తనకు అనుగుణంగా మలచుకొనేవాడు. విదేశీ వ్యవహారాలలో నిర్మొహమాటంగా వ్యవహరించేవాడు. ఉద్రేకతతో ఇతడు దుందుడుకుగా వ్యవహరించేవాడు. ఈ లక్షణాలే అతని విదేశీయ విధానాన్ని ప్రభావితం చేశాయి.

## 13.2 ఆంతరంగిక విధానము :

అభ్యుదయాన్ని రూజెవెల్ట్ దృఢంగా ముందుకు తీసికొని వెళ్ళాడు. ట్రస్ట్‌లను అదుపు చేయటం, బొగ్గు సమ్మెలో కలుగ జేసుకోవడం, జాతీయ వనరుల సంరక్షణ ఇతని ముఖ్య విధానాలు. కాంగ్రెస్‌కు తన మొదటి సందేశంలో దేశాన్ని పీడిస్తున్న ముఖ్యమైన సాంఘిక సమస్యలపై యుద్ధం ప్రకటించాలని కోరాడు.

అంతర్యుద్ధం తరువాత అమెరికాలో భారీ వ్యాపారం మొదలైంది. పారిశ్రామికీకరణ జరిగి నగరాలు విస్తరించాయి. గుత్త పారిశ్రామికులు బలపడి, పేదవారి దయనీయ జీవన పరిస్థితులకు కారకులైయ్యారు. రైల్వే సంస్థలు, పారిశ్రామిక సంస్థలు రహస్య ఒప్పందాలు చేసికొని, పోటీలను తగ్గించుకొని అక్రమ మార్గాలను చేపట్టి, విజయపధాన్ని చేరాయి. తమ అక్రమాలను బయటకు రాకుండా పత్రికా విలేఖర్లకు, ప్రజా ప్రతినిధులకు, న్యాయాధిపతులకు లంచాలు ఇచ్చేవారు. తమకు అనుకూలంగా ఉండేవారే ఇటువంటి పదువులకు వచ్చేటట్లు ఏర్పాట్లు చేసుకొనేవారు. రైల్వే సంస్థలవారు అమానుషమైన పద్ధతుల ద్వారా బలపడ్డారు. అత్యవసర రంగాలకు కూడా ట్రస్ట్‌లు విస్తరించాయి. నూనె, ఉప్పు, చక్కెర, అగ్గిపెట్టె, పొగాకు వంటి రంగాలలో కూడా ట్రస్ట్‌లదే అధిక్యత. ఇవి అత్యాశాపీడితులై న్యాయాన్యాయాలను విడిచి, గుత్త వ్యాపారాన్ని దైవదత్తమని భావించి, అనేకమంది అధికారులకంటే ఎక్కువగానే ప్రజలమీద తమ జులుం సాగించారు.

## 13.3 ట్రస్ట్‌ల నియంత్రణ :

రూజ్‌వెల్ట్ డిశంబర్ 3, 1901న కాంగ్రెస్‌కి ఇచ్చిన ఉపన్యాసంలో ట్రస్ట్‌ల పోకడల వలన సామాన్య పౌరుల సంక్షేమానికి హాని జరుగుతుందని తెలిపాడు. ఈ సమస్యను పరిష్కరించడానికి, ట్రస్ట్‌లను నిషేధించనప్పటికీ, వానిపై నిఘా ఉంచి, సంస్కరిస్తానని చెప్పాడు. దీనికి ఆశ్చర్య పడిన కాంగ్రెస్ వెంటనే అంగీకరించలేదు. రూజ్‌వెల్ట్‌కు వ్యతిరేకత భారీ వ్యాపారానికి మద్దతునిచ్చే సెనెటర్ ఆల్డ్రిచ్ నుంచి స్పీకర్ అయిన జోసెఫ్ జి. కానన్ నుంచి వచ్చింది. అప్పుడు రూజ్‌వెల్ట్ దేశమంతా పర్యటించి, ఉపన్యాసాలు ఇస్తూ తన అభిప్రాయాలను ప్రజలకు చేర్చాడు. తన విధానాన్ని "స్క్వేర్ డీల్" సమరస విధానంగా పేర్కొన్నాడు. ప్రజాభిప్రాయం అధ్యక్షునికి అనుకూలంగా ఉండటంతో కాంగ్రెస్ కూడా అంగీకరించింది.

ట్రస్ట్‌లను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా రూజ్‌వెల్ట్ షెర్మన్ ఏంటీ ట్రస్ట్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ చట్టం 1890లో ఆమోదించబడినప్పటికీ, దీని ద్వారా వచ్చిన కేసులుగాని, జరిగిన న్యాయం గాని తక్కువే. భారీ వ్యాపారుల దిశగా

ప్రభుత్వంగాని, కోర్టులుగాని పోలేదు. జాన్ మూడీ లెక్క ప్రకారం అంతర్యుద్ధం నుంచి 1904 వరకు 5,300 ప్రత్యేక సంస్థలు ఒకదానితో ఒకటి విలీనమై 318 పెద్ద కార్పొరేషన్లుగా ఏర్పడ్డాయి.

షెర్మన్ చట్టాన్ని మొదటిసారిగా అధ్యక్షుడు మార్చి 1902లో నార్తరన్ సెక్యూరిటీస్ కంపెనీపై ప్రయోగించాడు. రెండు రైలు కంపెనీల వారైన జేమ్స్ జె.హిల్, ఎడ్వర్డ్ హెచ్. హారిమన్ నార్తరన్ సెక్యూరిటీస్ కంపెనీని నిర్వహించేవారు. వీరికి మార్గన్ కంపెనీ సహాయ సహకారాలు ఉండేవి. వీరికి ఆగ్నేయ రైలు మార్గాలపై గుత్తాధిపత్యం ఉండేది. సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

ఈ విజయంతో ఉత్తేజితుడైన రూజ్‌వెల్ట్ ఇతర ట్రస్ట్‌లపై కేసులు పెట్టసాగాడు. స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ కూడా ప్రభుత్వ దృష్టికి గురి అయింది. రూజ్‌వెల్ట్ తన అధ్యక్ష కాలంలో మొత్తం 43 ట్రస్ట్‌లపై విచారణ జరిపించి, వాని ఆగడాలను అరికట్టించగలిగాడు. వానిపై అపరాధ రుసుంలను విధించగలిగాడు. ఉదాహరణకు స్టాండర్డ్ ఆయిల్ కంపెనీపై 29,240,000 డాలర్ల జరిమానా విధించడం జరిగింది.

థియోడోర్ రూజ్‌వెల్ట్ అనుసరించిన ట్రస్ట్‌లను భగ్నం చేసే కార్యక్రమం పూర్తి సత్ఫలితాలను ఇవ్వలేదు. కోర్టు తీర్పుల ద్వారా ట్రస్ట్‌లు చిన్న సంస్థలుగా మారినప్పటికీ, పరస్పర ఒప్పందాల ద్వారా పోటీ తత్వాన్ని పెరగనీయలేదు. భారీ వ్యాపారస్థుల వ్యతిరేకత అధికమై ఒకానొక ప్రసంగంలో, తాను భారీ వ్యాపారాన్నంతా వ్యతిరేకించడం లేదని, ట్రస్ట్‌ల మధ్య తేడాని మాత్రమే గమనిస్తున్నానని అధ్యక్షుడు అన్నాడు. తాను భారీ ట్రస్ట్‌లకి వ్యతిరేకి కాదని, ట్రస్ట్‌లలోని దుష్ప్రవర్తనకి మాత్రమే వ్యతిరేకినని ప్రకటించాడు. కార్పొరేషన్లు, భారీ ట్రస్ట్‌లు ఫెడరల్ ప్రభుత్వ అదుపులో ఉండాలని తెలిపేవాడు. ఈ విధంగా అతడు కొంత రాజీపడినట్లే.

షెర్మన్ చట్టాన్ని శక్తివంతం చేసిన తరువాత, రూజ్‌వెల్ట్ ఇంటర్ స్టేట్ కామర్స్ చట్టాన్ని బలోపేతం చేయ తలపెట్టాడు. రైల్వేలను నియంత్రించేందుకు ఉద్దేశించిన ఈ చట్టం 1887లో ఇంటర్ స్టేట్ కామర్స్ కమీషన్‌ని ఐదుగురు సభ్యులతో ఏర్పాటు చేసింది. నామమాత్రంగానే ఉన్న ఈ కమిషన్ రూజ్‌వెల్ట్ 1903లో ఆమోదింపజేసిన ఎల్కిన్స్ చట్టం ద్వారా శక్తివంతమైంది. ట్రస్ట్‌లకు, ఇతర పెద్ద సంస్థలకు రిబేట్లు ఇవ్వడాన్ని, ఫ్రీపాస్‌లు ఇవ్వడాన్ని ఇది నిషేధించింది. ప్రకటించిన రవాణా, ప్రయాణ రేట్లకే రైల్వేలు కట్టుబడి ఉండాలని ఈ చట్టం తెలియజేసింది.

థియోడోర్ రూజ్‌వెల్ట్ కాలంలోనే కాంగ్రెస్ హెప్‌బర్న్ చట్టాన్ని 1906 లో ఆమోదించింది. దీని ద్వారా కమిషన్‌కి నూతన అధికారాలు వచ్చాయి. సహేతుకంగా రేట్లని తగ్గించే అధికారం కమిషన్‌కి సంక్రమించినా, రైల్వేలు ఈ విషయంలో న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. రైల్వే కంపెనీలన్నీ తమ ప్రయాణ ఛార్జీలను, రవాణా రేట్లను తెలియజేయాలని, తమ లాభాలను కూడా తెలియజేయాలని కమిషన్ ఆదేశించింది. మొదటిసారిగా రైల్వేలకు సమాజ బాధ్యతను తెలియజేసే ప్రయత్నం జరిగింది.

## 13.4 బొగ్గు గని కార్మికుల సమ్మె :

యునైటెడ్ మైన్ కార్మికులు మే 1902లో జాన్ మిచ్చెల్ నాయకత్వంలో ఆందోళన చేపట్టారు. పని గంటలను తొమ్మిదికి తగ్గించమని ఎక్కువ కూలి కావాలని, యూనియన్‌కి గుర్తింపు కావాలని సమ్మె జరిగింది. ఇది కొన్ని నెలలు కొనసాగడంవలననూ, చలి కాలం దగ్గర పడుతుండడం వలననూ ప్రభుత్వ జోక్యానికై ఒత్తిడి ఎక్కువ అయింది. అధ్యక్షుడు కార్మిక నాయకులను, బొగ్గుగనుల యజమానులను పిలిచి మధ్యవర్తిత్వం చేసాడు. థియోడోర్ రూజ్‌వెల్ట్ జోక్యంతో యజమానులు అధిక జీతం ఇవ్వడానికి రోజుకి తొమ్మిది గంటలు మాత్రమే పని చేయించుకోడానికి అంగీకరించారు. యూనియన్ గుర్తింపు 1916 వరకూ జరుగలేదు.

థియోడోర్ రూజ్‌వెల్ట్ అధ్యక్షునిగా ఉన్న కాలంలో కార్మికులకు అనుకూల నిర్ణయాలు జరిగాయి. పసిపిల్లలను కార్మికులుగా నియమించే విషయంలోనూ, వారు పని చేయవల[illegible] కాలం విషయంలోనూ ప్రభుత్వం నియంత్రించింది. బాల కార్మికులు రాత్రి సమయంలో పని చేయడాన్ని పూర్తిగా నిషేధిం[illegible] పని చేసే సమయంలో కార్మికులు ప్రమాదాలకులోనైతే యజమానులు నష్ట పరిహారం చెల్లించే ఏర్పాట్లు జరిగాయి.

## 13.5 అభ్యుదయ వాదం :

అమెరికాలో ఇరవైయ్యవ శతాబ్ద ఆరంభంలో ఒక సంస్కరణోద్యమం మొదలయింది. అనేకమంది రచయితలు, అభ్యుదయ వాదులు, సాంఘిక సంస్కర్తలు తమ రచనల ద్వారానూ, ఉపన్యాసాల ద్వారానూ నూతన సంస్కరణ భావాలను ప్రవేశపెట్టారు. వీరిని ప్రోగ్రెసివ్స్ అని పిలిచేవారు. ఈ రచయితలలో లెస్టర్‌వార్డ్ అగ్రగామి. డైనమిక్ సోషియాలజీ అనే గ్రంథం ద్వారా ఇతడు అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు సాంఘిక ప్రణాళికలు ప్రభుత్వం చేయాలని సూచించాడు. జాన్ డూయీ అనే రచయిత సంస్థల ప్రాధాన్యతను తెలియజేస్తూ, అవి మానవుని నడవడికలో పరివర్తన తీసికొని రాగలవని బోధించాడు. హెర్బర్ట్ క్రోలీ అనే మరో రచయిత స్వార్థ ప్రవృత్తిని దుయ్యబడుతూ, అవసరమైతే వ్యక్తులను, సంస్థలను ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా ప్రభుత్వ అజమాయిషీలలో ఉంచవలెనని కోరాడు.

## 13.6 మక్ రాకర్స్ :

అమెరికా సమాజంలో వృద్ధి చెందుతున్న అసమానత్వాన్ని, గుత్త వ్యాపారుల మోసాలను, ప్రభుత్వ యంత్రాంగంలో జరిగే అవినీతిని సామాన్యులకు సహితం అర్థమయ్యే రీతిలో తెలియజేసే రచనలు 1902-1908 మధ్య వచ్చాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలను తెలుపుతూ, వాని పరిష్కరణకు మార్గాలను చూపుతూ, ఉద్యమ రీతిలో ప్రచారం చేసినవారిని మక్ రాకర్స్ అని పిలిచారు. పెట్టుబడిదారీ విధానంలోని లోటుపాట్లను, దుమ్ము, ధూళిని వదిలించి ఆ విధానాన్ని పరిశుద్ధ పరచడానికి వీరు అంకితమయ్యారు.

ఇడా టార్బెల్ రచన అయిన "హిస్టరీ ఆఫ్ ది స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ" పెట్టుబడిదారుల దోపిడీ విధానాన్ని వర్ణించే గ్రంథం. రాగి ఉత్పత్తి దారులు చేసే అక్రమాలను థామస్ లాజన్ రచన "ఫ్రెంజీడ్ ఫైనాన్స్" చిత్రించింది. పురపాలక సంఘాలు చేసే దుర్మార్గాలను లింకన్ స్టీవెన్స్ రచించిన "షేమ్స్ ఆఫ్ ది సిటీస్" వెల్లడి చేసింది. జీవిత భీమా సంస్థలోని లోపాలను బర్టన్ కెన్రీ, సెనేట్‌లోని లంచగొండి తనాన్ని డేవిడ్ గ్రహం ఫిలిప్స్ వర్ణించారు. అన్నిటికంటె ప్రముఖమైన గ్రంథం ఆప్టిన్ సింక్లేర్ రచించిన "ది జంగిల్". మాంస విక్రేతలు చేసే మోసాలను కళ్ళకు కట్టినట్లు వివరించిందీ గ్రంథం. అధ్యక్షునిచే నియమించబడిన ఒక కమిటీ ఈ దుర్మార్గ విషయాలన్నీ వాస్తవాలేనని తెలిపింది. మాంసాన్ని నిలువచేసే ఫ్యాక్టరీలపై ప్రభుత్వ అజమాయిషీ అవసరాన్ని అందరూ గుర్తించారు. మీట్ ఇన్స్పెక్షన్ చట్టం 1906లో ఆమోదించబడింది. ప్యూర్ ఫుడ్ అండ్ డ్రగ్ ఏక్ట్ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించే చర్యలు తీసుకున్నారు. హానికరమైన ఆహార పదార్థాలను మందులను విసర్జించాలని, ప్రతిదానిపై వివరాలను తెలియజేసే లేబుల్స్ ఉండాలని కొత్త చట్టం తెలియజేసింది.

## 13.7. జాతీయ వనరుల సంరక్షణ :

జాతీయ వనరుల సంరక్షణ ప్రాధాన్యతను గుర్తించిన మొదటి అధ్యక్షుడు థియోడోర్ రూజ్‌వెల్ట్. పబ్లిక్ లాండ్ విధానం ఇంత వరకు ప్రైవేట్ ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటోందని ప్రజా సంక్షేమ దృష్ట్యా జరగలేదని తెలిపాడు. ఫారెస్ట్ సర్వీసెస్ డైరెక్టరు అయిన గిఫోర్డ్ పించో సహాయంతో నూతన దృక్పథాన్ని పెంచే ప్రయత్నం చేసాడు. ఫారెస్ట్ రిజర్వులకు 130 మిలియన్ల ఎకరాల భూమిని నూతనంగా కలుప గలిగాడు. బొగ్గు ఫాస్పేట్ మొదలగు ఖనిజ విలువలుగల 90 మిలియన్ల ఎకరాలను ఇతడు సేకరించి, 1902లో న్యూలాండ్స్ ఆక్ట్‌గా చట్టాన్ని తెచ్చి, దాని ద్వారా ఈ భూమిపై ప్రభుత్వ అజమాయిషీని ప్రవేశపెట్టాడు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న పశ్చిమ భూములను అమ్మి, ఆ ధనంతో నూతన వ్యవసాయ వనరులను నిర్మించే అధికారం అధికారం కేంద్ర ప్రభుత్వం తీసికొంది.

నదులు, సరస్సులు, కాలవల ద్వారా రవాణా రాకపోకల సౌకర్యాలను కలిగించడానికి కూడా ఇతనికి ఎక్కువ ఇష్టం ఉండేది. అరిజోనా రాష్ట్రంలోని సాల్ట్ నదిపై ఈ పద్ధతిలో నిర్మితమయిన భారీ ఆనకట్టకు 1911లో రూజ్‌వెల్ట్ పేరు పెట్టారు.

## 13.8 ఆల్డ్రిచ్ - ప్రీలండ్ చట్టం :

థియోడోర్ రూజ్‌వెల్ట్ అనుసరించిన ట్రస్ట్‌ల భగ్న కార్యక్రమాల వలన, రైల్వేల నియంత్రణవలన, లాభాలు తగ్గి ఆర్థిక సంక్షోభం 1907లో వచ్చింది. అయితే రూజ్‌వెల్ట్ దీనిని తన విధానాలకు వ్యతిరేకంగా ధనవంతులు కావాలని సృష్టించిన సంక్షోభంగానే భావించాడు.

దీన్ని అధిగమించడానికి న్యూయార్క్ బ్యాంకుల్లో 25 మిలియన్ల డాలర్లను జమ చేసాడు. ఆల్డ్రిచ్-వ్రీలండ్ చట్టాన్ని 1908లో కాంగ్రెస్‌చే ఆమోదింపజేసాడు. దీనివలన ఆరు సంవత్సరాల వరకు ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి "ఎమర్జన్సీ కరెన్సీ"ని విడుదల చేసే అధికారం బ్యాంక్‌లకు లభించింది. నేషనల్ మానిటరీ కమీషన్‌ని ఏర్పాటు చేయమని ప్రపంచంలోని కరెన్సీ విధానాలను ఆ సంస్థ అధ్యయనం చేసి, అమెరికన్ వ్యవస్థలో సంస్కరణలు తెలియజేయాలని ఆ చట్టం కోరింది.

## 13.9 విదేశీ విధానం :

థియోడోర్ రూజ్‌వెల్ట్ తన విదేశీ విధానాన్ని బడిత కర్ర (బిగ్ స్టిక్) విధానమని తెలిపాడు. "సునిసితంగా మాట్లాడుతూనే బడితకర్రను చేత పట్టుకుంటేగాని" విదేశాలతో, ముఖ్యంగా, ఐరోపా దేశాలతో వ్యవహరించడం కష్టమని అతని అభిప్రాయం. ఆఫ్రికా సామెతలనుంచి తీసికొన్న ఈ విధానాన్ని చెప్పడమేగాక, అమెరికా సైన్యాన్ని, నౌకాదళాన్ని సర్వ వేళలా యుద్ధానికి తయారుగా ఉంచేవాడు. కరిబియన్ దేశాలపైనా దూర ప్రాచ్య దేశాలపైనా బడిత కర్ర విధానాన్ని ప్రయోగించాడు. పది యుద్ధ నౌకలను, నాలుగు క్రూయిజర్లను సమకూర్చుకోడానికి కాంగ్రెస్ నుంచి అనుమతిని పొందాడు. స్పెయిన్‌తో 1898లో అమెరికా యుద్ధం చేయడం ద్వారా ఏకాంత విధానానికి స్వస్తి పలికి, ఐరోపా దేశాల మాదిరిగానే అధికార విస్తరణను ఆరంభించింది. ప్యూర్టోరికో, గయాంలు స్పెయిన్ నుంచి అమెరికాకు సంక్రమించాయి. క్యూబా నుంచి స్పెయిన్ తప్పుకుని, తాత్కాలికంగా అమెరికా అధికారంలో ఉంచారు.

**కరిబియన్ విధానము :** కరిబియన్ సముద్ర తీరంలో గల క్యూబా, హైతీ, డొమినికన్ రిపబ్లిక్, పోర్టోరికో మొదలయిన ప్రాంతాలలో థియోడోర్ రూజ్‌వెల్ట్ దుందుడుకు విధానాన్ని అనుసరించి, అమెరికా ఆధిపత్యాన్ని స్థిరంగా నెలకొలిపే ప్రయత్నం చేసాడు. అమెరికా ప్రయోజనాలు కొనసాగజేయడం, ఇతర ఐరోపా దేశాల ప్రవేశాన్ని నిరోధించడం ఇతడు చేశాడు. కరిబియన్ సముద్రం అమెరికా సరస్సు అన్నట్లుగా, అమెరికా స్వైర విహారం చేయసాగింది.

**13.9.1 క్యూబా :** అమెరికాతో 1898 యుద్ధంలో ఓడిన స్పెయిన్ పారిస్ సంధి ప్రకారము క్యూబాపై అధికారాన్ని కోల్పోడానికి అంగీకరించింది. అమెరికన్ సైన్య పాలనలో క్యూబా ఉండేటట్లు తాత్కాలిక అంగీకారం కుదిరింది. మూడు సంవత్సరాలలో అక్కడ సుపరిపాలన నెలకొంది. అమెరికన్ రాజ్యాంగాన్ని పోలిన రాజ్యాంగ వ్యవస్థ 1901లో ఏర్పడింది. అయితే 1901లో ప్లాట్ సవరణ ద్వారా క్యూబా సార్వభౌమాధికారాన్ని అమెరికా తగ్గించింది. అప్పులను తీర్చగలిగే పరిధిలోనే చేయాలని, స్వాతంత్ర్యాన్ని కోల్పోయే ఎటువంటి ఒప్పందాలకి అంగీకరించకూడదని, ముఖ్యంగా అక్కడ శాంతి భద్రతల కోసం అమెరికా జోక్యానికి ఎటువంటి అసమ్మతి ఉండకూడదని, దీనిలోని ప్రతిపాదనలు. ఈ ప్లాట్ సవరణ 1934 వరకు కొనసాగింది. ఆగష్టు 1906లో ఈ అంశం ఛాయలో అమెరికా జోక్యం చేసుకొంది.

**13.9.2 డొమినికన్ రిపబ్లిక్ : రూజ్‌వెల్ట్ ఉప సిద్ధాంతం :** డొమినికన్ రిపబ్లిక్ ఆర్థికపరమైన కష్టాల్లో చిక్కుకుంది. ఫ్రాన్స్, ఇటలీ వంటి ఐరోపా దేశాలకు ఋణగ్రస్థ మవడంతో (దాదాపు ఇరవై రెండు మిలియన్ల డాలర్ల వరకు), ఆ దేశాలు తమ ఒత్తిడిని, జోక్యాన్ని పెంచసాగాయి.

వీటిని నిరోధించడానికి థియోడోర్ రూజ్‌వెల్ట్ పూర్వపు మన్రో సిద్ధాంతాన్ని పేర్కొంటూ, దానికి తన ఉపసిద్ధాంతాన్ని (కరోలరీ) కలిపాడు. దీనివలన అమెరికా ఖండంలోని దేశాల అంతరంగిక వ్యవహారాలలో అమెరికా జోక్యం ఆవశ్యకతను తెలియజేస్తూ, ఐరోపా ఖండంలోని దేశస్థుల వత్తిడిని, ఆక్రమణను అరికట్టడానికి ఈ అంతర్జాతీయ రక్షణా బాధ్యతను స్వీకరిస్తున్నట్లు రూజ్‌వెల్ట్ ప్రకటించాడు. ఐరోపా దేశాల శక్తివంతమైన జోక్యాన్ని అమెరికా ఖండ వ్యవహారాలలో ఇక ఎంత మాత్రమూ సహించమని తెలియజేస్తూ, లాటిన్ అమెరికన్ దేశాలు కూడా అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించకపోతే అమెరికా జోక్యం తప్పని సరి అని ప్రకటనలో తెలిపాడు. ఆర్థిక సమస్యలను తమంతట తామే పరిష్కరించుకోలేకపోతే, ఆ దేశాల అంతరంగిక వ్యవహారాలలో అమెరికా జోక్యం తప్పదని తెలిపాడు. శాంటో డోమింగో 1905లో అమెరికాతో ఒక ఒప్పందం చేసుకొంది. దీని ద్వారా తమ దేశంలోని సుంకపు చౌకీలను అమెరికా స్వాధీనం చేసింది. ఈ చౌకీలనుంచి

వచ్చే ఆదాయంలో 45% డొమినికన్ ప్రభుత్వానికి అందజేసి మిగిలినది వారి అప్పులకు జమకట్టేవారు. రెండు సంవత్సరాలలో ఋణ సమస్య పరిష్కారమవడంతో 1907లో అమెరికా అక్కడనుంచి ఉపసంహరించుకుంది.

రూజ్‌వెల్ట్ ఉప సిద్ధాంతం వలన అమెరికా ఖండంలోని చిన్న దేశాలకు రక్షణ కంటే, భయాన్నే ఎక్కువ కలుగజేసాయి. దీన్ని అడ్డం పెట్టుకుని పొరుగు రాజ్యాల విషయంలో అమెరికా పూర్తి జోక్యం చేసుకోసాగింది.

**13.9.3. వెనిజులా :** ఇంగ్లండ్, జర్మనీ, ఇటలీ దేశాల నుంచి అత్యధిక మొత్తంలో వెనిజులా రుణాలు తీసికొంది. ఈ బాకీలను తీర్చలేని పరిస్థితులు ఏర్పడగా ఆ దేశాలు డిసెంబరు 1902లో వెనిజులాని నౌకా దళంతో దిగ్బంధం చేసి, నౌకలను, నౌకాశ్రయాలను ధ్వంసం చేయసాగారు. వెనిజులా అధ్యక్షుడయిన సిప్రియానో కాస్ట్రో ఈ ఒత్తిడికి తట్టుకోలేక రూజ్‌వెల్ట్‌ని మధ్య వర్తిత్వం చేయవలసిందిగా కోరాడు. జర్మనీకి హెచ్చరికలు చేయడం ద్వారానూ, ఇతర రెండు దేశాలతో రాజీ ప్రతిపాదనల ద్వారానూ శాంతి నెలకొలుపబడింది.

**13.9.4 పనామా కాలువ ఆవిర్భావం :** స్పానిష్ - అమెరికన్ యుద్ధం తరువాత అమెరికా సామ్రాజ్యం అట్లాంటిక్ నుంచి పసిఫిక్ సముద్రం వరకు విస్తరించింది. ఈ కొత్త ప్రదేశాలను జాగ్రత్తగా రక్షించుకోడానికి రెండు నౌకా దళాలు అవసరమౌతాయి. రెండు సముద్రాలకు మధ్య ఒక మార్గం కనుక ఏర్పడినట్లయితే, దూరం తగ్గుతుంది. ఒక నౌకాదళాన్ని అవసరం అయినచోట వాడుకునే వీలు లభిస్తుంది.[1] ఇస్త్మియన్ కాలువ కనుక ఏర్పడితే న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కోల మధ్య దూరం 2/3 వంతులు తగ్గుతుంది.

అయితే కొత్త కాలువ ఏర్పడాలంటే బ్రిటన్‌తోగల సంధి అమెరికాకి ఇబ్బందిగా ఉంది. క్లేటన్- బుల్వర్ సంధి (1850) ప్రకారం ఈ ప్రాంతంలో ఏ కాలువ నిర్మాణమైనా రెండు దేశాలు సమాన ప్రతిపత్తితో జరగాలి. అందుచేత అవసరమున్నా ఒంటరిగా అమెరికా ఈ కాలువ పనిని ఆరంభించలేదు. రూజ్‌వెల్ట్ అధ్యక్ష కాలంలో అతని విదేశాంగ కార్యదర్శి అయిన జాన్ హే 1901లో బ్రిటిష్ ప్రభుత్వ అధికారి అయిన పాన్స్‌ఫోట్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. దీనినే హే - పాన్స్ ఫోట్ సంధి అంటారు. దీనివల్ల బ్రిటన్ తన హక్కులను వదలుకోవడంతో కాలువ నిర్మాణానికి అమెరికాకి సంపూర్ణ హక్కులు లభించాయి. ఆంగ్లేయులకు అమెరికా మైత్రి ఆ కాలంలో అవసరమైనందున వారు ఈ ప్రతిపాదనకు అంగీకరించడం జరిగింది.

ఆ తరువాత అమెరికన్లు కాలువ నిర్మాణాన్ని ఎక్కడ చేయాలని ఆలోచించడం మొదలు పెట్టారు. ఒకటి పనామా (ఇస్థ్మస్). ఇక్కడ ఆ హక్కు ఫ్రెంచి కంపెనీకి ఉంది. రెండవ చోటు నికరాగ్వా మార్గం. కాని అక్కడ అంతా అగ్ని పర్వతాల మయం. అందుచేత పనామానే ఎంపిక చేశారు. ఫ్రెంచి కంపెనీ కూడా 40 మిలియన్ల డాలర్లకు తమ హక్కులను అమ్మడానికి అంగీకరించింది. పనామా కొలంబియాలో ఉన్నందున, రూజ్‌వెల్ట్ కొలంబియాపై ఒత్తిడిచేసి జనవరి 1903లో తన సెక్రటరీ హే ద్వారా హే-హెర్రన్ ఒడంబడిక కుదుర్చుకున్నాడు. దీని వలన అమెరికా పది మిలియన్ల డాలర్లను కొలంబియాకి చెల్లించేట్లు, ప్రతి సంవత్సరం కాలువ కౌలుకై (లీజు) 250 వేల డాలర్లు చెల్లించేట్లు అంగీకరించింది.[2] అయితే కొలంబియా సెనెట్ దీనిని అంగీకరించక, మరింత లాభం రావాలని పట్టు పట్టారు. ఇది తెలిసిన రూజ్‌వెల్ట్ ఒప్పందాన్ని వారు నిరాకరిస్తున్నందున బల ప్రయోగంతోనైనా పనామాను వశపరచుకొని, కాలువను కట్టించే అధికారం ఇమ్మని కాంగ్రెస్‌ను కోరసాగాడు. కాని ఈ లోపునే పనామాలో కొలంబియాకు వ్యతిరేకంగా విప్లవం వచ్చింది. నవంబరు 3, 1903వ తేదీన పనామా స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. థియోడోర్ రూజ్‌వెల్ట్ సంపూర్ణ సహకారంతో ఈ విజయం ప్రాప్తించింది. వెంటనే కొత్త దేశానికి గుర్తింపుని అమెరికా ఇచ్చి, నూతన సంధిని పనామా రిపబ్లిక్‌తో చేసుకొంది. ఇస్థ్మస్ వద్ద 10 మైళ్ళ నిడువుగల భూమి శాశ్వతంగా అమెరికా వశమైంది. శాంతి భద్రతలకై అమెరికా పనామా వ్యవహారాలలో జోక్యం చేసుకునే హక్కుని పొందింది.

---

[1] స్పానిష్-అమెరికన్ యుద్ధంలో పసిఫిక్ సముద్ర తీరంలో ఉన్న ఆరెగాన్ యుద్ధనౌక క్యూబా సముద్ర తీరంలో ఉన్న అమెరికా నౌకా దళానికి సహాయంగా రావడానికి చాలా సమయము ఖర్చు అయింది. శాంటియాగో యుద్ధ విజయానికి ఆరెగాన్ సహాయమే కారణమైందని అందుచేత రెండు సముద్రాలను కలిపే దగ్గర త్రోవ కావాలని అమెరికన్లు భావించారు.

[2] దీనికి ప్రతిగా కొలంబియా అమెరికాకు అట్లాంటిక్ పసిఫిక్ సముద్రాల మధ్య పదిమైళ్ళ భూభాగాన్ని ఇవ్వడానికి అంగీకరించింది.

కాలువ పనులు 1904లో ఆరంభమై 1914 నాటికి ముగిసాయి. దీనిపై మొదటి స్టీమరు ఆగష్టు 15, 1914న నడిచింది. దీని నిర్మాణానికి 275 మిలియన్ల డాలర్లు, దీని రక్షణకు 113 మిలియన్ల డాలర్లు ఖర్చు అయ్యాయి. కొలంబియాకి వ్యతిరేకతను చూపడాన్ని రూజ్‌వెల్ట్ సమర్థించుకొన్నాడు. ప్రపంచమంతా కాలువకై ఎదురు చూస్తోంటే కొలంబియా అడ్డ పడుతోందని, అందుకని తను వ్యతిరేకించానని రూజ్‌వెల్ట్ చాటాడు.

పనామా కాలువ విధానం ప్రపంచాన్ని, ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాలను, అబ్బురపరచింది.

**13.9.5. జపాన్‌తో సంబంధాలు :** రష్యా-జపాన్‌ల మధ్య 1904లో జరిగిన యుద్ధంలో అమెరికా సానుభూతి జపాన్‌కే ఉంది. ఎందుకంటే జపాన్, తెరచి ఉంచు విధానాన్ని (ఓపెన్ డోర్) వ్యతిరేకించే దేశం అయిన రష్యాతో యుద్ధం చేస్తోంది. జపాన్‌కి విజయం సిద్ధించిన తర్వాత మంచూరియాపై అధికారాన్ని సుస్థిరం చేసికొని, అక్కడ తెరిచిఉంచు విధానాన్ని వ్యతిరేకించడం మొదలు పెట్టగానే అమెరికా ఆందోళన చెందసాగింది. థియోడోర్ రూజ్‌వెల్ట్‌ని జపాన్ -రష్యాల మధ్య రాజీ చేయమనగానే ఇతడు నిబంధనలను పెట్టాడు. మంచూరియాలో తెరచి ఉంచు విధానాన్ని గౌరవించాలని, మంచూరియాని చైనాకి ఇవ్వడానికి అంగీకరిస్తేనే మధ్య వర్తిత్వానికి అంగీకరించాడు. జపాన్ ఆవిధమైన హామీలను ఇవ్వగానే ఆగష్టు 1905లో పోర్ట్స్‌మత్ సంధి జరిగింది.

రష్యా-జపాన్ యుద్ధం తరువాత జపానీయులు అధిక సంఖ్యలో అమెరికాకు వలస రావడం ఆరంభించారు. పసిఫిక్ తీరానికి, ముఖ్యంగా కాలిఫోర్నియాకి ఈ తాకిడి ఎక్కువమంది. జపానీయుల పట్ల వ్యతిరేకత ప్రబలి ఆందోళనా ఉద్యమం ఆరంభమయింది. ప్రతి సంవత్సరం వేలకొలది జనం వలస రావడంతో అలజడి చెందిన కాలిఫోర్నియన్లు "ఎల్లోపెరిల్" గురించి వ్యాసాలు రాయడం, వారిపట్ల వివక్ష చూపడం, ఆరంభించారు. శాన్‌ఫ్రాన్సిస్కో పాఠశాల విద్యా బోర్డు వారు అక్టోబరు 1906లో జపానీ బాలురు వేరే ప్రత్యేక పాఠశాలలో చదవాలనే ఆంక్ష విధించారు. దీనితో స్నేహ సంబంధాలు క్షీణించాయి. పసిఫిక్ సముద్రానికి రెండు తీరాలలోని ప్రజలు ఆవేశాలు పెంచుకుని, యుద్ధ వాతావరణాన్ని ఏర్పరచారు. థియోడోర్ రూజ్‌వెల్ట్ జోక్యంతో శాంతి వాతావరణం నెలకొల్పబడింది. శాన్‌ఫ్రాన్సిస్కో ఉద్యోగులను మందలించి, వివక్ష ఆంక్షలను ఉపసంహరింపజేసాడు. జపాన్ ప్రభుత్వంతో పెద్ద మనుషుల ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. దీనివలన జపాన్ ప్రభుత్వం కొత్త పాస్‌పోర్టులను జారీ చేయనని పేర్కొంది. ఈ విధంగా జపాన్ ప్రభుత్వం వలసలను ఆపడానికి, అమెరికన్ ప్రజలు జపాన్ వ్యతిరేక ఆందోళన ఆపడానికి నిర్ణయించారు.

**13.9.6 యుద్ధ నౌకా దౌత్యం :** అమెరికా ఏ దేశానికి భయపడదని, చాలా శక్తివంతమైనదని ప్రకటించడానికి థియోడోర్ రూజ్‌వెల్టు కొత్త ప్రయోగాన్ని చేసాడు. పదహారు యుద్ధ నౌకలను ప్రపంచాన్ని చుట్టి రమ్మని 1907లో వర్జీనియా తీరం నుంచి పంపాడు. ఈ నౌకా దళం దక్షిణ అమెరికా, హవాయ్, న్యూజిలాండ్ ఆస్ట్రేలియా తీరాలలో పర్యటించి, జపాన్‌లోని యోకోహామాని కూడా దర్శించి 45వేల కిలోమీటర్ల సముద్రయానం చేసి 1909లో స్వదేశాన్ని చేరింది. ఈ ప్రదర్శన వలన 1908లో రూట్ తకహిరా ఒప్పందాన్ని అమెరికా - జపానులు కుదుర్చుకున్నాయి. దీనివలన ఇరు దేశాలు వారి స్థావరాలపట్ల పరస్పర గౌరవాన్ని కలిగి ఉందామని, పసిఫిక్ ప్రాంతంలో యథాతథ స్థితిని కొనసాగించాలని, చైనా స్వతంత్ర్యాన్ని గుర్తించాలని, అక్కడ తెరచి ఉంచు విధానాన్ని పాటించాలని అంగీకరించాయి.

**13.9.7 మొరాకో :** ఉత్తర ఆఫ్రికాలోని మొరాకో విషయమై ఫ్రాన్స్ జర్మనీల మధ్య 1905-06 సంవత్సరాలలో యుద్ధ వాతావరణం ఏర్పడగా రూజ్‌వెల్ట్ దానిని నివారించాడు. ఆల్జీరియాలో జరిగిన ఐరోపా సదస్సుకు హెన్రీ వైట్‌ని తన ప్రతినిధిగా పంపాడు.

## 13.10 సమీక్ష :

ఈ విధంగా థియోడోర్ రూజ్‌వెల్ట్ అధ్యక్ష కాలంలో అభ్యుదయ సంస్కరణలు ఆంతరంగిక విధానంలోనూ, బడిత కర్రను ఝుడిపించడం విదేశీ విధానంలోనూ కనిపిస్తాయి.

## 13.11 వ్యాస ప్రశ్నలు :

1. థియోడోర్ రూజ్‌వెల్ట్ అవలంబించిన అంతరంగిక విధానాలను వివరింపుము.
2. థియోడోర్ రూజ్‌వెల్ట్ అనుసరించిన బడితకర్ర విధానాన్ని విశదీకరించుతూ, అతడు ఏయే సందర్భాలలో ఆ విధానాన్ని అవలంబించాడో తెలియపరచుము.
3. ఇరవైయ్యవ శతాబ్దంలో అమెరికాలో ట్రస్టీల వ్యవస్థను వివరించుతూ, థియోడోర్ రూజ్‌వెల్ట్ వాటిని ఏ విధంగా నియంత్రించిందీ తెలియపరచుము.

## 13.12 ఉపయుక్త గ్రంథాలు :


1. H.B. Parkes : The United States of America - A History
2. Richards N. Current, Harry T. Williams & Frank Freedel : American History A Survey
3. Allen Nevins : The Pocket Hisotry of the United States.
4. V. Kameswara Rao & B. Lakshmi Narayana : America Samyukta Rashtrala Charitra (Telugu Academy, 1986)


డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డి
లెక్చరర్, లయోలా కాలేజి, విజయవాడ

పాఠం - 14

# ఉడ్రో విల్సన్ 1913-1921

## 14.0 లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడైన ఉడ్రో విల్సన్ (1913-21) ఆంతరంగిక వ్యవహారాలలో ప్రవేశపెట్టిన సంస్కరణలను, తద్వారా సామాన్య మానవుడికి కల్పించిన నూతన స్వేచ్ఛను, అతను అనుసరించిన విదేశీ విధానములను, మొదటి ప్రపంచ యుద్ధకాలములో యుద్ధచ్ఛాయలు అమెరికాకు సోకకుండా విల్సన్ చేసిన ప్రయత్నాలను, ప్రపంచానికి శాశ్వత శాంతిని కల్పించటానికి విల్సన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలను వివరించటం ఈ పాఠ్య లక్ష్యం.

## విషయ క్రమం


14.1 జీవిత విశేషాలు

14.2 ఆంతరంగిక విధానము

14.3 టారీఫ్ సంస్కరణ

14.4 గ్లాస్ - ఓవెన్ ఫెడరల్ రిజర్వ్ చట్టం

14.5 ట్రస్ట్‌ల సంస్కరణ

14.6 ఇతర సాంఘీక చట్టాలు

14.7 వైదేశిక నీతి

14.8 సంగ్రహంగా

14.9 వ్యాసరూప ప్రశ్నలు

14.10 ఉపయుక్త గ్రంథాలు


## 14.1 జీవిత విశేషాలు

ఉడ్రో విల్సన్ 1856 సంవత్సరములో వర్జీనియాలో ప్రెస్బిటేరియన్ మత ప్రచారకుల సంతతికి చెందిన కుటుంబములో జన్మించాడు. విల్సన్‌లో కాల్వినిస్ట్‌లకు సహజంగా ఉండే పట్టుదల, నైతిక ఆదర్శవాదము పుష్కలంగా ఉండేవి. తన బాల్య మంతయూ జార్జియా, కెరోలినాలలో గడిపాడు. ప్రిన్స్‌టన్ విశ్వ విద్యాలయము నుండి పట్ట భద్రుడైనాడు. వర్జీనియా విశ్వ విద్యాలయమునుండి న్యాయ శాస్త్రములో పట్టా పుచ్చుకొన్నాడు. జాన్ హాప్‌కిన్సు విశ్వవిద్యాలయము నుండి డాక్టరేట్ పట్టాను పొందాడు. ప్రిన్స్‌టన్ విశ్వ విద్యాలయం అధ్యక్షునిగా 1902 నుంచి 1910 వరకు కొనసాగాడు. విశ్వవిద్యాలయాన్ని పునర్వ్యవస్థీకరించే అంశంలో పరాజితుడై 1910లో రాజీనామాచేసి రాజకీయాలలో ప్రవేశించాడు. గొప్ప విద్యా వేత్తగా, రాజనీతి శాస్త్ర కోవిదుడుగా ఆదర్శవాదిగా, ప్రపంచ శాంతి కోరేవానిగా గొప్ప పేరు ప్రశంసలు పొందాడు.

రాజకీయాలలో, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా 1910లో న్యూజెర్సీ రాష్ట్ర గవర్నర్‌గా ఎన్నికయ్యాడు. న్యూజెర్సీలో ఎన్నో అభ్యుదయ చట్టాలను, కార్యక్రమాలను నిర్వహించి మంచి పరిపాలకునిగా పేరు తెచ్చుకొన్నాడు.

విద్యావేత్తగా జీవితమారంభించినప్పుడే విల్సన్ అమెరికన్ ప్రభుత్వ వ్యవస్థపై పుస్తకం రాశాడు. అందులో బ్రిటన్ ప్రధాన మంత్రివలె అమెరికా అధ్యక్షునికి కూడా విశేషాధికారాలు ఉండాలని పేర్కొన్నాడు. 1913లో అధ్యక్ష స్థానమలంకరించినప్పటి నుండి 1919లో పదవిని వదిలే వరకూ తన నూతన సిద్ధాంతాలనే అతడు ఆచరణలో పెట్టాడు.

తన మొదటి అధ్యక్ష కాలములో పెట్టుబడి దారుల చేత సామాన్య మానవుడు పీడనకు గురికాకుండా చట్టాల ద్వారా రక్షణ కల్పించాడు. జీవితము మంచి చెడ్డలకు మధ్య జరిగే సంగ్రామమనీ, ధర్మ నిరతికే అంతిమ విజయం వస్తుందనీ భావించేవాడు. మంచిని కోరేవారు దానికే అంకితమై ఉండాలే తప్ప రాజీపడడం గాని, లొంగిపోవడంగాని చేయరాదని భావించాడు. దురభిమానానికిగాని, ధనలోభానికిగానీ లొంగక ఎప్పుడూ ఉదాత్త ఆశయాలవైపే మొగ్గు చూపాడు. ఇతడు చక్కని వక్త. తన ఉపన్యాసాల ద్వారా అసంఖ్యాక ప్రజలను ప్రభావితము చేయగలశక్తి, అతనిలో ఉండేది.

విల్సన్ తన అధ్యక్ష ప్రారంభోపన్యాసంలో భారీ పారిశ్రామికులచేత, పెట్టుబడిదారుల చేత సామాన్య మానవుడు పీడనకు గురికాకుండా నూతన స్వేచ్ఛను కల్పించనున్నట్లు ప్రకటించి, దానిని ఆచరణలో తేవడానికి వెంటనే ఉద్యమించాడు.

## 14.2 ఆంతరంగిక విధానము :

విల్సన్ అమెరికాలో తను అధ్యక్షునిగా ఉన్న కాలములో ఆంతరంగిక పరిపాలనలో ప్రవేశపెట్టిన సంస్కరణలను నూతన స్వేచ్ఛ అని అంటారు. భారీ పారిశ్రామికుల చేత, పెట్టుబడి దారులచేత సామాన్యుడు పీడనకు గురికాకుండా రక్షణ కల్పించటాన్ని నూతన స్వేచ్ఛ అంటారు. నూతన స్వేచ్ఛ సంస్కరణలలో భాగముగా టారిఫ్, ట్రస్ట్‌లలో, బాంకింగ్ పద్ధతులలో ఉన్న లోపాలను గ్రహించి, ఈ మూడింటినీ అదుపులోపెట్టడానికి కృషి చేసాడు. ఇంతేకాకుండా అమెరికాలోని వ్యవసాయ దారుల అభ్యున్నతికి, కార్మిక హక్కులకు, నూతన చట్టాల ద్వారా మేలు చేసాడు. జాతీయ వనరుల పరిరక్షణకు, స్త్రీలకు ఓటు హక్కు కల్పించుట, మద్యంపై నిషేధము, మొదలగు ఇతర సంస్కరణలెన్నో ప్రవేశపెట్టి మేలు చేసాడు. విల్సన్ అటు పెట్టుబడిదారుల చెప్పు చేతలలోగానీ లేక ఇటు వామ పక్షాలవారి ప్రభావములోగానీ పడకుండా ఒక మధ్య మార్గాన్ని ఎన్నుకొని చిన్న, చిన్న వ్యాపారస్తులకు, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి గట్టి మేలు చేసాడు.

## 14.3 టారిఫ్ సంస్కరణ : అండర్ ఉడ్ టారిఫ్ చట్టం

అమెరికాలో సామాన్య కొనుగోలుదారులు విపరీతమైన టారిఫ్‌ల వల్ల చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని గ్రహించి విల్సన్ టారిఫ్‌లను తగ్గించాలి అనుకొన్నాడు. టారిఫ్‌లను తగ్గించటానికి వీలులేకుండా వ్యతిరేకంగా ఈ బిల్లు చట్టం కాకుండా చేయటానికై కొందరు ధనికులు తమ పలుకుబడిని ఉపయోగించి కాంగ్రెస్‌లో సభ్యులను ప్రలోభపెట్టారు. కానీ విల్సన్ ఈ ధనికుల పైరవీలను, ప్రజలలోకి తీసుకొని వెళ్ళి లాబీలకు వ్యతిరేకంగా ప్రచారము చేసి, లాబీయిస్టుల మోసాన్ని బహిరంగపరచాడు.

ఈ బిల్లును ఏప్రియల్ 7, 1913న ఒక ప్రత్యేక కాంగ్రెస్ సమావేశంలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ బిల్లును ప్రవేశ పెట్టినప్పుడు, దిగువ సభలో ఆమోదం లభించినప్పటికీ, ఎగువ సభలో అనగా సెనేట్‌లో అడుగడుగున ఆటంకాలు ఎదురయ్యాయి. అప్పుడు విల్సన్ సెనేట్ సభ్యులలో కొందరు పెట్టుబడి దారీ వర్గాల ప్రయోజనాలు కాపాడటానికి స్వార్థముతో, ప్రజలకు మేలు కల్పించే చట్టమైన అండర్ ఉడ్ టారిఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటన చేయగా ప్రజలు సెనేటర్ల పై వ్యతిరేకత తెలియపరచి ఒత్తిడి చేయగా ప్రజా చైతన్యానికి భయపడి ఆరు నెలల అనంతరము ఈ బిల్లును సెనేట్ కూడా ఆమోదించింది. ఈ విధంగా అండర్ ఉడ్ టారిఫ్ అక్టోబర్ 1913లో చట్టమైంది. ఈ చట్టం వల్ల నూటికి పై చిలుకు వస్తువులపై సుంకాలు తొలగించడం జరిగింది, మరో వెయ్యి వస్తువులపై సగటున 27% నుండి 37% వరకు సుంకాలు తగ్గించటం జరిగింది.

అండర్ ఉడ్ టారిఫ్ చట్టం వలన ప్రభుత్వ ఆదాయము బాగా తగ్గిపోయింది. దీనిని పూడ్చటానికి అంచెలవారీ ఆదాయపు పన్ను ప్రవేశపెట్టారు. మూడువేల డాలర్ల ఆదాయం నుంచి ఒక శాతం పన్ను ఉండేది. అదనపు సర్‌ఛార్జీ 20,000 డాలర్లపై ఆదాయంపై మొదలై 5,00,000 డాలర్ల ఆదాయాలపై గరిష్టంగా ఆరు శాతం సర్‌ఛార్జీ విధించటాన్ని ప్రవేశపెట్టారు.

ఈ నూతన టారిఫ్ చట్టం ఒక్క సంవత్సరకాలం బాగా పని చేసినట్లుగా తెలుస్తుంది. కానీ ఆ తరువాత ఈ చట్ట ప్రభావము ప్రపంచ యుద్ధ కాలములో మరుగునపడింది.

## 14.4 గ్లాస్‌ఓవెన్ ఫెడరల్ రిజర్వ చట్టం :

డిసెంబరు, 1913లో ప్రవేశ పెట్టిన ఈ చట్టం ద్రవ్య వ్యవస్థను సంస్కరించడానికి ఉద్దేశించబడింది. అమెరికాలో జాతీయ బాంకింగ్ వ్యవస్థలో రెండు బలహీనతలు ఉన్నాయి. అవి : 1) బాంకులో ప్రభుత్వ బాండ్లు ఎన్ని ఉంటే వాటికి సరిపోను ధనము మాత్రమే ప్రవేశ పెట్టవలసి ఉంటుంది. ప్రజలకు నోట్ల అవసరాన్ని బట్టి నోట్లని పెంచే అవకాశం లేదు. వ్యాపారము పెరిగిన కొద్దీ నోట్లను పెంచే సౌకర్యం లేకపోయింది. అందువలన ధన సంచయము ఏర్పడింది. ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ అమెరికాలో ఈ సమస్య ఎక్కువైంది.

దేశంలోని 30,000 బ్యాంకులు వేటికవి స్వయం ప్రతిపత్తి కలిగి పరస్పర సంబంధము లేకుండా ఉన్నాయి. అవి తమ ఆర్థిక వనరులపైనే ఆధారపడి ఉండేవి. అందుచేత ఒత్తిడి సమయాల్లో ఈ బ్యాంకులు రుణగ్రస్తుమవడం, దివాలాతీయడం జరిగేవి. ఈ ద్రవ్య చెలామణి పద్ధతిని మార్చాలనే కోరిక ప్రజలలో పాప్యులిస్టు ఉద్యమం నుంచి ఉంది.

1907లో జాతీయ ఆర్థిక పరిస్థితి సౌమ్యంగా ఉన్నా బ్యాంకింగ్ వ్యవస్థ అస్తవ్యస్తమయింది. కొంతమంది విత్త వినియోగదారులు మదుపులతో చట్ట వ్యాపారం చేయుటమే దీనికి కారణం. బాంకుల ఉపద్రవం వలన వ్యాపారం దెబ్బతిని నిరుద్యోగం ఎక్కువయింది. దేశంలో ద్రవ్య చలామణి ప్రైవేటు బ్యాంకుల అనుచిత నియంత్రణను, ద్రవ్య అవ్యాకోచత్వాన్ని తొలగిస్తేగానీ ఈ సమస్యను పరిష్కరించటం సాధ్యపడదని ప్రజలు భావించారు.

ఈ పరిస్థితిని తొలగించటానికి 1908లో ప్రభుత్వము ఆల్డ్రిచ్ వ్రేలాండ్ చట్టాన్ని ప్రవేశ పెట్టింది. కానీ అది అంతగా ఉపయోగ పడలేదు. ద్రవ్య సమస్య స్వరూపాన్ని కూలంకషంగా పరిశీలించడానికి కాంగ్రెస్ రెండు బృందాలను నియమించింది. అవి : 1) నేషనల్ మానిటరీ కమిషన్ 2) పూజోకమిటి నేషనల్ మానిటరీ కమిషన్‌వారు దేశంలోని బాంకింగ్ వ్యవస్థలో 17లోపాలు ఉన్నట్లు తెలిపారు. బాంకింగ్ చట్టాలను సంపూర్ణంగా తిరగదోడవలెనని, కేంద్ర బాంకును స్థాపించవలెననీ సిఫార్సు చేసారు. పుజో కమిటీ సమాచారం ప్రకారం కొద్దిమంది పెట్టుబడి దారులు దేశంలోని ధనాన్నేకాక, అమెరికా వ్యాపారాన్నంతా కొన్ని ప్రత్యేక పద్దతుల ద్వారా తమ గుప్పెట్లో పెట్టుకొన్నారని తెలిపింది.

1913లో విల్సన్ స్వయంగా కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి బాంకుల నిర్వహణలో మార్పు ఆవశ్యకతపై ఉపన్యసించి, వారిని అంగీకరింపజేసాడు. గ్లాస్-ఓవెన్ ఫెడరల్ రిజర్వ్ చట్టము కాంగ్రెస్ ఆమోదాన్ని పొందింది. ఈ బిల్లును కార్టర్ గ్లాస్ అనే వర్జీనియా రాష్ట్ర ప్రతినిధి కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టినందున ఈ చట్టానికి ఆ పేరు వచ్చింది. ఈ చట్టం డిసెంబర్ 1913లో ఆమోదము పొందింది.

ఈ ఫెడరల్ రిజర్వ్ చట్టం ద్వారా విల్సన్ వికేంద్రీకృత బాంకింగ్ రంగాన్ని ప్రవేశపెట్టి, దాన్ని ప్రభుత్వ ఆధీనములో ఉండేటట్లు చేసాడు. అమెరికాను 12 జిల్లాలుగా విభజన చేసి ప్రతి జిల్లాలో ఒక ఫెడరల్ రిజర్వ్ బాంక్‌ను స్థాపించారు. వీటి నియంత్రణకై ఒక కేంద్ర రిజర్వ్ బోర్డును నియమించాడు. ఈ బోర్డులో ఒక ఖజానా శాఖ కార్యదర్శి, ఖజానా నియంత్రణాధికారి ఇంకను ఐదుగురు సభ్యులు కూడా ఉన్నారు. వీరి పదవీ కాలం పది సంవత్సరాలుగా నిర్ణయించడం జరిగింది.

ఈ ఫెడరల్ రిజర్వ్ బ్యాంకులు మామూలు వ్యాపారం చేయకుండా, తమ నిర్ణీత ప్రదేశాలలో ఉన్న బాంకులకు సహకారమిచ్చే బాంకు గా మాత్రమే వ్యవహరించసాగాయి. అప్పటి వరకు చలామణిలో ఉన్న నోట్లను చెల్లకుండా చేసి, వాటి స్థానములో ఫెడరల్ రిజర్వ్ నోట్లను ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ పాత నోట్లను ఫెడరల్ రిజర్వ్ బాంకునుండి మార్చుకొనవలసి వచ్చింది.

సభ్య బాంకులు, వారి వద్దనున్న బంగారము బాండ్లను, వ్యాపార లావాదేవీల సెక్యూరిటీస్‌ను, ఫెడరల్ బాంకులలో జమచేసి, ఫెడరల్ రిజర్వ్‌నోట్లను తెచ్చుకొనవచ్చును. దీనివలన కావలసినంత నోట్ల సరఫరా జరిగి వ్యాపారానికి అవసరమైనన్ని ఉంటాయని అంచనా. ఈ

విధముగా దేశములో ఉన్న అన్ని బాంకుల డిపాజిట్లు. రిజర్వ్ బాంకులలో జమచేయాలి. దీని వలన ప్రమాదములో పడిన వ్యవస్థలకు సహాయాన్ని అందించడం కూడా జరిగింది.

ఈ విధంగా ఆపత్కాలంలో సభ్య బాంకులకు ఫెడరల్ రిజర్వ్ బాంకు అప్పులిచ్చే అవకాశం కూడా ఏర్పడింది. 1915 నాటికి దేశములో ఉన్న మొత్తం బాంకింగ్ ధనములో సగం ఫెడరల్ రిజర్వ్ వ్యవస్థ నియంత్రించింది. 1928 నాటికి 80% శాతం ధనాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకొంది.

## 14.5 ట్రస్ట్‌ల సంస్కరణ :

టారిఫ్ బాంకింగ్‌ల తరువాత విల్సన్ ట్రస్ట్‌ల సంస్కరణను చేపట్టాడు. గుత్త వ్యాపారాన్ని నిర్మూలించి చక్కని పోటీకి వీలు కల్పించే ఉద్దేశ్యంతో రెండు బిల్లులను తీసుకురావడం జరిగింది. 1914 సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ చట్టాన్ని, క్లేటన్ చట్టాలను కాంగ్రెస్ ఆమోదించింది.

ఫెడరల్ ట్రేడ్ కమిషన్ చట్టం వ్యాపారములో పోటీని నివారించటానికి, కొందరు పెట్టుబడిదారులు తొక్కే అడ్డ దారులను నివారించడానికి ఉద్దేశించబడింది. వ్యాపార పద్ధతులను గమనిస్తూ, వ్యాపారాన్ని ఆపమని నిషేధించగల ఆజ్ఞలను జారీ చేయగల అధికారాన్ని ఫెడరల్ ట్రేడ్ కమీషన్‌కి ఇవ్వడం అయింది. పెద్ద పెద్ద గుత్త వ్యాపారస్థులు చిన్న వ్యాపార సంస్థలను అణగద్రొక్కడాన్ని వ్యతిరేకించి, అధ్యక్షుడు చిన్న వ్యాపారస్తులకు భద్రత కల్పించాడు.

ట్రస్టుల వ్యతిరేక చట్టాలను ఉల్లంఘించే వ్యక్తులకు, సంస్థలపై అపరాధపు పన్ను విధించడం జరిగింది. రైలు ఛార్జీలు, వ్యాపార వస్తువుల ధరలను క్రమబద్ధము చేసాడు. క్లేటన్ చట్టం పోటీని నివారించే అనేక పద్ధతులను చట్ట భద్రత లేనివిగా పేర్కొంది. ఇంటర్ లాకింగ్ డైరెక్టరేట్స్‌నో, ఒక సంస్థలోని నిలువ సరకును పోటీ వ్యాపారస్థుడు కొనటాన్నీ, గుత్త వ్యాపారాన్నీ, ధరలు హెచ్చు తగ్గులు కల్పించడాన్ని ఈ చట్టం నిషేధించింది. విల్సన్ అధ్యక్ష కాలములో ఫెడరల్ ట్రేడ్ కమీషన్ చట్టం అమలులోకి వచ్చి 1915 నుండి 1921 మధ్య కాలంలో 788 సంస్థల అక్రమాలను గూర్చి విన్నపాలను అందుకొని, 379 సంస్థలను మూతవేయించి మిగిలినవానిపై చర్యలు తీసుకొని అపరాధ పన్నులను విధించడం జరిగింది.

క్లేటన్ చట్టం అమలులోకి వచ్చి మొత్తం విల్సన్ అధికారంలో ఉన్న కాలములో 92 గుత్త వ్యాపార ట్రస్టుల సంస్థలను విచారించి అపరాధ రుసుమును వసూలు చేసింది.

క్లేటన్ చట్టం ఆరవ సెక్షనులో ట్రస్ట్ వ్యతిరేక చట్టాల నుంచి కార్మిక సంఘాలను మినహాయించి కార్మికులకు ఉపకారమొనర్చింది. సెక్షన్ ఇరవైలో కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం జరిపే సమ్మెలు, బాయికాట్లు, పికెటింగ్‌లు చట్ట సమ్మతమని గుర్తించింది. అందువల్ల కార్మికులు క్లేటన్ చట్టాన్ని తమ పాలిట 'యాగ్నాకార్టా'గా అభివర్ణించారు.

## 14.6 ఇతర సాంఘీక చట్టాలు :

ఉడ్రో విల్సన్ సంక్షేమాన్ని ఉద్దేశించి మరికొన్ని సాంఘీక చట్టాలను కూడా అమలులోకి తెచ్చాడు.

1914లో స్మిత్ లీవర్ చట్టం ద్వారా మిలియన్ డాలర్లను రైతుల హోమ్ డిమొన్‌స్ట్రేషన్ పనికి కేటాయించి, అమెరికాలో వ్యవసాయ అభివృద్ధికి దోహద పడ్డాడు. 1916 ఫెడరల్ వ్యవసాయ ఋణాల చట్టాన్ని ప్రవేశపెట్టి, ఈ చట్టం ద్వారా వ్యవసాయదారులకు తక్కువ వడ్డీలకు ఋణ సౌకర్యం కలిగించాడు. పంటలపై ఋణాలను ఇవ్వటం, రైతులకు అవసరమైన రోడ్ల నిర్మాణం చేయటం కూడా చేసాడు. 1917లో స్మిత్ - హ్యూగ్స్ చట్టం ప్రవేశపెట్టి, తద్వారా వ్యవసాయ శాస్త్ర విజ్ఞానాన్ని కళాశాలలో అధ్యయనానికి కావలసిన ఆర్థిక వనరులకు ప్రభుత్వం కొంత ఏర్పాటు చేసింది. ఈ విధంగా వ్యవసాయ రంగంలో పంటలపై పరిశోధనకు వీలు కల్పించింది.

1915 లాఫోలెట్ ప్రతి పాదించిన సీమెన్స్ చట్టం వల్ల సముద్రాలపైన, సరస్సులలోనూ ఓడలు నడిపే నావికులకు న్యాయమైన వేతనాలను, భోజనాది సౌకర్యాలను కల్పించాడు. వర్కుమెన్స్ కాంపెన్సేషన్ చట్టాన్ని ఆమోదింపచేసి ప్రభుత్వ కార్యాలయాలలో పని చేసే వ్యక్తులు అశక్తులైనప్పుడు వారికి పరిహారం ఇప్పించే ఏర్పాటు కల్పించాడు.

1916లో 17 లక్షల రైలు కార్మికులు నానా ఇక్కట్లకులోనై సమ్మెకు పూనుకొన్నారు. దీనివల్ల దేశ రక్షణ కార్యక్రమం స్తంభించింది. ఈ పరిస్థితిని సంస్కరించటానికై 1916లో విల్సన్ ఆడమ్సన్ చట్టాన్ని ప్రవేశపెట్టాడు. ఈ చట్టం వలన రైలు కార్మికులకు రోజుకు 8 గంటలకు మించి పని చేయవలసిన అవసరం తీరింది. మిగులు పనికి మిగులు వేతనం కూడా ఏర్పాటైంది. కీటింగ్ - ఓవెన్ ఛైల్డు లేబర్ చట్టం ద్వారా, బాల కార్మికులను నిషేధించే ఏర్పాటును కల్పించాడు.1918లో 18వ రాజ్యాంగ సవరణ ద్వారా మద్య నిషేధాన్ని, 19వ రాజ్యాంగ సవరణ ద్వారా స్త్రీలకు ఓటు హక్కును కల్పించాడు.

విల్సన్ ప్రతిపాదించిన నూతన స్వేచ్ఛా చట్టాల ద్వారా అమెరికాలో తనకు ముందు అధ్యక్షులు మొదలు పెట్టి అభ్యుదయ వాదా ఉద్యమాన్ని పతాక స్థాయికి చేర్చించి. విల్సన్ ఎంతో ఆసక్తితో అమెరికాలో సామాన్య మానవుని ఆర్థిక, మరియు సామాజిక స్థితిని మెరుగు పరిచే ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటికి, అధికార యంత్రాంగము చిత్త శుద్ధిగా ఆ చట్టాలను అమలు పరచనందువల్లను, అప్పటికి మొదటి ప్రపంచ యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావము చూపుటవల్లనూ, తను ఆశించిన మేర తన కృషి ఫలించలేదనే చెప్పాలి.

## 14.7. వైదేశిక నీతి :

అమెరికా అధ్యక్షుడైన ఉడ్రో విల్సన్ ఆంతరంగిక వ్యవహారాలపై ఎక్కువ శ్రద్ధ చూపాలని తన సమయాన్ని వీలైనంత తక్కువగా అంతర్జాతీయ రంగంలో వినియోగించాలని అనుకొన్నాడు. కానీ వాస్తవానికి అప్పుడు ప్రపంచ అంతర్జాతీయ వ్యవహారాలలో నెలకొన్న పరిస్థితుల వల్ల విల్సన్ తన ఇష్టానికి విరుద్ధంగా ఎక్కువ సమయాన్ని, తన శక్తియుక్తులను అంతర్జాతీయ వ్యవహారాలపై వినియోగించవలసి వచ్చింది.

**14.7.1 జపాన్‌తో సంబంధాలు** : కాలిఫోర్నియా రాష్ట్రములోనికి జపానీయులు 1900 నాటికి అధికంగా వలసవచ్చారు. 1890లో జపానీయులు 26,000 మాత్రమే ఉండగా, ఆ సంఖ్య 1900 నాటికి 1,30,000కు పెరిగింది. ఇంకనూ నూతనంగా వచ్చే వారిని నిరుత్సాహ పరచటానికి కాలిఫోర్నియా రాష్ట్ర శాసన సభ జపానీయులు ఆ రాష్ట్రములో భూములు సంపాదించ రాదనే శాసనాన్ని ప్రవేశ పెట్టాలని తలంచింది. దీనికి జపాన్ తీవ్ర నిరసన వ్యక్తపరుస్తూ యుద్ధ ప్రసంగాలు చేయటం కూడా మొదలు పెట్టింది. జపానీయ ప్రభుత్వం కాలిఫోర్నియాలో ప్రవేశపెట్టబడుచున్న జపాన్ వ్యతిరేక చట్టాలను గూర్చి వారి నిరసన భావాన్ని వ్యక్తపరచగా, విల్సన్ ప్రమేయముతో కాలిఫోర్నియా రాష్ట్రం జపనీయులను ప్రత్యేకంగా చట్టాలలో ఉటంకించడం మానివేసి ఆసియా వాసులెవరూ ఆ రాష్ట్రంలో భూములు కొనరాదనే సవరణను ఆమోదింపచేసినారు. దీనివల్ల కలిగే పర్యవసానము ఒకటే అయినా పరిస్థితిలో తీవ్రత తగ్గింది.

**14.7.2 బ్రిటన్‌తో సమస్య** : 1912లో పనామా కెనాల్ టోల్సు చట్టం అను దానిని టాఫ్ట్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టాడు. దీని ప్రకారము పనామా కెనాల్లో తిరిగే అమెరికా ఓడలపై పన్ను రద్దు పరిచారు. కానీ ఇది 1901లో ఏర్పాటు చేసుకొన్న హే-పౌన్స్‌ఫోట్ సంధికి విరుద్ధము. ఈ సంధి ప్రకారం అన్ని దేశాల వారి నుంచి సమానంగా ఓడరేవు సుంకాలు వసూలు చేయవలసిన నిబంధన ఉన్నది. దీనిపై 1912లో అమెరికా పొందగోరే మినహాయింపుకు బ్రిటన్ వ్యతిరేకించింది. బ్రిటన్ వాదనలో ఉన్న సత్యాన్ని గ్రహించిన విల్సన్ 1914లో కాంగ్రెస్‌కు హాజరై అమెరికన్ ఓడలకున్న రేవు మినహాయింపులను తొలగించవలెనని విజ్ఞప్తి చేసాడు. తీవ్ర చర్చానంతరం ఈ విజ్ఞప్తి ననుసరించి చట్టాన్ని సవరించడం జరిగింది.

**14.7.3. మెక్సికోతో సంబంధాలు** : మధ్య, దక్షిణ అమెరికాలోని సాటి గణతంత్ర రాజ్యాలతో స్నేహ సంబంధాలు నెరపి వాటి విశ్వాసాన్ని చూరగొనడానికి విల్సన్ తీవ్రయత్నం చేసాడు. ఈ విధానానికి ఆనాటి మెక్సికోలో పరిణామాలు సవాలుగా నిలిచాయి. మూడు

దశాబ్దాలుగా పోర్ఫిరియో డయాజ్, నియంతృత్వం కొనసాగింది. ఈ కాలములో మెక్సికో సహజ సంపద అయిన ఖనిజతైలము గనులు విదేశీ పెట్టుబడి దారుల వశమయ్యాయి. ఈ కాలములో 50 వేల మంది అమెరికన్‌లు అక్కడ స్థిరబడి అక్కడే సుమారు బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టారు. మెక్సికోలో స్థిరపడిన అమెరికన్‌లు ఆ దేశపు తైల నిక్షేపాల మొత్తంలో సగభాగాన్ని 2/3వ వంతు రైలు మార్గాలను, 3/4వ వంతు గనులను, సొంతం చేసుకొన్నారు.

డయాజ్ అమెరికన్లతో చాలా స్నేహముగా ఉన్నాడు, కానీ మెక్సికో ప్రజలు డయాజ్‌ను అసహ్యించుకొన్నారు. మెక్సికో సహజ సంపదలతో సౌభాగ్యవంతముగా ఉన్నా, కోటిన్నర జనాభాలో అత్యధిక బాగము భూమి పుత్రలేని పాటక జనమే. ఆదేశంలోని భూమి కొంత మంది భాగ్యవంతుల చేతులలోను విదేశీయుల చేతులలోను ఉండి పోయింది. అందువల్ల మెక్సికో ప్రజలు ఫ్రాన్సిస్కోమాడెరో నాయకత్వంలో 1910లో డయాజ్‌పై తిరిగబడ్డారు. డయాజ్ మెక్సికో నుండి పారిపోగా మాడిరో మెక్సికో అధ్యక్ష స్థానాన్ని ఆక్రమించాడు. మాడెరో మెక్సికోలోని పరిస్థితిని చక్క పెట్టలేకపోయాడు. జనరల్ హుఎర్టో అనే రెడ్ ఇండియన్ హుర్టాను చంపివేసాడు. తరువాత హుఎర్టో మెక్సికో అధ్యక్ష స్థానాన్ని ఆక్రమించుకొన్నాడు. హుఎర్టా ప్రభుత్వాన్ని ప్రపంచ దేశాలు 25 గుర్తించాయి. కానీ అమెరికా అధ్యక్షుడైన విల్సన్ మెక్సికోలోని హుఎర్టా ప్రభుత్వానికి గుర్తింపు ఇవ్వలేదు. దీనికి ప్రతీకారంగా హుఎర్టో మెక్సికోలోని అమెరికన్ పౌరులను హింసించడం మొదలు పెట్టాడు. ఈ తగాదా పెద్దదైంది. అమెరికా నౌకాదళానికి చెందిన కొందరిని మెక్సికన్ పోలీసులు నిర్బంధించారు. విల్సన్ మెక్సికో రేవు పట్టణమైన వెరాక్రాజ్‌ను ఆక్రమించాడు. యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంతలో ఈ యుద్ధాన్ని నివారించటానికి లాటిన్ అమెరికాలో ముఖ్య రాజ్యాలైన అర్జెంటైనా, బ్రెజిల్, చిలీలు (ఎ.బి.సి. దేశాలు) మధ్య వర్తిత్వం నెరపటానికి ముందుకు వచ్చినప్పటికీ, అమెరికాకూడా ఈ మధ్యవర్తిత్వానికి ఒప్పుకొన్నప్పటికీ హుఎర్టా ఒప్పుకోలేదు. తప్పనిసరి పరిస్థితులలో అమెరికా కాంగ్రెస్ తన నౌకాదళాన్ని వెరాక్రాజ్ ఆక్రమణకు ఆదేశించింది. ఏప్రిల్ 21, 22, 1914లలో ఈ ఆక్రమణ జరపగా అందులో 126 మెక్సికన్‌లు మరణించారు, 195 తీవ్రంగా గాయపడ్డారు. అమెరికా సైనికులు 19 మంది మరణించగా 17 మంది గాయపడ్డారు. ఇటువంటి పరిస్థితులలో మెక్సికోలో పరిస్థితులు తారుమారయ్యాయి. హుఎర్టా 1914లో తన దేశం నుండి పారిపోవలసి వచ్చింది.

హుఎర్టా తరువాత కరంజా అనునతడు మెక్సికో అధ్యక్షుడైనాడు. కరంజా అమెరికన్ల యందు స్నేహ భావంతో ఉన్నందున, అమెరికా వెరాక్రాజ్ నుండి తన సైన్యాన్ని ఉపసంహరించింది. అయినప్పటికీ మెక్సికోలో అమెరికన్ పౌరుల ప్రాణ ధనాలకు రక్షణ లేకుండా పోయింది. దీనికి కారణం మెక్సికోలో రగిలిన అంతర్యుద్ధం. 1914లో కరంజా మాజీ సైనికాధికారి అయిన ఫ్రాన్సిస్కో విల్లా అనునతడు కరంజా అధికారాన్ని కూలదోయటానికి ప్రయత్నం చేసాడు. విల్లా దుష్ట చర్యలను అరికట్టటానికి అక్టోబర్ 1915లో అమెరికా, ఎ.బి.సి. రాజ్యాలతో కలసి కరంజా ప్రభుత్వానికి గుర్తింపునిచ్చింది. విల్లా అమెరికాపై కోపంతో కొంత సైన్యాన్ని సమీకరించి, కొలంబస్‌పై దాడి జరిపి 17 మంది అమెరికన్ పౌరులను వధించాడు. దీనికి కోపోద్రీకుడైన విల్సన్, విల్లాను బంధించటానికి సైన్య పటాలాన్ని మెక్సికోకు పంపాడు. కానీ విల్లాను పట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మెక్సికో అధ్యక్షుడైన కరెంజాను అగౌరపరచటం ఇష్టంలేనందువల్లనూ, 1917లో అమెరికాకు జర్మనీకి మధ్య యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితులు ఏర్పడినందువల్లనూ మెక్సికోదేశంతో అమెరికా రాజీ పడడం జరిగింది. రాజీ ఫలితంగా అమెరికా తన సైన్యాన్ని మెక్సికోనుండి వెనుకకు రప్పించింది.

**14.7.4. ప్రథమ ప్రపంచ సంగ్రామము తటస్థ విధానము :** ప్రపంచములోని బలవత్తర రాజ్యాలు పందొమ్మిదవ శతాబ్దం నుంచి సామ్రాజ్య దాహాన్ని, సైనిక శక్తిని అభివృద్ధి చేసుకొన్నాయి. దీనివల్ల ఈ అగ్రరాజ్యాలు పరస్పర భయంతో భీతిల్లి కూటాలుగా ఏర్పడడం మొదలయింది. ఐరోపా 1914 నాటికి రెండు కూటాలుగా విడిపోయింది. జర్మనీ - ఆస్ట్రియా హంగరీలు ఒక వైపున కేంద్ర రాజ్యాల కూటమి (Costral Powers) గా నిలిస్తే, మరొక వైపున బ్రిటన్, ఫ్రాన్స్ రష్యాలతో కూడిన మిత్ర రాజ్యాలు మరో కూటమిగా (Allied powers) ఏర్పడ్డాయి. ఇంతలో జూన్ 28వ తేదీన ఆస్ట్రియా - హంగరీ సింహాసనానికి వారసుడైన ఫ్రాన్సిస్ ఫెర్డినాండ్ సరజీవో నగరంలో హతుడయ్యాడు. ఆస్ట్రియా సెర్బియాపై యుద్ధం ప్రకటించింది. సెర్బియాకు బాసటగా రష్యానిలిస్తే, ఆస్ట్రియాకు అండగా జర్మనీ వచ్చింది. 1915 వ సంవత్సరం సగం గడిచేటప్పటికి ఐరోపాలో ఒక దేశం తరువాత మరో దేశము మొదటి యుద్ధ సుడిగుండంలో పడిపోయాయి.

**అమెరికా తటస్థ విధానము :** మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభంలోనే విల్సన్ అమెరికా తటస్థంగా ఉంటుందని ప్రకటించాడు. అమెరికా జనాభాలో సగానికిపైగా ఇంగ్లీష్, కెనడియన్ ప్రజల సంతానమె, సాంస్కృతిపరంగా, ఆచార వ్యవహారాలవల్ల, భాషా బంధనాలవల్ల అమెరికా ప్రజలు ఆంగ్ల ప్రజలకు దగ్గరై ఉన్నారు. అమెరికా స్వాతంత్ర్య సమరంలో ఫ్రెంచివారు అమెరికాకు అందించిన సహాయంవలన మొదటి ప్రపంచ యుద్ధంలో మిత్ర పక్షాలవైపు అమెరికా ఉండాలని భావించింది. నిష్కారణంగా బెల్జియంపై జర్మన్‌లు దండెత్తి ఆ చిన్న దేశంలోని ప్రజల ప్రాణ, ధనాలకు విపరీతమైన నష్టం కలిగించడం అమెరికన్ ప్రజలకు కోపం కలిగించింది. అమెరికన్ సామ్రాజ్య విస్తరణలో సమోవా, మనీలా జల సంధుల దగ్గర జర్మనీ అడ్డు తగలడాన్ని అమెరికన్‌లు మరువలేదు. వీటన్నింటి కంటే అధికంగా, జర్మనీ సరకులు ప్రపంచ విపణిలో చాలా తక్కువ వెల పలుకుతూ అమెరికా వాణిజ్యంపై దెబ్బ తీయడం అమెరికన్‌లకు ఎంతో మనస్థాపాన్ని కలుగజేసింది.

అయితే కొందరు ప్రపంచ యుద్ధంలో కేంద్ర పక్షాన అమెరికా ఉండాలని ప్రచారము చేసారు. అమెరికా జనాభాలో 1/5 వ వంతు ప్రజలు జర్మన్, ఆస్ట్రియా సంతతివారు. చాలా మంది అమెరికన్ పౌరులు జర్మనీలోని విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించారు.

ప్రపంచ యుద్ధారంభానికి పూర్వం నుంచే అమెరికన్‌లు పెద్ద మొత్తంలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశీయులకు అప్పుగా ఇచ్చారు. ఈ యుద్ధం వలన అమెరికా వ్యవసాయరంగం యుద్ధం పూర్వం ఉన్న ఆర్థిక సంక్షోభం నుండి బయట పడసాగింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలలో అమెరికా పత్తి, గోధుమ, మాంసము ఉత్పత్తులకు మార్కెట్ లభించింది. దీనికి విరుద్ధంగా కేంద్ర రాజ్యాలతో అమెరికా యొక్క వాణిజ్య వర్తకాలు పెద్ద లాభదాయకంగా కూడా లేదు. అందుచేత ఆర్థిక కారణాలు అమెరికా విధానాన్ని నిర్ణయించాయి.

అయితే అమెరికా మిత్ర పక్షాల వైపు మొగ్గు చూపటానికి ఎన్నో బలమైన కారణాలు ఉన్నప్పటికి అమెరికా అధ్యక్షుడు అమెరికాను యుద్ధం వైపు నడిపించటానికి ససేమిరా ఇష్టపడలేదు. అమెరికాను యుద్ధంలో చేర్చకుండా ఉండాలంటే అసలు ఈ ప్రపంచ యుద్ధాన్నే జరగకుండా ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసాడు. 1916 నాటి అధ్యక్ష ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ తరుపున అధ్యక్షపదివికి గెలిచాడు. విల్సన్ అమెరికాను యుద్ధంలో ఇరికించకుండా చేసాడని ప్రచారం చేసి విజయాన్ని పొందాడు. రెండవసారి అధ్యక్షుడైన వెంటనే శాంతి మార్గాల నన్వేషిస్తూ యుద్ధ మధ్యంలో ఉన్న రెండు వర్గాలను తమ ధ్యేయాలేమిటో విశదం చేయమని కోరాడు. కానీ ఏ వర్గమూ యుద్ధాన్ని ఆపే స్థితిలోలేదు.

జనవరి 1917లో సెనేటును సంభోదిస్తూ, రెండు వర్గాలకు విజయ రహితమైన శాంతి, సముద్రాల మీద స్వేచ్ఛా వర్తకము, నిరాయుధీకరణము, రహస్య ఒప్పందాలకు స్వస్తి, యుద్ధ నివారణకు సమిష్టి భద్రతా ప్రయత్నాలు అనే అంశాలపై తాను కృషి చేస్తానని ప్రకటించాడు. కానీ అమెరికాలో గాని, ఐరోపాదేశాలలోగాని విల్సన్ చేసిన ఈ ప్రతిపాదనలకు మద్దతు లభించలేదు.

**14.7.5 మిత్ర పక్షం వైపు మొగ్గు :** యుద్ధ కాలములో ఇంగ్లాండు, జర్మనీ దేశాలనుంచి అమెరికా ఇబ్బందులను ఎదుర్కొంది. ఇంగ్లాండ్ కేంద్ర రాజ్యాలకు ఏ సరుకూ విదేశాలనుంచి దక్కకుండా చేయడానికి అడ్డుపడింది. (దీనినే లండన్ డిక్లరేషన్ అంటారు) జర్మనీతో వ్యాపారం చేస్తున్నట్లు తెలిసిన అమెరికా వ్యాపార సంస్థలను బ్రిటన్ నిషేధించింది. బ్రిటీష్ వారు అమెరికాను కష్ట పెట్టినప్పటికీ బ్రిటన్‌పై అమెరికాకు గల పక్షపాతం వల్లను, బ్రిటన్ కంటే జర్మనీ అనుసరించిన క్రూరమైన విధానాలవల్లను అమెరికా బ్రిటన్ మరియు మిత్ర పక్షాల వైపే మొగ్గు చూపుతూ ఉండేది.

ఫిబ్రవరి 1915లో ఇంగ్లాండ్ అవలంబించిన లండన్ డిక్లరేషన్‌కు ప్రతిగా, జర్మనీ జలాంతర్గాములను ఉపయోగించడం మొదలు పెట్టారు. బ్రిటన్ పరిసరాలలో కనిపిస్తున్న శత్రు నౌకలను ముంచి వేస్తామని జర్మనీ ప్రకటించింది. విల్సన్ దీనికి వ్యతిరేకంగా జర్మనీకు హెచ్చరికలు చేసాడు.

1915లో జర్మన్ జలాంతర్గాములు అమెరికాకు చెందిన "గుల్ ఫ్లైట్ అనే టాంకర్‌ని ముంచి వేసారు. మే నెల 15, 1915న జర్మన్ జలాంతర్గాములు ఐర్లాండ్ సమీపంగా పోతున్న బ్రిటీష్ ప్రయాణికుల ఓడ అయిన 'లూసిటానియా'ను ముంచివేసాయి. ఆ ఓడలో ఉన్న 1198 మంది వ్యక్తులు మరణించారు. వారిలో 128 మంది అమెరికన్లు కూడా ఉన్నారు. దీనికి విల్సన్ ఉగ్ర నిరసన తెలుపగా జర్మన్‌లు ఇక

ముందు ప్రయాణికుల క్షేమానికి తగిన వసతి కల్పించకుండా ఓడలను ముంచమని హామి ఇచ్చారు. దీనికి భిన్నంగా 1916 మార్చి నెలలో ససెక్స్ అనే ఫ్రెంచి ప్రయాణికుల ఓడను, అరబిక్ అనే మరో బ్రిటీష్ ఓడను జర్మన్‌లు ముంచగా అమెరికన్‌లు కొందరు మరణించారు. ససెక్స్‌ను ముంచటంతో పరిస్థితి విషమించి, విల్సన్ జర్మనీతో దౌత్య సంబంధాలను తెగ తెంపులు చేసుకొంటామని హెచ్చరించాడు. జర్మనీ దేశం అమెరికాతో వ్యక్తుల ప్రాణాలు రక్షించకుండా వ్యాపార నౌకలను ధ్వంసం చేయనని జర్మనీ తెలియ పరిచింది. తత్ఫలితంగా జర్మనీ, అమెరికన్‌ల మధ్య కొన్ని నెలలపాటు శాంతి నెలకొంది.

1917 సంవత్సర ప్రారంభం నుండి జర్మన్‌లు మరల జలాంతర్గాముల విజృంభణ మొదలు పెట్టారు. కొన్ని వారాల సమయంలో ఎనిమిది అమెరికా ఓడలను జర్మన్‌లు ముంచి వేసారు. ఏప్రియల్ 1917న విల్సన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి, అమెరికా జర్మనీపై యుద్ధం ప్రకటించటానికి అనుమతిని కోరాడు. కాంగ్రెస్ ఆమోదాన్నిపొంది, ఏప్రిల్ 6, 1917న అమెరికా మొదటి ప్రపంచ యుద్ధంలో మిత్ర పక్షాల తరుపున ప్రేశించింది.

జర్మనీ కృత్యాలవల్ల అమెరికాకు కలిగిన కోపంతో పాటుగా అమెరికాకు మిత్ర పక్షాల వల్ల ఎంతో ఆర్థిక ప్రయోజనాలను పొందింది. మార్చి 1917 నాటికి మిత్ర పక్షాలవారు అమెరికానుండి 2,000,000,000 డాలర్లు విలువచేసే యుద్ధ సామాగ్రిని కొనుగోలు చేసారు. ఈ విధంగా మిత్ర పక్షాలవారు చేసిన ఈ కొనుగోలు వలన అమెరికా దేశపు ఎగుమతులు పెరిగాయి. 1914 నాటికి పూర్వం అమెరికా ఎగుమతుల విలువ కేవలం 2,500,000 డాలర్లు మాత్రమే ఉండగా 1916 నాటికి యుద్ధం వలన అది 5,500,000 డాలర్లకు వృద్ధి చెందింది. 1914కు పూర్వం అమెరికాలో అన్ని రంగాలు ఆర్థిక మాంద్యంతో భీతిల్లుతున్నాయి. కాని 1916 తరువాత విపరీతమైన లాభాలతో అమెరికాలోని అన్ని ఉత్పత్తి రంగాలు అభివృద్ధి పంథాలో ఉన్నాయి.

1917 నాటికి మిత్ర పక్షాలవారు అమెరికా నుండి సుమారు 2,000,000 డాలర్లను అప్పుగా పొందారు. ఒక్క మోర్గాన్ కంపెనీ వారే ఎంతో ధనాన్ని మిత్ర పక్షాలవారికి అప్పుగా ఇచ్చారు. 500,000 మంది అమెరికా పౌరులు మిత్ర పక్షాల వారికి వారి సొంత ధనాన్ని అప్పుగా అందజేసారు. ఈ విధంగా అమెరికాకు మిత్ర పక్షాలవారికి యుద్ధ సమయంలో ఎన్నో ఆర్థిక పరమైన లావాదేవీలు ఏర్పడ్డాయి. మిత్ర పక్షాలవారు అమెరికా నుండి వివిధ యుద్ధ, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయకపోయినా, అమెరికా పౌరులనుంచి మిత్ర పక్షాల వారు తీసుకొన్న అప్పులు ఎగవేసినా, అమెరికా ఎంతో నష్టపోవలసి వస్తుంది. దీనితో పాటుగా మార్చి 1917లో రష్యా చక్రవర్తి జార్ సింహాసన త్యాగం చేసాడు. అక్కడ ప్రజాస్వామ్యాన్ని అనుసరించే ప్రభుత్వం ఏర్పాటయింది. ప్రజాస్వామ్య సిద్ధాంతానికి గౌరవ మిచ్చే విల్సన్‌కు ఈ మార్పు ఎంతో ఊరటనిచ్చింది. నూతన పరిస్థితులలో మిత్ర రాజ్యాలు అన్నీ ప్రజాస్వామ్య దేశాలైతే, కేంద్ర రాజ్యాలన్నీ నిరంకుశ ప్రభుత్వాలుగా ఉన్నాయి. విల్సన్ దీనితో యుద్ధం నిరంకుశ రాజ్యాలపై ప్రజాస్వామ్య దేశాలు చేసే పోరాటంగా అభివర్ణించాడు.

దీనికి తోడు మిత్ర రాజ్యాల వారు జర్మన్ సైనికులను రాక్షసులుగా చిత్రిస్తూ ప్రచారం చేసారు. ఇట్టి పరిస్థితులలో జర్మన్‌లు 'ఎడిత్ కావిల్' అనే ఒక నర్స్‌ని చంపారు. ఆ వ్యక్తి స్త్రీ అయినందున నర్స్ కావటంవల్ల జర్మనీ చర్యను గర్హించడమైంది. ఈ చర్యల వల్ల దిగ్భ్రమ చెందిన అమెరికన్‌లు ఆమె జ్ఞాపకార్థం ఎడిత్ కావిల్, ది ఉమన్ ది జర్మన్ షాట్ అనే సినిమాను చిత్రీకరించి ప్రదర్శించడంతో జర్మనీపై ఆగ్రహం పెరిగింది.

ప్రపంచంలో ప్రజాస్వామ్యం సుస్థిరత కోసమే ఈ యుద్ధంలో అమెరికా చేరిందని ఉడ్రో విల్సన్ స్పష్టం చేసాడు. ఈ యుద్ధ సమయంలో అమెరికన్ ప్రజలలో ఐక్యత గోచరించింది. పెద్ద జీతాలు తీసుకొనే ఉద్యోగస్థులు చాలా మంది సంవత్సరానికి ఒక్క డాలరు జీతానికి మాత్రమే పనిచేయటానికి సిద్ధమయ్యారు. సైన్య, నౌకా పునర్నిర్మాణానికి, ధన, వస్తు సేకరణలకు అవసరమయ్యే శాసన నిర్మాణము అతివేగంగా కొనసాగింది.

మిత్ర రాజ్యాలవారికి ఆహార ధాన్యాలు, పారిశ్రామిక వస్తువులు అందజేసారు. కావలసిన యుద్ధ సైనికులను కూడా సమకూర్చారు. దీనికోసం, జాతీయ రక్షణ సంస్థనొక దానిని స్థాపించి, యుద్ధానికి కావలసిన వనరులను సమకూర్చటం ఆ సంస్థకు అప్పగించారు. దీనితో సైన్య సమీకరణ, పారిశ్రామిక ఉత్పత్తుల అభివృద్ధి, ఆహార పదార్థాల సరఫరా రవాణా సౌకర్యాల అభివృద్ధి వేగతరం చేసారు.

**సైన్య సమీకరణ :** మే 1917లో సెలెక్టివ్ సర్వీసెస్ ఆక్ట్ అనే శాసనం ద్వారా అమెరికాలో నిర్బంధ సైనిక విధానం ప్రవేశ పెట్టడం జరిగింది. మొదట 21 నుండి 30 సంవత్సరాల వయస్సుగల పురుషులందరూ మిలటరీలో తప్పని సరిగా నమోదుకావాలని, తరువాత దానిని మార్పుచేసి 18 నుండి 30 సంవత్సరాల వయస్సుగల పురుషులందరూ మిలటరీలో తప్పనిసరిగా నమోదు కావాలని, తరువాత దానిని మార్పుచేసి 18 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సుగలిగిన పురుషులందరూ మిలటరీలో తప్పనిసరిగా చేరాలని శాసనం చేసారు. యుద్ధం ముగిసేలోపు మొత్తం 4,800,000 మంది స్త్రీ పురుషులు 32 శిక్షణా కేంద్రాలలో ఆర్మీలో, నౌకా దళములో, మెరైన్ రంగాలలో శిక్షణ పొందారు. వీరిలో నుండి మొత్తం 20 లక్షలమంది సైనికులను విదేశాలకు యుద్ధంలో పాల్గొనటానికి పంపడం జరిగింది.

**పారిశ్రామిక ఉత్పత్తుల అభివృద్ధి :** యుద్ధావసరాలకై పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడానికి విల్సన్ ఏప్రిల్ 1918లో కాంగ్రెస్‌లో వోవరమన్ చట్టం అనే దానిని ఆమోదింపజేసాడు. ఈ చట్టం ద్వారా ఒక పరిశ్రమ సంస్థను స్థాపించి, దానికి బెర్నార్డ్ బారూక్ అనే ఒక వాల్‌స్ట్రీట్ బ్రోకరును అధ్యక్షునిగా నియమించాడు. ఇతడు ధరలను స్థిరీకరించి, ఏవి ఉత్పత్తులను ఎంత మేరకు పెంచవలెనో వేటిని తగ్గించవలెనో నిర్ణయించి, దుబారాను అరికట్టి, మేలు సరుకులను అశేష సంఖ్యలో తయారు చేయించసాగాడు. కార్మికులు యుద్ధ విజయానికి మూల కందాలు అనే నినాదము పారిశ్రామిక రంగములో ఆనాడు తరచుగా వినిపించేది. పని చేయటమో యుద్ధం చేయటమో ఈ రెండింటిలో ఏదో ఒకటి నిర్ణయించుకోవటమో ఆనాటి అమెరికా ప్రజల ముందున్న విషయాలు. సామ్యూల్ గోంపర్స్ నాయకత్వంలో ఉన్న చాలా పెద్ద కార్మిక సంఘం ప్రభుత్వానికి ఎంతో సహకారమిచ్చింది.

యుద్ధ కాలంలో కార్మికులు అసలు సమ్మెలు తలపెట్టరాదని నిర్ణయించారు. కార్మికుల అవసరము యుద్ధ కాలంలో చాలా ఎక్కువైంది. ఖనిజ పరిశ్రమలలో, రవాణా పరిశ్రమలో, వస్త్రోత్పత్తి పరిశ్రమలలో 1915 నుండి 1918 నాటికి 20 శాతం జీతాలు పెరిగాయి. కార్మికులు కూడా ప్రభుత్వానికి పారిశ్రామిక ఉత్పత్తుల పెంపుదలకు చాలా దోహద పడ్డారు.

**ఆహార పదార్థాల ఉత్పత్తి పెంపుదల :** అమెరికన్ ప్రజల అవసరం తీర్చటానికే కాకుండా మిత్ర రాజ్యాలకు ఆహార లోటు తీర్చవలసిన అవసరం అమెరికాకు ఏర్పడింది. అమెరికాలోని వ్యవసాయ దారులను ప్రభుత్వం అంతకు పూర్వంకంటే ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయవలెనని ఉత్తేజ పరచింది. దీనిని సాధించటానికై 'ఫుడ్ అడ్మినిస్ట్రేషన్' అనే ఒక సంస్థను ఏర్పాటుచేసి హెర్బర్ట్ హోవర్‌ను అధ్యక్షునిగా నియమించింది. ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించుకోవడం, ఆహార పదార్థాల ఉత్పత్తిని ఎక్కువ చేయడం వంటి రెండు ముఖ్యమైన చర్యల ద్వారా అమెరికన్లు యుద్ధ సమయంలో మిత్ర పక్షాలవారి ఆహార పదార్థాల అవసరాలను తీర్చగలిగారు.

అమెరికాలోని ప్రజలు యుద్ధ కాలంలో అన్ని సోమ, బుధవారాలలో గోధుమలు వాడడం మానుకొన్నారు. మంగళవారం బాటు మాంసాహారాన్ని మానుకొన్నారు. ఐస్క్రీములలో పంచదార వేయకుండానూ, మాంసాహార స్థానములో కూరగాయల భోజనము చేయడం అలవాటు చేసుకొన్నారు. అమెరికాలో ప్రతి ఖాళీ ప్రదేశంలోనూ విక్టరీ గార్డెన్స్ అనే పేరుతో పెరటి తోటలు వెలసాయి. ప్రభుత్వం చేసిన విన్నపానికి సానుకూలంగా స్పందించి దాన్ని ఆచరణలో పెట్టి వారి ఆహార ఉత్పత్తులను పెంచారు. ప్రభుత్వం, వ్యవసాయ దారులు చిత్త శుద్ధిగా చేసిన కృషివలన దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా పెరిగింది. 1917లో 6,000,000 బుషల్స్‌గా ఉన్న గోధుమ వార్షిక ఉత్పత్తి 1918లో 9,000,000 బుషల్స్‌కి పెరిగింది. గోధుమలు 1917లో 45 మిలియన్ల ఎకరాలలో పండేది. దీనిని వ్యవసాయదారులు 1919 నాటికి 75 మిలియన్ల ఎకరాలకు వ్యాప్తిచేసారు. ఇదే విధంగా అన్ని పంటల ఉత్పత్తిని పెంపుచేసారు.

ఆహార ఉత్పత్తులు పెరగటమే కాకుండా యుద్ధకాలంలో అమెరికాలోని వ్యవసాయదారులు వారు పండించిన పంటలకు మంచి సరసమైన ధరలు కూడా పొందగలిగారు. వారి ఆర్థిక స్థితికూడా మెరుగుపడింది.

**రవాణా సౌకర్యాల పెంపుదల :** జర్మనీ దేశస్థులు, వారి జలాంతర్గాములతో యుద్ధంలో మిత్ర పక్షాల, అమెరికా దేశపు ఓడలను ఎన్నింటినో ముంచివేసారు. యుద్ధానికి కావలసిన వస్తువులను, ఆహార ధాన్యాలను రవాణా చేయడానికి ఎన్నో ఓడలు కావలసి వచ్చింది. ఈ కొరతను అధిగమించడానికి విల్సన్ ఏమర్జెన్సీ ఫ్లీట్ కార్పొరేషన్, వార్ షిప్పింగ్ బోర్డు అనే సంస్థలను ఏర్పరిచాడు. ఇవి అమెరికా నౌకా

సమూహాన్ని పెంచడానికి, అనేక మార్గాలను అవలంబించాయి. అమెరికా రేవులలోఉన్న శత్రు నౌకలను ఉపయోగంలోకి తీసుకొని రావడం, అమెరికా రేవులలో విడిది చేసిన తటస్థ దేశాల ఓడలను వారి యజమానుల అంగీకారంతో అమెరికాకు ఉపయోగపడేటట్లు చేయడం, వీటితో పాటుగా కొత్త నౌకల్లను అమెరికన్లు శరవేగంగా నిర్మించడం చేసారు. నౌకా నిర్మాణము నెమ్మదిగా జరిగే పని అయినా, జర్మన్ దేశీయులు ముంచి వేసే నౌకల సంఖ్య కన్నా ఎక్కువగానే ఓడలను అమెరికా తయారు చేసింది. ఇట్లు నౌకా నిర్మాణానికి తీసుకొన్న చర్యల వల్ల అమెరికాలో 1914లో తనకు విదేశీ వాణిజ్యానికి ఉన్న 1,000,000 టన్నుల నౌకా సామర్థ్యాన్ని 1918 సెప్టెంబరు నాటికి 8,500,000 టన్నులకు పెంచగలిగింది.

యుద్ధానికి అవసరమైన అన్ని రకముల వనరులను సమకూర్చడం కోసం అమెరికా దేశం మొత్తం 32,000,000,000 డాలర్లు ఖర్చు పెట్టింది. దీనిలో 10,350,000,000 డాలర్లను మిత్ర దేశాలవారు అమెరికా నుండి కొనుగోలు చేసిన వస్తువులకు అప్పుగా ఇచ్చిన బాపతు కాగా, మిగిలినది అమెరికా ప్రభుత్వము ప్రత్యక్షముగా ఖర్చు పెట్టిన సొమ్ము.

ఈ విధముగా అమెరికా ఖర్చు పెట్టిన ధనములో 1/3 వ వంతు పన్నులు పెంచడం ద్వారా సమకూర్చ గలిగింది. మిగిలిన 2/3 వంతులు జాతీయ అప్పుగా పరిగణించింది. అమెరికా ప్రజలు 600 కోట్ల డాలర్లను లిబర్టీ బాండ్స్ ద్వారా ప్రభుత్వానికి అంద చేసారు.

**14.8.6 ప్రత్యక్ష పాత్ర :** ఏప్రిల్ 1917 నాటికి, మిత్ర పక్షాలు యుద్ధంలో ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది. అమెరికా మిత్ర పక్షాలవారికి సహాయాన్ని అందచేయక ముందే యుద్ధాన్ని అంతం చేయవలెనని జర్మనీ నిర్ణయించుకొంది. ఆ ప్రయత్నంలో జర్మనీ కొంత వరకు సఫలమైంది కూడా. అక్టోబరు 1917లో కాపొరెట్టో దగ్గర ఓడిపోయిన ఇటలీ ధైర్యాన్ని కోల్పోయింది. మార్చి 1918లో రష్యా-జర్మనీతో బ్రెస్ట్-లిటో వెస్క్ సంధి చేసుకొని యుద్ధం నుండి విరమించింది. దీని వల్ల జర్మనీ సైనికులు తూర్పు రంగం నుండి విడుదలై - పశ్చిమ రంగంలో తమ శక్తిని కేంద్రీకరించటానికి అవకాశమేర్పడింది.

అప్పటికి అమెరికా తన సైన్యాన్ని ఫ్రాన్స్‌కు తరలించడం మొదలుపెట్టింది. తూర్పు రంగం నుండి విడుదలైన సైన్యం ఫ్రాన్స్‌ను ముట్టడికి సన్నాహం చేయసాగింది. ఫ్రాన్స్‌కు చేరవేయబడిన అమెరికా సైన్యాన్ని జాన్ జే. పెర్షింగ్ అనే జనరల్ నాయకత్వంలో యుద్ధ వ్యూహరచన చేయాలనుకొన్నారు. జూన్ 1917లో ఫ్రాన్స్‌కు చేరుకొన్న పెర్షింగ్ ఫ్రాన్స్‌లో ఒక మిలియన్ అమెరికన్ సైనికులను కూడా గొట్టాలనుకొన్నాడు. కానీ తను ఊహించినట్లుగా పరిస్థితులు అనుకూలించలేదు. అప్పటికే ఫ్రాన్స్‌లోని మిత్ర పక్ష సైనికులు డస్సిపోయారు. ఎప్పటికప్పుడు అమెరికా సైన్యం మిత్ర పక్షాలవారికి ఆసరాగా నిలిచి అంచెలంచెలుగా జర్మనీ సైన్యాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది.

అమెరికా సైన్యం ప్రత్యేక సైనిక బృందంగా యుద్ధంలో పాల్గొనడానికి మిత్ర పక్షం వారు అంగీకరించలేదు. దీనికి కారణం మిత్ర పక్షాలవారికి అమెరికా సైనికులపై నమ్మకము లేకపోవుటమే! ఆ కారణం చేత పెర్షింగ్ ఫ్రాన్స్‌లోని అమెరికా సైన్యానికి శిక్షణ ఇవ్వటంలో నిమగ్నమయ్యాడు. అప్పటికీ చాలా తక్కువగా ఉన్న అమెరికా సైన్యాన్ని మిత్ర పక్షాల వారితో కలిసి యుద్ధంలో పాల్గొనేటట్లు చేసాడు.

మొట్టమొదటిగా అమెరికా సైనికులు ఫ్రెంచ్ సైనికులతో కలసి రైన్‌లో అక్టోబర్ 1917న యుద్ధంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అమెరికా సైనికులు ఫ్రాన్స్ చేరకముందే మిత్ర పక్షాల వారిని ఓడించాలని, ఫ్రాన్స్‌ను ఆక్రమించాలని తద్వారా యుద్ధాన్ని ముగించాలని జర్మనీవారు నిశ్చయించుకొన్నారు. ఆ ఉద్దేశ్యంతోనే ఫ్రాన్స్ తూర్పు దిక్కునుండి జర్మనీ వారు ఆక్రమణను మొదలు పెట్టారు.

జర్మనీ సైన్యం 1918లో ఫ్రెంచ్, ఇంగ్లీష్ సైన్యాలను ధ్వంసం చేసి సొమ్మే దగ్గర 30 మైళ్ళను ఆక్రమించారు. ఏప్రియల్ నెలలో ప్లేండర్స్‌లో కూడా విజయాన్ని సాధించారు. ఈ విధంగా విజృంభిస్తున్న జర్మనీ సైన్య శక్తికి, వారి విజయాలకు మిత్ర పక్షాలవారు భీతి చెందారు. దీనితో వారు వారి సైన్యాన్ని పునర్ సమీక్షించుకొని అన్ని మిత్ర పక్ష దేశాల సైన్యాలకు ఒకే సైన్యాధ్యక్షున్ని నియమించారు. అతని పేరు ఫ్రెడినాండ్ ఫోక్. మిత్ర పక్షాలవారు అమెరికా వారిని పెద్ద సైన్యాన్ని వీలైనంత త్వరగా పంపమని అభ్యర్థించారు. మార్చి 1918 నాటికి ఫ్రాన్స్‌లో అమెరికా సైనికులు కేవలం 3,00,000 మంది మాత్రమే ఉన్నారు. కానీ జూలై 1918 నాటికి ఆ సైన్యం పెర్షింగ్ నాయకత్వంలో ఒక్కమిలియనుకు పెరిగింది.

మే 18, 1918 తేదీన మొదటిసారిగా అమెరికా సైన్యం సొమ్మేలోని కాన్టిగ్నీని ఆక్రమించి జర్మనీ వారి జొరబాటు సాగకుండా చేసి అమెరికా సైన్య పాటవాన్ని చూపారు.

వెంటనే జర్మన్ సేనలు విజృంభించి భయంకరమైన ఆక్రమణలను సాగించారు. ఒక నదీలోయ నుండి మరియొక నదీలోయలోకి ప్రవేసిస్తూ మే 30 1918 నాటికి మార్నే నదినీ, చాటీవ్ త్రీరీని దాటి పారిస్ నగర ముట్టడి చేయనున్నట్లు హెచ్చరించారు. ఇటువంటి పరిస్థితులలో, ఫ్రెంచ్ సైన్యానికి అమెరికా వారు సహకరించి జర్మనీవారి ఆక్రమణను అరికట్టటానికి ప్రయత్నించారు. ఒక వారం రోజుల పాటు జరిగిన యుద్ధం అనంతరము బెల్లీవ్‌వుడ్‌ను జర్మనీ సైన్య వశం నుండి విడుదల చేయగలిగారు.

15 జులై 1918 న పారిస్ దగ్గరలో రీయమ్స్ అనేచోట జర్మన్ సైన్యం ఫ్రాన్స్ సేనపై విరుచుకు పడాలని ప్రయత్నించారు. ఆ సమయములో 85,000 మంది అమెరికన్ సైన్యాలు రంగంలో ధిగి జర్మన్ సేనలు చేసిన ఈ ప్రయత్నాలను వమ్ముచేసారు. 18 జులై 1918 నాటికి జర్మన్ సేనల దాడులు అదుపులోకి వచ్చాయి. ఇక అప్పటి నుండి మిత్ర పక్షాలవారి విజృంభణ మొదలైంది. అమెరికా సేనలు కూడా అధిక సంఖ్యలో మిత్ర పక్షాల వారితో విజృంభించారు. మార్నే నుండి జర్మనీ సేనలను పారద్రోలారు.

జులై నెల నుండి, అమెరికా నుండి, ప్రతినెలా 2,63,000 సైనికుల చొప్పున ఫ్రాన్స్‌కు తరలింపబడ్డారు. మిత్ర పక్షాల వారు ఈ సైనిక శక్తితో జర్మనీ సేనలను ఫ్రాన్స్ నుండి వెడలగొట్ట గలిగారు.

10 ఆగష్టు 1918న మొదటిసారిగా పెర్షింగ్ తన స్వంత నాయకత్వంలో ప్రత్యేక అమెరికా సేనలతో ఒక ఆక్రమణను నిర్వహించాడు. పెర్షింగ్ 5,50,000 మంది అమెరికా సైనికులతో సెమ్ట్ మిహియల్ పై 36 గంటల పాటు దాడి జరిపాడు. ఈ దాడిలో పెర్షింగ్ ప్రయత్నాలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. ఆ తరువాత అమెరికా సైన్యం మీయుస్ ఆర్‌గొన్నే ప్రాంతంలోని మొత్తం 200 మైళ్ళకు గాను 24 మైళ్ళ పరిధిలోని అడవి ప్రాంతములో 26 సెప్టెంబర్ నాడు జర్మనీ సేనలపై యుద్ధం మొదలు పెట్టారు. ఇది చాలా భయంకరమైన ప్రాంతం. ఇక్కడ అమెరికా సైనికులు మొత్తం 47 రోజులపాటు పోరు జరిపారు. మంచు లోయల్లో దట్టమైన అడవులలో, బార్బ్‌డ్‌వైరు, మిరైడ్సు, షెల్ కార్టర్సు ఉన్న ప్రాంతాలలో అమెరికా సైనికులు ఎంతో సాహసవంతంగా పోరాటాన్ని జరిపారు. ఈ యుద్ధంలో మొత్తం 1,20,000 మంది అమెరికా సైనికులు పాల్గొన్నారు. ఈ ఒక్క యుద్ధంలోనే మొత్తం నాలుగు సంవత్సరాలపాటు జరిగిన ప్రపంచ యుద్ధంలో మిత్రపక్షాల వారందరూ కలసి వాడిన యుద్ధ సామాగ్రి మొత్తం కంటే ఇంకా ఎక్కువ సామాగ్రిని అమెరికా సేనలు కేవలం 47 రోజులలో ఉపయోగించారు. అమెరికా అంతర్యుద్ధ కాలములో కేంద్ర ప్రభుత్వం వారు దక్షిణ అమెరికా పక్షంపై వాడిన యుద్ధ సామగ్రి కంటే ఎక్కువగానే ఈ యుద్ధంలో అమెరికా సైనికులు వాడారు.

మొత్తం అమెరికా సైన్యం 13 చోట్ల మిత్రపక్షానికి అండగా కేంద్ర పక్షం వారితో పోరాడారు. వీటిలో పెర్షింగ్ నాయకత్వంలో రెండు చోట్ల అమెరికన్లు పోరాడారు. నవంబర్ 1918 నాటికి మొత్తం ఫ్రాన్స్‌లో అమెరికా సైన్యాలు రెండు మిలియన్లు యుద్ధంలో పాల్గొన్నారు. ఈ విధంగా జర్మనీ సేనలను ఫ్రాన్స్ నుండి వెనక్కి నెట్ట గలిగారు. జర్మనీ సైన్య శక్తి, మరియు సైన్య సఖ్యత తగ్గిపోసాగింది. జర్మనీ పై మిత్ర పక్ష సైన్యాలు ఆక్రమణ జరపబోవు చున్నారనే భయము పుట్ట సాగింది. వారి రవాణా మరియు ఇతర సమాచార వ్యవస్థ క్షీణించింది. పరిస్థితి విష మించిందని తలచి కొన్ని వారాలపాటు యుద్ధం నిలిపివేతకు అభ్యర్థించారు.

పెర్షింగ్ తన నాయకత్వంలో ఉన్న అమెరికా సైన్యాన్ని బెర్లిన్ వైపు నడిపించి జర్మనీయులకు యుద్ధం తీపిని చూపించాలని అనుకొన్నాడు. ఈ ఉద్దేశ్యంతోనే అమెరికా సైన్యాలు సెడన్‌కు చేరుకోగానే జర్మనీ దూత ఫోక్‌ను కలుసుకొని యుద్ధ విరమణకు ఒప్పుకొని దానికి కట్టుబడి ఉండే నియమాలను అందుకొన్నాడు. ఈ ఒప్పందంలోని నిబంధనలు చాలా కఠినమైనవిగా ఉన్నాయి. అయినప్పటికీ తప్పని పరిస్థితులలో జర్మనీవారు ఒప్పుకున్నారు. ఈ భయంకరమైన మొదటి ప్రపంచ యుద్ధం ఈ విధంగా 11 నవంబర్ 1918లో నిలిపివేయబడింది.

1918 మార్చి నాటికి జర్మనీ సైన్యం మిత్ర పక్షాల సైన్యంకంటే చాలా అధికంగా ఉంది. కాని జూన్ 1918 నాటికి అమెరికా సైన్యం మిత్ర పక్షంలో చేరినందున జర్మనీ సైన్యంకంటే పెద్ద సైన్యంగా ఎదగగలిగింది. అమెరికా సైన్యం చేరికతో మిత్ర పక్షాల వారి సైన్యం కేంద్ర

పక్ష సైన్యం కంటే 6,00,000 మంది ఎక్కువగా ఉంది. కేవలం కొన్ని నెలలపాటే అత్యంత సాహస వంతంగా అమెరికా సైన్యాలు మిత్ర పక్షాల వారికి సహాయంగా యుద్ధంలో పోరాడారు. యుద్ధంలో మొత్తం 1,12,000 మంది అమెరికా సైనికులు మరణించారు. 2,51,000 అమెరికా సైనికులు గాయపడ్డారు. యుద్ధంలో పాల్గొన్న మొత్తం అమెరికా సైనికులలో 7 శాతం మంది మరణించారు. కానీ ఫ్రెంచ్ సైన్యంలో యుద్ధంలో 73 శాతం మంది అనగా 1,385,000 మంది, ఇంగ్లీషు సైన్యంలో 36 శాతం మంది అనగా 900,000 మంది మరణించారు. కానీ మిత్ర పక్షాలవారు చేసిన ఖర్చు మొత్తంలో 1/6 వంతు ధనాన్ని అమెరికా వారే ఖర్చు పెట్టారు.

అమెరికా దేశస్థులు మిత్రపక్షాలవారికి తామే విజయం సమకూర్చామని భావించారు.

**14.8.7. పధ్నాలుగు సూత్రాలు :** ఒక వంక మిత్ర పక్షాలవారికి సహాయ సహకారాలను అందిస్తూ, యుద్ధంలో పరోక్షంగా పాల్గొనుచూ మరియొక వంక శత్రుత్వ భావాలను తగ్గించే ప్రయత్నాలు కూడా అమెరికా అధ్యక్షుడు విల్సన్ మొదలు పెట్టాడు. శత్రు దేశాల ప్రజలలో మిత్ర దేశాల సైన్యాలపై వ్యతిరేకత తగ్గించడానికి, యుద్ధానంతరము ఆ దేశాలతో శాంతి సంభాషణలు నెరపడానికి కావలసిన వాతావరణం కల్పించటానికి, శత్రు దేశాల ప్రజలలో మానసిక పరివర్తన తెచ్చే ఉద్యమానికి, ప్రపంచ శాంతిని సాధించే పధ్నాలుగు సూత్రాలను విశదీకరించాడు. తన పధ్నాలుగు శాంతి సూత్రాలను విల్సన్ అమెరికన్ కాంగ్రెస్‌లో జనవరి 8, 1918న ఒక ఉపన్యాసం ద్వారా వివరించాడు. ఆ పధ్నాలుగు సూత్రాలు ఏమనగా :

1. వివిధ జాతుల మధ్య జరిగే ఒడంబడికలు బహిరంగంగా జరగాలి.

2. అందరికీ స్వేచ్ఛా సముద్రయానపు హక్కులు ఉండాలి.

3. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య పరిస్థితులు నెలకొల్పాలి.

4. మారణాయుధాలను ప్రతి దేశము తగ్గించాలి. ఈ ఆయుధాలు ఆయా దేశాల అంతరంగిక భద్రతకు అవసరమైనంతగా మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి.

5. నిస్వార్థపూరితముగా వలస దేశాలపై వివిధ దేశాల ఆధిపత్యాన్ని నిర్ణయించుకోవాలి. ఈ ఆధిపత్య నిర్ణయంలో వలస దేశాల ప్రజల అభీష్టాన్ని కూడా పరిగణనకు తీసుకోవాలి.

6. రష్యా భూభాగమునుండి జర్మనీ తొలగాలి.

7. బెల్జియం నుండి అన్ని దేశాలవారు వైదొలగి అక్కడ పూర్వయథాతథ పరిస్థితిని నెలకొల్పాలి.

8. అదే విధంగా ఫ్రాన్స్ భూభాగాల నుండి శత్రు సైన్యాలు వైదొలగి, ఆక్రమణలో ఉన్న ప్రాంతాలను తిరిగి ఫ్రాన్స్‌కు అప్పగించాలి. 1871లో ఆల్సేస్ లోరైన్ విషయమై ఫ్రాన్స్‌కు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి.

9. ఇటలీ దేశపు సరిహద్దులను చక్కగా గుర్తింప వీలుకలిగే విధముగా, జాతీయతను చాటి చెప్పే విధముగా పునఃనిర్మించాలి.

10. ఆస్ట్రియా, హంగేరి ప్రజలకు వారు స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి చెందటానికి అవకాశాన్ని ఇవ్వాలి.

11. రుమేనియా, సెర్బియాల నుండి శత్రు సైన్యాలు తరలి వెళ్ళాలి. అక్కడ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలను తిరిగి ఆయా దేశస్థులకు అప్పగించాలి.

12. ఒట్టొమన్ సామ్రాజ్యములోని టర్కీ ప్రాంతాలకు సార్వభౌమాధికారాన్ని పొందగలిగేటట్లు చేయాలి. టర్కీయుల పరిపాలనలో ఉన్న ఇతర జాతుల వారు స్వయం ప్రతిపత్తిని పొందగలిగేటట్లు చేయాలి.

13. స్వాతంత్ర్య పోలిష్ రాజ్యాన్ని స్థాపించి, దానికి స్వేచ్ఛా, భద్రతలతో కూడిన సముద్రయానాలకు అవకాశము కల్పించాలి.

14. శాంతి భద్రతలకై అన్ని దేశాలు కలిసి ఒక ప్రపంచ సంస్థను ఏర్పాటు చేసుకోవాలి.

విల్సన్ ప్రతిపాదించిన ఈ 14 సూత్రాల ప్రతిపాదనలు ఆదర్శవంతమైనవే అయినప్పటికి, వాటిని ఎవరూ బలపరచలేదు. యుద్ధ విజయులై విశాల వలస సామ్రాజ్యాలను కబళించటానికి ప్రయత్నించిన అనేక మిత్రదేశాల వారు ఈ సూత్రాలను ఏవగించుకొన్నారు. యుద్ధ విజేతలయిన మిత్ర రాజ్యాలు జర్మనీపై ప్రతీకార వాంఛతో ఉన్నాయి. వారి అంగీకారం లేకనే ఉడ్రో విల్సన్ తన ప్రతిపాదనలను తెలియజేసాడు. జర్మనీ మాత్రం విల్సన్ మిత్ర రాజ్యాల పక్షాన ఈ పధ్నాలుగు సూత్రాలు ప్రతిపాదించినట్లు భావించింది. అదే విధంగా అమెరికాలోని రిపబ్లికన్‌లు ఈ పధ్నాలుగు సూత్రాలను అవహేళన చేయ నుద్యమించారు కూడా. మోసెస్ పది ఆజ్ఞలతోనే సంతృప్తి పడినాడు కానీ విల్సన్‌కు 14 సూత్రాలు కావలసి వచ్చినవి అని ఎగతాళి పట్టించారు కూడా. ఈ సూత్రాల ప్రతిపాదికపైనే యుద్ధంలో పరాజయం పొందిన రాజ్యాలు ఒడంబడినారు. ఈ సూత్రాలను ఆధారం చేసుకొనే నానాజాతి సమితి ఆవిర్భవించింది.

**14.8.8. పారిస్ శాంతి సదస్సు :** మొదటి ప్రపంచ యుద్ధం సద్దుమణిగిపోగానే, విల్సన్ ప్రతిపాదించిన పధ్నాలుగు సూత్రాలకు అనుగుణంగా జర్మనీ తన అంగీకారాన్ని తెలియ పరిచింది. 11వ నవంబర్ 1918న జర్మనీ యుద్ధ విరమణపై సంతకము చేసింది. యుద్ధం అంతమైంది. అప్పటికే కైజరు హాలెండుకు పారిపోయాడు. జర్మనీలో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఛాన్సలరైన మాక్స్ రాకుమారుడు సంధి షరతులను విశదీకరించమని కోరాడు. ఈ అదునుకోసం ఎదురు చూస్తున్న మిత్ర దేశాలు జనవరి 1919లో పారిస్‌లోని వర్సే అనే రాజ ప్రసాదంలో సంధి చర్చలను ప్రారంభించారు. దీని పర్యవసానమే చరిత్ర ప్రసిద్ధమైన వర్సెసంధి. జనవరి నుండి జూన్ నెల వరకు 1919లో ఆరు నెలల పాటు మిత్ర దేశాల వారు సంధి షరతులను గూర్చి చర్చలు జరిపారు.

ఈ పారిస్‌లో జరిగిన సమావేశం యుద్ధంలో గెలిచిన ఓడిన పక్షాల మధ్య జరిగిన ఒప్పందం కాదు. ఇది కేవలం గెలుపొందిన వారు మాత్రం కలిసి, ఓడిన వారిపై ఎటువంటి కక్ష సాధింపు ఆంక్షలు విధించాలనే అంశాలపై చర్చలు జరిపారు. కేవలం ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ అమెరికా దేశాలు మాత్రమే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొన్నారు.

ఈ సమావేశానికి ఇంగ్లాండ్ ప్రధాన మంత్రి అయిన డేవిడ్ లాయిడ్ జార్జి, ఫ్రాన్స్ దేశ అధ్యక్షుడు క్లెమెన్సో, అమెరికా అధ్యక్షుడు వుడ్రో విల్సన్, ఇటలీ సచివుడు ఆర్లెండోలు ఒక ఉపసంఘముగా ఏర్పడి, సంధి షరతులను నిర్ణయించే బాధ్యతలను తమ భుజాలపై వేసుకొన్నారు. ఈ సదస్సులో మిత్ర మండలికి చెందిన మిగతా చిన్న, పెద్ద దేశాలన్ని అక్కడ కూడాయి. కానీ ఈ సదస్సులో ముఖ్య పాత్ర కేవలం అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ దేశ ప్రతినిధులు మాత్రమే వహించారు.

ఈ సంధి షరతులను, తానే స్వయంగా రూపొందించాలనే ఆకాంక్షతో, విల్సన్ స్వయంగా వర్సే సమావేశంలో పాల్గొన్నాడు. విల్సన్ ప్రపంచ శాంతిని తన పధ్నాలుగు సూత్రాల ఆధారంగా సాధించుదామనుకొన్నాడు కానీ మిత్ర మండలి ప్రతీకార దృష్టితో ఉండి శత్రు దేశాలపై కక్ష సాధించటానికి నిర్ణయించుకోవటం వల్ల విల్సన్ అభిమతం నెరవేరలేదు.

విల్సన్ మిత్ర పక్షాలపై చాలా వత్తిడి తెచ్చి శత్రు పక్షంపై కఠినమైన నిబంధనలు పెట్టకుండా ఉండేలా ప్రయత్నించాడు. కానీ విల్సన్ తను ఊహించినంత మేర మిత్ర పక్ష సభ్యులు యుద్ధంలో ఓడిన దేశాలపై ఔదార్యం చూపలేదు. చివరికి ఎంతో తర్జన భర్జనల తరువాత జూన్ 28, 1919 తేదీన వర్సే సంధిని రూపొందించి, జర్మనీతో సంతకము చేయించారు.

**14.8.9. వర్సే సంధి షరతులు :** మిత్ర మండలివారు విధించిన యుద్ధ నష్ట పరిహారాన్ని చెల్లించటానికి ఆల్సేస్-లోరేన్ ప్రాంతాలను ఫ్రాన్స్‌కు అప్పగించాలి.

పశ్చిమ ప్రష్యాలో చాలా భాగం పోలెండుకు దఖలు పరచటానికి జర్మనీ అంగీకరించింది. జర్మనీకి చెందిన సార్ మండలాన్ని 15 సంవత్సరాల పాటు ఫ్రెంచి పరిపాలనలో పెట్టారు. జర్మనీ వలసలను నానాజాతి సమితి ఆదిష్ట పద్ధతి ద్వారా మిత్ర రాజ్యాల నిర్వాహణకి పంపే ఏర్పాటయింది. జర్మనీ సైన్యాలనూ, ఆయుధాల నిలువలనూ చాలా వరకు తగ్గించడమైంది. జర్మనీ యుద్ధ నష్టంగా 5 మిలియను డాలర్లను మిత్ర పక్షాల వారికి ఇవ్వవలసి వచ్చింది.

ఈ విధంగా విల్సన్ యుద్ధంలో ఓడిన దేశాలపై కరుణ, దయ కలిగేటట్లు సంధి ఉండాలని ఊహించితే, సంధి షరతులు మిత్ర పక్షాల వారు వారి శత్రు పక్షాలపై పూర్తి ప్రతీకార పూర్వకముగా నిర్ణయించారు. ఇది విల్సన్ ఆశయాలకు, ఊహాలకు పూర్తిగా వ్యతిరేకమైనవి. కానీ అతను ఈ ప్రతీకార జ్వాలలను అరికట్టలేక పోయాడు.

**సంధికి అమెరికన్ల వ్యతిరేకత :** జూన్ 1919 లో సంధి సంభాషణల తరువాత విల్సన్ స్వదేశానికి తిరిగి వచ్చాడు. అమెరికా రాజ్యాంగాన్ని అనుసరించి, ఆ సంధి అమెరికా సెనెట్ ఆమోదాన్ని పొందవలసి వున్నది. కానీ విల్సన్ ఈ సంధికి సెనెట్ ఆమోదము కోసం ప్రవేశ పెట్టినప్పుడు, సెనెట్ వ్యతిరేకించి ఆ బిల్లును త్రోసి పుచ్చింది. సెనెట్ ఈ వ్యతిరేకతకు కారణం ముఖ్యంగా విల్సన్ పారిస్‌కు సంధి సంప్రదింపులకు వెళ్ళినపుడు తనతో ఏ ఒక్క రిపబ్లికన్‌ను తీసుకొని పోలేదు. ఐదు నెలల పాటు అమెరికా అధ్యక్షుడు దేశాన్ని విడిచి సుదీర్ఘ కాలం దేశం వెలుపల గడపటాన్ని ఆమోదించక విల్సన్‌పై వ్యతిరేకతని పెంచుకొన్నారు. వర్సే సంధి పత్రాన్ని సెనెట్‌లో ఆమోదానికై పంపినప్పుడు అక్కడి రిపబ్లికన్ నాయకుడైన హెన్రీ కాబట్ లాడ్జ్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ సంధిని ఆమోదిస్తే బయటి దేశాలవారు అమెరికన్ సైన్యాలనూ, నౌకలనూ ప్రపంచములో ఎక్కడైనా పనిచేయడానికి పిలవవచ్చునని అతని వాదన. తాను ప్రాణ ప్రదంగా తయారు చేసిన సంధిని సెనెట్ ఆమోదించని స్థితి ఏర్పడేటప్పటికి విల్సన్ ప్రజలకే విజ్ఞప్తి చేయ సంకల్పించాడు. ఆ ప్రయత్నంలోనే పక్షవాతం సోకింది. ఆ అదునులోనే సెనెట్ సంధిని త్రోసి పుచ్చింది. ఈ విధంగా విల్సన్ కన్న కలలు ఇంటా బయటా కూడా కరిగి పోయే పరిస్థితులు ఏర్పడినాయి.

**14.8.10. నానాజాతి సమితి :** పారిస్ శాంతి సదస్సు నానాజాతి సమితి అనే ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పాటుకు దోహదపడింది. ఈ సంస్థ ఉడ్రో విల్సన్ కృషివల్లనే ఏర్పాటు చేయబడింది. మునుముందు ప్రపంచములో యుద్ధాలను నివారించటమే ప్రథమ కర్తవ్యముగా ఈ సంస్థ ఆవిర్భవించింది. నానాజాతి సమితి స్థాపనకు ఉభయ పక్షాలూ అంగీకరించాయి. ప్రపంచ శాంతి స్థాపన, అంతర్జాతీయ తగాదాల పరిష్కారము. అంతర్జాతీయ సహకారము మొదలైన ఉదాత్తాశయ పరిపూర్తికి నిర్దేశించిన నానాజాతి సమితి స్థాపన విల్సన్ సాధించిన విజయాలలో ముఖ్యమైనది.

ఈ సంస్థ సభ్యత్వము అన్ని దేశాలు పొందవచ్చును. కానీ కొన్ని బలమైన దేశాలు ఈ సంస్థపై అధిపత్యము పొందాయి. అమెరికా అధ్యక్షుని ప్రోద్బలముతో ఏర్పాటైన ఈ సంస్థలో అమెరికా దేశమే సభ్యత్వం తీసుకోవడానికి ఇష్టపడలేదు. అమెరికా దేశము కూడా ఈ సంస్థలో సభ్యత్వము కలిగి వుంటే, సంస్థ ఆశయాలు ఫలించి ఉండేవి. కానీ అమెరికాలో 1920 ఎన్నికలు కేవలం ఈ పారిస్ శాంతి సదస్సు, నానాజాతి సంస్థలలో విల్సన్ పాత్ర అమెరికా తీసుకోవలసిన నిర్ణయాలు అనే అంశాలపైనే కేంద్రీకృతమైనాయి. డెమోక్రాట్ అధ్యక్షుడైన విల్సన్ అమెరికా దేశం అంతర్జాతీయ శాంతి స్థాపనకు అంతర్జాతీయ వ్యవహారాలపై దృష్టి పెట్టాలనే ఉద్దేశ్యముతో పారిస్ శాంతి సదస్సులో, నానాజాతి సంస్థ ఏర్పాటుకు క్రియాశీల పాత్ర వహించాడు. కానీ రిపబ్లికన్ పార్టీవారు దీనిని వ్యతిరేకించారు. అమెరికా దేశం కేవలం వారి దేశ అభివృద్ధి కోసమో కట్టుబడి ఉండాలని, అంతర్జాతీయ వ్యవహారాలలో తల దూర్చరాదని ప్రచారము చేసారు. ఆ ఎన్నికలలో డెమోక్రాటిక్ పార్టీవారు ఓడి, రిపబ్లికన్ పార్టీ గెలుపొందింది. రిపబ్లికన్ పార్టీవారు నానాజాతి సంస్థలో అమెరికా దేశ సభ్యత్వానికి ఇష్టపడలేదు. ఆ విధముగా నానాజాతి సంస్థ స్థాపనకు ముఖ్య పాత్ర వహించిన దేశమే ఆ తరువాత ఆ సంస్థలో సభ్యత్వం పొందనందున ఈ సంస్థ వైఫల్యము పొందినదని చెప్పవచ్చును.

## 14.9 సంగ్రహంగా

ఉడ్రో విల్సన్ ఈ విధంగా ఆంతరంగిక విధానాలలో నూతన స్వేచ్ఛను ప్రతిపాదిస్తూ, ఆ దిశగా టారిఫ్ సంస్కరణను, ఫెడరల్ రిజర్వ్ చట్టాన్ని, ట్రస్ట్‌ల సంస్కరణను చేపట్టాడు. విదేశీ విధానంలో మిత్ర పక్షాలకు సంపూర్ణ సహకారాన్ని ప్రపంచ యుద్ధంలో అందజేసి వారి విజయానికి ముఖ్య కారకుడయ్యాడు. వర్సే సంధికి శాంతి సూత్రాలను ప్రతిపాదించి, నానాజాతి సమితి స్థాపనకై రాజీ పడ్డాడు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి అమెరికాను ఆధిక్య స్థానంలో నిలిపాడు.

## 14.10 వ్యాస ప్రశ్నలు :

1. అమెరికాలో ఉడ్రో విల్సన్ తన అధ్యక్షకాలంలో ప్రవేశ పెట్టిన నూతన స్వేచ్ఛా విధానాలు ఇతర సాంఘీక సంస్కరణలను గూర్చి విశదీకరించుము.

. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో తొలుత అమెరికా అవలంభించిన తటస్థ విధానమును తెలుపుచూ, తదుపరి మిత్ర పక్షాలవైపు మొగ్గు చూపటానికి దారి తీసిన పరిస్థితులను గూర్చి వ్రాయుము.

3. మిత్ర పక్షాలవారికి అమెరికా అందించిన సహాయ సహకారాలను, మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా ప్రత్యక్ష పాత్రను విపులీకరించుము.

. ఉడ్రో విల్సన్ ప్రతిపాదించిన పద్నాలుగు సూత్రాలను వివరిస్తూ శాంతి స్థాపనకు చేసిన కృషి ఏ విధంగా విఫలమైనదో వివరించుము.

## 14.11 ఉపయుక్త గ్రంథాలు :

1. Allan Nevins & Henry Steele Commager : The pocket History of the United States pocket Books, INC, New York 1943, 1951 (8th reprint)

2. Henry BamFord Parkes : The United States of America; A HISTORY; Khosla Publishing House, Mehra Offset Press, New Delhi 1986

3. Ralph W. Steen : The United States, A Hisotry, Prentice - Hall-INC, N.J.; 1959.

4. Rebekah R. Liebman & Gertrude A Young; The Growth of America; Prentice - Hall, Inc., N.J. 1966

5. Richard Hofstadter William Miller Daniel Aaron; The United States, The History of a Republic Prentice- Hall INC; N.J. 1957; .. 1964 (14th Edition)

6. Richard N. Current T. Harry Williams & Frank Freidel : American History A Survey, New York 1965

డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డి
లెక్చరర్, లయోలా కాలేజి, విజయవాడ

పాఠం - 15

# ఫ్రాంక్లిన్ డిలనో రూజ్‌వెల్ట్ 1933 - 45

## నూతన విధానము

### 15.0 లక్ష్యం :

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1928 నుండి ఏర్పడిన ఆర్థిక మాంద్యానికి పరిష్కారంగా 32 వ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ప్రతిపాదించిన నూతన విధానమును గూర్చి వివరించుట ఈ పాఠ్య లక్ష్యం.

### విషయ క్రమం :


15.1 జీవిత విశేషాలు

15.2 ఆర్థిక మాంద్యం

15.3 నూతన విధానము

15.4 ఉపశమన చర్యలు

15.5 పునరుద్ధరణ కార్యక్రమాలు

15.6 సంస్కరణలు

15.7 ఫలితాలు

15.8 సమీక్ష

15.9 వ్యాస ప్రశ్నలు

15.10 ఉపయుక్త గ్రంథాలు


### 15.1 జీవిత విశేషాలు :

ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 1882 లో "హైడ్ పార్క్" న్యూయార్క్‌లో జన్మించాడు. మొదట "హార్వర్డు" విశ్వ విద్యాలయంలో చదివి ఆ తరువాత కొలంబియాలో ఒక కళాశాలలో న్యాయ శాస్త్రములో పట్టాపుచ్చుకున్నాడు. 1905 లో ఎలియానోర్ అనునామెను వివాహమాడాడు. ఇతను థియోడోర్ రూజ్‌వెల్ట్‌కు దాయాది. అయితే థియోడోర్ రిపబ్లికన్ పార్టీకి చెందగా, ఫ్రాంక్లిన్ డెమొక్రాటిక్ పార్టీకి చెందినవాడు.

మొదటిగా 1910 లో ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ న్యూయార్క్ నుండి సెనెట్‌కు గెలుపొందాడు. ఉడ్రో విల్సన్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఫ్రాంక్లిన్‌ను నౌకాదళ సహాయ కార్యదర్శిగా నియమించాడు. డెమొక్రాటిక్ పార్టీవారు 1920 లో రూజ్‌వెల్ట్‌ని అమెరికా రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి పోటీలో నిలబెట్టారు. పోలియో వ్యాధి సోకినా నిర్దిష్టమైన వ్యాయామం ద్వారాను, ఈత ద్వారాను పట్టుదలతో శ్రమించి పోలియోనుండి విముక్తుడయ్యాడు.

న్యూయార్క్‌కు 1928 లో గవర్నరుగా ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ఎన్నికైయ్యాడు. 1932 లో మొదటిసారి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అధ్యక్షునిగా ఎన్నికై మొత్తం వరుసగా నాలుగుసార్లు అధ్యక్షుడైన ఘనత పొందాడు.

అధ్యక్ష పదవికి జరిగిన 1832 ఎన్నికలలో రిపబ్లికన్ అభ్యర్థి అయిన హూవర్, ఆర్థిక మాంద్యం ప్రపంచ పరిస్థితుల వలన ఏర్పడిందని, దానిపై అమెరికా ప్రభుత్వానికి ఎటువంటి అదుపులేదని, తాను తీసికొన్న చర్యలకు సత్ఫలితాలు వస్తున్నాయని ప్రకటించి రెండో సారి గెలిపించమని కోరాడు. మరో అభ్యర్థి అయిన రూజ్‌వెల్ట్ ప్రసంగాలలో మరో పరిష్కారాన్ని చూపాడు. సమాన ప్రాధాన్యతలలో కూడిన బడ్జెట్‌ని ప్రభుత్వ వ్యయంలో కోతని, స్థిరమైన ద్రవ్య వ్యవస్థని, ప్రైవేట్ రంగంతో ఎటువంటి జోక్యం చేసుకోని ప్రభుత్వాన్ని ఒక వంక ప్రకటిస్తూనే, రూజ్‌వెల్ట్, కొన్ని వ్యాపార పద్ధతులను సంస్కరించాలని, ఉపశమన విధానాలను ప్రభుత్వం అవలంభించాలని, ప్రభుత్వం అనేక భారీ ప్రాజెక్ట్‌లను చేపట్టాలని, తెలియజేసాడు. హూవర్ అనుసరించిన బడ్జెట్‌లో సమాన ప్రాధాన్యతలు లేవని, అందుచేతనే ఆర్థిక మాంద్యం ప్రబలిందని, డెమొక్రాటిక్ పార్టీ విమర్శించింది. డెమొక్రాటిక్ పార్టీ అధిక సంఖ్యాబలంతో అధికారంలోకి వచ్చింది.

ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడంలోను, ప్రపంచ యుద్ధంలో శత్రువులను ఓడించడంలోను, ప్రపంచ శాంతిని పరిరక్షించడంలోను ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ సిద్ధాంతాలకంటె అవసరాలకే ప్రాధాన్యత నిచ్చాడు. విజయవంతమవుతుందనుకున్న ఏ విధానాన్నైనా సరే అనుసరించడానికి అతడు వెనుకంజ వేయులేదు. ప్రత్యేక హక్కులను, దోపిడీని అతడు వ్యతిరేకించి, అమిత ధైర్యంతో పరిష్కారాలను ప్రతిపాదించేవాడు. సామాన్యునికి సహితం అర్థమయ్యే భాషలో అతని ఉపన్యాసాలు ఉండేవి. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనడంలో అతడు అత్యంత సాహసాన్ని, సంయమనాన్ని ప్రదర్శించి, సరియైన నాయకత్వాన్ని ఇవ్వగలిగాడు. అందుకే ఏ అధ్యక్షుడు పొందని గౌరవాన్ని, నాలుగుసార్లు వరుసగా అధ్యక్షునిగా ఎన్నికవడం, పొందగలిగాడు.

తన తొలి ప్రసంగంలోనే "మనం భయపడవలసింది కేవలం ఒక్క భయానికే" అని చెప్పడం ద్వారా ప్రజలలో ఆత్మ స్థైర్యాన్ని నెలకొల్పాడు. ప్రజాభిప్రాయాన్ని గ్రహించడంలోను, దానిని సరియైన భాషలో సరియైన సమయాన ప్రయోగించడంలోను, ఇతడు నిపుణుడు. ఈ లక్షణాలే అతడిని ప్రజానురంజకం చేశాయి. అయితే విమర్శకులు అతడు అధికారాన్నంతా కేంద్రీకరించుకున్నాడని, రాజకీయ ఎత్తుగడలలో నేర్పరని, కొన్ని సందర్భాల్లో దగ్గర త్రోవని అనుసరించేవాడని తెలియజేసేవారు.

రూజ్‌వెల్ట్ తన మొదటి రెండు అధ్యక్ష పదవి కాలాల్లో అమెరికాలో నెలకొని ఉన్న ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ఒక నూతన విధానాన్ని ప్రతిపాదించాడు. దానిని చిత్తశుద్ధితో అమలులో పెట్టాడు. ఇతను అభ్యుదయవాది. ఇతను తన సమయాన్నీ, శక్తినీ ఎక్కువగా విస్మృత మానవుని అభివృద్ధి కోసమే వెచ్చించాడు. అందువలనే భాగ్యవంతులు ఇతనిని తమ వర్గద్రోహిగా భావించేవారు.

## 15.2 ఆర్థిక మాంధ్యము :

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో అమెరికాకు ఉడ్రోవిల్సన్ అధ్యక్షునిగా ఉన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అధ్యక్షునిగా ఉన్నాడు. వీరిద్దరూ డెమొక్రాటిక్ పార్టీకి చెందినవారే. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలములో వారెన్ హర్డింగ్, కాల్విన్ కూలిడ్జ్, హెర్బర్ట్ హూవర్‌లు అధ్యక్షులుగా ఉన్నారు. వీరు ముగ్గురూ రిపబ్లికన్ పార్టీకి చెందినవారై ఉన్నారు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం అమెరికాలో వ్యవసాయ రంగం పారిశ్రామిక రంగం లాభదాయకంగానే ఉన్నాయి. ఉడ్రో విల్సన్ తరవాత వారెన్ హర్డింగ్, కాల్విన్ కూలిడ్జ్, హెర్బర్ట్ హూవర్‌లు అధ్యక్షులయ్యారు. ఆర్థిక మాంద్యం ప్రపంచమంతటా విస్తరించింది. హెర్బర్ట్ హూవర్ పదవీకాలంలో (1929 - 33) ఆర్థిక మాంద్యం తన చెడు ఫలితాలను అమెరికాకు ఇచ్చింది. నిరుద్యోగం భారీగా ప్రబలింది. ధనిక, బీద కుటుంబాల వ్యత్యాసం అధికమయింది. కేవలం మూడోవంతు అమెరికన్లు మాత్రమే లక్ష డాలర్ల వార్షిక ఆదాయాన్ని కలిగి

యున్నారు. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అధ్యక్షుడయ్యే నాటికి పరిస్థితులు మరింత విషమించాయి. నిరుద్యోగం వికృత రూపం దాల్చగా, బ్యాంకుల అనేకం మూతబడ్డాయి. ఈ పరిస్థితులనుంచి ఊరట కలిగించడానికి ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ న్యూడీల్ లేదా నూతన విధానాన్ని ప్రతిపాదించాడు

**15.3 నూతన వధానం :**

ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ప్రతిపాదించిన నూతన విధానం పూర్వపు అధ్యక్షులు అనుసరించిన అభ్యుదయ శకానికి కొనసాగింపుగ భావించవచ్చు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యుదయ సంస్కరణలను బలపరచనప్పటికీ, ఆ పార్టీకి కొత్తగా ఊతమిస్తున్న రైతులు, శ్రామికులు, మధ్య తరగతి సంస్కర్తలను సంతోష పెట్టడానికి ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ఈ విధానాన్ని అనుసరించాడు. పార్టీలో ఉన్న సంప్రదాయ వర్గాలతో పాటు సంస్కరణ వర్గాన్ని జతపరచి, అధ్యక్షుడు పార్టీని ముందుకు నడిపాడు.

నూతన విధానాల రూపకల్పనలో అధ్యక్షుడు పార్టీల కతీతమైన మేధావి వర్గంపై ఆధారపడేవాడు. ఉపన్యాసాలను తయారు చేయడంలోనూ, చట్టాలను రూపొందించడంలోనూ వీరి పాత్ర ఉండేది. వీరిలో ఆచార్యులు, ఉపన్యాసకులు, రచయితలు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు; పండితులు ఉండేవారు. ఈ సలహాదారులను పత్రికలవారు "బ్రెయిన్ ట్రస్ట్" అని పిలిచారు. ప్రత్యర్థి వర్గం వీరిని అనుభవ రహితమయిన ఆదర్శవాదులుగానూ తీవ్రవాదులుగానూ ముద్రవేసింది. వారి భావజాలం ద్వారానూ, నిష్కపట ప్రవర్తన ద్వారానూ రూజ్‌వెల్ట్ అధ్యక్ష కాలానికి వారు నూతన తేజాన్నిచ్చారు. నూతన విధాన రూపకల్పన అనేక మంది కృషి వలన జరిగింది.

ఇక నూతన విధాన అమలులో అధ్యక్షునికి పూర్తి సహకారాలు అందజేసిన వారిలో సెక్రటరీలయిన హెరాల్డ్ హిక్స్, హెన్రీ వాలెస్, ఫ్రాన్సిస్ పెర్కిన్స్ ఉన్నారు. రిపబ్లికన్ పార్టీ వారి సహాయాన్ని కూడా ఈ విధాన అమలులో అతడు తీసుకొన్నాడు.

నూతన విధానాలు 1933 నుంచి ఆరంభమయి, 1939 లో రెండవ ప్రపంచ యుద్ధ సమయానికి మిత్ర పక్షాలకు పూర్తి సహాయాన్ని అందించగలిగే స్థాయికి అమెరికన్ ఆర్థిక వ్యవస్థని తీసికొని వెళ్లాయి.

ఆర్థిక మాంద్యం నుంచి బయట పడడానికి ఆర్థిక వ్యవస్థలో సమతుల్యం అవసరమని అధ్యక్షుడు తెలిపేవాడు. వ్యవసాయ పారిశ్రామిక రంగాల మధ్య, ఉద్యోగ - కార్మికుల - వినియోగదారులమధ్య సమతుల్యం ఆర్థిక వ్యవస్థలో ఆవశ్యకమని రూజ్‌వెల్ట్ పేర్కొన్నాడు. ఆర్థిక వ్యవస్థను మెరుగు పరుచుకోవడానికి ఉపశమన పునరుద్ధరణ, సంస్కరణ అనే మార్గాలను ప్రతిపాదించాడు.

**15.4 ఉపశమన చర్యలు :**

రూజ్‌వెల్ట్ చేపట్టిన ఉపశమన చర్యలలో కొన్ని తాత్కాలిక కార్యక్రమాలు, మరికొన్ని దీర్ఘ ప్రణాళికలుగానూ ఉన్నాయి.

**15.4.1 నిరుద్యోగ సమస్య :** తాత్కాలిక ఉపశమన చర్యలలో ముఖ్యమైనది నిరుద్యోగ నిర్మూలన. అమెరికాలో 1933 నాటికి మొత్తం 12 మిలియన్ల ప్రజలు నిరుద్యోగులై ఉన్నారు. కరువు వలన బాధపడుతున్న వీరికి ఉపశమనం కల్పించడానికి, రూజ్‌వెల్ట్ ఫెడరల్ ఎమర్జెన్సీ రిలీఫ్ అడ్మినిస్ట్రేషన్ (F.E.R.A.) ని మే 1933 లో స్థాపించాడు. ఈ సంస్థ ప్రతిపాదించే పథకాల అమలుకు కావలిసిన ధనాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. కాని, ఆ పథకాలను అమలు పరిచే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చారు. న్యూయార్క్‌కి చెందిన సాంఘిక కార్యకర్త హారీ హాప్కిన్స్‌ని ఈ సంస్థకి అధిపతిగా నియమించారు.

ఈ పథకం అమలులోకి వచ్చిన తొలి రోజుల్లో కరువు బాధితులకు, నిరుద్యోగులకు ప్రభుత్వం ప్రత్యక్షంగానే ధన సహాయం చేసింది. కాని తరువాత "సివిల్ వర్క్స్ అడ్మినిస్ట్రేషన్" (CWA) ద్వారానూ ఆ తరవాత వర్క్స్ ప్రోగ్రెస్ అడ్మినిస్ట్రేషన్ (WPA) ద్వారానూ నిరుద్యోగులచే కొన్ని రకాల పనులు చేయించి, దానికి ఫలితంగా వేతనాల రూపంలో సహాయాన్ని అందించారు. ఈ విధంగా నిరుద్యోగులకు పని కల్పించి, పనికి ఫలితంగా పారితోషికం ద్వారా వారిని పరోక్షంగా ఆదుకున్నారు.

వర్క్స్ ప్రోగ్రెస్ అడ్మినిస్ట్రేషన్ (WPA) రెండవ ప్రపంచ యుద్ధం వరకు కొనసాగింది. ఈ సంస్థ నమోదు చేసికొన్న గరిష్ట సంఖ్య 3,300,000. ప్రైవేట్ వ్యాపారంతో జోక్యం చేసికోకుండా, సమాజానికి ఉపయోగపడే ఉద్యోగాలను వీరి కోసమై సంస్థ వెతకవలసి వచ్చింది. నమోదు చేసికొన్న వారిలో అధికులు ఎటువంటి నైపుణ్యము లేని వారవడంతో, వారికి పని కల్పించడం మరింత కష్టమయింది. అందుచేత ఈ సంస్థ వీరిని రహదారులు, వంతెనలు, భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన నిర్మాణాలలోనూ, వనరుల సంరక్షణ, ఉద్యానవనాల ఏర్పాటు మొదలయిన నూతన ప్రభుత్వ కార్యక్రమాలలోనూ విరివిగా ఉపయోగించారు. చిన్న పెద్ద ప్రాజెక్టులను వేల సంఖ్యలో నిర్మించారు. కొలంబియా నదిపై నిర్మించిన అతి పొడవైన కౌలీ ఆనకట్ట ఈ విధంగా నిర్మించ బడినదే.

ఉపశమన పథకాలలో పౌరపరిరక్షణ దళం ఏర్పాటు మరో ముఖ్యమైన సంఘటన. దీనినే సివిల్ కన్సర్వేషన్ కోర్ (CCC) అని పిలుస్తారు. ఈ పథకం క్రింద నిరుద్యోగులకు ఉపాధిని కల్పించి, వారి ద్వారా జాతీయ సహజ వనరులను పరిరక్షిస్తారు. దీని ద్వారా 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువకులకు ఉపాధి కలిగింది. అడవులను పెంపొందించడం, వరద నిరోధక చర్యలను చేపట్టడం, అగ్ని నిరోధక చర్యలలో పాల్గొనడం, దోమలను, క్రిమికీటకాలను అదుపు చేయడం వంటి పనులకు వీరిని ఉపయోగించారు

ప్రభుత్వం కళారంగాలను బలపరచింది. ఆర్థిక మాంధ్యం వలన ఆదరణ కోల్పోయిన కళాకారులకు ప్రభుత్వ ఆదరణ లభించింది. సంగీతం, నాట్యం, నాటకరంగం, చిత్ర లేఖనాల్లో ప్రవీణులను, వృత్తిపరమైన కళా సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఆదుకున్నారు. ఫెడరల్ రైటర్స్ ప్రాజెక్ట్ అనే సంస్థను స్థాపించి, నిరాదరణకు గురైన రచయితలకు ఆత్మ గౌరవాన్ని, భద్రతను కలుగజేసారు.

తాత్కాలిక, దీర్ఘకాలిక ఉపశమన కార్యక్రమాల వలన నిరుద్యోగ సమస్య కొంతవరకు పరిష్కరించబడింది. పట్టణాలు మెరుగుపడ్డాయి. వేల సంఖ్యలో నూతన భవనాలు నిర్మించబడ్డాయి. ధనం సామాన్య ప్రజానీకానికి చేరినందువలన వారిలో కొనుగోలు శక్తి పెరిగింది.

ఈ ప్రణాళికల అమలుకి చాలా ధనం వ్యయమయిందని, ఆ మొత్తాన్ని పన్ను కట్టే వారిపై అదనపు భారంగా ప్రభుత్వం వేసిందని, ప్రభుత్వ ధనాన్ని జులాయిగా తిరిగే వారి కోసం దుబారాగా ఖర్చు పెట్టారనీ విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ వ్యక్తుల పోషణ, సహజ వనరుల సంరక్షణ జరిగినందున దేశానికి ఉపకారమే జరిగింది. అన్నింటి కంటే మిన్నగా, ఈ కార్యక్రమాల్లో మానవీయత కనిపిస్తుంది.

## 15.5 పునరుద్ధరణ కార్యక్రమాలు :

నూతన విధానంలో భాగంగా ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ పతనమయిన ఆర్థిక వ్యవస్థని పునరుద్దరించడం కోసం రెండో ముఖ్య కార్యక్రమం దీని ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఎన్నో చర్యలను చేపట్టారు.

**15.5.1. వ్యవసాయ రంగం :** ఆర్థిక మాంధ్యం ఏర్పడిన కాలంలో అన్ని రంగాలలో వలెనే వ్యవసాయ దారులు నష్టపోయారు. వారు పండించిన పంటలకు తగిన ధర లభించలేదు. ఎక్కువమంది రైతులు తమ భూములను కుదువ పెట్టారు. వారిని, ఈ పేదరికం నుంచి విముక్తి పరచడానికి 1933 లో వ్యవసాయ క్షేత్రాల ఋణ చట్టాన్ని (ఫాం లోన్ ఆక్ట్) ఆమోదించారు. దీనివలన రైతులకు నూటికి 4 డాలర్ల వడ్డీకి, భూమి తనఖాపై అప్పులివ్వడానికి, ఫాం క్రెడిట్ అడ్మినిస్ట్రేషన్ అనే సంస్థని ఏర్పాటు చేసారు. బకాయిలను సక్రమంగా మూడు సంవత్సరాల లోపు చెల్లించిన వారికి భూములను తిరిగి ఇచ్చే విధానాన్ని చేపట్టారు. ఫలసాయం సరిగా లేని 17,000 వ్యవసాయ క్షేత్రాలను రీసెటిల్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వంకొని కొంతమంది వ్యవసాయ దారులకు మేలు చేసింది.

వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినప్పటికీ, రైతుల కష్టాలు తీరలేదు. ప్రపంచ యుద్ధ ఫలితంగా విదేశీ మార్కెట్లు తగ్గాయి. స్వదేశీ మార్కెట్టు సరిపోక పోవడంతో రైతుల బాధలు ఎక్కువయ్యాయి. దేశంలో కృతకమైన ఆహార ధాన్యాల కరువును ఏర్పరచడానికి ప్రభుత్వం నిర్ణయించింది. సేద్యం చేసే భూమిలో కొంత భాగాన్ని బీడు పెట్టిన వారికి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని చెల్లించింది. ఈ విధానాన్ని 1933 లో వ్యవసాయ సర్దుబాట్ల చట్టం (AAA) (అగ్రికల్చరల్ అడ్జస్ట్‌మెంట్ ఆక్ట్) ద్వారా ఆమోదించారు. సాగుని తగ్గించిన వారికి నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇచ్చింది. దీనికి కావలసిన ధనం వినియోగదారులనుంచి ఎక్సైజ్ పన్ను రూపంలో వసూలు చేశారు. విత్తు జల్లిన భూములను

సహితం బీడు పెట్టారు. కొన్ని చోట్ల పంటలను ధ్వంసం చేశారు. ముఖ్యంగా గోధుమలు, పత్తి, పొగాకు పంటలను తగ్గించారు. రైతులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా సాగు తగ్గేట్లు చేశారు. పరిమితంగా పంటలను పండించినందు వలన తమ పంటలను ఎక్కువ ధరకి అమ్ముకోగలిగారు. అదే విధంగా తాము పండించకుండా ఉంచిన భూములకు కూడా తగిన నష్ట పరిహారాన్ని పొందారు.

అయితే ఈ వ్యవసాయ సర్దుబాట్ల చట్టాన్ని జనవరి 1936 లో సుప్రీంకోర్టు చెల్లదని ప్రకటించింది. రాష్ట్రాల హక్కులకు భంగం కలిగిస్తుందని ఈ చట్టాన్ని సుప్రీం కోర్టు తిరస్కరించింది. వెంటనే కాంగ్రెస్, భూసార సంరక్షణ చట్టాన్ని (సాయిల్ కన్సర్వేషన్) ప్రతిపాదించింది. ఏ రైతులైతే తమ పొలాల్లోని భాగాన్ని భూసార సంరక్షణకై వదులుతారో, వారికి సబ్సిడీలు ఇస్తామని ప్రకటించారు. ఫిబ్రవరి 1938 లో తిరిగి దీన్ని రెండవ వ్యవసాయ సర్దుబాట్ల చట్టంతో (AAA) పూరించింది. ఉత్పత్తిని నిరోధించడమే దీని లక్ష్యం. ప్రభుత్వం రైతులకు కొన్ని ఎకరాల కోటాని ఏర్పరచింది. రైతులను అంతవరకే ఉత్పత్తి చేయమని బలవంతపు నిబంధన లేనప్పటికీ, ఆ విధంగా చేసిన వారు సబ్సిడీలు పొందేవారు. ఈ చట్టం ద్వారా అన్ని కాలాల్లో దేశ ధాన్యాగారం స్థిరంగా ఉండేట్లు ఏర్పాట్లు చేశారు.

ఏ సంవత్సరానికా సంవత్సరం, దేశ అవసరాలను బట్టి అంచనాలు వేసి, అంతవరకే (ఆ కోటా వరకే) రైతు భూములను సాగు చేసే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాలకు కట్టుబడే వారికి ప్రభుత్వం నష్ట పరిహార రూపంలో చెల్లింపులు చేస్తుంది. వాణిజ్య పంటలగు పత్తి, పొగాకు మొదలగు వాటిని పండించే రైతులలో మూడింట ఇద్దరు చొప్పున ఈ పథకంలో చేరి, లబ్ధిదారులయ్యారు. రైతులు త్వరలోనే కోలుకోసాగారు. అధిక ఉత్పత్తిని నియంత్రించడం వలన కొంత పునరుద్ధరణ జరిగింది. 1934 లోనూ 1936 లోనూ వచ్చిన క్షామాల వలన మరికొంత పునరుద్ధరణ జరిగింది. ధరలు 1932 కంటె - 1937 లో 86% పెరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధం రాక నాటికి వ్యవసాయ రంగం పూర్తిగా కోలుకుంది.

ఈ చట్టం వలన కలిగిన ప్రయోజనాలన్నీ ధనిక వాణిజ్య రైతులకే దక్కాయని ప్రధాన విమర్శ ఉంది. ఉత్పత్తి తగ్గడంతో సన్నకారు రైతులు, కౌలుదార్లు, వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత దిగజారింది. "రి సెటిల్ మెంట్ అడ్మినిస్ట్రేషన్" అనే సంస్థను 1935 లో ఏర్పరచి కొందరు రైతులకు సహకార వ్యవసాయ రంగంలో ఉపాధి చూపారు. ఫాం సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్‌ని 1937 లో ఏర్పాటు చేసి కౌలుదారీ రైతులకు అప్పులిచ్చి, వారు యజమానులుగా మారడానికి కావలసిన సహాయము చేశారు.

ఇన్ని పటిష్ట చర్యల వలన వ్యవసాయ రంగం 1939 నుంచి కుదుట పడింది.

**15.5.2 పరిశ్రమల పునరుద్ధరణ :** ఆర్థిక మాంధ్యం నుంచి ప్రజలను రక్షించడంలో పరిశ్రమల పునరుద్ధరణ ముఖ్య అంశమయింది.

జాతీయ పరిశ్రమల పునరుద్ధరణ చట్టాన్ని- నీ.రా.- (నేషనల్ ఇండస్ట్రియల్ రికవరీ ఆక్ట్) జూన్ 1933 లో కాంగ్రెస్ ఆమోదించింది. వ్యాపారాన్ని పునరుద్ధరించడం, దీని లక్ష్యం. పోటీని తగ్గించడం, ధరలను స్థిరీకరించడం ప్రభుత్వం చేస్తుంది. దీనికి బదులుగా కార్మికులకు పారిశ్రామిక వేత్తలు కొన్ని రాయితీలనివ్వాలని ప్రభుత్వం కోరింది. ఈ చట్ట నిర్మాణం వెనుక అమెరికాలోని కొందరు ధనిక వ్యాపార వేత్తల కృషి కూడా ఉంది. బెర్నార్డ్ బరూచ్, గెరార్డ్ స్వాప్ వీరిలో ప్రముఖులు. అంతకుముందు ట్రస్ట్‌ల నియంత్రణ కొరకు పరిశ్రమలపై విధించిన కొన్ని ఆంక్షలను తొలగించవలసిందిగా కొందరు వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక వేత్తలు పట్టు పట్టడంతో ఈ చట్టం వచ్చింది. పారిశ్రామిక వర్గం తప్పనిసరిగా కార్మికులకు కొన్ని వసతులను, రక్షణలను కల్పించే ఒప్పందంపై ఈ చట్టాన్ని ఆమోదించారు.

ఈ నేషనల్ ఇండస్ట్రియల్ రికవరీఆక్ట్ (నీరా), నేషనల్ రికవరీ ఎడ్మినిస్ట్రేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. పరిశ్రమలకు అవసరమయ్యే నియమావళిని దీనిని తయారు చేయమన్నారు. పని గంటలు తక్కువగా ఉండేటట్లు వేతనాలు కనీస స్థాయి కంటె ఎక్కువ ఉండేట్లు విపరీత పోటీ వలన ధరలు తగ్గకుండా ఉండేట్లు నియమావళిలో జాగ్రత్తలు తీసికొమ్మని ప్రభుత్వం చెప్పింది.

నీరా చట్టంలోని సెక్షన్ 7-A కార్మిక ప్రతినిధులకు చట్టపరమైన గుర్తింపు నిచ్చింది. నవంబరు 1933 నాటికే ప్రతి పెద్ద పరిశ్రమ కొన్ని నియమాలను పాటించడం మొదలు పెట్టింది. ఫిబ్రవరి 1934 నాటికి నియమావళి ప్రతి తయారు చేయబడింది. మొత్తం 557 మౌలికమైన ఆచరణ నియమాలను, 208 ఉప ఆచరణ నియమాలపై ఒప్పందాలు కుదిర్చారు. వ్యాపార వేత్తల, కార్మిక సంఘాల, వినియోగ దారీ వర్గాల ప్రతినిధుల సమక్షంలోనే ఈ నియమావళి జాబితాని తయారు చేశారు.

ఈ నీరా (NIRA) కొన్ని విమర్శలకు కూడా గురైంది. ఈ పథకం మొత్తం పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తల, వ్యాపార వేత్తల ఆధిపత్యంలో ఉన్నదని, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పారిశ్రామిక వేత్తలకు అంత అనుకూలంగా లేదని ఒక అభిప్రాయం ఉంది.

కార్మికులకు మరింత ప్రత్యక్ష సహాయం చేసే నిమిత్తం జూలై 1935 లో కాంగ్రెస్ వాగ్నర్ (Wagner Act) చట్టాన్ని ఆమోదించింది. కార్మికులకు యూనియన్‌లో చేరే హక్కు ఉందని, ఉమ్మడి ప్రయోజనాల కోసం డిమాండ్ చేసే ప్రాథమిక హక్కు ఉందని తెలియజేస్తూ ఈ హక్కులను పరిరక్షించడానికి "నేషనల్ లేబర్ రిలేషన్స్ బోర్డ్" (National Labour Relations Board - NLRB) ని ఏర్పాటు చేసింది. వాగ్నర్ చట్టం పూర్తిగా కార్మికుల హక్కులనే తప్ప, ఉద్యోగస్థుల హక్కులను పేర్కొనలేదనే విమర్శకు గురి అయింది. కేవలం రూజ్‌వెల్ట్ మద్దతు వల్లనే 1938 లో 'ఫెయిర్ లేబర్ స్టాండర్డ్స్ ఏక్ట్' ని కాంగ్రెస్ ఆమోదించింది. దీనివలన కార్మికులకు మేలు జరిగింది. వారానికి నలభై (40) గంటల పని మాత్రమే గరిష్ట స్థాయిలో ఉండాలని, పని చేసిన ప్రతి గంటకు నలభై (40) సెంట్లకు తగ్గకుండా జీతం ఉండాలని ఖరారు చేసారు. అంతకుముందు తక్కువ జీతాలకు పని చేసే వేలాది కార్మికులు కూడా ఈ చట్టం పరిధిలోకి వచ్చారు.

పారిశ్రామిక పునరుద్ధరణను ఉద్దేశించి రూజ్‌వెల్ట్ తీసికొన్న చర్యల వలన మూతపడిన కార్ఖానాలు, పరిశ్రమలు పని చేయ వారంభించాయి. అనేకమందికి ఉపాధి దొరికింది. ఆదాయమూ, కొనుగోలు శక్తి పెరిగి, ఉత్పత్తి పెరగడానికి దోహదం చేసాయి. కార్మిక సంఘాలు, సభ్యత్వము పెరగసాగాయి. పరిశ్రమలలో అసమంజసమైన పోటీ తగ్గింది.

**15.5.3 ద్రవ్య, బాంకింగ్ విధానాలు :** ధరల పెరుగుదల, వేతనాల పెరుగుదల తరవాత ప్రభుత్వం అప్పు చేసిన వారికి సహాయ కార్యక్రమాలు ఆరంభించింది.

హూవర్ అధ్యక్ష కాలంలో నెలకొల్పబడిన 'రికన్‌స్ట్రక్షన్ ఫైనాన్స్ కార్పొరేషన్' (RFC) ని రూజ్‌వెల్ట్ ప్రభుత్వం బలోపేతం చేసింది. ఈ సంస్థ భారీ వ్యాపార సంస్థలకు యధావిధిగా అప్పులివ్వసాగింది. తాకట్టు పెట్టిన సేద్య భూములను ఫామ్ క్రెడిట్ ఎడ్మినిస్ట్రేషన్ (Farm Credit Administration) సంస్థ ద్వారా వశం చేసుకునేది. నగరాలలోని తనఖాలను హోమ్ ఓనర్స్ లోన్ కార్పొరేషన్ (Home Owners Loan Corporation) సంస్థ సేకరించసాగింది. అప్పులిచ్చిన వారికి మొత్తం సైకాన్ని ఈ సంస్థలు చెల్లించి, గ్రామీణ నగరాలలో ఉండే తనఖాలనన్నీ వశం చేసికొన్నాయి. గ్రామాలలో తనఖాకి భూమిని, నగరాలలో ఇంటినీ తనఖాకి ఉపయోగిస్తారు. కనుక ఆ ఆస్తులను అప్పులిచ్చిన వారినుంచి ప్రభుత్వ సంస్థలు సేకరించాయి. అప్పులిచ్చిన వారికి సైకం అందింది అప్పు చేసిన వారు ఇప్పుడు ప్రభుత్వ సంస్థలకు భారీగా తగ్గించబడిన వడ్డీ రేటుతో సొమ్ము చెల్లించాలి. ఈ విధంగా ఇరువురు - అప్పు చేసిన వారు, అప్పు ఇచ్చినవారు - ప్రభుత్వ విధానం వలన లాభించారు. ఈ విధంగా ఫెడరల్ ప్రభుత్వమే ప్రైవేట్ బాంక్‌లా వ్యవహరించి, ద్రవ్య సంబంధ విషయాలను సమర్థవంతంగా పరిష్కరించింది.

ప్రభుత్వము జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థకు బాసటగా నిలించింది. దీనితో బ్యాంకులపై ప్రజలకు నమ్మకం పెరిగింది. కొన్ని వారాలలోనే బ్యాంక్‌లు కోలుకుని పూర్వపు స్థితికి చేరాయి. ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ అనే సంస్థను 1933 లో బాంకింగ్ చట్టం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్ బ్యాంక్ డిపాజిట్లకు పూచీ వహిస్తుంది. స్టాక్ ఎక్స్ఛేంజిలలో జరిగే ఉపద్రవాలను నివారించడానికి, ఖాటి పని తీరుని సరిదిద్దడానికి 1933 లో సెక్యూరిటీస్ ఆక్ట్‌ని, 1934 లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ ఆక్ట్‌ని ఆమోదించారు. కొత్త సెక్యూరిటీలను జారీ చేసేందుకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (S.E.C.) ని ఏర్పాటు చేశారు.

ద్రవ్యాన్ని నిర్వహించడం ద్వారానూ, డాలర్ విలువను అదుపు చేయడం ద్వారానూ, ప్రభుత్వం ధరలను మొదటగా పెంచి తరవాత స్థిరీకరించవచ్చని భావించింది. సువర్ణ విధానాన్ని (Gold Standard) ప్రభుత్వం తిరస్కరించింది. బంగారు, వెండిలను ప్రభుత్వమే కొని భద్రపరచసాగింది. డాలరు విలువను బాగా తగ్గించడంతో అధిక సొమ్ము ప్రజలమధ్య పంపిణీలో ఉంది. వడ్డీ రేట్లు కనీస ధరకు తగ్గాయి. ఖాతాదారులకు తమ డబ్బు క్షేమంగా ఉంటుందనే ధైర్యం, నమ్మకం ఏర్పడడంతో బాంకుల పునరుద్ధరణ జరిగింది.

**15.5.4 రైల్వేలు :** ఆటోమొబైల్ పరిశ్రమ ప్రవేశంతోనూ, ఆర్థిక మాంద్యం వలన రైల్వేల ఆదాయం తగ్గసాగింది. కాని రీకన్స్ట్రక్షన్ ఫైనాన్స్ కార్పోరేషన్ (R.F.C.) రైల్వేల ఆధునికతకు, తద్వారా పునరుద్ధరణకు, తోడ్పడింది.

**15.5.5 నౌకా పరిశ్రమ :** మర్చెంట్ మెరైన్ చట్టాన్ని 1936 లో ఆమోదించడం ద్వారా నౌకాయానం సబ్సిడీని పొందింది. మారిటైమ్ కమిషన్‌ని ఏర్పాటు చేశారు. ఏడాదికి ఏభై నౌకలను తయారు చేయించి, ప్రైవేటు కంపెనీలకు సరఫరా చేసేట్లు అంగీకరించారు.

## 15.6 సంస్కరణలు :

ఉపశమన, పునరుద్ధరణ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం విరివిగా సంస్కరణలను ప్రవేశ పెట్టి ఆర్థిక మాంద్యం నుంచి దేశాన్ని ఆదుకొంది. వీనిలో టెన్నసీవాలీ అభివృద్ధి, అనేక సాంఘిక చట్టాలు ఉన్నాయి.

**15.6.1 టెన్నసీలోయ అభివృద్ధి పథకం :** ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ తన నూతన విధానంలో భాగంగా టెన్నసీలోయ అభివృద్ధిని చేపట్టాడు. ఈ టెన్నసీ నది అమెరికాలోని ఏడు రాష్ట్రాల ప్రాంతాలలో ప్రవహిస్తుంది. టెన్నసీ నది, దాని ఉపనదులు పుష్కలంగా ప్రవహిస్తున్నా, ఈ లోయలోని ప్రజలు దాదాపు ఇరవై లక్షల మంది అధిక దారిద్ర్యంతో బాధపడేవారు.

రూజ్‌వెల్ట్ మే 1933 లో టెన్నసీ వాలీ అథారిటీ (TVA - Tennesse Valley Authority) అనే ఒక సంస్థను స్థాపించాడు. నూతన ఆనకట్టలను ఈ నదిపై కట్టడానికి, విద్యుదుత్పాదన చేసి ఈ విద్యుత్తును అమ్మడానికి ఈ సంస్థకు అధికారాలిచ్చారు. టెన్నసీ నదిని నౌకాయానానికి అనుకూలంగా చేయడం, వరద నిరోధక కార్యక్రమాలు చేపట్టడం వంటి బాధ్యతలను T.V.A. కి అప్పగించారు. సూక్ష్మంగా చెప్పాలంటే లోయలో నివసించే ప్రజల సాంఘిక ఆర్థిక సంక్షేమాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను ఈ సంస్థకు ఇచ్చారు.

టెన్నసీ వాలీ అథారిటీ తన పని తీరులో చక్కటి ఫలితాలను చూపింది. ఆ ప్రాంతంలో గల అపారమైన సహజ వనరులను ఉపయోగానికి తీసికొని వచ్చి, అభివృద్ధిని చేసింది. మొత్తం ఏడు ఆనకట్టలను 1940 నాటికి నిర్మించారు. అప్పటికే నిర్మించబడిన ఆనకట్టలను సహితం T.V.A. అధికార నిర్వహణ క్రిందకు తెచ్చారు. ఈ ఆనకట్టల ద్వారా జరిగే విద్యుదుత్పాదనను చాలా చౌకగా సరఫరా చేసేవారు. వ్యవసాయ క్షేత్రాలు, వ్యాపార సంస్థలు, గృహాలు దీని వలన ఉపయోగం పొందాయి. ప్రైవేటు కంపెనీలు వసూలు చేసే ఛార్జీలు ఎంతవరకు సమంజసమైనవో తెలుసుకోవడానికి ఈ సంస్థ వసూళ్ళు ప్రాతిపదిక అయింది.

రూజ్‌వెల్ట్ ప్రవేశ పెట్టిన సంస్కరణలలో అత్యంత విజయవంతం అయిన వాటిల్లో టెన్నసీ వాలీ అథారిటీ ఒకటి. గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకై 1935 లో గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా సంస్థని (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ ఎడ్మినిస్ట్రేషన్) నెలకొల్పారు. ఐదు సంవత్సరాలలోనే ఈ సంస్థ 43 రాష్ట్రాలలో విద్యుచ్ఛక్తిని వ్యవసాయ దారులకు అందించగలిగింది.

**15.6.2 సాంఘిక చట్టాలు :** కాంగ్రెస్ 1935 లో సాంఘిక భద్రతా చట్టాన్ని (సోషల్ సెక్యూరిటీ ఏక్ట్) ఆమోదించింది. దీని ద్వారా ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు, పించన్లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఏర్పాటు చేశారు. ఈ పథకానికి కావలసిన ధనాన్ని పరిశ్రమల యజమానుల నుండి మరియు ఉద్యోగస్థులపై నూతన పన్ను విధించుట ద్వారా సేకరించారు.

**15.6.3 గృహనిర్మాణం :** పరిశ్రమలు, కర్మాగారాలు పెరగడంతో కార్మికులు అధిక సంఖ్యలో నగరాలలో నివసించసాగిరు. ార్మిక కుటుంబాలు భరించగలిగే గృహనిర్మాణాన్ని చేపట్టడానికి ప్రైవేటు రంగం ముందుకు రాలేదు. మురికి వాడల నిర్మూలనం ప్రధాన ్క్ష్యమయింది. బీద ప్రజలకు నివాస యోగ్యమయిన గృహ సదుపాయం కలుగజేయవలసిన ఆవశ్యకత పెరిగింది. నూతన విధాన సంస్కరణలలో ాగంగా ప్రభుత్వ రంగమే ఈ కార్యక్రమం చేపట్టింది. "ఫెడరల్ హౌసింగ్ అథారిటీ" ని 1934 లో స్థాపించి, తక్కువ వడ్డీ రేట్లకు తనఖాలో ల ఇండ్ల అప్పులను తీర్చుకోడానికి సహాయం చేసింది. ఫెడరల్ ప్రభుత్వం రాష్ట్రాలకు, వ్యక్తులకు దీర్ఘకాలిక స్వల్ప వడ్డీలతో ఋణాలను మంజూరు చేయడానికై 1937 లో అమెరికా గృహ నిర్మాణ సంస్థను (U.S.H.A. - United States Housing Authority) ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా మురికి వాడలు శుభ్రపడి, లక్షల మంది బీదలకు చౌకలో మంచి నివాస గృహాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా నివాస యోగ్యంగా లేని, ప్రమాదకరంగా ఉన్నటువంటి భవనాలను వేల సంఖ్యలో నేలకూల్చారు.

**15.6.4 వనరుల రక్షణ :** ప్రభుత్వము అటవీ సంపదను పెంచి సహజ వనరుల రక్షణను చేపట్టింది. భూసార సంపద పరిరక్షణకై 1934 లో "సాయిల్ కన్సర్వేషన్ సర్వీస్" అనే సంస్థని స్థాపించారు. వీరు రైతులకు నూతన సేద్యవిధానాలను నేర్పసాగారు. ఖనిజాలు, కలప మొదలయిన జాతీయ వనరుల సంరక్షణకై జాతీయ సంపదల సంస్థను (నేషనల్ రిసోర్సెస్ బోర్డ్) ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం సేకరించిన అనేక భూములను అమ్మడానికి వీలు లేకుండా ప్రభుత్వం టేలర్ గ్రేజింగ్ చట్టం ద్వారా నిషేధించింది. నూట అరవై మిలియన్ ఎకరాలకి పైగా ఉన్న భూములను పశువుల మేతకై బీడు భూములుగా గాని, జాతీయ విహార స్థలాలుగా గానీ వదిలి పెట్టాలని తీర్మానించారు. ఆహార పదార్థాలు, మందులు తయారీలలో జరిగే కల్తీలు నివారించడానికి "స్వచ్ఛమైన ఆహార మందుల" శాసనాన్ని (Pure Food and Drugs Act) రూపొందించారు.

**15.7 ఫలితాలు :**

నూతన విధానం విప్లవాత్మకమైనదని దాని మద్దతుదారులు, వ్యతిరేకులు పేర్కొనడం విశేషం.

1. నిరుద్యోగాన్ని పూర్తిగా రూపుమాపాలనే కాంక్ష, ఉత్పత్తిని పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలనే కోరిక నెరవేరలేదు.

2. ప్రైవేట్ రంగంతో ప్రభుత్వ జోక్యం అధికమయింది. ప్రైవేట్ రంగాన్ని పరిపాలనా వ్యవస్థ పరిధిలోకి తెచ్చారు. కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించారు. ఈ కారణాల వలననే ఉత్పత్తి తగ్గిందని, అనిశ్చిత పరిస్థితి పెట్టుబడిదారులలో నెలకొందని సాంప్రదాయ వాదుల వాదన. అభ్యుదయ వాదులు మాత్రం సంస్కరణలు పరిపూర్ణంగా జరగనందువలననే నూతన విధానం అపజయం పొందిందని ప్రకటించారు. సామాన్య ప్రజానీకానికి కొనుగోలు శక్తి పెరిగేలా జాతీయాదాయం పెరగాలని వారు కోరారు. ప్రైవేట్ పెట్టుబడి తగ్గడం పండిన ఆర్థిక వ్యవస్థలో లక్షణంగా వారు భావించారు. ఫాక్టరీలు ఆఫీస్ భవనాలు, చాలా కాలం వరకు సరిపడా దేశంలో ఉన్నాయని, అందుచేత ప్రభుత్వ పెట్టుబడే శాశ్విత విధానమవ్వాలని, జాతీయ సంపద పెరగడానికి అది దోహద మవుతుందని వారు భావించారు. చౌక ధరలో భవన నిర్మాణం పాఠశాలలు, ఆసుపత్రులపై వ్యయం మంచిదని వారి అభిప్రాయం.

3. భారీ వ్యాపారంపై అదుపుగా ప్రభుత్వం రైతులకు, కార్మికులకు ప్రత్యక్ష రక్షణ కలుగజేసింది. భారీ వ్యవసాయాన్ని, కార్మిక యూనియన్లని ప్రోత్సహించింది.

4. ఫెడరల్ ప్రభుత్వానికి ఇదివరకటి కంటె అధికమైన బాధ్యతలను ఇచ్చింది. ఆర్థిక వ్యవస్థని నియంత్రించగలిగిన అధికారాలను, బలహీన వర్గాలకు రక్షణ కలుగజేసే బాధ్యతను, సంక్షేమ కార్యక్రమాలను అమలులో పెట్టవలసిన ఆవశ్యకతను నూతన విధానం తెలియజేసింది. విపరీతంగా పెరిగిన భారీ వ్యాపారానికి అడ్డుకట్ట వేసే నిమిత్తం వ్యవసాయదారులకు, కార్మికులకు రక్షణ కలుగజేయడమయింది.

నూతన విధానం దేశానికి ఆర్థిక పరిపూర్ణతను ఇవ్వలేకపోయినా ప్రజా వ్యవహారాలలో నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. ఆకలితో అలమటించే వారికి ప్రభుత్వం పని జూపడంతో అప్పటి నిరాశనుంచి వారిని విముక్తులను జేసి ఆశావాదం ప్రవేశింపగలిగే వీలు చేసింది. పబ్లిక్ వర్క్స్ విధానం జాతీయ సంపద పెరగడానికి దోహదం చేసింది. అత్యంత సంతృప్తి నిచ్చింది. టెన్నెసీ లోయ అభివృద్ధి పథకం దీనితోపాటు పశ్చిమ రాష్ట్రాలలో ఆనకట్టల ద్వారా వచ్చిన అభివృద్ధి గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమాలు, జాతీయ వనరుల రక్షణ కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి చేయడంలో దోహదపడ్డాయి.

## 15.8 సమీక్ష :

నూతన విధాన విమర్శకులు, మద్దతు దార్లు పేర్కొన్నట్లుగా గొప్ప విప్లవాత్మకమైన చర్య. అసంఖ్యాక వ్యవసాయ దారులు, కార్మికులు, ఇతర అట్టడుగు వర్గాల వారు ఆర్థిక మాంద్యం నుంచి బయట పడగలిగారు. మానవీయతతో సహాయం అందింది.

## 15.9 వ్యాస ప్రశ్నలు :

1. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అనుసరించిన నూతన విధానములను తెలియజేయుము.
2. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ నూతన విధానములు ఎంతవరకు అమెరికాను ఆర్థిక మాంద్యం నుంచి విముక్తి పరచ గలిగాయో తెలుపండి.
3. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌ని "వర్గద్రోహి" అని విమర్శకులు అన్నారు. దీని సత్యాసత్యాలను తెల్పుము.

## 15.10 ఉపయుక్త గ్రంథాలు :


1. Allan Nevins & Henry Steel Commager : A Pocket History of the United states, New York, 1951
2. Richard Hostad ter, William Miller and Danial Aaron : The Unifed States. The History of a Republic, New Jersy, 1964.
3. Richard N. Current, T. Harry Williams Frank Freidell : American History A Survey, New York, 1965.
4. H.B. Parkes : The United States of America; A History.



డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డి
లెక్చరర్, లయోలా కాలేజి, విజయవాడ

పాఠం - 16

# ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ విదేశీ విధానము

**16.1 లక్ష్యం :** ఫ్రాంక్లిన్ డినలో రూజ్‌వెల్ట్ విదేశీ విధానము అతను యుద్ధ సమయంలో అనుసరించిన విధానాలను గురించి వివరించుటయే ఈ పాఠం లక్ష్యం.

విషయ క్రమం

**16.1.2** పరిచయం

**3** ఐరోపా రాజకీయాలు

**4.** తటస్థ విధానానికి సృష్టి

**5.** అమెరికా విధానము

**6.** 1940 ఎన్నికలు

**7.** ఫ్రాన్సు బలహీనత

**8.** పాన్ - అమెరికనిజం

**9.** రెండో ప్రపంచ యుద్ధం - యుద్ధసన్నాహాలు

**10.** అరువు - కౌలుపద్ధతి

**16.2.1** జర్మనీ - రష్యాల మైత్రి సృష్టి

**2.** అట్లాంటిక్ ప్రకటన పత్రము

**3.** అమెరికా యుద్ధ ప్రవేశము

**4.** పెరల్ హార్బర్ పై దాడి

**5.** ఆఫ్రికా రంగము

**6.** ఇటలీపై దండయాత్ర

**7.** ఫ్రాన్స్ విముక్తి

**8.** 1944 ఎన్నికలు

**9.** జర్మనీ సేనల లొంగుబాటు

**10.** పసిఫిక్ యుద్ధరంగం - అణుయుద్ధం

**16.3.1** శాంతి స్థాపనకు ప్రయత్నాలు

**2.** యాల్టా సమావేశము

**3.** ఐక్యరాజ్య సమితి స్థాపన

**4.** సమీక్ష

**16.1.2. పరిచయం :** ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అధ్యక్షుడయిన తరువాత హూవర్ అనుసరించిన విదేశీ విధానాన్నే అనుసరించాలని భావించినా ఐరోపా సంఘటనల వలన మార్పులు చేసికోవలసి వచ్చింది. ఏకాంత విధానం నుంచి తటస్థ విధానానికి, అక్కడ నుంచి మిత్ర రాజ్యాలకు విశేషమైన సహాయ సహకారాలను అందించే దశకు, సహాయ దశనుండి, యుద్ధరంగంలో ప్రత్యక్షపాత్ర వహించే దశవరకూ క్రమ క్రమంగా చురుకైన పాత్ర వహిస్తూ వచ్చాడు. అమెరికా ప్రజలను ఒక వంకా, మిత్ర రాజ్యాలను మరోవంకా ఏకత్రాటిగా నడిపించి విజయవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాడు.

**16.2.3. ఐరోపా రాజకీయాలు :**

1. జర్మనీలో హిట్లర్ 1935 లో వర్సేల్స్ సంధిని కాదని తన సైన్యాన్ని అధిక సంఖ్యలో అభివృద్ధి చేసుకోవడం, 1936 లో రైన్ ప్రాంతాన్ని తిరిగి సైన్యంతో నింపివేయడం జరిగింది.

2. ముస్సోలిని ఇథియోపియాపై దురాక్రమణ చేయుటపై, బ్రిటన్, ఫ్రాన్స్, నానాజాతి సమితి, ఒక నిర్ణయానికి రాలేకపోయారు. దీనితో ముస్సోలీన్ దురాక్రమణకు తగినంత సమయం లభించింది.

3. స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకో తిరుగుబాటుకి ఇటలీ - జర్మనీలు మద్దత్తునిచ్చారు (1936).

4. ఇదే సంవత్సరం జర్మనీ - జపాన్ లేక బెర్లిన్-టోక్యో సఖ్యత జరిగింది. 1937 లో దీనిలో ఇటలీ కూడా చేరింది.

హిట్లర్ 1938 లో ఆస్ట్రియాపై దురాక్రమణ, మ్యానిక్ సంధి ప్రకారం (బ్రిటన్ - ఫ్రాన్స్ - జర్మనీ) జర్మనీ చెకోస్లోవికియాను పొందుట, అటుపిమ్మట 1939 లో ప్రాగ్‌ను నష్టపర్చుట, పోలాండ్ పై దురాక్రమణ, ఆపై మొత్తం తూర్పు ఐరోపాను తన ఆధీనంలో తీసి కొనిరావలెనని హిట్లర్ ప్రయత్నం.

6. ఏప్రిల్ 1939 లో బ్రిటన్ ప్రధాని ఛాంబర్‌లేన్ పోలాండ్‌కు సహాయం చేయుటకు మందుకు రావటం.

7. ఆగస్టు 23 వ తేదీ 1939, హిట్లర్, స్టాలిన్ రాజీ. దీనితో హిట్లర్ సెప్టెంబర్ 1 వ తేదీన పోలాండ్‌పై దండయాత్ర. బ్రిటన్, ఫ్రాన్స్ సెప్టెంబర్ 3 వ. తారీఖున జర్మనీపై యుద్ధప్రకటన.

8. మూడు వారాలలో పోలాండ్‌ను గెలుచుకొని జర్మనీ, రష్యా దాన్ని సమపాళ్ళలో పంచుకొన్నారు. ఆపై రష్యా బాల్టిక్ రాష్ట్రాలను (ఎస్టోనియ, లటవియ, లిథునియ) గెలుచుకొని, రుమేనియాను, ఫిన్‌లాండ్‌లపై దురాక్రమణ చేసింది.

**16.1.4 తటస్థ విధానానికి స్వస్తి :** పైన పేర్కొనబడిన సంఘటనల ద్వారా ఐరోపాలో యుద్ధ జ్వాలలు ప్రజ్వరిల్లగానే దానిలో అమెరికా పాల్గొనవలెనా లేదా అనే సమస్యపై దేశమంతటా చర్చలు మొదలైనాయి. కొందరు ఎట్టి పరిస్థితులలో కూడా అమెరికా ఐరోపా యుద్ధాలలో ప్రవేశించ కూడదని పట్టు పట్టినారు. ఈ వర్గంలో విలియమ్ రాండాల్ఫ్ హర్ట్స్, రాబర్ట్ మెక్ కార్మిక్ వంటి సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు, గెరాల్డ్‌నై, హామిల్టన్ ఫిష్ మొదలైన రాజకీయ నాయకులున్నారు. వీరేకాక అమెరికా విస్తరణ కాంక్షించని వర్గాలవారు కూడా ఈ ఆందోళనలో చేతులు కలిపారు. వీరినే ఏకాంత విధానవాదులు (Isolataionists) అన్నారు. ఇంకొకవర్గం వారు అమెరికా యుద్ధంలో స్వయంగా పాల్గొనకుండా మిత్రరాజ్యాలకు అవసరమైన సహాయం అందజేయవలెననే వారువున్నారు. 'ఎంపోరియాగెజిట్' సంపాదకుడు విలియమ్ ఎలన్‌వైట్ వీరిలో ప్రముఖుడు. అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కూడా యుద్ధంలో అమెరికా జోక్యాన్నే సమర్ధించడం ప్రారంభించాడు. ఇటలీ, జర్మనీ, జపాన్‌ల దురాక్రమణ చర్య వల్ల మనఃక్లేశం చెందిన రూజ్‌వెల్ట్ 1937లో ఈ దురాక్రమణ దారులను నిరోధించేవిధంగా ప్రత్యక్షచర్యలు తీసుకొనవలెనని ప్రసంగించాడు. ప్రజాభిప్రాయం కూడా నూటికి 70 వంతులు మిత్ర రాజ్యాలకు సహాయం చేయవలెననే ఉద్దేశాన్నే వెల్లడించింది. వీరినే అభిక్రమవాదులు (Interventionists) అన్నారు. దీనితో రూజ్‌వెల్ట్‌కు యుద్ధంలో పాల్గొనే ఆవశ్యకత ఏర్పడి, తన దేశం ఇంతవరకూ అనుసరిస్తున్న తటస్థ విధానానికి స్వస్తి పలకవలసిన తరుణమాసన్నమైంది.

**16.1.5 అమెరికా విధానము :** అమెరికా తన ఏకాంత విధానంలో మార్పు తేవలసిన అవసరమేర్పడింది. ఎందువలననగా అభిక్రమవాదుల సంఖ్య పెరిగిన కొద్దీ ప్రభుత్వం కూడా తన ఏకాంత విధానాన్ని మార్చుకొనడం ప్రారంభించింది. చట్టరీత్యా రూజ్‌వెల్ట్ యుద్ధంలో నిమగ్నమైన దేశాలకు ఏ విధమైన సహాయం చేయడానికి వీలులేదు. తన మిత్రదేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్‌లకు ఆయుధాలు సరఫరా చేయటానికి వీలులేకపోయింది. రూజ్‌వెల్ట్ ఆలోచించి ఒక పథకాన్ని పన్నాడు. అదేమనగా ప్రభుత్వాధీనంలో మిగిలి ఉన్న యుద్ధ సామగ్రిని వ్యక్తిగత సంస్థలకు మార్చాడు. వారిద్వారా బ్రిటన్‌కు విమానాలు, తుపాకులు, తదితర యుద్ధసామాగ్రిని చట్టాన్ని ఉల్లంఘించకుండా అందచేసాడు. ఈ సహాయము బ్రిటన్‌కు ఏ మూలకు సరిపోలేదు. ప్రతినిత్యం జర్మన్ జలాంతర్గాములు బ్రిటీష్ నౌకలను ముంచుతున్నందువల్ల వారికి శతఘ్ని నౌకలావశ్యకత ఏర్పడింది. వీటికోసం అమెరికాను బ్రిటన్ పదే పదే కోరసాగింది. ఈ కోర్కెను మన్నించి, రూజ్‌వెల్ట్ సెప్టెంబర్ 2, 1940 న అమెరికాకు చెందిన ఏభై పాత శతఘ్ని నౌకలను బ్రిటన్‌కు ఇవ్వడానికి, వీటికి బదులుగా అత్యవసరమైన ఎనిమిది యుద్ధస్థావరాలను తొంభైయ్ తొమ్మిదేళ్ళకు కౌలుకు అమెరికా బ్రిటన్‌నుంచి తీసికోవటానికి నిశ్చయిస్తాడు. ప్లాసెనిషియారేవు, బెర్ముడా, గ్రేట్ ఎక్జుమా, గాలవ్ హార్బర్, ఏంటిగువా, సెయింట్ లూషియా, ట్రినిడాడ్, బ్రిటిష్ గయానాలలో ఉన్న ఈ ప్రదేశాలు అమెరికాకు తూర్పువైపున కెనడానుంచి దక్షిణ అమెరికా వరకు విస్తరించి ఉన్నాయి. ఇటువంటి మార్పిడి చేయడం చట్టరీత్యాకూడని పని కాబట్టి అమెరికాలో దీనికి వ్యతిరేకంగా విమర్శలు కోకొల్లలుగా వచ్చాయి. అంతేకాక, యుద్ధనిమగ్నమైన దేశానికి తటస్థదేశమైన అమెరికా యుద్ధనౌకలను ఇవ్వటంవల్ల తటస్థ విధానానికి తిలోదకాలిచ్చి యుద్ధమార్గాన్ని చేబట్టినట్లైంది.

**16.1.6 1940 ఎన్నికలు :** ఈ అధ్యక్ష ఎన్నికలలో రూజ్‌వెల్ట్ మూడోసారి పోటీచేస్తాడా లేదా అనే సమస్య చాలామందిని వేధించింది. ఏ ఒక్క వ్యక్తి రెండు తడవలకుమించి అధ్యక్షపదవికి పోటీచేయరాదనే రాజ్యాంగ నిబంధన లేనప్పటికీ ఆ సంప్రదాయాన్ని అమెరికాలో పాటిస్తూ వచ్చారు. రూజ్‌వెల్ట్‌కూడా తన నిర్ణయాన్ని చివరివరకు వెల్లడించలేదు. రిపబ్లికన్‌లు న్యూయార్క్‌కు చెందిన వెండెల్ విల్కీని నియమించారు. ఇతడు ఏ రాజకీయ పదవులను చేపట్టక ఎటువంటి అనుభవము లేనివాడు. డెమోక్రాటిక్ పార్టీ మళ్ళీ రూజ్‌వెల్ట్‌నే తన అభ్యర్థిగా నిర్ణయించింది. ఇట్లా మూడోసారి ఎన్నికలకు నిలబడటం సర్వాధికారవాద (totalitarianism) మార్గాన్ని అవలంబించటమేనని రిపబ్లికన్‌లు విమర్శించారు. తీరికలేక, తలమునిగే కార్యభారంతో సతమతమవుతున్న రూజ్‌వెల్ట్ అధిక ప్రచారానికి తన కాలాన్ని వ్యయం చేయలేదు. ప్రజలు ఎక్కువ మెజారిటీతో రూజ్‌వెల్ట్‌ను ఎన్నుకోవటమేకాక కాంగ్రెస్ ఉభయసభలలోనూ డెమోక్రాట్లను అధికంగా గెలిపించారు. ప్రపంచంలో చెలరేగిన కల్లోల పరిస్థితిని ఎదుర్కొనడానికి అనుభవజ్ఞుడైన అధ్యక్షున్ని ఎన్నుకోవడం మంచిదని అమెరికన్లు భావించడమే దీనికి కారణము.

**16.1.7 ఫ్రాన్సు బలహీనత :** 1940 వ సంవత్సరం నాటికి వరుసక్రమంగా జరిగిన సంఘటనలు అమెరికా ప్రజలను, ప్రభుత్వమును నివ్వెరపర్చాయి. జర్మనీసైన్యం ఏప్రియల్ 1940 లో డెన్మార్క్, నార్వేను, మే నెలలో హాలెండ్, బెల్జియంను వశపర్చుకొన్నాయి. ఆ వెంటనే ఫ్రెంచ్ సైన్యంపై దండయాత్ర చేసి వారిని చిత్తుచిత్తుగా ఓడించారు. ఈ లోపు ఇటలీవైపునుండి ముస్సోలినీ యుద్ధంలో చేరాడు. జూన్ 25 వ తేదీన ఫ్రెంచ్ క్రొత్త ప్రభుత్వం దాని అధినేత మార్షల్ పెటెన్ ఒక ఒప్పందానికి వచ్చి, జర్మనీ గెలుచుకొన్న ఫ్రెంచ్ భూమిని జర్మనీకి యిచ్చివేయుటకు ఒప్పుకున్నాడు. ఈ పరిస్థితులలో ఐరోపాలో హిట్లర్ తాకని దేశం కేవలం బ్రిటన్ ఒక్కటే మిగిలింది. అయినా నాటి బ్రిటిష్ ప్రజలకు అదృష్టంగా తగిన నేత రూపంలో చర్చిల్ లభించడం, ప్రజలను అతని భాషణలు ఉత్తేజ పరచడం, ప్రపంచ నేతలను ఆకర్షించడం జరిగాయి. సెప్టెంబర్ నెలలో బ్రిటిష్ రాయల్ ఫోర్స్ జర్మనీపై జరిపిన దాడులతో హిట్లర్ తొలి పరాభవం ఎదుర్కొనవలసి వచ్చింది.

**16.8 పాన్ - అమెరికనిజం :** ఇరవై ఒక్కమంది ప్రతినిధులు, పశ్చిమ హెమీస్ఫేర్ నుండి పనామా పట్టణంలో కలిసి పాన్ అమెరికన్ తటస్థ విధానమును నిర్దేశించారు. దీని ప్రకారము దక్షిణ కెనడానుండి 400 మైళ్ళ తీరము పొడవు 12 మైళ్ళ వెడల్పు 'సురక్షిత ప్రదేశం' గా నిర్ణయించి, యుద్ధదేశాలు ఏవీకూడా ఈ ప్రాంతాలలో ఎటువంటి విన్యాసాలు, ఎటువంటి అవాంఛనీయ కార్యకలాపాలు చేయుటకు వీలులేదని నిర్దేశించారు.

**16.1.9 రెండో ప్రపంచయుద్ధం : యుద్ధ సన్నాహాలు** : జూలై 1940 లో పచినాలో మరో సమావేశం జరిగింది. అమెరికా ఖండాలలో ఐరోపావారి ఆధీనంలో ఉన్న ఏ వలసలకూ (Colonies) అమెరికన్‌లు కాని వారికి స్వాధీనం చేయరాదని నిషేధించారు. శత్రువుల చేతిలో పడడానికి అవకాశమున్న వలసలకు గట్టి ఏర్పాట్లు జరిగే వరకూ అమెరికా గణతంత్ర రాజ్య కూటమి పాలనా భారం వహించవలెనని నిర్ణయించారు. రక్షణ ప్రయత్నాలలో కెనడా సహకారాన్ని పొందటానికి ఆ దేశంతో ఒక ఒప్పందం కుదుర్చుకొని ఆగస్ట్ 1940 లో ఉమ్మడి రక్షణ సంస్థను (Joint Board of Defence) స్థాపించారు. వీటితోబాటే దేశ అంతరంగిక సంపదల అభివృద్ధికి కూడా తగిన ఏర్పాట్లు చురుకుగా సాగాయి. అమెరికా యుద్ధసన్నాహాలలో మొదట చూడవలసినది జర్మనీ మెరుపు దాడుల వ్యూహానికి తట్టుకొని నిలవటంకోసం దేశ సైనిక పాటవాన్ని ఎంతో పెంచవలెనని అమెరికన్‌లు భావించారు. సైనికి, నౌకా, వైమానిక దళాలను ధృడంచేయడానికి కాంగ్రెస్ 1940 లో 13 బిలియన్ డాలర్లధనాన్ని మంజూరు చేసింది. దీనికోసం ప్రజలపై పన్నుల భారం కూడా మోపారు. వరణాత్మక శాసనము ఇరవై ఒక్కటి ముప్పైఐదు సంవత్సరాల మధ్య వయసుగల వారందరూ ఒక సంవత్సరం సైనిక శిక్షణ పొందవలెనని నిర్ణయించారు. మరికొంత కాలానికి 18-40 సంవత్సరాల మధ్య వయసుగల వారందరికీ నిర్బంధ సైనిక శిక్షణను వర్తింప చేశారు.

యుద్ధ సామాగ్రిని తయారు చేయుటను ప్రోత్సహించారు. దేశ ఆర్థిక సంపదలను యుద్ధ పథాన వినియోగించడానికి విలియం సేన్‌కుండ్ ఆధ్వర్యంలో ఉత్పత్తి నిర్వహణ సంస్థను స్థాపించారు. డొనాల్డ్ నెల్సన్ ఆధ్వర్యంలో యుద్ధ వస్తూత్పత్తి సంస్థను స్థాపించారు. ఈ సంస్థ కొత్త పరిశ్రమ కేంద్రాలను స్థాపించటమేగాక అనేక కార్ఖానాలను యుద్ధ సామగ్రిని తయారు చేయటంలో ప్రోత్సహించింది. రకరకాల వస్తువుల కోటాలను నిర్ణయించటంలో గూడా ఈ సంస్థ తోడ్పడింది. ఈ సంస్థల కృషి ఫలితంగా 1944 నాటికి పారిశ్రామికోత్పత్తులు 200 బిలియన్ల డాలర్లకు పై బడ్డాయి. యుద్ధసమయమనగానే అత్యవసర పరిస్థితులేర్పడుతాయి. అత్యావసరమైన సరకులను సమంగా పంపిణీచేయుటకు వాటిధరలను అదుపుచేయుటానికి, ధరల వ్యవస్థీకరణ సంస్థ ఏర్పడింది. కార్మిక సంఘాలు యుద్ధసమయంలో సమ్మెలు చేయమని శపథాలు చేశాయి. కార్మిక వేతనాలను సవరించేటందుకు యుద్ధకాలిక కార్మిక సంస్థ కృషిచేసింది. పైన పేర్కొనబడిన సంస్థల కృషివలన 1 కోటి 50 లక్షల మంది సైనికుల కవసరమైన సర్వ సన్నాహాలు జరిగాయి. ఇదే సమయంలో దేశంలోని రెండు రాజకీయ పక్షాల మధ్యా సామరస్యం పెంపొందించేటందుకు తన మంత్రిమండలిలో హెన్రీ స్టింసన్, ఫ్రాంక్‌వాక్స్‌లను చేర్చుకొన్నారు.

రెండో ప్రపంచ యుద్ధానికి 300 బిలియన్ డాలర్ల వ్యయాన్ని అమెరికా భరించింది. దీనిలో అధిక భాగము ఋణపత్రాల అమ్మకం ద్వారా సమకూర్చ గలిగింది. ఆదాయపుపన్ను, అధికలాభాలపన్ను, వ్యాపార సంస్థల పన్ను, భోగ వస్తువులపై పన్ను విపరీతంగా పెంచటంవల్ల కూడా చాలా ధనం సమకూర్చాడు. మొదటి ప్రపంచ యుద్ధంతో పోలిస్తే, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికన్ పౌరుల స్వేచ్ఛపై నిర్బంధాలు తక్కువగా విధించటం జరిగింది. అందరికన్నా జపాన్ - అమెరికన్ పౌరులపై ఎక్కువ నిఘా ఉంచారు. పసిఫిక్ సముద్ర తీర ప్రాంతాలలో ఉండే వేలాది జపానీ అమెరికన్‌లను దేశ మధ్యంలోని పునరావాస కేంద్రాలకు తరలించి వారి నడవడిని శతవిధాల కనిపెట్టే ఏర్పాటు చేశారు. నిజానికి వీరిలో చాలామంది అమెరికాకు ఏ మాత్రం ద్రోహం తలపెట్టనివారే.

**16.1.10 అరువు - కౌలుపద్ధతి** : యుద్ధ వాతావరణం తీవ్రతరమైన కొలది బ్రిటిష్ ఆర్థిక పరిస్థితి దిగజారటం ఎక్కువైంది. ఎక్కువగా యుద్ధావసర సామగ్రిని తెప్పించుకోవటంవల్ల అమెరికాలో ఉన్న బ్రిటన్ నిధులు తరిగిపోయాయి. బ్రిటన్‌కు సహాయం చేయాలన్న ఉద్దేశ్యంతో రూజ్‌వెల్ట్ ఒక క్రొత్త పద్ధతిని మొదలుపెట్టాడు. యుద్ధంలో పతనం చెందటానికి సిద్ధంగా ఉన్న ప్రజాస్వామ్య దేశాలకు సహాయం చేసే ఉద్దేశంతో అరువు - కౌలు పద్ధతిని అతడు ప్రవేశపెట్టదలచాడు. పక్కవారింట్లో నిప్పంటుకొన్నప్పుడు పొరుగువారినుంచి నీటి గొట్టాన్ని అరువు తీసుకొని పనిపూర్తి అయిన తర్వాత తిరిగి ఇచ్చినట్లుగానే ఈ పద్ధతి ఉంటుందని రూజ్‌వెల్ట్ వివరించాడు. యుద్ధం పూర్తి అయిన తర్వాత తమ దగ్గరనుంచి తీసుకున్న టాంకులనూ, తుపాకులనూ తిరిగి ఇచ్చే పద్ధతిపైన వారికి అందజేయుటానికి రూజ్‌వెల్ట్ సంకల్పించాడు. దీనికి సంబంధించి ఒక చట్టం ప్రవేశపెడుతూ దీనివల్ల అమెరికా చిక్కుకోకుండా ఉండగలదని వివరించడం జరిగింది. "అక్షరాజ్యాల దండయాత్రలనుంచి రక్షించుకోవటానికి ప్రతిఘటించటానికి పరిశ్రమిస్తున్న దేశాలకు సంయుక్త రాష్ట్రాలు ఇప్పుడు సహాయంచేస్తే అమెరికా ప్రజలు ప్రత్యక్షంగా యుద్ధంలో చిక్కుకొనే అవకాశాలు ఉత్పన్నంకావు. మిత్ర రాజ్యాలు ఓడిపోతుంటే ఊరుకుందామా అంటే పరిస్థితి ఒకేవిధంగా ఉండదు. అందువల్ల మనకు ఎక్కువ తుపాకులు, ఎక్కువ విమానాలు - అన్నీ ఎక్కువగా కావాలి. దీనిని సాధించవలెనంటే

మామూలు వ్యాపార ధోరణిని మనం త్యజించాలి. మనం ప్రజాస్వామ్యానికి పెట్టనికోట కావాలి, అని రూజ్ వెల్ట్ ప్రబోధించాడు. ఇదే సందర్భంలో మానవులకు అవసరమైన నాలుగు స్వాతంత్ర్యాలను గురించి కూడా ఇతడు ప్రవచించాడు. అంతటా వాక్స్వాతంత్ర్యము, దైవారాధన స్వాతంత్ర్యము, దారిద్ర్యం తొలగించుకొనే స్వాతంత్ర్యము, భయరహిత స్వాతంత్ర్యము అనేవి ఈ నాలుగు దురాక్రమణకు గురి అయిన ఐరోపా దేశాలకు విరివిగా ఆయుధ సహాయం చేస్తే వారే తమవైపు పోరాడి యుద్ధాన్ని అట్లాంటిక్ మహాసముద్రం అవతలి ఒడ్డుకే పరిమితం చేస్తారని వీరు భావించారు. బహు తర్జనభర్జనలైన తర్వాత మార్చి 1941 లో అరువు - కౌలు బిల్లును కాంగ్రెస్ ఆమోదించింది. కాంగ్రెస్ ఆమోదించిన చట్టాలలో ఇది అత్యంత విశిష్టమైంది. 1945 లో యుద్ధాంతానికి అమెరికా ఈ చట్టం క్రింద 50 బిలియన్ డాలర్ల ఖరీదయిన యుద్ధ సామగ్రిని మిత్రరాజ్యాలకు సహాయం జేయడం జరిగింది. ఈ చట్టం ద్వారా అక్షరాజ్యాలపై ఆర్థికంగా యుద్ధం ప్రకటించినట్లైంది. హిట్లర్ కూడా అరువు - కౌలు చట్టము అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించడం అనధికారంగా యుద్ధం ప్రకటించటమేనని అభిప్రాయపడ్డాడు. అంతవరకూ అతడు అమెరికన్ నౌకలకు ఎట్లాంటి హానీ కలిగించలేదు. అరువు - కౌలు చట్టాన్ని ఆమోదించిన తర్వాత అమెరికన్ నౌకలను ముంచడం మొదలుపెట్టాడు. ఏప్రియల్ 1941 లో నాజీ వ్యతిరేకులైన డెన్మార్క్‌వారు అమెరికాకు గ్రీన్‌లాండ్‌లో సైనిక స్థావరాలు ఏర్పరచుకొనే హక్కునిచ్చారు. దీనివల్ల అమెరికా యుద్ధానికి మరింత చేరువలోకి వచ్చింది.

### 16.2.1 జర్మనీ - రష్యాల మైత్రి స్వస్తి :

జర్మనీ - రష్యాలు మాస్కో బెర్లిన్ ఒప్పందం ద్వారా 1939 లో పరస్పర నిర్యుద్ధ ప్రకటన చేశాయి. ఈ మైత్రి ఎక్కువకాలం మన్నలేదు. హిట్లర్, స్టాలిన్‌లు ఒకరినొకరు ఎప్పుడూ నమ్మలేదు. తత్ఫలితంగా నిర్యుద్ధ సంధిని అతిక్రమించి రష్యాపై దండయాత్రకు హిట్లర్ పూనుకొని 22 జూన్ 1941 న తన సైన్యాలను పంపాడు. అరువు - కౌలు చట్టాన్ని రష్యాకు కూడా అనువర్తింపజేస్తూ ఆ దేశానికి ఒక బిలియన్ డాలర్ల ఖరీదుగల సహాయాన్ని అమెరికా వారు పంపారు. అమెరికా రక్షణకోసం తాము రష్యాకు ఈ సహాయాన్ని పంపినట్లు రూజ్‌వెల్ట్ వెల్లడించాడు. మాస్కోదాకా వచ్చిన నాజీ సేనలను రష్యాసైన్యము క్రమంగా తిప్పికొట్టసాగింది.

**16.2.2 అట్లాంటిక్ ప్రకటన పత్రము :** అమెరికా అధ్యక్షుడు, బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ఆగస్టు 1941 లో, అట్లాంటిక్ మహా సముద్రంలో ఒక ఓడమీద రహస్యంగా కలుసుకొన్నారు. ఉభయ దేశాలకు సంబంధించిన అనేక విషయాలపై సుదీర్ఘ సంభాషణల తరవాత ఎనిమిది అంశాల ఉమ్మడి ప్రకటనను వెల్లడించారు. దీని ప్రకారంఉభయులూ:

1. భూమిపైగాని మరే విధంగాగాని దురాక్రమణకు సిద్ధపడకూడదు,
2. స్థానిక ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఏ ప్రాంతాన్ని మరో దేశానికి మార్చరాదు.
3. ప్రజలు తమ ఇష్టంవచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పరచుకొనే హక్కును బలపరచాలి.
4. ప్రపంచంలో ఉన్న ముడి సరుకులు అన్ని దేశాలకూ సమకూరేటట్లు సహకరించాలి.
5. అన్నిదేశాల సహాయ సహకారాలు, ఆర్థిక పరంగాను, శ్రామికుల అభివృద్ధి, అన్నిదేశాల ప్రజలకు సామాజిక రక్షణ కల్పించాలి.
6. లేమినీ, భయాన్నీ తొలిగించాలి.
7. సముద్రాలలో నిర్నిబంధంగా విహరించే ఏర్పాటు చేయాలి.
8. శాశ్వత శాంతిని సాధించటానికి దురాక్రమణ చేసే దేశాలను నిరాయుధీకరించాలి. వీటికి పాటుపడ నిశ్చయించుకోవటం తమ యుద్ధధ్యేయంగా ఉభయులూ ప్రకటించారు.

ఆదర్శాలను ప్రతిబింబించే ఈ ప్రకటన వెలువడిన కాలానికే అగ్రరాజ్యాలకు వ్యతిరేకులయిన పదిహేను దేశాలవారు అట్లాంటిక్ ఒడంబడికకు తమ ఆమోదాన్ని తెలిపారు, వీటిలో సోవియట్ రష్యాకూడ ఒకటి.

**16.2.3 అమెరికా యుద్ధ ప్రవేశము :** అమెరికా పంపించే యుద్ధ సామగ్రి చేరవేసుకోవటానికి బ్రిటన్‌కు తగినన్ని శతఘ్ని నౌకలు లేవు. అందువలన బ్రిటిష్ నౌకలను జర్మన్ జలాంతర్గాములు ముంచటమూ, సరుకంతా సముద్రం పాలుగావటము జరిగేది. ఇట్లా

అమెరికన్ సరుకు నీటిపాలుకాకుండా తమ లక్ష్యం చేకూరటానికి అరువు - కౌలు సరుకులను చేరవేసే ఓడలకు రక్షణగా నౌకాదళంవారు ఐస్‌లాండ్ వరకూ వెళ్ళి దింపి రావలెనని సర్వసైన్యాధ్యక్షుడుగా రూజ్‌వెల్ట్ ఆర్డరు జారీచేశాడు. ఆ ప్రాంతాలను పహరాకాస్తూ జర్మన్ జలాంతర్గాములు కనబడితే తాము వాటిపై కాల్పులు జరపకుండా బ్రిటన్‌కు సమాచార మందజేయవలసిందిగా కూడా అమెరికన్ నౌకా విమానదళాలను రూజ్‌వెల్ట్ ఆదేశించాడు. ఈ పనులలో నిమగ్నమైన అమెరికన్ నౌకలను జర్మన్‌లు ఢీకొనటం మొదలుపెట్టాయి. సెప్టెంబర్, 1941 లో 'గ్రీర్' అనే అమెరికన్ శతఘ్ని నౌకను జర్మన్ జలాంతర్గాములు ఢీకొన్నాయి. రూజ్‌వెల్ట్ జర్మన్ జలాంతర్గాములు కనపడగానే కాల్చండి అని ఆదేశించాడు. ఆపై కొంత కాలానికి 'కీర్నీ', 'రూబెన్ జేమ్' అనే శతఘ్నినౌకలను కూడా జర్మనీ ఎదుర్కొని విశేష నష్టం కలిగించింది. అమెరికన్ తాటస్థ్య శాసనాన్ని కాంగ్రెస్ కొంత సవరించి తమ వ్యాపార నౌకలకు సైనిక సహాయాన్ని జోడించి బ్రిటన్‌కు యుద్ధసామగ్రిని చేరవేసే అవకాశం కల్పించింది. పరిస్థితులలో ఇంతమార్పులు వచ్చినాగాని అమెరికన్‌లు చట్టరీత్యా యుద్ధం ప్రకటించకపోవటమేగాక తాటస్థ్య శాసనాన్ని కూడ తొలగించలేదు. అంతలోనే, అంటే 1941 లో జపాన్ పెరల్‌హార్బర్ (Peral Harbour) పై దాడి జరిపేవరకూ ఈ రెండు చర్యలనూ తీసుకోలేదు.

**16.2.4 పెరల్ హార్బర్ పై దాడి :** జపాను 1931 లో మంచూరియాపై దండయాత్రచేసి దానిని ఆధీనం చేసుకొంది. ఈ విషయంపై నానాజాతి సమితి ప్రతిగా ఏమి చేయలేకపోయింది. అక్టోబర్ 1932 లో లిట్టన్ కమిషన్ తన నివేదికను సమితి మండలికి సమర్పించింది. ఆ నివేదిక మంచూరియాపై జపాన్ దాడి చేసిందని ముద్రవేసింది; జపాన్ చూపించిన సాకులను తిరస్కరించింది. మంచుకో స్వతంత్ర దేశంగా ఉండటాన్ని వ్యతిరేకించింది. చైనా, జపాన్, రష్యాల ప్రయోజనాలను రక్షిస్తూ ఒక అంగీకారాన్ని కుదుర్చుకోవాలని ప్రతిపాదించింది. సమితి నాయకత్వంలో చైనా, జపాన్ దేశాలమధ్య సంప్రదింపుల ద్వారా వాగ్వివాదాల అనంతరం సమితి కౌన్సిలు అసెంబ్లీకి ఈ విషయాన్ని నివేదించింది. తిరిగి చర్చల అనంతరం అసెంబ్లీపై రిపోర్టును ఫిబ్రవరి 1933 లో ధృవీకరిస్తూ జపాన్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరింది. అందువల్ల సమితినుంచి వైదొలుగుతున్నట్లు జపాన్ సమితికి తెలియజేసింది.

ఈ పరిస్థితుల్లో కొన్ని పాశ్చాత్యదేశాలు చైనాకు సానుభూతి సహకారాలను అందివ్వాలని నిర్ణయించాయి. సైనిక బలాలతో జపాన్ దురాక్రమణను అరికట్టడానికి అమెరికా ప్రయత్నించకుండా చైనాకి ఆర్థిక సహాయం అందించి సంతృప్తి చెందింది. చైనాలో వైమానిక పరిశ్రమల స్థాపనకు అమెరికా అంగీకరించింది. 1939 ప్రారంభంలో నౌకా నిర్మాణ పథకాన్ని చేపట్టింది. ఆ సంవత్సరంలోనే జపాన్‌తో చేసుకున్న వ్యాపార ఒడంబడికను రద్దు చేసుకునే ఉద్దేశ్యాన్ని తెలియజేసింది. జపాన్‌కు ఏ విధమైన విమానాలను అమ్మవద్దని మిగిలిన దేశాలను కోరింది. ఈ చర్యలకు స్పందించి అమెరికా నుంచి దిగుమతులను జపాన్ మానివేసింది. తర్వాత జూలై 1941 లో అమెరికాలో ఉన్న జపాన్, చైనా ఆస్తులను కైవసం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ఉత్తరువులు జారీ చేశాడు.

సెప్టెంబర్ 1939 లో జర్మనీ, ఇటలీలతో, జపాన్ దశవర్ష సఖ్యతను కుదుర్చుకొన్నప్పటినుంచి ఆ మూడు దేశాలు కలిసి వ్యవహరించడం ప్రారంభించాయి. ఈ రోమ్ - బెర్లిన్ - టోకియో సంధి జూలై 1941 తరువాత - ముఖ్యంగా జపాన్ ఇండోచైనాను ఆక్రమించిన తరువాత - అమెరికాను కొంత ఇబ్బందిపెట్టటం మొదలైంది. జపాన్ ఏ క్షణంలోనైనా ఫిలిప్పీన్ దీవులపైనా ఆగ్నేయ ఆసియాలో ఉన్న బ్రిటిష్, డచ్ వలసపైనాదాడి చేయవచ్చునని తలచారు. జపాన్‌కు అప్పటివరకు అమెరికా ఖనిజాలు, నూనె, ఉక్కు, ఇనుము మొదలైన అత్యావశ్యక వస్తువులను అమ్ముతూ ఉండేది. దీనికి తమ ప్రభుత్వాన్ని అమెరికన్‌లు ఎంతగానో దుయ్యబట్టారు. ఫ్రెంచ్, ఇండో చైనా ఆక్రమణానంతరం జపాన్‌కు చేసే ఎగుమతులను అమెరికా ఆపివేసింది. కొంతకాలానికి అమెరికాలో ఉన్న జపాన్ వారి ఆస్తులన్నింటినీ కైవసం చేసుకొంది. చైనాలో తాను ఆక్రమించిన ప్రదేశాలనుంచి వెనుదిరిగితే మళ్లీ వ్యాపార సంబంధాలను కొద్దిగా ప్రారంభిస్తానని అమెరికా తెలియజేసింది. దీనికి జపాన్ అమెరికాతో మంతనాలు సాగించింది. ఈ మంతనాల వెనుక అమెరికాపై దాడి చేయాలన్న ఆశకూడా వున్నట్లు అమెరికా అధికారులు జపాన్ రహస్య సంకేతాల వివరాలను ఎట్లాగో పసికట్టి జపాన్ అంతిమ ధ్యేయం తమతో యుద్ధం చేయటమేనని తెలుసుకొన్నారు. అమెరికా ఈ విషయంలో తొందరపడలేదు. జపాన్ తమపై కాల్పులు మొదలుపెట్టేవరకూ తమకై తాము ఏ చర్యా తీసుకోకూడదనే నిర్ణయించింది. వాషింగ్టన్‌తో ఒకవైపు వ్యాపార చర్చలు చేస్తూనే జపాన్ మరొకవైపునుంచి 7, డిసెంబరు 1941 న అమెరికాకు చెందిన పెరల్‌హార్బర్ పై విమానాలతో దాడి జరిపింది. ఆనాడు సుమారు మూడు వేలమంది అమెరికన్‌లు చనిపోయారు. అనేక విమానాలు

ధ్వంసమయ్యాయి. ఎనిమిది, యుద్ధనౌకలు మరెన్నో చిన్ననౌకలు తుత్తునియలయ్యాయి. మరుసటి దినమే అమెరికన్ కాంగ్రెస్ ఈ తీవ్రపరిణామాన్ని చర్చించింది. ఈలోపే జర్మనీ - ఇటలీలు 11 డిసెంబరు 1941 న అమెరికాపై యుద్ధాన్ని ప్రకటించాయి. అనంతరం కాంగ్రెస్ కూడా యుద్ధప్రకటన చేసింది. దీనితో అనధికారికంగా సాగుతున్న పోరు ఇప్పుడు సాధికారికంగా కొనసాగటం మొదలైంది. పెరల్ హార్బర్ ఉదంతంవల్ల అమెరికన్లు అందరూ ఇంతకుముందున్నెడు లేని విధంగా ఐక్యమయ్యారు. 1941 - 42 ల మధ్య జపాన్ అనేక విజయాలు సాధించింది. సింగపూర్‌లో ఉన్న బ్రిటిష్ నౌకాస్థావరము, డచ్ తూర్పుఇండియా దీవులు, బర్మాగువామ్ వేన్‌ద్వీపము, హాంగ్‌కాంగ్ మొదలైనవి ఒకదాని వెంట మరొకటి జపాన్ వశమైనాయి. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో జనరల్ డగ్లస్ మెకార్థర్ నాయకత్వంలో ఉన్న సేనలను ఆస్ట్రేలియాకు తరలించిన తరువాత అలూషియన్ దీవులపై ఎగసిన జపాన్ అట్టా, కిస్కా అనే దీవులను వశం చేసుకొంది. 1942 నాటికి మొత్తం 1.6 మిలియన్ చదరపు కి.మీ. ప్రాంతాన్ని జపాన్ ఆక్రమించుకొంది. జపాన్ సైన్యాలు పసిఫిక్ సముద్రానికి దక్షిణాన ఉన్న న్యూగినీ, సాల్మన్ ద్వీపాలను కూడా జయించి ఆస్ట్రేలియాపై దండెత్తే అదునుకోసం వేచి ఉంది. జపాన్ వ్యూపును అపటాన్ని కోరల్ సముద్రం దగ్గర మే 1942 లో జరిగిన ఒక యుద్ధంలో ఆస్ట్రేలియన్ సైన్యాలతో అమెరికన్ సేనలు కలిసి అడ్డుకొని జపాన్ ప్రగతిని నిరోధించాయి. తర్వాత జపాన్‌మిడ్‌వే ద్వీపాలను స్వాధీనం చేసుకోవడానికి ఉద్యమించింది. జూన్ 1942 లో మిడ్‌వే ద్వీపాల దగ్గర జరిగిన ఒక ముఖ్య నౌకా యుద్ధంలో అమెరికన్ నౌకాదళాధిపతి అడ్మిరల్ నిమిట్జ్ నాయకత్వం వహించి జపాన్ వారిని వెళ్ళగొట్టాడు. జనరల్ మెకార్థర్, నిమిట్జ్‌లు ఆస్ట్రేలియన్ సైన్యాలతో కలిసి జపాన్‌నుంచి క్రమంగా న్యూగినీ, అట్టా, కిస్కామకిన్, మార్షల్ దీవులను పునరాక్రమించుకున్నారు. చివరకు జపాన్ ముఖ్యదీవులపై దాడులను కేంద్రీకరించారు.

**16.2.5 ఆఫ్రికా రంగము :** ఐరోపాలో అగ్రరాజ్యాల శత్రువులలో జర్మనీ ముఖ్యమైంది. మొట్టమొదట జర్మనీ ప్రగతిని అడ్డుకోవాలని మిత్ర రాజ్యాలు తలపెట్టాయి. జనవరి ఒకటి 1942 వ సంవత్సరం ఇరవై ఒక్క మిత్ర దేశాల ప్రతినిధులు, వాషింగ్టన్‌లో సమావేశమై ఐక్యరాజ్య సమితి ప్రకటనపై సంతకాలు చేశారు. అట్లాంటిక్ ప్రకటన సూత్రాలను ఆధారంగా చేసుకొని శత్రువులను తామంతా కలిసి ఎదుర్కోవాలని, యుద్ధానంతరం తాము విడిగా సంధులు, రాజీ ప్రయత్నాలు చేసుకోమని వీరు ప్రకటించారు. దీని తర్వాత నవంబర్ 1942 లో మిత్రరాజ్యాలు ఐరోపాలో ముఖ్య శత్రువైన జర్మనీపై ఎదురుదెబ్బ తీయడం మొదలెట్టారు. జర్మనీ తనచుట్టూ ఉన్న రాజ్యాలను ఆక్రమించుకొని వాటిమధ్య స్థిరపడింది. మొట్టమొదట జర్మనీని నేరుగా ఎదుర్కోకుండా, జర్మనీ మిత్రరాజ్యాలను జయించవలెనని, మిత్రరాజ్యాలు వ్యూహం పన్నాయి. జనరల్‌డ్వైట్.డి. ఐసెన్‌హోవర్ నాయకత్వంలో నాలుగు లక్షల అమెరికన్, బ్రిటిష్, కెనెడియన్, ఫ్రెంచ్ సైనికులు ఆఫ్రికా ఉత్తర తీరాన్ని చేరాయి. మొరాకో, ఆల్జీరియాలను జయించి మే 1943 లో ట్యూనీషియాలోని జర్మన్ సైనికులను లొంగదీసాయి.

**16.2.6 ఇటలీపై దండయాత్ర :** రూజ్‌వెల్ట్, చర్చిల్, కొత్తగా జయించిన మొరాకోలోని కాసా బ్లాంకా దగ్గర సమావేశమై భవిష్యత్ కార్యక్రమంపై నిర్ణయాలు తీసుకొన్నారు. సిసిలీ ద్వారా ఇటలీని గెలుచుకొని, శత్రువు నిర్నిబంధంగా లొంగిపోయేవరకూ పోరాడవలెనని వీరు తీర్మానించారు. మిత్రదేశాల సంయుక్తసైన్యాలు సిసిలీని ఆగస్ట్ 1943 లో జయించాయి. వెంటనే ఇటలీ ఫాసిస్ట్ నియంత ముస్సోలినీని పదవినుంచి తొలిగించి రోమ్ ప్రజలు నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. సిసిలీ ద్వీపంనుంచి దక్షిణ ఇటలీకి మిత్రరాజ్యాల సేనలు రావడం మొదలైంది. దీనితో ఇటలీ నిర్నిబంధంగా సెప్టెంబర్ 1943 లో లొంగిపోయింది. ఇటలీ అగ్రరాజ్యాల కూటమినుంచి తొలగిపోయినా ఇటలీనుంచి జర్మన్ సేనలు మిత్రరాజ్యాల సేనలను చాకచక్యంతో ఎదుర్కోసాగాయి. యుద్ధాలతో విసిగి వేసారిన ఇటలీ అక్టోబర్ 1943 లో జర్మనీపై యుద్ధం ప్రకటించింది. 1944 సంవత్సరం మొత్తం వరుసగా ఇటలీలో తీవ్రమైన యుద్ధాలు జరిగాయి. చివరకు మే 2, 1945 వ సంవత్సరం ఇటలీలోని అక్షరాజ్యాల సేనలు మిత్రరాజ్యాల సేనలు వశమైనవి, అదే సంవత్సరం ఇటాలియన్‌లు ముస్సోలినీని, అతని భార్యనూ కాల్చిచంపారు.

**16.2.7 ఫ్రాన్స్‌విముక్తి :** జర్మన్ సైన్యాలు రష్యాపై దాడులు అధికం చేయడంవల్ల, రెండోయుద్ధరంగం ప్రారంభించిన జర్మన్‌ల దృష్టిని రష్యానుంచి మళ్ళించవలెనని స్టాలిన్ చాలాకాలంగా మిత్రరాజ్యాలను కోరుతున్నాడు. ఆఫ్రికా రంగంవల్ల కూడా స్టాలిన్ తృప్తిపడలేదు. ఈ విషయంపై తగిన నిర్ణయం తీసుకోటానికి ఇతర ముఖ్య సమస్యలను చర్చించటానికి నవంబర్ 28, 1943 న నాలుగు రోజులపాట

రూజ్‌వెల్ట్, స్టాలిన్, చర్చిల్‌లు ఇరాన్ రాజధాని, టెహరాన్‌లో సమావేశమైనారు. రష్యామీదికి వెళ్లే జర్మన్ సైనికుల ఔద్ధత్యం తగ్గించటానికి జర్మనీని పశ్చిమ దిశనుంచి ఎదుర్కొనే బృహత్పథకాన్ని ఈ సమావేశంలో రూపొందించారు. జర్మనీ ఓటమి సాధించేటందుకు పశ్చిమ దిశనుంచి దాడిచేయడానికి నిర్ణయించారు.

అగ్రమిత్ర రాజ్యాల సైన్యాలు రోమ్‌ను ఆక్రమించిన నాడే జూన్ 6, 1944 న జనరల్ ఐసెన్ హోవర్ సర్వసైన్యాధ్యక్షుడుగా మిత్రరాజ్యాల మహా సేనావాహిని 4000 ఓడల్లో, 11, యుద్ధ విమానాల రక్షణలో నార్మండీలో దిగడం ఆరంభించింది. ఈ మహాసేనా వాహినిలో 20 అమెరికన్, 14 బ్రిటిష్, 3 కెనేడియన్, 1 స్వేచ్ఛాఫ్రెంచ్, 1 పోలిష్ డివిజన్‌లు ఉన్నాయి. ఈ దండయాత్ర ప్రపంచ యుద్ధ చరిత్రలో అపూర్వ సంఘటన. మిత్రరాజ్యాల సైన్యాలు అప్రతిహతవేగంతో పురోగమించి ఆగస్ట్ 1944 నాటికి ఆర్లియన్స్, పారిస్‌లను విముక్తి చేశాయి. మిత్రమండలి సేన మరొకటి దక్షిణ ఫ్రాన్స్‌నుంచి సాగి ఫ్రాన్స్‌ను జయించింది. నవంబరు 1944 నాటికి ఫ్రాన్స్ విముక్తి చెంది స్వేచ్ఛావాయువులను పీల్చుకుంది. విముక్తి పొందిన ఫ్రాన్స్ పరిపాలనా బాధ్యతలను చార్లెస్ డీగాల్ స్వీకరించాడు. ఫ్రాన్స్‌ను విముక్తి చేసిన ఐసెన్ హోవర్ సైన్యాలు బెల్జియం, లగ్జంబర్గ్‌లను ఆక్రమించి, హాలెండ్‌లో ప్రవేశించి జర్మనీపై దండయాత్రకు సిద్ధమయ్యాయి.

**16.2.8 1944 ఎన్నికలు :** నాలుగువైపుల నుండి యుద్ధవాతావరణం ఆవరించి వుంది. ఇటువంటి తరుణంలో 1944 లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు వచ్చాయి. కొందరు యుద్ధం ముగిసేదాకా ఎన్నికలు వాయిదా వేయమన్నా కూడా యదావిధిగా ఆ తంతును జరిపించటానికే ప్రభుత్వం నిర్ణయించింది. రిపబ్లికన్ పార్టీవారు తమ అభ్యర్థిగా న్యూయార్క్ గవర్నరైన థామస్ డీవీని ఎన్నుకొన్నారు. డెమోక్రాట్ల తరపున మళ్ళీ నాలుగోసారి కూడా రూజ్‌వెల్ట్‌నే నియమించారు. కాని అతను వయసు మీరి ఉన్నందువల్ల ఉపాధ్యక్ష పదవికి ఎన్నుకొనే అభ్యర్థి విషయంలో కూడా ఎక్కువ శ్రద్ధచూపారు. చివరకు ఈ పదవికి సెనెటర్ హారీ ట్రూమన్‌ను ఎన్నుకున్నారు. రూజ్‌వెల్ట్, ట్రూమన్‌ల జట్టు గెలిచింది.

**16.2.9 జర్మనీ సేనల లొంగుబాటు :** 1944 చివరలో జర్మనీ పశ్చిమ సరిహద్దుల్లో అగ్రమిత్ర రాజ్యాలు తమ సైన్యాలను మోహరించాయి. అదే సమయంలో అంటే డిసెంబర్ 1944 లో జర్మనీ పశ్చిమంనుంచి తనపై ఎదుర్కొంటున్న మిత్రరాజ్యాల సేనలను తిప్పికొట్టడానికి పెద్దదాడి తలపెట్టింది. బెల్జియమ్ - లక్జెంబర్గ్ ప్రాంతాన్ని అకస్మాత్తుగా ముట్టడించి అక్కడ ఉన్న అశేష శత్రువులను దాదాపు సముద్రతీరం దాకా ఉత్తరానికి తరిమివేశాయి. ఈ తాకిడిని మొదటి మిత్రరాజ్య విమాన దళాలు కొంతవరకు ఎదుర్కొన్నాయి. తరువాత మార్చి 1945 లో జనరల్ ఐసెన్ హోవర్ ఆధిపత్యంలోని దళాలు ముందుకు చొచ్చుకొని వచ్చి జర్మనులను వెనుకకు మళ్ళించటం ఆరంభించాయి. రష్యన్‌లు తమకు అనుకూలమైన శీతాకాలం ప్రవేశించగానే జనవరి, 1945 లో తూర్పునుంచి జర్మన్‌ల మీద విజృంభించారు. మార్చి నెల వచ్చేసరికి వారు జర్మనీకి 48.కి.మీ. చేరువకు వచ్చారు. పశ్చిమరంగంలో ఆంగ్లో - అమెరికన్ - ఫ్రెంచి సైన్యాలు జర్మనీలో పురోగమించి ఏప్రిల్ 25, 1945 న సాక్సనీలో నిటర్గో వద్ద ఎర్రసేనలతో కలిసాయి. ఏప్రిల్ 30 న సోవియట్ సైన్యాలు బెర్లిన్‌లో ప్రవేశించగానే హిట్లర్ అతని ప్రియురాలు ఇవాబ్రాన్‌తో సహా ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ విధంగా ఫాసిస్ట్ నియంత ముస్సోలినీ, నాజీ నియంత హిట్లర్ నికృష్ట పరిస్థితుల్లో మరణించారు. మే 7, 1945 న అడ్మిరల్ కార్ల్‌డోయనెట్జ్ నాయకత్వంలో జర్మన్ సేనానులు రీమ్స్ వద్ద బేషరతుగా లొంగిపోయారు. మే 8 న మిత్రరాజ్యాలు యూరప్ విజయోత్సవాన్ని జరుపుకొన్నాయి.

ఏప్రిల్ 1945, అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కొద్ది విశ్రాంతి తీసుకోవటానికి జార్జియాలోని 'వామ్‌స్ప్రింగ్స్' అనే ప్రదేశానికి వెళ్ళాడు. ఏప్రిల్ 12 న తలలో రక్తనాళాలు చిట్లి రూజ్‌వెల్ట్ చనిపోయాడు. వెంటనే ట్రూమన్ అధ్యక్ష పదవీబాధ్యతలు స్వీకరించాడు.

**16.2.10 పసిఫిక్ యుద్ధరంగం - అణుయుద్ధం :** ఐరోపా విముక్తి చెందినా, జపాన్ తన యుద్ధాన్ని కొనసాగించింది. జర్మనీ లొంగిపోయే నాటికి జపాన్ చాలా ప్రాంతాలు కోల్పోయింది. తన చుట్టూ అగ్రమిత్ర రాజ్యాలు వల పన్నుతున్నాయని జపాన్ గ్రహించింది. తూర్పున జనరల్ మెకార్థర్, అతని బృందంవారు చొచ్చుకొని వస్తూవుంటే పశ్చిమంనుంచి ఎర్ల్‌మౌంట్‌బాటన్ చుట్టుముట్టి

వచ్చాడు. అమెరికన్‌లు త్వరగా టోకియో సమీపానికి చేరే ఉద్దేశంతో తమ వ్యూహారచనకు అవసరమనుకొన్న ముఖ్యమైన దీవులను వశపర్చుకొని ఒక దీవినుంచి మరొక దీవికి సాగాయి. జూన్ 1944 ~~లో సైపాన్ దీవిని మరో~~ నెలలో గువామ్‌ను వీరు ఆక్రమించారు. ఈ దీవులలో ఉన్న సువిశాల విమానాశ్రయాలనుంచి 2400 కి.మీ. దురాన ఉన్న టోకియో మీద బాంబులు వేయడం మొదలుపెట్టారు. ఈ దూరాన్ని ఇంకా తగ్గించవలెనని టోకియోకు 960 కి.మీ. దూరానగల ఐయోజిమాను 640 కి.మీ. దూరంలో ఉన్న ఓకినావాను ఆక్రమించటానికి మిత్రరాజ్యాల వారు సిద్ధపడ్డారు. నిరాశులైన జపానీయులు ఈ దీవులను నిలబెట్టుకొనడానికి చేసిన పోరాటము అతి తీవ్రమైంది. ఇక్కడ చాలా కాలంవరకు రెండు వర్గాల మధ్య అతి తీవ్ర పోరాటం జరిగింది. మార్చి 1945 లో జిమా, జూన్‌లో ఒకినావా మిత్రరాజ్యాల వశమైనాయి. ఈ రెండు దీవులు పతనం కాగానే జపాన్ ముఖ్య నగరాల మీద ఎడతెరిపి లేకుండా బాంబుల వర్షం కురిసింది.

అక్టోబర్ 1944 లో లెయిటీ ద్వీపాన్ని డగ్లస్ మెకార్థర్ స్వాధీనం చేసుకొన్నాడు. దానిచుట్టూ వున్న ద్వీపాలలో ముఖ్యమైన వాటిని ఆక్రమించుకుంటూ జనవరి 1945 నాటికి లూజెన్ చేరుకొని ఫిలిప్పైన్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకొన్నాడు. ఇదేవిధంగా జనవరి 1945 నుంచి చైనావారు కూడా జపాన్ సైనికులను తమ దేశంనుంచి తరిమివేయడం ప్రారంభించారు. అయినా జపానీయులు యుద్ధం విరమించి లొంగిపోలేదు. పైగా ఆత్మహత్యా పూర్వకమైన ధైర్య సాహసాలతో జపాన్ విమానచోదకులు తమ విమానాలనిండా బాంబులను నింపుకొని మిత్రమండలి వారి యుద్ధనౌకలను విధ్వంసం చేయసాగాయి. జపాన్‌ను ఎట్లాగైనా ఓడించవలెనని వాషింగ్టన్‌లో జరిపిన సుదీర్ఘ చర్చలనంతరం మిత్రరాజ్యాధినేతలు ప్రణాళికలు సిద్ధపరిచారు. ఈ పథకాలు అమలు చేస్తే వేలకొద్ది మిత్రమండలి సైనికులు ఆహుతి కావలసి ఉంది. తన విజయావకాశాలు సన్నగిల్లినాయని జపాన్ తనకు ఇంకా స్నేహ పాత్రంగా ఉన్న రష్యాద్వారా శాంతి సందేశం పంపింది. జపాన్ తనకు తానుగా ప్రత్యక్షంగా ఏమీ చెప్పలేదు. పాట్స్‌డామ్‌లో పదిహేడు రోజులు జరిపిన సుదీర్ఘచర్చల తర్వాత మిత్రమండలి వారు లొంగిపోవటమో, నాశనం కావటమో తేల్చుకోవలసిందిగా జపాన్‌ను హెచ్చరించారు. ఈ సందేశాన్ని వేలకొద్దీ కరపత్రాల ద్వారా జపాన్ అంతటా అమెరికన్ విమానాలు వెదజల్లినాయి. అయినా జపాన్‌నుండి ఎటువంటి ప్రతిక్రియ లేదు. జపాన్ అప్పటికీ వశం కాకపోవటంతో 1945 ఆగష్టు 6 వ తేదీన జపాన్‌లోని ప్రముఖ పారిశ్రామిక నగరమైన హిరోషిమాపై కొత్తగా కనిపెట్టిన ఆటంబాంబును అమెరికా ప్రయోగించింది. ఆటంబాంబు కల్పించిన బీభత్సంలో 1,80,000 మంది మృతులుగాని క్షతగాత్రులుగాని అయినారు. ఆటంబాంబు ప్రయోగానికి గురైనా కూడా జపాన్ ఇంకా పోరు కొనసాగించటానికే నిశ్చయించింది. అందువల్ల ఆగష్టు 9 వ తేదీన ఇంకొక పారిశ్రామిక నగరమైన నాగసాకీపై రెండో అణుబాంబును అమెరికా ప్రయోగించింది. ఈసారి సుమారు 80,000 మంది జపానీయులు మృతి చెందారు. అణుబాంబుల విపత్తును భరించలేని జపాన్ ఆగష్టు 10, 1945 న తాను దైవ సమానుడుగా భావించే తన చక్రవర్తిని ఆ పదవిలోనే ఉంచే షరతు మీద లొంగిపోయింది. అధికారికంగా జపాన్‌పై విజయోత్సవాన్ని సెప్టెంబర్ 2, 1945 న మిత్ర రాజ్యాలన్నీ జర డంతో ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముగిసింది.

**16.3.1 శాంతి స్థాపనకు ప్రయత్నాలు :** రెండో ప్రపంచయుద్ధం 1939 లో ప్రారంభమైనప్పటినుండి అమెరికా శాంతిస్థాపన మార్గాలను వెదకుతూనే ఉంది. రూజ్‌వెల్ట్ శాంతి ప్రయత్నాలను అమెరికన్‌లు బలపరచటమొక విశేషము. 1943 లో విలియం లెబ్రైట్, ఫుటామ్ కొనెలీలు శాంతి స్థాపనకోసం ప్రపంచ సంస్థను స్థాపించడం జరిగితే అందులో అమెరికా సభ్యత్వం స్వీకరించవలెననే తీర్మానాన్ని కాంగ్రెస్‌లో ప్రతిపాదించారు. ఈ తీర్మానము ఉభయసభలలోనూ అత్యధిక సంఖ్యాబలంతో ఆమోదం పొందింది. శాంతి పథకాలను రూపొందించటానికి అమెరికా విదేశాంగ కార్యదర్శి హాల్ మాస్కోలో, బ్రిటన్, రష్యాల విదేశాంగ మంత్రులతో ఉన్నతస్థాయి చర్చలు సాగించాడు, శాశ్వత సహకారాన్ని పరస్పరం అందజేసుకోటానికీ, సమానత్వ సూత్రాన్ని అంగీకరించిన అన్ని శాంతి కాముక దేశాలతో కూడిన అంతర్జాతీయ సంస్థను స్థాపించటానికి వీరు సంసిద్ధతను వెలిబుచ్చినారు. నవంబరు 1943 న రూజ్‌వెల్ట్, చర్చిల్, చాంగ్ - కై-షేక్‌లు కైరోలోనూ, రూజ్‌వెల్ట్, స్టాలిన్‌లు టెహరాన్‌లోనూ ఇంకా సుదీర్ఘ చర్చలు సాగించారు. అక్టోబర్ 1944 లో జరిగిన డంబార్టన్-ఓక్స్ సమావేశంలో ఐక్యరాజ్యసమితి చిత్తు నియమావళిని తయారు చేశారు. కాని మిత్రరాజ్యాలమధ్య అనుకొన్నంత సహకారము కార్యాచరణలో కనపడలేదు. అట్లాంటిక్ ప్రకటనకు వ్యతిరేకంగా పోలండ్, జెకోస్లవేకియా, యూగోస్లావియా దేశాలను రష్యా ఆక్రమించుకొని అక్కడ కమ్యూనిస్ట్ ప్రభుత్వాలను ఏర్పరచసాగాయి. ఈ విషయాలను చర్చించి అభిప్రాయభేదాలను తొలగించటానికి రూజ్‌వెల్ట్ ఇంకో ప్రయత్నం చేయవలెనని 1945 లో యాల్టా సమావేశానికి వెళ్లాడు.

**16.3.2 యాల్టా సమావేశం :** ఎనిమిది రోజులు సాగిన ఈ సమావేశము అతి ముఖ్యమైంది. ఐక్యరాజ్య సమితిలో చేరటానికి సూత్రప్రాయంగా రష్యా అంగీకారం పొందటానికి ఈ సమావేశంలో రష్యాకు కొన్ని ప్రత్యేక హక్కులివ్వటం జరిగింది. ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో రష్యాకు మూడు ఓట్లు, భద్రతాసమితి సభ్యులకు వీటో అధికారం, రష్యాకు పోలెండ్ మంచురియాలలో అధికార విస్తరణకు అవకాశము దీనివల్ల కలిగాయి. యాల్టా సమావేశంలో జర్మనీని నాలుగు సైనిక మండలాలుగా విభజించి వాటిని బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, అమెరికాల కింద ఉంచటానికీ, ఐక్యరాజ్యసమితి ప్రణాళికను సవిస్తరంగా తయారు చేసేటందుకు ఏప్రిల్ 1945 లో శాన్ ఫ్రాన్సిస్కోలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి అంగీకరిస్తూ తీర్మానాలు ఆమోదించటం జరిగింది.

**16.3.3 ఐక్యరాజ్య సమితి స్థాపన :** పైన పేర్కొన్న సమావేశాలలో ఐక్యరాజ్య సమితి ప్రణాళికను లోగడ అనుకొన్న ప్రకారం సవిస్తరంగా రూపొందించారు. సభ్యదేశాలన్నిటితో కూడిన సాధారణసభ, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, రష్యా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు శాశ్వత సభ్యులుగాను, ఇంకో ఆరుదేశాలు తాత్కాలిక సభ్యులుగానూ ఉన్న భద్రతాసమితి, రాజ్యాల మధ్య ఏర్పడే తగాదాలను పరిష్కరించటానికి 15 మంది న్యాయాధీశులతో కూడిన అంతర్జాతీయ న్యాయస్థానము దీనిలో ముఖ్యాంగాలు. ఆర్థిక, సాంఘిక సమితి, ధర్మ కర్తృత్వ సమితి, విద్యా సాంఘిక, సాంస్కృతిక వ్యవహారాల సంస్థ మొదలైన ఉపాంగాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి అంగప్రత్యాంగాల సమన్వయం సాధించటానికి సాధారణసభ ప్రధాన కార్యదర్శిని నియమిస్తుంది.

ఐక్యరాజ్యసమితి అంగాలు ప్రప్రథమంగా సాధారణసభ, భద్రతాసమితి 1949 లో లండన్ నగరంలో సమావేశమైన తరువాత అవి న్యూయార్క్‌కు వెళ్లాయి. అక్కడనే ఐక్యరాజ్యసమితి శాశ్వత కార్యస్థానం నిర్మితమైంది. ఐక్యరాజ్యసమితి మొదటి సమావేశాలవల్ల తేలిందేమంటే సభ్యదేశాలు రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గానికి రష్యా మరోవర్గానికి అమెరికా నాయకత్వం వహించాయి. తత్ఫలితంగా ముఖ్యాంశాల మీద నిర్ణయాలు తీసుకోవడం కష్టమయింది. పైగా వీటో హక్కును కొన్ని దేశాలు ముఖ్యంగా రష్యా - ధారాళంగా ఉపయోగించటంవల్ల కూడా ఐక్యరాజ్య సమితి వ్యవహారాలు కుంటుపడ్డాయి. మొదటి మూడు సంవత్సరాలలో రష్యా వీటో అధికారాన్ని ముప్ఫైసార్లు వినియోగించింది. ఈ అనిశ్చిత స్థితికి రెండో ప్రపంచయుద్ధం తరువాత ప్రపంచంలో చెలరేగిన ప్రచ్ఛన్నయుద్ధమే ముఖ్యకారణము.

**16.3.4 సమీక్ష :** రూజ్‌వెల్ట్ విదేశీ విధానం విజయవంతమైంది. యుద్ధకాలంలో తన దేశ ప్రజలనేకాక మిత్రరాజ్యాల అధికారులన కూడా ఒకే మాటపై నడపగలిగాడు. ఈ విషయంలో ఇతడు ఉడ్రోవిల్సన్ కంటే భిన్నమైన సమర్థవంతమైన నాయకత్వ పటిమను చూపగలిగాడ విల్సన్ ఆదర్శమైన అంతర్జాతీయ శాంతి సంస్థను ఇతడు స్థిరమైన పునాదిపై ఏర్పర్చగలిగాడు. ప్రతి విషయాన్ని అనేక సమావేశాల చర్చించి, వారి అనుమతితోనే ఆ నిర్ణయాలను తెలిపేవాడు. అందుచేతనే అతడికి వ్యతిరేకత రాలేదు.

**వ్యాసరూప ప్రశ్నలు :**

1. రూజ్‌వెల్ట్ విదేశీ విధానమును వర్ణించుము.
2. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా పాత్రను వివరింపుము.

**Reference Books :**


| | | |
|---|---|---|
| 1. Henry Bamford Parkes | : | The United States of America |
| 2. Thomas A - Bailey | : | The American Pageant |
| 3. C.P.Hill | : | History of the United States |
| 4. Patt & Drummond | : | Our Nation from its Creation |
| 5. David Donald | : | A History of American Life & Thought |
| 6. Richard B Morris | : | Encyclopaedia of American History |

7. E.H. Carr : International Relations between the Two world wars 1919 - 1939

8. E.H. Carr : The Twenty Years Crisis

9. C.D.M. Kettlebey : A History of Modern Times

10. Edward J. Conlon (For the United States Information service - Madras) : America Charitra Sangraham

11. Telugu Academy : America Samyukta Rashtrala Charitra

12. Telugu Academy : Adhunika Prapancha Charitra

13. Telugu Academy : Rendu Prapancha Yudhalu - Prapancha Santi Prayatnalu

14. S.P. Nanda : History of Modern world

15. Fraser, Lindley : Germany between two wars

16. Churchill, winston S : The World Crisis; The Afmermath (Landon)

17. Lipson E. : Europe 1914 - 1939

18. C.E. Black & Helmreich : Twentieth Century Europe

19. Walters. F.P. : A History of the League of Nations


20. Zimmern, Sir Alfred : The League of Nations and the Rule of Law 1918 - 1935



## అనుబంధం - I


| రాష్ట్రము | యూనియన్‌లో చేరిన సంవత్సరం | రాష్ట్రము | యూనియన్‌లో చేరిన సంవత్సరము |
|---|---|---|---|
| అలబమ | 1819 | మాంటెనా | 1889 |
| అలాస్కా | 1959 | నెబ్రాస్కా | 1867 |
| అరిజోనా | 1912 | నెవెడా | 1864 |
| అర్కన్సాస్ | 1836 | న్యూ హాంప్‌షేర్ | 1788 |
| కాలిఫోర్నియా | 1850 | నార్త్ కరోలినా | 1789 |
| కొలొరోడో | 1876 | న్యూ జెర్సీ | 1787 |
| కనెక్టికట్ | 1788 | న్యూ మెక్సికో | 1912 |
| డేలవేర్ | 1787 | న్యూ యార్క్ | 1788 |
| ఫ్లోరిడా | 1845 | నార్త్ డకోటా | 1889 |
| జార్జియ | 1788 | ఒహియో | 1803 |
| హవాయి | 1959 | ఓక్లహోమా | 1907 |
| ఇడాహో | 1890 | ఆరెగాన్ | 1859 |
| ఇలినాయిస్ | 1818 | పెన్సిల్వేనియా | 1787 |
| ఇండియానా | 1816 | రోడ్ ఐలాండ్ | 1790 |

| | |
|---|---|
| ఐయోవా | 1846 |
| కాన్సస్ | 1861 |
| కెంటకీ | 1792 |
| లూసియానా | 1812 |
| మేయిన్ | 1820 |
| మేరీలాండ్ | 1788 |
| మాసాచూసెట్స్ | 1788 |
| మిచిగన్ | 1837 |
| మిన్నెసోటా | 1858 |
| మిసిసిపి | 1817 |
| మిస్సోరి | 1821 |
| సౌత్ కరోలినా | 1788 |
| సౌత్ డకోటా | 1889 |
| టెన్నెస్సీ | 1796 |
| టెక్సాస్ | 1845 |
| ఊటా | 1896 |
| వెర్మాంట్ | 1791 |
| వర్జీనియా | 1788 |
| వాషింగ్టన్ | 1889 |
| వెస్ట్ వర్జీనియా | 1863 |
| విస్కాన్‌సిన్ | 1848 |
| వైమింగ్ | 1890 |

## పెరల్ హార్బర్‌పై దాడి




మధ్యధరా ప్రాంతంలోని
యుద్ధరంగాలు
1942-43
మిత్ర రాజ్య సైన్య పురోగమనం
అక్ష రాజ్య సైన్య పురోగమనం
నార్వే
స్కాట్లండ్
ఇంగ్లండ్
లండన్
జర్మనీ
పారిస్
ఫ్రాన్స్
ఇటలీ
నల్లసముద్రము
స్పెయిన్
కార్సికా
సార్డీనియా
టర్కీ
అల్జీర్స్
సిసిలీ
మొరాకో
అల్జీరియా


1945 లో ఐరోపా
యుద్ధరంగాలు
నార్వే
స్కాట్లండ్
ఇంగ్లండ్
ఫ్రాన్స్
స్పెయిన్
కార్సికా
సార్డీనియా
సిసిలీ

## అనుబంధం II

| క్రమ సంఖ్య | పదవీకాలం | అధ్యక్షుడు | స్థానిక రాష్ట్రం |
|---|---|---|---|
| 1 | 1789 - 97 | జార్జి వాషింగ్టన్ | వర్జీనియా |
| 2 | 1797 - 1801 | జాన్ ఆడమ్స్ | మస్సాచుసెట్స్ |
| 3 | 1801 - 1809 | థామస్ జెఫర్సన్ | వర్జీనియా |
| 4. | 1809 - 1817 | జేమ్స్ మాడిసన్ | వర్జీనియా |
| 5. | 1817 - 1825 | జేమ్స్ మన్రో | వర్జీనియా |
| 6. | 1825 - 1829 | జాన్ క్విన్సీ, ఆడమ్స్ | మస్సాచుసెట్స్ |
| 7. | 1829 - 1837 | ఆండ్రూ జాక్సన్ | టెన్నెస్సీ |
| 8. | 1837 - 1841 | మార్టిన్ వాన్ బ్యూరెన్ | న్యూయార్క్ |
| 9. | 1841 | విలియం హెన్రీ హారిసన్ | ఒహియో |
| 10. | 1841 - 45 | జాన్‌టైలర్ | వర్జీనియా |
| 11. | 1845 - 49 | జేమ్స్ కె.పోక్ | టెన్నెస్సీ |
| 12. | 1849 - 1850 | జకారీ టైలర్ | లూసియానా |
| 13. | 1850 - 1853 | మిల్లర్డ్ ఫిల్‌మోర్ | న్యూయార్క్ |
| 14. | 1853 - 1857 | ఫ్రాంక్లిన్ పియర్స్ | న్యూ హామ్‌షేర్ |
| 15. | 1857 - 1861 | జేమ్స్ బుఛనన్ | పెన్సిల్వేనియా |
| 16. | 1861 - 1865 | అబ్రహాం లింకన్ | ఇలినాయిస్ |
| 17. | 1865 - 1869 | ఆండ్రూ జాన్సన్ | టెన్నెస్సీ |
| 18. | 1869 - 1877 | యులిసిస్ యస్. గ్రాంట్ | ఒహియో |
| 19. | 1877 - 1881 | రూథర్ ఫోర్డ్ బి. హేస్ | ఒహియో |
| 20. | 1881 - | జేమ్స్ ఎ. గార్‌ఫీల్డ్ | ఒహియో |
| 21. | 1881 - 1885 | ఛెస్టర్ ఎ. ఆర్థర్ | న్యూ యార్క్ |
| 22. | 1885 - 1889 | గ్రోవర్ క్లీవ్‌లాండ్ | న్యూ యార్క్ |
| 23. | 1889 - 1893 | బెంజిమన్ హారీసన్ | ఇండియానా |
| 24. | 1893 - 1897 | గ్రోవర్ క్లీవ్‌లాండ్ | న్యూ యార్క్ |
| 25. | 1897 - 1901 | విలియం మెక్కిన్లీ | ఒహియో |

| | | | |
|---|---|---|---|
| 26. | 1901 - 1909 | థియోడార్ రూజ్‌వెల్ట్ | న్యూ యార్క్ |
| 27. | 1909 - 1913 | విలియం హెచ్. టాఫ్ట్ | ఓహియో |
| 28. | 1913 - 1921 | ఉడ్రోవిల్సన్ | న్యూ జెర్సీ |
| 29. | 1921 - 1923 | వారెన్ జి. హార్డింగ్ | ఓహియో |
| 30. | 1923 - 1929 | కాల్విన్ కూలిడ్జ్ | మెసాచుసెట్స్ |
| 31. | 1929 - 1933 | హెర్బర్ట్ సి. హూవర్ | కాలిఫోర్నియా |
| 32. | 1933 - 1945 | ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ | న్యూ యార్క్ |
| 33. | 1945 - 1953 | హారీ యస్. ట్రూమన్ | మిస్సోరి |

డా॥ కంరున్నిసా బేగం, యం.ఏ.; యంఫిల్., పి.హెచ్.డి.
చరిత్ర మరియు పురాతత్వ శాస్త్ర శాఖ
ఆచార్య నాగార్జున యూనివర్శిటి.

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ – 522 510.**

| Course | Year | Paper No. & Title |
| --- | --- | --- |
| M.A. History | Ist Year | Paper - V : History of U.S.A. (1776 to 1945) |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)